# యతీంద్రమతదీపికా

సంస్కృతం

**శ్రీనివాసాచార్యులు**

తెలుగు అనువాదం

**ఆచార్య బూరుగడ్డ నరసింహాచార్యులు**

ప్రచురణ

**కార్యనిర్వహణాధికారి**
**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**
**2011**

YATEENDRA MATA DEEPIKA

Sanskrit: Srinivasacharyulu
Telugu Translation: Prof. Burugadda Narasimhacharyulu

T.T.D. Religious Publications Series No. 895

© All Rights Reserved

First Edition : 2011

Copies: 1000

***Published by***
**L.V. Subrahmanyam** I.A.S.,
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati.

***D.T.P.*** *by*
Chief Editor's Office; T.T.D.; Tirupati.

Cover Design - B.Gurukumar Reddy
Chief Editor's Office; T.T.D.; Tirupati.

***Printed at***
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# ముందు మాట

"అధ్యాత్మవిద్యా విద్యానాం అహం" విద్యలలో నేను అధ్యాత్మ విద్యను అని భగవంతుడు విభూతియోగం లో, అధ్యాత్మ విద్య తన స్వరూపమే అని వివరించాడు. ఈ విద్యయే బ్రహ్మవిద్య, ఉపనిషద్విద్య, పరావిద్య ఇత్యాది నామాలతో వ్యవహరింప బడుతోంది.

భారతీయ వేదాంతం అద్వైతం, విశిష్టాద్వైతం, ద్వైతం అని ముఖ్యంగా మూడు భేదాలు కలిగి ఉన్నది. ఈ మూడు భేదాలకూ చెందిన సిద్ధాంతాలను త్రిమతాచార్యులు చాలా స్పష్టంగా తమ గ్రంథాలలో నిరూపించియున్నారు. విశిష్టాద్వైతమతం భగవద్రామానుజులవారిచే శ్రీభాష్యం మొదలైన భాష్య గ్రంథాలలో విస్తరించి వివరించబడింది.

భగవద్రామానుజులవారి మతాన్ని అనుసరించి శ్రీనివాసాచార్యుల వారు "యతీంద్రమతదీపికా" అనే గ్రంథాన్ని సంస్కృతంలో రచించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు, సంస్కృతవిభాగాధ్యక్షులు, డా॥ బూరుగడ్డ నరసింహాచార్యులవారు తిరుమల తిరుపతి దేవస్థానం వారి అభ్యర్థన మేరకు ఈ గ్రంథాన్ని సరళమైన తెలుగులో అనువదించారు.

తిరుమల తిరుపతి దేవస్థానం అనేక ధార్మిక, ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రచురిస్తున్న విషయం పాఠకులకు తెలిసిందే. తెలుగు అనువాదముతో ప్రచురింపబడుతున్న ఈ యతీంద్రమతదీపిక గ్రంథాన్ని పాఠకులు అందుకుని వినియోగించుకోగలరని ఆశిస్తున్నాం.

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# స్వగతము

దర్శనములు ఆరు–సాంఖ్య యోగ, న్యాయ,వైశేషిక, పూర్వ ఉత్తర మీ మాంసలు. వీటికే వేదాంతముతోటి సార్థక్యము – ఈ ఆరు ఉత్తరోత్తర ప్రధానములని చెప్పుకోవచ్చును. వేదాంతములో నెన్నియో మతభేదములు కలవు. ద్వైతాద్వైత విశిష్టాద్వైతములు, వాటిలో ముఖ్యములు. విశిష్టాద్వైతము ప్రాచీన కాలమునుండి ఉన్నను, పునరుజ్జీవనము, పునఃప్రతిష్ఠ భగవద్రామానుజుల వల్లనే జరిగినది. వారికే యతీంద్రులు, యతిరాజులు మొదలయిన పేర్లు ఉన్నవి. యతీంద్రమతము విశిష్టాద్వైతము.

దీనిలో వాదగ్రంథములు చాలా ఉన్నవి. విశిష్టాద్వైత సిద్ధాంతములనన్నిటినీ ఒక పాఠ్యగ్రంథరూపమున వివరించునది ఈ యతీంద్రమత దీపిక. మూల గ్రంథము, చౌఖంబావారిచే, ఆనందాశ్రమసంస్కృత గ్రంథమాల పుణే వారిచే, శ్రీరామకృష్ణమఠము మద్రాసు వారిచే కూడ ప్రచురింపబడినది. చౌఖంబావారు హిందీ అనువాదముతో, ఆనందాశ్రమము వారు సంస్కృత వ్యాఖ్యానముతో, మద్రాసువారు ఇంగ్లీషు అనువాదముతో ప్రచురించారు. ప్రస్తుతము తిరుమలతిరుపతిదేవస్థానము వారి ప్రచురణ విభాగము వారు తెలుగు లిపిలో, భాషలో కూడ ఈ పుస్తకమును ముద్రింపించి, ప్రచురింపదలచినారు. నాకీ అనువాదకత్వపు అవకాశము కలిగించినందులకు ఆ విభాగపుకమిటి సదస్యులకు, సంపాదకులకు, నమస్కరిస్తూ వారికి హృదయపూర్వక కృతజ్ఞత లను తెలుపుకుంటున్నాను. అన్నిటికన్న మిన్నగా వేంకటేశ్వరుని కృపాకటాక్షము ప్రసరించినందుకు పొంగిపోతున్నాను. భక్తితో ప్రణమిల్లుతున్నాను.



మొదట మూలమును సశీర్షకముగా వ్రాసి అనువాదములో వాక్య రూపమున అదేవిషయము వ్రాయడమైనది. పిదప అవసరమయినచోట్ల వివరణము పేరుతో, విషయములను విపులీకరించడము, వీలయినంత వరకు స్పష్టపరచడము జరిగినది. విషయమునుబట్టి భాషయుండుట సహజమే కద! సులభ మయిన, వ్యావహారిక మయిన తెలుగునే ఉపయోగించడము జరిగినది. పుస్త కము చివరలో విన్నవించుకున్నట్లు మంచిఏమయినా ఉంటే అది గురువుల బోధఫలితము కనుక గుణాలు వారివిగా, లోపములు దోషములు ఏవయినా ఉంటే నావిగా భావించి గుణాలను గ్రహించగలరు, తప్పులను మన్నించగలరు. ముందు పేర్కొన్న మూడు పుస్తకములను పరిశీలించి, తోచినట్లు భాషాంతరీ కరణము చేయప్రయత్నించినాను. దీని ఉపయోగము ఎంత అనడానికి చదువరులే ప్రమాణము.

గ్రంథకర్త శ్రీనివాసాచార్యులు. శ్రీనివాసాచార్యులుగారు తిరుపతి వాస్తవ్యులు. వీరి తండ్రిగారు స్వామిపుష్కరిణీ గోవిందాచార్యులు గ్రంథకర్త గురువు శ్రీమన్మహాచార్యులుగారు. గురువుగారు వాధూలగోత్రులు. మహారాయ అని కూడ ప్రసిద్ధులయిన మహాచార్యులుగారు. కందాల వాధూల గోత్రము నకు చెందిన దొడ్డయ్యాచార్యులే అని విమర్శకుల నిశ్చితాభిప్రాయము. మహాచార్యులు విశిష్టాద్వైత సంప్రదాయ ప్రవర్తకుల సరసన ఉండదగిన ప్రతిష్ఠ కలవారు. శ్రీవేదాంత దేశికుల శతదూషణీ గ్రంథముపయి 'చండ మారుతము' అను గొప్ప వ్యాఖ్యాన గ్రంథమును వెలయించినారు. ఇది వారి తత్త్వదృష్టికి

తార్కాణము. దీనితోబాటు ఇంకో ఏడు పుస్తకాలు వీరివి ఉన్నవి. వీటిలో చాలావరకు అముద్రితములే. వీరు అప్పయ్యదీక్షితుల సమాకాలికులు, మిత్రులు. దీక్షితుల వారి సమయమును 1420–1593 క్రీ.శ. మధ్యకాలముగా చారిత్రకులు నిర్ణయించారు. కనుక మహాచార్యులకాలముకూడ పదహారు శతాబ్దము చివర గాని పదిహేడవశతాబ్దము మొదటి భాగము కాని కావచ్చును. యతీంద్ర మతదీపికాకర్తలు, ధర్మరాజాధ్వరియొక్క వేదాంత పరిభాషనుండి తమ గ్రంథములో ఉదాహరించారు. వారు 'వేదాంతపరిభాష' అని తమ గ్రంథము నకు పేరు పెట్టినట్లు, శ్రీనివాసాచార్యులు తమదీపికకు శారీరక పరిభాషా అని పేరుపెట్టారు. ధర్మరాజాధ్వరిగారు కూడ పదిహేడవ శతాబ్దమునకు చెందినవారు. ఇది శ్రీనివాసాచార్యులు పదిహేడవ శతాబ్దమునకు చెందినట్లు బలపరుస్తున్నది. మహాచార్యుల పూర్వికులు తాము రామానుజుల సంబంధీకులయిన దాశరథి వంశమునకు చెందినట్టు, పేర్కొనినందువలన, మనగ్రంథకర్తకు రామానుజ సంప్రదాయముతో సాక్షాత్తుగాకూడ సంబంధ మున్నట్టు మనము ఊహించ వచ్చును. దీనివలన ఈయనకు సంప్రదాయము బాగుగా బోధపడినట్లు, అబ్బి నట్లు చెప్పవచ్చును. గురుపరంపర మాహాత్మ్యము ఇంత అని చెప్పలేము గద. ఇంత మాత్రమున శ్రీనివాసాచార్యులు గర్వించి, తాను సిద్ధాంతములను నూతనముగా ప్రతిపాదిస్తున్నట్టు ఎక్కడ చెప్పుకోలేదు. ముప్పదిరెండు



పూర్వసూరుల గ్రంథములు తనకు ఉపజీవ్యములు అని వాటి పేర్లుకూడ చివర ఇచ్చారు.

గ్రంథాంత పుష్పికలో 'ఇతి శ్రీవాధూలకులతిలక, శ్రీమన్మహాచార్యస్య ప్రథమదాసేన, శ్రీవేంకటగిరినాథ పదకమలసేవాపరాయణస్వామి పుష్కరిణీ శ్రీగోవిందాచార్య సూనునా' అని చెప్పుకున్నారు. తండ్రి గారివలె ఈయన వేంకటేశభక్తుడు కనుకనే, 'శ్రీవేంకటేశం'తోఆరంభించారు గ్రంథాన్ని. ఇప్పుడు ఆ వేంకటేశుడే తన భక్తుడి గ్రంథాన్ని తెలుగుచేయించడము మిక్కిలిసంతోష దాయకము. భగవంతుని ప్రధానమయిన అవతారములు పది. అదేవిధముగా పుస్తకములోని పరిచ్ఛేదములకు అవతారము అనిపేరుపెట్టారు. వాటిసంఖ్యకూడ పదిమాత్రమే.

ఇది విశిష్టాద్వైతమును తెలిసికొనుటకు ఉపయోగపడునట్టి ప్రవేశ గ్రంథము–వాచకము. ఇది చిన్నదే ఆకారమున, భావములు చాలా విస్తృతము లయినవి. గహనము లయిన అనేక సిద్ధాంతవిషయములను చాలా సంక్షిప్తముగా వ్రాస్తూ అవసరమున్నంతగా విశదీకరించారు. శైలి సరళము. నిజముగనే బాలబోధ జరుగుతుంది. వారిలో జిజ్ఞాసను రేకెత్తిస్తుంది. సంస్కృత, హిందీ, ఆంగ్లవ్యాఖ్యలు, ఈ గ్రంథము అనువదించడానికి చాలా ఉపయోగపడినవి. ఆ


గ్రంథకర్తలకు నా కృతజ్ఞతాభివందనములు, నా పూర్వాచార్యులందరకు నేనెంతయో ఋణపడిఉన్నాను.

3-1-2002 **ఆచార్య బూరుగడ్డ నరసింహాచార్యులు**

XI



XII



# యతీంద్రమతదీపికా - తెలుగు అనువాదము

## మఙ్గలాచరణమ్

మూ॥ శ్రీవేంకటేశం కరిశైలనాథం శ్రీదేవరాజం ఘటికాద్రిసింహమ్।
కృష్ణేన సాకం యతిరాజమీడే స్వప్నే చ దృష్టాన్ మమదేశికేన్ద్రాన్

శ్లో॥ యతీశ్వరం ప్రణమ్యాహం వేదాన్తార్యం మహాగురుమ్।
కరోమి బాలబోధార్థం యతీన్ద్రమత దీపికామ్। 1

## అనువాదము - మంగళాచరణము

శ్లో॥ యో నాథయామునమహాగురుముఖ్యశిష్యః
యో వాదిభీకరగురుః ప్రణతార్తిబంధుః ।
యస్సర్వలోకమనుజానకరోన్ముముక్షూన్
రామానుజం యతివరం తమహం నమామి ॥ 2

శ్లో॥ శఠకోప గురూపాత్తవిద్యాసంస్కారవైభవమ్।
శ్రీరంగాచార్యనామానం మాతులం ప్రణమామ్యహమ్॥

శ్లో॥ ప్రణమ్య పితరౌ పూజ్యౌ అన్యాంశ్చాపి గురూంస్తథా।
ఆంధ్ర్యాం లిఖామ్యహం భక్త్యా యతీన్ద్రమతదీపికామ్॥ 3

శ్లో॥ అవ్యాజకరుణాసింధోర్వేంకటేశస్య సత్కృపా!
కేవలం కారణం కార్యే వైదుష్యం నాత్ర సంశయః॥ 4

శ్రీవేంకటేశ్వరుని, కంచివద్దగల కరిశైలనాథుడయిన శ్రీదేవరాజును, ఘటికాద్రినాథుడయిన నారసింహుని, భగవద్రామానుజులను, కృష్ణా పర నామముగల్గిన యామునులను, వేదాంతదేశికులను, దొడ్డ యాచార్యులను స్వప్నములో జూచినవారిని స్తుతించి నమస్కరించు చున్నాను. గ్రహణధారణ సమర్థులయిన బాలురకొరకు యతీంద్రమత దీపికను వ్రాయుచున్నాను.

శ్రీ మన్నారాయణ ఏవ చిదచిద్విశిష్టాద్వైతతత్త్వం, భక్తిప్రపత్తిభ్యాం. ప్రసన్నః స ఉపాయః[1] అప్రాకృతదేశవిశిష్టః స ఏవ ప్రాప్యఇతి వేదాన్తవాక్యైః ప్రతిపాదయతాం శ్రీవ్యాస, బోధాయన, గుహదేవ, భారుచి[2] బ్రహ్మనన్ది, ద్రమిడాచార్య, శ్రీపరాఙ్కుశ, నాథ, యామునముని, యతీశ్వర ప్రభృతీనాం మతానుసారేణ బాలబోధార్థం వేదాన్తానుసారిణీ యతీన్ద్రమత దీపికాఖ్యా శారీరక పరిభాషా మహాచార్య కృపావలమ్బినా మయా యథామతి సఙ్గ్రహేణ ప్రకాశ్యతే.

**ఆ:** చిత్తు అచిత్తుల విశేషణములతోగూడిన శ్రీమన్నారాయణుడే, ఒక్కడే ముఖ్య మయిన విశిష్టాద్వైతతత్త్వము. అతడే భక్తిప్రపత్తులతో– నవవిధభక్తులు– ఆత్మ శరణాగతులతో, ప్రసన్నము చేసుకోదగినవాడు. ముక్తిప్రాప్తికి ఉపాయము– సాధనము. అప్రాకృతదేశము–వైకుంఠము నందున్న అతడే పొందదగిన, వలసిన వాడు. ఈ విశిష్టాద్వైతమును ప్రవర్తింప, ప్రవర్ధిలజేసినారు. శ్రీవ్యాస మునీం ద్రులు, బోధాయనమహర్షి, గుహదేవుడు, ధారుచి, బ్రహ్మనంది, ద్రమిడా చార్యులు, శ్రీపరాంకుశులు, నాథమునులు, యామునమునులు, శ్రీమద్రామా నుజులు మరియు నితరులు, వారు వేదాన్తవాక్యముల సహాయమున, సోపపత్తి కముగ విశిష్టాద్వైతమును ప్రతిపాదించినారు. వారిమతమును– అభిప్రా యమును అనుసరిస్తూ వేదాన్తమును అనుసరిస్తూ, మా మహాచార్యుల[3] పరమకృపచే, నేను నాబుద్ధికి తోచినట్లు గ్రహణధారణముల యందు సమర్థ లయిన బాలురకు సులభముగా తెలియుటకు, సంగ్రహముగా 'యతీంద్రమత – దీపికా' అను

1.స ఏవ–పాఠాన్తరము, 2.బ్రహ్మనన్ది–పా, 3. దొడ్డయ్యాచార్యులను మరొక పేరు గల వీరు శ్రీనివాసుల గురువుగారు



పేర, [1]శారీరక పరిభాషను బ్రహ్మసూత్రములకు చెందినదానిని దీపికా' అను పేర 'శారీరక పరిభాషను బ్రహ్మసూత్రములకు చెందినదానిని వెలుగులోనికి దెచ్చుచున్నాను. (సంస్కృతమున–దినకరీ, దీపికా, ప్రదీపః ప్రకాశఃమొదలయిన గ్రంథముల పేర్లు కలవు. అలోకః లోచనం మొ, ఇలాంటివే–అ,) ఈ గ్రంథమున దశ–అవతారములు గలవు. శ్రీమన్నారాయణుని పదియ వతారములవలె మొదటిదానిలో–ప్రత్యక్షప్రమాణము స్మరణము, రెండవ దానిలో–అనుమితివ్యాప్తి హేత్వాభాసములు మూడవదానిలో శబ్దప్రమాణము, నాలుగవదానిలో– ద్రవ్యలక్షణము, చతుర్వింశతి తత్త్వ నిరూపణము, అయిదవ దానిలో–కాలము దానిభేదములు, అరవదానిలో– నిత్యవిభూతి, ఏడవ దానిలో– బుద్ధి నిరూపణము, ఎనిమిదవ దానిలో– జీవుడు, అతని గుణములు, తొమ్మిదవ దానిలో–పరమాత్ముడు, చివరిదానిలో–పదివిధాలయిన అద్రవ్యము క్రమముగా తీసికొని నిరూపించడం జరిగినది.

శ్రీమన్–అవినాభావముగా కలసియున్న లక్ష్మీనారాయణులు–ఒక్కరే, పరమబ్రహ్మము. విశ్వానికి మాతాపితరులు. పాంచరాత్రము ప్రకారము ధర్మము–ధర్మి, అహన్తా–అహము, జ్యోతి– ప్రకాశము, సూర్యుడు– సూర్యా తపము వలెనున్న విడదీయరాని సంబంధము. వేరుగా భావింపబడినప్పటికి , వారి దయాకృత్యములలో భేదమిసుమంతగానరాదు. విశ్వస్థితికొరకు, జీవకోటి ఉద్ధారము కొరకు మాత్రమే ద్వంద్వభావము పరిమితము. శ్రీస్తవములో, శ్రీవత్సాం కులు చెప్పినట్లు నారాయణుడు న్యాయము అయితే, అమ్మ దయ లేదా కృపా రూపిణి, జీవులపక్షాన ఆమె నిలబడి వారికి ముక్తిని ప్రసాదిస్తుంది.

1.బ్రహ్మశరీరి(న్)చిత్, అచిత్‌లు అతని శరీరము. శరీరి శరీరముల సంబంధమును చర్చించునది శారీరకము, దానికి సంబంధించిన సాంకేతిక పదజాలమును బోధించునది కనుక శారీరక పరిభాషా, దీని పేరే యతీంద్రమతదీపికా.

## పదార్థసముద్దేశః :

**మూ:** సర్వపదార్థజాతం ప్రమాణప్రమేయభేదేన ద్విధా భిన్నమ్. ప్రమాణాని త్రీణ్యేవ. ప్రమేయం ద్వివిధం–ద్రవ్యాద్రవ్యభేదాత్. ద్రవ్యం ద్వివిధమ్ జడమజడం చేతి. జడం తు ద్వివిధం–ప్రకృతిః కాలశ్చేతి. ప్రకృతిశ్చతుర్వింశతి తత్త్వాత్మికా. కాలస్తు ఉపాధిభేదాత్ త్రివిధః

**అ:** తెలియదగిన పదార్థము[1]లు రెండు విధములుగ విభజింపబడినవి. వానిలో మొదటిది ప్రమాణము. జ్ఞానమునకు సాధనము. రెండవది ప్రమేయము. ప్రమాణమునే దెలియదగిన వస్తువు. ప్రమేయము రెండువిధములు ద్రవ్యము,అ ద్రవ్యము అని. మళ్ళీ ద్రవ్యము–జడము, అజడము అని రెండు తెగలు. జడమయిన ప్రమేయము రెండు విధములు–ప్రకృతి, కాలము అని. ఇక ప్రకృతి 24 తత్త్వములుగలది. కాలము, హెచ్చు తగ్గులు మొదలయిన ఉపాధులచేత, అతీతము, వర్తమానము, భవిష్యత్తు అను మూడు ఉపాధుల చేత మూడు విధములు.

**టీక:** తత్త్వశాస్త్రములు లేదా దర్శనములు అన్నీ ప్రమాణములను ఒప్పుకుని తీరతాయి. వారివారి సిద్ధాన్తానుసారం ఒకటినుండి ఎనిమిది ప్రమాణాలవరకు ఒప్పుకుంటారు ఆయా తత్త్వశాస్త్రానుయాయులు. చార్వాకులు ఒక్కప్రత్యక్షమును, బౌద్ధులు వైశేషికులు ప్రత్యక్షానుమానములను, సాంఖ్యులు ప్రత్యక్షానుమాన శబ్దములను, నైయాయికులు ప్రత్యక్షానుమానోపమాన శబ్దము లను నాలుగు ప్రమాణములను, ప్రాభాకరమీమాంసకులు అర్థాపత్తి అనుదానితో గలిపి ఐదు ప్రమాణములను, భాట్టమీమాంసకులు అద్వైతులు అనుపలబ్ధితో కలిపి అరింటిని, పౌరాణికులు సంభవము, ఐతిహ్యములతో గలిపి ఎనిమిది ప్రమాణములను అంగీకరించి తమ తత్త్వమును బలపరచుచుందురు.

---

1. పదము–పుష్పము, నీళ్ళు మొదలయిన శబ్దాలు అన్ని పదములు అర్థము–వస్తువు ద్రవ్యము. పుష్పము, జలము, మొదలయినవి–కొన్ని కనపడనివి–జ్ఞానము–అనుపదము యొక్క అర్థము. దీనిని మనము తెలిసికొన గలుగుదుము.



విశిష్టాద్వైతులు సాంఖ్యులవలె ప్రత్యక్షము, అనుమానము, శబ్దము అను మూడింటిని మాత్రమే ఒప్పుకుని మిగతా వానిని, వీటిలోనే చేర్చుదురు.

వేదాంత సృష్టిక్రమము ప్రకారము, అచిత్ అనునది ప్రకృతియే 1మహత్, 2అహంకారము, 11జ్ఞానేన్ద్రియములు, 5పంచతన్మాత్రలు, 5పంచ మహాభూతములు అను ఇరువది నాలుగు తత్త్వములుగా మారును. సద్విద్యా బ్రహ్మకు విశ్వానికి ఉన్న అభేదాన్ని–రెండు ఒకటే అను విషయాన్ని– బోధి స్తున్నది. 11జ్ఞానేన్ద్రియములు–మనస్సు,శ్రోత్రము, త్వక్, చక్షువు, జిహ్వా, ఘ్రాణం, వాక్,పాణి,పాదములు,పాయువు,ఉపస్థ,5తన్మాత్రలు–శబ్ద,స్పర్శ, రూప, రస,గంధతన్మాతలు 5భూతములు – ఆకాశ, వాయు, తేజస్సు, అప్పు–జలము, పృథివి అనునవి.

**మూ:** అజడం తు ద్వివిధమ్–పరాక్ ప్రత్యక్ చేతి. అజడం పరాగపి తథా నిత్యవిభూతిర్ధర్మ భూతజ్ఞానం చేతి.

**అ:** అజడము అయినపదార్థము కూడ రెండు విధములు. అవి పరాక్ (భాహిరము) మరియు ప్రత్యక్ (అంతరము) అని. అజడమయిన పరాక్ కూడ మళ్ళీరెండు విధాలు. 1.నిత్యవిభూతి,2 ధర్మభూతజ్ఞానము.

**వి:** స్థూలముగా జడము చైతన్యము ప్రాణములేని టేబుల్, కుర్చీ, కొండలు,గుట్టలు తమకుతాముగా ఏమిచేయలేనివి అని చెప్పుకోవచ్చును. జడత్వమునకంటె వేరయినది అజడత్వము. దీనిని ఆరవఅవతారంలో శుద్ధ సత్త్వము, ధర్మభూతజ్ఞానము, జీవుడు, ఈశ్వరులలోఉండునది అని నిరూపిస్తాడు గ్రంథకర్త. స్వయంగా ప్రకాశించగలిగియుండడం. మరింకా కొన్ని విశేషాలకు ఆరవ అవతారం చదవండి.

**మూ:** ప్రత్యగపి **ద్వివిధః–** జీవేశ్వరభేదాత్, జీవస్త్రివిధః– బద్ధ, ముక్త నిత్యభేదాత్, బద్ధోఽపి ద్వివిధః బుభుక్షు, ముముక్షు భేదాత్, బుభుక్షుర్ద్వివిధః

– అర్థకామపరో ధర్మపరశ్చేతి, ధర్మపరో ద్వివిధః– దేవతాన్తరపరో భగవత్పరశ్చేతి, ముముక్షుర్ద్వివిధః– కైవల్యపరో మోక్షపరశ్చేతి. మోక్షపరో ద్వివిధః– భక్తః ప్రపన్నశ్చేతి, ప్రపన్నో ద్వివిధః–ఏకాన్తీ, పరమైకాన్తీచేతి. పరమైకాన్తీ ద్వివిధః –దృప్తార్తభేదాత్.

**అ:** ప్రత్యక్కు కూడ రెండువిధములు–జీవుడు మరియు ఈశ్వరుడు అనీను. (ఎనిమిదవఅవతారములో–ప్రత్యక్త్వంనామస్వస్మైభాసమానత్వమ్–అని నిర్వచనం చెబుతాడు గ్రంథకర్త. తనకు తాను ప్రకాశించుట అనగా తననుతాను తెలుసుకొనగలిగియుండుట అను కోవచ్చును. ఆ) జీవుడు బద్ధుడు–ముక్తుడు–నిత్యుడు అని మూడు విధాలు. బద్ధుడు–బుభుక్షువు–(అసలు అర్థం ఆకలిగొన్న వాడు, ఇక సుఖములు కోరువాడు అని చెప్పుకోవచ్చును.) ఈ బుభుక్షువు అర్థ కామము లందు ఆసక్తి కలవాడు, ధర్మపరుడు అని మళ్ళీ రెండు విధాలు ధర్మపరుడు–ఇతర దేవతల కొలుచువాడు, భగవంతు డయిన శ్రీమన్నారా యణుని యందాసక్తుడు అని రెండురకములు. ముముక్షువు కూడ కైవల్యపరడు, మోక్షపరుడు అని రెండువిధాలు. (కైవల్యము–ఆత్మజ్ఞానము, మోక్షము– [illegible][1] మోక్షపరుడు కూడ భక్తుడు అని, ప్రపన్నుడు అని రెండురకాలు. (భక్తుడు–దేవుని ప్రేమించువాడు, ప్రపన్నుడు–తనకు భగవంతునకు అర్పించుకొన్నవాడు.) ప్రపన్నుడు కూడ ఏకాన్తీ అని పరమైకాన్తీ అని మరల రెండు విధాలు. (ఏకః అంతః నిశ్చయము, అది కలవాడు ఏకాన్తీ. శ్రీమన్నారాయణుడేకాపాడువాడు అనునిశ్చయము గలవాడు. అది దృఢంగా గలవాడు పరమ–మిక్కిలి ఏకాన్తీ అని భావము. అ) పరమైకాన్తీ అనువాడుకూడ దృప్తుడు–(మాములుగా అయితే దర్పము–గర్వము అదిగలవాడు దృప్తుడు. ఇక్కడ మాత్రం వేచియుండటం చేసేవాడు అనిచెప్పు కోవాలి.) ఆర్తుడు అనిమళ్ళీ రెండు విధాలు. (ఆర్తిగలవాడు–ఆగలేనివాడు అని అర్థం, అ)

---

1. అ.అంటే అనువాదకుడు.



**మూ:** పఞ్చధావస్థిత ఈశ్వరః–పర వ్యూహ విభవ అంతర్యామి అవతార భేదాత్ పర ఏకధా వ్యూహశ్చతుర్ధా–వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నా నిరుద్ధభేదాత్. కేశవాది వ్యూహాన్తరమ్. మత్స్యాదయో విభవాః పునరనన్తాః. అన్తర్యామీ ప్రతిశరీర మవస్థితః అర్చావతారస్తు శ్రీరఙ్గవేంకటాద్రి హస్తిగిరి యాదవాద్రి ఘటికాచలాదిషు సకలమను జనయనవిషయతాం గతో మూర్తివిశేషః.

**అ:** ఈశ్వరుడు ఐదు రూపములలో ఉండును– ఆ ఐదు ఇవి. పరము, వ్యూహము, విభవము, అంతర్యామి, మరియు అవతారము–పరుడు– ఒకడే తానుగా ప్రకాశించువాడు పూర్ణుడు. వ్యూహరూపుడు నాలుగు విధములుగా నున్నాడు. ఆ రూపములు వాసుదేవుడు, సఙ్కర్షణుడు, ప్రద్యుమ్నుడు మరియు అనిరుద్ధుడు అని. కేశవుడు మొదలయినవి మరియొక రకమయిన ఇతర వ్యూహరూపులు. మత్స్యము, కూర్మము మొదలయిన విభవరూపములు ఇవి అనంతమయినవి–లెక్కింపరానివి. అంతర్యామి అను అతడు ప్రతిశరీరములో నున్నాడు. అర్చావతారుడు అందరికి కన్నులపడుగచేస్తూ శ్రీరంగము, తిరుమల, హస్తిగిరి యాదవాద్రి ఘటికాచలము మొదలగు పుణ్యక్షేత్రములలో వెలసి యున్నాడు.

**వి:** కంచీపురందగ్గరలో ఓ కొండఘటికావలము. ఇప్పటి షోలింగరు అనునది.

**మూ:** అద్రవ్యం తు సత్త్వరజస్తమః శబ్దస్పర్శరూప రసగంధ సంయోగ శక్తిభేదాద్దశధైవ.

**అ:** ద్రవ్యము కానిది పదివిధములుగా నుండును. అవి ఇవి–సత్త్వము (మంచితనము) రజస్సు (మోహం లేదా స్పందన క్రియ) తమస్సు చీకటి–అశక్తత, శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము, సంయోగము, శక్తి అనేవి

**మూ:** ఏవముద్దిష్టానాముద్దేశక్రమేణ లక్షణపరీక్షే క్రియేతే ప్రమాణ లక్షణమ్. తత్ర ప్రమాకరణం ప్రమాణమ్. ప్రమాణం లక్ష్యమ్. ప్రమాకరణత్వం లక్షణమ్ ప్రమాలక్షణమ్ యథావస్థిత వ్యవహారాను గుణజ్ఞానం ప్రమా,

ప్రమాలక్ష్యమ్. యథావస్థిత వ్యవహారానుగుణ జ్ఞానత్వం లక్షణమ్. జ్ఞానం ప్రమా ఇత్యుక్తే శుక్తికాయాం ఇదం రజతమితి జ్ఞానే అతివ్యాప్తిః అత ఉక్తం వ్యవహారానుగుణమ్ ఇతి. ఏవమపి తత్రైవాతివ్యాప్తిః. భ్రాన్తిదశాయామపి ఇదం రజతమితి వ్యవహ్రియమాణత్వాత్. అత ఉక్తం యథావస్థిత ఇతి. యథావస్థిత ఇతిపదేన సంశయాన్యథాజ్ఞానవిపరీతజ్ఞానవ్యావృత్తిః.

అ: పయిన చెప్పినవరుసలో క్రమముగా పదార్థముల లక్షణము (నిర్వచనము) వాని పరీక్ష కూడ నిరూపించడం జరుగుతుంది. (ప్రతిశాస్త్రములో ఆశాస్త్రము నిరూపింపబోయే పదార్థాలను పేర్కొనడం–ఉద్దేశము, ఉద్దేశించిన పదార్థాలకు క్రమంగా నిర్వచనం చెప్పడం–లక్షణం; చెప్పిన లక్షణం దోష రహితమా కాదా అని, ఆ లక్షణం పదార్థంలో ఎలా ఉందో చెప్పడం పరీక్షా, అని మూడు అంశాలతో కూడిఉంటుంది. చెప్పిన లక్షణం, ఉద్దేశించని పదా ర్థంలో ఉండటం. అతివ్యాప్తి, కొన్ని ఉద్దేశించిన లక్ష్యాల్లో లేకపోవడమే– అవ్యాప్తి, లక్ష్యాల్లో అసలే లేకపోవడం అసంభవం, అని మూడు లక్షణదోషాలు (అను). అట్లా ఉద్దేశించిన పదార్థాల్లో మొదటిది అయిన **ప్రమాణము లక్షణము–** ప్రమాకరణమ్ అని దీంట్లో ప్రమాణం లక్ష్యము–మనము దేనికి లక్షణము చెపుతున్నామో అది ప్రమాకరణత్వమ్ అనేది లక్షణము. ఇక ప్రమా లక్షణము–యథావస్థిత వ్యవహారానుగుణ జ్ఞానత్వమ్–అనేది. లక్షణంలో జ్ఞానానికి రెండు విశేషణాలు ఉన్నాయి. జ్ఞానమే ప్రమా. ఎలాంటి జ్ఞానము? యథావస్థితము మరియు వ్యవహారాను గుణము అయినట్టి జ్ఞానము అని భావము.

వ్యవహారానుగుణము–అనుదళము (లక్షణంలోని విశేషణపదాన్ని దళము అంటారు) ఎందుకు? కేవలం జ్ఞానం మాత్రమే ప్రమా అని లక్షణముంటే శుక్తికయందు (ముత్యపుచిప్పయందు) ఇది వెండి అని కలిగే జ్ఞానములో అతివ్యాప్తి. అదిభ్రమజ్ఞానము ప్రమ కాదు అయినా జ్ఞానము కనుక జ్ఞానము ప్రమా అనే లక్షణము వర్తించి అతివ్యాప్తిదోషం కలుగుతుంది. కనుకవ్యవహారాను గుణమను



విశేషణము చెప్పడం జరిగింది. భ్రాంతిదశయందు ఆ జ్ఞానాన్ని అనగా ఇదం రజతం అనే దాన్నిగా వ్యవహరిస్తున్నందున మళ్ళీ అతివ్యాప్తి యథాతథంగా ఉంటుంది. దాన్ని తొలగించడానికి యథావస్థిత అని మరియొక విశేషణము అవసరమయింది. ఈ విశేషణంచేత శుక్తికయందు ఇదంరజతం అనే జ్ఞానంలో అతివ్యాప్తి తొలగిపోతుంది. ఉన్నది ఉన్నట్లుగా కాని సంశయము, అన్యథాజ్ఞానము, విపరీతజ్ఞానాల్లో ఈలక్ష్యము వర్తించదు. ఇట్లా లక్షణాలు దోషరహితాలు కావాలి.

**మూ:** ధర్మిగ్రహణే మిథో విరుద్ధానేకవిశేషస్మరణం సంశయః యథా ఊర్ధ్వతావిశిష్టే స్థాణుర్వా పురుషో వా ఇతి జ్ఞానమ్. అన్యథా జ్ఞానం నామ ధర్మవిపర్యాసః. యథా కర్తృత్వేన భాసమానే ఆత్మని కుయుక్తిభిః కర్తృత్వస్య భ్రాన్తత్వోపపాదనమ్. విపరీతజ్ఞానం నామ ధర్మివిపర్యాసః. యథా వస్తునో వస్త్వన్తరజ్ఞానమ్.

**అను:** ఒక వస్తువును (ధర్మము గలది ధర్మి) గ్రహించునప్పుడు తెలుసు కొను నప్పుడు దానికిచెందిన పరస్పరము విరుద్ధము లయిన అనేక విశేష (ణ) ములను జ్ఞప్తికి దెచ్చుకోవడం–సంశయము అన్నమాట. పొడవుగా ఉన్న వస్తువును దూరమునుండి చూసి పొడవుగా ఉండే స్థాణువు–స్తంభమా, పురుషుడా, మనిషా అని పరస్పర విరుద్ధము లయిన విశేషములను స్మరించడం సందేహమంటారు. ఒక ధర్మిలో అనేక ధర్మస్మరణం సంశయమయితే, ధర్మిలోని ఒక ఉన్న ధర్మాన్ని లేనట్లుగా తెలుసుకోవడం అన్యథాజ్ఞానము. ఆత్మయందు కర్తృత్వము అనే ధర్మము ఉన్నది. కుయుక్తులతో ఆ ధర్మము లేనట్లుగా నిరూపించడాన్ని భ్రాంతి అని ఉపపాదించడాన్ని అన్యథాజ్ఞానం అంటారు. ఇక విపరీత జ్ఞానం అంటే ధర్ములయొక్క తారుమారు ఒకదానికి మారుగా ఇంకొకటి అని గ్రహిం చడమన్నమాట. శుక్తికను రజతముగా గ్రహించడము. విపరీత జ్ఞానము నకు ఉదాహరణము.

## లక్షణస్య దోషత్రయమ్ :

**మూ:** లక్షణస్య త్రీణి దూషణాని సన్తి. అవ్యాప్త్యతివ్యాప్త్య సంభవ భేదాత్. లక్ష్యైకదేశే లక్షణస్యావర్తమానత్వమవ్యాప్తిః. కపిలవర్ణవత్త్వం గోర్లక్షణమ్ ఇతి లక్షణే కృతే శుక్లాయామవ్యాప్తిః. లక్ష్యాదన్యత్ర ప్రవర్త మానత్వమతి వ్యాప్తిః. లక్ష్యే క్వాప్యవిద్యమానత్వమసమ్భవః. యథా చక్షుర్విషయో జీవ ఇత్యుక్తే అసంభవ ఏవ. అత్రోక్తదూషణత్రయాభావాత్ ప్రమాలక్షణం స్వస్థమ్.

**అ:** దేనికయినా మనం లక్షణం చెప్పేటప్పుడు మూడు దోషాలు సంభవించవచ్చును. అవి అవ్యాప్తి. అతివ్యాప్తి మరియు అసంభవము అని. లక్షణము చెప్పదలచుకున్న వాటిల్లో, కొన్నింటికి లక్షణము కుదరకపోవడం అవ్యాప్తి. లక్ష్యాలు అన్నిటిలో లక్షణము వ్యాపించి ఉండకపోవడము. ఉదాహరణము కపిలవర్ణము కల్గిఉన్నది ఆవు అని లక్షణము చెపితే తెల్లని ఆవుల్లో లక్షణము లేనందున అవ్యాప్తి అవుతుంది. లక్ష్యములకంటె వేరే వాటియందు లక్షణము కుదరడం అతివ్యాప్తి-ఎక్కువగా లక్షణం అన్వయం అనడము (ఉదా.చీలిఉన్నగిట్టలుకలది ఆవు. అంటే లక్ష్యముకాని-ఆవు కాని మేకయందు ఈ లక్షణము సమన్వయం కావడం అతి-ఎక్కువగా వ్యాప్తి. తక్కువ ఎక్కువ అసలే లేకపోవడం అని సంగ్రహంగా అనుకోవచ్చును. అను,) లక్ష్యములో ఏదానియందు లేకపోవడం అసంభవము.

**ఉదా:** ఆత్మ కళ్ళకు కనబడువాడు అన్నట్లయితే ఏ ఆత్మ కళ్ళకు కనబడదు కనుక లక్షణానికి అసంభవం- ఎక్కడా లేకపోవడమనే దోషం కలుగుతుంది. కనుక ప్రతిలక్షణము మాట, చెప్పేవిషయము ఈ మూడుదోషాలు లేకుండా ఉంటే అది న్యాయబద్ధము అనితాత్పర్యము. ప్రమాకరణం ప్రమాణం అనే లక్షణంలో ఈ మూడు దోషాలు లేనందున ఆ లక్షణము బాగుగా ప్రతిపాదింపబడినది.



## కరణపదార్థవివేచనమ్:

**మూ॥** సాధకతమం కరణమ్. అతిశయితం సాధకం సాధకతమమ్. యస్మిన్ సతి అవిలమ్బేన జ్ఞానముత్పద్యతే తత్ 'అతిశయితమ్' ఇత్యుచ్యతే తేన ప్రమాకరణం ప్రమాణమితి సిద్ధమ్. అనధిగతార్థగన్తృ ప్రమాణమిత్యాదికం తు తత్తద్వాదిభిరేవ నిరస్తత్వాదనాదరణీయమ్.

**అ॥** ఒక కార్యమును బాగుగా నెరవేర్చగలుగు కారణమే కరణము. సాధకతమము అనగా అతిశయితముగా ఎక్కువగా అవసరము అయిన కారణము. (పయిన ప్రమకు కరణము ప్రమాణము అని లక్షణము చెప్పారు. ఇప్పుడు కరణలక్షణమును చెప్పుచున్నారు గ్రంథకర్త) ఏది ఉంటే, దీనివలన వెంటనే, ఆలస్యం జరగకుండ, జ్ఞానముకలుగుతుందో అది అతిశయితము అయినది (కారణము కనుకనే కరణము) అని పిలువబడుతుంది. అందువలన ప్రమాకరణము ప్రమాణము అనుట యుక్తము. తెలియని అర్థములను-విషయములను తెలుపునది ప్రమాణము అని ప్రమాలక్షణము. ఆ లక్షణమును నిర్వచించినవారి అనుయాయులే కొందరు ఖండించినందున, అది సరియయిన ప్రమాణలక్షణము కానేరదు. ఆ లక్షణమును ఆదరింప పనిలేదు.

## విశిష్టాద్వైత మతాభిమత ప్రమాణసంఖ్యా :

**మూ:** తాని ప్రమాణాని ప్రత్యక్షానుమానశబ్దాఖ్యాని త్రీణి.

**అ:** ఆ ప్రమాణములు మూడే. అవి ప్రత్యక్షము, రెండు అనుమానము మూడవది శబ్దము. (ఇతరులు చెప్పిన పలు ప్రమాణములు వీనిలోనే కలిసి పోవును.)

## ప్రత్యక్షప్రమాణలక్షణమ్:

**మూ:** అత్ర సాక్షాత్కార [1]ప్రమాకరణమ్ ప్రత్యక్షమ్. అనుమానాది వ్యావృత్త్యర్థం సాక్షాత్కార ఇతి. దుష్టేన్ద్రియజవ్యావృత్త్యర్థం ప్రమా ఇతి.

**అను:** వీటిలో ప్రత్యక్షలక్షణము–సాక్షాత్కారము కలుగచేయునది ప్రమ అయినది–ప్రత్యక్షము. సాక్షాత్త్వం అనగా జ్ఞానేంద్రియములతో విషయం అర్థము–పదార్థమును గ్రహించుట. అంతేగాని హేతువువలన, శబ్దమువలన, స్మృతివలన కలుగు ప్రమాజ్ఞానము కాదన్నమాట, కనుకనే లక్షణములో సాక్షాత్కారీ అనుమాట ప్రయోజనవంతము, కేవలం స్పష్టత, వైశద్యము సాక్షాత్త్వం అన కూడదు. అది సుషుప్తిలో, పరోక్షజ్ఞానంలో కూడ ఉంటుంది. ఇక లక్షణంలో 'ప్రమా' అనే పదం లేకుంటే గ్రహించే ఇంద్రియాలు బాగుగాలేనప్పుడు కలిగే జ్ఞానం కూడ ప్రత్యక్షం కావల్సి వస్తుంది. దానిని తొలగించడానికి 'ప్రమా' అనేపదము. అన్యథాజ్ఞానమందు కూడ జ్ఞానత్వముండవచ్చును. కాని యథా వస్థిత వ్యవహారానుగుణ జ్ఞానత్వము ప్రమా అను లక్షణము అన్యథా జ్ఞానములో లేనందున ప్రమాకరణము కానందున దానికి కలిగే ప్రమాణత్వాన్ని పరిహరిం చేందుకు 'ప్రమా' పదం లక్షణంలో సార్థకము.

## నిర్వికల్పక సవికల్పక భేదద్వయమ్:

**మూ:** తచ్చ ప్రత్యక్షం ద్వివిధమ్ – నిర్వికల్పక సవికల్పక భేదాత్. నిర్వి కల్పకం నామ గుణసంస్థానాది విశిష్టప్రథమపిణ్డగ్రహణమ్. సవికల్పకం తు స

1. సాక్షాత్కారిప్రమా పాఠాన్తరము. ఇదే సరియయినది. తర్కభాషలోఉన్నది. ప్రత్యక్షం అంటే కళ్లఎదుట అని కూడ ఓ అర్థం. దీనికి విరుద్ధమయినది పరోక్షము అని ఈ ప్రత్యక్షము. ప్రమాణముఅనుఅర్థంలో ప్రతిగతమక్షమ్ అని లేదా అక్షస్యప్రతివిషయంవృత్తిః అని గాని విడదీయాలి. ప్రతి ఇంద్రియముద్వారగలిగిన జ్ఞానము–ప్రత్యక్షము. దీనినే అక్షమక్షం ప్రతీత్యోత్పద్యతే అని ప్రతిగతమాశ్రితమక్షమ్ అనికూడ నిర్వచిస్తారు. వెలుపలి పదార్థములతో ఇంద్రియముల సంనికర్షవలన కలుగు జ్ఞానము.



ప్రత్యవమర్శం గుణసంస్థానాది విశిష్టద్వితీయాదిపిణ్డగ్రహణమ్. ఉభయవిధమపి ఏతద్ విశిష్ట విషయమేవ. అవిశిష్టగ్రాహిణో జ్ఞానస్యానుపలమ్భాదనుపపత్తేశ్చ.

**అను:** ఆ ప్రత్యక్షము రెండువిధములు. నిర్వికల్పకము సవికల్పకము అనీను. నిర్వికల్పక ప్రత్యక్షము ఇట్లా ఉంటుంది. (రూపరస గంధస్పర్శ శబ్ద ములను విషయాలను ఇంద్రియములతో గ్రహించేటప్పుడు దేనిని గ్రహిస్తు న్నామో అది ఏ విశేషణాలు (వికల్పాలు) లేకుండా ఒక పదార్థంగా ఓ శబ్దంగా ఓ రసంగా ఓ గంధంగా స్పర్శగా మాత్రమే గ్రహించడము. ఇది నైయాయికుల సిద్ధాన్తము ప్రకారము) ఒక వస్తువు మన దృష్టిపథంలో పడగానే మొదట ఓ వస్తువుగానే వ్యక్తిగానే ఏ విశేషణాలు లేకుండా గుర్తిస్తాము. క్రమంగా దగ్గరికి వచ్చిన తర్వాత అది ఏవస్తువో ఎవరో సరిగ్గా విశేషణాలతో తెలుసుకుంటాము. మొదటిది నిర్వికల్పకము, రెండవది సవికల్పకము. నిర్వికల్పక జ్ఞానములో ప్రకారత అనేది ఉండదు. ఘటంలో ఉండే ఘటత్వం–లాటిది. మొదట ఒక ఘటమును కేవలఘటంగానే గుర్తిస్తాము పిదప తెల్లని, నల్లని, చిన్న, పెద్ద మొదలయిన విశేషణాలతో కూడిన ఘటాన్ని గ్రహిస్తాము. మొదటిది నిర్వికల్పకము రెండవది సవికల్పము.

మొదటిది నిష్ప్రకారక జ్ఞానము, రెండవది నామ జాత్యాది విశేషణ విశేష్యసంబంధావగాహిజ్ఞానము. మొదటిదానిలో కేవలం సత్తామాత్రము–ఉనికినే గ్రహిస్తాము, అది భావరూపము, దానిని ఇతరముల నుండి వేరు చేయలేదు. మొదట్లో ఒకనిని–ఒకమనిషిగా మాత్రము చూస్తాము. తరువాత 'శ్యామో దేవదత్తో బ్రాహ్మణః పచతి' అని సవికల్ప కంగా–గుణము, పేరు, జాతి, క్రియ అను, నాలుగింటితో సంబంధమున్నట్లుగా గ్రహిస్తాము. ఇతన్ని మొదట వేరువేరుగా గ్రహించి పిదప దేవదత్తుడికి సంబంధించినట్లుగా గ్రహి స్తాము. ఇది న్యాయసిద్ధాంతము ప్రకారము.) నిర్వికల్పము అనగా ఒక మొదటి దానిని పదార్థమును, వ్యక్తిని గుణములతో అమరిక లేదా పొందికతోనున్న దానిగా గ్రహించుట. గుణము సంస్థానములు అనునవి విశేషణములే.

ఈ సిద్ధాంతమున రెండు సవిశేషణములయిన గ్రహణములే. నిర్వికల్పకము మొదటి పిండ గ్రహణము, సవికల్పకము రెండవ మూడవ పదార్థముల, వ్యక్తుల, ప్రత్య వమర్శముతో అనగా పాత ప్రథమ పిండగ్రహణముతోగూడినది. రెండు ప్రత్యక్షములతో కూడ విశేషములు కలిగిన విషయమే జ్ఞానముగా కలది. విశేషణములు లేనిదాని గ్రహించు జ్ఞానము కలుగదు, ఉపలభ్యము కావడంలేదు మరియు అది యుక్తియుక్తము కాబోదు.

**వి:** ఈ సిద్ధాంతము తమకు అవసరము ఉన్నంతవరకు న్యాయశాస్త్రపద్ధతిని అనుసరిస్తుంది. చాలాచోట్ల దానితో వేరవుతుంది కూడ. ఉదాహరణకు న్యాయ శాస్త్రంలో ఉపమానంకూడ ప్రమాణమే. దానితో ప్రమాణాలసంఖ్య నాలుగ వుతుంది. కాని విశిష్టాద్వైతులకు మూడేప్రమాణాలు. ఉపమానం ప్రమాణం కాదు. అట్లాగే, నిర్విక్తం వికల్పేభ్యః అని నిర్వచనము. న్యాయశాస్త్రంలో ఈ సిద్ధాన్తములో మాత్రము ప్రథమ పిండగ్రహణము నిర్వికల్పకము, ద్వితీయా దిగ్రహణము సవికల్పకము. అద్వైతంలోనయితే నిర్వికల్పకము ఎట్టి సంసర్గమును అంటే సంబంధమును గ్రహించదు. సవికల్పకము సంసర్గ సహితమును గ్రహిస్తుంది. నిర్వికల్పకము బొత్తిగ సంబంధరహితమునే గ్రహిస్తుంది అంటే దాని ప్రత్యక్షతను నిరూపించడంలో కొన్ని ఇబ్బందులుంటాయి. వాటిని తొలగించడానికి సంబంధం కలిగిన ప్రథమపిండగ్రహణం. ద్వితీయాదిగ్రహణం అని నిరూపించడం జరిగింది. మొదటిదానిలో వస్తువుయొక్క జాతిస్వభావము మాత్రము తెలుస్తుంది. రెండవదాంట్లో ఇదివరకే తెలిసిన వస్తువు యొక్క ప్రత్యక్షగ్రహణం స్పష్టమవుతుంది. ఈరెండును సవిశేషప్రత్యక్షాలే నిర్విశేషము ఏదీ కాదు.

## వస్తూనాం గ్రహణప్రకారః:

**మూ:** గ్రహణప్రకారస్తు–ఆత్మా మనసా సంయుజ్యతే, మన ఇంద్రియేణ, ఇంద్రియమర్థేనేతి. ఇంద్రియాణాం ప్రాప్య ప్రకాశకారిత్వనియమాత్. అతో ఘటాది రూపార్థస్య చక్షురాది రూపేన్ద్రియ్యస్య చ సన్నికర్షే సతి అయం ఘటః ఇతి చాక్షుషజ్ఞానం జాయతే. ఏవం స్పార్శనప్రత్యక్షాదయోపి.



**అ:** ప్రత్యక్షము కలుగు విధానము – ఆత్మ మనస్సుతో కలియును, మనస్సేమో ఇంద్రియముతో కలియును, తిరిగి ఆ ఇంద్రియమేమో (జ్ఞానము యొక్క) అర్థము – పదార్థము లేదా వస్తువు వ్యక్తితో కలియును. ఇంద్రియము లన్నియు అర్థములతో సంయోగమును చెందియే వాటిప్రత్యక్షము కలుగ జేయునను నియమము. కుండ మొదలయిన అర్థములు చక్షువు మొదలయిన ఇంద్రియముతో కలసినప్పుడే ఇది ఘటము అనే చాక్షుషజ్ఞానము – అనగా కన్నుతో ఏర్పడు ప్రత్యక్షజ్ఞానము కలుగుతుంది. ఇట్లాగే తాకిడివలన, వాసన చూచుటవలన, వినుటవలన, రుచిచూచుటవలన ప్రత్యక్షజ్ఞానము కలుగును

**వి:** ఇంద్రియమలు అర్థముతో సంబంధము కలిగి ఉండినప్పుడే అవి ప్రత్యక్షమవుతుంటవి. మనచూపునకు ఏదయినా ప్రతిబంధకం అడ్డం తగిలిన గాని గోడ అవతలివైపువి కాని కనబడవు. ఇక ధ్వని – శబ్దముల ప్రత్యక్షము – అవి కర్ణేంద్రియమును సోకుట ద్వారా కలుగుతుంది. ఇట్లే వాసన, స్పర్శ శరీరముపయిన చర్మానికి అంతకు ఉంటుంది. కావున మనము తాకిన, మనసు తాకిన మనకు స్పర్శకలుగుతుంది. నాలుక (కొస) పయిన రసనేన్ద్రియముంటుంది. నాలుకమీద పడిన పదార్థపు రుచిని అది తెలుసుకుంటుంది. ప్రత్యక్షం ఇట్లా ఇంద్రియము పదార్థముల సంబంధముచే కలుగు (ప్రమా) జ్ఞానము.

## సంబంధవిచారః:

**మూ:** ద్రవ్యగ్రహణే సంయోగః సంబంధః. ద్రవ్యగతరూపాది గ్రహణే సమవాయానఙ్గీకారాత్ సంయుక్తాశ్రయణసమ్బన్ధః.

**అ:** ఒక వస్తువును గ్రహించునప్పుడు ఇంద్రియములుకు వస్తువుతో సంయోగము – అనునది సంబంధము. అనగా ఇంద్రియములు వస్తువుతో సంయోగము చెందినప్పుడే వాటి ప్రత్యక్షము కలుగుతుంది. ఈ విషయం విస్తరంగా పయిన చర్చించుకున్నాము. మా సిద్ధాన్తము ప్రకారం సమవాయము

అను సమ్బంధము లేదు. అలాంటప్పుడు వస్తువులోని రూపమును సంయుక్తాశ్రయణము – సంయోగసంబంధముతో ఇంద్రియముతో నున్న దానిని ఆశ్రయించి నట్టిది – వస్తువు ఇంద్రియముతో సంయుక్తము – దానిని ఆశ్రయించినది రూపము.

**వి:** సమవాయము అనునది న్యాయము ప్రకారము నిత్యద్రవ్యవృత్తి. నిత్యమయినది ఆరవపదార్థము. ద్రవ్యములో ఉండేరూపము మొదలయినవి, గుణములు సమవాయ సంబంధముతో ఉంటాయి. అవయవములలో అవయవి కూడ సమవాయముతో ఉంటుంది. విశిష్టా ద్వైతము ప్రకారము సమవాయము లేదు కనుక 'సంయుక్తాశ్రయణము' అను సంసర్గము లేదా సన్నికర్షను అంగీకరించి దాని ద్వారా ద్రవ్యగతరూపగ్రహణము జరుగునని చెబుతారు.


## ప్రత్యక్షస్య అవాన్తరభేదాః

**మూ:** నిర్వికల్పక సవికల్పక భిన్నం ప్రత్యక్షం ద్వివిధమ్ – అర్వాచీనం అనర్వాచీనం చేతి. అర్వాచీనం పునర్ద్వివిధమ్ – ఇన్ద్రియ సాపేక్షం తదనపేక్షం చేతి. తదనపేక్షం చ ద్వివిధమ్ – స్వయంసిద్ధం దివ్యంచేతి. స్వయం సిద్ధం యోగజన్యమ్, దివ్యం భగవత్ప్రసాదజన్యమ్. అనర్వాచీనం తు ఇన్ద్రియానపేక్షం ముక్తనిత్యేశ్వరజ్ఞానమ్. అనర్వాచీనం తు ప్రసఙ్గాదుక్తమ్. ఏవం సాక్షాత్కార ప్రమాకరణం ప్రత్యక్షమితి సిద్ధమ్.

**అ:** నిర్వికల్పకము, సవికల్పకము అను రెండు భేదములు గల ప్రత్యక్షము మళ్ళీ అర్వాచీనము – ఆధునికము, తరువాతిది అనర్వాచీనము. ఇందు అర్వాచనము అనునది మళ్ళీ రెండు విధాలు – ఇంద్రియములపయి ఆధారపడినది ఇంద్రియములపయి ఆధారపడనిది అని. ఇంద్రియములపయి ఆధారపడనిది మళ్ళీ స్వయంసిద్ధము అని దివ్యము అని రెండురకాలు. యోగమువలన గలుగు ప్రత్యక్షము స్వయం సిద్ధము. దివ్యము భగవంతుని ప్రసాదమువల్ల గలుగునది. ఇక అనర్వాచీన ప్రత్యక్షము. ఇంద్రియముల పయినాధారపడ



నట్టిదియు, ముక్తుల, నిత్యుల, ఈశ్వరుని యొక్క జ్ఞానము. ఇక్కడ అనర్వాచీన ప్రత్యక్షము గూర్చి వివరించడం, సందర్భాన్నిబట్టి ప్రత్యక్ష నిరూపణము కనుక ప్రస్తుతం కేవలం ఇంద్రియ సాపేక్ష ప్రత్యక్షనిరూపణమే జరుగుతున్నది. ఈ విధముగా 'సాక్షాత్కారిప్రమాకరణమే' ప్రత్యక్షమని నిరూపించనయినది.




## స్మృతేః ప్రత్యక్షే అన్తర్భావః :

**మూ:** నను యథావస్థితవ్యవహారానుగుణజ్ఞానం ప్రమేత్యుక్తమ్. ఏవఞ్చ స్మృతేరపి యథావస్థిత వ్యవహారానుగుణత్వేన ప్రామాణ్యాత్ స్మృతేరపి ప్రమాణత్వేన పరిగణనాచ్చ త్రీణ్యేవ ప్రమాణానీతి కథం ప్రతిపాద్యతే? ఇతిచేత్ ఉచ్యతే– స్మృతేః ప్రామాణ్యాఙ్గీకారేఽపి సంస్కారసాపేక్షత్వాత్ఽ తస్య ప్రత్యక్ష మూలత్వాత్ మూలభూతప్రత్యక్షేఽన్తర్భావ ఇతి న పృథక్ ప్రమాణత్వకల్పనమ్. అతస్త్రీణ్యేవ ప్రమాణాని సమ్భవన్తి.

**అ:** ప్రమను 'యథావస్థిత వ్యవహారానుగుణ జ్ఞానము' అని నిరూపించడం జరిగినది. ఇట్లయితే స్మృతికూడ ఉన్నది ఉన్నట్లుగా మరియు వ్యవహారానికి అనుగుణముగా ఉంటుంది. మరి స్మృతికి కూడ ప్రామాణ్య బుద్ధి ఉంది కనుక స్మృతి కూడ ప్రమాణము అవుతుంది. మరి మూడే ప్రమాణాలు అని ఎట్లా కుదురుతుంది? అంటే సమాధానము – నిజమే. స్మృతికికూడ ప్రామాణ్యబుద్ధి ఉంది కాని అది ఒక సంస్కారాన్ని ఆపేక్షిస్తుంది. సంస్కారం ఉంటేనే స్మృతి కలుగుతుంది. ఆ సంస్కారమునకు ఆధారము ప్రత్యక్షము కావున స్మృతి తనకు మూల భూతమయిన ప్రత్యక్షములోనే చేరిపోతుంది కనుక దానికి వేరుగా ప్రమాణత్వం కల్పించ నవసరంలేదు. అందువలన మూడే ప్రమాణాలు అని తాత్పర్యము.

## స్మృతినిరూపణమ్:

**మూ:** స్మృతిర్నామ పూర్వానుభవజన్య సంస్కారమాత్రజన్యంజ్ఞానమ్, సంస్కారోద్బోధశ్చ సదృ శాదృష్ట చిన్తాద్యాః స్మృతిబీజస్య బోధకాః ఇత్యుక్త ప్రకారేణ క్వచిత్సదృశ దర్శనాద్భవతి, క్వచిదదృష్టాత్, క్వచిచ్చిన్తయా, ఆది శబ్దేన సాహచర్య స్యాపి గ్రహణాత్తేనాపి చ భవతి. సాదృశ్యజా యథా–దేవదత్త యజ్ఞదత్తయోః సదృశయోః దేవదత్తదర్శనేన యజ్ఞదత్తస్మృతిః, ద్వితీయా యథా – యాదృచ్ఛికీ కాలాన్తరానుభూతశ్రీరఙ్గాది దివ్యదేశస్మృతిః. తృతీయా యథా – చిన్త్యమానే సతి శ్రీవేఙ్కటేశస్య కమనీయ దివ్యమఙ్గల విగ్రహస్మృతిః. చతుర్థీ తు సహచరితయో ర్దేవదత్తయజ్ఞ దత్తయోర్మధ్యే అన్యతరదర్శనేన తదన్యతరస్మృతిః.

**అ:** స్మృతియనగా–సాదృశ్యము, అదృష్టము, చిన్త మొదలగు వానివలన సంస్కారము కలిగి అట్లా సంస్కారము ఉద్బుద్ధము కాగా సంస్కారమువలన మాత్రమే కలిగెడి జ్ఞానము.

(న్యాయశాస్త్రములో జ్ఞానము–స్మృతిరనుభవశ్చ అని రెండు విధముల జ్ఞానము సంస్కారమాత్ర జన్యం జ్ఞానం స్మృతిః అని ప్రతిపాదించారు. దానినే విశిష్టాద్వైతులు అనుసరిస్తున్నారు. అ).



సంస్కారం ఉద్బుద్ధం అవడానికి (మేల్కోడానికి) సాదృశ్యము, అదృష్టము. చింతా ఆదిపదము చేత సాహచర్యము స్మృతి బీజమయిన సంస్కారాన్ని మేల్కొలుపుతాయి. క్రమముగా ఉదాహరణములు. నాలుగు విధాలయిన సంస్కారోద్బోధకాలకు తద్వారా కలిగే స్మృతులకున్నూ సాదృశ్యమువలన ఒకే తీరుగా ఉన్న దేవదత్త యజ్ఞదత్తులలో దేవదత్తుని చూడ్డంతో యజ్ఞదత్తుడు స్మృతికి రావడము (ఒకరిని చూస్తే ఆ సాదృశ్యము వలన కలిగిన సంస్కారము ఉద్బుద్ధమయి, అలాగే ఉండే యజ్ఞదత్తుడు జ్ఞాపకానికి రావడము), అదృష్టము వలన అనుకోకుండా కలిగేది – తానుపూర్వం చూచిన శ్రీరంగము, తిరుమల మొదలయిన పుణ్యక్షేత్రముల జ్ఞాపకము. తృతీయోదాహరణము ఆలోచించగా ఆలోచించగా కలిగే శ్రీవేఙ్కటేశుని దివ్యమంగళ విగ్రహము యొక్క స్మృతి; సాహచర్యమువలన – కలిసి ఉండే దేవదత్త యజ్ఞదత్తులలో, ఒకరిని చూచిన మరి యొకరికి స్మృతి కలుగడము.

**మూ:** సమ్యక్ పూర్వమనుభూతస్య సర్వస్య స్మృతి విషయత్వ నియమః క్వచిత్ కాలదైర్ఘ్యాత్ వ్యాధ్యాదినా నా సంస్కారప్రమోషాత్ స్మృత్యభావః

**అ:** పూర్వము బాగుగా అనుభవించినదంతయు జ్ఞాపకానికి వస్తుంది. స్మృతికి విషయము అవుతుంది. దేనిగురించి స్మృతి కలుగుతుందో అది విషయము. దుఃఖము అనుభవించాము. ఆ దుఃఖము స్మృతికి విషయము. అట్లే సుఖము, భయము, భోజనము మొదలయినవి. అయితే ఒక్కోసారి, అనుభవం తరువాత చాలాకాలము అయిపోయినందున లేదా రోగము వలన, సంస్కారములు పూర్తిగా కప్పబడి వున్నందున మేల్కోలేనంత బలహీనముగా నున్నందున జ్ఞాపకము కలుగుకుండాపోతుంది. (మనము పరిచితులను, ప్రదేశాలను గుర్తుతెచ్చుకోవడానికి పడేపాట్లు ఈ సంస్కారం దృఢంగా లేక, అనుభవం గట్టిదికాక పోవడమే–అ).

**ప్రత్యభిజ్ఞాదీనాం ప్రత్యక్షే అన్తర్భావః:**

**మూ:** యథా స్మృతేః ప్రత్యక్షేఽన్తర్భావః తథా 'సోఽయం దేవదత్త' ఇతి ప్రత్యభిజ్ఞాయా అపి ప్రత్యక్షేఽన్తర్భావః. అస్మన్మతే అభావస్య భావాన్తర రూపత్వాత్ తజ్జ్ఞానస్యాపి ప్రత్యక్షాన్తర్భావః. భూతలే ఘటాత్యన్తాభావో భూతలమేవ ఘటప్రాగభావో నామ మృదేవ. ఘటధ్వంసశ్చ కపాలమేవ.

**అ:** స్మృతి ఎట్లా ప్రత్యక్షమో 'ఇతడే ఆ దేవదత్తుడు' అనే ప్రత్యభిజ్ఞ కూడ ప్రత్యక్షములోనే చేరుతుంది. (మనము ఒకరిగురించి విని తెలిసికొని ఉంటాము, తరువాత నిజంగా కలిసి చూసినప్పుడే ఓ అతనే ఇతడు అని గుర్తిస్తాము. గుర్తింపునే ప్రతి+అభిజ్ఞా అంటారు. ఇది కొందరి మతంలో ప్రత్యేకమయిన ప్రమాణము. విశిష్టాద్వైతుల సిద్ధాంతములో మాత్రము ప్రత్యక్షమే కానివేరు ప్రమాణముకాదు.అ). విశిష్టాద్వైతమున అభావము ప్రమాణము కాదు. పదార్థమూ కాదు. భావము యొక్క మరియొక రూపమే. నైయాయికులకు ప్రమాణము కాదు కానికొందరి ప్రకారము ఏడవ పదార్థము భూమి పయిన కుండ లేకపోవడం అంటే భూమియే. ఘటానికి ముందుండే అభావము - మట్టియే.

**టీక:** భాట్టమీమాంసకులు మరియు అద్వైతులు ప్రత్యభిజ్ఞ అనుదానిని ప్రత్యక్షము స్మృతులు కలిసిన ప్రమాణముగా గుర్తించారు-వైయాయికులు మాత్రము దీనిని ప్రత్యక్షములోనే చేర్చుతారు. వేరేభాగాలున్నట్టుగా గుర్తించరు. స్మృతి ప్రత్యక్షములోనే చేరింది కనుక స్మృతిపయి ఆధారపడిన ప్రత్యభిజ్ఞను కూడ మేము ప్రత్యక్షములో అంతర్భవింపజేస్తాము. మా మతమున, భావము యొక్క మరియొక రూపమే అభావము కనుక అభావజ్ఞానాన్నికూడ ప్రత్యక్షంతో చేర్చుతాయి. భూమిపయి కుండ లేకపోవుట అంటే భూతలమే గాని వేరొకటి కాదు. (ఈ అభావాన్ని అత్యన్తా భావము అని నైయాయికులు ప్రతిపాదిస్తారు. అట్లాగే ప్రాగభావము, ప్రధ్వంసము, అన్యోన్యము అని మరిమూడురకాలుగా



అభావం అని వారంటారు. కాని) ఘటము తయారవడానికి ముందు ఘటప్రాగ భావము అనేది మట్టే గాని మరొకటి కాదు. అట్లాగే ఘటం నశించడము అంటే కపాలమే - బొచ్చలేనన్నమాట. కనుక నాలుగు విధములయిన అభావము ప్రసక్తే లేదు.

**వి:** విభిన్న సిద్ధాంతములు అభావాన్ని భిన్న భిన్నంగా ప్రతిపాదించాయి. భాట్టమీమాంసకులు వారి ననుసరిస్తూ అద్వైతులు కూడ అభావాన్ని ఆరవ ప్రమాణముగా ఒప్పుకుంటారు. నైయాయికులు పదార్థముగా ఒప్పుకుంటారు గాని ప్రమాణముగా కాదు. మొట్టమొదట వైశేషికములో దీనికి పదార్థత్వము కూడలేదు. ప్రాభాకరమీమాంసకులు వారిని అనుసరిస్తూ విశిష్టాద్వైతులూ దీనిని-అభావాన్ని ఒక ప్రత్యేక పదార్థంగా ప్రతిపాదింపరు. ఘటాభావ వద్భూ తలమ్-కుండలేని భూమి-అను దానిని కేవలము భూమి-అధికరణము అని ప్రతిపాదిస్తారు.

**మూ:** ప్రాయః పురుషేణానేన భవితవ్యమ్ ఇత్యేతదూహః పురః కింసంజ్ఞ కోఽయం వృక్ష ఇతి అనధ్యవసాయో జ్ఞానం సంశయ ఉక్తః. ఏతయోరపి ప్రత్యక్షేఽన్తర్భావః పుణ్యపురుషనిష్ఠా ప్రతిభాపి ప్రత్యక్షేన్తర్గతా.

**అను:** బహుశ ఇతడు మనిషి కావచ్చును అనునది ఊహ (ఊహిస్తాము గనుక ఊహ) నిశ్చయము కాని జ్ఞానమునకు సంశయము అని పేరు చెప్ప బడినది. దీని రూపము-ఉదాహరణము-ముందట ఉన్నది ఏం (పేరు గల) చెట్టబ్బా! అని సందేహము. చెట్టు అని తెలుసు ఏంచెట్టు అని తెలియదు. మొదటిదానిలో 'వస్తువు' ఇది కావచ్చు అనుకోవడం ఉన్నది (నిశ్చయంఉన్నట్టే అనుకోవాలి). రెండవదానిలో అధ్యవసాయం నిశ్చయం లేదు. పుణ్యపురుషుల యొక్క భూతభవిష్యద్వర్తమానముల చూడగలిగేది ప్రతిభ వారి బుద్ధివిశేషము ప్రతిభ. సంశయము ఊహ ప్రతిభ-ఇవి అన్నీ ప్రత్యక్షములోచేరుతాయి. విడిగా ప్రమాణములు కావు కానేరవు.

**యథార్థఖ్యాతేః సమర్థనమ్:**

"యథార్థం సర్వవిజ్ఞానం ఇతి వేదవిదాం మతమ్" ఇత్యుక్తత్వాత్ భ్రమాది ప్రత్యక్షాదిజ్ఞానం యథార్థమేవ. అఖ్యాత్మాత్మఖ్యాత్మ నిర్వచనీయఖ్యాత్యన్యథా ఖ్యాత్యసత్ఖ్యాతి వాదినో నిరస్య సత్ఖ్యాతిపక్షస్వీకారాత్. సత్ఖ్యాతిర్నామ జ్ఞాన విషయస్య సత్యత్వమ్.

**అను:** వేదము దెలిసినవారు జ్ఞానమంతయు–అన్నిజ్ఞానములు యథా ర్థము సత్యము అని ఒప్పుకున్నారు. 1.అఖ్యాతి, 2.ఆత్మఖ్యాతి, 3.అనిర్వచ నీయ ఖ్యాతి, 4. అన్యథాఖ్యాతి మరియు 5. అసత్ ఖ్యాతి అను అయిదు వాదము లను నిరసించి మేము సత్ఖ్యాతి పక్షమును ఒప్పుకున్నాము కనుక సర్వ విజ్ఞానమునూ సత్యమే. సత్ఖ్యాతియనగా జ్ఞాన విషయము అయిన దంతయు సత్యమేనన్నమాట.

**మూ:** తర్హి భ్రమత్వం కథమితిచేత్ విషయవ్యవహార బాధాద్ భ్రమ త్వమ్. తదుపపాదయామః. పంచీకరణ ప్రక్రియయా పృథివ్యాదిషు సర్వత్ర సర్వభూతానాం విద్యమానత్వాత్, అతఏవ శుక్తికాయాం రజతాంశస్య విద్య మానత్వాత్ జ్ఞానవిషయస్య సత్యత్వమ్. తత్ర రజతాంశస్య స్వల్పత్వాత్తు న వ్యవహార ఇతి తద్బాధాత్ తజ్జ్ఞానం భ్రమః శుక్త్యంశ భూయస్త్వజ్ఞానాత్ భ్రమనివృత్తిః.

**అ:** విజ్ఞానమంతయు సత్యమయితే భ్రమస్థలములోని జ్ఞానమునకు భ్రమ అని ఎట్లు పేరు సరిపోతుంది. జ్ఞానమునకు విషయము అయిన దాని వ్యవహారమునకు బాధకలుగుతుంది. అది ఎట్లానో నిరూపిస్తున్నాము. పంచ భూతములలో సగభాగము పృథివి మొదలగునవి ఉంటవి. మిగత సగభాగమును నాలుగుగా చేస్తే మిగత నాలుగు భూతముల అంశము లుంటవి. దీనినే పంచీ కరణప్రక్రియ అని అంటారు. దీనిచేత సర్వభూతములలో సర్వ భూతములు ఉంటవి అన్నది నిర్వివాదము. అందువలన శుక్తికయందు– ముత్యపు చిప్ప యందు వెండి భాగముకూడ ఉన్నందున ఇది జ్ఞానవిషయము, సత్యము.



వెండిభాగము కొద్దిగా ఉన్నందున వెండియని వ్యవహారము లేదు. ఇట్టి వ్యవహారమునకు బాధకల్గినది. కనుక వెండియను జ్ఞానము భ్రమ అన్నమాట. ఇక ముత్యపుచిప్ప అంశమే ఎక్కువ అను జ్ఞానముచేత (వెండికాదు అను) భ్రమ తొలిగిపోతుంది.

**మూ:** స్వప్నాదిజ్ఞానం తు సత్యమేవ. తత్తత్పురుషాను భావ్యతయా తత్తత్కాలావసానాన్ రథాదీన్ పరమపురుషః సృజతీతి హి శ్రుత్యావగమ్యతే.

**అను:** స్వప్నములో కలిగే జ్ఞానము సత్యమే. బృ.ఉ.6.3. 10లో'న తత్ర రథా...' అను శ్రుతి చేత ఇట్లు చెప్పబడినది. స్వప్నములో రథములు, మార్గములు, సంతోషములు, భవనములు, పుష్కరిణులు ఏవి ఉండవు. వాటిని పరమాత్ముడు సృష్టిచేస్తాడు. దీన్నిబట్టి పరమాత్మ యొక్క జాగ్రత్కాలిక సృష్టి ఎట్లా నిజమో స్వప్నకాలికసృష్టికూడ అంతే నిజము.

**మూ:** పీతః శఙ్ఖ ఇత్యాదౌ నయనవర్తి పిత్తద్రవ్యసమ్భిన్నా నాయన రశ్మయః శఙ్ఖాదిభిః సంయుజ్యన్తే. తత్ర పిత్తగత పీతిమాభిభూతః శబ్దగత శుక్లిమా న గృహ్యతే. అతస్సువర్ణాను లిప్త శఙ్ఖవత్పీతశ్శఙ్ఖ ఇతి ప్రతీయతే. సూక్ష్మత్వాత్ పీతమ్ స్వనయన నిష్క్రాన్తతయా స్వేనైవ గృహ్యతే న త్వన్యైః

**అను:** శంఖము పసుపుపచ్చనిది అనుచోట కళ్ళలోఉన్నపిత్తముతో కూడినవియై కంటి వెలుగులు శంఖము మొదలగు వాటితో సంయోగం చెందు తవి–కలుస్తాయి. ఇంద్రియము, అర్థముతో–శంఖము మొదలయిన దానితో సంనికర్ష– సంయోగసంబంధముతో కలిస్తేనే ప్రత్యక్షము కలుగుతుంది. పయి ఉదాహరణములో పిత్తమువలన కలిగిన పసుపు పచ్చదనము చేత తగ్గిపోయిన దయి, శబ్దములోని తెల్లదనము గ్రహింపబడదు. కనుక బంగారు పూతపూసిన శంఖమువలె శంఖము పసుపు పచ్చనిది అని తెలుస్తుంది. పసుపు పచ్చదనము సూక్ష్మము అయినది. తనకళ్లనుండి వెలువడేది కనుక తనకే పచ్చదనము అగు పడుతుంది. ఇతరులకు కనబడదు.

**మూ:** జపాకుసుమ సమీపవర్తి స్ఫటికమణిరపి రక్త ఇతి గృహ్యతే. తత్ జ్ఞానం సత్యమేవ, మరీచికాయాం జలజ్ఞానమపి పఞ్చీకరణప్రక్రియయా పూర్వోక్తవదుపపద్యతే పఞ్చీకరణప్రక్రియా తూత్తరత్ర వక్ష్యతే.

**అ:** జపాకుసుమము (ఎఱ్ఱని రంగుగలపువ్వుల) వద్ద ఉన్నట్టి, స్ఫటికమణి (చాలాతెల్లని రంగు గలదియే) ఐనను ఎఱ్ఱదిగా కనపడు తుంది. ఆ జ్ఞానము సత్యమే. ఎండమావులలో కనపడే జల (ము–దాని) జ్ఞానము వాస్తవమే (పయిన తెలిపిన ముత్యపుచిప్ప - వెండి జ్ఞానము వలె) పంచీకరణ ప్రక్రియ అంటే ఏమిటో ముందు వివరిస్తాము. (కొంత అనువాదములో తెలుసుకున్నాము.).

**మూ:** దిగ్భ్రమోఽపి తథైవ దిశి దిగన్తరస్య విద్యమానత్వాత్ అవచ్ఛేదకమన్తరేణ దిగితి ద్రవ్యాన్తరానఙ్గీకారాచ్చ.

**అను:** దిగ్భ్రమలో కలిగే జ్ఞానముకూడ సత్యమే. ఒక దిక్కులో అన్నిదిక్కులుకూడా ఉంటాయి. వైశేషికులు అంగీకరించినట్లు మేము దిక్కుఅనే ద్రవ్యాన్ని వేరుగా ఒప్పుకోము. (చూ.త.సం.పృథివ్యప్తేజో వాయ్వాకాశ కాలదిగాత్మమనాంసి నవ ద్రవ్యాణి) దిక్కు అనునది కేవలము అవచ్ఛేదము. ఉదయాచలముతో సంయోగము కలిగి ఉన్న మూర్తమయిన పదార్థమే అవచ్ఛేదకము (ఈ విషయాన్ని వివరంగా ఆకాశ నిరూపణం స్థలంలో గ్రంథకర్త చర్చిస్తారు.)

**మూ:** అలాతచక్రాదౌ తు అతిశై ఘ్ర్యాత్ తదన్తరాలా గ్రహణాత్ తత్తద్దేశ సంయుక్త తత్తద్వస్తున ఏవ చక్రాకారేణ గ్రహణాత్ తదపి సత్యమేవ.

**అను:** అలాతచక్రము అనగా–బాగా మండే కట్టెను సాముగరిడీలలో మాదిరి, నలువైపులకు తిప్పుతుంటే, ఆకట్టె తిప్పిచోట ఓ చక్రము నిప్పుతో ఏర్పడినట్లుండుట. వాస్తవంగా కట్టెకు ఒకవైపో రెండువైపులలోనో మంట



ఉంటుంది. వేగం, శీఘ్రము కారణంగా ఆ కట్టె మధ్యభాగము గ్రహింపబడదు. పైగా దాని తిప్పుట మధ్యవచ్చినవన్ని చక్రములాగా కనపడుతుంటవి. అదికూడ సత్యమే.

**మూ:** దర్పణాదిషు నిజముఖాదిప్రతీతిరపి యథార్థా. దర్పణాది ప్రతి హతగతయో నాయనరశ్మయో దర్పణాది గ్రహణపూర్వకం నిజముఖాది గృహ్ణన్తి. తత్రాప్యతిశైఘ్ర్యాదన్తరాలాగ్రహణాత్తథా ప్రతీతిః. ద్విచన్ద్ర జ్ఞానాదావప్యఙ్గుల్య వష్టమ్భ తి మిరాదిభిర్నాయన తేజోగతి భేదేన సామగ్రీ భేదాత్ సామాగ్రీద్వయ మన్యోన్యనిరపేక్షం ద్విచన్ద్రగ్రహణ హేతుర్భవతి. సామగ్రీద్వయం పారమార్థికమ్. తేన ద్విచన్ద్రజ్ఞానం భవతి. అతః సర్వవిజ్ఞానం సత్యం సవిశేషవిషయఞ్చ నిర్విశేషవస్తునోఽ గ్రహణాత్.

**అను:** అద్దము మొదలయినవాట్లలో కనబడే మనయొక్క ముఖ (ప్రత్యక్ష) జ్ఞానము కూడ యథార్థ మయినదీ. మనకళ్ళయొక్క కాంతుల గతి–ప్రసారము అద్దముచే అడ్డగింపబడి అద్దంతో బాటు మనముఖాన్ని కూడ గ్రహిస్తుంది. అందువలననే అద్దంలో ముఖం కనిపిస్తుంది. కాంతివేగం కారణంచేత చూపు అద్దం మధ్యనఉన్న అన్తరాలాన్ని– మధ్యభాగము ప్రదేశం యొక్క జ్ఞానము కలుగదు. అద్దంలో ముఖం కూడ సత్యమే. మనం కళ్ళను చివర ఓ వేలితోఒత్తి చూస్తుంటే ప్రతిది రెండు వస్తువులుగా కనబడుతుంది. అట్లాగే ఓ రకమయిన కంటి జబ్బు (తిమిరం–అని దానిపేరు) వచ్చినప్పుడు కూడ వస్తువులు రెండు రెండుగా కనపడతవి. దీనికి అంటే రెండు రెండుగా కనబడడానికి వేలితో ఒత్తి పట్టడం, తిమిరం అనే జబ్బు కారణము. దీనివలన నేత్రకాంతులు రెండుగా అవడం (సామగ్రీ భేదము చేత) రెండు వస్తువులు వేరువేరుగా చంద్రుడు కూడ ఇద్దరు ఉన్నట్లు కనబడడానికి కారణమవుతుంది. చూసే కాంతులు (సామగ్రీ) రెండు యథార్థమే. దానివలన ద్విచంద్రజ్ఞానము కలుగుతుంది. అందువలన విజ్ఞానమంతయు సత్యమే. మరియు విశేషములతో కూడిన విషయము కలదియే నిర్వికల్పకమయిన వస్తువు గ్రహింపబడదు.

వి: ధాతువుల కనేకార్థాలున్నాయి. ఖ్యా ధాతువుకు కూడ చెప్పుట– (తెలుగు ఖ్యాతి అంటే ప్రసిద్ధి.) దర్శనాలలో ఖ్యాతి అంటే భ్రమ జ్ఞానము. చీకట్లో తాడును చూసి పాము అనుకోవడం భ్రమ. ఈ జ్ఞానాన్ని పలువురు దార్శనికులు పలురకాలుగా చెప్పారు.

**1. అఖ్యాతి:** మీమాంసకులలో ఒకరయిన ప్రభాకరుని మతమున–ఈ పదము భ్రమజ్ఞానమును తెలుపుతుంది. ముత్యపుచిప్పను చూసి ఇదం–ఇది, రజతం– వెండి అనుప్రయోగములో ఇదం అనేది ప్రత్యక్షాన్ని తెలుపుతుంది రజతం–వెండి అనుప్రయోగములో ఇదం అనేది ప్రత్యక్షాన్ని తెలుపుతుంది రజతం–స్మరణాన్ని, రెండు జ్ఞానాల విషయాలు సరిగా వివేచింపలేక పోవడం కారణంగా భ్రమ ఏర్పడుతుంది. అఖ్యాతి–వివేకజ్ఞానం లేక పోవడం.

**2. ఆత్మఖ్యాతి:** సౌత్రాంతికులు, వైభాషికులు అను బౌద్ధులు దీన్ని ఒప్పుకుంటారు. ఇంద్రియార్థ సన్నికర్ష లేకుండా బుద్ధిప్రత్యక్ష మవుతుంది. అదేవిధంగా బుద్ధి రూపరజతము కూడ ఇంద్రియార్థ సన్నికర్షం లేకుండా ప్రత్యక్షం అవుతుంది. విజ్ఞానమే రజతరూపం అయి, రజతంగా గ్రహింపబడుతుంది. ఇది వెండి కాదు అనే బాధకజ్ఞానము కలుగగా వెండి ఎదుట లేకపోవడం మాత్రం నిషిద్ధ మవుతుంది. మొత్తం రజతంకాదు. ధర్మిని, ధర్మాన్ని రెండింటిని నిషేధించడం కంటే ఎదురుగా ఉన్న అనే ధర్మాన్ని నిషేధించడం సులువు– లాఘవము. విజ్ఞానమే ఆత్మ అంటారు వీరు. కనుక వీరు చర్చించిన ఖ్యాతి– ఆత్మఖ్యాతి.

**3. అనిర్వచనీయ ఖ్యాతి:** అద్వైతులు దీన్ని ఒప్పుకుంటారు. భ్రమ ఉదాహరణ ములోని వెండి సత్‌కాదు. అసత్‌కాదు. సత్ అయితే దానికి నిషేధ ముండదు– బాధ కాదు. అసత్ అయితే కుందేటి కొమ్మువలె అది తెలియ బడదు–ప్రతీతికాదు.



సత్ అసత్ అని చెప్పరానందున అనిర్వచనీయ ఖ్యాతి అన్నమాట. అనిర్వచనీయ రజతమే ముత్యపుచిప్ప యందున్న చైతన్యముగా వివర్తము చెందుతుంది.

**4. అన్యథాఖ్యాతి:** తార్కికులు దీన్ని ఒప్పుకుంటారు. వీరి ప్రకారము ముత్యపుచిప్పను, ముత్యపుచిప్పగాకాక వెండిగా అనుకోవడం వేరొకవిధంగా అనుకోవడం అన్నమాట. వెండి మరోచోట ఉంటుంది. తాదాత్మ్య సంబంధంతో జ్ఞానలక్షణము యొక్క ప్రత్యాసత్తి కలుగుతుందో అప్పుడు చిప్పలో అలౌకిక చాక్షుపప్రత్యక్షంతో 'వెండి' ప్రతీతి కలుగుతుంది.

**5. అసత్ ఖ్యాతి:** శూన్యవాదులయిన మాధ్యమిక బౌద్ధులు–దీనిని ఒప్పు కుంటారు. అసత్‌ను ప్రకాశింప జేసేది విజ్ఞానము. విజ్ఞానమునకు అసత్తుపయి పక్షపాతము కలది అను నియమమున్నది. సత్ఖ్యాతివాదులందరు ప్రకాశమాన మయినది మాత్రమే వస్తుసత్త కలది అంటారు. అప్పుడు అన్ని ప్రకాశమానమయితే అన్ని ఉన్నట్టుగా–సత్తా కలవిగా అంగీకరించాల్సివస్తుంది. దీన్ని తప్పించు కోవడానికి అసత్‌ఖ్యాతియే మార్గము.

**6. యథార్థఖ్యాతి:** విశిష్టాద్వైతులు, గ్రంథకర్తదీన్ని ఒప్పుకుంటారు. భ్రమజ్ఞానము యొక్క విషయాన్ని 'యథార్థము' అని అంగీకరించుటయే ఇది. ఈ దర్శనము వైదికము. ఛాందోగ్యోపనిషత్తులో ఆత్మవిద్యాప్రకరణంలో 'తేషాం త్రివృతం త్రివృతంకరవాణి' అని సంకల్పించి పరమాత్ముడు పృథివ్యప్తేజస్సులలో, సగంభాగము వాటిని, మిగత సగంభాగంలో, జలతేజస్సులను సృష్టించాడు. త్రివృత్కరణమే తరువాతి పంచీకరణానికి మూలము. అన్నిటిలో అన్నీ ఉన్నప్పటికి, ఎక్కువ ఉన్నదాన్ని బట్టి వ్యపదేశము–పేరు ఏర్పడుతుంది. దీనిప్రకారము శుక్తిలో ఉన్న రజతమే ప్రతీతము అవుతున్నది. గ్రహింపబడుతున్నది. ఇదియథార్థము. మరి దీన్ని భ్రమ ఎందుకంటారు. శుక్తిలో ఉన్న రజతముయొక్క వ్యవహారానికి

పిలువడానికి బాధ ఏర్పడుతున్నది. ఆ వెండితో నగలు మొదలయినవి చేసు కోరాదు కద. ముత్యపు చిప్ప భాగము ఎక్కువ అని జ్ఞానము కలుగగానే ఆ భ్రమకు బాధ నిషేధం కలుగుతుంది.

**మూ:** ఏవం భూతం ప్రత్యక్షం ప్రథమతో (జాత్యాదిరూప) భేద విశిష్ట మేవ గృహ్ణాతి. భేద ఇతి వ్యవహారే తు ప్రతియోగ్యపేక్షా, నతు స్వరూపే. తేనానవ స్థాన్యోన్యాశ్రయదోషోఽపి నాస్తి ఉపర్యు పర్యపేక్షాఽనవస్థా. పరస్పరాపేక్షా అన్యోన్యాశ్రయః

**అను:** ఇట్లు పయిన చెప్పినప్రకారము, మొదటి ప్రత్యక్షములోనే (జాతి మొదలయినట్టి) భేదములతో కూడినట్టి వస్తువు గ్రహణం జరుగుతుంది. ఒకటిగానే వస్తువుంటుంది గద. భేదము తెలియాలంటే మరియొకటి – ప్రతి యోగి కూడ కావాలి అని అనరాదు. భేదమును చెప్పేప్పుడు (వ్యవహారము నందు) ప్రతియోగి అవసరం కాని ఆ వస్తుస్వరూపంవిషయంలో అక్కరలేదు. దీనివలన అనవస్థాదోషముగాని అన్యోన్యాశ్రయదోషముగాని కలుగదు. అనవస్థా అంటే ఒకదాని తర్వాత మరియొక్కటి కల్పించాల్సి రావటం. అన్యోన్యాశ్రయము అంటే ఇంచుమించు పెళ్ళి కుదిరితే పిచ్చితగ్గుతుంది. పిచ్చితగ్గితే పెళ్ళిఅవుతుంది అనడం లాంటిది. ఈ దోషాలు ఇక్కడ ఎట్లా లేవో చూద్దాము.

ఒకపదార్థము–ధర్మి దానిజాతి మొదలయినవి ధర్మములు. ధర్మములు ధర్మికంటె భిన్నములు. స్వరూపం కంటే భిన్నములు. అట్లాభిన్నము అయినప్పుడు అభేదమునకు భేదము. ఒకదాని తర్వాత ఒకటి కల్పించాల్సివస్తుంది కద. భేదమును వ్యవహరించేప్పుడు దానియొక్క ప్రతియోగి (ధర్మము) కావాల్సి వస్తుంది. స్వరూపజ్ఞానంతో పనిలేదు. దీనివలన దోషం తొలగిపోతుంది. ఉదాహరణకు–గోత్వాది సంస్థాన రూపమయిన జాతియే (స్వరూపమే) గవా దులను అశ్వాదులతో అభేదము అను జ్ఞానానికి విరోధియయిన జ్ఞానానికి (గోత్వాదియొక్క తెలివిడికి) విషయమవుతుంది. కనుక అశ్వాదులకంటే భిన్న ములు గవాదులు అనుజ్ఞానంలో ప్రతియోగిజ్ఞానం అవశ్యకత లేదు. జాతి



తనను పరమును నిర్వహిస్తుంది కాబట్టి ఇతరములనుండి భేదమును కల్గించ డానికి మరియొక ధర్మము అవసరము లేదు. అట్లే భేదము నిర్వహణకయి ప్రతియోగి అపేక్షకూడ ఉండదు. కాబట్టి భేదవిశిష్టమయిన వస్తువు యొక్క ప్రత్యక్షగ్రహణమునందు, అన్యోన్యాశ్రయ దోషము, అనవస్థాదోషమూ లేవు.

## దశమస్త్వమసీతి వాక్యజన్యజ్ఞానస్య ప్రత్యక్షత్వనిరాసః

**మూ:** నను, దశమస్త్వమసీత్యేతదపి ప్రత్యక్షం కిం న స్యాదితి చేన్న. త్వమిత్యేతస్య ప్రత్యక్షత్వేఽపి దశమోఽసీత్యేతస్యవాక్యజన్యత్వాత్. యదిదశమోఽసీత్యస్య (ప్రత్యక్షత్వం) ప్రత్యక్షవిషయత్వం తర్హి ధర్మవాంస్త్వ మసీత్యేతస్యాపి ప్రత్యక్షత్వం స్యాత్. అఙ్గీకారేఽతి ప్రసంగాత్. అతఏవ తత్త్వమసీతి వాక్యస్య నాపరోక్షజ్ఞానజనకత్వమ్.

**అ:** ఆవును నీవు పదవవాడవు అనువాక్యముచే కలిగేజ్ఞానము కూడ ప్రత్యక్షములో చేరుతుంది గద–కాదు. ఎందుకంటే నీవు అను దాని ప్రత్యక్షం అయినప్పటికీ నీవు పదవవాడవు అనేజ్ఞానము మాత్రము వాక్యజన్యము. నీవు పదవవాడవు అనుదానిని కూడ ప్రత్యక్షము యొక్క విషయముగా ఒప్పుకుంటే నీవు ధర్మవంతుడవు' అను వాక్యము వలన గలుగు జ్ఞానాన్ని కూడ ప్రత్యక్షము అని ఒప్పుకోవాల్సివస్తుంది. అట్లా ఒప్పుకుంటే అతి ప్రసంగము అవుతుంది. అందువలన 'తత్త్వమసి' అనే వాక్యము కూడ అపరోక్ష జ్ఞానమును కలిగిం చదు.

**వి:** అద్వైతులు 'తత్త్వమసి' అను వాక్యాన్ని అపరోక్షతత్త్వజ్ఞానాన్ని కలిగించేదిగా అంగీకరిస్తారు. దీన్ని సమర్థించడానికి ఓ కథను కూడ ఉదా హరిస్తారు. పదిమంది పనిమీద గ్రామాంతరం వెళ్ళారు. తిరిగివచ్చేప్పుడుఅందరు ఉన్నారో లేదో అని ప్రతివాడు లెక్కపెట్టాడు, లెక్కపెట్టేవాడు అందర్ని లెక్కపెట్టి తనను మరచిపోయేవాడు. అట్లా ఒకడు తగ్గాడు అని వాళ్ళు విచారి స్తుండగా

ఒక జ్ఞాని వారి విచార కారణం అడిగి పిచ్చివాళ్ళారా ఆ పదవవాడు నీవే అని చెప్పాడు. ఆ మాట వినగానే లెక్కపెట్టినవారికి అపరోక్షజ్ఞానం–నేనే ఆ పదవ వాడను అనేది కలిగింది. ఇట్లానే 'తత్త్వమసి' వాక్యము కూడ అపరోక్ష జ్ఞానము కలిగిస్తుంది అని అభిప్రాయము.

దీనిని ఖండిస్తూ విశిష్టాద్వైతులు ఇలా చెప్తూతారు – ఈ అభిప్రాయం సరి కాదు. 'దశమస్త్వమసి' అను వాక్యంలోని 'త్వం' యొక్క అర్థాన్ని వినువాడు 'తనే' అని తెలుసుకుంటాడు. కాని పదవవాడు అనుదాన్ని సాక్షాత్కారింప జేసుకోడు. పదవవాడవు అనే జ్ఞానము శబ్దము వలననే కలుగుతున్నది. ఈ జ్ఞానము కూడ ప్రత్యక్షం వలననే కలుగుతుంది. అంటే నీవు ధర్మవంతుడవు అనువాక్యం వినగానే వినేవాడికి తన ధర్మవత్త్వముకూడ ప్రత్యక్షము కావాలిసి వస్తుంది. దాన్ని ఎవరూ ఒప్పుకోరు. ఇట్లా 'తత్త్వమసి' వాక్యముతోగూడ అపరోక్ష జ్ఞానం కలుగుతుందని ఒప్పుకోలేము. శ్రోత అయిన శ్వేతకేతువుకు నీవు అనేది ప్రత్యక్షం కావచ్చును కాని తాను బ్రహ్మాత్మకుడు అనేజ్ఞానం మాత్రం శాస్త్రాల ద్వారానే కద కలుగుతున్నది. కనుక జ్ఞానము శాబ్దమే కాని ప్రత్యక్షము కాదు. ప్రత్యక్షము=అపరోక్షము. అప్రత్యక్షము=పరోక్షము.

**మూ:** ఏతేన–ప్రత్యక్షప్రమాకరణం ప్రత్యక్షప్రమాణమ్. ప్రమాచాత్ర చైతన్యమేవ. చైతన్యం చ త్రివిధమ్ – అంతఃకరణావచ్ఛిన్న చైతన్యం, వృత్త్య వచ్ఛిన్న చైతన్యమ్, విషయావచ్ఛిన్న చైతన్యం చేతి. యదా త్రయాణామైక్యం తదా సాక్షాత్కారః తదపి నిర్విశేషవిషయమేవ అభేదమేవ గృహ్ణాతీత్యాది కుదృష్టి కల్పనా నిరస్తా. నిర్వికల్పకం తు నామ జాత్యాదియోజనాహీనం వస్తుమాత్రావ గాహి కిఞ్చిదిదమితి జ్ఞానమితి నైయాయికానాం మతమపి నిరస్తమ్.

**అ:** పయి నిరూపించినదాన్ని బట్టి ప్రత్యక్ష ప్రమకు సాధకతమమయినది ప్రత్యక్షప్రమాణము. కరణము అనగా సాధకములలో శ్రేష్ఠమయినది. ప్రత్యక్ష ప్రమను సాధించుటలో శ్రేష్ఠమయినది ప్రత్యక్షప్రమాణము అని అర్థము. ఇక్కడ ప్రమా అంటే చైతన్యమనియే. చైతన్యము మూడువిధాలు–1 మనస్సులో



వుండేది–అంతఃకరణముచే అవచ్ఛిన్నము 2 అంతఃకరణవృత్త్యవచ్ఛిన్న చైత న్యము3 విషయావచ్ఛిన్న చైతన్యము. ఈ మూడుచైతన్యములు కలిసినప్పుడు సాక్షాత్కారము కలుగుతుంది. ఆ ప్రత్యక్షము కూడ అభేదమును మాత్రము గ్రహిస్తుంది. ప్రత్యక్షవిషయము కూడ నిర్విశేషవిషయమే అనునవి ఖండింప బడినవి. పేరు, జాతి మొదలయినవి లేకుండ వస్తుమాత్రం ఇది అని నిర్వికల్పక (ము) జ్ఞానము అను నైయాయికుల అభిప్రాయము కూడ ఖండింపబడినది.

**మూ:** నను 'కాణాదం పాణినీయం చ సర్వశాస్త్రోపకారకమ్' ఇత్యుక్త త్వాత్ కథం గౌతమమతనిరాస ఇతిచేత్, ఉచ్యతే న ఖలు (నాస్మాభిః) కార్త్స్న్యేనాస్య మతస్య నిరాసః క్రియతే. యావదిహాయుక్తియుక్తం తావత్స్వీక్రియతే, పరకల్పిత తటాకోపజీవనవత్. న ఖలు తటాకస్థపఙ్కోఽపి స్వీక్రియతే. అతః పరమాణు కారణత్వమ్, వేద పౌరుషేయత్వమ్, ఈశ్వరానుమానికత్వమ్, జీవవి భుత్వమ్, సామాన్యవిశేష సమవాయానాం పదార్థత్వేన స్వీకారః ఉపమానాదేః పృథక్ ప్రమాణత్వకల్పనమ్, సంఖ్యాపరిమాణ పృథక్త్వవిభాగ పరత్వాపరత్వ గురుత్వ ద్రవత్వాదీనాం పృథగ్గుణత్వ కల్పనమ్, దిశోఽపి ద్రవ్యత్వ కల్పన మిత్యాది సూత్రకారాది విరుద్ధప్రక్రియా నాస్మాభిః స్వీక్రియతే. అవిరుద్ధాని తు స్వీక్రియంత ఇతి న విరోధః.

**ఇతి శ్రీవాధూల కులతిలక శ్రీమన్మహాచార్యప్రథమదాసేన శ్రీనివాస దాసేన విరచితాయాం యతీన్ద్రమతదీపికాయాం శారీరకపరిభాషాయాం ప్రత్యక్షనిరూపణం నామ ప్రథమోఽవతారః.**

**అ:** వైశేషిక దర్శనము, పాణినీయవ్యాకరణమూ అన్నిశాస్త్రాలకు ఉప కరిస్తాయి. అని ఓ సూక్తి ఉన్నది కదా. అప్పుడు గౌతమ మతమును ఎట్లా ఖండిస్తారు అని ప్రశ్న. కాణాదము వైశేషికము, గౌతమదర్శనము–న్యాయము రెండు సమానతంత్రములు. వీటికి రెండిటికి కలిపి 'తర్కశాస్త్రము' అనిపేరు. దీనికి సమాధానము ఏమంటే–మేము మొత్తము న్యాయశాస్త్రమును

నిరసించుటలేదు. ఎంతవరకు గౌతముని మతము మాకు యుక్తియుక్తమో అంతవరకు స్వీకరిస్తాము. ఇతరులు తవ్వించిన చెరువులోని నీరును గ్రహించినట్లుగా, దప్పిక గొన్నవాడు నీళ్ళను మాత్రము తాగుతాడు. బురదను వదలిపెడతాడు గదా అట్లాగా అన్నమాట. అందుకని ఈ క్రింది వాటిని మేము ఒప్పుకోము. పరమాణుకారణవాదము, వేదములు పురుషనిర్మితములు అనుట, ఈశ్వరుణ్ణి అనుమాన ప్రమాణముతో సిద్ధింపజేయుట, జీవులయొక్క విభుత్వము సామాన్యమును, విశేషమును, సమవాయమును పదార్థములుగా అంగీకరించుట, ఉపమానమును వేరు ప్రమాణముగా అంగీకరించుట, సంఖ్య, పరిమాణము, పృథక్త్వము, విభాగము, పరత్వాపరత్వములు, గురుత్వము, ద్రవత్వము, అనువాటిని వేరు గుణములని ఒప్పుకొనుట, దిక్కులు ద్రవ మయముగా అంగీకరించుట అనునవి సూత్రకారులకు భాష్యకారులకు మొదలగువారికి విరుద్ధమయినవి. కావున వీటిని మేము అంగీకరించము. సూత్ర కారాదులకు విరుద్ధము కానివాటిని ఒప్పుకుంటాము.

శ్రీవాధూలకులతిలక శ్రీమన్మహాచార్యప్రథమదాసుడు అయిన
శ్రీనివాసదాసునిచే విరచితమయినయతీన్ద్రమతదీపికయందు శారీరక
పరిభాషయందు ప్రత్యక్షనిరూపణము అను ప్రథమావతారము
సమాప్తము.

***



## అథ ద్వితీయావతారః

## అనుమానలక్షణం అనుమితిలక్షణం చః

**మూ:** అథానుమానం నిరూప్యతే. వ్యాప్యస్య వ్యాప్యత్వాను సన్ధానాత్ వ్యాపక విశేషప్రమితిరనుమితిః. తత్కరణం అనుమానమ్. వ్యాప్యస్య–ధూమస్య, అగ్నివ్యాప్యత్వానుసన్ధానాత్ వ్యాపకవిశేషప్రమితి ర్వహ్నిప్రమితిః.

**అ:** ప్రత్యక్షమును నిరూపించి దానిపయి ఆధారపడిన అనుమానము నిరూపింపబడుతున్నది. వ్యాప్యము యొక్క వ్యాప్యత్వమును మాటిమాటికి తలచుకొనుట వలన (అనుసంధానము–విమర్శ, పరిశోధన అని కూడ అర్థము.) వ్యాపక విశేషము యొక్క ప్రమితి – జ్ఞానము, అనుమానము అని అర్థము. ఆ అనుమితిని సాధించుకరణము అనుమానము. వ్యాప్యము–ధూమము, అగ్ని వ్యాప్యము అని తలచుట వలన వ్యాపకవిశేషము యొక్క–అగ్నియొక్క జ్ఞానము కలుగుట అనుమతి యని అర్థం.

**వి:** హేతుదర్శనము, హేతువును సపక్షములో చూడటము అను ప్రత్యక్షముపయి ఆధారపడినట్టిది అనుమానము అను ఈ రెండవ ప్రమాణము. వ్యాప్యము అనగా హేతువు, వ్యాపకము అనగా – సాధ్యము. హేతువు నందు సాధ్యనిరూపిత వ్యాప్యత్వము ఉంటుంది. ఈ వ్యాప్యత్వజ్ఞానము ద్వారా పక్షము (పర్వతం మొదలయినవి) లో ఉండే వ్యాపకము యొక్క – వహ్ని యొక్క ప్రమాజ్ఞానము కలుగుతుంది. దీనినే అనుమితి అంటారు. మనము పర్వతము పయి పొగను చూస్తాము. ఆ పొగను ఇదివరకు నిప్పుఉన్న ప్రదేశాల్లో–వంటఇల్లు మొదలయిన వాటిల్లో చూశాము. ఇట్లాప్రత్యక్షము–పొగాకు నిప్పుకు ఉన్న అవినాభావసంబంధాన్ని తరచు చూసినందువలన పర్వతముపయి కేవలం పొగను దూరమునుండి చూసి కూడ పొగకు నిప్పుకు ఉన్నసంబంధము గుర్తు తెచ్చుకొని వ్యాప్యత్వాను సంధానము అంటే ఇదే, నిప్పుయొక్క జ్ఞానాన్ని పొందు తాము – ఇదే వ్యాపకవిశేషప్రమితి, దీని పేరే అనుమితి.

### వ్యాప్తినిరూపణమ్:

**మూ:** అనధికదేశకాల నియతం వ్యాప్యమ్. అన్యూనదేశకాలవృత్తి వ్యాపకమ్. తదిదమవినాభూతం వ్యాప్యం. తత్రప్రతిసంబంధివ్యాపకమితి. తేన

నిరుపాధికతయా నియతసంబంధో వ్యాప్తిరిత్యుక్తం భవతి. సేయం యత్ర ధూమస్తత్ర వహ్నిరితి వ్యాప్తిర్భూయోదర్శనేన గృహ్యతే. వ్యాప్తిర్ద్వివిధా: అన్వయవ్యతిరేకభేదాత్. సాధనవిధౌ సాధ్యవిధి రూపేణ ప్రవృత్తా వ్యాప్తిరన్వయ వ్యాప్తిః. యథా యో యో ధూమవాన్ స సోఽగ్నిమానితి. సాధ్యనిషేధే సాధననిషేధ రూపేణ ప్రవృత్తావ్యాప్తిః వ్యతిరేకవ్యాప్తిః. యథాయోఽనగ్నిః స నిర్ధూమ ఇతి. సేయముభయవిధా వ్యాప్తిః ఉపాధిసమ్భవే దుష్టా.

**అ:** వ్యాప్యము, (హేతువు అన్న మాట) సాధ్యము (అగ్నిమొదలయిన వాని) కంటె అధికదేశాల్లో (చోట్లలో) కాలాల్లో ఉండదు. అట్లాగే వ్యాపకము, వ్యాప్యముకంటే తక్కువచోట్లలో కాలాల్లో ఉండదు. వ్యాప్యము వ్యాపకముతో అవినాభావము కలది. అనగా వ్యాపకము లేకుండ వ్యాప్యము ఉండదు అని తాత్పర్యము. వ్యాపకము వ్యాప్యమునకు ప్రతిసంబంధి అవుతుంది. వ్యాప్యముతో వ్యాపకమునకు ఉపాధిలేకుండ ఉండే సంబంధమును వ్యాప్తి అంటారు. ధూమము ఉన్నచోటల్లా అగ్నిని చూడటం వలన వ్యాప్తిగ్రహణము జరుగుతుంది. వ్యాప్తి రెండువిధాలు–ఒకటి అన్వయవ్యాప్తి, రెండవది–వ్యతిరేక వ్యాప్తి, సాధనము ఉన్నందువలన సాధ్యము ఉన్నదని ప్రతిపాదించు వ్యాప్తిని అన్వయవ్యాప్తి అంటారు–ధూమమెక్కడ ఉన్నదో అక్కడ వహ్ని ఉన్నది అనునది లేదా ఏది ధూమము కలదో అది అగ్ని కలది–అనేది. సాధ్యమును లేదని నిషేధించి సాధనమును నిషేధించుటతో గ్రహించేవ్యాప్తిని వ్యతిరేకవ్యాప్తి అంటారు–ఏదిఏది అగ్నిలేనిదో అయ్యది ధూమము లేనిది అనునది వ్యతిరేకవ్యాప్తి కుదాహరణము.

**వి:** అనుమానప్రమాణం చర్చలో తరచూవచ్చే పారిభాషిక పదాలు, వ్యాప్యము, వ్యాపకము, వ్యాప్తి మొదలయినవి. వ్యాప్యమునే హేతువు అనీ లింగము అనికూడ అంటారు. వ్యాపకమును సాధ్యము అని లిఙ్గి అని కూడ పిలుస్తారు. అనుమానముతో సాధింపదలచుకున్న దానిని సాధ్యము అంటారు. ఉదా: పర్వతము పయి కనపడే పొగద్వారా సాధించబోయే అగ్నిని సాధ్యము



అంటారు. ఆ సాధ్యమును సాధించుదానికే –సాధనము, హేతువు, వ్యాప్యము లింగము అని పేర్లు. వ్యాప్యము, వ్యాపకముతో సమానముగా లేదా తక్కువ దేశాల్లో కాలాల్లో ఉండటము జరుగుతుంది. వ్యాపకము కంటే ఎక్కువ దేశకాలాల్లో వ్యాప్యముండదు. ఇక వ్యాపకము స్వభావము ఏమంటే వ్యాప్యముతో సమానముగా అంతకంటే ఎక్కువ దేశకాలాల్లో ఉండటము. వ్యాపకము వ్యాప్యముకంటే తక్కువ దేశాకాలాల్లో ఉండదు. ఇది వ్యాప్యానికి వ్యాపకముతో నున్న అవినాభావ సంబంధము. అనగా వ్యాప్యము వ్యాపకము లేకుండ ఉండదు. అగ్ని ఉన్నచోట ధూమముంటుంది, అగ్నిలేకుండ ధూమముండదు. ఎందుకంటే ధూమము అగ్నితో అవినాభూతముగా ఉండేది గాబట్టి. ఏది లేకుండా వ్యాప్యముండదో, అది వ్యాపకము–ఉదా–అగ్నిధూమానికి వ్యాపకము. అందుకే వ్యాపకము వ్యాప్యము యొక్క అవినాభూతత్వానికి ప్రతిసంబంధి అవుతుంది. హేతువులోఉండే అవినాభావమునకు నిరూపకము అవుతుంది.

వ్యాప్తిజ్ఞానము లేనిదే అనుమితి కలుగదు కనుక వ్యాప్తిజ్ఞానము అత్యావశ్యకము. వ్యాప్యముతో వ్యాపకమునకు గల అవ్యభిచరిత సంబంధమే వ్యాప్తి–ఎక్కడయినా ఒకచోట లేకపోవడం వ్యభిచారము. అనగా నియమమును అతిక్రమించుటయే, నియమభంగములేని సంబంధమే అవ్యభిచరిత సంబం ధము. అదియే నియత సంబంధము. నియతముగా తప్పక ఉండే సంబంధము. అదియే ఉపాధిలేనట్టి సంబంధము. ఉపాధి ఉన్నట్లయితే వ్యాప్తి కలుగదు. ఎక్కడెక్కడ పొగఉన్నదో అక్కడక్కడ నిప్పు తప్పక ఉన్నది అనే జ్ఞానాన్ని వ్యాప్తి గ్రహము అంటారు.

వ్యాప్తిగ్రహము విషయంలో రెండు అభిప్రాయాలున్నాయి. మాటి మాటికి సాహచర్యదర్శనమునే వ్యాప్తిగ్రాహకము అంటారు. వంట ఇంట్లో, కొలిమిలో, నెగళ్ళలో ఎక్కడ చూసిన పొగ ఉన్నప్పుడు నిప్పుకూడ తప్పక ఉంటున్నది. ఈ సాహచర్యదర్శనము మాటిమాటికి కలుగుటచేత దానివలన

పొగ ఎక్కడ ఉంటుందో అక్కడ నిప్పుఉంటుంది అని నిశ్చయిస్తాడు. ఇది ఒకటి–దీనిలో భూయోదర్శనము ప్రధానమయినది. ఇక రెండవదాని ప్రకారం – నియతసాహచర్యదర్శనము మాత్రమే వ్యాప్తిగ్రాహకము. ధూమాగ్నుల సాహచర్యము నియతము అదియే గ్రాహకము.

వ్యాప్తిరకాలు–1 అన్వయవ్యాప్తి– అన్వయమధికృత్యప్రవృత్తావ్యాప్తిః, తత్సత్త్వేతత్సత్త్వమన్వయః–అదిఉంటే అది ఉన్నది–హేతువుంటే సాధ్యమున్నది అను అన్వయాన్ని ఆధారంగా చేసుకొని ఏర్పడినది అన్వయవ్యాప్తి. వ్యాప్యసత్త్వే వ్యాపకసత్త్వం – అన్వయః. ధూమసద్భావాన్ని ఆధారంగా అగ్నిసద్భావాన్ని ప్రతిపాదించడం ద్వారా కలిగే వ్యాప్తి. యత్ర యత్ర ధూమః తత్ర తత్ర వహ్నిః అని అన్వయవ్యాప్తికి ఉదాహరణము. 2 వ్యతిరేకవ్యాప్తి. వ్యతిరేకం ఆధారంగా ఏర్పడేది వ్యతిరేక వ్యాప్తి. తదభావే తదభావః వ్యతిరేకః. సాధ్యాభావే సాధనాభావో వ్యతిరేకః. అగ్నిలేక పోతే ధూమము కూడ ఉండదు అనునది వ్యతిరేకవ్యాప్తి. స్థూలముగా అన్వయము అంటే ఉండటము వ్యతిరేకము అంటే లేకపోవడం అని చెప్పుకోవచ్చును. ముఖ్యముగా గుర్తుంచుకోవలసింది ఏమంటే అన్వ యంలో వ్యాప్యమున్నను వ్యాపకములేక పోవడం అనేది ఉపాధిఅవుతుంది. అప్పుడు వ్యాప్తి కలుగదు. అట్లాగే వ్యాప్యములేకున్నా వ్యాపకము ఉండటము అనే ఉపాధి ఉంటే వ్యతిరేకవ్యాప్తి కలుగదు.

**ఉపాధినిరూపణమ్:**

**మూ:** సాధ్యవ్యాపకత్వేసతి సాధనావ్యాపకత్వముపాధిః. యథా– వహ్నినా ధూమే సాధ్యమానే అర్ద్రేన్ధన సంయోగ ఉపాధిః. మైత్రీతనయత్వేన శ్యామత్వే సాధ్యమానే శాకపాకజత్వముపాధిః. స చోపాధిః ద్వివిధః–నిశ్చితః శఙ్కితశ్చేతి. నిశ్చితో యథా–విప్రతిపన్నాసేవా దుఃఖహేతుః సేవాత్వాత్ రాజ సేవావత్ ఇత్యత్ర పాపారబ్ధత్వముపాధిః. అయం చేశ్వర సేవాయాం నాస్తీతి నిశ్చయాదయం నిశ్చితోపాధిః. శఙ్కితో యథా–విప్రతిపన్నో జీవేతచ్ఛరీరావసానే ముక్తిమాన్ నిష్ప



న్నసమాధిత్వాత్ శుకాదివదిత్యత్ర కర్మాత్యన్త పరిక్షయ ఉపాధిఃస చ నిష్పన్న సమాధౌ విప్రతిపన్నే జీవే అస్తి(వా) నాస్తీతి సన్దిగ్ధత్వాత్ శఙ్కితోపాధిః. అతో నిరుపాధిక సమ్బంధవత్ వ్యాప్యం ఇతి సిద్ధమ్.

**అ:** ఏది సాధ్యమునందు వ్యాపకముగా ఉంటూ సాధనమునందు వ్యాపకముగా ఉండదో అది ఉపాధి. అయం ధూమవాన్ వహ్నేః అనుచోట ధూమము సాధ్యము, వహ్నిహేతువు. ఇక్కడ ఆర్ద్రేన్ధనసంయోగము ఉపాధి. ఈ ఆర్ద్రేన్ధన సంయోగము సాధ్యమయిన ధూమమునందు వ్యాపకముగా నున్నది. కాని సాధనమయిన వహ్నియందు లేదు. అట్లాగే అయం శ్యామః మైత్రీ తనయ త్వాత్ అనుచోట శ్యామత్వము సాధ్యము. మైత్రీతనయత్వము హేతువు. ఇక్కడ శాకపాకజత్వము ఉపాధి. శాకపాకజత్వము సాధ్యమయిన శ్యామత్వమున ఉన్నది. కాని సాధనమయిన మైత్రీతనయత్వమున వ్యాపకము కాదు. ఈ ఉపాధి నిశ్చితము, శంకితము అని రెండు రకాలు. వివాదాస్పద మయిన, సేవ దుః ఖకారణము, సేవ అయినందున రాజసేవలాగ అను అనుమానమున పాపారబ్ధత్వము ఉపాధి. ఈ ఉపాధి ఈశ్వరసేవయందులేదు కనుక నిశ్చిత మయిన ఉపాధి శంకితోపాధి–వివాదాస్పదుడు అయిన జీవుడు ఈ శరీరము అయిపోయిన తర్వాత ముక్తి పొందుతాడు. సమాధి కలిగిన వాడు కాబట్టి శుకుడు మొదలగు వారికిట్లాగే ముక్తి దొరికింది. కనుక దీనిలో కర్మమొత్తం బొత్తిగా లేకుండా క్షీణించుట ఉపాధి. ఈకర్మాత్యన్తపరిక్షయము సమాధి కలిగిన ఈజీవుని యందు ఉన్నదా లేదా అను శంక ఉన్నందున శంకితోపాధి. కనుక వ్యాప్యము నిరుపాధిక సంబంధము కలిగియుండాలని నిశ్చయము అయినది.

**వి:** వ్యాప్తిని కలుగకుండచేయునది (దూషించునది) ఉపాధి. ఉపాధి స్వరూపము–ఏది సాధ్యమునందు వ్యాపించిఉండి సాధనమున వ్యాపించి ఉండదో అది ఉపాధి. మనము హేతువు ద్వారా సాధిస్తాము కనుక హేతువులో కూడ వ్యాపించి ఉంటే బాగుంటుంది. ఉదాహరణకు అయం ధూమవాన్ వహ్నేః

అనుచోట వ్యాప్తిఇట్లా ఉండాలి–ఎక్కడ ఎక్కడ వహ్ని ఉన్నదో అక్కడ అక్కడ ధూమము ఉన్నది అని కాని ఈవ్యాప్తి కలుగదు ఉపాధిఉన్నందువలన. ధూమములేనిచోట అగ్నిఉన్నందువలన మండునిప్పుకలలో అగ్ని ఉంటుంది కాని పొగ ఉండదు. ఆర్ద్రేన్ధన సంయోగము సాధ్యమయిన పొగయందు వ్యాపించియున్నది కాని సాధనమయిన వహ్నియందు వ్యాపించలేదు కనుక ఉపాధి. మైత్రి కొడుకుల్లో ఒకణ్ణి చూసి, అయంశ్యామః మైత్రీతనయత్వాత్ అని సాధించబోతే వ్యాప్తి ఎక్కడ శ్యామత్వమున్నదో అక్కడ మైత్రీతనయత్వమున్నది అని వ్యాప్తి కలగాలికాని ఉపాధివలన కలుగదు. 'శాకపాకజత్వము' అనగా గర్భవతిగా నున్నప్పుడు తినిన శాకములయొక్క పాకము వలన కూడ శ్యామత్వము కలుగవచ్చును. శాకపాకజత్వము సాధ్యమయిన శ్యామత్వమున వ్యాపించి యున్నది కాని సాధనమయిన మైత్రీతనయత్వము లేదు.

నిశ్చితోపాధి – రెండురకాల ఉపాధిలో ఇది మొదటిది. సేవలు అన్ని దుఃఖమును కలిగించేవి. సేవ రాజుసేవతో సమానమయినది. దీనిలో వ్యాప్తిని అడ్డగించే ఉపాధి 'పాపారబ్ధత్వము' అనునది ఏదయినా పాపము చేసిఉంటేనే జీవుడు రాజుగారిసేవకుడు అయి సేవలు చేస్తాడు. రాజుసేవలో కష్టం ఎక్కువగానే ఉంటుంది. ఇట్లాగే అర్థకామాల కొరకు ప్రపంచంలో చేసే సేవలన్నికూడ ఆయా పాపములవలన కలిగినవే. ఆసేవలన్ని దుఃఖము కలిగించేవే కానీ భగవంతుని సేవలో దుఃఖప్రదత్వము లేదు. సుఖమున్నది. ఇది పుణ్యముయొక్క ఫలితమే. కనుక సేవ దుఃఖప్రదము అనుదానిలో పాపారబ్ధత్వము ఉపాధి పాపారబ్ధత్వము దుఃఖప్రదత్వములో వ్యాపించి ఉన్నది. కాని అన్ని సేవలలో (ఈశ్వరునిసేవలో) లేదు. అవ్యాపకము పరమాత్ముని సేవలో పాపారబ్ధత్వము లేనేలేదను నిశ్చయము కూడ ఉన్నది. కనుక ఇది నిశ్చితోపాధి. శంకితోపాధి–ఈ శరీరంలోని జీవునకు శరీరము తొలగిపోయిన తర్వాత ముక్తి కలుగుతుంది. ఇతనికి శుకునితో సమానమయిన సమాధి కుదిరింది.



ఇందులో కర్మలు పూర్తిగా నశించడం అనేది ఉపాధి. కర్మలుఅన్ని నశించిన వానికే ముక్తి కలుగుతుంది. కాని 'సమాధి కుదరడం' కారణంగా కాదు. మరి ఈ సమాధిసిద్ధుని యొక్క కర్మలు అన్ని నశించాయా లేదా? ఇది సందేహమే. ఇక్కడ కర్మాత్యన్త నాశము ముక్తిమత్త్వము అనుసాధ్యములో వ్యాప కమే. కాని దీనిసాధనమయిన నిష్పన్న సమాధిత్వములో అవ్యాపకము. దీనివలన నిరుపాధిక సంబంధ ముంటేనే వ్యాప్యమునకు వ్యాపకముతో అవినాభావ నిరు పాధిక సంబంధము ఉన్నట్టయితేనే వ్యాప్తికలుగుతుంది అనేది నిర్వివాదము.

**వ్యాప్యనిరూపణమ్:**

**మూ:** వ్యాప్యం సాధనమ్ లిఙ్గమిత్యనర్థాన్తరమ్. తస్య ద్వే రూపే అనుమిత్యఙ్గభూతే వ్యాప్తిః పక్షధర్మతా చేతి. పఞ్చరూపాణ్యపి సన్తి, తాని చ పక్ష (వ్యాప కత్వమ్) ధర్మవత్త్వమ్ (సత్త్వమ్) సపక్షే సత్త్వమ్, విపక్షాత్ వ్యావృత్తిః, అబాధిత విషయత్వమ్, అసత్ప్రతిపక్షత్వమ్ చేతి. సిషాధయిషిత ధర్మవిశిష్టో ధర్మీ పక్షః. యథా అగ్నిమత్త్వాదిసాధనే పర్వతాదిః. సిషాధయిషిత ధర్మసజాతీయ ధర్మవాన్ సపక్షః. యథా మహానసాదిః. సాధ్యతజ్జాతీయ శూన్యో విపక్షః, యథా మహా హ్రదాదిః ప్రబలప్రమాణేన పక్షే నిశ్చితసాధ్యాభావవత్త్వం బాధిత విషయత్వమ్. యథా మహాహ్రదో అగ్నిమానిత్యాదిః. తదభావవత్త్వమబాధిత విషయత్వమ్. సమబలతయా ప్రతీయమాన ప్రమాణోపరోధాభావోఽ సత్ప్రతిపక్షత్వమ్.

**అ:** వ్యాప్యము, సాధనము, లిఙ్గము అనునవి ఒకేఅర్థాన్ని బోధిస్తాయి. అది హేతువు. అనుమితికి అఙ్గభూతమయిన వ్యాప్యము రెండు రూపాల్లో ఉంటుంది. ఒకటి వ్యాప్తి. రెండవది పక్షధర్మత. ఈవ్యాప్యము ఐదురూపాలు కూడ ఉన్నాయి. అవి పక్షములో ధర్మముగా ఉండటం. సపక్షంలో ఉండటం, విపక్షంలో ఉండకపోవడం, అబాధిత విషయం కావడం, సత్ప్రతిపక్షములేనిది కావడం అనేవి. అనుమానం ద్వారా దేనిని సాధించదలచుకున్నామో అది

ధర్మముగా కలిగి ఉండేది పక్షము. పర్వతో వహ్నిమాన్ ధూమాత్ అను అనుమానంలో సాధించదలచుకున్న వహ్ని కలది, పర్వతము పక్షము. సిషాధయిషిత (సాధింపదలచుకున్న అని అర్థము) ధర్మము సజాతీయమయిన ధర్మము కల్గిన ధర్మి సపక్షము, వంట ఇల్లు మొదలయినవి. సాధ్యము. దానితో సజాతీయమయిన ధర్మము లేనట్టిది. పెద్దమడుగు. ప్రబలమయిన ప్రమాణము ద్వారా పక్షములో సాధ్యము లేదు అను నిశ్చయము కలుగుట–బాధిత విషయత్వము. అది లేకపోవడం అబాధితవిషయత్వము. (ఇది నిశ్చయముగా తెలిసిపోతే సాధించడంలో అర్థముండదు కదా) ఉదాహరణకు–పెద్దమడుగులో అగ్ని ఉండదు అని ప్రబలమయిన ప్రత్యక్షప్రమాణముతోనే నిశ్చయము అయింది కనుక పెద్దమడుగులో వ్యాప్యము బాధితవిషయము అవుతుంది. తద్వారా వ్యాప్తికలుగదు. అనుమానం అసలే కలుగదు. సమబలమయిన ఏదయినా ప్రమాణముతో వ్యాప్యములో ఏవిధమయిన అడ్డంకి కలగడం సత్‌ప్రతి పక్ష త్వము–అదిలేకపోవడం అసత్ ప్రతిపక్షత్వము.

**వి:** పక్షధర్మత్వమ్ – పర్వతో వహ్నిమాన్ ధూమాత్ – అను అనుమాన వాక్యములో సాధ్యము అగ్నిమత్త్వము. సాధ్యమునే సిషాధయిషితధర్మము అంటారు. సాధయితుం ఇషితం–సిషాధయిషితం అనువ్యుత్పత్తి. ఈధర్మముతో కూడిన ధర్మిని పక్షము అంటారు. సిషాధయి షితధర్మమయిన అగ్ని కలది–ధర్మి–పర్వతము కనుక అది పక్షము. ఆ ధర్మియందు పక్షమునందు ధర్మముగా అవడమే వ్యాప్యము యొక్క పక్షధర్మత్వము. పర్వతము అగ్ని కలదని సిద్ధింప జేయడానికి పర్వతము యొక్క ధూమవత్త్వజ్ఞాన మత్యావశ్యకము. అది లేకుండ అనుమానమే కలుగదు. ఇదే వ్యాప్యముయొక్క పక్షధర్మత్వము.

అసత్ ప్రతిపక్షత్వము. ప్రతిపక్షము లేకపోవుట. సాధ్యమునకు విపరీత మయిన దానిని సాధించే సమానబల మయిన ప్రమాణముండటం ప్రతిపక్షం. అది కలిగియుండటం సత్‌ప్రతిపక్షత్వము లేకపోవడం అసత్ ప్రతిపక్షత్వము.



క్షిత్యంకురాదికం, సకర్తృకత్వాన్ని–ఇదే అనుమానంతో –క్షిత్యంకురాదికం అకర్తృ కం–అకార్యత్వాత్ అనుదానితో సాధించవచ్చును. కనుక కార్యత్వము అను హేతువు సత్ప్రతిపక్షము–ప్రతిపక్షముకలది–అవుతుంది. కావున వ్యాప్తి కలుగదు. అనుమానం కూడ కలుగదు. పర్వతో వహ్నిమాన్ ధూమత్‌లో ధూమ రూప హేతువునకు ప్రతిపక్షము లేదు కనుక వ్యాప్తి తద్ద్వారా. అనుమానం కలుగుతుంది.

**వ్యాప్యభేదౌ:**

**మూ:** ఏవం భూతం వ్యాప్యం ద్వివిధమ్ – అన్వయవ్యతిరేకి కేవలా న్వయి భేదాత్. పూర్వోక్తపఞ్చరూపో పన్నం వ్యాప్యమన్వయవ్యతిరేకి. యథా–పర్వతోఽగ్నిమాన్ ధూమవత్త్వాత్ యో యో ధూమవాన్ స సోఽగ్నిమాన్ యథా మహానసః. యోఽనగ్నిస్స నిర్ధూమః యథా హ్రద ఇతి. తాదృశ మేవ విపక్ష రహితం వ్యాప్యం కేవలాన్వయి. యథా బ్రహ్మశబ్దవాచ్యం వస్తుత్వాత్ ఘటవత్. విపక్షాభావాత్ కేవలాన్వయి చతూరూపోపపన్నమ్ కేవలవ్యతిరేకిణి సాధ్యాప్రసిద్ధేః తద్వ్యతిరేకవ్యాప్తిః దుర్గ్రహా. అతః కేవలవ్యతిరేకనిరాసః. కేవలా న్వయిని. అన్వయవ్యతిరేకిణి చ అత్యన్తాతీన్ద్రియగోచరతా నిరస్తా.

**అ:** పయినపేర్కొన్న వ్యాప్యము రెండు రకాలుగా ఉంటుంది–1 అన్వయవ్యతిరేకి–2 కేవలాన్వయి అని. ఐదురూపములు గల వ్యాప్యము అన్వయ వ్యతిరేకి అవుతుంది. పర్వతము నిప్పుగలది, పొగగలది అవడంచేత. ఏది ఏదిపొగ గలది అవుతుందో అది అది నిప్పు గలది అవుతుంది వంట ఇల్లు లాగ. దేనిలో అగ్ని ఉండదో దానిలో పొగకూడ ఉండదు నీళ్ళమడగువలె. కేవలాన్వయిలో విపక్షము వుండదు. కనుక నాలుగు రూపాలే. ఉదా: బ్రహ్మశబ్ద వాప్యము, వస్తువు అయినందువలన, ఘటమువలె. దీనికి విపక్షము లేనందున కేవలాన్వయి వ్యాప్యము. కేవలవ్యతిరేకి హేతువు యొక్క సాధ్యము అప్రసిద్ధముగా ఉంటుంది కనుక దీని వ్యాప్తిగ్రహము కలుగడం కష్టము. అందుకే కేవలవ్యతిరేకి అనుమానాన్ని ఒప్పుకోలేదు సిద్ధాన్తములో. అతీన్ద్రియ పదార్థముల యొక్క

అనుమితిని కూడ కేవలాన్వయి ద్వారాగానీ అన్వయవ్యతిరేకి ద్వారా గానీ జరుగుతుందని ఒప్పుకోలేదు.

**వి:** అన్వయవ్యతిరేకి వ్యాప్యములో ఐదురూపాలు పక్షధర్మత్వం మొదలయినవి ఉండటం వలన అందరూ ఒప్పుకుంటారు. కేవలాన్వయిలో అన్వయ వ్యాప్తిమాత్రమే గ్రహించబడుతుంది. ఉదా: బ్రహ్మశబ్దవాచ్యము వస్తువు అయినందున ఘటంలాగా ఏదేదివస్తువో అది అది శబ్దవాచ్యము తప్పకుండ అవుతుంది. శబ్దవాచ్యము కాని వస్తువు ఏదీలేదు కనుక విపక్షము ఏదీ లేదు. విపక్షము లేనందున వ్యతిరేక వ్యాప్తి కలుగదు. అందుకే కేవలాన్వయి హేతువునకు విపక్షవ్యావృత్తత్వరూపము ఉండదు కనుక నాలుగే రూపాలు. కేవలవ్యతిరేకీ అనుమానము. నైయాయికులు దీనిని ఒప్పుకుంటారు. కేవలాన్వయిలో నాలుగురూపాలున్నట్టు కేవల వ్యతిరేకిలో కూడ నాలుగు రూపాలుంటాయి. విపక్షవ్యావృత్తత్వము కేవలాన్వయిలో ఉండనట్టే సపక్షసత్త్వము కేవల వ్యతిరేకిలో ఉండదు. దాంట్లో విపక్షముండదు. దీంట్లో సపక్షముండదు. దాని వలన అనుమానము కలిగినట్లే దీనివలన కూడ అనుమానము కలగాలి. కేవలవ్యతిరేకి అనుమానము ఇట్లా ఉంటుంది. జీవుడు ఆత్మ చైతన్యవంతుడు అయినందున, చైతన్యవంతము కానిది ఆత్మకాదు ఘటంలాగ. ప్రతిది పక్షంలో చేరినందున సపక్షము దొరుకదు. అందుకే కేవలవ్యతిరేకి సాధ్యము అప్రసిద్ధము లేదా అనిశ్చితము అనడము జరిగింది. పయిఅనుమానము యొక్క పక్షముగా అన్ని చైతన్యవంతములు అయిన పదార్థములు వస్తాయి. విపక్షములన్నీ జడ పదార్థములు. సాధ్యము నిశ్చయమయిన పక్షము ఏదీలేదు. అనుమాన దోషము. ఇదే ఈ కేవలవ్యతిరేకి హేతువును అవీత హేతువు అనికూడ అంటారు. వీతః విశేషేణ ఇతః భూయః సాధ్యవద్ దేశస్థితః అన్వయవ్యాప్తిభావహేతుః. తద్భిన్నో హేతుః అవీతహేతుః. కేవలవ్యతిరేక వ్యాప్తిమాన్‌హేతుః. నైయాయికులు కేవలాన్వయి కేవలవ్యతిరేకి హేతువుల ద్వారా ఈశ్వరుణ్ణి సిద్ధింప జేస్తారు. విశిష్టాద్వైతులు ఈశ్వరుణ్ణి అత్యన్తాతీంద్రియ పదార్థమని, కేవలాన్వయిగాని



కేవలవ్యతిరేకి గాని సిద్ధింపజేయ లేవంటారు. అత్యంతాతీంద్రయపదార్థము యొక్క వ్యాప్తి కలుగనే కలుగదు అని సిద్ధాన్తీకరిస్తారు. శాస్త్రైకసమధిగమ్యుడు ఈశ్వరుడు. దీనినే బాదరాయణులవారుకూడ శాస్త్రయోనిత్వాత్ అనుసూత్రము ద్వారా ప్రతిపాదించారు. శ్రుతియే ఈశ్వరుని బోధించే ప్రమాణము.

## అనుమానస్య ద్వైవిధ్యమ్:

**మూ:** తదేతదనుమానం స్వార్థం పరార్థంచేతి ద్విధా విభజ్య కేచిదాహుః. సర్వేషామేవానుమానానాం స్వప్రతిసన్ధానాదిబలేన ప్రవృత్తతయా స్వవ్యవహార మాత్రహేతుత్వమితి స్వార్థానుమానమేవ ఇత్యపరే.

**ఆ:** కొందరు ఈ అనుమానము స్వార్థము (కొరకు) పరార్థము (ఇతరుల నుద్దేశించి) అని రెండు విధాలుగా విభజించి చెప్తుతారు. తనకు ఉద్దేశించిన అనుమానంలో ప్రతిజ్ఞ, హేతువు, దృష్టాంతము మూడు ప్రయోగింపబడుతవి. ఇతరులలో అనుమితిప్రమ కలిగించేందుకు ప్రయోగించే అనుమానమును పరార్థము అంటారు. ఉపనయము, నిగమనము అను రెండు అవయవములు ఎక్కువగా అవసరము. వ్యాప్తి మరియు పక్షధర్మతతో కూడిన హేతువు వలన తెలుసుకొను వారికి అనుమితిజ్ఞానము కలుగుతుంది. కనుక అది తనకొరకే కలుగుతుంది. కాబట్టి అనుమానాలన్ని స్వార్థము కొరకే అని ఒప్పుకోవాలి. పరార్థానుమానము అనే భేదము ఒప్పుకోవడం సముచితం కాదు.

## అనుమానస్య అవయవపఞ్చకమ్:

**మూ:** తదనుమానబోధకవాక్యం ప్రతిజ్ఞా హేతూదాహరణోపనయ నిగమనరూప పఞ్చావయవసంయుక్తమ్. తత్ర సాధ్యవత్తయా పక్షవచనం ప్రతిజ్ఞా; యథా పర్వతోఽగ్నిమానితి. లిఙ్గస్య వచనం హేతుః. యథా ధూమ వత్త్వాదితి. వ్యాప్తినిర్దేశపూర్వకం దృష్టాన్తవచన ముదాహరణమ్. తద్ ద్వివిధమ్–అన్వయ వ్యతిరేక భేదాత్. యథా–యో యో ధూమవాన్ స సోఽగ్నిమాన్ యథా మహా

నస ఇత్యన్వయోదాహరణమ్. యోऽనగ్నిస్స నిర్ధూమః యథా హ్రద ఇతి వ్యతిరేకోదాహరణమ్. దృష్టాన్తావమర్శేన వ్యాప్తతయా పక్షే హేతూపసంహార వాక్యముపనయః. సోऽపి ద్వివిధః అన్వయవ్యతిరేక భేదాత్. తథా ధూమవా నిత్య న్వయోపనయః అయం చ న తథా నిర్ధూమ ఇతి వ్యతిరేకోప నయః హేతు పూర్వకం పక్షే సాధ్యోప సంహారవాక్యం నిగమనమ్. ఏతదపి ద్వివిధం తథైవ. యథా – తస్మాదసా వగ్నిమానిత్యన్వయేన నిగమనమ్. తస్మా దయం నిరగ్నిర్న భవతీతి వ్యతిరేకేణ.

**అ:** అనుమానమును బోధించేవాక్యములో అయిదు అవయవము లుంటాయి. అవి వరుసగా ప్రతిజ్ఞ, హేతువు, ఉదాహరణము, ఉపనయము, నిగమనము అని. పక్షములో సాధ్యము ఉన్నది అని చెప్పడము ప్రతిజ్ఞ – పర్వతము నిప్పు గలది అని. సాధ్యమును సాధించు నట్టి లింగమును చెప్పుట హేతువాక్యము. పర్వతముపయి పొగ ఉన్నందున అని పొగ కలిగి ఉండుట హేతువు. సాధనము మరియు సాధ్యము మధ్యన గల అవ్యభిచరిత సంబంధరూప మయినట్టి వ్యాప్తిని చూపి దృష్టాన్తాన్నికూడ చెప్పడము. ఈ ఉదాహరణము అన్వయోదాహరణము వ్యతిరేకోదాహరణమని రెండు విధాలు. ధూమము ఉన్నచోటల్లా అగ్ని ఉంది. వంటింటిలోవలె అనునది అన్వయోదాహరణము. అగ్ని లేనిది, పొగ లేనిది అని వ్యతిరేకోదాహరణము సరోవరము వలె. దృష్టాం తముగూర్చి విచారించిన పిదప పక్షమునందు హేతువు వ్యాపించి ఉంది అని చెప్పడం ఉపనయము. ఇదీ రెండు రకాలు– అన్వయోపనయము వ్యతిరేకోప నయము అని. పర్వతముకూడ ధూమవత్తు పొగగలది అని అన్వయోపనయము. పర్వతము పొగలేనిది కాదు అని వ్యతిరేకోపనయము. నిగమనవాక్యములో మొదటపక్షములో హేతువు ఉందని చూపెట్టిన తరువాత సాధ్యము ఉందని =òyOK@=ò [ ~¡Q® ÇÛk. J#H Ç=¼öHÐWk ä€_Ë÷O_Ê¨q^¥ం. అందువలన ఈ పర్వతము అగ్నికలది అనునది అన్వయ రెండువిధాలు.



అందువలన ఈ పర్వతము అగ్నికలది అనునది అన్వయ నిగమనము. అందువలన ఈ పర్వతము అగ్నిలేనిదికాదు అని వ్యతిరేక నిగమనము.

## అనుమానస్యావయవానాం విషయే దార్శనికానాం మతభేదప్రదర్శనమ్:

**మూ:** ఏవం పఞ్చావయవవాదినో నైయాయికాః. ప్రతిజ్ఞా హేతూదా హరణ రూపత్ర్యవయవవాదినో మీమాంసకాః ఉదాహరణోపనయరూప అవయవ ద్వయవాదిన స్సౌగతాః. అస్మాకం త్వనియమః. క్వచిత్పఞ్చావయవాః. క్వచిత్ త్రయోऽవయవాః. క్వచిద్ ద్వావవయవౌ. ఉదాహరణోపనయాభ్యామేవ వ్యాప్తి పక్షధర్మతయోః సిద్ధత్వాత్ తావతైవానుమిత్యుపపత్తేః. మృదుమధ్యమ కఠోరధియాం విస్తర సంగ్రహాభ్యాం వ్యవహార ఉపపద్యత ఇత్యనియమ ఏవ. ఏవం పంచా వయవయుక్తః సద్ధేతురేవ వహ్న్యనుమాపకః. సద్ధేతురిత్యుక్తత్వాత్ ధూమసదృశ ధూలీపటలాన్న వహ్న్యనుమితిః.

**అ:** అనుమానానికి ఈ అయిదు అవయవాలు – వాక్యాలు అవసరము అని నైయాయికుల వాదన. ప్రతిజ్ఞ హేతువు ఉదాహరణం అను మూడు చాలు అని మీమాంసకుల అభిప్రాయము. ఉపనయము, నిగమనము అను రెండే చాలని సౌగతుల మతము. (సంస్కృతంలో మతం అంటే అభిప్రాయము అని అర్థము.) విశిష్టాద్వైతులకు ఇలాటి నియమము లేదు ఐదు ఉండవచ్చు, మూడు కావచ్చు, రెండే అనుమానాన్ని కలుగజేస్తాయి. వ్యాప్తిని పక్షధర్మతను సిద్ధింపజేసేవి ఉదాహరణము ఉపనయములు కనుక వాటితోనే అనుమితి కలుగుతుంది. మృదుబుద్ధి కలవారలకు (అనగా నైపుణ్యం లేని వారలకు) విస్తరముగా మందబుద్ధి కలవారలకు మధ్యమముగా, కఠోరబుద్ధి కలవారలకు (కఠోర– సంపూర్ణముగా) సఙ్గ్రహముగా వ్యవహారము జరుగుతుంది కనుక నియమము లేదనుట. ఇట్లా ఐదు అవయవాలు గల్గిన సత్ – హేతువే వహ్ని ఉన్నది అను అనుమానాన్ని కలిగిస్తుంది. సత్ అనడం చేత ధూలి సమూహము చూడడంచేత వహ్ని అనుమానం కలుగదు.

**హేత్వాభాసాః:**

అన్యే హేతువదాభాసమానాః హేత్వాభాసాః, తే చాసిద్ధ విరుద్ధ-అనైకాన్తిక ప్రకరణసమ కాలాత్యయాపదిష్ట భేదాత్ పఞ్చప్రకారాః. తత్రాసిద్ధస్త్రివిధః స్వరూపాసిద్ధః ఆశ్రయాసిద్ధో వ్యాప్యత్వాసిద్ధశ్చేతి. స్వరూపాసిద్ధో యథా- అనిత్యో జీవః చాక్షుషత్వాత్ ఘటవదితి. ఆశ్రయాసిద్ధస్తు-వ్యోమారవిన్దం సురభి అరవిన్దత్వాత్ సరోజారవిన్దవత్ ఇతి. వ్యోమారవిన్దమాశ్రయః స చాసిద్ధః. వ్యాప్యత్వాసిద్ధో ద్వివిధః - ఏకో వ్యాప్తిగ్రాహక ప్రమాణాభావాత్, అపరస్తు ఉపాధి సద్భావాత్. ఆద్యో యథా-యత్సత్ తత్ క్షణికమితి. క్షణికత్వసత్త్వయోః వ్యాప్తి గ్రాహక ప్రమాణాసిద్ధేః. ద్వితీయో యథా - అగ్నీషోమీయ హింసా అధర్మ సాధికా హింసాత్వాత్ క్రతుబాహ్యహింసావదితి. అత్ర నిషిద్ధత్వముపాధిః. అతో హింసాత్వహేతుః సోపాధికః. సాధ్యవిపరీతవ్యాప్తో హేతుః సాధ్యాభావ వ్యాప్తః, సవ్యభిచారోఽనైకాన్తికః. స చ ద్వివిధః సాధారణః అసాధారణశ్చేతి. పక్షసపక్షవిపక్షవృత్తిః సాధారణానైకాన్తికః. యథా శబ్దః నిత్యః ప్రమేయత్వాత్, కాలవత్. అసాధారణస్తు సపక్షవిపక్షవ్యావృత్తః. యథా-భూః నిత్యాగంధవత్త్వాత్ వ్యోమవదితి. ప్రకరణ సమస్తు-సాధ్యవిపరీత సాధకహేత్వన్తరవాన్. యథా-ఈశ్వరో నిత్యః. అనిత్యధర్మ రహితత్వాత్, ఈశ్వరో, న నిత్యః నిత్యధర్మ రహితత్వాదితి. అయమేవ సత్ప్రతిపక్షః యస్య హేతోః సాధ్యాభావవాన్ పక్షః స కాలాత్యయాపదిష్టః. స యథా-అగ్నిరనుష్ణః పదార్థత్వాత్ జలవత్. అయం చ ప్రత్యక్షేణైవ ఉష్ణత్వావధారణాద్ బాధితః.

**అ:** పయినచెప్పిన కేవలాన్వయి కేవలవ్యతిరేకి మొదలగు సద్‌హేతువుల కన్న ఇతరములయినవి-హేతువు వలె భాసించునవి హేత్వాభాసములు. హేతువువలె కొద్దిగా భాసంచునవి కన్పడునవి, వాస్తవముగా హేతువులు కానివి హేత్వాభాసములు. ఈ హేత్వాభాసములు ఐదు రకాలు-1 అసిద్ధము 2 విరుద్ధము 3అనైకాన్తికము 4 ప్రకరణసమము 5 కాలాత్యయాపదిష్టము అని. వీటిలో మొదటిది అయిన అసిద్ధము మూడు విధములు -1. స్వరూపాసిద్ధము 2 ఆశ్రయాసిద్ధము 3 మరియు వ్యాప్యత్వాసిద్ధము అని. వరుసగా ఉదాహరణములు-స్వరూపా సిద్ధము జీవుడు అనిత్యము కుండ మొదలయిన వానివలె, చాక్షుషము చక్షువులకు విషయ మయినవాడు జీవుడు అని చాక్షుషమునకు అర్థము. చాక్షుషత్వము అనే హేతువు పక్షమయిన జీవునిలో లేదు-స్వరూపమే సిద్ధము కాలేదు కనుక స్వరూపాసిద్ధము. ఆశ్రయాసిద్ధానికి ఉదాహరణము -ఆకాశ కమలము సుగంధము కలది. కమలము గనుక కొలనులోని కమలము వలె అరవిందత్వము అను హేతువునకు ఆశ్రయము వ్యోమారవిన్దము, అదే అసిద్దము కనుక ఆశ్రయాసిద్ధము. వ్యాప్యత్వాసిద్ధము రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి వ్యాప్తిని గ్రహింప చేయగలిగే ప్రమాణము లేకపోవడంవలన ఏర్పడుతుంది. రెండవది-(వ్యాప్తిదోషమయిన) ఉపాధి ఉండడం వలన ఏర్పడుతుంది. మొదటి దాని ఉదాహరణము. ఏది సత్ (ఉన్నదో) అది క్షణికము. జ్ఞేయము (తెలుసుకోదగినది) జ్ఞాతా (తెలుసుకొనువాడు) క్షణికము అయినందున మళ్ళీమళ్ళీ చూడటం వలన వ్యాప్తి యొక్క గ్రహణము జరుగదు. వ్యాప్తిని గ్రహింపజేసే ప్రమాణము లేనందున వ్యాప్తి కలుగనందున హేతువు వ్యాప్యత్వాసిద్ధము.

ఇక రెండవది అగ్నీషోమీయములో (అనే పేరుగల యజ్ఞములో) చేయు హింస అధర్మాన్ని సాధిస్తుంది. హింస అయినందు వలన, యజ్ఞం వెలుపల జరిగే హింస వంటిది కనుక ఇక్కడ నిషిద్ధత్వము అనునది ఉపాధి. శాస్త్రము నిషేధించిన హింసయే అధర్మాన్ని కలిగిస్తుంది. అగ్నీషోమీయహింస శాస్త్రముచే విహితము అయినది. దీనివలన పాపము తగులదు. ఇక్కడ హింసాత్వము అనుహేతువు ఉపాధితో కూడినది. ఉపాధిద్వారా హేతువునందు వ్యభిచారము చూపబడినందున హేతువు వ్యాప్యత్వాసిద్ధము అని భావము. సాధ్య విపరీతము నందు వ్యాప్తి గలిగినహేతువు విరుద్ధము. ఉదాహరణము-ప్రకృతి నిత్యము, కృతకత్వము (అనుహేతువు) వలన కాలమువలె. ఇక్కడ కృతకత్వము హేతువు. అది సాధ్యమయిన నిత్యము అనుదానికి విపరీతమయిన అనిత్యము అనుదానితో వ్యాప్తికలిగి ఉన్నది. ఏది కృతకమో అది అనిత్యము అని. సాధ్యాభావముతో వ్యాప్తి కలిగియున్నది.

అనైకాన్తికము రెండు విధాలు-సాధారణము అసాధారణము అని. పక్షములో, సపక్షములో, విపక్షములో అన్నింటిలో సమానంగా ఉండే హేతువు సాధారణానైకాన్తికము. శబ్దము నిత్యము. ప్రమేయము కాలమువలె, ప్రమేయము అయినందున ప్రమాణములతో తెలుసుకొన వలసినది ప్రమేయము. ఇక్కడ ప్రమేయత్వము పక్షములో సపక్షములో విపక్షములో అన్నింట్లో ఉంటుంది కనుక సాధారణ-అనైకాన్తిక హేతువు.

అసాధారణ అనైకాన్తిక హేతువు కేవలము పక్షములో మాత్రముంటుంది. సపక్షములో విపక్షములో ఉండదు. పృథివి, నిత్యమయినది. గంధము న్నందున ఆకాశము వలె. దీనిలో హేతువు అయిన గంధ (వత్త్వము)ము కలిగి యుండుట అనునది కేవలము పృథివిలో పక్షంలో ఉంటుంది. సపక్ష మయిన ఆకాశములో లేదు. విపక్షములయిన అనిత్య పదార్థాలలో కూడ లేదు.కనుక అసాధారణానైకాన్తిక హేత్వాభాసము. ప్రకరణసమము- సాధ్యము నకంటే విపరీతమయిన దానిని సాధించే మరియొక హేతువును కలిగిన హేతువును ప్రకరణసమము అంటారు. ఉదాహరణము- ఈశ్వరుడు నిత్యుడు, అనిత్య ధర్మములు లేనివాడు కాబట్టి. దీనిలో నిత్యత్వము సాధ్యము. అనిత్యధర్మరహితత్వము హేతువు. దీనికి విరుద్ధము అయిన నిత్యధర్మ రహితత్వము అను విపరీతహేతువు ద్వార అనిత్యత్వము కూడ సాధించ వచ్చును. ఈశ్వరుడు అనిత్యుడు, నిత్యధర్మరహితు డయినందున అని, ఈహేత్వాభాసానికే 'సత్ప్రతి పక్షము' అనికూడ పేరు ఉన్నది. సత్ విద్యమానః ప్రతిపక్షః సాధ్యవిపరీతార్థ సాధకో హేతుః యస్య సః. సాధ్యమునకు విపరీత మయిన అర్థమును సాధించే హేతువును కలిగి ఉండటం సత్ప్రతి పక్షత్వము అన్నమాట. కాలాత్యయాపదిష్టము-మనం చెప్పే అనుమానంలో హేతువున్న పక్షములో సాధ్యము లేకుండట ఈ హేత్వా భాసము అవుతుంది. అగ్ని చల్లనిది. జలము వలె. పదార్థము కనుక. దీనితో సాధించదలచినది చల్ల దనము. అనుష్ణత్వము పక్షమేమో అగ్ని. అగ్నియందు చల్లదనములేదు కద.



ప్రత్యక్షప్రమాణంతోనే అగ్ని ఉష్ణము అని సిద్ధిస్తుంది. దీనికే బాధితము అని కూడ పేరు.

అనైకాన్తిక హేత్వాభాసానికే సవ్యభిచారము అనిపేరు. తర్క సంగ్రహము మొదలయిన గ్రంథాల్లో సవ్యభిచార, విరుద్ధ, సత్ప్రతిపక్ష, అసిద్ధ, బాధితాః- అనిహేత్వాభాసాలను చెప్పడం జరిగింది. సవ్యభిచారము- ఈ గ్రంథంలో అనైకాన్తికము. విరుద్ధము సమానమే. సత్ప్రతిపక్షము-ప్రకరణ సమము. అసిద్ధము సమానమే. బాధితము- కాలాత్యయాపరిష్టము.

**ఉపమానస్యానుమానాదావన్తర్భావనిరూపణమ్:**

**మూ:** ఏవమనుమానే నిరూపితే ఉపమానాదే రనుమానా దావన్తర్భావః. యథా - అతిదేశ వాక్యార్థ స్మరణసహకృత సాదృశ్య విశిష్ట పిణ్డజ్ఞానమ్ ఉపమానమ్. గవయమజానానోఽపి యథా గౌస్తథా గవయ ఇతి కుతశ్చిదారణ్యా కాచ్ఛ్రుత్వా వనంగతో అతిదేశవాక్యార్థం స్మరన్ యదా గోసాదృశ్యవిశిష్టషిణ్ణం పశ్యతి తదా తద్వాక్యార్థ స్మరణసహకృత గోసాదృశ్య విశిష్టపిణ్డజ్ఞానం జాయతే, తదుపమానమిత్యుచ్యతే.. తస్య స్మరణరూపత్వాత్ ప్రత్యక్షేఽన్తర్భావః. వ్యాప్తిగ్రహాపేక్షత్వా దనుమానేఽన్తర్భావః, వాక్యజన్యత్వాచ్ఛబ్దేఽన్తర్భావ ఊహ్యః.

అ: అనుమానము నిరూపించి ఉపమానాదులను అనుమానాదులలో చేరినవిగా నిరూపణము జరుగుతున్నది. (ఉపమీయతే అనేన ఇతి ఉపమానమ్) ప్రసిద్ధమయిన దానియొక్క సాధర్మ్యముచేత అప్రసిద్ధమును సాధించుట ఉప మానము. ఆవు ఎలాటిదో గవయము కూడ అలాటిదే అని. ఆవు ప్రసిద్ధము, గవయము అప్రసిద్ధము. రెంటిలో ఉన్న సాధర్మ్యాన్ని బట్టి గోవు వంటిది గవయము అనుకోవడము ఉపమానము. దీనికి అతిదేశవాక్యార్థ స్మరణము తోడ్పడుతుంది. ఏకత్ర శ్రుతస్య అన్యసమ్బన్ధః అతిదేశః. ఒక ఆటవికుడి ద్వారా గోవు వంటిది గవయము అని విని అడవికి వెళ్ళినప్పుడు, గోవులాంటి

జంతువును చూసి విన్నవాక్యము అర్థము జ్ఞప్తికి తెచ్చుకొని ఈ జంతువు గవయము అనుజ్ఞానాన్ని పొందుతాడు. యథా గౌస్తథాగవయః అనునది అతిదేశవాక్యము. ఈ ఉప మానములో సాధకతమము సాదృశ్యముతో కూడిన దానిని చూడటము. దీనిని చూచి నంతనే చూపరికి అతిదేశవాక్యము- అర్థము గుర్తుకు వస్తాయి. స్మరణ జన్యజ్ఞానమునకు మూలము స్మరణమే. దానికి మూలభూత మయిన ప్రత్య క్షములో అన్తర్భావము. స్మరణప్రత్యక్షంలోనే చేరుతుంది. వేరుకాదు.

సాదృశ్యజ్ఞానము శబ్దము వలన కలుగుతున్నది. కనుక శబ్ద ప్రమా ణములో వాక్యము అంతర్భవిస్తుంది. ఇక ఈ జంతువు గోవులాగ ఉన్నది కనుక గవయము అనే జ్ఞానము వ్యాప్తివలన కలుగుతున్నది. కనుక అది అనుమానములో చేరుతుంది. ఈ మూడు విధములుగా కలిసిన జ్ఞానమునకే ఇతరదార్శనికులు ఉపమానము అనే పేరుపెట్టినారు. ఉపమానజ్ఞానము ప్రత్య క్షములో, అనుమానములో, శబ్దములో అంతర్భవిస్తుంది. కనుక వేరే ప్రమాణము కానేరదు.

## అర్థాపత్త్యాదికస్య అనుమానే అన్తర్భావః

మూ: అర్థాపత్తిర్నామ దివా అభుఞ్జానస్య పురుషస్య పీనత్వ దర్శనాద్ రాత్రిభోజనం కల్ప్యతే. ఏతస్యానుమానే అన్తర్భావః. తర్కో నామ వ్యాప్యాఙ్గీకారేణ వ్యాపకానిష్ట ప్రసఞ్జనమ్ తద్యథా- పర్వతో వహ్నిమాన్ ధూమవత్త్వాదిత్యనుమానే ధూమోఽస్తు వహ్నిర్మాస్తు ఇత్యుక్తే యది వహ్నిర్న స్యాత్ తర్హి ధూమోఽపి న స్యాత్ ఇతి. ఏతస్య ప్రమాణానుగ్రాహకత్వమ్. తర్కానుగృహీతప్రమాణ పూర్వ కతత్త్వావ ధారణం నిశ్చయః. వీతరాగకథా వాదః పక్షద్వయసాధనవతీ విజగీషు కథాజల్పః. స్వపక్షస్థాపనహీనా వితణ్డా అవివక్షిత శబ్దార్థారోపేణ దూషణం ఛలమ్. స్వవ్యాప్త దూషణం జాతిః. అసదుత్తరం జాతిరితి వా పరాజయ హేతుర్ని గ్రహస్థానమ్. ఇత్యేతేషాం అనుమానాఙ్గత్వాత్ అనుమానే అన్తర్భావః. క్వచిత్క్వ చిత్ నైయాయిక మతానుసారి వ్యవహారస్తు తన్మతాను సారేణోక్తః. అతో న విరోధః. ఇత్యనుమానం నిరూపితమ్.



ఇతి శ్రీవాధూలకులతిలక శ్రీమన్మహాచార్యప్రథమదాసేన శ్రీనివాసదా సేన విరచితాయాం యతీన్ద్రమతదీపికాయాం శారీరక పరిభాషాయాం అనుమాన నిరూపణం నామ ద్వితీయోఽవతారః.

అ: పగలు భోంచేయడు అయినా దిట్టంగా బలంగా ఉన్నాడు అంటే రాత్రి భోంచేస్తుండ వచ్చును అని కల్పించడమే అర్థాపత్తిప్రమాణము. మీమాం సకులు దీన్ని ఒప్పుకుంటారు. దేవదత్తుడు బలిష్ఠంగా ఉన్నాడు కాని పగలు భోంచేయడు అనేది వినగానే శ్రోత, బలంగా ఉన్నవాడు భోజనం ఎప్పుడో ఒకప్పుడు చేస్తేనే బలంగా ఉంటాడు లేకుంటే లేదు, దేవదత్తుడు పగలు తినడం లేదంటే రాత్రి తింటుండవచ్చును అని అనుమానిస్తాడు. పయి కల్పనకు ఆధా రము అనుమానమే కనుక అర్థాపత్తి అనుమానంలోనే చేరుతుంది. వేరు ప్రమాణము కానేరదు. వ్యాప్యమును ఒప్పుకొని వ్యాపకము వద్దు (వ్యాపకము నందు అనిష్టము ఇదే) అనడం తర్కము. పర్వతము అగ్ని కలది, ధూమము కలది అయినందున అని అనుమానము. దీనిలో వ్యాప్యము ధూమము వ్యాపకము అగ్ని. పక్షములో పర్వతములో వ్యాప్యమయిన ధూమాన్ని ఒప్పుకొని వ్యాపకమయిన అగ్నిని వద్దనడం తర్కము. పర్వతే ధూమోఽస్తు వ హ్నిర్మాస్తు అని అంటే ఏం ఇబ్బంది? దీనికి జవాబు పర్వతంలో అగ్ని వద్దంటున్నారు కద మీరు, అప్పుడు మీరు ఒప్పుకున్న ధూమము మాత్రం ఎట్లా ఉంటుంది అని. వ్యాపకమే లేకపోతే వ్యాప్యము ఎక్కడి నుండి ఉంటుంది అని. వ్యాపకమునకు వ్యాప్యమునకు అవినాభావసంబంధము ఉన్నది. ఇట్లా పయిన పేర్కొన్న పర్వతోవహ్నిమాన్, ధూమవత్త్వాత్ అనే అనుమానానికి వ్యాపకము లేకుంటే వ్యాప్యము ఎక్కడ ఉంటుంది అనే తర్కము సహాయకారిగా అవుతుంది. తర్కాను గృహీతమయినదే సత్ప్రమాణము. తర్కము అనుమానములో అంతర్భవిస్తుంది.

నిశ్చయము అనగా వాదిప్రతివాదులు ఒకరినొకరు జయించాలి అనే కోరిక లేకుండా తర్కానుగృహీతములయిన ప్రమాణముల ద్వారా తత్త్వమును

నిర్ధారిస్తారో అది. ఇది అనుమానానికి ఒక అంగము కనుక (లింగము అని పాఠాంతరము) అనుమానములోనే చేరుతుంది. పేరుకాదు. వాదము, అనగా వాదిప్రతివాదులు తాము గెలవాలి అనేకోరిక లేకుండా కేవలము తత్త్వము ఏమిటో తెలుసుకోవాలి అని తమతమ సిద్ధాంతములను అభిప్రాయాలను చెప్పు తారో అది. గ్రంథకర్తప్రకారము ఇదీ అనుమానము లోనే చేరుతుంది. (వాదే వాదే జాయతే తత్త్వబోధః. అను దానిని బట్టి వాదము నిశ్చయము ఒకటిగానే అగుపిస్తున్నవి. అ.) దీనికే కథా అని కూడ పేరు ఉన్నది.

జల్పము: అంటే విజయమును కాంక్షిస్తూ వాదిప్రతివాదులు చేసే వాదము. కథ జల్పములో రెండు పక్షాలకు సిద్ధిఉంటుంది. ఇది కూడ అను మానములోనే చేరుతుంది.

వితణ్డా: దీనిలో వాదిప్రతివాదులు తీవ్రమయిన విజయాకాంక్షతో ప్రతిపక్షాన్ని మాత్రం చీల్చి చెండాడుతారు, తమకంటూ ఓ పక్షాన్ని సమర్థించు కోరు. తమ తెలివితేటలతో ఎదుటివారిని భ్రమలోపడేసి వారి పక్షాన్ని ఖండిం చడమే ధ్యేయము. ఇది కూడ అనుమానంలోనే చేరుతుంది. ఛలము అనగా వక్తయొక అభిప్రాయాన్ని లెక్కజేయక అతనికి అవివక్షితమయిన అర్థమును గ్రహించి (ఆ పదానికి రెండు అర్థాలు ఉంటాయి– ఒక దాన్ని స్వీకరించి ఖం డించడం శబ్దచ్ఛలము. అర్థాన్ని వేరుగా స్వీకరించి ఖండించడం అర్థచ్ఛలము. నవకమ్బలః అంటే ఒకటియె గొంగడి ఉంది కదా అనడం కొత్త అనే అర్థం తీసుకోకపోవడం– మొదటి దాని కుదాహరణ. ఈ రోడ్డు ఎక్కడికి వెళుతుంది– ఎక్కడికి వెళ్లదనడం అర్థచ్ఛలము) ఖండించడము ఛలము. ఇది అనుమానం లోనే చేరుతుంది.

జాతి అనగా సాధర్మ్యాన్నిబట్టిగాని వైధర్మ్యాన్ని బట్టిగాని దోషమును నిరూపించడము. నీవాదములో ఈ దోషముంది. అనిప్రతిపాదించేవాడిలో కూడ



ఉండే దోషము లేదా సరిగాలేని సమాధానము జాతి అని అర్థము. ఇది అనుమానములోనే అంతర్భవిస్తుంది.

నిగ్రహస్థానము అనగా పరాజయానికి కారణమయిన విప్రత్తి– తన వాదనను తప్పుగా ప్రతిపాదించడం, ప్రతిపాదించలేకపోవడము గాని అవు తుంది. నిగ్రహము పరాజయము దానికి స్థానములు తప్పుగా ప్రతిపాదించడం. అసలే ప్రతిపాదించ లేక పోవడమూను. ఇది కూడ అనుమానంలోనే చేరుతుంది. కొన్ని కొన్నిచోట్ల నైయాయికులవలె విషయాలను ప్రతిపాదించడం జరిగింది. ఆవిషయాలను వారిమతానుసారముగానే ప్రతిపాదించి నందువలన వారితో విరోధము ఏదీలేదు.

శ్రీవాధూలకులతిలకుడయినట్టి శ్రీమన్మహాచార్యుల ప్రథమదాసుడు అయిన శ్రీనివాసదాసునిచే విరచితమయిన శారీరక పరిభాషా రూపమయిన యతీంద్ర మతదీపికయందు అనుమాననిరూపణము అను రెండవయవతారము సమాప్తము.

*****

# అథ తృతీయావతారః

## శబ్దనిరూపణమ్:

**మూ:** అనుమాననిరూపణానన్తరం శబ్దో నిరూప్యతే. అనాప్తానుక్త వాక్యజనిత తదర్థ విజ్ఞానం శబ్దజ్ఞానమ్. తత్కరణం శబ్దప్రమాణమ్. అనాప్తానుక్తేత్యుక్తత్వాద్వేదస్య పౌరుషేయత్వమతనిరాసః. కారణదోష ప్రత్యయా భావవద్ వాక్యం వా. సర్గాదౌ భగవాన్ చతుర్ముఖాయ పూర్వపూర్వ క్రమవిశిష్టాన్ వేదాన్ స్మృత్వా స్మృత్వా ఉపదిశతీత్యుక్త్యా నిత్యత్వమ పౌరుషేయత్వం చ సిద్ధమితి కారణదోషాభావో బాధకప్రత్యయాభావశ్చ.

అ: అనుమానప్రమాణం నిరూపించాక శబ్దప్రమాణనిరూపణం ఇప్పుడు చేయవలసి యున్నది. అనాప్తునిచే అనుక్తమయిన (ఒకవిధముగా ఆప్తునిచే చెప్పబడిన అన్నట్లే, కాని నైయాయిక మతఖండనకయి ఇట్లా చెప్పడం జరిగింది.) అనగా అనాప్తునిచే చెప్పబడని వాక్యమువలన కలిగిన వాక్యార్థవిజ్ఞానమును శబ్దప్రమాణమని అంటారు. ఆ శబ్ద జ్ఞానానికి సాధకతమయినది శాబ్ద ప్రమాణము. లక్షణములో అనాప్తానుక్త పదమును చెప్పుటచే వేదములను పౌరుషేయములని ఒప్పుకొనిన నైయాయికుల మతము ఖండితమవుతున్నది. లేదా కారణదోషము మరియు బాధకజ్ఞానము లేని వాక్యము శబ్దప్రమాణము అని కూడ లక్షణము చెప్పవచ్చును. సృష్టి ఆరంభసమయమున భగవంతుడు పూర్వపూర్వక్రమము కలిగిన వేదములను మాటిమాటికి స్మరించుకొని చతుర్ముఖ బ్రహ్మకు ఉపదేశిస్తాడు అని చెప్పటంవలన వేదములకు నిత్యత్వము, అపౌరుషేయత్వము సిద్ధిస్తుంది. అందుకేకారణములో ఉండే దోషాలుగానీ బాధజ్ఞానము గానీ వేదాల్లో లేవు.

వి: శబ్దప్రమకు సాధకతమ మయినది శబ్దప్రమాణము. ఏ వాక్యము అనాప్తునిచే పలుకబడలేదో ఆ వాక్యము యొక్క అర్థము వలన ఏర్పడు జ్ఞానము శాబ్దజ్ఞానము. 'అనాప్తానుక్త' అను లక్షణములోని పదమువలన శాబ్దజ్ఞానజనక మయిన వాక్యము ఏ పురుషు డయినా ఉచ్చరించినదే కావాలను నియమము



లేదని తెలుపుతున్నది. అట్లే వేదము అపౌరుషేయము అని కూడ. దానివక్త ఏ పురుషుడు భగవంతుడూ కాని కాదన్నమాట. ఈశ్వరుడు కూడ పూర్వ కల్పములోని వేదములను ఆనుపూర్వితో కూడ గుర్తుకు తెచ్చుకొని బ్రహ్మకు ఉపదేశిస్తాడు. ఏ అక్షరము తర్వాత ఏ అక్షరముందో అట్లాఉండటము ఆనుపూర్వి. కావున వేదాలు పురుషవిశేషముతో చెప్పబడినవి కావు, అనిత్యములు కావు. నైయాయికులు శబ్దమును అనిత్యమని నిరూపిస్తారు. వేదములు పౌరుషేయములనీను. దీనిని ఖండించడానికొరకే లక్షణములో అనాప్తానుక్త పదము నుపయోగించారు. సిద్ధాన్తములో వాక్యము ఉచ్చరించబడాలని నియమము లేదు. ఒకవేళ వాక్యము ఉచ్చరించబడి ఉంటే వక్త అనాప్తుడు కావద్దు ఆప్తుడే కావాలి అని నియమము ప్రమాణముగా ఒప్పుకోవడానికి ఎట్టికారణాలున్ననూ యథార్థమునే చెప్పువాడు, అయథార్థమును చెప్పనివాడు మాత్రమే ఆప్తుడు.

నైయాయికులకు ఈశ్వరుడు ఆప్తపురుషుడు వేదములనుపదేశించిన వాడునూ. బహుశః జనసామాన్యంలో కూడ చాలా ఆప్తులుంటారు. వారు చెప్పేది యథార్థమే ఉంటుంది. కాని అప్పుడప్పుడు కొన్ని కారణ దోషములు – భ్రమ, ప్రమాదాలు ఉచ్చారణ కారణభూతాలయిన స్థానప్రయత్నములు బాగలేక కలిగేవి ఉంటాయి. ఆ దోషాలు లేనిది మరియు అర్థముతో పొంతన గలిగినది (అనగా బాధలేనట్టిది– నిప్పు చల్లగా ఉంటుంది– బాధ ఉన్న వాక్యము) అయిన వాక్యము గాని అని శబ్దప్రమాణానికి రెండవ లక్షణమును గ్రంథకర్త చెప్పారు. వేద వాక్యములలో కూడ భ్రమప్రమాదాది దోషములు, బాధితజ్ఞానము లేని కారణాన ప్రమాణములు, వేదములు నిత్యములు.

## సంపూర్ణస్య వేదస్య ప్రామాణ్యప్రతిపాదనమ్:

**మూ:** నను వేదవాక్యానాం మీమాంసకైః కార్యపరతయైవ ప్రామాణ్య స్వీకారాత్ సిద్ధబ్రహ్మపరవాక్యానాం వ్యుత్పత్త్య సంభవాచ్చ కథం ప్రామాణ్యమితి చేన్న. సిద్ధ బ్రహ్మపరవాక్యానామపి ఉపాసనారూప కార్యాన్వయస్వీకారాత్. పితా తే సుఖమాస్తే ఇతి లౌకికసిద్ధపరవాక్యస్యాపి బోధకత్వదర్శనాత్. బాలానాం లోకే

మాతాపితృప్రభృతిభిరమ్బాతాతమాతుల చన్ద్రాదీ నఙ్గుల్యా నిర్దేశ్య తదభి ధాయినః శబ్దాన్ ప్రయుఞ్జానైః క్రమేణ బహుశః శిక్షితానాం తత్తదర్థ బుద్ధ్యుత్పత్తి దర్శనాత్. వేదేఽపి పరినిష్పన్నేఽప్యర్థే శబ్దస్య బోధకత్వం సమ్భవతీతి నా ప్రామాణ్య శఙ్కావకాశః. తర్హి అభిచారాది ప్రతిపాదక వేదాంశస్య కథం ప్రామాణ్య మితి నాశఙ్కనీయమ్. తస్య దృష్టఫలప్రదర్శనేన అదృష్ట స్వర్గాదిఫలక సాధనాదౌ ప్రవృత్తి ప్రయోజకత్వాత్. యూపాదిత్వ వాక్యం తు ఆదిత్యవద్యూప ప్రకాశనపరమ్. అతః కృత్స్నస్య వేదస్య ప్రామాణ్యమ్.

**అ:** మీమాంసకులు ముఖ్యముగా ప్రభాకరానుయాయులు, వేద వాక్యములకు కార్యపరమయిన అర్థమును బోధించువరకు మాత్రము ప్రామాణ్యమును ప్రతిపాదిస్తారు. వారి అభిప్రాయం ప్రకారము అన్ని వాక్యములకు కూడ కార్యార్థమును బోధించుటయే ప్రధాన మయినది. ఇదివరకే సిద్ధమయిన (ఉన్న) బ్రహ్మను గురించి బోధించు వాక్యాలకు వ్యుత్పత్తి కుదరనందున (ఆ ఉపనిషద్ వాక్యములకు) ప్రామాణ్యము ఎట్లు సంభవము? (లోకములో సిద్ధము అని కార్యము అని అర్థాలు రెండు విధాలుగా ఉంటాయి. ఘటాది పదార్థాలు సిద్ధములు. ప్రయత్న సాధ్యములు కార్యములు. వెళ్ళుట మొదలయిన క్రియలు. లౌకికవైదిక శబ్దాలన్నింటికి కార్యార్థమును తెలుపుటయే తాత్పర్యము. బ్రహ్మ పూర్వమే సిద్ధము కనుక దానిని గూర్చి తెలిపే వేద వాక్య ములకు అర్థము – కార్యరూపము కుదరదు కనుక ఎట్లు ప్రామాణ్యము అని ప్రశ్న?) సమాధానము ఏమంటే–కొద్దిసేపు శబ్దాలన్నిటికి కార్యరూపార్థమే అని ఒప్పు కున్నా. సిద్ధబ్రహ్మను గురించి చెప్పువాక్యాలు కూడ ఉపాసనా రూపమయిన కార్యరూపార్థాన్ని బోధిస్తున్నాయి గనుక వాటికి ప్రామాణ్యము అని, వాస్తవంగా అన్నివాక్యాలు కార్యరూపార్థాన్ని చెప్పేవి కావాలని నియమము ఏమీ లేదు. నీ తండ్రి సుఖముగా నున్నాడు మొదలయిన లౌకిక వాక్యాలకు కూడ బోధకత్వమును మనము చూస్తునే ఉన్నాము. సిద్ధబ్రహ్మ పరవాక్యములకు ఉపాసనారూపకార్యము అను అర్థముతో సంబంధము నొప్పుకొని ప్రామాణ్యము చెప్పడం వలన మీమాంసక విరోధమును తొలగించవచ్చును. ఇదివారు చెప్పిన దానిని. ఒప్పుకుని, సమాధానం చెప్పడం



వాస్తవంగా అలాటి నియమములేదు. లోకంలో తలిదండ్రులు మొదలయిన వారు, తల్లిదండ్రులను, మామలను, చంద్రుడు మొదలయిన వారిని వేలితోచూపి తల్లి,తండ్రి,మామ,చంద్రుడు మొదలయిన శబ్దాలను ప్రయోగిస్తూ ఆ యా అర్థములను, దానికి తగిన బుద్ధిని గరపుతుంటారు. ఇట్లా లోకంలో సిద్ధ వస్తువులను గురించి తెలిపే వాక్యాలవలన కూడ శబ్దజ్ఞానము కలుగుతున్నది. అట్లాగే వేదంలో కూడ సిద్ధవస్తు బ్రహ్మను గూర్చి చెప్పు శబ్దాలద్వారా సిద్ధబ్రహ్మ జ్ఞానము కలుగుతుంది కనుక ఆ వాక్యాలకు అప్రామాణ్యము అనే శంకకు అవకాశమే లేదు.

ఇది బాగానే ఉంది కాని అభిచారాది కర్మలను ప్రతిపాదించే వాక్యములకు ప్రామాణ్యమెట్లాస్వీకరించేది? అని ప్రశ్న కలుగుతుంది. అట్టి కర్మలను చెప్పే వేదవాక్యములకు శత్రుమరణమును దృష్టఫలముగా చెప్పివాటి ద్వారా అదృష్ట స్వర్గాది ఫలసాధనము పయిపు మనుష్యులను నడిపించడమే లక్ష్యము– ప్రయోజనము కూడ అని సమాధానము చెప్పవచ్చును. 'ఆదిత్యో యూపః.' అను వాక్యానికి తాత్పర్యమేమంటే సూర్యునిలాగ యూపము (స్తంభము) ప్రకాశిస్తున్నది అని చెప్పడం లోనే. ఇట్లా సంపూర్ణ మయిన వేదభాగానికి ప్రామాణ్యము సిద్ధిస్తుంది. కలదు కూడ.

## వేదస్య విభాగః

**మూ:** స వేదః కర్మబ్రహ్మప్రతిపాదక పూర్వోత్తర భాగాభ్యాం ద్విధా భిన్నః. ఆరాధనకర్మప్రతిపాదకం పూర్వకాణ్ణమ్. ఆరాధ్య బ్రహ్మప్రతిపాదక ముత్తర కాణ్డమ్. అత ఉభయోర్మీమాంసయోరైకశాస్త్ర్యమ్. భాగద్వయాత్మకో వేదః ఋగ్యజుస్సామాథర్వరూపేణ చతుర్ధాఽవస్థితః. పునరనన్తప్రకారశ్చ ఋగాదిబహుప్రకారో వేదో మన్త్రార్థవాదవిధిరూపేణ త్రివిధః. అనుష్ఠేయార్థప్రకాశకో మన్త్రః. విధ్యధీన ప్రవృత్త్యుత్తమ్భక వాక్యవిశేషోఽర్థవాదః. హితానుశాసనరూపం వాక్యమిహ విధిః. స చ త్రివిధః అపూర్వ పరిసంఖ్యానియమ భేదాత్. తే పునర్నిత్య నైమిత్తిక కామ్యాది భేదాద్ బహువిధాః. వ్రీహీన్ ప్రోక్షతీతి విధిరపూర్వవిధిః.

(మనో మయ త్వాద్యుపాసన విధిర్విశిష్టవిధిః.) ఇమామగృభ్ణన్నిత్యశ్వరశనావిధిః , పరిసంఖ్యావిధిః, గుర్వభిగమనాదివిధిర్నియమవిధిః, సన్ధ్యోపాసనాదివిధి ర్నిత్య విధిః. జాతేష్ట్యాది విధిర్నైమిత్తిక విధిః. జ్యోతిష్టోమాదివిధిః కామ్యవిధిః.

**అ:** ఆ వేదము పూర్వభాగము ఉత్తరభాగము అని రెండు విధములు. పూర్వభాగమున కర్మములు ప్రతిపాదింపబడినవి. ఉత్తరభాగమున బ్రహ్మ ప్రతిపాదన జరిగినది. పూర్వభాగమునకే సంహితాభాగము లేదా మన్త్రభాగము అని పేరు. ఉత్తరభాగమునకే జ్ఞానకాండము లేదా బ్రాహ్మణభాగము అనిపేరు. బ్రహ్మయొక్క ఆరాధన రూపమయిన కర్మలు పూర్వకాండములో ప్రతిపాదింప బడినాయి. ఆరాధ్యమయిన బ్రహ్మప్రతిపాదన ఉత్తరకాండములో ఉన్నది. ఈ రెండిటికే పూర్వమీమాంసా, ఉత్తర మీమాంసా అని పేరు. ఈ రెండూ ఒకే శాస్త్రము యొక్క రెండు భాగములు. వేదముల పూర్వభాగముయొక్క అర్థ నిర్ణ యము కొరకు జైమినిముని పూర్వమీమాంస ప్రారంభించాడు. వేదముల ఉత్తర భాగముల యొక్క అర్థనిర్ణయము కొరకు ఉత్తరమీమాంస మొదలయినది. కనుక ఇవి రెండు ఒక శాస్త్రమే. ఇట్లా పూర్వ–ఉత్తర భాగములుగా రెండువిధము లయిన వేదము–ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వవేదము అని నాలుగు విధములు. మళ్ళీ ఈ వేదమునకు అనంతమయిన భేదము లున్నాయి. ఇట్లా అనేక ప్రకారములుగా ఉన్నవేదము మంత్రము, అర్థవాదము, విధి అని మూడువిధములు, అనుష్ఠింపతగిన విషయములను ప్రతిపాదించునది మంత్రము. విధివాక్యములద్వారా విధింపబడే యాగాదులయందు ప్రవర్తింప జేయునది, చేయదగిన దాని స్తుతిని చేయకూడని దాని నిందనుచేయునది అర్థవాదము. ఇష్టము యొక్క ప్రాప్తికి అనిష్టము యొక్క పరిహారమునకు సాధనమయిన అర్థము నుపదేశించునది విధివాక్యము.

ఈ విధి మళ్ళీ మూడువిధములు. అపూర్వవిధి, పరిసంఖ్యావిధి, నియమ విధి అని విధివాక్యాలుమూడుకూడనిత్యనైమిత్తిక కామ్యభేదములతో మూడు



విధాలు. ఇక అపూర్వవిధి–ఏ ప్రమాణముతో తెలియని, విధింపబడని, అర్థమును విధించునది. 'వ్రీహీన్ ప్రోక్షతి'–అనునది ఉదాహరణము. యాగములో ధాన్య మును ప్రోక్షించుట (దానిపయి నీళ్లు చల్లుట) అనునది ఈ వాక్యము ద్వారానే ప్రాప్తించునది. మరి యే వాక్యము దీనిని విధిగా చెప్పుట లేదు కనుక అపూర్వ– పూర్వము లేనిది, దేనితో విధింపబడనిది, అయిన విధి. (మనోమయః–ఇత్యాది విధి వలన బ్రహ్మయొక్క ఉపాసన విహితమయినది. దీనిని విశిష్టవిధి అంటారు.)

ఇక పరిసంఖ్యావిధి. ఒక విధి రెండింటిలో సమానముగా ప్రాప్తమయి నప్పుడు ఒకదానికే పరిమితము చేయడము పరిసంఖ్యావిధి అన్నమాట. ఇమామగృభ్ణన్ రశనామృతస్య అను మంత్రముచే యాగములో రశనను (నాలుకను) కోయడం విహితమయినది. అయితే అశ్వరశనను కోయడమా రాసభ రశనను కోయడమా? విధి రెండింటికీ వర్తిస్తుంటే పయిమంత్రముతో 'ఇమా... అశ్వాభిధానీమాదత్తే' అను మీమాంసావాక్యము, మంత్రము చదివి అశ్వరశనను ఖండించాలి అని చెప్తుతుంది. విధిని ఒక దానికి పరిమితము చేసే వాక్యము పరిసంఖ్య. (గద్యకావ్యాలలో) చాలా ప్రసిద్ధమయిన అలంకారము పరిసంఖ్యా– అక్షగృహేషు కలహః–అంటే ఇండ్లలో కలహాలు లేవు జూదగృహాల్లోనే ఉన్నాయి అని. అ).

ఇక నియమవిధి. ఏదయినా పనిచేయాల్సివచ్చినప్పుడు ఇట్లానే చేయాలి అని చెప్పేవాక్యము–నియమము చేసే విధి కనుక నియమవిధి. 'తద్విజ్ఞానార్థం సగురుమేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్' అనువాక్యముతో ముముక్షువయిన అధికారి బ్రహ్మజ్ఞానము కొరకు సమిధలు మొదలయిన కానుకలు తీసుకొని వేదజ్ఞుడు బ్రహ్మనిష్ఠ డయిన గురువువద్దకే వెళ్ళాలి అని నియము చేస్తున్నది కనుక ఈ వాక్యము నియమవిధివాక్యము. సం ఉపసర్గ పూర్వఇణ్ – గతౌధాతువుక్తాన్తరూపము. సమిత్ = రెండు చేతులు జోడించి అని సమిత్పాణిః యొక్క అర్థము. సమేతంగా=కలిసి అని అర్థము. దీంట్లో దూరవిద్య లాభం లేదు. గురుముఖతఃనే చదువుకోవాలి అని తెలుస్తున్నది.

ఇక నిత్యవిధి అంటే తప్పకుండా చేయవలసిన కర్మలను విధించునది నిత్యవిధి. 'అహరహః సన్ధ్యాముపాసీత' అనునది అనగా ప్రతిదినము సంధ్యా వందనము చేయాలి అని.

ఇక నైమిత్తిక విధి – ఏదయినా సందర్భంలో ఏ నిమిత్తముగా కారణముగా చేయవలసిన వాటిని విధించునది. పుత్రుడు పుడితే జాతకర్మ చేయాలి. అనేది ఒక విశేషము. నిత్యకర్మలను ప్రతినిత్యం చేయాలి. వాటిని చేసినందువలన ఏమీ పుణ్యం కలుగదు కాని చేయకపోతే పాపము చుట్టుకుంటుంది. నైమిత్తిక కర్మలు చేయటం వలన పుణ్యము వస్తుంది. చేయకపోవడం వలన పాపము తగులుతుంది. నిత్యనైమిత్తికములను శాస్త్రవిహితముగా చేసినందున పాపము నశిస్తుంది.

ఇక కామ్యవిధి–కోరికతో ఇదికావాలి అని చేసే కర్మలు కామ్యకర్మలు వాటిని విధించేది కామ్యవిధి. పుత్రకామేష్టి అశ్వమేధ యాగములు – 'స్వర్గకామో ఽశ్వమేధేనయజేత' మొదలయినవి కామ్యవిధికి ఉదాహరణములు. (చేసిన పాపములు నశించడంకోసం చేసే కర్మలను చెప్పేవి– ప్రాయశ్చిత్తవిధివాక్యములు అంటారు.)

## వేదాఙ్గాని:

**మూ:** ఏవం విధ్యర్థవాదమన్త్రాత్మకస్య వేదస్య–ఛన్దః,కల్పః, శిక్షా, నిరుక్తమ్. జ్యోతిషమ్, వ్యాకరణమిత్యేతాని అఙ్గాని. ఛన్దః–అనుష్టుప్, త్రిష్టుప్ ఆది ప్రతిపాదనరూపమ్. శ్రౌతస్మార్తప్రయోగప్రతిపాదనపరః కల్పః. శిక్షా వర్ణ నిర్ణయాత్మికా. నిరుక్తం అపూర్వార్థప్రతిపాదకమ్. జ్యౌతిషమ్ అధ్యయన తదర్థానుష్ఠాన కాలనిర్ణాయకమ్. వ్యాకరణం తు సుశబ్దస్వరాది సమర్థన పరమ్. ఏవం సాఙ్గస్య వేదస్య ప్రామాణ్యం సిద్ధమ్.

**అ:** విధి, అర్థవాదము, మంత్రము అనుమూడు విధముల రూపముగల వేదమునకు ఆరు అంగములు (అవయవములు) ఉన్నవి. అవి ఛందస్సు, కల్పము, శిక్ష, నిరుక్తము, జ్యౌతిషము వ్యాకరణము అని. ఛందస్సు– అనుష్టుప్, త్రిష్టుప్ మొదలయిన ఛందముల యొక్క లక్షణములను తెలుపుశాస్త్రము. (వేదానికి కూడ ఛందః అనిపేరు. అధ్యాయము–అనికూడ.) కల్పము–శ్రౌతములు స్మార్త ములు అయిన యాగముల స్వరూపమును ఆచరణవిధానమును తెలుపునట్టి (కల్పించునట్టి) శాస్త్రము. శిక్ష – అనునది వర్ణములయొక్క స్వరూపము, ఉత్పత్తి, స్థానము ప్రయత్నము, స్వరము మొదలగు వాటిని తెలుపునట్టి శాస్త్రము వేదాఙ్గశిక్ష. నిరుక్తము – నిర్వచనము ద్వారా వైదికపదములకు గల అపూర్వ మయిన అర్థములను తెలుపుశాస్త్రము (అపూర్వము అనగా – లౌకిక సంస్కృతములో కొన్నివైదిక పదాలుపయోగింపబడుతున్నవి. కాని వాటి అర్థము మాత్రము వేరుగా ఉన్నది. చంద్ర శబ్దము లౌకికములో చంద్రుడు మాత్రమే. వేదములో చల్లనిది ఆహ్లాదమును కల్గించునది అని విశేషణము. ఇది అపూర్వము.) అర్థమునకు ప్రాధాన్యము నిచ్చుశాస్త్రము. నేటి భాషాశాస్త్రసిద్ధాంతము లెన్నియో దీనిలో కలవు. జ్యౌతిషము–అధ్యయనమునకు అధ్యయనము చేసిన అర్థములను ఆచరించుట – అనుష్ఠించుటకు తగిన కాలమును నిర్ణయించునది. వ్యాకరణశాస్త్రము శబ్దసాధుత్వమును, ప్రకృతి ప్రత్యయాదియోజనముచే నూతన శబ్దముల ఉత్పత్తిని సంధి, సమాస, విభక్తి విచారమును చేస్తుంది. స్వరప్రక్రియను కూడ తెలుపుతుంది. ఇట్లా ఆరు అంగములతో కూడుకున్న వేదమునకు ప్రామాణికత్వము సిద్ధిస్తుంది.



## స్మృత్యాదీనాం ప్రామాణ్యవివేచనమ్:–

**మూ:** అథ శ్రుత్యవిరుద్ధాచారవ్యవహార ప్రాయశ్చిత్తాది ప్రతిపాదికా ఆప్తప్రణీతా స్మృతిః ప్రమాణమ్. హిరణ్యగర్భాదీనామాప్తత్వేపి తేషాం గుణత్రయ వశ్యత్వసమ్భవాత్ తత్కర్తృకయోగ కపిలాది స్మృతీనాం మన్వాది స్మృత్యవిరుద్ధాంశా ఏవ ప్రమాణమ్. తత్త్వవిపర్యాసాది విరుద్ధాంశా న ప్రమాణమ్. వేదోపబృంహణ రూపేతిహాసపురాణయోరపి ప్రామాణ్యం స్వతస్సిద్ధమ్. తత్ర భారత రామాయణ యోః క్వచిత్క్వచిద్విరోధభావేఽపి తత్త్వాంశే వేదాన్తవాక్యవదవిరోధో నేయః.

**అ:** శ్రుతికివిరుద్ధము కానట్టి ఆచారవ్యవహారములను ప్రాయశ్చిత్తము మొదలయిన వాటిని ప్రతిపాదించునట్టి ఆప్తులచే రచింపబడినట్టి స్మృతులు ప్రమాణము. హిరణ్యగర్భుడు (మొదలయినవారు) (బ్రహ్మ కాదు వేరే ఆ పేరు గలవాడు) కపిలుడు ఆప్తులే అయినను వారు సత్త్వరజస్తమోగుణాల అధీనంలో ఉంటారు కనుక వారు చెప్పిన యోగ కపిలస్మృతులలో మనువు మొదలగుయిన వారి స్మృతుల అంశములతో విరోధములేని అంశాలు మాత్రమే ప్రమాణములు. సిద్ధాంతములోని తత్త్వమునకు విరుద్ధమయిన పయిస్మృతులకు విరుద్ధములయిన అంశములకు ప్రామాణ్యము లేదు. ఛాందోగ్యోపనిషత్తు ఎనిమిదవ ప్రపాఠకములో చార్వాకమతమును సూత్రప్రాయంగా చెబుతాడు హిరణ్య గర్భుడు. కపిలుడు సాంఖ్యప్రవర్తకుడు. వీరు చెప్పిన అంశములు స్మృతి విరుద్ధములు కాకుంటేనే ప్రమాణము. అయితే కావు అని నిష్కర్ష. "ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్, బిభేత్యల్పశ్రుతాద్వేదః మామయం ప్రతరిష్యతి" (ప్రతరేదితి పాఠాంతరము) రామాయణ మహాభారతములు ఇతి హాసములు, అష్టాదశపురాణములు అగ్ని, వాయు, విష్ణు పురాణములు మొదలయినవి. ఈ ఇతిహాస పురాణములకు గూడ ప్రామాణ్యము స్వతఃగా సిద్ధము. రామాయణము ఇతిహాసశ్రేష్ఠము అని ప్రసిద్ధిగాంచినది. ఈ ఇతిహాసములలో కొన్నిచోట్ల విరోధము ఉన్నట్లు పయికి కనబడుతుంది. కాని, విరుద్ధముగా కనబడే వేదాంతవాక్యములలో విరోధమును నివారించినట్లుగా ఇతిహాసములలో విరోధాన్ని పరిహరించి తత్త్వము విషయములో వాటికి ఐకమత్యమున్నదని గమనించాలి. అనగా వేదాంత వాక్యములలోని విరోధమును తొలగించుచు, తత్త్వము విషయములో విరోధము లేదు అని నిరూపించు విధముగా, ఇతి హాసములలో కూడ విరోధము లాగ కనబడే దానిని తొలగించి తత్త్వ విషయములో అవిరోధమును స్థాపించాలి.



## అన్యేషాం పురాణాగమాదీనాం ప్రమాణవ్యవస్థా :

**మూ:** సర్గాదిప్రతి పాదకపురాణేష్వపి సాత్త్విక, రాజస, తామస భేద భిన్నేషు తత్త్వాంశే (విరోధాభావాత్) విరుద్ధాంశో న ప్రమాణం అన్యత్ సర్వం ప్రమాణమ్. పాశుపతాద్యగమా అపి తథైవ, ఆగమ, దివ్యతన్త్ర తన్త్రాన్తర, సిద్ధాన్త భేద భిన్నస్య శ్రీపాఞ్చరాత్రాగమస్య క్వచిదపి వేదవిరోధాభావాత్ కార్త్స్న్యేన, ప్రామాణ్యమ్, ఏవం వైఖానసాగమస్యాపి ధర్మశాస్త్రాణా మపి తథైవ శాణ్డిల్య పరాశర భారద్వాజ వసిష్ఠహారీతాదయో ధర్మశాస్త్రప్రణేతారః. శిల్పాయుర్వేద గాన్ధర్వ భరతాగమాదికమప్యుపయుక్తాంశే తథైవ. శిల్పో నామకర్షణాది గోపురప్రాకారాది నిర్మాణప్రతిపాదకః. ఆయుర్వేదో వైద్యకమ్. గాన్ధర్వో గానాదిరూపః. భరతాగమో నృత్తాదివిధాయకః. పునః చతుష్షష్టి కలారూపేషు శాస్త్రేషు తత్త్వో పాయ పురుషార్థోపయుక్తాని ప్రమాణాని.

**అ:** 'సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ, వంశానుచరితం చైవ పురాణం పఞ్చలక్షణం' అనుశ్లోకములో చెప్పినట్లు పురాణములు సృష్టి మొదలయిన ఐదు అంశాలను ప్రతిపాదిస్తాయి. ఇవి పద్దెనిమిది ఉన్నాయి. వీటిలో విష్ణు, నారదీయ, భాగవత, గరుడ, పద్మ, వారాహ పురాణములు సాత్త్వికపురాణములు. బ్రహ్మాండ, బ్రహ్మవైవర్త, మార్కండేయ, భవిష్య, వామన, బ్రాహ్మపురాణాలు రాజసపురాణాలు. మత్స్య, కూర్మ, లింగ, శివ, స్కంద, అగ్ని పురాణాలు తామసపురాణాలు అని ప్రసిద్ధిచెందినవి. ఈ పురాణాలలోని అంశాలన్ని తత్త్వాంశముతో విరోధము లేనట్టివి. అన్ని ప్రమాణములు. విరోధ మున్నవి మాత్రము ప్రమాణములు కావు. పాశుపతాది ఆగమాల విషయములో కూడ ఇదే విధముగా విరోధములు లేని అంశములు ప్రమాణములు. విరోధము న్నవి ప్రమాణములు కావు. శ్రీపాంచరాత్రాగమము, ఆగమ సిద్ధాంతము, దివ్య

సిద్ధాంతము, తంత్రసిద్ధాంతము, తంత్రాంతరసిద్ధాంతము అనునాలుగు సిద్ధాంతములను నిరూపిస్తుంది.

శ్రీమన్నారాయణుడే పంచాయుధముల అంశముచే జన్మించిన జాపగాయనుడు, శాండిల్యుడు, భరద్వాజుడు, కౌశికుడు, మౌంజాయనుడు అను మహర్షులకు విడివిడిగా ఒక్కోరాత్రి ఒక్కొకరికి లోకరక్షను, బద్ధులయిన జీవుల ఉద్ధారమును, సద్ధర్మములో భగవదారాధనలో నడచుకోవడానికి గల హేతువులను మోక్షదాయకములను మొదటివేదమయిన ఏకాయనశాఖ అనే పేరుగల రహస్యామ్నాయమును బోధించెను. అందువలన దీనికి పాంచరాత్రాగమము అనుపేరు వచ్చినది. ఈ పాంచరాత్రాగమానికి ఏ విషయంలో వేదంతో విరోధము లేనందున మొత్తము ఆగమము ప్రమాణమే. నూటఎనిమిది సంహితలు ఈ ఆగమమునకు చెందినవి ఉన్నట్టు ప్రతీతి. ఇట్లే భగవంతుని అవతారమైన వైఖానసునిచే ప్రణీతమయిన వైఖానసాగమము కూడ మొత్తము ప్రమాణమే. ధర్మశాస్త్రములకు ఇదే నియమము వర్తిస్తుంది. వేదావిరోధము తత్త్వావిరోధము ఉన్న ధర్మశాస్త్రములలోని అన్ని అంశాలకు ప్రామాణ్యము. విరోధమున్న వాటికి ప్రామాణ్యము లేకపోవడమే ఆ నియమము. శాణ్డిల్యుడు, పరాశరుడు, భరద్వాజుడు, వసిష్ఠుడు, హారీతుడు మొదలగు వారు ధర్మశాస్త్ర (స్మృతిగ్రంథ) కర్తలు. 'కలౌ పారాశరస్మృతిః' అనిప్రసిద్ధికూడ కలదు. కొన్నిగ్రంథాల్లో పద్దెనిమిది మంది కొన్నింట్లో 21 మంది ఇంకా ఉపస్మృతికర్తలు కూడ పేర్కొనబడ్డారు.

ఇలాగే శిల్పము, ఆయుర్వేదము, గాంధర్వము, భరతాగమములలో కూడ వేదముతో విరోధము లేని అంశాలకే ప్రామాణ్యమున్నట్లు తెలుసుకోవాలి. శిల్పము–భూమిని దున్నడం మొదలుకొని గోపురమును, ప్రాకారమును మందిరమును, విగ్రహమును మొదలగు వానిని నిర్మించి కట్టే విధానాన్ని తెలిపేది. ఆయుర్వేదమంటే వైద్యమునకు సంబంధించినది. గాంధర్వవేదము గానానికి సంగీతానికి సంబంధించినది. సంగీతశాస్త్రము. భరతాగమము నృత్తమునృత్యము, నాట్యము, రూపకములు, రసములు, భావములు మొదల యిన వాటిని నిరూపించునది. అట్లాగే కామసూత్రములో అరువది నాలుగుకళలు నిరూపించడం జరిగింది. ఆ యాశాస్త్రలలో తత్త్వమునకు పురుషార్థము సంపాదించుటకు ఉపయుక్తమయినట్టి వేదావిరుద్ధమయినట్టి అంశాలకు ప్రామాణ్యమున్నది. మిగిలినవాటికి ప్రామాణ్యము అసలే లేదు.



## సహస్రగీతి శ్రీభాష్యయోః ప్రామాణ్యప్రతిపాదనమ్:

**మూ:** వకులాభరణాది దివ్యసూరిసూక్తయః కార్త్స్న్యేన ప్రమాణతరాః. శ్రీమద్రామానుజాచార్యప్రభృతిభిః ప్రణీతా శ్రీభాష్యాదిప్రబంధాః ప్రమాణతమా.

**అ:** "భూతం, సరశ్చ, మహదాహ్వయ, భట్టనాథ, శ్రీభక్తిసార, కులశేఖర యోగిముఖ్యాన్, భక్తాంఘ్రిరేణు, పరకాల, యతీంద్ర మిశ్రాన్, శ్రీమత్పరాంకుశము నిం, ప్రణతోఽస్మి నిత్యమ్" అను ఈ శ్లోకములో భూతయోగి, సరోయోగి, మహాయోగి, భట్టనాథసూరి, శ్రీభక్తిసారసూరి, కులశేఖరసూరి, యోగివాహన సూరి, భక్త్యాంఘ్రిరేణు సూరి, పరకాలసూరి, యతీంద్రసూరి, పరాంకుశసూరి, శఠకోపసూరి అని పదకొండుమంది దివ్యసూరులు పేర్కో బడ్డారు. గోదాదేవిని కలుపుకొని పన్నిద్దరాళ్వార్లు–పన్నెండు మంది అళ్వార్లు.

'వకులాభరణం వందే జగదాభరణం మునిమ్।
యః శ్రుతేరుత్తరం భాగం చక్రే ద్రావిడభాషయా'

అనివకులాభరణుని–శఠకోపుని మరియు ఇతర దివ్యసూరుల యొక్క శ్రీసూక్తులు ప్రమాణతరములు. భగవద్రామానుజాచార్యులు మొదలయిన వారు రచించిన శ్రీభాష్యాది ప్రబంధములు ప్రమాణతమములు. మొదట చెప్పిన వేదస్మృ తీతిహాస పురాణాదులు ప్రమాణములు. దివ్యప్రబంధములు ప్రమాణతరములు, శ్రీభాష్యాదులు ప్రమాణతమములు. ఉత్తరోత్తరప్రామాణ్యము ఎక్కువ అను విషయాన్ని తరతమప్రత్యయములతో గ్రంధకర్త తెలిపారు.

## వాక్యాదివిచారః

**మూ:** పురుషస్వాతంత్ర్యాధీన రచనావిశేషవిశిష్టం పౌరుషేయమ్. ఏతేన కావ్యనాటకాలఙ్కారాదీనామపి లక్షణముక్తం స్యాత్ ఏవమాప్తైనోచ్చరితాన్యాకాంక్షా యోగ్యతా సన్నిధి మల్లౌకికవాక్యాన్యపి ప్రమాణాని. యథా నద్యాస్తీరే పఞ్చ ఫలాని సన్తీత్యాదీని. ఏవం వైదిక లౌకిక సాధారణం వాక్యం ద్వివిధమ్. ముఖ్యవృత్తి గౌణవృత్తిభేదాత్. ముఖ్యవృత్తిరభిధావృత్తిః. యథా సింహశబ్దస్య మృగేంద్రే సాఽభిధావృత్తిర్యోగరూఢ్యాదిభేదేన బహువిధా. ముఖ్యార్థబాధే సతి తదాసన్నేఽర్థవృత్తిరౌపచారికీ. సా ద్వివిధా-లక్షణాగౌణీభేదాత్. ప్రథమా యథా- గంగాయాం ఘోష ఇత్యత్ర అధికరణ'త్వ'స్య బాధాత్ తీరే లక్షణా; ద్వితీయా యథా- సింహో దేవదత్త ఇత్యత్ర దేవదత్తే శౌర్యాదిగుణయోగాత్. ఏవం వైదిక లౌకికరూపం సర్వం వాక్యజాతం స విశేషవిషయకం భేదవిషయకం చ. శరీర వాచకశబ్దానాం యథా శరీరిణి పర్యవసానం, ఏవం భగవచ్ఛరీరభూత బ్రహ్మ రుద్రాగ్నీన్ద్రాది చిద్వాచకశబ్దానాం తథా తచ్ఛరీరభూతప్రకృతి కాలాకాశ ప్రాణాద్య చిద్వాచక శబ్దానాం చ శరీరిణి పరమాత్మని నారాయణే పర్యవసానముప పాదయన్తి ఆచార్యాః. వేదాన్తజ్ఞానాద్ వ్యుత్పత్తిః. పూర్వత ఇత్యుక్తమ్. నారాయణస్య సర్వశబ్ద వాచ్యత్వం సర్వశరీరకత్వం ఇత్యాదికం తు ఉపరి ఈశ్వర పరిచ్ఛేదే ప్రతిపాద యామః. ఇతి, శబ్దో నిరూపితః.

ఇతి శ్రీవాధూలకులతిలక-శ్రీమన్మహాచార్యప్రథమదాసేన
విరచితాయాం యతీన్ద్రమతదీపికాయాం శారీరకపరిభాషాయాం
శబ్దనిరూపణం నామ తృతీయోఽవతారః.

**అ:** పౌరుషేయము అనగా-గ్రంథకర్త తన ఇష్టముతో ఏ గ్రంథమును వ్రాస్తాడో అది. గ్రన్థకర్త ఇష్టమునకు లోబడి చేసిన రచనతో కూడిన గ్రన్థము పౌరుషేయము అని చెప్పుకోవచ్చును. దీనితో కావ్యములు, నాటకములు (రూపకములు) అలంకారశాస్త్రము మొదలయిన వాటి యొక్క లక్షణము చెప్పి



నట్లు అవుతుంది. దీనివల్ల వేదములు అపౌరుషేయములు. మిగిలిన వేదాంగములు, ఇతిహాసము, పురాణములు, కావ్యరూపకాలంకారాద్యన్య గ్రంథములన్ని పురుష విశేషరచితములు కనుక పౌరుషేయములు. ఇట్లా పౌరు షేయము-అపౌరుషేయము అను వాటి చర్చ చేసినట్లయినది. ఇంత వరకు వైదిక వాక్యముల యొక్క నిరూపణము ప్రమాణ చర్చజరిగినది. ఇప్పుడు నిత్యవ్యవహారంలో మాట్లాడుకునే వాక్యాలు సాహిత్యంలోని వాక్యాలు వాటిచర్చ జరుగుతున్నది. పయి వేదవాక్యాలలాగ ఆప్తుడయినవాడు పలికినట్టివి, ఆకాంక్ష, ఆసత్తి, యోగ్యత కలిగినట్టివి, అయిన వాక్యములు ప్రమాణములే, ఈ వాక్యములు శాబ్దీప్రమను కలుగజేస్తవి. పదములయొక్క సమూహము వాక్యము. వర్ణముల యొక్క సమూహము పదము. శబ్దమును ప్రమాణముగా చాలామంది దార్శ నికులు ఒప్పుకుంటారు. అందరు ఇంచుమించు వాక్యలక్షణాన్ని పయి విధము గానే చెప్పారు. ఒక వాక్యార్థము పూర్తిగావడానికి పదార్థము యొక్క జిజ్ఞాస మిగిలి ఉండడము ఆకాంక్ష. ఆకాంక్షా ప్రతీతిపర్యవసాన విరహః అని లక్షణము ప్రతీతి-జ్ఞానము, పర్యవసానము-పూర్తిఅగుట, విరహము-లేకపోవుట అని అర్థము. ఉదాహరణకు శ్రీనివాసదాసుగారు యతీంద్రమత దీపికను- అని మాత్రమే అన్నామనుకోండి ఏం చేసారు? అని ప్రశ్న ఆకాంక్ష ఇంకా ఉంటుంది. వ్రాసారు అని పూర్తిచేస్తే అది వాక్యం అవుతుంది. ఆకాంక్ష తొలగిపోతుంది. వాక్యములోని పదములకు (పరస్పరం) ఆకాంక్ష ఉంటుంది.

యోగ్యతా-ఇంతకుపూర్వము చాలాసార్లు వచ్చింది. వాక్యములోని పదార్థములకు పరస్పరము ఉండే సంబంధములో ఎట్టిబాధలేక పోవడము- పదార్థానాం పరస్పరసంబంధే బాధాభావః యోగ్యతా. సూర్యుడు పడమట ఉదయిస్తున్నాడు. (ఈవాక్యము వ్యాకరణపరంగా సరిగానే ఉంటుంది. ప్రకృతి, ప్రత్యయం, విభక్తి, సంధి సమాసాదులు బాగుంటేవాక్యం సరిగానే ఉన్నట్టు. కాని అర్థంలోనే) యోగ్యత బాధా భావము లేదు. బాధనే ఉన్నది కనుక ఈ వాక్యము ప్రమాణము కానేరదు.

ఆసత్తి–ఒకవాక్యములోని పదములను అవ్యవధానముగా (అంటే రెండుపదాల మధ్య తీసుకోవలసినసమయం కంటే వేరుగా గంటకు రోజుకు, వారానికి నెలకు మాట్లాడితే అని అర్థము) ఉచ్చరించడము అన్నమాట, అవ్యవధానము దేశము వలన కాలము వలన కూడ జరుగవచ్చును. కనుక ఒకపదము వెనువెంట మరియొకపదము ఉచ్చరించితేనే ఆసత్తి ఉంటుంది. ఇట్లా ఆకాంక్ష,యోగ్యత, ఆసత్తికలిగిన 'సద్యాస్తీరే పఞ్చ ఫలాని' నదిఒడ్డున ఐదుపండ్లు వున్నవి మొదలయిన లౌకికవాక్యాలు కూడ ప్రమాణములే.

ఇక ఈ వైదిక లౌకిక వాక్యము మళ్ళీ రెండు విధములు. ముఖ్యవృత్తిగల వాక్యము, గౌణవృత్తిగల వాక్యము, ముఖ్యవృత్తి అనగా అభిధావృత్తి. అభిధీయతే అనయా అని వ్యుత్పత్తి. దీనినే చెప్పడం జరుగుతున్నది. ఈ పదానికి ఈ అర్థము అని చెప్పేది అభిధావృత్తి. శబ్దానికే ఈ శక్తి ఉన్నది. ఆవు అని పదము వినగనే గంగడోలు, నాలుగు కాళ్ళు, పొదుగు, తోక ఉన్నజంతువు అని తెలుస్తుంది. ఈపదానికి ఈ అర్థంలో శక్తిఉంది అని తెలుసుకోవడానికి, వ్యాకరణము, ఉపమానము, కోశము, ఆప్తవాక్యము, వ్యవహారము, వాక్యశేషము, వివరణ, సిద్ధపదముయొక్క సన్నిధి, ఉపయోగపడుతాయి. వీనినే శక్తి గ్రహోపాయములు అంటారు. సింహము అంటే మృగేంద్రుడు–అని చెప్పేవృత్తి ముఖ్యవృత్తి. వృత్తి–శక్తి ఒకే అర్థాన్ని తెలుపుతాయి. అట్లాగే ముఖ్యవృత్తి. ఏముఖ్యవృత్తి–అభిధాశక్తి–పదశక్తి–శబ్దశక్తి– అన్ని ఒకటే. ఈ అభిధావృత్తి యోగము, రూఢి అని మొదలయిన అనేకభేదాలు గలది.

యోగము–వ్యాకరణశాస్త్రములో చెప్పినట్టి ప్రకృతి ప్రత్యయ యోగముతో ఏర్పడిన పదానికి ఆ ప్రత్యయానికి గల అర్థాన్ని జోడించి చెప్పడము. రామ– ప్రకృతి, సు,ఔ,జస్ మొదలయినవి ఏడు విభక్తి ప్రత్యయాలు. రామః – రాముడు, రామే–రాముని యందు, ఇట్లా అర్థాలుంటాయి. రూఢి– జనవ్యవహారంలో, ప్రసిద్ధి, ఉదా–ప్రవీణుడు– నేర్పరి అని రూఢి. బాగా వీణ వాయించువాడు అని యోగము. కుశలుడు, పంకజము మొదలయినవి ఇట్లాటివే. ఔపచారికీ వృత్తి శబ్దము యొక్క ముఖ్యముయిన అర్థానికి బాధ కలుగగా (అర్థము కుదరకపోగా– అనుపపన్నము కాగా) ముఖ్యార్థముతో సంబంధము కలిగిన ముఖ్యార్థానికి దగ్గరగా ఉన్న అర్థాన్ని బోధించే వృత్తి–ఉపచారవృత్తి. దీనికే లక్షణావృత్తి అని అలంకార న్యాయశాస్త్రాల్లో పేరు. విశ్వనాథుని సాహిత్య దర్పణములో ఉపచారలక్షణము ఇట్లాఉంది. అత్యన్తవిశకలితయోః శబ్దయోః (పదార్థయోః) సా దృశ్యాతి శయమహిమ్నా భేదప్రతీతిస్థగనముపచారః– మిక్కిలి పేరు వేరుగా ఉన్న రెండు రెండు పదార్థములయొక్క భేదము వాటికి గల ఎక్కుడు పోలికచే తెలియకపోవడము భేదమును కప్పిపుచ్చుట ఉపచారము అని భావము. ఈ ఔపచారికీ వృత్తి–లక్షణా, గౌణీ అని రెండు విధాలు. ఇట్లా పూర్వమీమాంసా శాస్త్రములో కూడ ఒప్పు కుంటారు. సాహిత్యశాస్త్రములో గౌణీకూడ లక్షణావృత్తిలోనే భాగము, విడిగా కాదు. కేవలము పదార్థముల మధ్యన సాదృశ్యము సంబంధముగా ఉండటమే భేదముగాని మరొకటి కాదు. లక్షణావృత్తికి ఉదాహరణము గంగాయాం ఘోషః– గంగాశబ్దానికి నది, జలప్రవాహము అనునది అభిధవలన–ముఖ్యవృత్తి వలన గలిగిన అర్థాలు. సప్తమీ విభక్తికి అధికరణము–స్థానము అర్థము. అయితే ఘోషము–పల్లె అనేది గంగయందు ఉండదు. కనుక ముఖ్యార్థమునకు బాధ కలుగుతుంది. అపుడు తదాసన్నే అర్థే–ముఖ్యార్థమయిన ప్రవాహనికి సమీపముగానున్న ఒడ్డు అను అర్థమును లక్షణావృత్తి బోధిస్తుంది. గంగాతీరములో పల్లె అని వాక్యార్థము.



రెండవదయిన గౌణీవృత్తికుదాహరణము–'సింహో దేవదత్తః. దేవదత్తుడు సింహము. దేవదత్తుడు సింహము కాదు కనుక ముఖ్యార్థానికి బాధ. అయితే దీన్ని తొలగించడానికి సింహములో ఉన్న గాంభీర్యము, శౌర్యము మొదలయిన గుణములు ఉన్నందున గౌణీవృత్తి సింహము వంటివాడు అని తెలియజేస్తుంది. మనము నిత్యవ్యవహారంలో కూడ ఇలాటివి వింటుంటాము–ఈ పొలంలో బంగారము పండుతుంది. వాడొట్టి అడివి మొదలయినవి. ఇట్లాగ వైదిక లౌకిక వాక్యాలు ప్రమాణములు.

మరియొక విశేషము ఏమంటే ఈ వాక్యాలన్నీ విశేషణములతో కూడినవి, భేదముతో కూడినవీను అని గ్రంథకర్త అభిప్రాయము–విశిష్టాద్వైత వేదాంతానుసారాభి ప్రాయంకూడ. దీనిప్రకారము–ఏ శబ్దము కూడ విశేషణ రహితమయిన వస్తువును ప్రతిపాదించదు. వాక్యముల, పదములయొక స్వభా వమే విశేషణ విశిష్టమయిన వస్తుప్రతిపాదనము.

పదములు రెండు భాగాలను కలిగి ఉంటాయి. ప్రకృతి, ప్రత్యయము అని. రెండు భాగముల అర్థములు కూడ భిన్న భిన్నముగా ఉంటాయి. ఈరెండు అర్థాలు పరస్పరము అన్వయాన్ని పొందుతాయి. ఇట్లా ప్రకృతి ప్రత్యయార్థ విశిష్టమయిన తన అర్థాన్ని బోధిస్తుంది. ప్రత్యయం కూడా తన అర్థంతో కలిసిన ప్రకృత్యర్థాన్ని బోధిస్తుంది. ఇట్లా పదము విశేషణ విశిష్టమయిన అర్థాన్ని బోధిస్తుంది. పదమే నిర్విశేషమయిన అర్థాన్ని బోధించనప్పుడు పదసముదాయ రూపమయిన వాక్యము ఎట్లా నిర్విశేషమయిన అర్థాన్ని బోధిస్తుంది. కనుక వాక్యాలన్నీ సవిశేషవిషయమును, భేద విషయమును కలిగించునవి–విషయకములు. దేవదత్తుడు మనుష్యుడు మొదలయినపదాలు మొదట దేవదత్తుని మనుష్యుని శరీరమును గురించి చెప్పినను దేవదత్తునిలో మను ష్యునిలో ఉండే శరీరిని ఆత్మను గురించి చెప్పేవే.

అట్లాగే బ్రహ్మ, రుద్రుడు, అగ్ని, ఇంద్రుడు మొదలయిన శబ్దాలు మొదట శరీరభూతములయిన బ్రహ్మరుద్రాదులను తెలిపినను, వారు శరీరముగా గలిగిన శరీరి నారాయణుని బోధిస్తాయి. ఈ శబ్దాలన్నీ చిద్వాచకములు జీవులను, చైతన్యము కల వాటిని చెప్పేవి. అట్లాగే ప్రకృతి, కాలము, ఆకాశము, ప్రాణము, మొదలయినవి మొదట ఆ పదార్థాలను బోధించినను, అవియే శరీరముగా కలిగిన శరీరిని పరబ్రహ్మను, నారాయణుని బోధిస్తాయి. ఐత దాత్మ్యమిదం సర్వమ్, జగత్ సర్వం శరీరం తే; తత్ సర్వం వై హరేస్తనుః ఇత్యాది శ్రుతిస్మృతి వాక్యములు ఇదే విషయాన్ని ప్రతిపాదిస్తున్నవి. చిత్ అచిత్‌లు ఈశ్వరునికి శరీరభూతములు. మనకు మన శరీరము ఎట్లానో నారాయణునకు మన ఆత్మలు, చిద్రూపములు, జగత్తు,–అచిద్రూపము అయినవి శరీరము సంపూర్ణమయిన జగత్తు పరమాత్ముని శరీరము. ఇట్లా చిద్వాచకములు అచిద్వా చకములు ఐన అన్నిపదాలు నారాయణుని శరీరవాచకములు. మొదట చిదచిత్తులను తెలిపినా పర్యవసానము శరీరియందు ఈశ్వరుని యందే అని ఆచార్యవర్యులు నిరూపించారు. వేదాంతజ్ఞానము చేతనే జ్ఞానానికి పరిపూర్ణత్వము సిద్ధిస్తుంది. అనగా జగత్తుసర్వము బ్రహ్మాత్మకము అను జ్ఞానము కలుగు తుంది. ఈశ్వర పరిచ్ఛేదములో, తొమ్మిదవ అవతారములో, అన్ని పదములు నారాయణుని బోధిస్తవి. జగత్తంతయు నారాయణునకు శరీరము అను విషయాల నిరూపణము జరుగుతుంది. సర్వశబ్దవాచ్యుడు. సర్వశరీరాంతర్యామి నారాయణుడు అని సిద్ధాంతము. ఇట్లా శబ్దప్రమాణ నిరూపణము ముగిసినది.



శ్రీవాధూలకులతిలకుడయినట్టి శ్రీమన్మహాచార్యుని ప్రధానశిష్యుడు

శ్రీశ్రీనివాసాచార్య విరచితమయిన యతీంద్రమతదీపిక

అను శారీరకపరిభాషయందు శబ్దనిరూపణమను

మూడవ అవతారము ముగిసినది.

****

## ప్రమేయస్య ద్రవ్యాద్రవ్యేతి భేదద్వయసమర్థనమ్

**మూ:** ప్రమాణనిరూపణానన్తరం ప్రమేయం నిరూప్యతే. ప్రకర్షేణ మేయం ప్రమేయమ్. తచ్చ ద్వివిధమ్-ద్రవ్యాద్రవ్యభేదాత్. ఉపాదానం ద్రవ్యమ్. అవస్థాశ్రయ ఉపాదానమ్. నను ద్రవ్యగుణకర్మ సామాన్యవిశేష సమవాయాభావాః సప్త పదార్థా ఇతి మతాన్తరస్థైః సప్తధా పరిగణనాత్ కథం ద్రవ్యాద్రవ్య భేదేన ద్విధా సమర్థనమితి చేత్ ఉచ్యతే. ఉత్క్షే పణాపక్షేపణాకుఞ్చన ప్రసారణ గమనభేదాత్ కర్మ పఞ్చధాఽవస్థితమితి కల్పనే గౌరవాత్. చలనాత్మకం కర్మేత్యే కదైవోపపత్తేః, తస్యాపి సంయోగమాదా యైవోపపత్తేః. సంస్థానమేవ జాతిరితి సంస్థానాతిరేకేణ సామాన్యానంగీకారాత్. సమవాయే సమవాయాన్త రాఙ్గీకారేఽనవస్థానాత్, తస్యాపి సంయుక్తవిశేషణ (తయైవో) తామాదాయోపపత్తేః జీవేశ్వర యోరణుత్వవిభుత్వాది విభాజక ధర్మమన్తరేణ విశేష ఇతి కిఞ్చిత్ పదార్థాఙ్గీకారే గౌరవాత్.

అతః కర్మసామాన్య విశేష సమవాయానాం పృథక్ పదార్థత్వేనానఙ్గీ కారాచ్చ ద్రవ్యమద్రవ్యమితి ద్విధా విభాగ ఉపపద్యతే. ఏతే నాభావస్సప్తమపదార్థ ఇత్యపి నిరస్తమ్. అభావస్య భావాన్తర రూపత్వాత్. ప్రాగభావో నామ పూర్వా వస్థాపరమ్పరా. ధ్వంసఉత్తరావస్థాపరమ్పరా. అత్యన్తాన్యో న్యాభావౌ చ ధర్మ్యన్తర (గతవిశేష) స్వరూపావేవ. ఏతస్య ప్రత్యక్షేఽన్తర్భావః పూర్వముక్తః. ఉపాదానం ద్రవ్యమిత్యుక్తమ్. గుణాశ్రయో ద్రవ్యమిత్యపి సామాన్యలక్షణం భవతి.

**అ:** మొదటి మూడు అవతారములలో ప్రత్యక్షము, అనుమానము, శబ్దము అను మూడు ప్రమాణములను నిరూపించి, ఇప్పుడు ఈ నాలుగవ అవతారమున ప్రమేయముల నిరూపణ చేయడం జరుగుతున్నది. ప్రకృష్టమయిన జ్ఞానము ప్రమ. ప్రమకు విషయము అయినది తెలుసుకొనదగినది ప్రమేయము. యథార్థ జ్ఞానవిషయము అయినది తెలుసుకొనదగినది ప్రమేయము. యథార్థ జ్ఞానవిషయము. ప్రమేయత్వము అనునది సర్వపదార్థ సాధారణమయిన సామాన్య ధర్మము. మరియొక విధముగా జ్ఞానవిషయము మేయము, ఏదిప్రకృష్టమయినది



మరియు జ్ఞానవిషయ మయినది అది ప్రమేయము. ఈ ప్రమేయత్వము విశేషధర్మము. అన్నీ బాగుగ తెలుసుకోదగినవి కావు. లాభప్రద మయిన పదార్థములనే బాగుగ తెలుసుకొనవలయును. ఈ ప్రమేయము రెండు విధములు 1 ద్రవ్యము 2 అద్రవ్యము అని. ఉపాదానమునకు ద్రవ్యము అనిపేరు. అవస్థాశ్రయమునకు ఉపాదానమని వేరు. ద్రవ్యము అవస్థాశ్రయము అన్నమాట. అవస్థా అనగా ఒక ధర్మము. ఇది తనధర్మికంటే వేరుగా ఉండనిది కాని వచ్చి చేరినట్టి ధర్మము. ఉదాహరణకు-శరీరమునకు గలుగు బాల్యావస్థ, యువావస్థ బలము కలిగి యుండుట దుర్బలముగా ఉండుట, లేదా కుండకు కపాలదశ, పగిలి పోయిన పిదప ముక్కలు అయిన దశ, మొత్తము తయారు అవడము కంటే ముందు పొడి దశ మొదలయినవి.

వైశేషికాది దర్శనములలో ద్రవ్య, గుణ, కర్మ, సామాన్య, విశేష, సమ నాయ అభావాః సప్తపదార్థాః అని ప్రమేయమయిన పదార్థములను ఏడుగా నిర్ధారించారు కద. మీరుమాత్రం ద్రవ్యం అద్రవ్యము అని ప్రమేయం రెండు విధాలే నని చెప్పుతున్నారు. ఇదెట్లా సాధ్యము అంటే అన్ని పదార్థములకు రెంటిలోనే అంతర్భావము. అది ఈ విధముగా జరుగుతుంది-కర్మ ఉత్క్షేపణము, ఉపక్షేపణము, ఆకుచంచనము, ప్రసారణము, గమనము అని అయిదు విధా లుగా నిరూపించారు. అట్లా అయిదువిధాలు అని చెప్పడంలో గౌరవం ఉన్నది. చలనాత్మక మయినది కర్మ అంటేనే సరిపోతుంది కనుక. ఆ చలనాత్మక కర్మకూడ సంయోగము వలననే కలుగుతున్నది. అనగా ఒకటి ఒకదేశమునుండి కదలి ఇంకోస్థానమును పొందుతున్నది. మొదటి స్థానమునుండి విడివడుట, రెండు దేశముతో కలవడం కనుక సంయోగము కంటే భిన్నముగా కర్మను ఒప్పుకొని పనిలేదు. వైశేషికులు జాతిని సామాన్యము అని పిలుస్తారు. ప్రత్యక్షానికి విష యము అయినట్టి వస్తువుయొక్క సంస్థానమునకే జాతి అనిపేరు. రెండవమూడవ ప్రత్యక్షాల్లో సంస్థానమును జాతి అంటాము. ఒక ఆవుల గుంపును చూసినాము. అప్పుడు అన్నీకలసి సంస్థానముగా ఉంటాయి. విడిగా ఒక ఆవును చూసినప్పుడు

ఇది కూడ ఆవు గోత్వము ఉన్నందు వలన అని రెండవసారి తెలుస్తుంది. కనుక సంస్థానవిశేషమున కంటే భిన్నంగా జాతి అనేది లేదు. అది కేవలం మొదటిప్రత్యక్షం కాలంలో కనబడుతుంది. తర్వాత ప్రత్యక్షాలలో గుర్తుచేసుకో బడుతుంది. వస్తువు యొక్క అసాధారణమయిన ఆకారమునే జాతి అని అంటారని సిద్ధాంతము.

అయుతసిద్ధములు–అనగా కలిసి ఉండేవి, విడిగా ఉండనివి అయినట్టి గుణములు. గుణము కలిగినవి (గుణీ) జాతి–వ్యక్తి అవయవములు–అవయవు (అవయవములు కలిగినది) లలో సమవాయమును, వైశేషికులు ఒప్పుకుంటారు. ఇది ఒకనిత్యమయిన సంబంధముకూడ. పయిన చెప్పిన వాటిలో సమవాయము ఎట్లాఉంది అంటే సమవాయముతో, దానిలో ఆ సమవాయము సమవా యముతో అని అంతులేకుండా పోతుంది. అనవస్థా ప్రసంగము కలుగుతుంది. అంతేగాకుండ ఇంద్రియములతో సన్నికర్ష కలిగిన (సంయోగ సంబంధము కలిగిన) వస్తువుల యొక్క విశేషణముగా సమవాయముంటుంది కనుక వేరే పదార్థముగా ఒప్పుకో పనిలేదు. ఇక విశేషము అను పదార్థము సంగతి. అది కేవలం జీవులలో ఈశ్వరునిలో ఉండే అణుత్వము, విభుత్వము అను వేరుచేయు ధర్మము మాత్రమే. కనుక పదార్థముగా ఒప్పుకోనవసరము లేదు. కనుక కర్మ, సామాన్య, విశేష, సమవాయములను వేరుపదార్థములుగా ఒప్పుకొనక ద్రవ్యము అద్రవ్యము అను విభాగము చేయడము ఉపపన్నమే.

దీనితోటే అభావము ఏడవపదార్థము అనేది కూడ నిలువదు. భావము యొక్క రూపాంతరమే అభావము కద. నాలుగువిధాల అభావాలు నాలుగు అవస్థలు–దశలు అన్నమాట. ప్రాగభావము–(పుట్టుకకు) పూర్వము ఉన్నదశ–అవస్థ; ధ్వంసము–గిట్టిన తర్వాతి అవస్థ నశించినదశ; అత్యంతా భావము అన్యోన్యాభావములు–ఆ భావము యొక్క మరియొక రూపములు అవస్థలే. ఈ అభావము ప్రత్యక్షములోనే చేరుతుంది అని మొదటే నిరూపించడం జరిగినది. మొదట ద్రవ్యము యొక్క లక్షణము ఉపాదానము అని చెప్పాము. (కుండ



చేయాలంటే మట్టి ఉపాదానము, బట్ట నేయాలంటే దారములు ఉపాదానము) ద్రవ్యానికి మరోలక్షణము గుణములకు ఆశ్రయము. ఇది సామాన్య లక్షణము. (దీని వలన గ్రంథకర్త ఉపాదానము అనుదానిని ద్రవ్యానికి ప్రత్యేక లేదా విశేష లక్షణంగా చెప్పారని మనం అనుకోవచ్చును). గుణములకు ఆశ్రయము ఏదో అది ద్రవ్యము.

## ద్రవ్యవిభాగః:

**మూ:** తాని చ ద్రవ్యాణి షట్ – ప్రకృతి, కాల, శుద్ధసత్త్వ, ధర్మ భూతజ్ఞాన, జీవ, ఈశ్వరభేదాత్ తత్ర జడాజడరూపయో ర్విభక్తయోర్మధ్యే జడ లక్షణ ముచ్యతే, అమిశ్రసత్త్వరహితం జడమితి. తద్ ద్వివిధమ్– ప్రకృతి కాలభేదాత్.

**అ:** ఆ ద్రవ్యములు ఆఱు – అని 1 ప్రకృతి, 2 కాలము, 3 శుద్ధ సత్త్వము, 4 ధర్మభూతజ్ఞానము, 5 జీవుడు, 6 ఈశ్వరుడు అని. ద్రవ్యమునకు 1 జడము 2 అజడము అని మరియొక విభాగము కూడ ఉన్నది. అమిశ్రసత్త్వము లేనిది జడము. అది కాలము ప్రకృతి అని రెండు విధములు.

## ప్రకృతినిరూపణమ్ః:

**మూ:** తత్ర, సత్త్వరజస్తమోరూప గుణత్రయాశ్రయరూపా ప్రకృతిః, సా నిత్యా అక్షరా అవిద్యామాయాది శబ్దవాచ్యా చ. తస్యా భగవత్సఙ్కల్పాధీన గుణవైషమ్యాత్ కార్యోన్ముఖావస్థా అవ్యక్తశబ్దేనోచ్యతే. తస్మాన్మహాను త్పద్యతే. స మహాన్ సాత్త్విక రాజస తామసభేదాత్ త్రిధాఽవస్థితః. మహతోఽహఙ్కార ఉత్పద్యతే. సోఽపి సాత్త్వికాహఙ్కారో రాజసాహఙ్కారస్తామసాహఙ్కారశ్చేతి త్రివిధో భవతి. ఏతేషాం త్రయాణాం వైకారిక స్తైజసో భూతాదిరితి నామాన్తరాణ్యపి సమ్భవన్తి. తేషు వైకారిక ఇతి ప్రసిద్ధాత్ తైజససంజ్ఞక రాజసాహఙ్కార సహకృతాత్ సాత్త్వికాహఙ్కారాత్ ఏకాదశేన్ద్రియాణి జాయన్తే.

**అ:** జడద్రవ్యములలో ప్రధానమయినది ప్రకృతి. ఇది సత్త్వము, రజస్సు, తమస్సు అను మూడు గుణములకు ఆశ్రయము. ప్రలయావస్థయందు ప్రకృతిని

మూలప్రకృతి అంటారు. ప్రలయము ముగిసిన తరువాత భగవంతుడు సృష్టి కాముడయి ప్రకృతిలో క్షోభను కలిగిస్తాడు. అప్పుడు మూడు గుణములలో వైషమ్యము ఏర్పడుతుంది. ఆ వైషమ్యము వలననే ప్రకృతిలో కార్యోన్ముఖమయిన దశ ఏర్పడుతుంది. ఆ అవస్థకు అవ్యక్తము అనిపేరు. త్రిగుణములకు ఆశ్రయ రూపమయిన ప్రకృతియే జగత్కారణము. ఆ ప్రకృతి అది లేనిది. అంతం లేనిది. నిత్యమయినది. అందుకే ప్రకృతికి నిత్యా, అక్షరా అనిపేర్లు. అది అధ్యాత్మ జ్ఞానమునకు విరోధము కలిగించునది కనుక అవిద్యా అని పేరు కలది. నానారకము లయిన సృష్టి చేయడం వలన మాయా అని కూడ ప్రకృతికి పేరు వచ్చినది.

కార్యోన్ముఖావస్థలోనున్న అవ్యక్తప్రకృతి నుండి మహత్తు (బుద్ధి) పుడుతుంది. ఆ మహత్తు సాత్త్విక,రాజస,తామసభేదములతో మూడు విధములుగా ఉంటుంది. మూడువిధము లయిన మహత్తునుండి అహంకారము పుడుతుంది. అదికూడ సాత్త్వికాహంకారము, రాజసాహంకారము, తామసాహం కారము అని మూడువిధాలుగా ఉంటుంది. ఈ మూడు అహంకారాలకు సాత్త్వికాహంకారానికి వైకారికము. రాజసాహంకారానికి తైజసాహంకారము, తామసాహంకారానికి భూతాది అహంకారము అని కూడ పేర్లు ఉన్నాయి. రాజసాహంకారముతో (అనగా తైజసాహంకారముతో) సహకరింపబడిన వైకారికమని ప్రసిద్ధి చెందిన సాత్త్వికాహంకారము నుండి పదకొండు ఇంద్రియ ములు పుడుతున్నవి.

ప్రకృతి ⟶ గుణత్రయాశ్రయము, నిత్యా, అక్షరా, అవిద్యా, మాయా

అవ్యక్తము ⟶ కార్యోన్ముఖావస్థలోని ప్రకృతి

మహత్తు ⟶ మహాన్

అహంకారము



సాత్త్వికాహంకారము రాజసాహంకారము తామసాహంకారము

వైకారికము-అని మరియొక పేరు

ఏకాదశ ఇంద్రియములు

5 జ్ఞానేంద్రియములు, 5 కర్మేంద్రియములు 1. అంతఃకరణము,=11

ఇంద్రియములు

(సృష్టిక్రమము సాంఖ్యులది ఇట్లానే వుంటుంది.)

**ఇంద్రియనిరూపణమ్ః**

**మూః** సాత్త్వికాహఙ్కారోపాదానకం ద్రవ్యమింద్రియం, ఇతీంద్రియ లక్షణమ్. ఇంద్రియం ద్వివిధమ్-జ్ఞానేంద్రియం, కర్మేంద్రియం చేతి. జ్ఞాన ప్రసరణశక్తమింద్రియమ్ జ్ఞానేంద్రియమ్. తత్ షోఢా-మనః. శ్రోత్ర, చక్షుః, ఘ్రాణ, రసనా, త్వక్భేదాత్. స్మృత్యాది కారణమింద్రియం మనః, తచ్చ హృదయ ప్రదేశవర్తి బుద్ధ్యహంకారచిత్తాది శబ్దవాచ్యమ్. బంధమోక్ష హేతుభూతం చ శబ్దాదిపఞ్చకే శబ్దమాత్రగ్రహణశక్త మింద్రియం శ్రోత్రేంద్రియమ్. తన్మనుష్యా దీనాం శ్రవణకుహరవర్తి. ద్విజిహ్వాదీనాం నయనవర్తి. ఏవం రూపమాత్ర గ్రహణ శక్తమింద్రియం చక్షుః సర్వేషాం నయనవర్తి. గన్ధమాత్ర గ్రహణశక్త మింద్రియం ఘ్రాణేంద్రియమ్. నాసాగ్రవర్తి. గజాదేః కరాగ్రవర్తి. రసమాత్ర గ్రహణ శక్తమింద్రియమ్. రసనేంద్రియం, జిహ్వాగ్రవర్తి. స్పర్శమాత్ర గ్రహణశక్త మింద్రియం త్వగింద్రియం, సర్వశరీరవర్తి. నఖదన్తకేశాదిషు ప్రాణమాన్ద్య తారత మ్యాత్ స్పర్శానుపలమ్భః. శ్రోత్రాదీంద్రియాణాం భౌతికత్వప్రతిపాదనం భూతా ప్యాయితత్వే నౌపచారికమ్. ఏతేషాం విషయసమ్బన్ధః క్వచిత్సంయోగః. క్వచిత్సంయుక్తాశ్రయణమితి వృద్ధసంప్రదాయః.

ఉచ్చారణాదిష్వన్యతమ క్రియాశక్తత్వం కర్మేద్రియ సామాన్య లక్షణమ్. తచ్చ వాక్ పాణిపాదపాయూపస్థభేదాత్ పఞ్చధాఽవస్థితమ్. వర్ణోచ్చారణ కరణమింద్రియం వాక్. సా చ హృత్కణ్ఠజిహ్వా మూలతాలు దన్తోష్ఠ నాసా మూర్ధరూపస్థానాష్టక వర్తినీ. (మూక) మృగాదిష్వదృష్ట విరహాత్తదభావః. శిల్పకరణమింద్రియం పాణిః. స చ మనుష్యాదీనాం అఙ్గుంగల్యగ్రవర్తీ. వారణా దీనాం నాసాగ్రవర్తీ. సంచరణకరణమింద్రియం పాదః. స చ మనుష్యాదీనాం చరణవర్తీ. భుజగపతగాదీనామురః పక్షవర్తీ. మలాది త్యాగ కరణం ఇంద్రియం పాయుః. స చ తత్తదవయవవర్తీ. ఆనన్ద విశేషకరణమింద్రియముపస్థః. స చ మేహనాదివర్తీ. ఏతానీంద్రియాణ్యణూని. పరకాయప్రవేశే లోకాన్తరగమనాదిషు చ జీవేన సహ గచ్ఛన్తి.

ఇంద్రియాణాం ముక్తిదశాయాం అప్రాకృతదేశగమనాసమ్భవాదిహైవ యావత్ప్రలయం స్థితిః. కరణవిధురైరన్యైః పరిగ్రహో వా కర్మేంద్రియాణాం శరీరనాశాన్నాశ ఇతి పక్షస్తు భాష్యాదివిరోధేన హేయః. ఏతేన పురుషేంద్రియం, స్త్రీంద్రియం, ఏకేంద్రియవాదః. త్వగింద్రియైకత్వస్వీకార ఇత్యాది విమత పక్షా నిరస్తాః.

**అ:** సాత్త్వికాహంకారము ఉపాదానకారణముగా కలదానిని ఇంద్రియము అని అంటారు. అనగా ఇంద్రియము సాత్త్వికాహంకారముతో తయారు అవుతుంది అని తాత్పర్యము. పయిభాగమున రాజసాహంకారముతో సహకరింప బడిన వైకారికమను పేరుగలిగిన సాత్త్వికాహంకారమువలన పద కొండు ఇంద్రియములు పుడుతాయి అని చెప్పడం జరిగింది. ఆ అహంకారమే ఉపాదానకారణముగా గలిగినది ఇంద్రియము అని ఇంద్రియము యొక్క సామాన్యలక్షణము. ఇంద్రియములు ప్రత్యక్షమునకు విషయములు కావు మరియు అణువు పరిమాణముగా కలవి. మనకు అగుపించే కళ్ళు, ముక్కు మొదలయినవి కాక, వాటివద్ద ఉండే అణువంత ఉండేవి ఇంద్రియములు.



ఈ ఇంద్రియము జ్ఞానేంద్రియము కర్మేంద్రియము అని రెండు విధములు. జ్ఞానమును ప్రసరించటములో (కలిగించటములో) సమర్థమయినవి జ్ఞానేంద్రియములు, జ్ఞానేంద్రియములు ఆరువిధములు. 1 మనస్సు, 2 శ్రోత్రము (చెవి), 3 చక్షువు (కళ్ళు), 4 ఘ్రాణము (నాసికా), 5 రసనా (నాలుక), 6. త్వక్ (చర్మము), అని. మనస్సును జ్ఞానేంద్రియములలో ఒకటిగా నిరూపించడం జరిగినది. ఒకేసారి రెండుమూడు (ప్రత్యక్ష) జ్ఞానాలు కలుగకపోవడం, కలిగే జ్ఞానములో కూడ ఇంద్రియాలకు మనస్సుతో సహకారం లేకపోతే ఆ జ్ఞానం కలుగక పోవడం మనస్సు ఉన్నది అనడానికి కారణాలు. అంతేగాక స్మృతి మొదలయిన వాటిని సాధించునది కరణభూతమయినదీ మనస్సే. అట్లాగే బాహ్యవిషయాలను ఇంద్రియములు గ్రహించి ప్రత్యక్షము చేసినట్లు అభ్యంతరమయిన సుఖము దుఃఖము, కోపము, ద్వేషము మొదలయిన వాటిని గ్రహించి మనకు ప్రత్యక్షము చేయించునది మనస్సే, ఈ మనస్సు హృదయ ప్రదేశమున ఉంటుంది. దీనికే బుద్ధి, అహంకారము, చిత్తము మొదలయిన పేర్లు ఉన్నాయి. ఈ మనసే (సంసార) బంధానికి, మోక్షానికి కూడ కారణము. (శ్రీమద్భగవద్గీతలో–మనఏవమనుష్యాణాం కారణం బంధమోక్షయోః– అని మనస్సును గూర్చి చెప్పడం జరిగినది.) ఇట్లాగా మనస్సు ఇంద్రియము అని నిరూపించడంతో అది ఇంద్రియము కాదన్న వారివాదన వీగిపోయినది.

రూపము, రసము, గంధము, స్పర్శ, శబ్దములు– అనునవి ఐదువిషయములు. వీటిని వరుసగా నేత్ర, రసన, ఘ్రాణ, త్వక్, శ్రోతములు గ్రహిస్తవి. వీటిలో శబ్దమును మాత్రము గ్రహించుటయందు సమర్థమయినది శ్రోత్రేంద్రియము. ఈ ఇంద్రియము మనుష్యుల చెవులలో ఉంటుంది. పాములు మొదలయినవాటి నేత్రములలో ఉంటుంది (అందుకే వాటికి చక్షుః శ్రవములని పేరు కూడ ఉన్నది సంస్కృతములో) రూపమును మాత్రము గ్రహించుటలో శక్తికల్గిన ఇంద్రియము చక్షువు. అందరి నయనములలో ఉండునది. గంధమును (వాసనను) మాత్రము తెలుసుకొనుటయందు సమర్థమయినట్టి ఇంద్రియము

ఘ్రాణము, ఇది నాసిక యొక్క అగ్రభాగమున ఉంటుంది. (ఏనుగు మొదలగు వాటికి తొండము కొస ఉంటుంది) రుచినిమాత్రమే గ్రహించు శక్తిగలిగినట్టి ఇంద్రియము రసన, ఇది నాలుక పయిభాగమున ఉంటుంది తాకిడిని మాత్రము తెలుసుకొనశక్తి కల ఇంద్రియము త్వక్–ఇది శరీరము అంతట ఉంటుంది. గోళ్ళలో, పళ్ళలో, వెంట్రుకలలో ప్రాణము అతితక్కువగా ఉన్నందున వాటికి గల్గుస్పర్శ జ్ఞానము అంతంతమాత్రమే. పంచభూతములచే అదరించబడినందున ఇంద్రియములకు ఔపచారికముగా (అంటే లక్షణచేత) భౌతికత్వము ఉన్నది అని చెప్పడం జరిగినది. (బహుశః ఇంద్రియములు భూతముల వలన పుట్టినవని అర్థము కాదు, సాత్త్వికాహంకారము వలన పుట్టినవి ఇంద్రియములు కనుక – కేవలము భౌతికత్వ వ్యవహారము మాత్రమున్నదని తాత్పర్యము గాబోలును) ఇంద్రియములు విషయములను ఎట్లా గ్రహిస్తవి, వాటికి విషయములకు ఎట్టి సంబంధము ఉన్నది అను ప్రశ్నలకు జవాబు–ఇంద్రియములకు విషయములతో ఒకచోట సంయోగము, మరికొన్నిచోట్ల సంయుక్తా శ్రయణము (అనగా సంయోగముతో ఉన్నదానిని ఆశ్రయించి ఉండునది అను సంబంధము అనిభావము) అను జ్ఞానము పెద్దలవలన కలుగునది. (దీనినే న్యాయశాస్త్రములో ఆరువిధములయిన సంనికర్షల సహాయమున చెప్పుతారు. సంయోగము, సంయుక్తసమవాయము, విశేషణవిశేష్యభావము మొదలయినవి.)

కర్మేంద్రియము అనగా ఉచ్చారణము, శిల్పకరణము, సంచరణ కరణము, ఆనన్దవిశేషకరణము, త్యాగకరణము అను ఐదింటిలో ఒకక్రియను చేయగలిగినది అని (సామాన్య) లక్షణము. ఆ కర్మేంద్రియము 1 వాక్కు 2 పాణి 3 పాద 4 పాయువు 5 ఉపస్థ అని ఐదువిధములు, వర్ణములను ఉచ్చరిం చుట (లో) కు సాధకతమ మయినట్టి ఇంద్రియము వాక్కు. అది హృదయము, కంఠము, జిహ్వామూలము (నాలుక మొదటి భాగము – నాలుక కూడ) తాలు–దవడలు, ఓష్ఠములు–పెదవులు, నాసా–ముక్కు, మూర్ధ–తల, అను ఎనిమిది స్థానములలో ఉండును. (అక్షరములు ఉచ్చరించడానికి ఇవి అన్ని అవసరము. ఉచ్చరించు వాటిని అక్షరములు–నశించనివి అని లిపిబద్ధమయిన వాటిని వర్ణములు–వ్రాయడానికి ఏదయినా రంగుకావాలి కనుక వర్ణము అని అంటారు. అంటే వర్ణము నశించవచ్చును. కాని అ–క్షరము నశించదు. అందుకే బ్రహ్మకు కూడ అక్షరము అని పేరు. ఈ భేదము గమనించాలి. అ) మూగ వారిలో, మృగము మొదలయిన వాట్లలో ఇది లేదు కదా? అదృష్టము లేనందున ఈ వాగింద్రియము వారికి, వాటికి లేదు అని జవాబు. శిల్పక్రియ యందు దేనినయినా చేయడము నందు సాధకతమము అయినట్టి ఇంద్రియమునకు పాణి అనిపేరు. (కృ అనుధాతువు నుండి ఏర్పడిన కరః–సరిగా అతికినట్టుం టుంది. ఆ) అది మనుష్యుల యొక్క అరచేతులలో వేళ్ళకొనలలో ఉంటుంది. ఏనుగులు మొదలయిన వాటికి తొండము అగ్రభాగమున ఉంటుంది. (ఏనుగులు కూడా చిత్రములను గీస్తున్నట్లు ఫోటోలను మనం పత్రికలలో చూస్తున్నాము కూడ.) నడచుట తిరుగుట మొదలగు క్రియలకు సాధకతమ మయిన కర్మేంద్రియము పాదము. మానవుల కాళ్ళలో, పాములకు ఉరమున (అందుకే అవి ఉరగములు) పక్షులకు రెక్కలలో ఉంటుంది ఈ కర్మేంద్రియము. మలమును విసర్జించు క్రియయందు సాధకతకమము అయినట్టి కర్మేంద్రియము – పాయువు అనునది. ఆ యా జీవుల గుదమునందు ఉంటుంది. ఆనందమును కలిగించు క్రియయందు సాధకతమమయిన కర్మేంద్రియము ఉపస్థ. ఇది జన నేంద్రియములలో ఉంటుంది.

ఈ ఇంద్రియములు మొదట చెప్పినట్టు అత్యంత సూక్ష్మములు. ఇవి అతీంద్రియములు–ఇంద్రియములకు గోచరములు కావు. పరకాయప్రవేశము చేసినప్పుడు, మరణించిన పిదప జీవుడు మరియొక లోకమునకు వెళ్ళునప్పుడు (మరియు వచ్చునప్పుడు కూడ) ఇవి జీవుని వెంటనే వెళ్లును. (వచ్చును కూడ) ఈ ఇంద్రియములు జీవుడు ముక్తి పొందునంత వరకు అతనితో ఉండును. అనగా జీవుడు ప్రకృతిమండలములో ఉన్నంత వరకు అవి ఉండును. అతడు ముక్తుడు

కాగానే అతని ఇంద్రియములు ప్రకృతి మండలములో ఉండును. జీవుడు వైకుంఠాదిలోకములకు వెళ్ళును. ముక్తజీవులు ఇంద్రియములను ప్రకృతి మండలములోనే వదలుదురు. అవి అక్కడే ఉంటాయి లేదా అవి లేనివారు వాటిని తీసుకుంటారు. అట్లా తీసుకోనివి ప్రలయమువరకు అక్కడే ఉంటాయి. అయితే కొందరు–శరీరము నశించడంతోటే కర్మేంద్రియాలుకూడ నశిస్తవి అని చెప్తుతారు. కాని ఇది శ్రీభాష్యాదులకు విరుద్ధమయినందున వదలిపెట్టాలి.

శ్రీభాష్యంలో, బ్రహ్మసూత్రాలలో ఇంద్రియ సహకృతుడయిన జీవుడు పరలోకానికి వెళ్ళుతాడు. మళ్ళీ పుట్టి వస్తాడు అని ప్రతిపాదించడం జరిగినది. ఇట్లాగే పురుషుల స్త్రీల ఇంద్రియములు సమానముగనే ఉంటవి. నిర్మాణమే వేరువేరు. కాబట్టి, పురుషేంద్రియ వాదము, మనుష్యేంద్రియవాదము, ఏకేంద్రియవాదము, ఒక త్వగింద్రియ వాదము అనే విమత పక్షములన్నీ పయి ఇంద్రియ నిరూపణముతో తొలగిపోతాయి.

## పంచతన్మాత్రాణాం పంచభూతానాం చ నిరూపణమ్:

**మూ:** రాజసాహఙ్కారసహకృతాద్ భూతాది సంజ్ఞక తామసాహఙ్కారాత్ శబ్దాదిపంచతన్మాత్రాణి ఆకాశాది పంచమహా భూతాని చోత్పద్యన్తే. భూతానామవ్య వహిత సూక్ష్మావస్థావిశిష్టం ద్రవ్యం తన్మాత్రమ్. తదేవ భూతోపాదానమ్. విశిష్ట శబ్దాది విషయాధికరణం భూతమ్. తన్మాత్రాణి– శబ్దతన్మాత్రం, స్పర్శతన్మాత్రం, రూపతన్మాత్రం, రసతన్మాత్రం, గన్ధతన్మాత్రమితి పంచ. భూతాని చ తథా– ఆకాశం, వాయుః తేజః, ఆపః, పృథివీతి భేదాత్.

**ఆ:** పయిన అహంకారము యొక్క మూడు భేదాలు తెలుసుకున్నాము. అవి సాత్త్విక, రాజస, తామసాహంకారములు, రాజసాహంకారం తోడుపడగా భూతాది అని పేరుగల తామసాహంకారము నుండి ఐదుతన్మాత్రలు పుడుతాయి. అవి శబ్దతన్మాత్ర, స్పర్శతన్మాత్ర, రూపతన్మాత్ర, రసతన్మాత్ర, మరియు గంధ తన్మాత్రలు. అట్లాగే ఆకాశము, వాయువు, తేజస్సు, నీరు, పృథివి అని ఐదు



మహాభూతములు కూడ పుడుతవి. భూతముల ఉత్పత్తి కంటే అవ్యవహితముగా పూర్వక్షణమున భూతములుగా మారబోయే ద్రవ్యమునకు ఒకసూక్ష్మమయిన అవస్థ ఉంటుంది. అట్టి దశ అవస్థ కల ద్రవ్యమే తన్మాత్ర. ఈ తన్మాత్రయే ఉపాదానకారణముగా పుట్టేవి పంచభూతములు. తన్మాత్ర అవస్థలో శబ్దాది గుణములు శాంతము, ఘోరము, మూఢత్వము అను విశేషణములు లేకుండా ఉంటాయి. భూతావస్థ కలుగగనే ఈ గుణములు ఆ విశేషములను – ఘోరము, మూఢము, శాంతము అను వాటిని పొందుతవి. అట్టి విశేషాలతో కూడిన శబ్దాదివిషయములకు ఆశ్రయము లయిన వాటిని భూతములు అని అంటారు. తన్మాత్రలో శబ్దాది గుణములు నిర్విశేషముగా ఉంటాయి. భూతావస్థలో సవిశేషముగా ఉంటాయి. పాలు పెరుగుగా మారే దశకు ముందు కలిలావస్థగా పరిణామము చెందుతాయి. పిదప పెరుగుగా పరిణామము చెందుతాయి. అదేవిధముగా తామసాహంకారము భూతాదులుగా పరిణామం చెందడానికి ముందుండే అవస్థనే తన్మాత్రావస్థ. పిదప భూతములుగా పరిణామము చెందుతాయి. కలిలము అనగా చొరరానిది ఎరుగరానిదని అర్థము.

## ఆకాశనిరూపణమ్:

**మూ:** తత్ర తామసాహంకారాకాశయో ర్మధ్యమావస్థావిశిష్టం ద్రవ్యం శబ్దతన్మాత్రమ్. క్షీర దధ్నోరన్తరా (లే కలిల) లపరిణామవత్. తస్మాదాకాశో జాయతే, అస్పర్శవత్త్వే సతి విశిష్టశబ్దాధారత్వమ్ శ్రోత్రాప్యాయకత్వం చ ఆకాశలక్షణమ్. స చ శబ్దమాత్రగుణక అవకాశహేతుః నీలం నభ ఇతి ప్రతీతేః ప్రత్యక్షః. పంచీకరణప్రక్రియయా చ సావయవో రూపవాన్. ఏతేనాకాశస్య అభిన్నత్వనిరాసః. సూర్యపరిస్పంద యుక్తాకాశస్యైవ (సూర్యపరిస్పన్దాదిభి రాకాశ స్యైవ) ప్రాచ్యాది వ్యవహారోపపత్తౌ దిగితి న పృథగ్ ద్రవ్యకల్పనమ్, దిక్సృష్టిస్తు అన్తరిక్షాది సృష్టివదుపపద్యతే.

**అ:** ఆ తన్మాత్రల సృష్టిలో కూడ తామసాహంకారము మరియు ఆకాశమునకు మధ్యనగల అవస్థ కలిగిన ద్రవ్యమునకు శబ్దతన్మాత్రము అనిపేరు.

క్షీరము దధిగా పరణమిస్తుంది. దానికంటె ముందు క్షీరములో ఒక తెలియరాని అవస్థ ఉంటుంది. దాని పేరు కలిలావస్థా. పిదప ఆ క్షీరము దధిగా మారుతుంది. అట్లాగే తామసాహంకారము మరియు ఆకాశము యొక్క మధ్యన కల అవస్థకే శబ్దతన్మాత్ర అనిపేరు. ఆ శబ్దతన్మాత్రనుండియే ఆకాశము పుడుతుంది.

సాంఖ్యమతము ప్రకారము – తామసాహంకారము తరువాత పంచ తన్మాత్రలు పుడుతాయి. ఆ తన్మాత్రల వలన ఆకాశాదులు పుడుతాయి. శబ్దతన్మాత్రనుండి ఆకాశము. శబ్దతన్మాత్రసహకృతమయిన స్పర్శతన్మాత్రతో వాయువు, ఇట్లాగ పూర్వపూర్వతన్మాత్ర సహకృత మయిన ఆ యా తన్మాత్రలతో ఆ యా భూతముల ఉత్పత్తి జరుగుతుంది. ఇది ఆకాశాద్ వాయుః వాయో రగ్నిః ఇత్యాది శ్రుతివాక్యవిరుద్ధము గావున పయిన చెప్పిన సృష్టిక్రమమే సక్రమము.

ఇక ఆకాశము యొక్క లక్షణము – స్పర్శలేనిది విశిష్టమయిన శబ్దము నకు ఆశ్రయమయినట్టిది శబ్దము. శాంతత్వము, ఘోరత్వము, మూఢత్వము అనునవి విశేషములు–అని కలిగినది విశిష్టము. మరియొక లక్షణము – శ్రోత్రము అను ఇంద్రియమును పోషించునది అని. ఆకాశంలో శబ్దము అనే గుణం ఒక్కటే ఉంటుంది. మరియు ఇతరములకు అవకాశము చొరడానికి వీలు కల్పిస్తుంది. (ప్రకృతి మొదలయిన ప్రదేశాలు కూడ అవకాశమును కలిగిస్తాయి. స్పర్శ కలిగిన పదార్థాలు కూడ వాటినుండి రాకపోకలు సాగిస్తాయి. లేకుంటే భూతసూక్ష్మము కలిగిన మోక్షాధికారులు వాటిని దాటి పోవడం అసంభవము అవుతుంది.)

ఆకాశంలో శబ్దము ఒకటే గుణం అన్నారు. మరి ఆకాశం నీలంగా ఉంది అని రూపప్రత్యక్షము కలుగుతుంది కద, దీనిని ఒప్పుకోవాల్సిందే. ఎందుకంటే పంచీకరణమువలన రూపము కూడ ఆకాశంలో ఉన్నట్టే రూపం కలది ప్రత్యక్షం అవుతుంది. అంతే గాదు సావయవము కూడ. దీనివలన ఆకాశము నిత్యము అనేవాదన తొలగిపోతుంది. ఆకాశము కూడ జన్యము అని



సిద్ధాంతము. అంతేగాదు దిక్కు అనే ద్రవ్యాన్ని వేరుగా ఒప్పుకోవలసిన అవసరము కూడ లేదు. సూర్యుడు ఉదయించినప్పుడు అతనికి ఎదురుగా నిలబడితే ఉన్న దిక్కు తూర్పు. కుడిచేతివయిపు ఉన్న ఆకాశము దక్షిణము. ఇట్లా దిక్కులు ఏర్పడుతున్నాయి. సూర్యుడు లేకుంటే దిక్కులు కూడ తెలుసు కొనలేవు. దీని బట్టి సూర్యుని ఉదయాస్తమయాలు జరిగే ఆకాశాన్ని బట్టే తూర్పు, పడమర మొదలయినవి ఆ యా ఆకాశాలకు ప్రాంతాలకు మూర్తపదార్థములకు ఏర్పడతాయి. ఆకాశానికంటే విడిగా దిక్కులు ఏవీ లేవు–అవి ద్రవ్యములు కావు. దిశఃశ్రోత్రాత్ అని శ్రుతివాక్యవిరుద్ధము కదా ఈ విషయము అంటే కాదు. ఆకాశము కంటే భిన్నముగా అంతరిక్షములేకున్నా అంతరిక్షము సృష్టికి విరోధము లేనట్టే, ఆకాశము కంటే వేరుగా దిక్కులు లేకున్నా, శ్రుతి విరోధము లేనట్టే చెప్పుకోవాలి.

## వాయునిరూపణమ్:

**మూ:** ఆకాశాత్ స్పర్శతన్మాత్రమ్. ఆకాశవాయ్వోర్మధ్యమావస్థా విశిష్టం ద్రవ్యం స్పర్శతన్మాత్రమ్. తస్మాద్ వాయుః. విశిష్ట స్పర్శవత్త్వే సతి రూపశూన్యత్వం అస్మదాది స్పర్శనైకేంద్రియ గ్రాహ్యద్రవ్యత్వమ్, అనుష్ణాశీతస్పర్శవత్త్వే సతి రూప శూన్యత్వ మిత్యాదికం వాయోర్లక్షణమ్. తస్మిన్ నానాసలిలాతపకుసుమాది (ద్యవయవ) యోగాత్ శీతోష్ణసౌరభాదివ్యపదేశః. స చ త్వగింద్రియాప్యాయ కత్వేనోపకరోతి. శబ్దస్పర్శౌ గుణౌ తత్ర శరీరధారణాదిహేతు ర్వాయువిశేషః ప్రాణః స చ పంచ ప్రకారః. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన భేదాత్. హృది ప్రాణః, గుదే అపానః, సర్వ శరీరగో వ్యానః, కణ్ఠే ఉదానః, నాభిదేశే సమానః, ఇతి నియమో జఙ్గమేష్వేవ. స్థావరేషు తు ప్రాణసమ్బన్ధః స్వల్ప ఏవ. వాయోః స్పార్శనప్రత్యక్షత్వేనానుమేయవాదనిరాసః.

**అ:** ఆకాశమునుండి స్పర్శ తన్మాత్రము. ఈ తన్మాత్రము ఆకాశము మరియు వాయువుల మధ్యమ అవస్థతో కూడినట్టి ద్రవ్యము. ఈ తన్మాత్రనుండి

వాయువు పుడుతుంది. ఇక వాయువు లక్షణము. ఒకటి గాదు మూడులక్షణాలు– ఏ ద్రవ్యము శాంతత్వము, ఘోరత్వము, మూఢత్వము కల్గిన స్పర్శకు ఆశ్రయమో మరియు రూపము లేనిదో అది వాయువు. ఇది ప్రధానమయిన లక్షణము. ఆకాశాదుల్లో అతివ్యాప్తి తొలగించడానికి స్పర్శవత్త్వము అని లక్షణంలో చేర్చడం జరిగింది. స్పర్శ ఆకాశాదుల్లో లేనందున ఈ లక్షణము అక్కడ ప్రసక్తము కాదన్నమాట. విశిష్ట అను పదముతో స్పర్శతన్మాత్రలో ఈ లక్షణప్రసక్తి తొలగి పోతుంది. ఆ తన్మాత్రలో సూక్ష్మస్పర్శనే ఉంటుంది కనుక.

తేజస్సు మొదలయిన వాటిలో రాబోయే అతివ్యాప్తిని నివారించడానికి రూపశూన్యత్వము అనే విశేషణము. తేజస్సులో రూపమున్నందున అతివ్యాప్తి రాదు. ఇక రెండవలక్షణము మనయొక్క త్వగింద్రియము మాత్రముచేతనే గ్రహింపబడునది వాయువు అని. మూడవది రూపము లేక అనుష్ణము అశీతము అయిన స్పర్శగలది వాయువు అని. ఆ గాలి పలువిధాల నీరు, ఎండ, పూలు, కలియడంచేత వాటిమీదుగా వీచడం చేత, చల్లనిగాలి, వేడిగాలి, సువాసనగాలి– మలయమారుతము మొదలయిన వ్యవహారము వాయువునకు కలుగుతుంది. ఆ వాయువు మన త్వగింద్రియమును పోషిస్తూ మనకు చాలా ఉపకరిస్తుం టుంది. ఆ వాయువునకు శబ్దము, స్పర్శ అను రెండుగుణము లున్నాయి. (వైశేషికము ప్రకారము స్పర్శ ఒకటే గుణము.) మనము శరీరము ధరించి ఉండుటకు కారణభూతమయిన వాయువిశేషము ప్రాణము.

కేవలము శరీరధారణమునకు హేతువయినట్టి వాయువే ప్రాణముకాని అన్నివాయువులు కాదు. కనుకనే విశేషశబ్దము ఆ విషయమునే తెలుపును. అన్నివాయువులు ప్రాణములు కాదు. ఉచ్ఛ్వాస నిఃశ్వాసలు అను క్రియలు కూడ వాయువు పేర్లు. అవి కూడ ప్రాణము కాదు. విశేషమయిన వాయువే ప్రాణము. ఈ ప్రాణము అను వాయువు అయిదు విధాలు (అందుకే మనం పంచప్రాణాలు అనడం, ప్రాణాలకు బహువచనం కూడ) బ్రహ్మసూత్రముల ప్రకారము పరమాత్ముని నుండి ప్రాణము, మనస్సు, సర్వేంద్రియములు, వాయువు, జ్యోతి,



నీరు, పృథివి అన్నీ పుట్టాయి అనే విషయాన్ని న వాయుక్రియే పృథగుపదేశాత్ 2–4–8 లో నిరూపించబడినది. ఈ ప్రాణము అను వాయువిశేషము–ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము అని అయిదు విధాలుగా ఉంటుంది. హృదయములో ప్రాణము, గుదమున అపానము, శరీరమంతా వ్యానము, కంఠమున ఉదానము, నాభిలో సమానము ఉంటాయి. ఈ విషయము–ఆ యా స్థానములలో ఆ యా ప్రాణము అను నియమము– జంగమముల గురించియే కాని స్థావరముల గురించి కాదు. ఎందుకంటే స్థావరములలో ప్రాణముతో సంబంధము కొద్దిగనే యుండును. వాయువు స్పర్శ అను ప్రత్యక్షముతో తెలుసుకో దగినందున ప్రాచీన నైయా యికులు చెప్పినట్టు, వాయువు అనుమానంతోనే తెలుసుకో దగినది–అనే వాదన వీగిపోతుంది. వారి ప్రకారము త్వగింద్రియము రూపము కలిగిన ఘటాదులకే ప్రత్యక్షయోగ్యతగాని, రూపరహితమయిన వాయువుకు త్వగింద్రియ ప్రత్యక్ష యోగ్యత లేదు. అయితే అనుమాన ప్రమాణం తెలియని వారికి, మిగత అందరికి కూడ త్వగింద్రియము యొక్క సన్నికర్షతో వాయువున్నట్లు ప్రత్యక్షమే అవుతున్నది. అనుమానావశ్యకత లేదు.

## తేజోనిరూపణమ్ :

**మూ:** వాయు తేజసోర్మధ్యమావస్థావిశిష్టం ద్రవ్యం రూపతన్మాత్రమ్. తస్మాత్తేజః. ఉష్ణస్పర్శవత్త్వం భాస్వరరూపవత్త్వాదికం తు తేజసో లక్షణమ్. తస్య బహిః పచనాది హేతుత్వమగ్ని సూర్యాత్మనా అన్తర్వైశ్వానరసంజ్ఞక జఠరాగ్ని రూపేణ. దివాభీతాది వ్యతిరిక్తానాం చాక్షుషజ్ఞానే ఆలోకద్వారా సహకారి చ భవతి. తచ్చతుర్ధా–భౌమం, దివ్య, ముదర్యం, ఆకరజం చేతి. తత్ర పార్థివమా త్రేన్ధనం తేజో భౌమం దీపాది. జలమాత్రేన్ధనం దివ్యం సూర్యాది. జలపార్థి వేన్ధనం ఉదర్యం జాఠ (రం) రాది. నిరిన్ధనం తేజ ఆకరజలసువర్ణాది. సువర్ణస్య ద్రవ్యాన్తరసంసర్గా దుష్ణస్పర్శాభావః. పునస్సామాన్యేన ప్రభా ప్రభావాంశ్చేతి

విభక్తమ్. అపరణసద్భావాధీన సజ్కోచ వికాస ప్రసారి తేజోవిశేషః ప్రభా. సా చ ప్రభావద్భిః సహోత్పద్యతే సహ నశ్యతి. ద్రవ్యరూపా గుణభూతా సావయవా చ. అనేన ప్రభాయాః కేవల గుణత్వమతనిరాసః. ప్రభావిశిష్టం తేజః ప్రభావత్, తచ్చతుర్విధమితి ప్రతిపాదితమ్. తత్తేజః శబ్దస్పర్శరూపగుణవచ్చ.

**అ:** వాయువు మరియు తేజస్సు మధ్యలో ఉండే సూక్ష్మవస్థ. దానితో కూడిన ద్రవ్యమునకే రూపతన్మాత్ర అనిపేరు. రూపతన్మాత్ర నుండి తేజస్సు పుదుతుంది. వాయోరగ్నిః అను శ్రుతిని అనుసరించి కూడ తేజస్సు యొక్క ఉపాదానకారణము వాయువే.

ఒక్క వైశేషికులు పార్థివ పదార్థములను అగ్నికి ఉపాదానకారణముగా, వాయువును నిమిత్తకారణముగా ప్రతిపాదిస్తారు. ఆకులు, గడ్డి, కట్టె మొదలయిన పార్థివ పదార్థాలతో అగ్ని పుడుతుంది. వాయువుతో రాజుకుంటుంది. పెరుగు తుంది. (తక్కువపరిమాణంలో ఉంటే అగ్ని వాయువుతో ఆరిపోతుంది కూడ.) శ్రుతి తాత్పర్యము నిమిత్తకారణమనియే వారు చెప్పుతారు. కాని గ్రంథకర్త విశిష్టాద్వైతులు, ఆ శ్రుతి అంతా ఉపాదాన కారణాలగురించి చెప్పుతున్నందున వాయువే ఉపాదానము అంటారు. ఈ ఉపాదానము అగుట అనన్యథాసిద్ధము కూడ. సిద్ధము–తయారగునది, అయినది, అన్యథా మరిదేనితోనయినా అట్లా కానిది. న అన్యథాసిద్ధము అనన్యథాసిద్ధము. అంతే గాక వీటిలయమును తెలుపు శ్రుతి, 'తేజో వాయౌ లీయతే' అని చెప్పినందున వలన కూడ. వాయువే ఉపాదానకారణము. సముద్రములో ఉండే బడబాగ్నికి, మేఘాల్లో ఉండే విద్యుత్తుకు ఉపాదానకారణము పార్థివము కాదు కద.

అన్నిటిని ఉపాదానముగా ఒప్పుకోలేము. కట్టె మొదలయిన వాటిల్లో పంచీకరణ ప్రక్రియద్వారా తేజస్సు ఉంటుంది కనుక సహకారికారణాలు కలువగనే వ్యక్తమవుతుంది. ఇక తేజస్సులక్షణము ఉష్ణస్పర్శ కలది యై ఉండుట, భాస్వర రూపము కలిగి యుండుట. తేజస్సు ఏ రూపముతో కలిసి తనతోబాటు



ఇతరములయిన వస్తువులను ప్రకాశింపజేస్తుందో ఆ రూపమునకే భాస్వర రూపము అనిపేరు. ఈ భాస్వరూపము తోటే అన్ని వస్తువులను పదార్థాలను కనబడేట్టు చేస్తుంది తేజస్సు. ఈ తేజస్సే, అగ్ని, తేజస్సు రూపముతో వెలుపల ఉండి పదార్థములను పండింప (వండింపకూడ) చేస్తుంది. మనకడుపులోని అగ్నిరూపమున తిన్న తాగిన వాటిని పచనము చేస్తుంది. ఒక్క గుడ్లగూబలకు పగలు తప్ప మిగత అందరికి (గుడ్లగూబలకు రాత్రి మాత్రము) ఆ యా వస్తువులను కళ్ళతో చూసి చాక్షుషజ్ఞానము పొందుటకు కాంతిద్వారా సహాయకారిగా ఉంటుంది తేజస్సు. (దివాంధము అంటే పగలు గుడ్డి–గుడ్లగూబ).

అట్టి తేజస్సు నాలుగు విధాలుగా ఉంటుంది – భౌమము, దివ్యము, ఉదర్యము, ఆకరజము అని. భూమికి చెందినది పార్థివపదార్థములు ఇంధన ములుగా కలది. భౌమము–దీపము మొదలయినవి. ఇక దివ్యము– సూర్యుడు మొదలయినవి. చంద్రుడు, నక్షత్రాలు, విద్యుత్తు మొదలుకొని అన్ని దివ్యము. దివ్యము–ఆకాశములో కలుగునవి. దివ్యము వీటికి జలము మాత్రమే ఇంధనము. ఉదర్యము–ఉదరములోనుండు తేజస్సు. దీనికే జఠరాగ్ని అనిపేరు. కడుపులో ఏ పదార్థమూ లేకుంటే–మండిపోతున్నది, కాలిపోతున్నది అని అంటూ ఉంటాము. అగ్ని తేజస్సు ఉన్నందు వలననే. దీనికి జలము, పార్థివ పదార్థములు రెండు ఇంధనము.

ఇక మూడవది ఆకరము–ఖని–గని, లో పుట్టినది ఆకరజము సువర్ణము, రజతము మొదలయినవి. వీటికి ఎట్టి ఇంధనము ఉండదు. మిగత తేజస్సులన్నిటికి ఉష్ణస్పర్శ ఉంది కద మరిదీనికి ఆకరజమునకు లేదేమి? సువర్ణ ములో మరియొకద్రవ్యముతో సంబంధమున్నది కనుక వేడి లేదు. అంతేకాదు, స్వేతరవస్తుప్రకాశమయిన ధర్మము అయిన భాస్వరతేజస్సు కూడ స్పష్టముగా లేదు. బంగారము మరియొకదానిని ప్రకాశింపజేయలేదు. ఈ తేజస్సును మరియొక విధముగా కూడ. కాంతి, కాంతిమత్తు (కలది–మతుప్ప్రత్యయము).

అని విభజించవచ్చును. దీపము, మణులు మొదలగువాటి యొక్క ప్రభ. అవి ప్రభ కలవి. ఈ ప్రభ ఆవరణము ఉన్నచో తక్కువగా ఉండును, ఆవరణము తొలగిపోతే ఎక్కువగా అగును. మరియు ఇది ప్రసరించే గుణము కలది. ఈ ప్రభ కాంతికలవాటితో పుడుతుంది. వాటితో పాటు నశిస్తుంది. ఉదాహరణము దీపపుకాంతి. దీపంతో వస్తుంది. ఆరిపోతే పోతుంది. ఈ కాంతి అనునది కాంతి గల ద్రవ్యమున కంటే వేరుగా ఉండనిది, వాటికి విశేషణము అయినట్టిది. తన ఆశ్రయంకంటే విడిగా ఉండదు, ఉండలేదు. కనుక ఇది గుణము. ఇది ద్రవ్య రూపమయినది కూడ. ఎందుకంటే దీనిలో క్రియకూడ ఉన్నది. ఉష్ణస్పర్శ ఉన్నందున తేజోద్రవ్యము. ఇది అవయవములతో కూడినది. కొందరు చెప్పినట్లుగా ఇది కేవలము గుణము అనునది ద్రవ్యత్వ నిరూపణముతో తొలగి పోతుంది. ప్రభతో కూడిన తేజస్సు ప్రభావత్. పైనచెప్పినట్లు ప్రభావద్ ద్రవ్యము, దివ్యము, ఆకరజము, భౌమము, ఔదర్యము అని నాలుగు విధములు. ఈ తేజస్సులో మూడు గుణములు ఉంటవి–అవి శబ్దము, స్పర్శ మరియు రూపము.

## అపాం నిరూపణమ్:

**మూ:** తేజస్సలిలయోర్మధ్యమావస్థా విశిష్టం ద్రవ్యం రసతన్మాత్రమ్. తస్మాదాపః. శీతస్పర్శవత్త్వం నిర్గంధత్వే సతి విశిష్ట రసవత్త్వమిత్యాది అపాం లక్షణమ్. తాసాం శుక్ల మధురశీతైక స్వభావానాం ఆశ్రయాది సంసర్గ భేదాత్ రూపస్పర్శ వైచిత్ర్యారోపః. తాః సముద్రసరిదాదిరూపేణ బహుప్రకారాః. శబ్దస్పర్శ రూపరసగుణాశ్చ. సేచన పిణ్డీకరణాదిహేతవశ్చ.

**అ:** తేజస్సు జలముగా పరిణతి చెందకమునుపు, తేజస్సు మరియు జలము యొక్క మధ్య ఉండే సూక్ష్మావస్థతో కూడిన ద్రవ్యమును రసతన్మాత్ర అంటారు. ఆ రసతన్మాత్ర నుండి జలము పుడుతుంది. చల్లని స్పర్శ గలిగి ఉండటం జలము యొక్క లక్షణము. గంధము లేకపోవుట శాంతము, ఘోరము, మూఢము, అను విశేషణములు కలిగిన రసము కలిగియుండుట



అనునది రెండవలక్షణము. సహజముగా జలము తెల్లగా, తియ్యగా చల్లగా ఉంటుంది. జలము ఉండే ఆశ్రయాన్ని సంబంధాన్ని బట్టి రూపంలో, స్పర్శలో, రసంలో భేదము కలుగుతుంది. విచిత్రంగా మారుతుంటుంది. నలుపు, వేడి, చేదు, ఉప్పు, మొదలయిన విచిత్రాలు రూపరసస్పర్శలలో ఏర్పడుతుంటాయి. ఆ జలము, సముద్రము, నది మొదలగు రూపాల్లో పలువిధాలుగా ఉంటుంది. జలములో నాలుగు గుణాలుంటాయి. అవి శబ్దము, స్పర్శ, రూపము మరియు రసము. జలము ద్వారానే ఏ వస్తువునయినా తడపవచ్చును. మెత్తగా చేయవచ్చును.

## పృథివీ నిరూపణమ్ :

**మూ:** అప్పృథివ్యోర్మధ్యావస్థావిశిష్టం ద్రవ్యం గన్ధతన్మాత్రమ్. తస్మాత్ పృథివీ. విశిష్టగన్ధవత్త్వమ్ రసవత్త్వే సతి అనుష్ణాశీత సర్శవత్త్వమిత్యాది పృథివీలక్షణమ్. సా సురభిర్మధురా కృష్ణ రూపానుష్ణాశీతస్పర్శవతీ. పాకభేదాత్ (పాకజ భేదాత్తు) విచిత్రవర్ణగన్ధరసా చ. మనో ఘ్రాణాప్యాయ కత్వేనోపకరోతి. మృత్పాషాణాన్నౌషధాది బహుప్రకారవతీ. శబ్ద స్పర్శరూప రసగన్ధగుణకా ధారణ హేతుశ్చ. తమసః పృథివ్యామన్తర్భావః తద్గుణకత్వాత్ తదవస్థాన్తరత్వాద్వా. అతఏవ అలోకాభావమాత్రం తమః స ద్రవ్యాన్తరమిత్యాదిపక్షాః నిరస్తాః.

**అ:** జలము పృథివిగా పరిణతి చెందక మునుపు రెండింటి మధ్యన ఉండే సూక్ష్మావస్థతో కూడిన ద్రవ్యమును గంధతన్మాత్ర అంటారు. ఆ తన్మాత్ర నుండి పృథివి పుడుతుంది. శాంతము, ఘోరము, మూఢము అను విశేష ణములతో గూడిన గంధమునకు ఆశ్రయము అగుట పృథివి మొదటి లక్షణము. విశిష్టమయిన గంధము కలిగియుండుట. రసమును కలిగిఉంటూ అనుష్ణాశీత సర్శను కలిగిఉండటము కూడ పృథివీలక్షణము, అనగా పృథివిలో విశిష్టమయిన గంధము ఉన్నది. రసము ఉన్నది, వేడికాని చల్లనిదికాని స్పర్శ ఉన్నది. పృథివిలో సుగంధము, మధురరసము, కృష్ణరూపము, అనుష్ణాశీతస్పర్శము ఉన్నపాకము

యొక్క భేదముచేత రూపరసగంధములు విచిత్రములుగా మారుతుం టాయి. ఈ పృథివి మనస్సును, ఘ్రాణేంద్రియమును తృప్తిపరుస్తుంది.

ఇక ఈ పృథివి మట్టి, అన్నము, రాళ్ళు, వృక్షాలు మొదలయిన అనేక విధాలుగా ఉంటుంది. దీనిలో శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము అను అయిదు గుణాలున్నాయి. విశిష్టాద్వైతమున తమస్సు అనేది వేరు ద్రవ్యము కాదు. పృథివిలోనే చేరుతుంది. పృథివి యొక్క గుణమయినా కావచ్చును. లేదా దానియొక్క మరియొక రూపము కావచ్చును. వైశేషికులు తేజస్సు లేకపోవడం ఆలోకాభావము, తేజస్సు అని అభావరూపముగా ఒప్పుకున్నారు.

మరికొందరు రూపము యొక్క జ్ఞానము లేకపోవడం (కలుగక పోవడను గాని) తమస్సు అని అన్నారు. మరికొందరు, ఆకాశంలో వ్యాపించిన పరమాణువుల్లో ఉండే నీలరూపం యొక్క ప్రతీతినే తమస్సు అన్నారు. ఈ మూడు అభిప్రాయాలు సరి గావు. మొదటిది అభావరూపము. కాని అంధకారము అంధకారముగా తెలుస్తున్నది. భావపదార్థమే కనుక పృథివిగా ఒప్పుకోవాలి. ద్రవ్యముగా కూడ ఒప్పుకోవాలి. కళ్ళు ప్రకాశం లేనప్పుడు అంధకారాన్ని ప్రత్యక్షం చేస్తున్నాయి. ప్రకాశం లేకపోవడాన్ని కూడ కళ్ళు ప్రత్యక్షం చేస్తున్నాయి కనుక ద్రవ్యంగా ఒప్పుకోవాలి. తమస్సును గూర్చి ఇతరుల అభిప్రాయములు పృథివీనిరూపణముతో వీగిపోయినవి.

## పంచీకరణప్రక్రియా నిరూపణమ్:

**మూ:** భూతేషు సర్వత్ర పంచీకరణప్రక్రియయా శబ్దాదీనాం గుణానాముపలమ్భః. పంచీకరణ ప్రక్రియా తు. భగవాన్ భూతాని సృష్ట్వా ఏకైక మేవ భూతం ద్విధా కృత్వా ద్వయోః భాగయోః స్వభాగమేకం నిధాయ భాగాన్తరం చతుర్ధా కరోతి. తాన్ చతుర్భాగాన్ భూతాన్తరేషు చతుర్షు యోజయతి ఏవం సర్వేషు భూతేషు క్రియమాణేషు ఏకైకస్య భూతస్య అర్ధం స్వభాగః. అర్ధా న్తరం చతుర్ణాం భూతానాం భాగసముచ్చయో భవతి. తథా చ



స్వభాగస్య భూయస్త్వాత్, పరభాగస్య అల్పీయస్త్వాచ్చ పృథివ్యాది వ్యపదేశః. వేదే త్రివృత్కరణోపదేశస్తు పంచీకరణస్యాప్యుపలక్షణమ్. భూతైస్సాకం మహద హఙ్కారౌ మిలిత్వా సప్తీకరణ మిత్యాహుః. ఏతేషు చతుర్వింశతి సంఖ్యాకేషు పంచభూతాని ప్రకృతి మహద హఙ్కారాశ్చ శరీరోపాదానాని. ఏకాదశేంద్రియాణి ప్రత్యేకమ సంఖ్యాతాని ప్రతిపురుషం భిన్నాని ఆ భరణార్పితరత్నానీవ శరీరమాక్రమ్య తిష్ఠన్తి.

**అ:** పంచీకరణము అను ప్రక్రియద్వార అన్ని భూతములలో శబ్దము మొదలయిన గుణములు ఉంటుంటవి. పంచ అంటే అయిదు. అయిదు కానిది అపంచ. అయిదుకాని దాన్ని అయిదుగా చేయడము పంచీకరణము. (ఈ ప్రత్యయమును వ్యాకరణములో 'అభూతతద్భావే చ్వి:' అంటారు. సఫలీకృతులు, విపులీకరించు, సమీకరించు మొదలయినవి ఉదాహరణాలు.) భగవంతుడు సృష్టి ప్రారంభమున భూతములను సృష్టించాడు. వాటిలో ఒక్కొక్కదానిని రెండుగా విభజించి ఒక భాగమును దానిలో ఉంచాడు. రెండవభాగములో నాల్గు భాగములు చేసాడు. ఒక్కొక్కభాగాన్ని మిగతా నాలుగు భూతాలలో చేర్చాడు. పృథివి: తేజస్సు, జలము, వాయువు, ఆకాశం, ఈ విధముగా అన్ని భూతాలలో సగభాగము ఆ భూతముది. మిగతానాలుగు భాగాలు (కలసి మిగతసగం అని చెప్పుకున్నాము) మిగత భూతాలవి. ఇట్లా అన్ని భూతాల్లో అన్ని భూతాల భాగాలు ఉంటాయి.

అయితే మరి పృథివి, జలము అని వేర్వేరు పేరులు ఎందుకు? ఒక దానిని ఒకేపేరుతోనే ఎందుకు పిలవాలి? మొత్తం సగంభాగం దేనిది ఉంటే ఆ పేరుతో పిలువడం జరుగుతున్నది. పృథివి–అంటే దీనిలో ఒక సగం పృథివి, మిగిలిన సగంభాగంలో 1/8వంతు మిగతనాలుగు భూతాలు ఉన్నవి అని పంచీకరణము యొక్క అభిప్రాయము. మరి అయితే ఛాందోగ్యోపనిషత్తులో 'తాసాం త్రివృతం త్రివృతమేకైకాం కరవాణి' అని త్రివృత్ కరణమ్ చెప్పబడినది

కదా! అది పంచీకరణానికి ఉపలక్షణము. (లక్షణమునకు సమీపముగా ఉన్నది ఉపలక్షణము. మూడింటికి చెప్పినను ఐదింటికి చెప్పినట్లు అనిభావము. అందుకే కొందరు పంచీకరణము నాధారముగా సప్తీకరణము అని కూడ చెప్పినారు.)

మహత్తు, అహంకారము కలిస్తే సప్తీకరణము అనికూడ చెప్పేశారు. ప్రకృతి యొక్క ఇరువది నాలుగు తత్త్వములలో పంచభూతములు ప్రకృతి, మహత్తు, అహంకారము అనునవి ఎనిమిది శరీరమునకు ఉపాదాన కారణ ములు. ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు, మనస్సు అను పద కొండు ఒక్కొక్క జీవునికి వేరు వేరుగా ఆవిధంగా లెక్కలేనన్ని మొత్తం మీద ఉంటాయి. ఆభరణములలో రత్నములు పొదుగబడి ఉన్నట్లుగా ఆ పదకొండు అతికినట్లు ఉంటాయి. శరీరోపాదాన కారణములయిన ఎనిమిది తత్త్వములకంటే భిన్నమయిన మిగతా పదహారుతత్త్వములు వికారముల వంటివి.

## శరీరలక్షణమ్:

శరీరం నామ చేతనం ప్రతి ఆధేయత్వ, విధేయత్వ, శేషత్వనియమైర పృథక్సిద్ధో ద్రవ్యవిశేష ఇత్యేకం లక్షణమ్. నియమేన యదాధేయం, నియమేన యద్విధేయం, నియమేన యచ్ఛేషం తదితి లక్షణత్రయం వా యోజ్యమ్. ఈశ్వర తజ్జ్ఞానవ్యతిరిక్త ద్రవ్యమితి వా తటస్థలక్షణమ్. ఏతేన చేష్టాశ్రయః శరీరమ్. ఇంద్రియాశ్రయః శరీరమ్. భోగాయతనం శరీరమ్. శిరః పాణి పాదాదిమయం శరీరం. ఇత్యాదీని పరోక్తాని శరీరలక్షణాని నిరస్తాని.

**అ:** తన ఆశ్రయమైన ప్రాణము (చేతనము) నకు ఏది నియమముగా ఆధేయము, విధేయము, శేషము అనువానిచేత చేతనమున కంటే అపృథక్ సిద్ధమయిన ద్రవ్యమో అది శరీరము అని ఒకలక్షణము. చేతనమునకు ఇది ఆధేయము-ఉండదగిన చోటు. అది నియమముగానే ఎంతవరకు చేతనము శరీరంలో వుంటుందో అంతవరకు వుంటుంది. చేతనము తొలగిపోతే శరీరము నశిస్తుంది. చేతనాశ్రితము అయినందున చేతనులకు ఆధేయము అయినది.



శరీరము తనకు ఆశ్రయమైన చేతనము యొక్క చెప్పుచేతలలో ఉంటుంది. చేతనము చెప్పినట్లు శరీరము నడుచుకొంటుంది. ఇది విధేయత. ఇట్లాగే శరీరము చేతనమునకు సేవకుని వంటివాడు. చేతనుడు శేషి-యజమాని. అంతే కాకుండ తనకు ఆశ్రయభూత మయిన చేతనమున కంటే విడిగా అస్సలు ఉండదు, ఉండలేదు. అపృథక్-విడిగ, సిద్ధము-ఉనికి గలది, కాదు. అని కూడ మూడు లక్షణాలు శరీరమునకు చెప్పవచ్చును. లేదా ఈశ్వరుని కంటే అతని జ్ఞానమునకంటే వ్యతిరిక్తమయినట్టి ద్రవ్యము శరీరము అని తటస్థలక్షణము చెప్పవచ్చును. ఇట్లా శరీరానికి లక్షణాలు చెప్పి స్థిరపరచినందున చేష్టకు-క్రియకు ఆశ్రయము శరీరమని, ఇంద్రియములకు ఆశ్రయము శరీరమని, భోగములకు ఆశ్రయము శరీరము అని (ఈ చివరిది న్యాయశాస్త్ర లక్షణము. చూ -న్యాయదర్శనము.) లక్షణాలు నిలువవు. అట్లాగే తల, కాళ్ళు, చేతులు, మొదలు, గల అవయవములు కలది అను లక్షణము కూడ పరాస్తము అవుతుంది.

## శరీరవిభాగః:

**మూ:** శరీరం ద్వివిధమ్-నిత్యం, అనిత్యమితి. తత్ర నిత్యం త్రిగుణద్రవ్య కాలజీవశుభాశ్రయాదికం, ఈశ్వర శరీరమ్, నిత్యసూరీణాం స్వాభావికం గరుడ భుజగాదిరూపం చ. అనిత్యం ద్వివిధమ్-అకర్మకృతం, కర్మకృతం చేతి. ప్రథమం ఈశ్వరస్య మహదాదిరూపమ్. తథాఽనన్త గరుడాదీనాం ముక్తానామీశ్వరస్య చ ఇచ్ఛాగృహీతం తత్తద్రూపమ్. కర్మకృతమపి ద్వివిధమ్. స్వసఙ్కల్పసహకృత కర్మ, కృతం కేవల కర్మకృతం చేతి, పూర్వం మహతాం సౌభరి ప్రభృతీనామ్. ఇతరదన్యేషామ్. పునస్సామాన్యేన ద్వివిధం స్థావర జఙ్గమభేదాత్. స్థావరాః. శిలావృక్ష గుల్మాదయః. జఙ్గమాశ్చతుర్ధా-దేవ మనుష్యతిర్యఙ్ నారకిభేదాత్. ఉద్భిజ్జ, స్వేదజ, అణ్డజ, జరాయుజభేదా అపి విభాజక ధర్మాః. అయోనిజ శరీరాణ్యపి సన్తి.

ఆ: శరీరమును అనేక విధముల విభజించవచ్చును. మొదట నిత్యము, అనిత్యము అని రెండు విధములు. నిత్యశరీరము ఈశ్వరునిది. ప్రకృతి, జీవులు, శుభములకు ఆశ్రయ మయినది ఇవి అన్నియు ఈశ్వరుని శరీరము. సంపూర్ణ మయిన జగత్తు ఈశ్వరునకు శరీరము. ఈశ్వరుడు జగత్తునకంతకు ఆత్మ, జగత్తునకంతకు ఆత్మ, ప్రకృతి, జీవులు ఈశ్వరుని నిత్యశరీరము. అది సకల శుభములకు ఆశ్రయభూతము. అట్లాగే నిత్యసూరుల యొక్క స్వాభావికమయిన గరుడుని గరుడశరీరము, అనంతుని సర్పశరీరము మొదలయినవి కూడ నిత్యశరీరములే. అనిత్యశరీరము కూడ రెండు విధములు. ఒకటి అకర్మకృతము, రెండవది కర్మకృతము. మొదటిది ఈశ్వరుని యొక్క శరీరము కర్మలవలన ఏర్పడినది కాదు. ప్రకృతినుండి కలుగు మహత్తు అహంకారము మొదలయిన నిత్యశరీరము. అట్లాగే నిత్యసూరిగణము తమ ఇష్టానుసారము ధరించు శరీర ములు కూడ నిత్యములు. ముక్తజీవులు కూడ తమ ఇచ్ఛానుసారము ధరించునట్టి శరీరములు కూడ కర్మకృతములు కావు. అవి నిత్యములు.

కర్మకృతమయిన శరీరము రెండువిధాలు– తన సంకల్పముతో కూడిన కర్మ వలన ఏర్పడినది మొదటిది, రెండవది కేవలము కర్మవలననే ఏర్పడినట్టి శరీరము. దాంట్లో మన సంకల్పముయొక్క ప్రమేయము ఏమీ ఉండదు. మహాపురుషులయిన సౌభరిమహర్షి మొదలగువారి శరీరము మొదటి రకానికి చెందినది. ఆయన యోగ శక్తిచేత యాభయి శరీరాలను ధరించారట.– కేవల కర్మతో ఏర్పడినది మనలాటి వారి శరీరము. ఈ విధముగా మూడు రకాలుగా ఉన్న శరీరవిభాగాన్ని సామాన్యముగా మరో విభాగం చేయవచ్చును. అది రెండు విధాలు–స్థావరము–నిలకడగా ఉండేది. స్వయంగా కదలే శక్తి, ఎట్టి క్రియ చేసే శక్తిలేనిది; జంగమము–ఎప్పటికీ గమనశీల మయినది. శక్తి, క్రియ గలది. రాళ్ళు, చెట్లు, పొదలు, కొండలు మొదలయినవి మొదటి రకానికి చెందుతాయి. వాటిలో కూడ మిక్కిలి పాపులు ఉంటారు. అహల్య రాయి రూపములో ఉండేది. యమలార్జునులు చెట్లరూపములో ఉండిరి.



ఇక రెండవరకమయిన జంగమమయిన శరీరము నాలుగు విధాలు– దేవతలు, మనుష్యులు, పశుపక్ష్యాదులు, నారకీయులు–నరకంలో ఉండేవారు. యక్షరాక్షసగంధర్వులు మొదలగు వారి శరీరము దివ్యమునకే చెందుతుంది. పుట్టుకవిధానాన్ని బట్టికూడ నాలుగురకాలుగా శరీరాన్ని విభజించవచ్చును–అది ఉద్భిజ్జము–చెట్లు మొదలయినవాటి శరీరము చీల్చుకొని పుట్టునది, అండజము– పక్షులు మొదలయిన వాటి శరీరము గుడ్డునుండి పుట్టునది. జరాయుజము– మనుష్యులు మొదలగు గర్భము నుండి పుట్టునది–మనుష్యులు. జంతువుల శరీరములు. ఇంకోవిధముగా అయోనిజము యోనిజము అని విభాగము కూడ చెయ్యవచ్చును. పై నాలుగు రకాల శరీరము యోనిజము. అయోనిజశరీరము సీత, ద్రౌపది, గోదాదేవి మొదలగు వారి శరీరములు అయోనిజములు అని తాత్పర్యము. శరీరాన్ని ఇన్ని విధాలుగా విభజించవచ్చును.

## సమష్టిసృష్టౌ కారణకార్యభావ నిరూపణమ్ :

**మూ:** ఏవం పంచీకృతానాం భూతానామేవాణ్డోత్పాదకత్వమ్. అణ్డోత్పా దాత్పూర్వ సృష్టిస్సమష్టిసృష్టిః. అనన్తరసృష్టిః. వ్యష్టిసృష్టిః మహదాదీనా ముత్పత్తిర్నామ తాల పలాశ తాటఙ్కన్యాయేనావస్థాన్తర ప్రాప్తిరేవ. సేనావనరాశ్యాదివ్యవ హారవత్ పూర్వాపరావస్థా విశేషసమ్బన్ధమాత్రేణ కార్యకారణ భేదవ్యవహారః. తత్ర పూర్వావస్థా ప్రహాణేన విజాతీయావస్థా ప్రాప్తౌ తత్త్వాన్తర వ్యపదేశః. పృథివీ పర్యన్తఏవ. ఇత్థం, ప్రకృతి మహదహఙ్కారైకాదశేం ద్రియ తన్మాత్రపంచక భూతపంచక విభాగేన చతుర్వింశతి తత్త్వాని వర్ణితాని. ఏతేన న్యూనాధికసఙ్ఖ్యా (కం) తత్త్వవాదినో బాహ్యాః పాశుపతాశ్చ నిరస్తాః. పరమాణుకారణత్వవాదినోఽపి నిరస్తాః.

**అ:** పంచీకృతములయిన భూతములనుండియే బ్రహ్మాండము ఉత్పన్న మవుతుంది. బ్రహ్మాండ ఉత్పత్తికిముందు ఉన్నసృష్టికి 'సమష్టి సృష్టి' అనిపేరు. బ్రహ్మాండోత్పత్తి తరవాతి సృష్టికి 'వ్యష్టిసృష్టి' యని పేరు.

పృథివినుండి మహత్‌తత్త్వమువరకున్న తత్త్వములు భిన్న భిన్నస్వభావము కలవి. జలములో ద్రవత్వము, పృథివిలో కాఠిన్యము మొదలయినవి. ఈ భిన్నశక్తులు ఒకటి అయితేనే సృష్టి చేయలేవు. ఈ తత్త్వములన్ని, బ్రహ్మాండనిర్మాణానికయి, ఒకదానితో ఒకటి సంయోగము చెంది, ఒకదాని నొకటి ఆశ్రయించి బ్రహ్మాండమును సృష్టిస్తాయి. ఇట్లా సృష్టి రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి సమష్టి సృష్టి– ఇది బ్రహ్మాండము యొక్క ఉత్పత్తికి మొదలు ఉన్నసృష్టి. బ్రహ్మాండము పుట్టినతరువాత జరగు సృష్టి వ్యష్టిసృష్టి. ప్రకృతి నుండి మహదాదులు పుట్టుతున్నాయి అంటే ఈ సృష్టి అవస్థాంతర ప్రాప్తిరూపమే కాని ఒకదానిలో నుండి ఒకటి పుడుతున్నట్టు కాదు. ఇది బుద్ధిభేదము కాలభేదము బట్టి వీటికి ఒకదానికి కారణము అని మరియొక దానికి కార్యము అని వ్యవహారము కలుగుతున్నది, ఒక తాటి ఆకునుపలురకాలుగా మడిచి కంకణము, కమ్మలు మొదలయినవి చేసినట్లు. అదే కారణము అదే కార్యము. కాలాన్నిబట్టి మొదట ఆకు పిదప ఆభరణము. దీనికే 'తాలపలాశ తాటఙ్క న్యాయము' అనిపేరు.

ప్రకృతి కూడ ఇట్లాగే మహదాది రూపముగా మారుతుంటుంది. మహదాదులుగా మారినా అది ప్రకృతిరూపమే. మరి ఇట్లా అంటే కారణదశలో ఒకజాతి ఉంటుంది. కార్య దశలో మరి ఒకజాతి ఉంటుంది. రెండు జాతులు ఒకదానిలో ఉండవు కదా, జాతిసంకరము ఏర్పడుతుంది అను నైయాయికుల ప్రశ్నకు జవాబు. నైయాయికులు కూడ సైనికులు విడిగా ఉంటే సైనికులు అంటారు. కలసి సమూహంగా ఉంటే సేన అంటారు గదా. చెట్లు విడివిడిగా చెట్లు. కలిస్తే వనము కదా. దానిలాగ పూర్వపుదశ అవస్థ, అపరదశ అవస్థ అనే భేదం సంబంధము చేతనే వాటికి ఓ దానికి కార్యము మరోదానికి కారణము అని భేదము చెప్పడము జరుగుతున్నది. సాంకర్యము లేదు అని. వాట్లలో మొదటి సైనికులే చెట్లే ఉన్నారు. ఉన్నవి, కొత్తవి ఏవీ రాలేదు. అట్లా మొదటి అవస్థకు కారణమని, రెండవ అవస్థకు కార్యమని పేరు. రెండు వేరు గాదు.



కార్యకారణభావము అంటే అవస్థాంతర ప్రాప్తియేగాని మరొకటి కాదు. మొదటి అవస్థను– దశను వదలిపెట్టి వేరే ఒక అవస్థను పొందడం అనేది. దానివలన అది వేరే ఒక తత్త్వము అని దానికి పేరు పెట్టడం పృథివి వరకు. ఈవిధంగా 1 ప్రకృతి 2 మహత్తు 3 అహంకారము 4–14 పదకొండు ఇంద్రియములు 15–19 పంచతన్మాత్రలు 20–24 పంచమహా భూతములు అను చతుర్వింశతి తత్త్వములు నిరూపించడ మయినది. దీనికి ఏడు పదార్థములను నిరూపించు వైశేషికుల, పదహారు పదార్థాలను నిరూపించు నైయాయికుల, ముప్పయి ఆరు తత్త్వాలు ప్రతిపాదించు పాశుపతుల మతము ఖండించినట్లు అవుతుంది. బాహ్యులనగా (వేదప్రామాణ్యమును ఒప్పుకొనని) బౌద్ధులని భావము. వైశేషికుల బౌద్ధుల, జైనుల పరమాణు కారణవాదము కూడ నిరస్త మవుతుంది.

## జంబూద్వీప వర్ణనం:

**మూ:** ప్రకృత్యాదయ ఈశ్వరస్య జీవస్య చ భోగ్యభోగోపకరణ భోగస్థానాని చ భవంతి. భోగ్యాని విషయాః. భోగోపకరణాని తు చక్షురాదీని. భోగస్థానాని చతుర్దశభువన సహితాన్యండజాతాని. అండం నామ కపిత్థఫలాకారం పంచీకృత పంచభూతారబ్ధం ప్రాకృతం ద్రవ్యమ్. తద్యథా పద్మాకారా భూః, కర్ణికాకారో మేరుః. మేరోర్దక్షిణతో భారతకింపురుష హరి వర్షాణి త్రీణి. ఉత్తరతో రమ్యక, హిరణ్యక, కురువర్షాణి త్రీణి. పురతో భద్రాశ్వవర్షమ్. పశ్చాత్ కేతుమాలవర్షమ్. మధ్యే తు ఇలావృతమ్.

**అ:** ప్రకృతి మొదలయిన తత్త్వాలు అన్ని ఈశ్వరునకు జీవునకు కూడ భోగ్యపదార్థములు అనుభవింపదగినవి. భోగోపకరణములు అనుభవించడానికి సాధనములు మరియు అనుభవించడానికి స్థానములు కూడ. ఇవి ఈశ్వరునకు ఆటకు ఉపయోగపడు ఉపకరణములు. లీలకు అవసరమయిన విషయములు సాధనములు స్థానము కూడ. భోగ్యములు–రూపరసగంధస్పర్శ శబ్దములు అనువిషయములు. భోగ+ఉపకరణములు– చక్షువు, జిహ్వ, ఘ్రాణము, త్వక్కు,

శ్రోత్రము, మనస్సు అను జ్ఞానేన్ద్రియములు, వాక్, పాణి, పాద, పాయు, ఉపస్థములు అను కర్మేంద్రియములు.

ఇక భోగస్థానములు పదునాలుగులోకాలతో కూడిన అండజాతములు. అండం అనగా వెలగపండు ఆకారంలో ఉండునట్టిది, పంచీభూతములచే ఆరంభింపబడిన ప్రాకృతమయిన (ప్రకృతితో ఏర్పడినట్టి) ద్రవ్యము. ఇదే బ్రహ్మాండము. భూమి పద్మమువలె ఉంటుంది. మేరుపర్వతము పద్మములోని కర్ణికవలె నడిమి దిమ్మెవలె ఉన్నది. ఈ పదునాలుగు భువనాల బ్రహ్మాండము అన్నివైపుల అండకటాహముతో అండము అను మూకుడుతో కప్పబడినట్లు ఉన్నది. ఈ విషయమునే విష్ణుపురాణము,

**ఏతదండకటాహేన తిర్యక్చోర్ధ్వమధస్తథా,**
**కపిత్థస్య యథా బీజం సర్వతో వై సమావృతమ్.**

అని వివరించింది. మధ్యన వెలగవిత్తు అన్నివైపుల కింద పయిన కూడ పండు గుజ్జుపయిన పెంకు ఉన్నట్లు, బ్రహ్మాండము విత్తులాగ అండకటాహముతో ఆవరింపబడి ఉన్నది. ఆ మేరుపర్వతానికి కుడి వయిపు భారతవర్షము, కింపురుషవర్షము, హరివర్షమూ ఉన్నవి. ఉత్తరము వయిపు రమ్యక, హిరణ్యక, కురువర్షములు ఉన్నవి. ఎదుట భద్రాశ్వవర్షము, వెనుక కేతుమాలవర్షము ఉన్నవి. మధ్యలో ఇలావృతవర్షము ఉన్నది.

## సప్తద్వీపవత్యాః పృథివ్యా వర్ణనమ్:

**మూ:** ఏవం నవవర్షయుక్తం జంబూద్వీపం లక్షయోజనవిస్తీర్ణం సమపరిమాణేన లవణసింధునాऽऽవృతమ్. స సింధుః ద్విగుణేన సప్తవర్షాత్మకేన ప్లక్షద్వీపేన వేష్టితః. సోఽపీక్షుసముద్రేణ సోఽబ్ధిః శాల్మలిద్వీపేన. స పునస్సురాసముద్రేణ. స కుశద్వీపేన. స సర్పిస్సముద్రేణ. సోఽపి క్రౌంచద్వీపేన, స దధ్యర్ణవేన,సోఽపి శాకద్వీపేన. స చ క్షీరార్ణవేన. సోఽపి వర్ష ద్వయ



విభాజక వలయాకార మానసోత్తర పర్వత సహితేన పుష్కరద్వీపేన. స శుద్ధజలార్ణవేన. ఏవం ద్వీపానాముత్తరోత్తరద్వైగుణ్యం ద్రష్టవ్యమ్. ప్లక్షద్వీపాదయశ్చ సప్తవర్షాత్మకాః. సప్తద్వీపాత్మకోఽయం ద్విగుణయా కాంచనభూమ్యావృతః. కాంచనభూమిస్తు లోకాలోక పర్వతేన, స పర్వత స్తమసా, తతో గర్భోదకేన, తతోఽండకటాహః.

**అ:** ఇట్లా తొమ్మిది వర్షములతో కూడినట్టి జంబూద్వీపము ఒకలక్షయోజనముల విస్తీర్ణము కలిగియున్నది. ఈ ద్వీపము చుట్టూ ఇంతే పరిమాణముగల ఉప్పునీటి సముద్రము ఆవరించి ఉన్నది. ఆ సముద్రము చుట్టూ దానికంటే రెండింతల విస్తీర్ణము గలిగిన ప్లక్షద్వీపము ఆవరించి ఉన్నది. ఆ ప్లక్ష ద్వీపములో ఏడు వర్షములు ఉన్నవి. ఆ ద్వీపమును చెఱకు రసమువలె తియ్యనయిన నీరు కలిగిన సముద్రము చుట్టుముట్టి ఉన్నది. ఆ సముద్రమును శాల్మలి ద్వీపము ఆవరించియున్నది. దానిని సురాసముద్రము ఆవరించి ఉన్నది. అది కుశద్వీపముచే ఆవృతమయి ఉన్నది. ఆ కుశద్వీపాన్ని ఘృతసముద్రము ఆవరించి ఉన్నది. దానిని క్రౌంచద్వీపము చుట్టుముట్టి ఉన్నది. అది పెరుగు సముద్రముచే ఆవృతమయి ఉన్నది. దానిని శాకద్వీపము ఆవరించి ఉన్నది. ఆ ద్వీపాన్ని పాలసముద్రము ఆవరించి ఉన్నది. ఆ సముద్రాన్ని పుష్కరద్వీపం చుట్టు ముట్టి ఉన్నది. ఆ ద్వీపం చుట్టూ, రెండు ద్వీపాలను విడదీసే కడియము ఆకారంలో ఉన్న మానసోత్తరపర్వతముతో కలిసి యున్నది. ఆ పుష్కరద్వీపాన్ని మంచినీటి సముద్రము చుట్టిఉన్నది. ఈ ద్వీపాలు వరుసగా ఒకటికంటె మరియొకటి రెండింతలుగా ఉన్నవి. జంబూద్వీపం వదలి, మిగతాద్వీపాలలో ఏడు ఏడు వర్షములు ఉన్నవి. ఏడుద్వీపముల ఈ బ్రహ్మాండమును ద్విగుణము అయిన-రెండింతలయిన బంగారు భూమి ఆవరించి ఉన్నది. (జంబూద్వీపం-లక్షయోజనాలు, ప్లక్షం- రెండు లక్షలు, శాల్మలి నాలుగు లక్షలు కుశం-ఎనిమిదిలక్షల, క్రౌంచం-పదహారులక్షలు, శాక-32లక్షలు, కుశం-64 లక్షలు, అంటే కాంచన భూమి 128 లక్షలు విస్తీర్ణము. ఇదంతా అగమ్యగోచరంగా

అగుపిస్తున్నది. అ) ఆ కాంచన భూమిని లోకాలోకపర్వతము ఆవరించి ఉన్నది. ఈ పర్వతములోపలనే అంటే కాంచన భూమిలోనే– కాంతి ఉంటుంది. వెలుపల ఉండదు. (కాళిదాసు దిలీపునితో ఇలా అనిపిస్తాడు– ఓ వసిష్ఠ మహర్షి నాకు అన్ని ఉన్నవి. కాంతి ఉన్నది. సంతానము లేదు బయట కాంతి లేదు. అలాంటి లోకాలోక ఇవాచలః అని) వెలుపల చీకటే ఉంటుంది. ఆ చీకటిని గుంటలు, జలము ఆవరించి ఉంటాయి. వాటి తరువాత అండకటాహము ఉంటుంది.

## భూమేరధోభాగస్య విస్తారవర్ణనమ్:

**మూ:** ఏవం భూమేరధోఽతల, వితల, సుతల, తలాతల, మహాతల, రసాతల, పాతాల భేదాత్ సప్తలోకాః అధో నరకాః తే చ పాపకర్మణాం పాపానుభవ భూమయో రౌరవాద్యాః ముఖ్యతయా ఏకవింశతి ప్రభేదాః. తతస్తమః. తతో గర్తోదకమ్ తతోఽండకటాహః

**అ:** నిరూపింపబడిన భూమి క్రింద ఏడులోకాలు ఉన్నవి. అతలము, వితలము, సుతలము, తలాతలము, మహాతలము, రసాతలము, మరియు పాతాలము అని వాటిపేర్లు. ఆ ఏడులోకాల క్రింద నరకలోకాలు ఉన్నాయి. వాటిలో పాపులు తాము చేసిన పాపములయొక్క ఫలమయిన దుఃఖమును అనుభవిస్తుంటారు. రౌరవము మొదలయినవి ఆ నరకలోకాల పేర్లు. అవి ముఖ్యముగా ఇరువయి ఒక్కవిధాలుగా ఉన్నాయి. ఆ లోకాల క్రింద చీకటి, దానితరువాత గుంటలు, నీళ్ళు తరువాత అండకటాహము ఉంటుంది.

## భూమేరూర్ధ్వభాగస్య విస్తారస్య వర్ణనమ్:

**మూ:** ఏవం భూమేరుపరి లక్షయోజనాత్ సూర్యమండలమ్. తావదేవ భువర్లోకః, తదుపరి చంద్రమండలమ్. తస్మాదుపర్యుపరి నక్షత్ర బుధశుక్రాంగారక



బృహస్పతి శని సప్తర్షిమండలాని. తదుపరి ధ్రువః. సూర్యమండలమారభ్య ధ్రువలోక పర్యంతం స్వర్లోకః. చతుర్దశలక్షోపరి కోటియోజనోచ్ఛ్రాయో మహర్లోకః. తస్మాద్ద్విగుణో జనోలోకః తతశ్చతుర్గుణస్తపోలోకః. తస్మాద్ ద్వాదశకోట్యుచ్ఛ్రాయః సత్యలోకః. తతస్తమో గర్తోదక మండకటాహశ్చ. ఏవం తిర్యగూర్ధ్వప్రమాణేన పంచాశత్ కోటియోజనత్వం భూమేరుక్తం భవతి. శతకోటి యోజన విస్తీర్ణత్వవాదో మానభేదన అండకటాహః కోటియోజనోచ్ఛ్రాయః.

**అ:** ఈ విధంగా, భూమినుండి లక్షయోజనముల దూరమున సూర్యమండలము ఉన్నది. అంతవరకు భువర్లోకము. దానిపయిన చంద్ర మండలము, దానిపయిన నక్షత్రమండలము, దానిపయిన బుధ మండలము, ఆ పయిన శుక్రమండలము, దానిపయిన అంగారకమండలము, పిదప బృహస్పతి మండలము, శనిమండలము. సప్తర్షిమండలము ఉన్నాయి. దాని పయిన ధ్రువమండలము. సూర్యమండలము నుండి మొదలుకొని ధ్రువలోక పర్యంతము స్వర్లోకము– స్వర్గము. దానినుండి పదునాలుగులక్షల (యోజనముల మీద) దూరము మహర్లోకము. కోటియోజనముల విస్తీర్ణముతో నున్నది. దానికి రెండింతల విస్తీర్ణముగలది జనో లోకము. దానికి నాలుగింతలు విస్తీర్ణము గలది తపో లోకము. దానిపయిన పన్నెండుకోట్ల విస్తీర్ణముగల్గి ఉన్నది సత్యలోకము. తదుపరి చీకటి, గుంటలు, నీరు, దానితరువాత అండకటాహము ఉన్నవి. ఇట్లా భూమికి ప్రక్కలకు పయిన యాభయికోట్ల యోజనము వరకు ఏమేమి ఉన్నదో నిరూపణ జరిగినది. కొందరి కొలత భేదము వలన శతకోటి యోజనముల విస్తీర్ణతకూడ భూమిభాగములకు కలుగుతుంది. క్రమంగా భూమికి అన్నివయిపుల లోకాలన్నీ దాటిన తరువాత ఉన్న అండకటాహము యొక్క విస్తీర్ణము – ఎత్తు నూరుకోట్ల యోజనములు. ఈ లోకాల విస్తీర్ణమును ఎత్తుగానే తీసుకోవాలి.

## చతుర్థావతారస్యోపసంహారః:

**మూ:** తదండం దశోత్తరావరణావృతమ్. ఏతాదృశాన్యండాన్యనంతాని. జలబుద్బుదవద్యుగ పదీశ్వరసృష్టాని. ఈశ్వరస్య చతుర్ముఖపర్యంతా సృష్టిర ద్వారికా. తదనంతరం సద్వారికేతి వివేకః. విస్తరస్తు పురాణరత్నాదిషు ద్రష్టవ్యః, ఇతి ప్రకృతిర్నిరూపితా.

ఇతి శ్రీవాధూలకులతిలక శ్రీమన్మహాచార్య ప్రథమకృపాపాత్రేణ శ్రీనివాసదాసేన, విరచితాయాం యతీంద్రమతదీపికాయాం శారీరకపరిభాషాయాం ప్రకృతి నిరూపణం నామ చతుర్థోఽవతారః.

**అ:** ఆ బ్రహ్మాండము పయిన పది ఆవరణములు ఉన్నవి. ఈ బ్రహ్మాండాలు ఎన్నో ఉన్నాయి. అనంతాలు. ఈశ్వరుడు వాటినన్నిటిని ఒకే కాలంలో నీటిలో బుడగలు పుట్టినట్టు సృష్టి చేస్తాడు. నాలుగు ముఖములు కలిగిన బ్రహ్మవరకు జరిగినది. ఈశ్వరుడు సాక్షాత్తుచేసిన సృష్టి. తదుపరి సృష్టి చతుర్ముఖుని ద్వారా చేయించిన సృష్టి. మొదటి సృష్టి అద్వారకము, రెండవది సద్వారకము అని తాత్పర్యము. వివేకము, తేడా, ఈ సృష్టిరహస్య విశేషాలు ఇంకా తెలుసుకోదలచిన వారు పురాణరత్నమయిన విష్ణుపురాణంగాని మరోపురాణం ద్వారాగాని తెలుసుకోవచ్చును. ఇట్లా ప్రకృతి అంటే ఏమిటో నిరూపణ జరిగినది.

శ్రీవాధూల తిలక శ్రీమన్మహాచార్యప్రథమ కృపాపాత్రుడయిన, ప్రధాన శిష్యుడయిన శ్రీశ్రీనివాసాచార్యవిరచితమయిన యతీంద్రమత దీపికయను శారీరక పరిభాషయందు ప్రకృతినిరూపణము అను నాలుగవ అవతారము సమాప్తము.

***



# అథ పంచమావతారః

## కాలనిరూపణమ్:

మూ: అథాచిద్విశేషః కాలో నిరూప్యతే. కాలో నామ గుణత్రయరహితో జడద్రవ్యవిశేషః. స చ నిత్యో విభుశ్చ. భూతభవిష్య ద్వర్తమాన భేదేన త్రివిధః. యుగపత్ క్షిప్రచిరాదివ్యవహార హేతుః. నిమేషకాష్ఠా (తత్పరావినాడీ) కలాఘటికా ముహూర్తదివస పక్ష మాస ఋత్వయన సంవత్సరాది వ్యవహారహేతుశ్చ. మనుష్యమానేన మాసః పిత్రూణాం దినమ్. తేషామమావాస్యా మధ్యాహ్నః మనుష్యమానేన సంవత్సరో దేవానాం దినమ్. తేషాముత్తరాయణమహః. దక్షిణాయనం రాత్రిః. ఏవం దేవమానేన ద్వాదశవర్షసహస్రసంఖ్యాకం చతుర్యుగమిత్యుచ్యతే. తత్ర చతుస్సహస్ర వర్షసంఖ్యాకం కృతయుగమ్. తత్ర పూర్ణో ధర్మః. త్రిసహర్స్రవర్షసంఖ్యాకం త్రిపాద్ధర్మవత్ త్రేతాయుగమ్. ద్విసహస్రవర్షపరిమిత (సార్ధపాదధర్మం) ద్విపాద్ధర్మవద్ ద్వాపరమ్. సహస్రవర్ష సంఖ్యాకం ఏక పాద్ధర్మయుతం కలియుగమ్. ఏతేషాం సన్ధిర్ద్విసహస్ర సంఖ్యాకః. ఏవం భూత చతుర్యుగసహస్రాణి బ్రహ్మణో దివసప్రమాణమ్ ఏవం రాత్రిః.

**అ:** ప్రకృతిని నిరూపించి అయిదవ అవతారమున కాలమును గ్రంథకర్త నిరూపించుచున్నాడు.

సత్త్వము, రజస్సు, తమస్సు అను ఈ మూడు గుణములు లేనట్టి జడద్రవ్యములలో ఒకటి అయినట్టిది కాలము. ఇదియే కాలము యొక్క లక్షణము. ఆ కాలము నిత్యము మరియు విభువు అంతట వ్యాపించి ఉండునది. అది జరిగినది, జరుగుతున్నది. జరుగబోవునది– వరుసగా భూతము, వర్తమానము, భవిష్యత్ అని మూడు విధములు. ఆ కాలము వలననే ఒకే మారు– యుగపత్, క్షిప్రము– వెంటనే, చిరము–చాలాకాలము అను వ్యపదేశములు– పేరులు ఏర్పడినవి. దానివలననే నిమిషము, కాష్ఠ, కల, ఘటిక, ముహూర్తం, దివసము, పక్షము, మాసము, ఋతువు, ఆయనము, సంవత్సరము మొదలయిన వ్యవహారములు–ఉపయోగములు ఏర్పడినవి. ఎల్లపుడు ఉండుటవలన ఇది నిత్యము. ఏ పని జరిగినా ఏదో ఒకకాలములోనే జరుగుతుంది. కనుక ఇది వి–అంతట, భు–ఉన్నది.

కొందరు వర్తమానకాలమును ఒప్పుకొనరు. కాని అది సరికాదు. ప్రత్యక్షము వర్తమానకాలముననే కలుగుతుంది. భూత భవిష్యత్ కాలముల యొక్క అవధి– భూతకాలము అయిపోవడానికి, భవిష్యత్ మొదలు అవడానికి కూడ. వర్తమానం లేకుండ భూతభవిష్యత్‌లు ఏర్పడలేవు. కాలమును అల్పము అల్పతరము అల్పతమముగా కూడ విభాగము చేయడానికి నిమిషము, కల, కాష్ఠ, మొదలయిన పేర్లు ఉన్నాయి, అట్లాగే దీర్ఘ, దీర్ఘతర, దీర్ఘతమముగా కాలమును తెలుపునవి. సంవత్సరము పుష్కరము, యుగము మొదలయిన పేర్లు ఉన్నాయి. అయితే ఈ భేదాలన్నీ ఔపాధికములు, వాస్తవములు కాకపోవచ్చును.

మనుష్యులకు ఒక నెల అయితే అదేకాలము పితృదేవతలకు ఒకదినము (అనగా మన 30 రోజులు వారికి దినము కిందలెక్క.) అమావాస్యవారికి మధ్యాహ్నము. మనకు ఒకసంవత్సరము అయితే దేవతలకు ఒకరోజు కిందలెక్క (365 రోజులు వారి ఒకరోజు అన్నమాట.) మనకు ఆరునెల్లు ఉత్తరాయణము, ఆరునెలలు దక్షిణాయనము. దేవతలకు మన ఉత్తరాయణము పగలు. దక్షిణాయనము రాత్రి.

ఇట్లా దేవమానముతో పన్నెండు వేలఏండ్లు ఒక చతుర్యుగములో ఉంటాయి. కృతయుగములో నాలుగవేలఏండ్లు ఉంటాయి. ఆ యుగములో ధర్మము నాలుగు పాదాలతో ఉంటుంది. (ధర్మమును వృషము అని కూడ అంటారు. వృషభానికి నాలుగుకాళ్ళు ఉంటాయి గనుక ధర్మం నాలుగు పాదాలతో నడుస్తున్నదని అంటారు.) ఇక త్రేతాయుగములో మూడు వేలసంవత్సరాలు, ధర్మానికి మూడు పాదాలు (వీటి వలన కృత అంటే నాలుగు, త్రేతా మూడు ద్వాపర రెండు అని సంఖ్యలకుకూడ పేర్లువచ్చాయి.) ఉంటాయి. అట్లాగే ద్వాపరమున రెండు వేల ఏండ్లు ధర్మము రెండుపాదములతో ఉంటుంది. ఇక



మన కలియుగంలో వెయ్యి సంవత్సరములు ధర్మము ఒక పాదముతో ఉంటాయి. ఈ నాలుగు యుగాలకు సంధికాలము రెండువేల ఏండ్లు. అంటే ఒక్కోయుగానికి ఐదు వందల ఏండ్లు సంధికాలము అని అర్థము.

ఈ దేవమానములో చతుర్యుగసహస్రము – వేయిచతుర్యుగములు ఒకదినము. అంతసమయమే రాత్రి కూడ. ఈ సంగతులు మరిన్ని విశేషాలు కాలంగురించి, శ్రీవిష్ణుపురాణములో విపులముగా ఉన్నవి. ఇట్లా ప్రకృతి మండలములో పనులన్నీ కాలము చేతనే జరుగుతవి. దివ్యవైకుంఠలోకమున కూడ కాలము ఉన్నది. అది శ్రీమన్నారాయణుని విభూతి పరిణామాలకు కారణము కాదు. ఆయన ఇచ్ఛతోటే అన్నిటి పరిణామము జరుగుతుంది. (బహుశ దీని ప్రభావంతోనే, భారతంలో... రాజా కాలస్యకారణమ్ అని చెప్పడం జరిగియుండవచ్చును. రాజే కాలానికి కారణము, కాలము రాజునకు కారణము కాదు అని భావము).

## బ్రహ్మణోఽహ్నో వర్ణనమ్:

**మూ:** బ్రహ్మణోఽహ్నిచతుర్దశమనవః తథేంద్రా స్సప్తర్షయశ్చ. ఏకైక మనోరేకసప్తతిచతుర్యుగపరిమాణకాలః. ఏవం బ్రహ్మమానేన బ్రహ్మణశ్శతవర్ష జీవిత్వమ్. ఏతత్సర్వం కాలాధీనమ్. ఏవం నిత్యనైమిత్తిక ప్రాకృతాది ప్రలయా అపి కాలాధీనాః. కాలస్య స్వకార్యం ప్రతిస్వస్యోపాదానత్వమ్. అఖండకాలో నిత్యః ఖండకాలాః పునరతినిత్యాః ఏవం భూతః కాల ఈశ్వరస్య క్రీడాపరికరో భవతి. లీలావిభూతావీశ్వరః కాలాధీన ఏవ కార్యం కరోతి. నిత్యవిభూతౌ తు కాలస్య విద్యమానత్వేఽపి తస్య నస్వాతంత్ర్యమ్. కేచిత్కాల ఏవ నాస్తీతి వదన్తి. అన్యేతు తామసో మహాన్ కాల ఇతి. ఉభయేషామాగమ బాధః ప్రత్యక్ష బాధశ్చ. షడింద్రియ వేద్యః కాల ఇత్యాచార్యాః. తేనానుమేయవాదినిరాసః. ఇతి కాలో నిరూపితః.

ఇతిశ్రీవాధూలకులతిలక శ్రీమన్మహాచార్యప్రథమదాసేన విరచితాయాం యతీంద్రమతదీపికాయాం శారీరక పరిభాషాయాం కాలనిరూపణం నామ పంచమోఽవతారః.

**అ:** బ్రహ్మ ఒక్కరోజు కాలములో (అనగా దేవమానముతో చతుర్యుగ సహస్రము అన్నమాట) పదునాలుగురు మనువులు, పదునాలుగురు ఇంద్రులు, పదునాలుగురు సప్తర్షులు ఉంటారు. ఒక్కొక్క మనువు జీవనకాలము డెబ్బయి ఒక్క చతుర్యుగముల కాలమంత ఉంటుంది. మనకు మన నూరుసంవత్సరాలు ఎట్లా జీవనకాలమో, బ్రహ్మకు కూడ ఆయన కాలమానప్రకారము నూరేళ్ళు. ఇదంతయు కాలము యొక్క అధీనంలో ఉంటుంది. ఇట్లానే నిత్యమయిన ప్రలయము నైమిత్తిక ప్రలయము, ప్రాకృతమయిన ప్రలయము కూడ కాలము యొక్క అధీనములో ఉంటాయి. కాలములోని కార్యమయినటు వంటి, క్షణము, లవము, మొదలయిన వాటికి కాలమే ఉపాదానకారణము. ఇట్లా లీలావిభూతిలో ఎక్కువ కాలము ఉండేది బ్రహ్మయొక్క సమయమే. ఆయనకుకూడ మనకున్నట్టు అంతము ఉన్నది. ఈకాలము నిత్యము అని పూర్వము చెప్పుకున్నాము.

ఈ నిత్యకాలము అఖండకాలము. ఎట్టి విభాగములు లేనిది. ఖండ కాలములు అనగా అన్ని విభాగములుగల కాలము. ఇవి అనిత్యములు. అంటే ఇవి పుడుతవి. అయిపోతవి. నిమిషము మొదలు బ్రహ్మ ఆయువు పర్యంతము కూడ ఉన్నకాలము అనిత్యము. ఇవి సఖండకాలములు. ఇవి అఖండకాలము యొక్క ఒక విభాగము. పయిన చెప్పినట్టు లీలావిభూతిలో కాలము స్వతంత్రము. అన్ని కాలాధీనములు. నిత్యవిభూతిలో మాత్రము కాలము కూడ భగవదధీనమే. భగవంతుడు కూడ లీలావిభూతిలో కాలాధీనుడయి తన పనులన్నీ నెరవేరుస్తాడు.

కొందరు [1]కాలమనే దానినే ఒప్పుకోలేదు. కొందరు తామసమయిన మహత్తే కాలము అని చెప్పారు. ఆగమము – శాస్త్రము కాలమును ఒప్పుకుని నిరూపించింది, మనకు ప్రత్యక్షంగా కూడ కాలము అనుభవానికి వస్తున్నందున కాలాన్ని లేదనలేము. ఈ కాలాన్ని ఆరు జ్ఞానేంద్రియములు గ్రహిస్తాయి అని ఆచార్యుల ప్రతిపాదన. రూప రస గంధ స్పర్శశబ్దముల జ్ఞానమునందు విశేషణముగా కాలము భాసిస్తుంటుంది.

1.తత్ర – అక్కడ – నిత్యవిభూతిలో కాలమును అంగీకరించ లేదు. ఇది తత్ర అను పాఠభేదమువలన తెలిసిన విషయము.



ఈ ప్రత్యక్షము వర్తమానములో జరుగుతుంది గద. అందుకని కాలము ప్రత్యక్షము. ఉన్నది–కలుగుతున్నది. ఇలాటిది ప్రత్యక్షము. ఉండెను. మొదలయినవి స్మృతి గోచరము. అన్ని జ్ఞానాల్లో కాలము విశేషణముగా ఉంటుంది ప్రత్యక్షమవుతుంది. లేదనలేము. అనుమానంతోనే తెలుసుకోవాలి కాలాన్ని, అని కూడ వాదించకూడదు. ప్రత్యక్షముతో జ్ఞానము కలుగుదానిని అనుమేయము అనకూడదు. (కావలిస్తే ప్రత్యక్షముతో బాటు అనుమాన ప్రమాణం కూడ కాలాన్ని నిరూపిస్తుంది అని చెప్పుకోవచ్చును.). ఇట్లా కాలము యొక్క నిరూపణ జరిగినది.

శ్రీవాధూలకులతిలకుడయినట్టి, శ్రీమన్మహాచార్యుల ప్రథమదాసుడయిన శ్రీనివాసదాసునిచే విరచితమయిన యతీంద్రమతదీపికయను శారీరక పరిభాష యందు కాలనిరూపణము అను పంచమావతారము

**సమాప్తము**

# అథ షష్ఠావతారః

## నిత్యవిభూతేర్నిరూపణమ్:

**మూ:** అథ నిత్యవిభూర్నిరూప్యతే.

శుద్ధసత్త్వ, ధర్మభూతజ్ఞాన, జీవ, ఈశ్వర సాధారణం అజడత్వమ్. అజడత్వం నామ స్వయం ప్రకాశత్వమ్. తత్ర శుద్ధసత్త్వ, ధర్మభూత జ్ఞానసాధారణ లక్షణం పరాక్త్వే సతి అజడత్వమ్. తత్తు స్వయం ప్రకాశత్వే సతి పరస్మా ఏవ భాసమానత్వమ్. శుద్ధసత్త్వం నామ త్రిగుణద్రవ్య వ్యతిరిక్తత్వే సతి సత్త్వవత్వమ్. నిఃశేషా విద్యానివృత్తిదేశ విజాతీయాన్యత్వం వా. సా విభూతిరూర్ధ్వప్రదేశే నానంతా. అధఃప్రదేశేన పరిచ్ఛిన్నా. అచేతనా స్వయం ప్రకాశా చ. ఆనందావ హత్వాదానందాత్మికా. పంచోపనిషన్మన్త్ర ప్రతిపాద్యతయా పంచోపనిషదాత్మికా. అప్రాకృత పంచశక్తిమత్తయా (మయతయా) పంచశక్తిమయీతి నిగద్యతే.

**అ:** కాలమును నిరూపించిన తరువాత ఈ అవతారములో నిత్యవిభూతి అననేమో నిరూపింపబడుచున్నది.

శుద్ధసత్త్వము ధర్మభూత జ్ఞానము, జీవుడు, మరియు ఈశ్వరుడు ఈ నాలుగింటిలో నుండు ధర్మము అజడత్వము. అజడత్వము అంటే జడము కాని దాని ధర్మము. అనగా స్వయం ప్రకాశత్వము. జడము పరప్రకాశ్యము– ఇతరముచే ప్రకాశింప చేయబడునది. శుద్ధసత్త్వమునకు, ధర్మభూతజ్ఞానమునకు సాధారణ మయిన లక్షణము – అజడము అయి ఇతరులకొరకు ప్రకాశించునట్టి ధర్మము గలిగియుండుట. శుద్ధసత్త్వము అంటే ఏమిటి? త్రిగుణద్రవ్యమున కంటే భిన్నమయ్యు, సత్త్వము గలిగియుండుటయే. ఇదియే– శుద్ధసత్త్వమే నిత్యవిభూతి, దీనికే త్రిపాద్ విభూతి యనికూడ పేరు. ఈ విభూతిలో ఉండే సత్త్వగుణము ప్రకృతికి చెందినది కాకుండా దివ్యమయిన సత్త్వము. ప్రకృతిలోని సత్త్వము రజోగుణము తమోగుణములతో మిశ్రితమయి ఉంటుంది. ఇది శుద్ధము – అమిశ్రితము. ఇది 'పరాక్' పరస్మై అంచతి ఇతరులకు ఉపయోగపడునది, ప్రకాశించునది. ఇది జడము కాదు. నిత్యవిభూతి. తనకంటే భిన్నులయిన



ఈశ్వరుడు, ముక్తజీవులకు ఉపభోగయోగ్యమయినది. ఇట్లా అజడము, పరాక్, త్రిగుణ ద్రవ్యములకంటే భిన్నమయి సత్త్వము గలిగియున్నది నిత్యవిభూతి.

దీని మొదటి లక్షణము 'త్రిగుణద్రవ్యాతిరిక్తత్వేసతిసత్త్వవత్వమ్'. ప్రకృతిలో అతివ్యాప్తిని తొలగించడానికి 'త్రిగుణద్రవ్యాతిరిక్తత్వము' అనువిశేషణము దలము. ప్రకృతి త్రిగుణద్రవ్యములు కలదియే కనుక శుద్ధసత్త్వలక్షణము ప్రసరించదు. సత్త్వవత్వము అనువిశేషణము – దలముచేత జీవునిలో ఈ లక్షణము అతిప్రసక్తము కాదు. ఇక నిత్యవిభూతి రెండవలక్షణము – నిఃశేషావిద్యానివృత్తిదేశ విజాతీ యాన్యత్వమ్ అనునది. జీవుడు నిత్యవిభూతిని చేరగనే దివ్యమయిన కరస్పర్శతో అతనిలోని అవిద్య సంపూర్ణంగా తొలగి పోతుంది. ఇట్లా నిత్యవిభూతి అనునది నిఃశేషముగా అవిద్య నివృత్తిదేశము అవుతుంది. దానికి విజాతీయము ప్రకృతి గలిగిన దేశము. దానికంటే అన్యము మరియు దానికి విజాతీయము అయినది సత్యవిభూతి. నిః శేషముగా అవిద్యా నివృత్తి దేశము శుద్ధసత్త్వము గలదియో అట్లే నిత్య విభూతికూడ శుద్ధసత్త్వగుణము కలది. అట్టి నిత్యవిభూతి పయిభాగమున అనంతమయినది. క్రింద మాత్రము (కొంతవరకే) లీలా విభూతి– ప్రకృతితో పరిచ్ఛిన్నమయి ఉన్నది. లీలావిభూతి వరకు వ్యాపించియున్నది. అది అచేతనమయ్యు స్వయంప్రకాశమానము. దానిలో జ్ఞాతృత్వము లేదు. అది ఆనందమును కలిగించునది, ఆనంద రూపమయినది. జ్ఞానమయముకూడ. ఉపనిషత్తులలోని రహస్యము అని ప్రసిద్ధిచెందిన మంత్రములు. నిత్యవిభూతిని దివ్య పంచభూతాత్మకమని నిరూపించినందున పంచోపనిషదాత్మిక, పంచ శక్తిమయీ అని కూడ పిలువబడుతున్నది.

## నిత్యవిభూతేర్భోగ్యత్వనిరూపణమ్:

**మూ:** సా విభూతిరీశ్వరస్య నిత్యానాం ముక్తానాం చేశ్వరసంకల్పాద్ భోగ్య, భోగోపకరణ, భోగస్థానరూపా చ భవతి. భోగ్యానీశ్వర శరీరాదీని, భోగోపకరణాని చందనకుసుమవస్త్ర భూషణాయుధాదీని. భోగస్థానాని తు

గోపురప్రాకారమండప విమానోద్యానపద్మిన్యాదీని. తత్ర ఈశ్వరస్య నిత్యముక్తానాం చ శరీరాణి భగవన్నిత్యేచ్ఛాసిద్ధాని. ముక్తానాం శరీరాణి తేషాం పిత్రాది సృష్టిర్యుగపదనేక శరీర పరిగ్రహ ఇత్యాదీని భగవత్సంకల్పాదేవ భవన్తి. భగవతో వ్యూహ విభవార్చావతార శరీరాణ్యప్రాకృత శరీరమత్రావిర్భవతి. ప్రాకృతా ప్రాకృతసంసర్గః కథమితి న శంకనీయమ్. శ్రీరామకృష్ణా ద్యవతార శరీరవదితి ప్రమాణానుసారేణ పరిహారో ద్రష్టవ్యః.

**అ:** ఈశ్వరునియొక్క సత్యసంకల్పము వలన ఆ నిత్యవిభూతి నిత్యులకు, ముక్తులకు, ఈశ్వరునకు కూడ భోగ్యవస్తువు, భోగసాధనము, భోగస్థానము కూడ అవుతుంది. భోగ్యములు ఈశ్వరుని శరీరము మొదలయినవి. నిత్య విభూతిలో ఈశ్వరుడు, నిత్యజీవులు ముక్తజీవులు ఉంటారు. నిత్యముక్తజీవులకు ఆ భగవంతుని దర్శనమే భోగ్యము సేవ పరమ భోగ్యము. భగవంతునకు కూడ శేషుడు మొదలయిన నిత్య ముక్తుల శరీరములు భోగ్యములు. భగవంతుని యొక్క నిత్యేచ్ఛచేత, ఈశ్వరునిది, నిత్యులవి ముక్తులవి శరీరములు ఏర్పడుతవి. ముక్తజీవులు ఎనిమిది గుణములు కలవారయి ఉంటారు. వారు తలచుకున్నప్పుడు సంకల్ప మాత్రముచేత అనేక శరీరములను ఒకసారి ధరించి ఉండగలరు. తమ పితృగణమును చూడాలనుకుంటే వారు కూడ ముక్తులముందట ప్రత్యక్షమవుతారు తమ శరీరాలతో. ఈ శక్తులన్నీ వీరికి భగవంతుని సత్య సంకల్పము ద్వారా ప్రాప్తిస్తవి.

భగవంతుని అన్ని శరీరములు- వ్యూహమున, విభవమున, అర్చావతారమున గలవి అన్ని, అప్రాకృతము - దివ్యము అయినవియే.



విగ్రహప్రతిష్ఠ తరువాత వరములు ఒసగే భగవంతుని ఇచ్ఛాధీనముగా అప్రాకృతమయిన శరీరము విగ్రహములో ఆవిర్భవిస్తుంది. వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధుడు అను నాలుగు శరీరములను వ్యూహరూపమున ఉన్న భగవానుడు ధరిస్తాడు. ఇక విభవమున రామకృష్ణాది అవతారములను ఎత్తుతాడు. అర్చారూపమున రాముడు, కృష్ణుడు, శ్రీవేంకటేశుడు మొదలయిన రూపముల మూర్తులు శిలవి, ధాతువులవి కాని కావచ్చును. కాని వాస్తవముగా అవి దివ్యమయినవి. దీనికి అవతారములలోని శరీరములు ప్రాకృతికములుగా అగుపించేవి. వాస్తవముగా అవి దివ్యములు అనే విషయము ప్రమాణముగా ప్రాకృతా ప్రాకృత సంబంధము విగ్రహములకెట్లా అను శంకను తొలగించేదిగా గుర్తించాలి. దీని బట్టి ప్రతిష్ఠ తరువాత అర్చావతారములలోని శరీరములలో కూడ దివ్యత్వము వెల్లివిరుస్తుంది.

## నిత్యవిభూతేర్దివ్యత్వ ప్రతిపాదనమ్:

**మూ:** ముక్తానాం శరీరాది పరిగ్రహస్తు వసంతోత్సవవేషపరిగ్రహాదివత్ స్వామినో ముఖవికాసహేతుత్వాత్ కైంకర్యమేవ. ఈశ్వరశరీరస్య షాడ్గుణ్య ప్రకాశకత్వాత్ షాడ్గుణ్యమితి వ్యవహారః. నిరవద్యనిరతిశ యౌజ్జ్వల్య సౌందర్య సౌగంధ్య సౌకుమార్య లావణ్య యౌవనమార్ద వార్జవాదయో దివ్యమంగలవిగ్రహ గుణాః. తస్య వ్యాపకత్వం గీతాసు ప్రసిద్ధమ్. ముక్తస్య శరీరం నాస్తీతి వచనం తు కర్మకృతశరీరాభవపరమ్. తత్ర ఇంద్రియాదీనాం నిత్యత్వాదత ఏవ కార్యకారణ భావాభావాత్ ప్రాకృతవన్న తత్త్వాంతరవ్యపదేశః. ఏతేన తత్ర శరీరాదికం నాస్తీతి మతనిరాసః అప్రాకృత శబ్దస్పర్శ రూపరస గంధాశ్రయత్వాదాకాశవ్యావృత్తిః. జ్ఞానాత్మకత్వప్రతిపాదనాత్ జడమితి మత నిరాసః.

**అ:** వసంతోత్సవమునందు వివిధవేషములను జనులు ధరిస్తూ ఉంటారు. అలాంటిదే ముక్తులు అనేకవిధములయిన శరీరాలను తీసుకోవడం, ఈ రెండు పనులు తమ యజమానులకు సంతోషము కలిగించడానికి ఉద్దేశించినవే. సేవ కింకరుడు చేయుపని. కైంకర్యము. ఈశ్వరుని శరీరమును. షాడ్గుణ్యమును శుద్ధసత్త్వము ప్రకాశింపజేస్తుంది కనుక నిత్యవిభూతికి షాడ్గుణ్యము అనిపేరు. ఆ షడ్గుణాలు ఏవనగా– జ్ఞానము, శక్తి, బలము, ఐశ్వర్యము, వీర్యము, మరియు తేజస్సు అనునవి. భగవత్ శబ్దానికి ఇవే అర్థము– షడ్గుణములు కలవాడు భగవంతుడు. ఆ దివ్యమంగళవిగ్రహము యొక్క గుణవిశేషములు ఏమనగా ఆ గుణాలు అన్ని నిత్యములు, ఎల్లప్పుడు ఉండునవి. దోషరహితములు– నిందింపరానివి– నిరవద్యములు. ఇంకా అవి నిరతిశయములు– వాటిని మించినవి లేవు అట్టివి. ఇవి గుణములకు విశేషములు. ఇక విశేష్యములయిన గుణములు – ఔజ్జ్వల్యము – దేదీప్యమానముగా ఉండుట, విగ్రహము సకలాభరణములతో ధగద్ధగాయమానముగా వెలుగుతుండటము ఔజ్జ్వల్య గుణము. ఇక సౌన్దర్యము వర్ణింపనలవికానిది అయినది.

కవులు, యామునాచార్యులవారు తమవాక్యాల్లో స్తోత్రరత్నములో బాగుగా వర్ణించారు. సౌగన్ధ్యము– ఆ దివ్యమంగళవిగ్రహము నుండి ఎల్లప్పుడు సుగంధము వెలువడుతూ ఉంటుంది. సౌకుమార్యము అతసీకుసుమమువలె నీలము వర్ణముతో ఆ శరీరము విరాజిల్లుతుంటుంది. లావణ్యము– అవయవములపొందిక, సంస్థానవిశేషముతో చూపరులను ఆకట్టుకొనునట్టి అందచందములు. యౌవనము. సర్వదా సర్వకాలావస్థలయందు యౌవనముట్టి పడుతుంది. (దేవతలకు కూడ త్రిదశత్వము మూడు దశలు, మూడు పదులు వయస్సనిన భగవంతుని గూర్చి చెప్పవలయునా.) మార్దవము – సౌమ్యత్వము పయిగుణములతో బాటు వెల్లివిరుస్తుంటుంది. (స్తోత్రరత్నమున శ్రీయామునా చార్యులవారు చాలా చక్కగా వర్ణించారు. ఈక్రిందిశ్లోకం ఆయన గుణాలను తెలుపుతుంది.



**వశీ వదాన్యో గుణవాన్ ఋజుః శుచిః**
**మృదుర్దయాలుః మధురః స్థిరః సమః**
**కృతీ కృతజ్ఞ స్త్వమసి స్వభావతః**
**సమస్తకల్యాణగుణామృతోదధిః**

ఈ శ్లోకంలో పదకొండు గుణాలను పేర్కొన్నారు. ఆర్జవము – ఋజుస్వభావము ఆర్జవము. ఇట్లా భగవంతుని దివ్యమంగళ శరీరములో సకలగుణము లున్నాయని భావము.

శ్రీమద్భగవద్గీత యందు ఆ భగవంతుని విభూతి విపులముగా కీర్తింపబడినది. ముక్తజీవులకు కర్మజన్యమయిన శరీరము ఉండదు. కాని భగవదిచ్ఛా జన్యమయిన శరీరములు ఉంటవి. వారి నిత్యశరీరముల యొక్క ఇంద్రియములు గూడ నిత్యములుగానే ఉన్నందున, వాటికి కార్యకారణ భావము లేనందున, మరియొక తత్త్వముగా వాటిని పేర్కొనరు. దీంతో నిత్యవిభూతిలో శరీరము ఉండదను వారి అభిప్రాయము తొలగిపోతుంది. తమసః పరస్తాత్– తమోగుణముకన్న అతీతముగా నిరూపించుట చేత ప్రకృతిలో ఓ భాగము మాత్రమే నిత్యవిభూతి అనువాదము కూడ నిలువజాలదు.

నిత్యవిభూతి ఆకాశము యొక్క తత్త్వమే అను వాదము కూడ సరికాదు. నిత్యవిభూతి దివ్యమయిన అప్రాకృతమయిన శబ్దస్పర్శ రూపరసగంధములకు ఆశ్రయము కాబట్టి అది ఆకాశము కాదు. దానికంటే వేరయినది నిత్యవిభూతి జ్ఞానమయము.

**'తత్రానందమయా లోకా భోగాశ్చందనలక్షణాః।**
**ఆనందం నామ తే లోకం పరమానందలక్షణమ్'॥**

అని యున్నందున నిత్యవిభూతి జడము అనేవారి మతము అభిప్రాయము నిరస్తమవుతుంది. అంతేగాదు అది ఆనంద మయము. ఆనందము అను పేరుగల ఆ నిత్యవిభూతి పరమానంద మయము.

లక్ష్మీనారాయణులకు పరమాకాశ మయిన నిత్యవిభూతియే ఉత్తమ సుఖరూప మయినది. షాడ్గుణ్యము తోనే, దాని ప్రసరముతోనే, భగవదిచ్ఛతోనే దేశముగా స్థానముగా మారింది. అనుకూలజ్ఞానవే ఆనందము. నిత్యవిభూతి జ్ఞానమయము కనుక ఆనందమయము కూడ. అది జడము కానే కాదు.

## భగవతో దివ్యమంగలవిగ్రహస్య సర్వాశ్రయత్వ ప్రతిపాదనమ్:

మూ: భగవతోఽప్రాకృతదివ్యమంగళవిగ్రహస్య అస్త్రభూషణాధ్యాయోక్తం సర్వా(ర్వతత్త్వో)పాశ్రయత్వమ్. తద్యథా పురుషస్య కౌస్తుభాకారత్వమ్. ప్రకృతేః శ్రీవత్సరూపత్వమ్. మహతో గదారూపత్వమ్ సాత్త్వికాహంకారస్య శంఖరూపత్వమ్. తామసాహంకారస్య శార్ఙ్గరూపత్వమ్. జ్ఞానస్యాసి రూపత్వమ్. అజ్ఞానస్య తదావారక రూపత్వమ్. మనసశ్చక్రత్వమ్. జ్ఞానేంద్రియకర్మేంద్రియాణాం శరరూపత్వమ్. సూక్ష్మస్థూల భూతానాం వనమాలాకారత్వమ్. అత్ర

**చేతశ్చక్రతి చేతనాస్థిరమతిస్తత్సంవృతిర్మాలికా**
**భూతాని స్వగుణైరహంకృతియుగం శంఖేన శార్ఙ్గాయతే।**
**బాణాః ఖాని దశాపి కౌస్తుభమణిర్జీవః ప్రధానం పునః**
**శ్రీవత్సం కమలాపతే। తవ గదామాహుర్మహాంతం బుధాః.॥**

**ఇతి సంగృహ్యోక్తం పద్యమనుసంథేయమ్.**

సా విభూతిరామోద ప్రమోద సమ్మోద వైకుంఠాఖ్యరూపేణ చతుర్విధా. పునరనంతా. త్రిపాద్విభూతి పరమపద పరమవ్యోమ పరమాకాశామృతనాకాప్రాకృతలోకానంద లోకవైకుంఠాయోధ్యాది శబ్దవాచ్యా చ. తస్యాం విభూతౌ ద్వాదశావరణోపేతమనేక గోపురప్రాకారైరావృతం వైకుంఠం నామ నగరమ్. తత్రానందాత్మకో దివ్యాలయః. తదన్తః రత్నమ యానేకస్తంభసహస్రైర్విరచితా మహామణిమండపాఖ్యా సభా. తస్యాం సహస్రఫణామణి తేజోవిరాజితోఽనంతః



తస్మిన్ ధర్మాదిమయ దివ్యసింహాసనమ్. తదుపరి చామరహస్తాభిర్విమలాదిభిః సేవ్యమాన మష్టదలాత్మకం పద్మమ్. తదుపరి ప్రకృష్టవిజ్ఞానధామాశేషః. తదుపరి వాచః పరం మహదద్భుతమ్. ఏవం నిత్యవిభూతిస్సంగ్రహేణ నిరూపితా.

ఇతి శ్రీవాధూలకులతిలక- శ్రీమన్మహాచార్య ప్రథమదాసేన శీనివాసదాసేన విరచితాయాం యతీంద్రమతదీపికాయాం శారీరక పరిభాషాయాం నిత్యవిభూతి నిరూపణం నామ షష్ఠోఽవతారః

**అ:** విష్ణుపురాణమందు అస్త్రభూషణాధ్యాయముకలదు. దానిలో శ్రీమన్నారాయణుని దివ్యమంగళవిగ్రహము, ఎట్లా సృష్టిలోని సమస్తమును అస్త్రములుగా, భూషణములుగా ధరించుతుందో, ఎట్లా సమస్తానికి ఆశ్రయమో నిరూపింపబడినది. పురుషుడు (అనగా ఆత్మ) జీవుడు భగవంతునకు కౌస్తుభమణి (వంటివాడు.) ప్రకృతి ఆ భగవంతునియొక్క శ్రీవత్సము పుట్టుమచ్చ. మహత్తత్వము గద దానిపేరు కౌమోదకి. సాత్త్వికాహంకారము శంఖము- పాంచజన్యము. తామసాహంకారము శార్ఙ్గము - ధనుస్సు. జ్ఞానము, ఖడ్గము. దాని పేరు నందకము. అజ్ఞానము ఆ కత్తియొక్క ఒర - కోశము. మనస్సు చక్రము - సుదర్శనము. జ్ఞానేంద్రియములు మరియు కర్మేంద్రియములు బాణములు. సూక్ష్మ భూతములు, స్థూలభూతములు రెండు వనమాలవంటివి. వీటినన్నిటిని సంగ్రహముగా చెప్పే శ్లోకం 'చేతశ్చక్రతి' మొదలయినది ఇచట గుర్తుచేసుకోవాలి.

ఆ నిత్యవిభూతి ఆమోదము, ప్రమోదము, సమ్మోదము, వైకుంఠము అని నాలుగు విధములుగా ఉన్నది. వ్యూహరూపు డయిన భగవానునివి సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు, మరియు వాసుదేవుడు అని నాలుగురూపములు గలవు. ఆమోదము సంకర్షణుని భవనము వంటిది. అట్లే ప్రమోదము ప్రద్యుమ్నుని భవనము వంటిది, సమ్మోదము అనిరుద్ధుని

భవనరూపము. ఇక వైకుంఠ మేమో వాసుదేవుని భవనము వంటిది. ఈ నాలుగు విధములయిన నిత్యవిభూతి మళ్ళీ అనంతమయినది. అనేక పేర్లున్నాయి.

శ్రీమన్నారాయణునివి రెండు విభూతులు కలవు. ఒకటి లీలావిభూతి రెండవది నిత్యవిభూతి. ఈ నిత్యవిభూతికే త్రిపాద్విభూతి అని పేరు. లీలావిభూతిలో సంపూర్ణమయిన జగత్తు ఉన్నది. అది ఒకపాదమే నాలుగవ వంతు. వైకుంఠమును త్రిపాద్ విభూతి అంటారు. పరమపదము, పరమవ్యోమ, పరమాకాశము, అమృతలోకము, నాకలోకము, అప్రాకృత లోకము, ఆనందలోకము, వైకుంఠము, అయోధ్య మొదలయినవన్ని దానిపేర్లే 'పాదో స్య విశ్వాభూతాని త్రిపాదస్యామృతం దివి.' అను శ్రుతివాక్యము కూడ పాదత్రిపాదవిభూతులనే చెప్పుతున్నది. జీవులన్ని చేరదగిన వలసిన చోటు కనుక పరమ– ఉత్కృష్టమయిన స్థానము అని పేరు. పరమపురుషుని స్థానము కనుక పరమపదమని పేరు.

పరమవ్యోమ, ఆకాశము అనడం, అది అన్నిలోకముల పయిన ఉన్నందున, పరమప్రకాశస్వరూపము అయినందునను, పరమాత్మ లోకమయి నందున అమృతలోకము, దివ్యగుణములతో కూడుకొని ఎల్లప్పుడు సుఖమయము అయినందున నాకలోకము, దివ్యములయిన పంచభూతములతో కూడినందున అప్రాకృతలోకము, ఆనందమయము అయినందున ఆనందలోకము అంటారు. అక్కడి జీవులయందు గుణాష్టకములతో నున్నవారు బాధలన్ని (కుంఠ– ఇబ్బంది, అడ్డము, బాధ) తొలగినవారు గనుక వైకుంఠము అనిపేరు. జయిం పరాని దయినందున అయోధ్య. ఇట్లా పేర్లన్ని అన్వర్థాలు. ఆ నిత్యవిభూతిలో



పన్నెండు ఆవరణములతో, అనేక గోపురములతో, ప్రాకారములతో, కూడిన వైకుంఠము అను నగరము ఉన్నది. దానిలో ఆనందము అను పేరుతో ఒక దివ్యాలయము కలదు. దానిలో రత్నమయములు, మణిఖచితము లయిన వేలస్తంభములతో నలరారు మహామణి మండపమను సభాగృహము ఉన్నది. ఆ సభయందు వేయిపడగలతో వానిపయిగల మణుల తేజస్సుతో విరాజిల్లునట్టి అనంతుడు ఉన్నాడు. అతనిపయిన ఒక దివ్యసింహాసన మున్నది. దాని నాలుగు పాదములు ధర్మమయములు. ఆ సింహాసనము పయిన అష్టదల కమలమున్నది. అక్కడ విమల మొదలగు చామరము చేబూనిన వారు వింజామరలు వీస్తుంటారు. ఆ కమలము పయి శేషుడు వెలుగొందుతున్నాడు. ఆయన జ్ఞానానికి మూర్తి. ఆశ్రయము.

ఆ ఆదిశేషుని పయి అవాఙ్మానసగోచరుడయిన శ్రీశ్రీమన్నారాయణుడు విలసిల్లుతుంటాడు. ఆయనను ఎప్పుడు చూచినను, సేవించినను కొత్తగానే ఉంటుంది. అద్భుతంగా ఇంతకు మునుపు చూడనట్టుగా ఉంటుంది. అది మహాద్భుతము, ఆయనను వర్ణించడం, సంపూర్ణంగా స్తుతించడం అలవికాని పని. విష్ణుపురాణం, భాగవతం, స్తోత్రరత్నం, కొన్ని భక్తివాక్యాలు ఆ లీలామానుష విగ్రహుని వర్ణించగలిగాయి. నిత్యవిభూతిని మాత్రం వర్ణించలేకపోయాయి. ఓశ్లోకంలో ఆయన వర్ణన ఇలా ఉంది. "ఆశ్రితుల యొక్క పాపములను హరించునట్టి ఎడమపాదమును చూపుకొని కుడిపాదమును మడిచి మోకాలుపయిపెట్టికొని ఉన్నాడు. కుడిఎడమ చేతులను శేషుని శరీరము మీద ఉంచాడు. వెనక రెండు చేతులతో శంఖమును చక్రమును ధరించి ఉన్నాడు. శ్రీదేవి, భూదేవులతో, హారకేయూర గ్రైవేయకాది అలంకారములతో విరాజిల్లుతున్న శ్రీవైకుంఠనాథుడు జగములనన్నిటికి సుఖసంతోషములతో గాచుగాత."

'సవ్యం పాదం ప్రసార్యాశ్రిత దురితహరం దక్షిణం కుఞ్చయిత్వా
జానున్యాధాయ సవ్యేతరమితరభుజం నాగభోగే నిధాయ!
పశ్చాద్ బాహుద్వయేన ప్రతిభటశమనే ధారయన్ శఙ్ఖచక్రే
దేవీభూషాదిజుష్టో వితరతు జగతాం శర్మ వైకుణ్ఠనాథః.

అని ఆ శ్లోకము. ఇట్లా నిత్యవిభూతినిరూపణము ముగిసినది.

శ్రీవాధూలతిలకుడయినట్టి శ్రీమన్మహాచార్యుని ప్రథమదాసుడయిన శ్రీనివాస దాసునిచే రచింపబడిన యతీంద్రమతదీపికయను శారీరక పరిభాషయందు నిత్యవిభూతి నిరూపణము అను ఆఅవ అవతారము.

**సమాప్తము.**



# అథ సప్తమావతారః

## ధర్మభూతజ్ఞానస్య లక్షణాదికమ్:

**మూ:** అథ క్రమప్రాప్తం ధర్మభూతజ్ఞానం నిరూప్యతే. సంవిత్ స్వయం ప్రకాశత్వే సతి అచేతనద్రవ్యత్వే సతి సవిషయత్వమ్. (స్వయంప్రకాశాచేతన ద్రవ్యత్వే సతి విషయిత్వమ్), విభుత్వే సతి ప్రభావద్ద్రవ్యగుణాత్మకత్వమ్. అర్థప్రకాశో బుద్ధిరిత్యాది తల్లక్షణమ్. తద్ధర్మ భూతజ్ఞానం ఈశ్వరస్య నిత్యానాం చ సర్వదా నిత్యమేవ విభు చ, బద్ధానాం తిరోహితమ్. ముక్తానాం పూర్వం తిరోహితమనన్తరమావిర్భూతమ్. నను జ్ఞానస్య నిత్యత్వే జ్ఞానముత్పన్నమ్. జ్ఞానం వినష్టమితి వ్యవహారః కథమితి చేత్; తదుచ్యతే. జ్ఞానన్య సఙ్కోచవికాసావ స్థామాదాయ తత్సమ్భవాత్. దృతేః పాదాద్యథోదకం క్షరతి తథా జ్ఞానమపి ఇన్ద్రియద్వారా నిస్సృత్యార్థేన సన్నికృష్యతే. అహికుణ్డలవత్ సఙ్కోచవికాసౌ.

**అ:** నిత్యవిభూతిని నిరూపించిన తరువాత, ద్రవ్యమయిన ప్రమేయములలో శుద్ధసత్త్వము తర్వాతి దయిన ధర్మభూతజ్ఞానము ఈ అవతారమున నిరూపింపబడుతున్నది.

ఈ ధర్మభూతజ్ఞానము యొక్క మొదటి లక్షణము ఏమనగా– ఏది స్వయంప్రకాశము అవుతూ, అచేతనద్రవ్యము అవుతూ, విషయము కలది అవుతూ ఉన్నట్టి జ్ఞానమో అది ధర్మభూతజ్ఞానము. జ్ఞానము అనునది స్వయంప్రకాశము, తాను ప్రకాశించుటకు మరిదేనిపయిన ఆధారపడదు. కేవలం స్వయంప్రకాశమే లక్షణము అయితే జీవునిలో, ఈశ్వరునిలో కూడ ఈ లక్షణము పొసగుతుంది. కనుక అతివ్యాప్తి వస్తుంది. దీనిని వారించడానికి అచేతనమయిన ద్రవ్యము అది దలము విశేషణము. ఇద్దరు చేతనులు గనుక అతివ్యాప్తి ప్రసక్తము కాదు. ఇంతమాత్రమే లక్షణము అయితే నిత్యవిభూతిలో అతివ్యాప్తి కలుగుతుంది. నిత్యవిభూతి స్వయంప్రకాశము మరియు అచేతనము కూడ. కనుక దీనిని వారించడానికి లక్షణములో సవిషయము అను దలము చేర్చడం జరిగింది.

జ్ఞానము తనకన్న వేరయిన జ్ఞేయములయిన పదార్థాలనన్నిటిని విషయము చేస్తుంది. నిత్యవిభూతి దేనిని విషయముగా చేయదు. కనుక సవిషయత్వపదము సార్థకము. ఇక రెండవలక్షణము అంతట వ్యాపించి ఉన్నదయి– విభువు అయి, కాంతివంతమయిన ద్రవ్యమునకు గుణము కావడము ధర్మభూతజ్ఞానము, అన్ని ద్రవ్యములతో సంయోగము కల్గియుండుట విభుత్వము. జ్ఞానము సర్వద్రవ్యములతో సంయోగము కలిగి ఉంటుంది. ప్రభ– కాంతి అనునది ప్రభావద్ ద్రవ్యము యొక్క గుణము. ప్రసరిస్తూ ఉంటూ ప్రభ అనునది పదార్థాల నన్నిటినీ తన విషయములుగా చేస్తుంటుంది. అట్లే జ్ఞానముకూడ ప్రసరణము విషయములను తన విషయములుగా చేసుకుంటుంది. ఆ ప్రభకూడ ప్రభావద్ ద్రవ్యముయొక్క గుణమే కనుక దానిలో అతి వ్యాప్తి కలుగుతుంది. దీనిని వారించడానికి 'విభుత్వేసతి' అను దళము. ప్రభలో ఈ వ్యాపకత్వము లేనందున, అతివ్యాప్తి తొలగిపోతుంది. జ్ఞానమును గుణము అని చెప్పడంతో అది ఎల్లప్పుడు తన ఆశ్రయమును ఆశ్రయించి ఉంటుంది అని చెప్పినట్లయినది. అంతమాత్రమున ఇది అద్రవ్యము అని అభిప్రాయము కానే కాదు.

కాలము ఒక ద్రవ్యము. ఎల్లప్పుడు నియతముగా పరమాత్ముని ఆశ్రయించి ఉంటుంది గనుక కాలములో జ్ఞానలక్షణము సరిపోయినందున అతివ్యాప్తి కలుగుతుంది. కనుక 'కాలజ్ఞాన భిన్నత్వే సతి' అని దళము. ఈశ్వరుడు సర్వవ్యాపకుడు, మరియు కాలము కంటే భిన్నుడు అయినవాడు. అతనిలో ధర్మభూత జ్ఞానలక్షణమునకు అతివ్యాప్తి కలుగుతుంది. దానిని తొలగించడానికి ఒక ద్రవ్యమునకు గుణము లేదా ద్రవ్యము గుణము అయినది అని విశేషణము. ఈశ్వరుడు ఏ ద్రవ్యమునకు గుణము కానందున అతివ్యాప్తి తొలగిపోతుంది. విషయములను ప్రకాశింపజేయునది అని ధర్మభూతజ్ఞానము యొక్క మూడవలక్షణము. ఈశ్వరుని యొక్క మరియు నిత్యముక్త జీవులయొక్క ఈ జ్ఞానము నిత్యము మరియు వ్యాపకము. వారికి అన్నీ జ్ఞానవిషయములే. బంధములో ఉన్నజీవుల యొక్క జ్ఞానము ముక్తికి మునుపు తిరోహితము (మరుగున పడి, కప్పబడి– ఉన్నది) ముక్తి కలిగిన తరువాత వారిజ్ఞానము



సర్వమును విషయముగా చేసుకుంటుంది. అన్నీ వారికి తెలుస్తవి. బద్ధులయిన జీవులయొక్క జ్ఞానము వారుచేసుకున్న కర్మలవలన తిరోహితమయిఉంటుంది. అన్నిటిని తెలుసుకొనలేదు.

మీరు జ్ఞానము నిత్యము అంటున్నారు కద. అట్లా అయితే జ్ఞానము కలిగింది పోయింది అని, దాని పుట్టుక నాశములు ఎట్లా కలుగుతవి అని ప్రశ్న కలుగుతుంది. సమాధానము ఏమంటే జ్ఞానము యొక్క వికాసమే జ్ఞానము పుట్టుక అను వ్యవహారమునకు కారణము. అట్లే సంకోచమే దాని నాశము అను వ్యవహారానికి మూలము. ఈ ధర్మభూత జ్ఞానము అందరిలో ఉంటుంది. వేరువేరుగా ఉంటుంది. ఆ జ్ఞానం అన్నిటిని గ్రహించేశక్తి కలది అయి ఉంటుంది. అదే దానిస్వభావము. అయినప్పటికి వారు బద్ధులయి ఉన్నప్పుడు వారువారు చేసుకున్న కర్మలను బట్టి కొద్దిగానో గొప్పగానో ఆ జ్ఞానముంటుంది వారికి. సంకుచితంగానే ఉంటుంది. కనుక సర్వాన్ని గ్రహించలేదు. జ్ఞానప్రసరణము ఇంద్రియములద్వారానే జరుగుతుంది. ఇంద్రియములపయి ఆధారపడియే జ్ఞానము కలుగుతుంది. ప్రసరణము జరిగితే జ్ఞానము పుట్టినట్టు ప్రసరణము ఆగిపోతే జ్ఞానము నష్టము అయినట్టు లెక్క.

ధర్మభూతజ్ఞానం నిత్యమే. కాని ఇంద్రియసాపేక్షము కనుక జ్ఞాన ప్రసరణము కూడ ఇంద్రియాధీనమే. ఇక్కడ రెండు దృష్టాంతాలు. ఒకటి నీళ్ళు మోసుకపోయేతిత్తి (దృతి) రంధ్రములనుండి నీరు ఎట్లా ఒక్కొక్కబొట్టుగా పడుతుందో అట్లానే జ్ఞానము కూడ ఇంద్రియములు అను రంధ్రములనుండి వెలువడి విషయములతో సంబంధము కల్గిఉంటుంది. సంకోచవికాసములకు దృష్టాంతము. పాముపడగలో కుంచించుకపోవడము, వెడల్పు అవడం ఎట్లానో జ్ఞానములోకూడ అట్లా వికాసము మరియు సంకోచములు కలుగుతుంటవి. తెలుసుకొనువాడు – జ్ఞాత నిత్యుడయి నందు వలన ఆతని ధర్మభూతజ్ఞానము కూడ నిత్యమే. ఆత్మ ఉన్నంతవరకు ఉండునట్టి ధర్మము జ్ఞానము. నిత్యఆత్మ యొక్క జ్ఞానము నిత్యమయినది.

## సర్వం జ్ఞానం స్వతః ప్రమాణం స్వప్రకాశం చ :

**మూ:** సర్వం జ్ఞానం స్వత ఏవ ప్రమాణమ్ స్వయంప్రకాశం చ. విప్రతిపన్నా సంవిత్ స్వగతవ్యవహారం ప్రతి స్వాధీనకించిత్కరా. స్వజాతీయ సంబంధా నపేక్ష్యవ్యవహారహేతుత్వాత్. అర్థేంద్రియ దీపాదివత్. న చ చక్షురాలోక యో స్సజాతీయత్వం,ఆహంకారిక తైజసయోర్భేదాత్ (ద్భేదః) అనేన జ్ఞానస్య క్షణికత్వం త్రిక్షణావస్థాయిత్వం ప్రాతిభాసికవద్ వ్యావహారికస్యాపి మిథ్యాత్వం పరతః ప్రామాణ్యం, జ్ఞానస్యైవాత్మత్వమిత్యాదిపక్షాః నిరస్తాః. స్తమ్భః స్తమ్భహః ఇత్యాది ధారావాహికజ్ఞానం తు ఏకమేవ.

**అ:** జ్ఞానము అంతయు స్వతః ప్రమాణము మరియు స్వయం ప్రకాశము. జ్ఞానము స్వతఃప్రమాణమా? పరతః ప్రమాణమా? అనగా జ్ఞానమును ఇది జ్ఞానము ప్రమాణము అని తెలిపేది మరిఒకటి అవసరమా? ఈ విషయములో దార్శనికులలో భిన్నాభిప్రాయాలున్నాయి. నైయాయికులు జ్ఞానమును పరతః – ఇతరముల వలన ప్రమాణముగా ఒప్పుకుంటారు. జ్ఞానమునకు ప్రమాత్వము అనుగుణము ప్రమాణము యొక్క గుణముల ద్వారా కలుగుతుంది. ఇంద్రియ సన్నికర్షము వస్తువులతో కలసి ప్రత్యక్షజ్ఞానమునకు ప్రమాత్వమును కల్పిస్తుంది. స్వతంత్రుడయిన వక్తయొక్క ఆప్తత్వము (యథార్థమును చెప్పువాడు ఆప్తుడు– ఆప్తస్తు యథార్థవక్తా) అనుగుణములతో శబ్దము వలన కలుగు జ్ఞానమునకు ప్రమాత్వము కలుగుతున్నది. అలాగే వేదములు, ఇతరగ్రంథములు వలనకలిగే శబ్దజ్ఞానానికి కూడ ప్రామాణ్యము సిద్ధిస్తుంది. కనుక జ్ఞానము పరతః ప్రమాణము.

ఈ వాదము సరి యయినది కాదు. వస్తువును ఉన్నది ఉన్నట్టు ప్రకాశింపజేయడము జ్ఞానము యొక్క స్వభావము. దాహకత్వము – కాల్చునట్టి గుణము, అగ్నికి ఎట్లా స్వాభావికమో అట్లాగే జ్ఞానానికి ప్రామాణ్యము స్వాభావికమే. భ్రమజ్ఞానము కలిగినచోట కూడ ధర్మియొక్క జ్ఞానము భ్రమరహితమే. జ్ఞాతదోషమువలన భ్రమ కాదు. వస్తువు యొక్క – భ్రమాంశము యొక్క దోషము వలన జ్ఞానానికి అప్రామాణికత్వము వస్తుంది. దాహకమయిన



అగ్నికి ప్రతిబంధకముల వలన దాహకత్వము అడ్డగింపబడుతున్నది. ఒక కారణమువలన కలిగినది కానందున ఈశ్వరుని జ్ఞానము స్వతఃప్రమాణము, దోషములు లేనందున ఈశ్వరుని నిత్యజ్ఞానము ప్రామాణికము, దోషములు లేనందున అపౌరుషేయ వేదవాక్య జ్ఞానము ప్రామాణికము. అట్లే ఒకవస్తువు జ్ఞానము కలుగు తున్నప్పుడు ఆ వస్తువు ఉండటమే ఆ జ్ఞానము యొక్క ప్రామాణికతను ఋజువు పరుస్తుంది. కాబట్టి జ్ఞానము స్వతఃప్రమాణము.

ఈ జ్ఞానము స్వయం ప్రకాశము కూడ. ఈ జ్ఞానము తనకు విషయములుగా వ్యవహరింప బడేవాటి గురించి స్వయంప్రకాశమే. ఎందుకంటే జ్ఞానవ్యవహారములో విషయమయిన ఇంద్రియము, దీపము ఇతరమును అపేక్షింపకనే జ్ఞానమును కలిగిస్తున్నవి. ఇది ఘటము అనే ఘటజ్ఞానము సజాతీయమయిన మరియొక ఘటజ్ఞానాన్ని కోరకుండా స్వయంగానే కలుగుతుంటుంది. తనకంటె విజాతీయమయిన ఆత్మను కోరుతుంది. ఇంద్రియాలు కూడ మరియొక ఇంద్రియసహాయమును అపేక్షించవు. కాని ప్రకాశమును అపేక్షిస్తాయి. దీపము ప్రకాశముకొరకు మరియొక దీపాన్ని కోరదు. కాని చక్షురింద్రియముంటే కనబడుతుంది. ఇవి అన్ని తమకంటే భిన్నమయిన ఆత్మను అపేక్షించి జ్ఞానమును కలిగిస్తాయి ఆత్మకు. ఇట్లా జ్ఞానము స్వయంప్రకాశము కూడ. చక్షురింద్రియము ప్రకాశాన్ని అపేక్షిస్తున్నది.

రెండు తేజస్సుకు చెందినవే అనరాదు. ఎందుకనగా చక్షురింద్రియానికి ఉపాదానకారణము సాత్త్వికాహంకారము. ఇకప్రకాశము – ఆలోకము తైజసము. చక్షురింద్రియమునకు తేజస్సు పోషణమాత్రము ఇస్తుంది. రెండు విజాతీయములు. జ్ఞానమును ప్రకాశింపజేయడానికి మానసప్రత్యక్షమును కల్పించడము సబబుకాదు, అది స్వయంప్రకాశము అయినందున. ఆ కల్పనలో అనవస్థాదోషము కూడ కలుగుతుంది. ఒకజ్ఞానమును ప్రకాశింపజేయడానికి మరొక మానసప్రత్యక్షము. దానికొరకు మరో ప్రత్యక్షము ఇట్లా అంతు అంటూ ఉండదు.

జ్ఞానము మానసప్రత్యక్షము అనిచెప్పడానికి ఉపయోగించిన రెండు హేతువులు అసిద్ధి, వ్యభిచార దోషములు కలవి. జ్ఞానము క్షణికము అవుతూ ఆత్మవిశేషగుణము అనునది మొదటి హేతువు. పయిన జ్ఞానము నిత్యము అని నిరూపించినందున అసిద్ధి దోషము. రెండవ హేతువు– జ్ఞానము యోగ్యము అవుతూ ఆత్మ యొక్క విశేష గుణము అని. జ్ఞానము మానసప్రత్యక్షము యొక్క యోగ్యవిషయము కానందున అసిద్ధిదోషము.

బౌద్ధులు చెప్పినట్టు జ్ఞానము ప్రతిక్షణము కొత్తగా పుట్టునది కాదు. నిత్యము అయినందున, నైయాయికులు చెప్పినట్టు జ్ఞానము పుడుతుంది ఒక క్షణంలో, రెండవక్షణంలో మాత్రముంటుంది. మూడవక్షణంలో నశిస్తుఉంటుంది. అనేదికూడ నిలువదు. అద్వైతులు జ్ఞానమును ప్రాతిభాసికము, వ్యావహారికము, పారమార్థికము అని మూడువిధాలుగా విభజించి మొదటిది భ్రమస్థలములో కలిగే జ్ఞానమని, ఘటాది విషయకమయిన జ్ఞానము కేవలము వ్యావహారికము అని బ్రహ్మజ్ఞానము మాత్రము పారమార్థికము– సత్యము. మిగతవి మిథ్యా జ్ఞానము అని అంటారు. వీరు బౌద్ధులు జ్ఞానమునే ఆత్మ అంటారు. ఈ పక్షాలన్ని జ్ఞానము, నిత్యము, స్వతఃప్రమాణము, స్వయంప్రకాశము అని నిరూపించినందున తొలగిపోతాయి.

భాట్ట మీమాంసకులు జ్ఞానమును స్వయంప్రకాశము అని ఒప్పుకోక ప్రాకట్యానుమేయము అంటారు. జ్ఞానమువలన విషయములో (ఘటాదులలో) ప్రకాశము అనే ధర్మము కలుగుతుంది.ఆ ధర్మాన్ని బట్టి జ్ఞానము కలిగింది అని అనుమానము ఏర్పడుతుంది, అని; జ్ఞానము వలన విషయములో ఉత్పన్నమయ్యే ధర్మానికే ప్రకాశము, ప్రాకట్యము, జ్ఞాతత అనిపేర్లు. కలిగే సుఖదుఃఖాలను బట్టి వాటి కారణమయిన పుణ్యపాపముల అనుమానం కలిగినట్టుగా ధర్మమువలన జ్ఞానము అనుమానింపబడుతుంది. అయితే ఇది సరికాదు. ధర్మము ఏదయినా ఉత్పత్తి అయితే మనకు కనబడాలిగద. కనబడడంలేదు కనుక ఉత్పత్తి



అవడంలేదు. ఘటాదిజ్ఞానము కలిగి నప్పుడల్లా ఘటాదివిషయకజ్ఞానము ప్రకాశిస్తునే ఉంటుంది. కనుక ఘటాదివిషయములను ప్రకాశింపజేయునట్టి జ్ఞానము స్వయంప్రకాశమే.

ఏదయినా పదార్థము విషయములో ధారారూపముగ జ్ఞానము కలుగడాన్ని ధారావాహికజ్ఞానము అంటారు. ఉదాహరణకు ఓ స్తంభం విషయంలో కలిగే స్తంభం, స్తంభం స్తంభం అని ప్రవాహరూపమున కలిగే జ్ఞానాన్ని ధారావాహిక జ్ఞానం అంటారు. ఇక్కడ ప్రశ్న ఏమంటే– ఎట్టి వ్యవధానము– అడ్డము, ఆగిపోవడము లేకుండ ప్రకాశించు ప్రసరించు పొడవయిన సూర్యకిరణములాగా ఆ జ్ఞానము ఒకటేనా ప్రవహించేది? లేదా ప్రతిక్షణము లభించే వత్తి నూనెల సహాయములో ప్రతిక్షణము పుడుతూ నశిస్తూ పుడుతూ ఉండే దీపసంతానములాగ జ్ఞానసంతానమే ధారావాహిక జ్ఞానమా అని ప్రశ్న. ధారావాహిక స్థలములోని జ్ఞానము కూడ ఒకటే కాని సంతాన జ్ఞానము కాదు.

## జ్ఞానస్య నిత్యత్వేఽపి జాగరాదిదశానాముపపాదనమ్:

**మూ:** నను, ఆగమబలాత్ జ్ఞానస్య నిత్యత్వాఙ్గీకారే కథం జాగర సుషుప్త్యాది భేదసిద్ధిరితి చేన్న. యథా దాహకస్య వహ్నేః దాహ్యసన్నిధౌ మణ్యాది ప్రతి బంధకాద్ దాహాభావః. తద్వత్ జ్ఞానతిరోధాయకతమో విశేషసన్నిధానా సన్నిధానాభ్యాం స్వాపాదిసిద్ధిః. పుంస్త్వాదివచ్చ. పుంస్త్వాదికం తు బాల్యే తిరోహితం యౌవనే ఆవిర్భవతి. యో యదాశ్రిత స్వభావః, స తస్య గుణలక్షణ లక్షితత్వాద్ జ్ఞానం గుణః; విశేషణాదివత్.

**అ:** ఆగమబలముచేత – శాస్త్రము చెప్పినందువలన జ్ఞానమును నిత్యమని అంగీకరించవచ్చును. 'న విజ్ఞాతుర్విజ్ఞాతేర్విపరిలోపో విద్యతే' అని బృహదారణ్యక ఉపనిషత్తు తెలుపుతున్నది. అవినాశి అయిన ఆత్మకు ఈ జ్ఞానము అపృథక్ సిద్ధమయిన – అనగా ఆత్మను విడచి ఉండనిది, ధర్మము. కనుక ఆత్మ

ఉన్నంతవరకు జ్ఞానముంటుంది. ఆత్మ నిత్యము, జ్ఞానమూ నిత్యమే. బాగుంది ఇట్లా ఒప్పుకుంటే ఒక ఇబ్బంది ఉంది. అదేమంటే– జ్ఞానము యొక్క స్వభావము ఏమనగా తన విషయములను తనకు ఆశ్రయభూతమయిన ఆత్మను ప్రకాశింప జేయడము.

మరి ఆత్మ నిత్యమయితే, జ్ఞానము నిత్యము అయితే జ్ఞానము ఎల్లప్పుడు ఇంద్రియముల ద్వారా వెలువడి ప్రకాశము కలిగిస్తుండ వలసివస్తుంది ఆత్మకు. జ్ఞానము తన విషయములప్రకాశనమును తనకు ఆశ్రయమయిన ఆత్మకు కలిగించే సమయమును జాగ్రదవస్థ అంటారు. నిత్యత్వమును జ్ఞానానికి ఒప్పుకుంటే ఆ జ్ఞానం ఎల్లప్పుడు తన కాశ్రయమయిన ఆత్మకు ఎల్లప్పుడు విషయములను ప్రకాశింప జేయవలసివస్తుంది. అప్పుడు ఎప్పటికి జాగరదశనే ఉంటుంది.

మరి నిద్ర, స్వప్నము మొదలయిన దశలు ఎట్లా కలుగుతవి. అవి– ఆత్మకు స్వాపాదిదశలు కలుగకుండ పోవలసి వస్తుంది. అవి కలుగుతున్నవి కనుక జ్ఞానము నిత్యము కాదు అనిప్రశ్న– శంక. దీనిజవాబు–జ్ఞానము యొక్క వికాసమునకు కారణము సత్త్వ గుణము. జ్ఞానమునకు ప్రతిబంధకము జ్ఞానమును కలుగకుండ చేయునది, తమోగుణము. సత్త్వగుణము ఎక్కువగా ఉంటే జ్ఞానము యొక్క వికాసము కలుగుతుంది. ఇదే జాగ్రదవస్థ ఆత్మకు. తమోగుణము ఎక్కువయితే నిద్రవస్తుంది ఈ దశలో జ్ఞానము పూర్తిగా అడ్డగింపబడుతుంది. అగ్నిమండకుండ– ప్రతిబంధకమయిన చంద్రకాంతమణి సంయోగముంటే, దహించదు. అట్లాగే ప్రతిబంధకమయిన తమోగుణము అధికమవడంచేత జ్ఞానము విషయములను ప్రకాశింప జేయదు. తమస్సు అనడంలోనే చీకటి తెలుస్తున్నది. ప్రతిబంధకమయిన మణిని తొలగించడంతో అగ్ని దహించినట్లు ప్రతిబంధకమయిన తమోగుణము తొలగిపోతుందో అప్పుడు జ్ఞానము యొక్కవికాసము జరుగుతుంది. ఇదే ఆత్మ యొక్క స్వాపాదిదశ,



జాగరదశలోని పరమార్థము. ప్రతిబంధకతమోగుణముంటే స్వాపము తొలగిపోతే జ్ఞానము. ప్రకాశింపజేస్తుంది. గనుక జాగరదశ.

ఈ విషయమునే బాదరాయణమహర్షి 'పుంస్త్వాదివత్తస్య సతో ఽభివ్యక్తియోగాత్ –2–3–31 అను సూత్రము ద్వారా తెలిపారు. బాల్యావస్థలో బయటపడని– అభివ్యక్తముకాని మగతనము యౌవనావస్థలో బయటపడుతుంది – అభివ్యక్తము అవుతుంది. ఇట్లాగే ఆత్మగుణమే జ్ఞానము స్వాపావస్థలో బయటపడదు. జాగ్రదవస్థలో అభివ్యక్తమవుతుంది. ఆత్మాశ్రితమయినందున జ్ఞానము ఆత్మగుణము. ఏది దేనిని ఆశ్రయించి ఉంటుందో దానిగుణము విశేషణము విశేష్యమును ఆశ్రయించి ఉంటుంది గద, కనుక విశేషణము విశేష్యము యొక్క గుణమన్నమాట. దీని వలన జ్ఞానము, ఆత్మగుణము, నిత్యము అయినా స్వాపము, జాగ్రదవస్థ అనేవి సిద్ధిస్తవి అని తాత్పర్యము.

## జ్ఞానస్య ద్రవ్యత్వసమర్థనమ్:

**మూ:** యతః సంకోచవికాసావస్థావత్ అతో ద్రవ్యమపి భవతి. ఆత్మగుణ భూతస్య జ్ఞానస్య ద్రవ్యత్వం కథమితి న శఙ్కనీయమ్. ప్రభావదేకస్యైవ ద్రవ్యత్వగుణత్వ యోర్విరోధాభావాత్. అవస్థాశ్రయో ద్రవ్యమితి హి ద్రవ్యలక్షణమ్. స్వాశ్రయాదన్యత్ర వర్తమానత్వమపి ప్రభా వదుపపద్యతే. ప్రయోగశ్చ, గుణభూతా బుద్ధిర్ద్రవ్యమ్, ప్రసరణాదిమత్త్వాత్, ఆత్మవదితి. ముక్తజ్ఞానస్య యుగపదనన్త దేశసంయోగో నయనసూర్యాదితేజోవత్ సమ్భవతి.

**అ:** జ్ఞానము ఆత్మయొక్క గుణము అవుతూ ద్రవ్యము కూడ దానిలో సంకోచము వికాసము వంటి అవస్థలు క్రియారూప మయినవి ఉన్నాయి. కనుక అవస్థలకు ఆశ్రయ మయినది ద్రవ్యము, కుండ, కపాలములు, పొడి, ముద్దమొదలయిన అవస్థలకు ఆశ్రయమయిన మన్ను ద్రవ్యము అయితే ఇక్కడ ఓ ప్రశ్న తలెత్తవచ్చు– ఒకే జ్ఞానము, గుణము ద్రవ్యము ఎట్లవుతుంది? జవాబు ఏమంటే– గుణములు రెండు రకములు. ద్రవ్యాత్మకమయిన గుణము, కేవలము

గుణము. జ్ఞానము, ప్రభ మొదలయినవి ద్రవ్యాత్మక గుణములు. సత్త్వము, రజస్సు, తమస్సు కేవలము గుణములు. ద్రవ్యాత్మక గుణములలో గుణశబ్దము గౌణముగా –అప్రధానముగాను, కేవలము గుణములలో గుణశబ్దము ప్రధానముగా ఉపయోగింపబడుతుంది. ద్రవ్యాత్మకమగు గుణమయిన ప్రభ తన ప్రభావత్ ద్రవ్యమయిన దీపాదులయొక్క గుణము అవుతూ ద్రవ్యముగా ఒప్పుకోబడినట్లు జ్ఞానము కూడ ఆత్మగుణమవుతూ, సంకోచవికాసములు కలిగినందున ద్రవ్యము అని ఒప్పుకోబడుతుంది. ద్రవ్యలక్షణము అవస్థలకు ఏది ఆశ్రయమో అది ద్రవ్యము అని. అంతే గాని అది గుణము కావద్దు అని ద్రవ్యలక్షణము కాదు.

ఇక్కడ ఒక ప్రశ్న – గుణము తన ఆశ్రయమును వదలి మరియొకచోట ఉండదు. గంధము పృథివిలోనే ఉంటుంది. ఇంకో చోట వుండదు. శబ్దము ఆకాశములో వుంటుంది. కాని జ్ఞానము ఆ యా విషయములతో సంబంధం కలిగి వుంటుంది. ఇది ఎట్లా వీలవుతుంది అని. జవాబు ఏమంటే ప్రభ తన ఆశ్రయద్రవ్యమయిన దీపమునుండి వెలువడి అన్ని వస్తువులను జేరి వాటిని ప్రకాశింపజేస్తున్నది. అది ప్రభావద్ ద్రవ్యము యొక్క గుణము. అట్లే జ్ఞానము గుణము అయినా రూపము రసము మొదలుగాగల వాటిని ప్రకాశింపజేస్తుంది. దీంట్లో ఏమి విరోధము లేదు. ఈ విషయాన్ని అనుమాన ప్రయోగము ద్వారా సాధిస్తారు గ్రంథకర్త. ఆత్మయొక్క గుణము అయిన బుద్ధి, ద్రవ్యము– ప్రసరించుట, సంకోచించుట, విస్తరించుట మొదట అయిన క్రియలు కలది కనుక. ఏది ప్రసరణాది క్రియలు గలదో అది ద్రవ్యము– ప్రభా‌ద్రవ్యము, రెండవది జ్ఞానము ద్రవ్యము– అది సంయోగము మరియు అదృష్టమునకంటే భిన్నమయినది మరియు భావన అను సంస్కారమునకు కారణము కూడ.ఆత్మవలె. ఆత్మసంయోగము మరియు అదృష్టమునకంటే భిన్నమయినది మరియు భావన అను సంస్కారమునకు కారణము. జ్ఞానము అలాటిదే గనుక ద్రవ్యము, నేత్రములు, సూర్యునితేజస్సు ఒకే కాలములో అనేక విషయములతో సంబంధము కలిగి ఉన్నట్లు ముక్తులు



జ్ఞానము కూడ ఒక కాలములో అనేక దేశాలతో (ప్రదేశము– స్థానము) సంబంధము కలిగి ఉంటుంది.

## జ్ఞానస్య వివిధాని నామాని రూపాణి చః

**మూ:** జ్ఞానమ్, మతిః, ప్రజ్ఞా, సంవిత్, ధిషణా, ధీః, మనీషా, మేధా, బుద్ధిః, ఇత్యేవమాదయశ్శబ్దాః జ్ఞానపర్యాయాః. బుద్ధిరేవోపాధిభేదాత్ సుఖదుః ఖేచ్ఛాద్వేష ప్రయత్నరూపా. సుఖాదే (స్వజనకతయా) ర్జనకతయాభ్యుపగత జ్ఞానాతిరేకే ప్రమాణాభావాత్ ఇచ్ఛామి, ద్వేష్మీతి వ్యవహారస్య స్మరామీత్యాదివత్ జ్ఞానవిశేషేణోపపత్తేః.

**అ:** జ్ఞానమును తెలుపు శబ్దములెన్నియో కలవు అవి– మతిః, ప్రజ్ఞా, సంవిత్, ధిషణా, ధీః, మనీషా, శేముషీ, బుద్ధి– ఇవి అన్నియు జ్ఞాన పర్యాయవాచకశబ్దాలు. ఈ బుద్ధియే ఉపాధి యొక్క భేదము చేత సుఖము, దుఃఖము, ఇచ్ఛ, ద్వేషము, ప్రయత్నము అను భిన్నరూపాలు గల్గి యుంటుంది. సుఖమును కల్గించు విషయముల యొక్క జ్ఞానమే సుఖము. అట్లే దుఃఖము కూడ. సుఖమును అనుభవించునప్పుడు ఇంద్రియములు సుస్థితములుగా ఉంటవి. సుస్థితాని ఖాని అని సుఖశబ్దము యొక్క విగ్రహవాక్యము. అట్లే దుః స్థితాని ఖాని దుఃఖానికి, ఏదయినా కావాలనే జ్ఞానాన్ని ఇచ్ఛ అంటారు. అయిష్టము కల్గించు జ్ఞానమే ద్వేషము. కార్యము – పని చేయడానికి నిశ్చయము చేసుకోవడమే అధ్యవసాయము– ప్రయత్నము. ఇవి అన్ని జ్ఞానము యొక్క విస్తృతి విశేషాలు. జ్ఞానమే సుఖము మొదలయిన అనుకూల ప్రతికూల ప్రతీతులను కలిగిస్తుంది. జ్ఞానము తప్ప మరి యే పదార్థము సుఖము మొదలయిన వాటిని కలిగించదు. స్థావరములలో తిర్యక్కులలో (పశుపక్ష్యాదులలో) జ్ఞానము తక్కువగా ఉంటుంది. అందువలన అవి సుఖాదులను తక్కువగా అనుభవిస్తవి. నేను స్మరించుచున్నాను అను ప్రతీతికి ఆధారము అతీతములయిన దేశకాలములలో అనుభవించిన విషయముల యొక్క జ్ఞాన విశేషమే. అట్లాగే

నేను కోరుతున్నాను నేను ఇష్టపడటం లేదు. మొదలయిన అనుభవాలకుకూడ జ్ఞానవిశేషమే కారణము. ఇచ్ఛాప్రయత్న ద్వేషసుఖదుఃఖాదులు అనేవి వేరుకాదు. జ్ఞానము యొక్క రూపములే అని భావము.

## ధర్మభూతజ్ఞానస్య వివిధా అవస్థావిశేషాః

**మూ:** నను కామస్సఙ్కల్పో విచికిత్సా శ్రద్ధా, శ్రద్ధా ధృతి రధృతిః హ్రీః ధీః భీరిత్యేతత్సర్వం మన ఏవేత్యుక్తం. జ్ఞానరూపత్వం కథమితిచేన్న; జ్ఞానస్య మనస్సహకారిత్వ నియమాత్ మన ఏ వేత్యుపచారాదుక్తమితి న విరోధః ఏవం ప్రత్యక్షానుమానాగమస్మృతి సంశయ నిర్ణయ విపర్యయ భ్రమవివేకవ్యవసాయ మోహరాగాద్వేషమద మాత్సర్యధైర్య చాపల్య దమ్భలోభ క్రోధ దర్పస్తమ్భ ద్రోహాభినివేశ నిర్వేదానన్దాదయః సుమతిర్దుర్మతిః ప్రీతిః తుష్టిః, పుష్టిరున్నతిః [1]శాన్తిః కీర్తి విరక్తీ రతిర్మైత్రీ దయా ముముక్షా లజ్జాతితిక్షా విచారణా విజిగీషా ముదితా క్షమా చికీర్షా జుగుప్సా భావనాకుహనా అసూయాజిఘాంసా తృష్ణా దురాశావాసనా దుర్వాసనా చర్చాభక్తిః ప్రపత్తిరిత్యేవమాదయశ్చ జీవాత్మగుణా అనన్తాధర్మ భూతజ్ఞాన విశేషా ఏవ. ఏవం జ్ఞానశక్తిబలైశ్వర్యతేజస్సౌశీల్యవాత్సల్య మార్దవార్జవ సౌహార్ద సామ్యకారుణ్య మాధుర్య గాంభీర్యౌదార్యచాతుర్య స్థైర్య ధైర్యశౌర్య పరాక్రమాదయోభగవతోఽనన్తకల్యాణగుణా జ్ఞానశక్త్యోర్వితతి భూతాః

**అ:** కామః సఙ్కల్పో విచికిత్సా శ్రద్ధాశ్రద్ధా ధృతిరధృతిర్హ్రీ ర్ధీర్భీరిత్యేతత్ సర్వం మనఏవ అని శ్రుతి (బృ.ఉ). కోరిక, సంకల్పము, సందేహము, శ్రద్ధ అశ్రద్ధ, ధైర్యము, అధైర్యము, సిగ్గు, జ్ఞానము భయము – ఇవి అన్ని మనస్సు యొక్క రూపాలు అని శ్రుతి తెలుపుతున్నది. ఇవి జ్ఞానముయొక్క రూపాలు అని చెప్పడం సంజసము కాదు అనిప్రశ్న. సమంజసమే. శ్రుతితో ఎట్టి విరోధము ఏర్పడదు. ఎందుకంటే ఆత్మలో కలిగే అన్నిజ్ఞానాలకు సహకారికారణము మనస్సు. ఈ విషయమే ఇంతకు ముందే నిరూపింపబడినది. కార్యమునకు కూడ కారణముగా ఔపచారికముగా ప్రయోగము శ్రుతిలో కనపడుతుంది. మనస్సు



సహకారి కారణము గనుక అవన్ని మనస్సు అని చెప్పబడినవి. కేవలం పయి శ్రుతిలో చెప్పినవి మాత్రమే జ్ఞానరూపములు కావు. చెప్పబోవు అనుభూతులన్నీ జ్ఞానము యొక్క అవస్థాభేదములే.

అవి ఇవి– ప్రత్యక్షము – నిరూపింపబడింది, అనుమానము– ప్రతిపాదన జరిగినది, ఆగమము – శాస్త్రములు మొదలగు వాటి వలన కలుగుజ్ఞానము, స్మృతి – ఇదివరకే చెప్పబడినది, గడచిన కాలములో ప్రదేశములో అనుభవించిన విషయములను వర్తమానజ్ఞానానికి విషయము చేయడము వలన కలిగే జ్ఞానము స్మృతి, సంశయము. ఇంద్రియముతో సన్నికర్షకలిగిన వస్తువు యొక్క నిర్ణయము కాకపోవడము. నిర్ణయము– నిశ్చయాత్మకమయిన జ్ఞానము, విపర్యయము, విపరీత జ్ఞానము, భ్రమ ఏ జ్ఞానానికి తర్వాత కలిగే జ్ఞానముతో బాధ కలుగుతుందో అది. వివేకము – భేదజ్ఞాన పూర్వకమయిన జ్ఞానము, వ్యవసాయము – నిశ్చయాత్మక జ్ఞానము, మోహము – మిక్కిలి తక్కువ ఫలమునందా సక్తిరూపమయిన జ్ఞానము, రాగము– రూపరసాది విషయములపయి కలుగు ఆసక్తి పూర్వకమయిన జ్ఞానము, ద్వేషము – అయిష్టమయిన జ్ఞానము, మదము – తన విషయములో రూపయౌవన, ధన, స్థాన జ్ఞాన విషయకమయిన గొప్పతనము కారణముగా కలిగే బుద్ధివికారము, మాత్సర్యము – ఇతరులదుఃఖాన్ని చూచి ప్రసన్నుడు కావడము, ధైర్యము – ఆపదలందు దృఢముగా వాటినెదుర్కొనే సహించేశక్తి నిచ్చే జ్ఞానము. చాపల్యము– కోరదగినవస్తువు కనబడగానే పొందడానికి త్వరపడజేసే జ్ఞానము, దమ్భము– తాను పనులను గొప్పగా చేస్తాను అను దానిని విద్యా, ధన, కుల, ధర్మవ్రత ఆచారాదులలో ప్రకటించుకునే దానిని దమ్భము అంటారు. (క్షేమేంద్రుడు కలావిలాసములో ఏడురకాల దమ్భాలను వివరించాడు) లోభము– అన్యాయ మార్గంలో వస్తుసంపాదనకు ప్రేరేపించు జ్ఞానము, క్రోధము– మాట, పని నెరవేరలేదని బుద్ధిలో కలిగే వికారము, దర్పము – గర్వము, కర్తవ్యాకర్తవ్య వివేకము లేనందున కలిగే జ్ఞానము, స్తంభము – కింకర్తవ్యతా మూఢత్వ జనక

జ్ఞానము, ద్రోహము– ఏ జ్ఞానము కారణముగా నితరులతో విరోధమేర్పడునో అది, అభినివేశము – బాగుగా ప్రవేశము బలవత్త్వము, నిర్వేదము – ఉదాసీనజ్ఞానము, ఆనందము– హాయిగలుగు తున్నదను జ్ఞానము, ఆనుకూల్యానుభవము కలుగుతున్న దను జ్ఞానము. ఇవి అన్నీ, ధర్మభూతజ్ఞాన విశేషములే.

ఇట్లాగే సుమతి, దుర్మతి, ప్రీతి, తుష్టి, పుష్టి, ఉన్నతి, శ్రమ, కీర్తి, విరక్తి, రక్తి, మైత్రి, దయ, ముముక్ష – మోక్తుమిచ్ఛా, మోక్షమునందలి కోరిక, సిగ్గు, ఓర్పు, విచారణ, జయించాలని కోరిక, ముదితత్వము – సంతోషము గల్గియుండుట, క్షమ – ఓర్మి, జుగుప్సా – ఏహ్యాభావము, భావన, కుహన – మోసం, అసూయ – ఈసు, జిఘాంస – చంపాలని కోరిక (కొట్టాలని కోరిక), తృష్ణ– దాహము, దురాశ – పేరాస, వాసన– సంస్కారము, దుర్వాసన– చెడు సంస్కారము, చర్చ – చర్చించుట, భక్తిసేవ, ప్రపత్తి – శరణుజొచ్చుట, మొదలయిన గుణాలు జీవునకు చెందినవి. అన్నియు ధర్మభూతమయిన జ్ఞానము యొక్క విశేషాలే,

ఇదేవిధముగా భగవంతుని అనంతములయిన కల్యాణగుణములు జ్ఞానముయొక్క, శక్తియొక్క విస్తృత రూపములే. అవి ఇవి – జ్ఞానము శక్తి, బలము, ఐశ్వర్యము. వీర్యము, తేజస్సు, సౌశీల్యము, వాత్సల్యము, మార్దవము, ఆర్జవము, సౌహార్దము, సామ్యము, కారుణ్యము, మాధుర్యము, గాంభీర్యము, ఔదార్యము, చాతుర్యము, స్థైర్యము, ధైర్యము, శౌర్యము, పరాక్రమము మొదలయినవి. (ఈ గుణములలో కొన్నిటివివరణ గడచిన అధ్యాయములలో చూడవచ్చును. కొన్నిటి వివరణను ముందరి గ్రంథభాగములో చూడవచ్చును.)

## భగవతః కల్యాణగుణానాం స్వరూపనిరూపణమ్:

**మూ:** తత్ర జ్ఞానం నామ సర్వసాక్షాత్కారరూపమ్. శక్తిః అఘటిత ఘటనాసామర్థ్యమ్. బలం ధారణసామర్థ్యమ్, ఐశ్వర్యం నియమన సామర్థ్యమ్. వీర్యమవికారిత్వమ్, తేజః పరాభిభవనసామర్థ్యమ్. మహతో మన్దైః సహ నీరంధ్రేణ



సంశ్లేషః సౌశీల్యమ్. వాత్సల్యం దోషే ఽ పి గుణత్వ బుద్ధిః. దోషాదర్శిత్వం వా. ఆశ్రితవిరహాసహత్వం మార్దవమ్. మనోవాక్కాయై రేకరూపత్వమార్జవమ్. స్వసత్తానపేక్షతద్రక్షాపరత్వం సౌహార్దమ్. అభిజన వృత్తగుణాద్య నపేక్షయా సర్వాశ్రయణీయత్వం సామ్యమ్. స్వార్థనిరపేక్ష (స్వప్రయోజనమనపేక్ష్య) పర దుఃఖనిరాచికీర్షా కారుణ్యమ్. పరదుఃఖాసహిష్ణుత్వం (పరదుఃఖదుఃఖిత్వం)వా. క్షీరవత్ ఉపాయాభావేఽపి స్వాదుత్వం మాధుర్యమ్. భక్తానుగ్రహ, వదాన్యత్వాదేరామూలతో దురవగాహత్వం గామ్భీర్యమ్. అపరిమితం (ప్రభూతం) దత్త్వాప్యతృప్తత్వమౌదార్యమ్. ఆశ్రితదోషగోపనం చాతుర్యమ్. అకమ్పనీయత్వం స్థైర్యమ్. అభగ్నప్రతిజ్ఞత్వం ధైర్యమ్. పరబలప్రవేశసామర్థ్యం శౌర్యమ్. తన్నిరాకరణం పరాక్రమః. ఇత్యాద్యూహ్యమ్.

**అ:** ఈ భాగమున భగవంతుని గుణవివరణమును గ్రంథకర్త చేస్తున్నాడు. భగవంతుని గుణములవలన జీవులందరికి శుభము కలుగుతుంది. అశుభము ఎవ్వరికి కలుగదు. అందుకే వాటిని కల్యాణ గుణములు అంటారు. అవి దివ్యములు. ఆ గుణాలన్నీ జ్ఞానము మరియు శక్తి అను గుణముల పరిణామ భూతమయినవే. 'యః సర్వజ్ఞః ససర్వవిత్, పరాస్య శక్తిర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియా చ' అని శ్రుతి ఘోషిస్తున్నది. ఆయన అన్నిటిని సామాన్యముగా విశేషముగా తెలుసుకొని యుంటాడు. ఆయనకు ఎన్నో పరా (ఉత్కృష్టమయిన) శక్తులున్నాయి. ఆయన జ్ఞానము బలము యొక్క పనులు స్వాభావికమయినవి. (జీవుల గుణములు భాగవతములో చెప్పినట్టు ఆతని కృపావిశేషము వలన గలిగినవే

**'యో–న్తః ప్రవిశ్య మమ వాచమిమాం ప్రసుప్తాం**
**సంజీవయత్యఖిల శక్తిధరస్స్వధామ్నా,**
**అన్యాంశ్చ హస్తచరణశ్రవణత్వగాదీన్**
**ప్రాణాన్ నమో భగవతే పురుషాయ తుభ్యమ్' అని).**

జ్ఞానము– అన్నిటిని అన్నివేళల సాక్షాత్కారము జేసుకొనునది. దీనివలననే ఆయనకు సర్వజ్ఞుడు, సర్వవిత్ అని పేరు కలిగినది.

శక్తి – అసంభవము లయిన వాటిని సంభవము చేయు సామర్థ్యము. దీనివలననే సర్వశక్తిమంతుడు ఆయన.

బలము – ఈ గుణముచేతనే భగవంతుడు సునాయాసముగా సమస్తమును ధరించగలుగుతున్నాడు.

ఐశ్వర్యము – దీనివలననే సమస్తమును శాసించుచున్నాడు. అధికారంలో పెట్టుకోగలుగుతున్నాడు. ఆయన ఆజ్ఞలోనే సూర్యచంద్రులు, సమస్తజగత్తు యథావిధిగా నడుస్తున్నవి.

వీర్యము – ఎట్టివికారము కలుగుక ఉండడము.

జగత్తునకంతకు ఆయనయే ఉపాదానకారణము. నిమిత్తకారణము ఆయనయే. కారణము కార్యముగా వికారమును చెందుతుంటుంది. కాని భగవంతుడు ఎట్టి వికారమును చెందడు 'స దేవసోమ్యేదమగ్ర ఆసీదేకమే వాద్వితీయమ్ః' అద్వితీయశబ్దముతో నిమిత్తకారణము కూడ అని, సత్‌శబ్దవాచ్యుడు పరమాత్మ ఒకడే ఉపాదానమని తెలుస్తున్నది. తేజస్సు– శత్రువులను ప్రభావహీనులను చేయు సామర్థ్యము. రావణుడు, కంసుడు మొదలయిన వారిని సంహరించునట్టి తేజస్సు కలవాడు.

సౌశీల్యము – గొప్పవారు, పెద్దవారు తమ గొప్పతనాన్ని పెద్దతనాన్ని పక్కన బెట్టి తమకంటే (హోదాలో, వయస్సులో, ధనములో, కీర్తిలో చిన్నవారితో కలివిడిగా ఉండడము.తమవారిగా చూడటము సౌశీల్యము. గుహుడు, శబరి, సుగ్రీవుడు, కుబ్జ, కుచేలుడు మొదలయిన వారిని భగవంతుడు తనవారిని చేసుకున్నాడు.

వాత్సల్యము – సాధారణముగా ఇది పెద్దవారికి చిన్నవారిపట్ల ఉండే ప్రేమాదరములను తెలుపునట్టిది. వత్స – దూడ. ఇక్కడ అర్థం ఏమంటే తమవారిలో దోషులలో కూడ దోషములు కనబడకపోవడం లేదా దోషాలు గూడ గుణము లుగా కనపడడము. భక్తులదోషాలు విభీషణుడిలో, శబరిలో, కాకిలో కనబడలేదు.



మార్దవము – ఆశ్రితులయిన జీవుల యొక్క ఎడబాటును సహించలేక పోవడము. అపరాధులయిన జీవులు కూడ ఆయనకు ఆశ్రయించడానికి ముందుకు వచ్చేట్టు చేసే గుణము.

ఆర్జవము – ఆశ్రితులయిన జీవులఎడ మనోవాక్కాయములతో నొకేవిధముగా నుండడము. ఆశ్రితుల కోరికప్రకారము మెదలడము.

సౌహార్దము– తన అస్తిత్వమును లెక్కచేయక, భక్తుల జీవితమును కాపాడు గుణము. స్వభావసిద్ధముగా జీవులందరికి హితైషి గావడము.

సామ్యము–అభిజన–పుట్టుక, వృత్త–ఉనికి హోదా మొదలయినవి, గుణాది – గుణములు మొదలయినవి. అనపేక్షయా – లెక్కలేక అందరిచే ఆశ్రయింపబడదగుట – సర్వలోకశరణ్యుడు ఈ గుణమువలననే.

కారుణ్యము – స్వార్థములేకుండ తనప్రయోజనము కోరకుండ ఆశ్రితులయిన జీవులయొక్క దుఃఖాలను తొలగించాలనే కోరిక. ఆయన అవతారాలన్ని ఇందుకే. భక్తులదుఃఖమును ఓర్వలేక పోవడం. భక్తులదుఃఖముతో దుఃఖితుడు కావడము కారుణ్యము.

మాధుర్యము – పాలవలె స్వభావసిద్ధముగా తియ్యగా మధురముగా ఉండడము. ఆయన రసస్వరూపుడని ఆనందమయుడని శ్రుతివచనము. 'పుంసాం దృష్టి చిత్తాపహారిణం' అని రాముణ్ణి వాల్మీకి కొనియాడుతాడు. కృష్ణుని సంగతి చెప్ప పనే లేదు.

గాంభీర్యము – భగవంతుని అనుగ్రహము ఇంత అంత అని తెలుసుకో రాకపోవడము. సాధారణంగా సముద్రం గంభీరము అంటాము. లోతు (వైశాల్యము కూడ) తెలుసుకోలేనందువలన. ఆయన తాను భక్తులకు ఋణపడిఉన్నానంటాడు. భారతములో 'ఋణప్రవృద్ధమివ మే హృదయాన్నా పసర్పతి' భక్తులపయి అంతులేని దయ. దయాసాగరుడు. రామానుజుల వారిని కూడ 'దయైకసింధోః' అని స్తుతించారు.

ఔదార్యము– అడిగినదానికన్న, అడగకున్నా, ఎక్కువ ఇచ్చుట, ఇంకా ఇవ్వడం బాగుండు ననుకోవడం ఔదార్యము. 'బహూనాం కామాన్ యః ఏకః విదధాతి' అని కఠోపనిషత్తు 2–5–18.

చాతుర్యము – ఆశ్రితుల, భక్తుల, దోషముల గప్పిపుచ్చునట్టి గుణము.

స్థైర్యము– వణకకుండుట, బెదరకుండుట, చెదరకుండుట 'మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం కథంచన' అంటాడు రాముడు.

ధైర్యము – ఆడినమాట తప్పకుండుట, ప్రతిజ్ఞను పాటించుట.

శౌర్యము– శూరునిభావము, శత్రుసైన్యములోకి చొచ్చుకొనిపోవు తెగువ కలిగియుండుట

పరాక్రమము – శత్రుసైన్యములోకి చొచ్చుకొనిపోయి, తనకు ఏమీ కాకుండ శత్రుసైన్యాన్ని చీల్చి చెండాడము.

ఇట్లా భగవంతునివి అఖిలహేయ ప్రత్యనీకకల్యాణగుణములు. ఇదే విధముగా మిగత గుణములను తెలుసుకోవాలి.

## భక్తిప్రపత్త్యోరద్వారకమోక్షసాధనత్వమ్:

మూ: జ్ఞానవిశేషభూతయోః భక్తిప్రపత్త్యోస్స్వరూపం కించిదుచ్యతే, భక్తిప్రపత్తిభ్యాం ప్రసన్న (భక్తిప్రపత్తీవ్యాజీకృత్య) ఈశ్వర ఏవ మోక్షం దదాతి. అతస్తయోః మోక్షోపాయత్వమ్. (భక్త్యపృథక్సిద్ధానాం) మోక్షోపాయత్వేనోక్తానాం కర్మయోగ జ్ఞానయోగ ప్రభృతీనాం భక్తిద్వారైవ సాధనత్వమ్. (తత్తత్పురుష వివక్షయోపాయత్వమ్.)

అ: భక్తి, ప్రపత్తి అనేవి జ్ఞానము యొక్క భేదాలు – విశేషాలు కాని వేరుగావు, 'ధ్యానం చ తైలధారావదవిచ్ఛిన్నస్మృతి సన్తానరూపమ్, ధ్రువా స్మృతిః' – ధ్రువానుస్మృతిరేవ భక్తిశబ్దేనాభిధీయతే, ఉపాసపర్యాయత్వాత్ భక్తి శబ్దస్య అని శ్రీభాష్యము – ఎడతెగకుండా నూనెధారలాగ ఉండే స్మరణము ధ్యానము అని. ధ్రువానుస్మృతియే భక్తి అని అర్థము. స్థూలముగా చెప్పుకోవాలంటే ఎల్లప్పుడు భగవంతుని సేవించుతూ ఉండటము అనుకోవచ్చును. భజ సేవాయాం అని ధాతువు. క్తిన్ ప్రత్యయముతో భక్తి ఏర్పడుతుంది. ఇకప్రపత్తి – పదగతౌ – ప్రపూర్వక ధాతువునుండి అదే క్తిన్ ప్రత్యయముతో ప్రపత్తి. ఎక్కువగా చేరుట, వెళ్ళుట, శరణు జొచ్చుట అని అర్థము. భగవంతుడొక్కడే శరణము అని తలచి శరణాగతి చెయ్యడము ప్రపత్తి అని తాత్పర్యము.



భక్తిప్రపత్తులు అనువానిచే మాత్రము భగవంతుడు ప్రసన్నుడవుతాడు. ప్రసన్నుడయి వారికి మోక్షమును ప్రసాదిస్తాడు. (భక్తి ప్రపత్తులు అనేవి ఒక నెపము భగవంతునికి. ఆ మిషతో మోక్షము ప్రసాదిస్తాడు.) ఈ రెండు – భక్తిప్రపత్తులు – మోక్షోపాయములు – మోక్షమును సాధించునవి. భగవంతుడు ఉపేయము, పొందదగినవాడు, సాధించదగినవాడు. శాస్త్రాల్లో కర్మయోగము జ్ఞానయోగము కూడ మోక్షమును సాధించునవిగా చెప్పబడినవి. అయితే అవి సాక్షాత్తుగా (మరియొకదాని సహాయములేకుండా) మోక్షాన్ని సాధించలేవు. అవి భక్తిద్వారానే, ప్రపత్తిద్వారానే మోక్షాన్ని సాధించగలవు. కనుక అవి సద్వారకమోక్షోపాయములు, భక్తిప్రపత్తులు అద్వారకమోక్షోపాయములు. భక్తిప్రపత్తులు తప్ప, కర్మయోగజ్ఞానయోగములు ఆ యా జీవుల యోగ్యత, అధికారమును బట్టి సాధనములు అవుతవి.

## కర్మయోగస్వరూపనిరూపణమ్:

**మూ:** కర్మయోగో నామ, ఉపదేశాత్ జీవపరయాథార్థ్యజ్ఞానవతా శక్త్యనుసారేణ ఫలసఙ్గరహితాని సిద్ధకామ్యనిత్యనైమిత్తిక రూపపరిగృహీతకర్మ విశేషః. స తు దేవార్చనాతపస్తీర్థ యాత్రాదానయజ్ఞాది భేద భిన్నః, అయం తు జీవగత కల్మషాపనయనద్వారా జ్ఞానయోగముత్పాద్య తద్ద్వారా (సాక్షాద్ వా) భక్త్యుత్పాదకో భవతి.

**అ:** గురువు యొక్క ఉపదేశము వలన జీవాత్మ పరమాత్మ యొక్క స్వరూపమును గూర్చిన యథార్థజ్ఞానము కలవాడయి తనశక్తికి మించకుండ, కర్మఫలమును అపేక్షించక, చేయదగిన వని విధింపబడిన కామ్య, నిత్య, నైమిత్తికములను కర్మలనుచేయుటయే కర్మయోగము. నిత్యకర్మలు రోజు చేయునట్టి స్నానసంధ్యాదులు. చేయకుంటే శుభానికి విఘ్నాలు కలిగించేవి. నైమిత్తికకర్మలు – పుట్టుక, మరణము మరియొక నిమిత్తము కారణముగా చేయునట్టివి. చేసినందువలన శుభము, చేయకుంటే అశుభము కలిగించేవి. కామ్యకర్మలు – కోరికతో చేసేవి పుత్రకామేష్టి, అశ్వమేధము, రాజసూయము మొదలయినవి. దేవతార్చన, తపస్సు, తీర్థయాత్రలు, దానము, యజ్ఞము, మొదలయినవి కర్మ యోగము యొక్క భేదములు. ఈ కర్మయోగము జీవునిలోని పాపములను బోగొట్టి జ్ఞానయోగమును కలిగింపజేస్తుంది. ఆ జ్ఞానయోగము ద్వారాగానీ, సాక్షాత్తుగా గానీ, భక్తిని కలుగజేస్తుంది.

ఈ విషయాన్ని శ్రీభాష్యము ఇలా తెలియజేస్తున్నది– మనిషి జన్మించి, తగినసంస్కారములను పొంది, గురువు వద్ద విద్యనభ్యసిస్తాడు. తదుపరి జీవాత్మపరమాత్మ స్వరూపము ఇదమిత్థముగా శ్రవణము, మననము, నిదిధ్యాసము వలన తెలుసు కుంటాడు. విధింపబడిన కర్మలను ఫలాపేక్షలేకుండ చేస్తూంటాడు. నిషిద్ధములను చేయడు. అతడు కర్మయోగి. దేవతార్చనాది కర్మల ద్వారా పాపవిముక్తుడవుతాడు. అట్లా కర్మయోగం ద్వారా జ్ఞానయోగం కలుగుతుంది. అప్పుడు భక్తియోగం హృదయంలో చిగురిస్తుంది. అయితే కొందరిలో కర్మయోగం సాక్షాత్తుగానే అంటే మధ్యన జ్ఞానయోగం ప్రసక్తిలేకనే భక్తియోగాన్ని కలిగించవచ్చును అని.

## జ్ఞానయోగస్య స్వరూపనిరూపణమ్:

**మూ:** జ్ఞానయోగో నామ కర్మయోగాన్నిర్మలాన్తఃకరణస్య ఈశ్వర శేషత్వేన ప్రకృతివియుక్త స్వాత్మచిన్తావిశేషః. తస్య సాక్షాద్ భక్త్యుపయోగః. ఏవం



సాధనాన్తరాణామపి (స్వాతంత్ర్యమ్) భక్త్యుపయోగిత్వం (చ) యథాప్రమాణ మూహ్యమ్.

అ: కర్మయోగముచేత అంతఃకరణము – మనస్సు నిర్మలము – స్వచ్ఛము అవుతుంది. అట్లా నిర్మలాంతః కరణు డయినవాడు తనను ఈశ్వరునికి దాసుడుగా – శేషుడు భావించుకుంటాడు. శాస్త్రములలో జీవాత్మ పరమాత్మ యొక్క శేషుడుగా చెప్పడం జరిగినది. దీనినే శేష–శేషి భావము, శరీర శరీరి భావము అంటారు. ఆ జీవాత్మ ప్రకృతికంటే వేరయినదని ప్రకృతి వియుక్తము అని చర్చ – విచారము – చింతన చేసుకుంటుంటాడు. ఇదే జ్ఞానయోగము. ఇది భక్తియోగానికి సాక్షాత్తు ఉపయోగిస్తుంది. ఇదే విధముగా ఇతరసాధనములు – మోక్షమును సాధించునవిగా చెప్పబడినవి, భక్తియోగానికి సహాయపడుతవి. వాటి ఉపయోగము భక్తియోగమును సాధించు వాటిగానే. అవి సాక్షాత్తు మోక్షసాధనములు గావు. దీనివలన భక్తియోగప్రాధాన్యము తెలుస్తున్నది.

## భక్తియోగస్య స్వరూప నిరూపణమ్:

మూ: భక్తియోగో నామ, యమనియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధారణాధ్యాన సమాధి రూపాష్టాఙ్గయుక్తః తైలధారావదవిచ్ఛిన్న స్మృతిసన్తానరూపః స చ వివేక విమోకాభ్యాసక్రియా కల్యాణా నవసాదానుద్ధర్షరూప సాధన సప్తక జన్యః. తత్ర వివేకో నామ, జాత్యాశ్రయనిమిత్తా దుష్టాన్నాత్కాయశుద్ధిః. విమోకః కామానభిష్వఙ్గః అభ్యాసః పునః పునరాలమ్బన సంశీలనమ్. శక్తితః పంచమహా యజ్ఞాద్యనుష్ఠానం క్రియా. సత్యార్జవ దయాదానాహింసాదీని కల్యాణాని. అనవసాదో దైన్యాభావః. అనుద్ధర్షః తుష్ట్యభావః అతిసన్తోషశ్చ విరోధీత్యర్థః ఏవం సాధన సప్తకాను గృహీతా భక్తిర్దర్శనసమానాకారా అన్తిమ ప్రత్యయావధికా చ భవతి. స చాన్తిమ ప్రత్యయః ఏతచ్ఛరీరావసానే శరీరాన్తరావసానే వా భవతి. వేదనధ్యానో పాసనాది శబ్దవాచ్యా చ భక్తిః పరభక్తి పరజ్ఞాన పరమభక్తిరూప

క్రమవతీ ప్రపత్త్యఙ్గకా చ, సా ద్వివిధా– సాధన భక్తిఫలభక్తి భేదాత్. ఉక్తసాధనజన్యా సాధనభక్తిః. ఫలభక్తిస్తు భేదాత్. ఉక్తసాధనజన్యాసాధన భక్తిః. ఫలభక్తిస్తు ఈశ్వరకృపాజన్యా శ్రీపరాఙ్కుశనాథాదినిష్ఠా. మద్భక్తజనవాత్సల్య మిత్యాదిషు స్తుతినమస్కారాదిషు చ భక్తిశబ్దప్రయోగ ఔపచారికః.

అ: పూజ్యులయిన వారి యెడల ప్రీతినే భక్తి అంటారు. భగవంతుడే జీవులందరకీ పూజ్యుడు. భగవంతునిమీది ప్రీతినే భక్తి అంటారు. ఆ భక్తి స్వరూపాన్ని ఇంకా ఇలా వివరిస్తాడు గ్రంథకర్త.

భగవంతుని విషయమున ఆగిపోని, ఎడతెరిపిలేకుండా పడునట్టి నూనె ధారవలె.ఎడతెరపిలేని, ఆగిపోని స్మృతి – జ్ఞాపకముల యొక్క సంతానము – పరంపర – ఒక దాని తరువాత ఒకటి కలుగునట్టి స్మృతిసంతానము భక్తి.

ఈ భక్తి అష్టాంగ యోగముతో కూడి బలపడుతుంది. యోగానికి చాలా అర్థాలున్నాయి. ప్రస్తుతమున – చిత్తవృత్తి నిరోధము అనాలి. మనస్సు పరిపరివిధాల పోకుండ ఆపి, భగవంతుని పయి లగ్నము చేయుట. ఇక ఆ ఎనిమిది అంగములు ఏవనగా–

I. యమము– 1.అహింస, 2. సత్యము – ఉన్నది ఉన్నట్లు చెప్పుట, అది ఇతరులకు మంచినికలిగించేది, పీడను కలిగించనిది కావాలి. మోసము కపటము లేనిది కావాలి. 3. అస్తేయము – దొంగతనము చేయకపోవుట 4. బ్రహ్మచర్యము, 5. అపరిగ్రహము విషయములలోని – సంపాదించుట, కాపాడు కొనుట, నశించుట, సహవాసము, హింస అనుదోషాలు చూసి ఏ విషయమును గ్రహింపకపోవుట, అను ఆరు యమములు. వీటిని పాటించడం యమపాలనము.

II. నియమము: 1 శౌచము – స్నానము, శుచియయిన వస్తువులను భుజించుట వలన గలుగునది. వెలుపలి – బాహ్యశౌచము వ్రతము ఉపవాసము మొదలగు వాటిచే గల్గునది. లోపలి– అభ్యంతరశౌచము, 2 సంతోషము–



కర్తవ్యకర్మములను చేస్తూ దొరికినవాటితోటే జీవనము గడపడము, 3 తపము – శీతోష్ణము సుఖదుఃఖము మొదలయిన విరుద్ధద్వంద్వములను సహింప గలుగుట, 4 స్వాధ్యాయము – మోక్షమును గలిగించు శాస్త్రములను చదువుట, ఓంకారమును – ప్రణవమును జపించుట 5ఈశ్వరప్రణిధానము – ఈశ్వరుని స్వరూప విభవైశ్వర్యములను ఎల్లప్పుడు చింతించుచుండుట, అన్ని ఈశ్వరార్పణము చేయుటయు.

III. ఆసనము: యోగాసనములు. ఆస్యతే ఆస్తే వా అనేన ఇత్యాసనమ్.

IV. ప్రాణాయామము: ఆసనము సిద్ధించిన పిదప స్వాభావికమయిన ఉచ్ఛ్వాస నిఃశ్వాసలను ఆపుట పీల్చుట.

V. ప్రత్యాహారము: పయిన పేర్కొన్న ప్రాణాయామము అభ్యాసము చేస్తూ పోతే ఇంద్రియములు శుద్ధమవుతవి. తదుపరి ఇంద్రియముల యొక్క పనిని అన్నివిషయాలనుండి కూడగట్టు కొని మనస్సులో విలీనము చేయడము – స్వవిషయా సమ్ప్రయోగే చిత్త స్వరూపానుకార ఇవ ఇంద్రియాణాం ప్రత్యాహారః – యో.సూ. 2.54.

VI. ధారణ: చిత్తమును లోపలి నాభిచక్రము, హృదయకమలము మొదలయిన దేశములలో గాని, సూర్యచంద్రులు, ఏదయినా దేవత మొదలయిన దేశములో – స్థానములో గాని చిత్తము స్థిరముగా ఉంచగలగడము.

VII. ధ్యానము: ధ్యానించు వస్తువుపయి చిత్తము ఏకాగ్రముగా ఉండడము, ధ్యేయవిషయముపయి మాత్రమే ఉండే చిత్తవృత్తి.

VIII. సమాధి: ధ్యానములో ధ్యానించు దానియొక్క స్వరూపము మాత్రమే తెలుస్తూండడము, చిత్తము తనస్వరూపమును పూర్తిగా మరిచిపోయినట్టు కావడము, ధ్యేయమును ధ్యానిస్తూ ధ్యానిస్తూ పోతే చిత్తము కూడ ఆ ధ్యేయము యొక్క ఆకారముగా అయిపోయి కేవలము ధ్యేయముయొక్క ప్రతీతియే కలుగడము సమాధి.

ఇట్లా అష్టాంగ యోగయుక్తు డయిన భక్తుడు ధ్యేయుడయిన భగవంతుని స్వరూపమును ధ్యానిస్తూ ఉంటాడో అప్పుడతని ధ్యానసమయమున చిత్తములో భగవంతుని రూపము ప్రత్యక్షము అవుతుంది. దీనినే భక్తియోగమంటారు. నూనె పడుతుంటే ధారలో మధ్య తెగిపోనట్టుగా ధ్యానించువాడి మనస్సు ఎల్లప్పుడు భగవత్స్వరూప చింతనములో ఉంటుంది. కొంచెము కూడ ఎడముండదు. ఈ భక్తి యోగము వివేకాదులయిన ఏడుసాధనములతో పుడుతుంది. అవి ఇవి.

1. వివేకము– I. జాతిచేత అనగా పదార్థము – వెల్లుల్లి మొదలయిన వాటిచేత II) ఆశ్రయము చేత –ఆతతాయులచేత III) నిమిత్తము చేత ఈగలు దోమలు మొదలయినవి పడిన కారణముగా దూషితమయిన పాడయిన అన్నము తినకపోవుట అనగా శుద్ధమయిన ఆహారమును తీసుకొనుట చేత కాయశుద్ధి– శరీరశుద్ధి కలిగియుండుట ఆహారశుద్ధౌ సత్త్వశుద్ధిః, సత్త్వశుద్ధౌ ధ్రువాస్మృతిః అని ఛాం. ఉపనిషత్తు7–26లో తెలుపుతున్నది.

2. విమోకము: విషయముల పయి (రూప, రస, గంధ, స్పర్శ, శబ్ద ములు అను 5 విషయములు. వీటిని వరుసగా చక్షువు, జిహ్వా, ఘ్రాణము, చర్మము, శ్రోత్రములు గ్రహిస్తాయి) కోరికలపయి ఆసక్తి లేకపోవుట, విరక్తుడయి విషయములను సేవించుట.

3. అభ్యాసము: ఆలంబనము అనగా ముముక్షువులయిన జీవులయొక్క కల్యాణములకు ఆశ్రయుడయిన భగవంతుని దివ్యమంగళవిగ్రహమే. ఆలంబనమును ఆరంభణమని కూడ అంటారు. ఆ ఆలంబనమును – విగ్రహమును మళ్ళీ మళ్ళీ సంశీలనము – చింతనము చేయడమే అభ్యాసము. ఏ పనినయినా రెండవసారి లేదా అనేక సార్లు చేయడమే అభ్యాసము. 'అభ్యాసము కూసువిద్య' అని సామెత కూడ ఉన్నది.

4. క్రియ: శక్తిని అనుసరించి, బ్రహ్మయజ్ఞము, పితృయజ్ఞము, దేవయజ్ఞము, భూతయజ్ఞము, మనుష్యయజ్ఞము అను ఐదు యజ్ఞములను



చేయుట. వేదాధ్యయనము, అధ్యాపనము బ్రహ్మయజ్ఞము' పితృతర్పణము పితృయజ్ఞము. హోమము దేవయజ్ఞము; భూతములకు ఇచ్చు బలి ఆహారము భూతయజ్ఞము. అతిథిపూజ మనుష్యయజ్ఞము.

5. కల్యాణము: సత్యము పలుకుట, త్రికరణశుద్ధిగా సమానముగా నుండుటయును ఆర్జవము, దయ, దానము, అహింస అన్ని కలిస్తే కల్యాణము అని పేరు. ముముక్షువు వీటిని పాటించాలి.

6. అనవసాదము: అవసాదము కానిది అనవసాదము. కృశత్వము దీనత్వము అవసాదము. విపరీతమయిన పరిస్థితుల్లో శోకమును దీనతను పొందకుండుట అనవసాదము. బలహీనుడు భగవంతుని పొందలేడు అని 'నాయమాత్మా బలహీనేన లభ్యః' ముం ఉ 3–2–4, శ్రుతి.

7.అనుద్ధర్షము: ఉత్+హర్షము – ఎక్కువ సంతోషము లేకపోవుట అనుద్ధర్షము. అనుకూల పరిస్థితుల్లో, ప్రియవస్తువు స్మరణంతో అతిగా సంతోష పడక పోవడము. తనకు గల ప్రాపంచిక భోగభాగ్యాలను జూసి ఎక్కువగా సంతోషపడితే ముముక్షువు భక్తినుండి దూరంగా పోతాడు. సంతోషాధిక్యము మంచిది కాదు.

ఇట్లా సాధన సప్తకములచే బలపడిన భక్తిధ్యేయుడయిన భగవంతుని సాక్షాత్కారము వంటిదియు, అంతిమ జ్ఞానమువరకు స్థిరముగా ఉంటుంది. భక్తునకు భగవంతుని సాక్షాత్కారము కలుగుతున్నట్లుగా ఉంటుంది. ఈ భక్తి అంతిమ ప్రత్యయము కలుగువరకు నిలకడగా నిలుస్తుంది. ఈ అంతిమప్రత్యయము ఇప్పటి శరీరము పడిపోవువరకు ప్రారబ్ధకర్మలు అనుభవించడం అయిపోయితే, ఈ శరీరం పడిపోవడంతోటే కలుగుతుంది. ప్రారబ్ధకర్మలు అనుభవించడం కాకపోతే అంతిమ ప్రత్యయం మరో జన్మ అయిపోయిన తర్వాతనయినా కలుగుతుంది. ఈ సాధన సప్తకానుగృహీతమయిన భక్తిలేకపోతే అంతిమ ప్రత్యయం కలుగనేరదు. శరీరము పడిపోయేప్పుడు కూడ

ధ్యేయుడయిన భగవంతుని యొక్క స్వరూప రూపవిభవ ఐశ్వర్య సంబంధముల స్మరణ ఉండుటయే అంతిమ ప్రత్యయము. ఇది కలవాడే మోక్షాధికారి అవుతాడు.

శాస్త్రములలో ఈ భక్తికి వేదనము ధ్యానము, ఉపాసన మొదలయిన పేర్లు ఉన్నాయి. పోనుపోను పెరిగే ఈ భక్తికి మూడు పర్వములు క్రమముగా కలుగుతవి. అవి – పరభక్తి, పరజ్ఞానము, పరమభక్తి అని. ఈ భక్తికి ప్రపత్తి అనునది అంగము – అవయవము.

పరభక్తి– ప్రీతిరూపమును పొందుతూ, దర్శనముతో సమానమయి నట్టిది మోక్షమునకు కారణమయినట్టి ఎడతెగని స్మృతి.

పరజ్ఞానము – భగవంతుని విషయములో కలుగు పరిపూర్ణ సాక్షాత్కారము. అది భగవద్ధ్యానముచే భగవంతుని సాక్షాత్కారము కొరకు అత్యంతమయిన ఉత్కంఠతో, భగవంతుని 'స్వామీ! ప్రసన్నుడయిన భగవంతుని కృపతో కలుగు నిర్వికారస్వరూప జ్ఞానదర్శనము నాకు కల్గించుము' అని ప్రార్థన.

పరమభక్తి– ఇట్లా శ్రీభగవంతుని సాక్షాత్కారము కాగానే భగవంతుని పొందుటకు ప్రేమమయమయిన తొందర కలుగుతుంది. అది పరమభక్తి. ఇట్లా మూడు, ఒక దానికంటె ఒకటి ఉత్కృష్టమయిన పరభక్తి లాంటి దశలు కలిగిన ప్రపత్తి అంగముగానున్న భక్తి రెండు విధాలు– సాధనభక్తి రెండవది ఫలభక్తి. శమాది సాధనములు సాధనసప్తకము యొక్క అనుష్ఠానము – ఆచరణము చేత ముముక్షుజీవునిలో కలుగునది సాధనభక్తి మహర్షివ్యాసుడు మొదలయినవారి భక్తి. ఇక సాధ్యభక్తి భగవంతునికృపవలననే కలుగునట్టిది. శ్రీశఠకోపమునుల భక్తివంటిది.

**"మద్భక్తజనవాత్సల్యం పూజాయాం చానుమోదనమ్ ।**
**స్వయమభ్యర్చనం చైవ మదర్థం దమ్భవర్జనమ్ ॥**
**మత్కథాశ్రవణే భక్తిః స్వరనేత్రాంగవిక్రియా ।**
**మమానుస్మరణం నిత్యం యశ్చ మాం నోపజీవతి"॥**



భక్తిరష్టవిధాహ్యేషా. ఇత్యాది శ్లోకములలో స్తుతి, నమస్కారము మొదలయినచోట్లలో భక్తి శబ్దము యొక్క ప్రయోగము లక్షణవలననే. పయిశ్లోకములో భగవద్భక్తుల యెడల వాత్సల్యము, భగవత్పూజను అనుమోదించుట, స్వయంగా పూజచేయుట, భగవద్విషయమున ఎట్టి దంభములేక ఉండుట, భగవత్కథా శ్రవణాసక్తి, భగవత్కథశ్రవణముచే స్వరములో, శరీరములో, నేత్రములలో వికారము కలుగుట, నిత్యస్మరణము, భగవంతుని పేరు మీదనే జీవించకపోవుట అని ఎనిమిది విధాలు భక్తి. అట్లే భాగవతములో–

**'శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్।**
**అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మనివేదనమ్' ॥**

అని తొమ్మిది విధాలుగా భక్తి నిరూపణము ఉన్నది. వీనినన్నిటిని ఔపచారికముగ భక్తి అని అనడమే గాని ముఖ్యముగా పయిన పేర్కొన్న పరభక్తి పరజ్ఞాన పరమభక్తి యే భక్తి అని తాత్పర్యము. శ్రవణాదులు భగవద్భక్తిని కలిగించేవి. కనుక వాటికి కూడ (ఔపచారికముగా) భక్తి అని వ్యవహారము.

## వేదాన్తేషు ధ్యానస్యైవ విధానమితి ప్రతిపాదనమ్:

**మూ:** నను వేదాన్తేషు శ్రవణమననయోరపి విధానాత్ కథం ధ్యానమేవ విధీయత ఇతిచేత్ ఉచ్యతే. అధీతసాంగవేదః పురుషః ప్రయోజన వదర్థావబోధిత్వ దర్శనాత్ తన్నిర్ణయాయ స్వయమేవ శ్రవణే ప్రవర్తత ఇతి శ్రవణస్య ప్రాప్తత్వాదనువాదః. శ్రవణప్రతిష్ఠార్థత్వాన్మననస్యాప్యనువాదః. తస్మాద్ ధ్యానమేవ విధీయతే ఇతి న విరోధః.

**అ:** ఉపనిషత్తులలో ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః' అని శ్రవణము మరియు మననములను విధించడం జరిగింది కదా'. కేవలము ధ్యానమునే శ్రుతి విధిస్తున్నదని ఎట్లా ఒప్పుకోవాలి అని

ప్రశ్న. సమాధానము ఏమంటే – వేదములను ఆరు అంగములతో బాటు చదివిన వాడు వేదవాక్యములు ప్రయోజనసహితమయిన అర్థమును బోధిస్తున్నవి అని తెలుసుకొని, ఆ వాక్యముల అర్థమును వినుటయందు ఆసక్తుడయి ప్రవర్తిస్తాడు. సహజముగనే ప్రాప్తించిన కారణమున శ్రుతి, శ్రవణమును మళ్ళీ చెపుతున్నది (అను తరువాత, వచ్చిన విషయమును, వాదము – చెప్పుట జరుగుతున్నది. తెలుగులోనే అనువాదము అంటే తర్జుమా అని అర్థము ఉన్నది. సంస్కృతంలో చెప్పిన దానిని మళ్ళీ చెప్పుట అనియే అర్థము.) విన్నదానిని తలచుకోవడం మననం చేయుట కూడ అవసరమే కనుక మననము శ్రవణము తరువాత క్రమప్రాప్తమే. శ్రుతి దానిని కూడ అనువదించుచున్నది. అప్రాప్తము అయిన – ఇంతకుముందు విధింపబడని, సహజముగా ప్రాప్తము కాని అర్థము ధ్యానమే. కనుక 'నిదిధ్యాసితవ్యః' అని శ్రుతిధ్యానమునే – దర్శన సమానాకారముతో కూడిన భక్తినే విధిస్తున్నది అనిచెప్పడంలో ఎట్టి విరోధము లేదు.

## విద్యాభేదాత్ భక్తిభేదః

**మూ:** ధ్యానశబ్దవాచ్యా భక్తిః విద్యాభేదాత్ బహుధా భవతి. తాశ్చ విద్యా ద్వివిధాః– ఐహికఫలా ముక్తిఫలాశ్చేతి. తత్రైహికఫలా ఉద్గీథ విద్యాదయః. ముక్తిఫలాస్తు అంతరిక్షవిద్యా, అంతరాదిత్యవిద్యా, దహరవిద్యా, భూమవిద్యా, సద్విద్యా, మధువిద్యా, ఉపకోసలవిద్యా, శాండిల్యవిద్యా, పురుషవిద్యా, ప్రతర్దనవిద్యా, వైశ్వానరవిద్యా, పంచాగ్నివిద్యా ఇత్యాదికా బ్రహ్మవిద్యాః.

**అ:** దర్శనముతో సమానాకారము కలిగిన భక్తికే ధ్యానము అనిపేరు. భక్తి ధ్యానశబ్దవాచ్యము. విద్యలయొక్క భేదమును బట్టి ఆ భక్తి అనేక విధాలుగా ఉంటుంది. విద్యలు రెండురకాలు. ఈ లోకంలో కలిగే ఫలాన్ని ఇచ్చేవి



ఐహికవిద్యలు. ముక్తినే ఫలముగా ఇచ్చేవి ముక్తివిద్యలు– వీటినే బ్రహ్మవిద్యలు అని అంటారు. ఇక ఉపనిషత్తులు నిరూపించిన ఈ రెండురకాల విద్యలను గూర్చి వివరంగా తెలుసుకుందాము.

## ఐహికవిద్యలు – కామ్యవిద్యలు :

ఉద్గీథవిద్య: ఛాందోగ్యపనిషత్తు 'ఓమిత్యేత దక్షరముద్గీథముపాసీత' అని ఈ విద్యను వివరించినది. దీని చర్చను బాదరాయణమహర్షి 'ఆదిత్యాది మతయశ్చఅంగ ఉపపత్తేః 4–1–6 అనుసూత్రమున చేశారు'.

య ఏవాసౌ తపతి తముద్గీథముపాసీత – ఛాం. ఉ. 1–3–1 అని తెలుపుతున్నది. దీనిననుసరించి ఆదిత్యాది ఉపాసనను ఉద్గీథరూపమున చెయ్యాలా? లేదా ఉద్గీథాది ఉపాసనము ఆదిత్యాది దృష్టితో చెయ్యాలా అని ప్రశ్న. పూర్వపక్షము ఏమంటే ఆదిత్యాది ఉపాసనలోనే ఉద్గీథాది దృష్టి ఉండాలి అని. ఏ సూర్యుడు ప్రకాశిస్తున్నాడో అతనిని ఉద్గీథముగా ఉపాసించాలి అనితాత్పర్యము. సూత్రకారుని అభిప్రాయము ఉద్గీథాది ఉపాసనలో ఆదిత్యాది దృష్టి ఉండాలి. ఆదిత్యాదిదేవత ఉపాసన ద్వారా ఉద్గీథాది ఉపాసనకర్మలు ఫలప్రదము అవుతవి. కనుక ఉత్కృష్టమయిన ఆదిత్యాదులలోనే ఉద్గీథాది దృష్టి కలిగి ఉండాలి అని భావము.

నామాదిప్రతీకవిద్య: 'స యో నామ బ్రహ్మేత్యుపాస్తే' ఛాం.ఉ.7–1–5 నామాది విద్యను ప్రతిపాదిస్తున్నది. నామప్రతీకవిద్యను ఉపాసించే వానికి నామాదిగతిపర్యంతము ఇష్టము వచ్చినట్లు గతి ఉంటుంది. అని నామాది ప్రతీకవిద్య ఉపాసనఫలితము ఉపనిషత్తు చెపుతున్నది. న ప్రతీకే న హి సః – బ్ర.సూ. 4.1.4లో బాదరాయణమహర్షి దీనిని చర్చించారు. ప్రతీకములో నామత్వమును తలచుకోవాలి అని పూర్వపక్షము. ఉపాసకునిఆత్మ ప్రతీకము కాదు కనుక దానిలో నామత్వానుసంధానము చేయవద్దు అని సిద్ధాంతము.

పయివాక్యములో బ్రహ్మవిశేషణము మాత్రమే. బ్రహ్మకంటే భిన్నమయిన దానిలో బ్రహ్మదృష్టితో ఉపాసనచేయడమే ప్రతీకోపాసన. ఉపాసకుని ఆత్మ ఉపాస్య రూపానికి ప్రతీకము కాదు. కనుక దానిలో– ప్రతీకములో, న – నామత్వాను సంధానము చేయవలదు, సః– అతడు న – ఉపాస్యుని ప్రతీక కాదు అని అర్థము.

మనశ్చితాదివిద్యా – అగ్నిరహస్య బ్రాహ్మణము యొక్క తృతీయ బ్రాహ్మణమున 'మనశ్చితో వాక్చితః ప్రాణశ్చితః చక్షుశ్చితః శ్రోత్రచితః కర్మచితః అగ్నిచితః' అను శ్రుతిద్వారా (అగ్ని. ర.10–5–3.) మనశ్చితాదులు విద్యారూపమయిన అగ్నులు. క్రియామయత్వము దీనిలో ఉన్నది కనుక ఇవి క్రియారూపములా? విద్యామయమయిన క్రతువులో ఉన్నవి కనుక విద్యా రూపములా? అని ప్రశ్న. 'స యో హ వైతదేవం. వేద లోకం పృణానామేనం భూతమేతత్సర్వమభి సమ్పద్యతే' అను తర్వాతి బ్రాహ్మణములో చెప్పినందున మనశ్చితాదులన్ని విద్యామయములే అని సిద్ధాంతము. ఈ విషయము బ్ర.సూ.మూడవ అధ్యాయము మూడవ పాదము పూర్వవికల్పాధి కరణములో 44 నుండి 50 సూత్రములలో నిరూపించబడినది. ఇవి ఐహికఫలముల నిచ్చు విద్యలు.

ఇక ముక్తిఫలము నిచ్చువిద్యలు 32 కలవు. వాని నుండి ఈ క్రింది పన్నెండింటిని గ్రంథకర్త వివరించాడు.

అంతరిక్షవిద్య: ఛాం. ఉపనిషత్తు 1–9–1లో అస్య లోకస్యకా గతిరితి ఆకాశ ఇతి హోవాచ, సర్వాణీహ ఇమాని భూతాని ఆకాశాదేవ సముత్పద్యన్తే, ఆకాశం ప్రత్యస్తం యన్తి, ఆకాశో హ్యేవైభ్యోజ్యాయానాకాశః ఏవ పరాయణమ్. అని ఆకాశవిద్యను వివరిస్తున్నది. బ్రహ్మసూత్రములో మొదటి అధ్యాయము మొదటిపాదములో ఆకాశ శబ్దముచే పరమాత్మ చెప్పబడినాడని వివరణ కలదు. అన్నిటిని ప్రకాశింపజేయువాడు పరమాత్మ కనుక అతనికే ఈ పేరు. ఆకాశయతి ఇతి ఆకాశతే ఇతి ఆకాశః అని వ్యుత్పత్తి. మహాభూతములలో చివరిదయిన ఆకాశము కానేరదు. ఎందుకనగా సంపూర్ణమయిన జగత్తుకు ఉత్పత్తికారణము



లయస్థానము కాలేదు. అది ఒక భగవంతునికే తగును కనుక ఈ విద్య భగవంతుని నిత్యనిరతిశయ ప్రకాశవంతునిగా తెలుపుతున్నది.

అంతరాదిత్యవిద్యా: ఛాం. ఉపనిషత్తు 1–6–6–7లలో 'య ఏషోఽన్తరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే హిరణ్యశ్మశ్రు హిరణ్యకేశ ఆప్రణఖాత్సర్వఏవ సువర్ణః తస్య యథా కప్యాసం పుండరీకమేవ మక్షిణీ తస్యోదితినామ స ఏష సర్వేభ్యః పాప్మభ్య ఉదితః' అని అనంతరాదిత్యవిద్యను బోధిస్తున్నది. దీనిని బాదరాయణమహర్షి అంతరాధికరణములో వివరించారు. అతని గుణ గణములను కొనియాడారు.

దహర విద్యా: ఈ విద్యను ఛాం. ఉపనిషత్తు బృ. ఆ. ఉపనిషత్తు, తైత్తిరీయోపనిషత్తు వివరిస్తున్నాయి. సంపూర్ణజగత్తుకు భగవంతుడే ఆధారమని ఈ విద్య బోధిస్తుంది. బాదరాయణమహర్షికూడ దహరాకాశమునే పరమాత్మయని బ్ర.సూ. 1–3–14 నిరూపించారు.

భూమవిద్యా: ఛాం. ఉపనిషత్తు ఏడవఅధ్యాయములో ఈ విద్యా నిరూపణము జరిగినది. 'యత్రనాన్యత్ పశ్యతి నాన్యచ్ఛృణోతి నాన్యద్ విజానాతి స భూమా' 7.24. ఛాం.ఉ. అత్యంతానుకూలమయిన సుఖరూపమును చూసే సమయములో మనుష్యుడు మరి దేనిని చూడడు, వినడు అట్టిది భూమా– ఉత్కర్షతో గూడిన స్వరూపమున అని అర్థము. భూమగుణవిశిష్టమయిన తత్త్వము పరబ్రహ్మ అని పయివాక్యములోని భూమశబ్దానికర్థము. జీవాత్మకన్నశ్రేష్ఠము అదియే. దీనినే భూమాసమ్ప్రసాదాధ్యుపదేశాత్ – బ్ర.సూ. 1.3.7లో బాదరాయణ మహర్షి వివరించారు.

సద్విద్యా: 'స దేవసోమ్యేదమగ్ర ఆసీదేకమ్ వాద్వితీయమ్' ఛాం. ఉ 6.2.1లో సద్విద్యానిరూపణ మున్నది. సచ్ఛబ్దవాచ్యమయిన పరబ్రహ్మ తనసంకల్పమాత్రమున సంపూర్ణమయిన జగత్తుకు నిమిత్తకారణము ఉపాదానకారణము (రెండుకలిసియే – అభిన్నముగానే) అవుతుంది అని భగవంతునికే అభిన్న నిమిత్తోపాదాన కారణత్వమును ప్రతిపాదిస్తున్నది ఉపనిషత్తు.

మధువిద్యా: భగవంతుడు వసువులు, రుద్రుడు, ఆదిత్యుడు, మరుత్తులు, మరియు సాధ్యుల యొక్క ఆత్మరూపమున ఉపాసింపదగినవాడు అని ఛాందోగ్యోపనిషత్తులో నిరూపించడం జరిగినది. 'మధ్వాదిషు అసమ్భవాదనధికారం జైమినిః.' బ్ర.సూ. 1.3.30 నుండి మొదలు కొని మధ్వధికరణములో బాదరాయణమహర్షి ఈ విద్యను చర్చించారు.

ఉపకోసలవిద్యా: 'య ఏషోఽక్షిణి పురుషో దృశ్యతే ఏష ఆత్మేతి హోవాచ ఏతదమృత మేతదభయమేతద్ బ్రహ్మ' ఛాం, ఉపనిషత్ 4-15-1లో ఈ విద్యా నిరూపణము కలదు నేత్రములో మనిషి కనబడుతున్నాడు. అతడు ఆత్మ అని ఆచార్యులు చెప్పారు. అతడు అమృతము వంటి వాడు భోగ్యుడు. అభయుడు. భయమునకు కారణము దుఃఖము. కలుగబోయే దుఃఖమును తలచుకుంటే భయము కలుగుతుంది. అది బ్రహ్మ. ఈ విద్య పరమాత్మనేత్రములో ఉన్నాడని తెలుపుతున్నది. అంతర ఉపపత్తేః 1-2-13లో బాదరాయణమహర్షి నేత్రములో వెలుగొందే పురుషుడు పరమాత్మ అని సంయద్వామత్వము, మొదలయిన కల్యాణ గుణములు అతనిలోనే సరిపోతవని నిరూపించారు. కోరదగినవి. శుభమును కలిగించునవి అయినవి సంయద్ వామగుణములు.

శాండిల్యవిద్యా: 'సర్వం ఖల్విదం బ్రహ్మ, తజ్జలానితి శాంత ఉపాసీత, అథ ఖలు క్రతుమయోఽయం పురుషో యథా క్రతురస్మిన్ లోకే పురుషో భవతి. తథేతః ప్రేత్యభవతి స క్రతుం కుర్వీత మనోమయః ప్రాణశరీరః' ఛాం. ఉ 3.14. 1-2 అట్లాగే బృ. ఉపనిషత్తు అగ్నిరహస్యఉపనిషత్తు కూడ ఈ విద్యను వివరించాయి. ఇదంతా బ్రహ్మమయము. బ్రహ్మనుండే అన్ని పుడుతున్నాయి. బ్రహ్మలోనే లీనమవుతున్నాయి. అన్నీ బ్రహ్మచేత ఉజ్జీవింపబడుతున్నాయి. శాంతుడయి బ్రహ్మ ఉపాసన చేయవలయును. జీవుడు ఉపాసనామయుడు. ఈ లోకంలో ఏ విశేషణముతో కూడిన బ్రహ్మను ఈ జన్మలో ఉపాసిస్తే వచ్చే

1. అన్ని కోరదగిన కల్యాణగుణములు కల్గియుండుట



జన్మలో అట్టి బ్రహ్మను పొందుతాడు అని విద్య తాత్పర్యము. మనోమయుడయిన ప్రాణశరీరకమయిన బ్రహ్మను ఉపాసించవలయును. ప్రతిపదార్థము యొక్క ఉనికి, పుట్టుక, లయము బ్రహ్మమీదనే ఆధారపడియున్నవని ఈ విద్య బోధిస్తున్నది.

పురుషవిద్య: బృహదారణ్యకము వివరించిన ఈ విద్య శ్రీభగవంతుడే పరమపురుషుడు అని తెలుపుతుంది. బ్ర.సూ. 'పురుష విద్యాయామపి చేతరేషా మనామ్నానాత్' 3-3-24 పురుషవిద్యాధికరణములో కూడ ఈ బ్రహ్మవిద్య నిరూపణము జరిగినది.

ప్రతర్దనవిద్య: 'ప్రతర్దనో హ వై దైవో దాసిః ఇంద్రస్య ప్రియం ధామోపజగామ యుద్ధే చ పౌరుషేణ' కౌ.బ్రా.ఉ.3.1.దివోదాసు పుత్రుడు ప్రతర్దనయుద్ధంలో తన పౌరుషముతో పోరి ఇంద్రుని స్థానం చేరుకున్నాడు. ఈ విద్య, భగవంతుడే ఇంద్రుడు, ప్రాణము మొదలయిన చేతనాచేతనములకు ఆత్మ అని తెలుపుతున్నది. ఇంద్రప్రాణవిద్య అని కూడ దీనికి పేరు. వైశ్వానరవిద్యా - ఛాం. ఉపనిషత్తులో దీని వర్ణనకలదు. వైశ్వానరుడే స్వర్లోకము మరియు ఆదిత్యుడు మొదలయిన వారికి అంగము అని. 'ఆత్మానం ఏవేమం వైశ్వానరం సమ్ప్రత్యధ్యేషి' ఛాం. ఉ. 5.11. లో వైశ్వానరశబ్దముచే పరమాత్మనే వాచ్యుడు. ఈ శబ్దానికి అనేక అర్థాలున్నాయి. ఇక్కడ ఈ శబ్దానికి సర్వాత్మత్వము మొదలయిన విశేషాలు అర్థము. ఇవి పరమాత్మ యొక్క అసాధారణధర్మము. ఈ ధర్మాలు అన్ని వైశ్వానరాత్మలో ఉన్న విశేషణములని ప్రకరణము తెలుపుతున్నది. వైశ్వానరః సాధారణ శబ్దవిశేషాత్ బ్ర.సూ. 1-2-25లో బాదరాయణ మహర్షికూడ వైశ్వానరశబ్దము పరమాత్మవాచకము అని తెలిపారు.

పంచాగ్ని విద్యా: ఛాందోగ్యము మరియు బృహదారణ్యకములో ఈ విద్య నిరూపణము కలదు. ఈ విద్య ప్రతిపాదించునది ఏమన సంసారబంధము నుండి విముక్తి భగవదధీనము అని. ఈ విషయాన్ని తదంతర ప్రతిపత్త్యధి కరణములో 'తదంతర ప్రతిపత్తౌ రంహతి సంపరిష్వక్తః ప్రశ్ననిరూపణాభ్యాం'

3-1-1 అని మొదలు కొని ఏడు సూత్రాల్లో బాదరాయణమహర్షి చర్చించి నిరూపించారు.

ఆదిశబ్దము చేత వ్యాహృతి శరీరవిద్య అనున్యాసవిద్యను గ్రహించాలి. భగవంతుడు వ్యాహృతులయొక్క ఆత్మ కనుక మంత్రమయుడు అని ఈ న్యాసవిద్య తెలియజేయుచున్నది. నానాశబ్దాది భేదాత్ బ్ర.సూ. 3-3-56 ఈ విషయాన్ని నిరూపిస్తున్నది. తృతీయాధ్యాయపు తృతీయపాదంలో ఈ విషయచర్చ జరిగినది. ఇవి అన్ని బ్రహ్మవిద్యలు. (మనం వాడుకలో అంటూ ఉంటాము ఏదయినా కొత్తవిషయం, చదువు నేర్చుకోవాలసివస్తే అది కష్టమయినది ఏం కాదు అని చెప్పడానికి - అదేం బ్రహ్మవిద్యా - అని తాత్పర్యము. బ్రహ్మవిద్య కష్టము అని అను).

## న్యాసవిద్యాయా వర్ణనమ్:

**మూ:** న్యాసవిద్యాప్రపత్తిః. సా చ అనన్యసాధ్యే స్వాభీష్టే మహావిశ్వాస పూర్వకంతదేకోపాయతా యాచ్ఞా ప్రపత్తిః శరణాగతిరిత్యుక్తా. ఆనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనమ్। రక్షిష్యతీతి విశ్వాసో గోప్తృత్వవరణం తథా॥ ఆత్మనిక్షే పకార్పణ్యమిత్యంగపంచకయుక్తా ఏతద్దేహావసానే మోక్షప్రదా. అంతిమ ప్రత్యయ నిరపేక్షాసకృత్కర్తవ్యాన్యాసః శరణాగతి రిత్యాదిశబ్దవాచ్యా జ్ఞానవిశేష రూపా. ఏషా గురుముఖా ద్రహస్యాది శాస్త్రేషు సత్సమ్ప్రదాయ పూర్వకం జ్ఞాతవ్యేతీహ బాలబోధనార్థప్రవృత్తేగ్రంథేన ప్రకాశ్యేతి విరమ్యతే.

**అ:** ప్రపత్తినే న్యాసవిద్యా అని అంటారు. ఉపనిషత్తులలో సుమారు ముప్పయి బ్రహ్మవిద్యలు ఉన్నాయి. వాటిలో న్యాసవిద్య ఒకటి. (తైత్తిరీయ నారాయణములో వసురణ్యో విభురసి ప్రాణే త్వమసి సంఘాతా బ్రహ్మంస్త్వమసి విశ్వసృక్ తేజోదాత్వమస్యగ్నేః వర్చోదాస్త్వమసి సూర్యస్య ద్యుమ్నోదాస్త్వమసి చంద్రమస ఉపయామ గృహీతోऽసి బ్రహ్మణే, త్వామహ స ఓమిత్యాత్మానం యుంజీతైతద్వై మహోపనిషదం దేవానాం గుహ్యం య ఏవం వేద బ్రహ్మణో మహిమాన మాప్నోతి. తై.నా 78. ఓ పరమాత్మ నీవు దేవతలకూ ఉపాస్యుడవు వ్యాపకుడవు. జగత్ స్రష్టవు. అగ్నితేజస్సు సూర్యునకు జ్యోతి, చంద్రునికి కాంతి ఇచ్చువాడవు. చాలాకాలము తరువాత చూడబడితివి. శరణాగతిని చేయు చున్నాను. తద్వారా మిమ్మల్ని చేరుదామని. ఓం అని తనను తాను అర్పించుకోవాలని ఉపనిషత్తు తెలుపుతున్నది.) న్యాసవిద్య స్వరూపాన్ని శ్రీవాత్స్య వరదాచార్యులవారు 'ప్రపన్న పారిజాతము స్వరూపపద్ధతి'లో అనన్య.... శరణాగతిః॥ స్వ.ప. 2. వివరించారు. ఈ శ్లోకంలో ప్రపత్తినే శరణాగతి అన్నారు. అది యాచ్ఞారూపము. ప్రపత్తికంటే భిన్నమయిన ఏ సాధనముతో ప్రసన్నుడు కానట్టి తనకు చాలా ఇష్టుడయినట్టి శ్రీభగవంతుని విషయమయి గొప్ప విశ్వాసముతో, ఆ భగవంతునే ఉపాయముగా తలచి ఆ భగవంతుని ప్రాప్తికొరకు ఆయననే యాచించుట ప్రపత్తి. శరణాగతికి అయిదు అంగములు ఉన్నాయి.



1. భగవంతునికే అనుకూలముగా ఎల్లకాలము ఉండుటకు సంకల్పము.
2. ఎప్పుడుగానీ, భగవంతునకు ప్రతికూలముగా విరుద్ధముగా ఉండక పోవుటకు సంకల్పము.
3. భగవంతుడు తనను తప్పక రక్షిస్తాడు అని విశ్వాసము కలిగియుండుట.
4. భగవంతుడే మనలను రక్షించువాడు అను దృఢ విశ్వాసము. ఆయనయే కాని ఇతరులు రక్షకులు కాదని.
5. భగవంతునకు తన్ను తాను అర్పించు కొని దీనత్వమును చూపుట. ఇట్టి అయిదు అంగములు గల శరణాగతి ఈశరీరము పడిపోయిన తర్వాత మోక్షమును కలిగిస్తుంది. ఈ శరణాగతి భక్తి కంటే వేరయినది. అంతిమ ప్రత్యయము లేక భక్తి మోక్షము కలిగించలేదు. అంతే గాక ఈ శరీరము పడిపోయినప్పుడే మోక్షము కలుగుతుంది. అనలేము. కాని ప్రపత్తి

గలవాడికి– ప్రపన్నునికి వర్తమాన శరీరము చివరనే మోక్షము కలిగితీరుతుంది. భక్తి జీవితాంతముండాలి. ప్రపత్తి ఒకేసారి ఉంటుంది. ఇన్ని భేదాలున్నను, ఇవి రెండు – భక్తి ప్రపత్తులు జ్ఞానముయొక్క విశేషములే. భేదములే. ఈ రెండిటి వినియోగమును బట్టి ఫలములో భేదము చూడడానికి ప్రపత్తి సులువుగా అనిపిస్తుంది కాని మహా విశ్వాసము (ఎల్లకాలము) ఉండటము కష్టసాధ్యము. ఈ ప్రపత్తి గురుముఖతః వినాలి తెలుసుకోవాలి. సంప్రదాయం తెలుసుకొని యుండాలి కనుక, బాలురకు బోధించడానికి వ్రాసిన ఈ గ్రంథములో వివరించడము జరుగలేదు. అది భగవద్విషయము తిరుమంత్రార్థము మొదలగు రహస్యశాస్త్రముల ద్వారానే తెలుసుకొనదగినది అని భావము.

**మోక్షోపాయవిషయకమతాంతర నిరాసః**

**మూ:** భక్తిప్రపత్త్యోరేవ మోక్షసాధనత్వేన స్వీకారాత్ పరోక్తోపాయ నిరాసః యథా వేదబాహ్యానాం మధ్యే కేషాంచిన్మతే దేహాతిరిక్తాత్మనోఽనఙ్గీకారాత్ మోక్షప్రవృత్తిరేవ న సమ్భవతి. అన్యేషాం మతే జ్ఞానస్య క్షణి కత్వాత్ తస్యైవాత్మత్వాత్క స్య ప్రవృత్తిః. సన్తానస్యేతి చేన్న, అన్యం ప్రత్యన్యేన హి యత్నో న కార్యః, ఇతి న ప్రవృత్తిః. అపరేషాం మతే (ధర్మాధర్మా) సత్త్వా సత్త్వాది సప్తభంగీరీత్యానే కాంతవాదాన్న ప్రవత్తిః వైశేషి కాది పక్షే పాషాణ కల్పమోక్షే ప్రవృత్తిః కస్యాపి న సమ్భవతి. సాఙ్ఖ్యాదిపక్షేఽపీశ్వరానంగీకారాత్ పురుషస్య వా ప్రకృతేర్వా మోక్ష ఇతి సంశయాన్న ప్రవృత్తిః భాస్కరయాదవోక్త కర్మ జ్ఞానసముచ్చయవాదోఽప్యుక్తన్యాయేన నిరస్తః శైవమతే తు పశుపతేః ప్రాప్యత్వ స్వీకారాద్వేదవిరుద్ధ భస్మధారణాదేః సాధనత్వేన స్వీకారాచ్చ తన్నిరాసః. ఏవం మతిర్నిరూపితా.

ఇతిశ్రీవాధూలకులతిలక– శ్రీమన్మహాచార్య ప్రథమ దాసేన శ్రీనివాసదాసేన విరచితాయాం యతీంద్రమతదీపికాయాం శారీరకపరిభాషాయాం బుద్ధి (ధర్మ భూతజ్ఞాన) నిరూపణం నామ సప్తమోఽవతారః॥



**అ:** సిద్ధాంతములో భక్తి మరియు ప్రపత్తులనే మోక్షసాధనముగా ప్రతిపాదిస్తున్నారు కనుక ఇతరులు చెప్పినవాటికి మోక్షోపాయత్వము తొలగిపోతుంది. వేద ప్రామాణ్యమును ఒప్పుకోనివారు కొందరున్నారు. వారిలో కొందరు (చార్వాకులు కావచ్చు బహుశః) దేహము కంటే వేరుగా ఆత్మను ఒప్పుకొనరు. కావున వారికి మోక్షములో ప్రవృత్తియే కలుగదు. ఇక కొందరి అభిప్రాయములో (బౌద్ధులు) జ్ఞానమే ఆత్మ అయితే ఆ జ్ఞానము క్షణికము. క్షణము తర్వాత నశిస్తుంది. మరియొక క్షణంలో ఉండనందున ఆత్మకూడ లేనట్టు. ఇక ఎవరి మోక్షము కొరకు ప్రయత్నము చేయవచ్చుగద, అదికూడ జరుగదు. ఒకరి మోక్షము కొరకు మరొకరు ప్రయత్నము చేయరు కనుక మోక్షప్రవృత్తి యుండదు. ఇక మరియొకరి (జైనుల) అభిప్రాయములో ధర్మము – అధర్మము, సత్త్వము – అసత్త్వము మొదలయిన ఏడు విధములయిన న్యాయము సిద్ధాంతము. వారికి ఎల్లప్పుడు సంశయమే – అనేకాంతవాదము ఉన్నందున మోక్షము కూడ ఉన్నదా లేదా అనే సందేహముంటుంది. నిశ్చయము లేనందున మోక్షములో ప్రవృత్తి కలుగనేరదు.

వైశేషికులు నైయాయికులు మోక్షములో సుఖము దుఃఖము ఏవీ ఉండవు అనడంతో మోక్షదశ అంటే రాయిలాగ పడిఉండడమే అన్నమాట. (శ్రీహర్షుడు కూడ 'శాస్త్రమూచే శిలాత్వాయ' అంటూ గౌతముడు గోసముడని విమర్శించాడు.) అట్లాటి మోక్షము కావాలని ఎవరు కోరుకుంటారు. సాంఖ్యుల సిద్ధాంతములో ఈశ్వరుడు లేడు. మోక్షము పురుషునికా ప్రకృతికా అను సందేహముతో మోక్ష ప్రవృత్తి కలుగదు. జగత్తు మిథ్య అను అద్వైతులకు వ్యావహారికమయినట్టి తత్త్వమసి మొదలయిన వాక్యములతో పారమార్థికమయిన అభేదజ్ఞానము కలుగనేరదు. కనుక మోక్షంలో ప్రవృత్తి పుట్టదు. భాస్కరులు, యాదవప్రకాశులు చెప్పిన కర్మజ్ఞాన సముచ్చయ వాదము కూడ – వ్యావహారిక వాక్యజ్ఞానముతో పారమార్థిక అభేదజ్ఞానము కలుగనందున మోక్షమునకు ఉపాయము కాబోదు.

శైవమతమున పశుపతియే ప్రాప్యుడయిన– పొందవలసిన దేవుడు, అని అంగీకరించినందున, వేదవిరుద్ధమయిన భస్మధారణము మోక్షసాధనము అని ఒప్పుకోవడంతో వాటి మోక్షోపాయత్వము తొలగిపోయినది. విశిష్టాద్వైత దర్శనమున వాటిని మోక్షోపాయములుగా అంగీకరించలేదు. ఇట్లా మతి – జ్ఞానము – ధర్మభూత జ్ఞానము యొక్క నిరూపణము ముగిసినది.

ఇట్లు శ్రీవాధూలకులతిలకుడయినట్టి శ్రీమన్మహాచార్యుల ప్రధాన శిష్యుడు అయిన శ్రీనివాసాచార్య ప్రణీతమయిన యతీంద్రమతదీపిక అను శారీరక పరిభాషయందు బుద్ధి (ధర్మభూతజ్ఞాన) నిరూపణము అనుఏడవ అవతారము ముగిసినది.



# అథాష్టమావతారః

## జీవస్వరూపనిరూపణమ్ ః

**మూ:** అథ జీవో నిరూప్యతే. ప్రత్యక్త్వచేతనత్వాత్మత్వకర్తృత్వాదీని ఈశ్వర జీవసాధారణలక్షణాని. ప్రత్యక్త్వం నామ స్వస్మై స్వయమేవ భాసమానత్వమ్. చేతనత్వంనామ జ్ఞానాశ్రయత్వమ్. ఆత్మత్వం శరీరప్రతి సంబంధిత్వమ్. కర్తృత్వం సంకల్పజ్ఞానాశ్రయత్వమ్. ఆత్మత్వం శరీరప్రతి సంబంధిత్వమ్. కర్తృత్వం సంకల్పజ్ఞానాశ్రయత్వమ్. ఏవం సామాన్య లక్షణలక్షితస్య జీవస్య విశేషలక్షణా న్యుచ్యన్తే. అణుత్వేసతి చేతనత్వమ్. స్వతః శేషత్వేసతి చేతనత్వమ్. ఏవమాధేయత్వ విధేయత్వ పరాధీన కర్తృత్వ పరతన్త్రాదికమూహ్యమ్.

**అ:** ధర్మభూతజ్ఞానము నిరూపించిన పిదప ఇప్పుడు జీవుని స్వరూపము నిరూపింపబడుతున్నది. మొదట ఈశ్వరునిలో జీవునిలో సమానముగా ఉండే లక్షణములను తెలుసుకుందాము. ఇవి ప్రత్యక్త్వము, చేతనత్వము, ఆత్మత్వము, కర్తృత్వము అనునవి. ఆదిశబ్దముచే ఇంకా కొన్ని ఉన్నట్టు తెలుస్తున్నది. ప్రత్యక్త్వము అనగా ప్రకాశమునకయి ఇతరమును అపేక్షించక తనకై తాను ప్రకాశించడము అని అర్థము. తమప్రకాశముచే కలిగే – జరిగే వ్యవహారము అను ఫలాన్ని వీరిద్దరూ తమకొరకే పొందుతారు. (ఘటము ప్రకాశము ద్వారా తెలుపబడితే ఆ వ్యవహార రూపమయిన ఫలాన్ని చూసే వ్యక్తి పొందుతాడు కాని ఘటము పొందదు. ఇక్కడ అట్లా కాదు.) చైతన్యమస్తి ఇతిచేతనః, తస్యభావః చేతనత్వం, అని వ్యుత్పత్తి చేతనత్వశబ్దానికి. చైతన్యమునకు జ్ఞానమునకు ఆశ్రయము అగుట చేతనత్వము. శరీరముతో (ప్రతి) సంబంధము కల్గిఉండటము ఆత్మత్వము. కర్తృత్వము అంటే సంకల్పమునకు మరియు జ్ఞానమునకు ఆశ్రయము కావడము, ఈ నాలుగుధర్మములు ఈశ్వరుడు మరియు జీవునిలో సమానముగా ఉన్నాయి.

ఈశ్వరుడు జీవుడు తమ ప్రకాశముతో జరిగే వ్యవహారరూపమయిన ఫలమును తామే పొందుతారు. తమప్రకాశము కొరకు ఇతరుల మీద ఆధారపడరు. 'స్వయంజ్యోతిష్' మొదలయిన శబ్దాలు విశేషణములుగా ఉన్నాయి. 'యః సర్వజ్ఞః సర్వవిత్' ఇత్యాది శ్రుతులు ఈశ్వరుణ్ణి జ్ఞానానికి ఆశ్రయముగా చెపుతున్నాయి. జీవుడి ఒకపేరు చేతనుడు అనియే. ఈ జ్ఞానమే జీవుణ్ణి ఈశ్వరునికంటే భిన్నమయిన వాటినుండి వేరు చేస్తున్నది. 'స్వాభావికీ జ్ఞానబలక్రియాచ' మొదలయిన శ్రుతులు ఈశ్వరునికి సహజముగానే జ్ఞానము బలముయొక్క క్రియ ఉందని తెలుపుతున్నవి. ఆయన సర్వశక్తిమంతుడు. ఏ పనిచేయడానికి జ్ఞానము 'సంకల్పము అవసరము. ఇవి జీవునిలో కూడ ఉన్నాయి. ఇట్లా ఇవి ఇద్దరికీ సమానధర్మములు. ఇక జీవుని విశేషలక్షణములు. అణు పరిమాణము కలిగి ఉండి చేతనత్వము కల్గియున్నవాడు. ఈశ్వరునిలో అతివ్యాప్తి తొలగించడానికి 'అణుత్వే సతి' అనడం. జడములో పరమాణులో అణుత్వము ఉందికనుక అతివ్యాప్తి. దానిని నివారించడానికి చేతనత్వము అను పదము. వాటిలో చేతనత్వం లేనందున తొలగిపోతుంది అతివ్యాప్తి. ఈశ్వరుడు అణువు కాదు కనుక పయి అతివ్యాప్తి తొలగుతుంది. చేతనత్వమున్నప్పటికిని.

రెండవలక్షణము – తాను శేషుడయి ఉంటూ చేతనుడు కావడం చేతనత్వం ఈశ్వరునిలో ఉంది. అతివ్యాప్తి వస్తుంది. దానిని తొలగించడానికి శేషుడు కావడము అని విశేషణము. ఆయన శేషి భోక్త యజమాని అంతే గాని శేషుడు కాదు. జీవుడు ఇతరులకొరకు (ఈశ్వరునికొరకు) ఉన్నవాడు మరియు చేతనుడు. ప్రకృతి మొదలయిన అచేతనము కూడ శేషము. ఇతరులకొరకు ఉన్నదే, అతివ్యాప్తి వస్తుంది, తొలగించడానికి చేతనత్వ విశేషణము. వాటిలో చేతనత్వము లేనందున తొలగుతుంది. ఇట్లాగే చేతనత్వేసతి ఆధేయత్వమ్ చేతనత్వేసతి విధేయత్వమ్ చేతనత్వేసతి పరాధీనకర్తృత్వమ్ చేతనత్వేసతి పరతంత్రత్వమ్ మొదలయినవి ఊహించుకోవాలి. ప్రకృతిలో అచేతనములో అతివ్యాప్తి తొలగించడానికి చేతనత్వవిశేషణము. ఈశ్వరునిలో చేతనత్వము వలన కలిగే అతి వ్యాప్తిని



తొలగించడానికి, విధేయత్వాది విశేషణములు. ఆయన ఎవరికీ విధేయుడు ఆధేయము కాదు. పరాధీనకర్తృత్వము, పరతంత్రత్వములేనివాడు కనుక అతివ్యాప్తి తొలగిపోతుంది.

**జీవస్య దేహేంద్రియాదిభ్యో భిన్నత్వసాధనమ్:**

**మూ:** స చ దేహేన్ద్రియమనః ప్రాణదిభ్యో విలక్షణః. యథా మమ శరీరమితి ప్రతీత్యా దేహాద్ వ్యావృత్తః. ఏవం చక్షుషా పశ్యామి, శ్రోత్రేన్ద్రియేణ శృ ణోమి, వాచా వదామీత్యాది ప్రత్యయాత్ బాహ్యేన్ద్రియేభ్యో వ్యావృత్తః. మనసా జానామీతి మనసో జ్ఞానకరణత్వప్రతీతేః, మమ ప్రాణా ఇతి వ్యతిరేకోక్త్యా జానామ్యహమితి ప్రతీత్యా చ మనఃప్రాణజ్ఞానేభ్యో వ్యావృత్తః.

**అ:** ఆ జీవుడు దేహము, ఇంద్రియములు, మనస్సు, ప్రాణము మరియు జ్ఞానము అనువానికంటె భిన్నుడు. అవి వేరు జీవుడు వేరు. ఇది నాశరీరము, అను ప్రతీతి– జ్ఞానమువలన ఆత్మ వేరు శరీరము వేరు అని తెలుస్తున్నది. నేను కంటితో చూస్తున్నాను. చెవితో వింటున్నాను, నోటితో మాట్లాడుతున్నాను – అని మొదలయిన జ్ఞానముచే ఇంద్రియములు జీవుడు భిన్నము అని తెలుసుకోవచ్చును. ఇవి అన్ని బాహ్యేంద్రియములు, నేను మనస్సుతో తెలుసుకొంటున్నాను. నా ప్రాణం ఉసూరుమన్నది, అనుకొనడం ద్వారా మనస్సు జ్ఞానానికి కరణము – సాధనము అని, ప్రాణము నేను (ఆత్మ) ఒకటి కాదని తెలుస్తున్నది. అహం జానామి నేను తెలుసుకుంటున్నాను అనే ప్రతీతి కూడ ఆత్మ వీటన్నికంటే వేరు అని విదితమవుతున్నది.

**వి:** మనం (మన శరీరమునే) నేను నేను అని అంటుంటాము. ఆ నేను ఎవరు? ఈ ప్రశ్నకు జవాబుగా ఒక చార్వాకులు దేహమునే ఆత్మ అంటారు. దీనికి ప్రత్యక్షమే ప్రమాణము. నేను లావుగా ఉన్నాను, నేను చిక్కిపోయాను, ఇ లాటి నేను శరీరము. ఆత్మకు జ్ఞాతృత్వము ఉన్నది. శరీరమే అహమ్ అను దానికి అర్థము. కుండ మొదలయిన అచేతన పదార్థములకు

తమ ఇష్టానుసారము నడిచే శక్తిలేదు. అవి ఇంద్రియాలకు ఆశ్రయమూ కాదు. శరీరములో ఈ రెండు ఉన్నాయి. కనుక శరీరము చేతనము ఆత్మకూడ. శరీరభిన్నమయిన ఆత్మను ధ్రువీకరించే అనుమానము ప్రత్యక్షముతో బాధింప బడుతున్నది. బృహస్పతియను ఆచార్యులు పృథివ్యాపస్తేజోవాయురితి తత్త్వాని తేభ్యశ్చైతన్యం కిణ్వాదిభ్యో మదశక్తివత్ అని చెప్పారు పృథివి, జలము, తేజస్సు, వాయువు అను ఈనాలుగు తత్త్వాలు శరీరమును ఆరంభిస్తాయి. వీటిసంయోగముతో కలయికతోనే, మద్యము చేయుపదార్థముల కలయికతో వాటిలో లేని మదము కలిగించు శక్తి వచ్చినట్లు శరీరములో జ్ఞానము కలుగుతుంది. ఈ వాదమును బట్టి దేహమే ఆత్మయని తేలుతుంది.

విశిష్టాద్వైతులు దీనిని ఖండించే విధము – ప్రతి మనిషి తన ఆత్మను తాను, తాను అని తెలుసుకుంటాడు. తనకంటే ఇతరములయిన వాటిని ఇది అది ఇవి అవి అని అంటాడు. నేను, ఇది, అది అను పదాలతో చెప్పే పదార్థాలు వేరు వేరు. నేను – అన్నది ఆత్మ. ఇది అది అనునవి ఆత్మ కానివి. ఇది నా పుస్తకము, ఇది నా ఇల్లు, అది నా స్కూటరు, అది నా కాలేజి అను వాటిలో ఇది అది అనేవి ఆత్మ కావు, నేను అనునది ఆత్మ. ఈ విధముగా ప్రత్యక్షముగా అనుభవములోనికి వస్తున్నదాన్నిబట్టి దేహము ఆత్మ కాదని స్పష్టము.

చార్వాకులు స్థూలశరీరమునే ఆత్మ అంటారు. మనిషి బాహ్యేంద్రియముల పయి నియంత్రణతో మనస్సును సావధానము చేసుకొని తనను తాను నేను అని తెలుసుకుంటుండేప్పుడు ఆ ఆత్మకు కాళ్ళు చేతులు మొదల యిన వాటి ప్రతీతి కలుగదు. శరీరమే ఆత్మ అయితే కరచరణాదుల ప్రతీతికూడ కావలసి యుండెడిది. లేదు కనుక అహమర్థమయిన ఆత్మ శరీరము కాదు అని స్పష్టము.

కొందరు చార్వాకులు అనుమానమును ఒప్పుకుంటారు. అనుమానముతో, శరీరము ఆత్మకాదని ఇట్లా నిరూపించవచ్చును. నేను తెలుసుకుం



టున్నాను,అను ప్రతీతి శరీరమునకు చెందినది కాదు. (శరీరవిషయిణి కాదు) ఇతరవిషయములకు చెందినది, ఎందుకంటే ప్రణిధానసమయములో– ఏకాగ్రతగా మనస్సు దేనినయినా ధ్యానిస్తున్న సమయములో అవయవములను విషయముగా తెలుపుటలేదు. శరీరము యొక్క అవయవములను తెలుపని ప్రతీతి శరీరవిషయిణి కాకుండ వేరే విషయములను తెలుపునది. 'ఇది ఘటము' అను ప్రతీతిలాగ. చక్షురింద్రియముతో జరిగే శరీరవిషయిణి ప్రతీతి శరీరము యొక్క ఇంద్రియము లను ప్రకాశింపజేస్తుంది. శరీరము అహంశబ్దము యొక్క విషయము కాలేదు. అది చక్షురింద్రియముతో గ్రహింపబడుతున్నది ఇది అనే శబ్దముతో చెప్పబడు తున్నది. ఇది ఘటము అన్నట్లుగానే ఉన్నది. ఘటము అనేది ఎన్నడు అహం శబ్దముతో చెప్పబడదు. అట్లానే శరీరముకూడ చెప్పబడదు. దీన్నిబట్టి అహంప్రతీతికి శరీరము విషయము కాదని స్పష్టము.

జ్ఞానము శరీరము యొక్క క్రియ కాదు. కార్యము కాదు. కారణము యొక్క గుణములు కార్యములోని గుణాలను ఆరంభం చేస్తాయి అని న్యాయము. మద్యమును తయారు చేసే ప్రతిపదార్థము పరమాణువులో మాదకశక్తి ఉంటుంది. కాని అట్లా శరీరమును తయారుచేయునట్టి పృథివి, జలము, తేజస్సు, వాయువు పరమాణువులలో కూడ జ్ఞానముండాలి. లేదు కనుక జ్ఞానము శరీరము యొక్క కార్యము కాదు.

సుఖము, దుఃఖము, కోరిక మొదలయినవి శరీరము యొక్క గుణములు కావు. చనిపోయిన తర్వాత శరీరముంటుంది కాని దానికి సుఖదుఃఖములు మొదలయినవి ఏవి ఉండవు. అవి శరీరముయొక్క గుణములు కావు. గుణములే అయితే రూపము మొదలయిన గుణాలు ఎప్పుడూ శరీరంలో ఉన్నట్టు అవీ ఉండాలి. వీటన్నిటివలన దేహము ఆత్మ కాదను విషయము సుస్పష్టము.

కొందరు చార్వాకులు ఇంద్రియములు ఆత్మ అని వాదిస్తారు. దేహము ఆత్మ కానీయకపొండి, ఇంద్రియములను ఆత్మగా ఒప్పుకోవడంలో తప్పులేదుగద.

ఇంద్రియములు ఇది అది అనే ప్రతీతికి తగినవి కావు. ఇంద్రియములు శరీరము వలె ఉద్భూత రూపాది గుణములు కలవి కావు. స్థూలములు కావు. అహమర్థము కూడ ఇంద్రియములు కావచ్చును.

ఇంద్రియములు అతీంద్రియములు అవి ఇంద్రియములచే గ్రహింప బడవు కనుక అహం అనుదానితో వాటి ప్రతీతి ఎట్లా కలుగుతుంది అని ప్రశ్న. జవాబు చక్షురాది ఇంద్రియములతో కలుగు రూపాది పదార్థజ్ఞానానికి ఆధారం చక్షురాదీంద్రియములు. అవి ఉంటే రూపాదిజ్ఞానము లేకుంటే లేదు. ఇట్లా రూపాది జ్ఞానానికి చక్షురాదులతో అన్వయవ్యతిరేకం ఉన్నది. ఆ జ్ఞానం చక్షురాదికి జరుగుతుంది. చక్షురాదిలోనే ఉంటుంది. ఇంద్రియములయొక్క వ్యాపార సన్నికర్షతో కలిగే ప్రత్యక్ష జ్ఞానరూపఫలము ఇంద్రియములకే దక్కుతుంది. ఇట్లా ఇంద్రియముల జ్ఞానాధారమయి అహమర్థము అవుతుంటే వాటిని అతీంద్రియములు అప్రత్యక్షములు అని ఒప్పుకోవడం బాగులేదు. కంటికి ఇంపుగా లేదు, చెవికి బాధకలిగిస్తున్నది శబ్దము, స్పర్శ భరించదు– ఇట్లాటి వాటివలన ఇంద్రియములు సుఖదుఃఖాలను అనుభవిస్తుంటాయి. ఇంద్రియముల యొక్క ధర్మము ఆత్మలో ఉన్నట్టు కనబడుతున్నాయి. ఇంద్రియవికలురు కాగానే మేము వికలురము అయ్యాము, బాగవగానే మేము బాగయ్యాము అని అనుభవము కలుగు తున్నందున ఈ ధర్మము అహమర్థగతము అవుతున్నందున ఇంద్రియములే ఆత్మ అని సిద్ధము సప్రమాణము అని ఇంద్రియాత్మ వాదన.

ఇక దీని విమర్శ. ఇంద్రియములు అహమర్థమయితే, ఇంద్రియములు అనుభవించినది, ఇంద్రియములకే స్మరణకు రావాలి ఇతరులకు రాకూడదు. లోకంలో మనం చూస్తుంటాము, బాల్యములో యౌవనములో చూచే శక్తికలవారు ప్రపంచాన్నంతా చూస్తారు. ముసలితనంలో కళ్ళు కనబడకుండా అవుతాయి. అయినా కళ్ళుచూసిన వాటిని స్మరిస్తుంటారు. స్పర్శతో తెలుసుకుంటూ మొదటచూసిన వాటిని ఇప్పుడు తాకిడితో తెలుసుకుంటున్నాను అని జ్ఞాపకం



చేసుకుంటుంటారు. చక్షురింద్రియం లేకున్న అది అనుభవించినది ఇంకొకరికి స్మరణకు వస్తున్నది. ఇంద్రియాత్మ వాదంలో ఇది పొసగదు. ఇంకో అనుపపత్తి– ఇంద్రియములు చాలా ఉన్నవి. ఈ ఇంద్రియములు వేరు వేరుగా ఆత్మనా? లేక అన్ని కలిసి ఆత్మనా అనిప్రశ్న. వేరువేరుగా ఆత్మ అనుకుంటే ఒక ఇంద్రియముతో తెలుసుకున్నది మరొక ఇంద్రియముతో స్మరించుట వీలుకాదు. నేను చూసిన దాన్నే స్పర్శతో తెలుసుకుంటున్నాను అని స్మరణం కలుగుతున్నది. ఇంకో విషయం ఏమంటే ఒక శరీరంలో అనేకం ఆత్మలు అనాల్సివస్తుంది. లేదు, అన్నికలిసియే ఒక ఆత్మ అనడం కూడ సమంజసము కాదు. ఇంద్రియాలన్ని కలసి ఒకే వస్తువును అనుభవిస్తున్నాయి అని చెప్పలేము. అన్నికలిసి కూడ ఒకవస్తువును స్మరించలేవు. ఇంద్రియములయొక్క గుణము జ్ఞానము అని చెప్పితే, ఆ ఇంద్రియము నష్టమయిపోతే ఆ అనుభవాన్ని జ్ఞాపకం చేసుకోవడమూ కుదరదు. వీటన్నిటివలన ఇంద్రియములు ఆత్మ గాదనుట స్పష్టము.

మనస్సును ఆత్మగా ఒప్పుకుంటే దేహేంద్రియాత్మవాదులకు గలిగిన దోషాలుండవు. మనస్సు ఒకటే అవయవసముదాయాత్మకము గాదు, నష్టము గాదు కనుక స్మరణము అనుపపన్నము గాదు. అది ఇంద్రియములకు అధిపతి కూడ అని మరి యొక చార్వాకుల వాదన, ఇదంతా బాగుంది. దీంట్లో ఇతర దోషాలున్నాయి. నా మనస్సు అనే అనుభవము కలుగుతుంటుంది. దీని వలన మనస్సు వేరు అహమర్థము వేరు అనిసిద్ధిస్తుంది. ఇంకోదోషము ఆత్మస్మరణము మొదలయిన క్రియలను చేస్తుంది. ఆ క్రియలలో తోడ్పడేది కరణము మనస్సు. అందుకే దీనికి అంతఃకరణము అని కూడ పేరు. కర్త వేరు కరణము వేరు వేరు కద. కరణము అయినందుననే చక్షురాది ఇంద్రియములు కర్తఅయిన ఆత్మ కాలేకపోయిన వోమనస్సు కూడ కరణమే కనుక కర్త కాదు ఆత్మ కాదుస్మరణానికి కూడ కర్త కాదు మనస్సు. జ్ఞానాలన్నీ ఒకసారే కలుగకపోవడానికి మనస్సే – బాహ్యేంద్రియాలకు సహకరించే అంతరింద్రియము మనస్సే కారణము.

పరధ్యానములో ఉంటే చూస్తున్నా వింటున్నా వాటిజ్ఞానము కలుగదు. వీటికి మనస్సు వరుసగా ఒక్కోదానికి సహకరిస్తూ దాని ప్రతీతిని ఆత్మకు కలుగజేస్తుంది.

రూపాదులను చక్షురాదులు గ్రహించినట్టు, సుఖదుఃఖాదులను గ్రహించే సాధనము మనస్సు – కర్త కాదు. జ్ఞానమున కాశ్రయము అహమర్థమయిన ఆత్మ. జ్ఞానానికి కరణమయిన మనస్సు రెంటిని ఒప్పుకుంటేనే నేను తెలుసుకుంటున్నాను, నాకు తెలుసు ఇట్లాటి ప్రతీతి వీలవుతుంది. జ్ఞానమునకు కరణమయిన మనస్సు జ్ఞానమునకు ఆశ్రయమయిన ఆత్మ కాదు కాలేదనుట సుస్పష్టము. మరియొక రకము చార్వాకులు. ప్రాణమే ఆత్మఅని నిరూపిస్తారు. దానికి ఇవి ప్రమాణములు. శరీరములో ప్రాణమున్నప్పుడు సాత్మకము అని, ప్రాణము పోయినప్పుడు నిరాత్మకమని అంటాము.

ఈ అన్వయ వ్యతిరేకముతో ప్రాణమే ఆత్మ. ఆత్మ దేహమును ఇంద్రియములను ఆ యా పనులలో ప్రవర్తింపజేస్తుంది. శరీరము, ఇంద్రియము, మనస్సు వీటన్నిటి పనితనము ప్రాణము మీదనే ఆధారపడి ఉన్నది. దీన్ని బట్టి కర్తృత్వముకూడ ప్రాణమునకు సిద్ధిస్తున్నది. ప్రాణశబ్దము ఆత్మశబ్దము ఒకదానికి కూడ ఉపయోగింపబడుతున్నవి. కనుక వీటికి అభేదము సిద్ధిస్తుంది. జీవన్మరణములు ఆత్మ శరీరములో ఉండటం, లేకపోవడం వలన జరుగుతున్నవి. ప్రాణం ఉంటే జీవితం, లేకుంటే మరణం. ఉపనిషత్తులు కూడ ఆత్మ ఈ శరీరం నుండి వెళ్ళిపోవడం, లోకాంతరానికి పోవడం, వచ్చి మళ్ళీ శరీరం ధరించడం గురించి చెపుతున్నాయి. ప్రాణము గమనశీలము కనుక ఇది కూడ సిద్ధిస్తుంది. వీటన్నిటిని బట్టి ప్రాణమే ఆత్మ అని వాదము సారాంశము.

దీనివిమర్శ విశిష్టాద్వైతుల ప్రకారము ఇట్లా ఉంటుంది. ప్రాణము అనునది వాయువు యొక్క భేదమే గాని ఆత్మ గాదు. ప్రాణము అను వాయువు నాసిక నుండి వెలుపలికి వచ్చునప్పుడు స్పర్శవలన మనం గుర్తిస్తాము అది కూడ ఒకరకమయిన వాయువు అని. గాలి మన శరీరాన్ని తాకినా మనము



వాయువును గుర్తిస్తాము, బాహ్యమయిన గాలి ఎట్లా అచేతనమో అట్లా ప్రాణవాయువు కూడ అచేతనమే. అచేతనము ఆత్మ కానేరదు. సుషుప్తికాలములో ఆత్మ నిర్వ్యాపారముగా ఉంటుంది. ఆ సమయములో ప్రాణము తన పని తాను చేస్తుంటుంది. సవ్యాపారము. ప్రాణము సుషుప్తిలో కూడ పనిచేస్తూ అన్నమును సప్తధాతువులుగా మారుస్తూ ఉంటుంది. ఉచ్ఛ్వాసనిశ్వాసలు జరుగుతూనే ఉంటాయి. సుషుప్తికాలంలో ప్రాణం ఇంత పనిచేస్తుంటే ఆత్మకు తెలియనే తెలియదు. ఎందుకని రెండు ఒకటయితే తెలియాలిగా మరి. దీన్నిబట్టి ఉచ్ఛ్వాసనిఃశ్వాసరూపమగు ప్రాణము, ఆత్మ వేరు వేరని స్పష్టము.

నా ప్రాణం హాయి మన్నది, నా ప్రాణం పోయింది. ఇలాంటి ప్రతీతి వలన తాను (ఆత్మ) వేరు ప్రాణం వేరని తెలుస్తున్నది. శరీరము సంఘాత రూపమయినట్లు ప్రాణము కూడ పది వాయువుల సంఘాతమే. ఇక్కడ కూడ సముదాయము ఆత్మ అయితే ఒకదోషము విడిగా ఆత్మ అయితే అనేకాత్మత్వ దోషము ఇంద్రియాత్మవాదములో లాగ, వస్తుంది.

ప్రాణం ఆత్మ అని నిరూపించడానికి చెప్పిన కారణాలు అన్యథా సిద్ధములు– ప్రాణం ఆత్మ కాకున్నా ఉండేవే. ఆత్మ ప్రాణంతో పాటు శరీరంలో ఉంటుంది, ప్రాణంతో బాటే బయటకు వెళుతుంది. అపుడే జీవితం, మరణం, సాత్మకం, నిరాత్మకం అవడం సహజము. దేహాదుల వ్యాపారానికి కారణం ప్రాణం కనుక దానిని ఆత్మ అనడం బాగుండదు. ప్రాణంతో బాటు జ్ఞానం, ఇచ్ఛ మొదలయిన కారణాలు కూడ ఉన్నాయి దేహాదివ్యాపారానికి. వాటినన్నిటిని ఆత్మ అనలేము గద. అనేకార్థం ఉంది కనుక పర్యాయంగా వాడుతుంటాము. ప్రాణశబ్దాన్ని ఆత్మశబ్దానికి బదులుగా. అంత మాత్రానికే అభేదము సిద్ధించదు. స్పర్శలేనట్టి అణువు అయినట్టి మనస్సు ప్రయత్నము మరియు అదృష్టముల యొక్క ప్రేరణచే శరీరమునుండి బయటకు వెళుతుంది మరణము అప్పుడు, మళ్ళీ జన్మ అప్పుడు తిరిగివస్తుంది. అట్లే ఆత్మలో కూడ గమనాగమనములు

కలుగుతుంటవి. కేవలము గమనాగమనములకొరకయి ప్రాణాన్ని ఆత్మగా ఒప్పుకోవని లేదు. సాధుకహేతువులు లేనందున, బాధక హేతువులున్నందున ప్రాణము ఆత్మ అనువాదము సరికాదనుట సుస్పష్టము.

దార్శనికులయిన బౌద్ధులు జ్ఞానసంతానమునే ఆత్మ అని స్వీకరిస్తారు. జ్ఞానము ప్రతిక్షణము నశిస్తుంది మళ్ళీ పుడుతుంది. కనుక క్షణికము. జ్ఞానము తరువాత జ్ఞానము తరువాత మూడవది నాలుగవది ఇట్లా వరుసగా ధారలాగ జ్ఞానం ఉంటుంది. ఆ ధారనే సంతానమంటారు. జ్ఞాన సంతానమే అజడము కనుక ఆత్మ స్వయంప్రకాశము. ఇతరనిరపేక్షముగా ఉన్నంతసేపు జ్ఞానము ప్రకాశిస్తుంటుంది. దీనివలననే ఘటాదులు ప్రకాశింపబడుతున్నాయి. ఘటాదులు తెలుస్తున్నవి అనే జ్ఞానం కూడ కలుగుతున్నది. రూపం ఉన్నందున ఆ సంబంధం కారణంగా ఘటాది పదార్థము చాక్షుషత్వజ్ఞానము కలుగుతున్నది. ఇదే విధంగా ఘటాదులు చాక్షుషములు అను వ్యహారము కలుగుతున్నది.

ఇదేవిధంగా ఘటాదులు చాక్షుషములు అను వ్యవహారము కలుగు తున్నది. ఈ చాక్షుషత్వధర్మము చాక్షుషత్వవ్యవహారము రూపము విషయంలో సరిపోయినది, రూపుకూడ చాక్షుషము కనుక. రూపము తన చాక్షుషత్వము తద్వ్యవహారమునకయి మరియొక రూపముతో సంబంధము కారణమును కోరదు కద. అట్లే తన సంబంధము కారణముగా ఘటాదిపదార్థములను ప్రకాశింప జేయు జ్ఞానము ప్రకాశధర్మాన్ని ప్రకాశమానత్వ వ్యవహారాన్ని పొందటానికి మరియొక జ్ఞానమును కారణముగా కోరదు. స్వయంగానే పొందుతుంది. అందువలన జ్ఞానములో ప్రకాశమనునది దాని స్వరూపమే. ఇంకొకజ్ఞాన సంబంధముతో కలుగుతు లేదు. దీనివలన జ్ఞానము స్వయంప్రకాశము. ఈ స్వయంప్రకాశ జ్ఞానము అజడము కాబట్టి దీనినే ఆత్మగా ఒప్పుకోవాలి.

జ్ఞానం అంటే వేరుగా జ్ఞాతగా ఆత్మగా ఒప్పుకుంటే రెండింటిని ఒప్పుకోవడంతో గౌరవదోషం కూడ కలుగుతుంది. (సంస్కృతంలో గౌరవం అంటే అవసరమయిన దానికంటే ఎక్కువగా దేనినయినా ఒప్పుకోవడం దోషం



కిందలెక్క. లాఘవం గుణము తక్కువగా ఒప్పుకోవడం. వ్యాకరణంలో విశేషంగా సూత్ర నిర్మాణములో ఒకమాత్ర-దీర్ఘము, లాఘవము కలిగినా మిక్కిలి సంతోషిస్తారు అని ఒక సామెత.అ) అహం అనుదానికి అర్థమయిన జ్ఞానానికి ఆశ్రయముగా ప్రతీతమవడం కూడ జ్ఞానం ఆత్మ అని ఒప్పుకోవడానికి రెండవ కారణము.

ఈ జ్ఞానము ఆలయవిజ్ఞానము ప్రవృత్తివిజ్ఞానము అని రెండువిధాలు. నేను అనువిధముగా ప్రతీతమగు జ్ఞానము ఆలయవిజ్ఞానము. నీలాది పదార్థములను చెప్పునట్టి జ్ఞానము ప్రవృత్తివిజ్ఞానము. మొదటిది రెండవదానికి కారణము. నేను అను రూపమున ప్రతీతమగు జ్ఞానము. ఇతరప్రవృత్తి జ్ఞానములకు ఆశ్రయముగా భాసిస్తుంది. వాస్తవానికి ఆశ్రయము ఆశ్రయించునది ఇట్లాటివి ఏవి లేవు. ప్రాచీనమయిన వాసన (సంస్కారము) అవిద్యా అనువాని కారణముగానే జ్ఞానములో, జ్ఞాత, జ్ఞేయము మొదలయిన అవాస్తవిక రూపములయిన వాటిని తెలుపునట్టి స్వయంప్రకాశజ్ఞానమేదయితే ఉందో అదే సత్యము. అదే ఆత్మ. ఈవిషయాన్నే

**'అవిభాగోఽపి బుద్ధ్యాత్మా విపర్యాసితదర్శనైః।**
**గ్రాహ్యగ్రాహకసంవిత్తి భేదవానివ లక్ష్యతే'**

అనుశ్లోకం తెలుపుతున్నది. బుద్ధి అనే ఆత్మ సహజంగా విభాగము లేనిది. విపరీతదర్శనము గలవారు దానిలో గ్రాహ్యము- గ్రహింపబడునది గ్రాహకము-గ్రహించువాడు, సంవిత్తి- జ్ఞానము అనుభేదాలు ఉన్నట్టుగా చూస్తున్నారు.

ఇక దీనివిమర్శ- జ్ఞాత, జ్ఞేయము మరియు జ్ఞానము అనునవి ఎల్లప్పుడు నియతంగా తోడుగానే ప్రతీతము అవుతాయి కనుక వీటికి అభేదము. అది వారి వాదన. ఇది ఉచితము గాదు. జ్ఞేయములు భిన్న భిన్నములు. జ్ఞానము ప్రతిక్షణము పుట్టడం నశించడం మళ్ళీపుట్టడం వలన భిన్నభిన్నమే. వీటిలో ఏజ్ఞానము కూడ జ్ఞాత, జ్ఞేయములతో నియమముగా కలుగదు. ఓసారి

ఈ జ్ఞానముతో బాటు ప్రతీతము అవుతుంది. మరోసారి మరో జ్ఞానముతో బాటు ప్రతీతము అవుతుంది. మరోసారి మరో జ్ఞానముతోబాటు ఒక జ్ఞానముతోనే జ్ఞాత, జ్ఞేయములు ప్రతీతము అవుతారనేది కూడ లేదు. మీరు జ్ఞాన సామాన్యముతో జ్ఞాత, జ్ఞేయము ప్రతీతము అవుతవి అని చెప్పలేరు. మీకు వ్యక్తులు తప్ప సామాన్యము అనునది (దీనికే సత్తా, జాతి అని పేరు. నిత్యమేకం అనేకానుగతం సామాన్యం అని లక్షణము. సామాన్యము నిత్యమయినది. ఇది ఒక్కటే. అనేక వ్యక్తులలో ఉండునది అని భావము. మానవత్వము, పశుత్వము మొదలయినవి సామాన్యములు. అ) లేదు కనుక అపోహము ఆయా వ్యక్తిరూపమయినదే.

ఇంకోసంగతి. జ్ఞాత, జ్ఞేయము యొక్క జ్ఞానము కలిసియే కలుగుతున్నది, సహితముగానే, ఇట్లా సాహిత్యము అంటే రెంటిలో భేదము సిద్ధిస్తునే ఉన్నది. జ్ఞాత, జ్ఞేయము, జ్ఞానము అనువాటి ప్రతీతి అబాధితము కావున వాటిలో భేదము నివారించరాదు. నేను తెలుసుకొంటున్నాను అను ప్రతీతిని బట్టి జ్ఞానము అహమర్థము యొక్క (ఆత్మయొక్క) ధర్మమని అహమర్థము జ్ఞానానికి ఆశ్రయమని తెలియుచున్నదని మొదట చెప్పబడినది. జ్ఞానము అహమర్థము కొరకయి ప్రకాశిత మవుతున్నది. జ్ఞానము వలన కలిగే వ్యవహార రూపమయిన ఫలము అహమర్థమునకే కలుగుతుంది ఆత్మకే అన్నమాట. జ్ఞానము పరార్థము. అట్లా పరార్థమయిన జ్ఞానమును ఆత్మ అనడం సబబు కాదు. అనన్యార్థమయినట్టి అహమర్థమునే (తనకొరకు నేను అనుదానికి అర్థమయిన దానినే )ఆత్మగా ఒప్పుకోవాలి. బౌద్ధులు అహమర్థమునే ఆత్మ అంటారు గాని-- నేను- నేను- అనుదాని అర్థము అదిజ్ఞానమే. కాని అహమర్థములో ఉన్న జ్ఞానాశ్రయత్వమును వాస్తవికము గాదంటారు. జ్ఞానము, జ్ఞాత, జ్ఞేయము అను మూడు వాస్తవికములే గద. జ్ఞానము ఎట్లా సత్యమో అట్లాగే జ్ఞానాశ్రయత్వముగా అహమర్థమును ఒప్పుకోవడం సత్యమే. జ్ఞాతా అహమర్థమే ఆత్మ అని సుస్పష్టము.



అద్వైతమతము. విషయమును ప్రకాశింపజేయునది జ్ఞానము. అది స్వపరనిర్వాహకము అనున్యాయముతో స్వయంప్రకాశము. అదినిత్యము. నిత్యము అయినందున నిర్వికారము, నిర్వికల్పకము, నిర్ధర్మకము, ఏకము, భేదరహితము, కూటస్థము, నిత్యప్రకాశైక స్వరూపము, అట్టి జ్ఞానమే ఆత్మ పరమాత్మ. ఆ జ్ఞానముకంటే ఆత్మపరమాత్మ భిన్నము కాదు. ఆ జ్ఞానమే వేదాంతవాక్యముల తాత్పర్యము. (వేదముల యొక్క చివర ఉన్నవి ఉపనిషత్తులు. వేదము, సంహిత, బ్రాహ్మణము, ఆరణ్యకము, ఉపనిషత్తులు అని విభజింపబడినది. చివర ఉన్నవి ఉపనిషత్తులు. అంతము అంటే నిశ్చయము కూడ కనుక వేదములలో ఉన్నదానిని నిశ్చయముగా తెలిపేవి అని అర్థము.అ) ఈ జ్ఞానమును తెలియపరచుటకు వేదాంతవాక్యములు మొదలు అయినవి.

ఇక దీనివిమర్శ. బౌద్ధుల జ్ఞానాత్మవాద ఖండనముతోనే దీని ఖండనము కూడ అవుతుంది. బౌద్ధుల జ్ఞానాత్మవాదానికి అద్వైతులు వైదికరూపమిచ్చారు. వీరిద్దరి వాదములో తేడా ఇది-బౌద్ధులు క్షణికజ్ఞానాన్ని ఆత్మ అంటారు. అద్వైతులు స్థిరజ్ఞానమును-నిత్యజ్ఞానమును ఆత్మ అని ఒప్పుకుంటారు. బౌద్ధమతములో చూపెట్టిన దోషాలన్ని దీంట్లోకూడ ఉన్నాయి. వీరిలో ఇంకో దోషముంది. వీరు జ్ఞానాన్ని నిర్ధర్మకము అని ఒప్పుకుంటారు. విషయము ఆశ్రయములేని జ్ఞానము ఉండనే ఉండదు. కనుక నిర్ధర్మకమయిన జ్ఞానముందనడానికి ప్రమాణము లేదు. దీనివలన అహం అనే ప్రతీతి రూపమయిన ఆత్మ కానేరదు. ఆత్మజ్ఞాత కూడ జ్ఞానం మాత్రమే కాదు. ఈ విషయాన్ని బాదరాయణమహర్షి 'జ్ఞోఽ త ఏవ' (బ.సూ. 2.3.19లో స్పష్టంచేశారు. జ్ఞః అతః ఏవ అని మూడుపదాలున్నాయి సూత్రంలో. ఏవ అనుపదమునకు జ్ఞః అతః ఏవ అని మూడుపదాలున్నాయి సూత్రంలో. ఏవ అనుపదమునకు జ్ఞః అతః అను రెండుపదాలతో సంబంధమున్నది. జ్ఞః ఏవ – ఏవ అనునది తెలుగులో ఏ

వంటిది. అదియే ఇదియే అన్నట్లు ఇతరముతో సంబంధాన్ని తొలగించివేస్తుంది. అతః ఏవ అంటే- అయోగవ్యావర్తనముగా సంబంధము కలిగి ఉంటుంది అతః పదముతో. పూర్వసూత్రము 2-3-18 నాత్మా శ్రుతేః అని. అతః పదము శ్రుతి అను దానిని పరామర్శిస్తుంది.

ఈ విధంగా సూత్రార్థము ఆత్మజ్ఞానము కలవాడు, జ్ఞానమాత్రమే కాదు. ఇందువలననే జ్ఞానము మాత్రమే ఆత్మ అని కాదు అతడు జ్ఞానము కలవాడు. అత ఏవ అనుపదము ఆత్మయొక్క జ్ఞాతృత్వమును శ్రుతులు సిద్ధింపజేస్తున్నాయి అని తెలుపుతుంది. ఛాందోగ్యోపనిషత్తు ముక్తజీవులు అముక్తజీవుల స్వరూపమును వర్ణిస్తుంది. ఆసందర్భంలో 'అథయో' వేదేదం జిఘ్రాణీతిస ఆత్మాఛాం. ఉ. 8.12.4లో తెలుపుతున్నది. దీనర్థం ఏమంటే నేను వాసన చూస్తున్నాను అని ఎవడు తెలుసుకుంటున్నాడో అతడు ఆత్మ అని. అతఏవ అన్నప్పటి ఏవకారము అయోగవ్యావర్తనము కనుక యుక్తి ద్వారా ఆత్మ యొక్క జ్ఞాతృత్వమును సాధిస్తుంది. (యోగం-సంబంధము, అయోగం- సంబంధంలేక పోవడం దానిని తొలగిస్తున్నది వ్యావర్తకము. ఇందువలననే అని అర్థము.) ఆత్మకు జ్ఞాతృత్వము అనుధర్మమును సిద్ధింపజేస్తూ శాంకర భాష్యము ఇలావివరిస్తుంది 'జ్ఞోనిత్యచైతన్యోఽయ మాత్మాత ఏవ' ఇందువలననే ఆత్మ నిత్యచైతన్యరూపమయిన గుణము కలవాడు. 'నిత్యచైతన్యం యస్య అసౌ నిత్యచైతన్యః' అని పుంలింగపదము యొక్క విగ్రహవాక్యము. ఇట్లా జ్ఞానమాత్రము ఆత్మ కానప్పుడు దాని నిర్వికారత్వము మొదలయినవాటి పరీక్ష ప్రస్తుతము అనవసరము.

## అత్మనః అణుపరిమాణకత్వసమర్థనమ్:

**మూ:** స చాణుపరిమాణః. ఉత్క్రాన్త్యాది శ్రవణాత్ ప్రమాణానుసారాచ్చ. అణుత్వే యుగపదనేకవిషయానుభవః కథమితి న శంకనీయమ్. ధర్మభూతజ్ఞాన వ్యాప్త్యోపపత్తేః. ఏతేనైవ సౌభరిప్రభృతీనాం ముక్తానాం చ యుగపదనేకశరీరపరిగ్రహోఽపి సంభవతి.



**అ:** ఆ ఆత్మ అణువు అంత పరిమాణము - కొలతకలవాడు. ఈ దేహమునుండి ఉత్క్రమిస్తాడు - వెళ్ళిపోతాడు. మళ్ళీ వస్తాడు అని వినబడుతున్నది. శ్రుతులు ఆత్మ యొక్క అణుపరిమాణాన్నే సమర్థిస్తున్నాయి కాబట్టి అణువే. మరి ఆత్మ అణువు అయితే ఒకే సమయంలో అనేక విషయాలను ఎట్లా అనుభవించ గలుగుతున్నాడు అని శంకించ వలసినపనిలేదు. జీవులయొక్క ధర్మభూతజ్ఞానము వ్యాపకముగనుక ఏకకాలములో అనేక విషయానుభవము వీలవుతుంది. ఇందు వలననే సౌభరి మొదలయిన ముక్తజీవులు ఏకకాలములో అనేకశరీరాలు దాల్చడం కూడ వీలవుతున్నది.

**వి:** 'ఏషోఽణురాత్మా చేతసా వేదితవ్యో యస్మిన్ ప్రాణః పంచధా సంవివేశ' ముం. ఉ. 3.1.9లో ఆత్మ అణువని, పరిశుద్ధమయిన మనసుతో తెలుసుకోదగినవాడని ప్రాణము అయిదు విధాలుగా ప్రవేశించి ఉన్నవాడని తెలుపుతున్నది. బాదరాయణమహర్షి స్వశబ్దోన్మానాభ్యాం చ బ్ర.సూ. 2.3.23లో, శ్రుతి సాక్షాత్తు స్వశబ్దముతో అణుశబ్దముతో చెపుతున్నదని మరియు దృష్టాంతముతో కూడ బోధిస్తున్నదని చెప్పారు. ఉన్మానము అనగా ఒక వస్తువును దానితో సమానమయిన వస్తువు దృష్టాంతముగా చెప్పడము. శ్వే. ఉ. 5.9 లో బాలాగ్ర శతభాగస్య శతధా కల్పితస్య చ, భాగో జీవః స విజ్ఞేయః అని ఉన్మానం ఇస్తున్నది. వెంట్రుకకొసను తీసుకొని నూరు ముక్కలుగా చేయాలి. ఆ నూటిలో ఒక దానిని తీసుకొనిమళ్ళీ నూరు ముక్కలు చేస్తే ఉండే ఒకముక్క అంత పరిమాణంలో జీవుడు ఉంటాడు అని అర్థము. ఇదే ఉపనిషత్తు సమాధి కాలములో ఆత్మ (జీవాత్మ) ఆరాగ్రము అంత- చర్మమును కుట్టుసూది ఆరా- దాని కొసఅంత సాక్షాత్కరిస్తాడు అని చెపుతున్నది- 'ఆరాగ్రమాత్రో హ్యవరోఽపి దృష్టః' 5.8.

ఇక ఉత్క్రాంతి, ఆగమనవిషయము. 'ఉత్క్రాంతిగత్యాగతీనామ్' బ్ర.సూ. 2.3.20లో బాదరాయణమహర్షి శరీరత్యాగకాలములో ఆత్మ ఈశరీరము నుండి వెళ్ళి పోతున్నాడు. అర్చిరాది మార్గంగా గాని ధూమమార్గంగా గాని ఆయా లోకాలకు వెళ్ళి ఫలమునసుభవించి పంచాగ్నుల ద్వారా మళ్ళీలోకంలోకి వస్తాడు అని తెలుపుతున్నారు. తేన ప్రద్యోతేనైష ఆత్మా నిష్క్రామతి చక్షుషోవా మూర్ధ్నోవా అన్యేభ్యో వా శరీరదేశేభ్యః బృ.ఉ. 6.4.2 హృదయములో కలుగు వెలుగుచేత నాడిని తెలుసుకొని ఈ జీవాత్మ శరీరమును వదలేప్పుడు నేత్రములనుండో తలనుండో శరీరము యొక్క ఇతర ప్రదేశమునుండో వెళ్లుతాడు. 'యే వైకే చాస్మల్లోకాత్ ప్రయంతి చంద్రమసమేవతే సర్వే గచ్ఛంతి' కౌషీతకీ ఉ. 1.2 ఈ లోకంనుండి ఎవరైతే వెళ్ళుతారో వారందరు చంద్రలోకమునకే వేళ్ళుతారు అని చెపుతున్నది. అట్లాగే ఆ లోకాలనుండి రావడాన్ని– 'తస్మాల్లోకాత్ పునరేత్యాస్మైలోకాయ కర్మణే' బృ.ఉ. 3.4.6 స్వర్గలోకమునుండి జీవుడు కర్మలను చేయడానికి, కర్మఫలమును అనుభవించడానికి తిరిగివస్తాడు అని చెపుతున్నది. ఇట్లా శ్రవణాన్ని ప్రమాణాన్ని బట్టి జీవాత్మ అణుపరిమాణంవాడే కాని కొందరన్నట్టు విభువు కాడు.

ఏకకాలములో అనేక విషయానుభవము సంగతి– సుఖము దుఃఖములయొక్క అనుభవము ఆత్మకే కలుగుతుంది. అణుపరిమాణం కలవాడు ఆత్మ అయితే శరీరములోని ఏప్రదేశములో ఉంటే ఆ ప్రదేశములో జరిగే సుఖ దుఃఖాదులు తెలుసుకో గలుగుతాడు. కాళ్ళుచేతులు బాగున్నవి తలనొప్పే ఉన్నది ఇట్లా ఒకసారి అనేకం ఎట్లా ఆత్మకు కలుగుతవి? దీనికి అనేక విధాల జవాబును బాదరాయణమహర్షి చెప్పారు. 'అవిరోధంచందనవ త్' 4.3.24లో చందనము యొక్క ఒక్క చుక్క శరీరము మీద ఎక్కడపడ్డా శరీరమంతా చల్లదనము కలిగిస్తుందో అట్లా ఆత్మ శరీరములో ఓ చోటనే ఉన్నప్పటికి అణుపరిమాణం కలవాడే అయినప్పటికి శరీరం మొత్తములో జరిగే వాటిని అనుభవిస్తాడు అని వివరించారు. దీనిలో ఏమీ విరోధము లేదు.



ఇంకో విధముగా కూడ 'గుణాద్వా ఆలోకవత్' బ్ర.సూ. 2.3.26 లో తెలిపారు. ఆత్మశరీరము యొక్క హృదయప్రదేశంలో ఉంటాడు. తన ధర్మభూత జ్ఞానం ద్వారా శరీరం మొత్తంలో కలిగే సుఖదుఃఖాదులను అనుభవిస్తాడు. ఉదాహరణము ఆకాశంలో ఓ చోటనే ఉండి సూర్యుడు ఒకప్రదేశంలోనే ఉండి మణి, దీపము మొదలయినవి చాలాదూరములో ఉన్న వస్తువులను తమప్రకాశం ద్వారా వెలుగొందజేస్తారు. సూత్రంలో వాశబ్దానికి ఇతర అభిప్రాయమును తొలగించడం అభిమతము. ఓ చోటనే ఉన్న ఆత్మ అయినా ధర్మభూతజ్ఞానము చేత శరీరమంతా వ్యాపించి ఉంటాడు. శరీరము వ్యాప్యము. ఆత్మ వ్యాపకుడు. సౌభరిమహర్షి ఒకేసారి యాభయి శరీరములను ధరించి ఆ యా శరీరాలలో కలిగే సుఖదుఃఖాలను అనుభవించడం కూడ ఈ ధర్మభూతజ్ఞానం వ్యాపకం అవడం వలననే వీలయినది. ముక్తజీవులుకూడ ముక్తావస్థలో అనేకం శరీరాలు ధరించి వ్యాపక ధర్మభూత జ్ఞానము వలన ఆయా విషయాలను అనుభవిస్తారు.

## జీవానాం నిత్యత్వసాధనమ్:

**మూ:** స చ నిత్యః. పూర్వానుభూతార్థప్రతిసన్ధానాత్ నిత్యశ్చేత్, జీవ ఉత్పన్నోజీవో నష్ట ఇతి ప్రతీతిః కథమితి చేన్న, జీవస్య దేహసంబంధ ఉత్పత్తిః తద్వియోగో నాశ ఇతి ప్రతిపాదనాత్ జీవస్వరూపం నిత్యమేవ.

**అను:** ఆ జీవుడు నిత్యుడు. పూర్వకాలములో అనుభవించిన విషయములను స్మరిస్తున్నాడు కనుక. మరి నిత్యుడయితే జీవుడు పుట్టాడు, జీవుడు నశించాడు అనేప్రతీతి ఎట్లాకలుగుతున్నది అని ప్రశ్న. ఈ శంక సరియయినది కాదు. జీవునకు దేహముతో సంబంధము కలగడం పుట్టినట్టు. దేహముతో ఎడబాటు కలగడం జీవుడు నశించినట్టు. పూర్వము నిరూపించడం జరిగినది. కనుక జీవస్వరూపము నిత్యమే కాని అన్యము కాదు.

**వి:** జీవుడు అనిత్యమంటే చేయనిదానిని పొందడం. చేసినదానికి ఫలంపొందకపోవడం అను రెండుదోషాలు కలుగతవి. శ్రుతులు కూడ 'స

జాయతేమ్రియతే వా విపశ్చిత్' కఠో 2.18;' జ్ఞాజ్ఞౌద్వావజౌ ఈశానీశౌ' 'శ్వే 1.9' నిత్యోనిత్యానాం చేతనశ్చేతనానాం ఏకోబహూనాం యో విదధాతి కామాన్' – శ్వే. ఉ. 6.13; 'అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో న హన్యతే హన్యమానే శరీరే' కఠో 2.18 జీవుడు నిత్యుడని ఘోషిస్తున్నవి. అజః అనుపదం జన్మరాహిత్యాన్ని తెలుపుతున్నది. పుట్టడు గిట్టడు అని న జాయతేమ్రియతే' పదాలు తెలుపుతున్నాయి. నిత్యః, శాశ్వతః పదాలు నిత్యత్వాన్ని బోధిస్తున్నాయి. 'నాత్మా శ్రుతేః నిత్యత్వాచ్చ తాభ్యః' – బ్ర.సూ. 2–3–18లో బాదరాయణమహర్షి ఈ విషయాన్నే ఇలా తెలిపారు– నాత్మా ఉత్పద్యతే ఆత్మపుట్టడు, శ్రుతులు చెప్పినందున తాభ్యః– శ్రుతిభ్యః ఏవ ఆత్మనో నిత్యత్వం చ అని.

## జీవానామనేకత్వాదిసాధనమ్:

**మూ:** స చ ప్రతిశరీరం భిన్నః. ఏకపరిమాణేషు సర్వేషు ఘటేషు ఏకో ఘట ఇతి ప్రతీతివద్ వ్రీహిరాశౌ చ ఏకో వ్రీహిరితి ప్రతీతివచ్చ జ్ఞానైకాకారతయా ఏకత్వవ్యవహారః న తు స్వరూపైక్యమ్ ప్రమాణవిరోధాత్. స్వతఃసుఖీ– ఉపాధివశాత్ సంసారః అయం చ కర్తా భోక్తా శరీరీ శరీరం చ భవతి. ప్రకృత్యపేక్షయా శరీరీ. ఈశ్వరాపేక్షయా శరీరం. చ. అస్య ప్రత్యక్ష శ్రుతిభ్యాం స్వయం ప్రకాశత్వం చ సిద్ధమ్ ప్రయోగశ్చ – ఆత్మా స్వయం ప్రకాశం జ్ఞానత్వాత్ ధర్మభూత జ్ఞానవదితి. జ్ఞానత్వాణుత్వ అమలత్వాదయః ఏతస్య స్వరూప నిరూపకధర్మాః.

**అ:** ఆ జీవుడు ప్రతిశరీరంలో వేరువేరుగా ఉంటాడు – జీవులు అనేకులు. స్వరూపముగా వారు ఒక్కరు కాదు ఐక్యము కాదు. చాలా కుండలలో ఒకే కొలత ఆకారం కలవాటిల్లో ఒకేకుండ, ధాన్యరాశిలో ఒకే ధాన్యము కుప్పగా, జ్ఞానము ఒకటేగనుక ఆత్మ ఒకటి అని వ్యవహారము. స్వరూపము ఒకటి అనడానికి శ్రుతులతో విరోధము ఏర్పడుతుంది. జీవాత్మ స్వభావసిద్ధముగా సుఖియే కాని కర్మలు అను ఉపాధివలన సంసారమును పొందుతాడు. ఈ జీవాత్మ కర్త, భోక్త,



శరీరి, శరీరముకూడ అవుతాడు ప్రకృతి జీవాత్మశరీరముకనుక శరీరి, పరమాత్మునకు జీవాత్మ శరీరము అవుతాడు. ప్రత్యక్షప్రమాణంతో శ్రుతుల ప్రమాణముతో కూడ స్వయం ప్రకాశుడు. అనుమానప్రమాణం కూడ చెప్పు కోవచ్చును. ఆత్మ స్వయంప్రకాశించేవాడు, జ్ఞానము అయినందున, ధర్మభూత జ్ఞానము వలె అని అనుమానప్రయోగము. జ్ఞానత్వము, అణుత్వము అమలత్వము, అజడత్వము మొదలయినవి ఆత్మస్వరూపమును తెలుపు ధర్మములు.

**వి:** ఆత్మ ఒకడు అని, చాలా అని దార్శనికులలో భిన్నాభిప్రాయాలు న్నాయి. విశిష్టాద్వైతుల ప్రకారము ఆత్మలు చాలా ఉన్నవి. ఒక్కో శరీరములో ఉండే ఆత్మవేరు. ఒక్క సౌభరి మొదలయిన మహర్షుల శరీరములలో ఉన్న ఆత్మలను వదలి పెట్టితే ఒక్కోశరీరములో ఒక్కో ఆత్మ. యోగ బలముతో సౌభరి ఆత్మ ఒక్కటే, అనేక శరీరాల్లో ఉంటాడు. ఒక్కోశరీరంలో స్మృతి, అనుభవము, సుఖ దుఃఖములు, ఇంద్రియములు ప్రయత్నములు మొదలయినవి వాటికి ప్రత్యేకముగా ఉంటాయి. అవి ఆ జీవుని అనుభవానికే వస్తాయి. ఇతరులకు రావు. ఒకరి అనుభవం ఒకరికి కలుగదు గనుక భిన్నభిన్న ఆత్మలు ఉన్నట్టుగా ఒప్పుకోవాలి.

నైయాయికులు– నానా ఆత్మానో వ్యవస్థాతః అను సూత్రం చేత, సాంఖ్యులుజనన–మరణ–కరణానాం ప్రతినియమాదయుగపత్ ప్రవృత్తేశ్చ, పురుషబాహుత్వం సిద్ధం త్రైగుణ్యవిపర్యయాచ్చైవ–18 అను కారిక ద్వారా ఆత్మానేకత్వం ప్రతి పాదించారు. యోగశాస్త్రము కూడ ఒప్పుకుంది. కొన్నిచోట్ల స్వరూపతః భేదమున్నా ఆకారతః భేదము లేనందున ఐక్యమును చెపుతున్నవి. వాటినిచూసి స్వరూపైక్యము అని భ్రమపడరాదు. 'రామసుగ్రీవయోరైక్యం' విష్ణుపురాణములోని 'యద్యన్యోఽస్తి పరఃకోఽపి.... తస్యాత్మ పరదేహేషు సతోఽప్యేకమయం హి యత్' విజ్ఞానం పరమార్థో హి ద్వైతినోఽతథ్యదర్శినః' అను శ్లోకములలో ఇదే ఉద్దేశముతో ఏకత్వము బోధింపబడినదని తెలుసు కోవాలి. దీనినే 'అవిరోధాంతరంగత్వజాతి భోగాద్యభేదతః ఏకోక్తిరపృథక్ సిద్ధేః

దేశకాలదశాదిభిః' అనుశ్లోకం వివరిస్తున్నది. వీటన్నిటివలన జీవుల నానాత్వము సుస్పష్టము.

'ఏష ఆత్మాఽపహత పాప్మా విజరో విమృత్యుర్విశోకో విజిఘత్సోఽపిపాసః సత్యకామః సత్యసంకల్పః' అను ఛాందోగ్యోపనిషత్తు ఆత్మయొక్క స్వభావ సిద్ధమయిన జన్మజరాదిరహితత్వము, క్షుత్పిపాసారహితత్వము, పాపరహి తత్వము' సత్యసంకల్ప, సత్య కామత్వము అనుగుణములను తెలుపుతున్నది. ముక్తావస్థ స్వభావసిద్ధమయినది. సంసారము ఉపాధివలన కలుగుతున్నది. కర్మలవలన సంసారబంధము.

కర్తృత్వము భోక్తృత్వము స్వాభావికమయినవి. కర్తా శాస్త్రార్థవత్త్వాత్ 2–3–33లో మోక్షప్రాప్తిసాధనములను విధించు శాస్త్రము కర్త ఉంటేనే సఫలము కనుక కర్తృత్వము ఉన్నది అని సాధించారు బాదరాయణమహర్షి. జ్ఞోఽతఏవ 2–3–19లో జ్ఞానాశ్రయత్వము నిరూపింపబడినది. దీని గురించి పూర్వమే తెలుసుకున్నాము. కర్తృత్వమే భోక్తృత్వానికి కారణము. కర్త అయినందుననే దేవమనుష్యాది శరీరములను ధరించిన కారణముగా జీవాత్మ శరీరము కలవాడు – శరీరి అవుతాడు. పరమాత్ముడు ఆ జీవాత్మలో ప్రవేశించి దానిని నియమిస్తాడు కనుక జీవాత్మ పరమాత్మకు శరీరము కూడ అవుతాడు. శ్రుతి– 'య ఆత్మానమంతరోఽయమాత్మాన వేద యస్యాత్మా శరీరమ్' అని. పరమాత్ముడు నీ యొక్క ఆత్మలో ప్రవేశించినందున ఆత్మలోన ఉన్నాడు. ఆత్మ అతనిని తెలుసుకుంటు లేడు. ఆత్మ పరమాత్మ శరీరము, అతడే అంతర్యామి, పరమాత్మ నీ యొక్క ఆత్మ అని తాత్పర్యము. స్వయంప్రకాశత్వము గూర్చి ఇదివరకే వివరముగా తెలుసు కున్నాము. అత్రాయం పురుషః స్వయం జ్యోతిర్భవతి కతమః ఆత్మా యోఽయం విజ్ఞానమయః ప్రాణేషుహృద్యంతర్ జ్యోతిః పురుషః మొదలయిన శ్రుతులు ఈ విషయాన్నే బెబుతున్నవి. జ్ఞానత్వా దులన్ని ఆత్మయొక్క స్వరూపని రూపకధర్మములు.



## ఆత్మవిషయే మతాంతరనిరాసః

**మూ:** ఏతేన జ్ఞానస్య క్షణికత్వం క్షణికసంతానరూప ఆత్మేతి బౌద్ధ పక్షః, భూతచతుష్టయాత్మకత్వాద్దేహస్య దేహావధిక ఆత్మేతి చార్వాకపక్షః, గజదేహే గజపరిమాణః పిపీలికాదేహే పిపీలికా పరిమాణః, అతో దేహపరిమాణ ఆత్మేతి జైనపక్షః కర్తృత్వభోక్తృత్వాదికం ప్రకృతే రేవ న పురుషస్యేతి సాంఖ్యపక్షః, బ్రహ్మాంశో జీవ ఇతి యాదవపక్షః, సోపాధిక బ్రహ్మఖండో జీవ ఇతి భాస్కరపక్షః, అవిద్యా పరికల్పితైక జీవవాదపక్షః అంతఃకరణావచ్ఛిన్నానేక జీవవాదపక్షః, ఇత్యే వమాదయో విరుద్ధపక్షాః నిరస్తాః విభుత్వవాదపక్షోఽపి.

**అ:** ఇంతవరకు నిరూపించిన గ్రంథభాగముచేత జ్ఞానము క్షణికము, జ్ఞానసంతానము ఆత్మ అనుబౌద్ధుల పక్షము; పృథివి, జలము, తేజస్సు, వాయువును నాలుగు భూతముల కలయిక దేహము. దేహముండువరకు ఉండునది ఆత్మ కనుక దేహమే ఆత్మయను చార్వాకుల వాదము; ఏనుగు శరీరములో ఏనుగంత, చీమ శరీరములో చీమ అంత ఆత్మ ఉంటుంది అను జైనులమతము; కర్తృత్వము భోక్తృత్వము ప్రకృతియొక్క ధర్మములుగాని పురుషునివి కావు అనే సాంఖ్యుల అభిప్రాయము; జీవుడు బ్రహ్మయొక్క ఒక అంశము అను యాదవప్రకాశాచార్యుల పక్షము; సోపాధిక బ్రహ్మయొక్క ఒక ఖండము జీవుడు అనే భాస్కరాచార్యుల పక్షము; జీవుడు అవిద్యా కల్పితుడు ఒక్కడే (చాలామంది కాదు) అను అద్వైతపక్షము, అంతఃకరణావచ్ఛిన్నచైతన్యము అనేకము అయినందున జీవులు అనేకులు అను వాచస్పతి మిశ్రులపక్షము; ఇంకా ఇలాటి విరుద్ధపక్షాలు అన్నీ తొలగింప బడుతాయి. ఆత్మవిభు – సర్వ మూర్తద్రవ్య సంయోగము కలవాడు అనేవాదము కూడ ఖండితము అయినది.

**వి:** బౌద్ధుల క్షణికవిజ్ఞాన వాదము, జ్ఞానసంతానాత్మవాదము గురించి స్వయంప్రకాశమును గురించి చర్చించే సందర్భములో తెలుసుకున్నాము. దేహాత్మవాదమును గురించి ఇంద్రియమనస్సులు ఆత్మ అనే వాదాన్ని కూడ

చర్చించుకున్నాము. ఇక మిగిలిన వాటి గురించి తెలుసుకుందాము. దేహసమపరిమాణాత్మవాదము: జైనులు ఈ వాదాన్ని బలపరిచే వారు. దేహమెంతో ఆత్మ అంత పరిమాణము కలది. నేను చిక్కాను, నేను లావెక్కాను ఇట్లాటి ప్రతీతుల వలన దేహము పరిమాణము ఎంతో ఆత్మ అహమర్థము అంత అని తెలుస్తున్నది. చిన్నదాంట్లో పెద్దదాంట్లో కూడ ఉంటాడు ఆత్మ. కర్మానుసారం వివిధ శరీరములను ధరించేవారి ఆత్మకూడ ఆ యా శరీరానుసారం ఉంటాడు అని.

ఇక దీనివిమర్శ. ఈ వాదము సరిగాదు.ఇది చార్వాకుల దేహాత్మ వాదమును పోలి ఉన్నది. దేహము పరిమాణాన్నిబట్టి ఆత్మ పరిమాణం అని ఒప్పుకుంటే దేహం రంగు రూపము బట్టి ఆత్మఉంటాడని ఒప్పుకోవాల్సి వస్తుంది. కాని జైనులు అట్లా ఒప్పుకోరు. ఒకశరీరంలోనుండి ఇంకో శరీరంలోనికి పోవడం వీలుకాదు. పెద్దవి చిన్నవాట్లో ఇముడవు కద. చిన్నగా అయి ఇముడుతాడు అంటే వికారము కలవాడవుతాడు. అనిత్యుడు కూడ అవుతాడు. జీవాత్మమోక్షం సమయంలో ఏ పరిమాణంలో ఉంటాడో అది సహజమయిన పరిమాణంగా చెప్పుకోవాలి. అదేపరిమాణం సంసారంలోకూడ ఉండాలి. ఆత్మకు ముక్తావస్థలో శరీరం ఉండదు. కాబట్టి ఆత్మ దేహసమ పరిమాణం కలవాడు అని చెప్పడం అసమంజసము.

ఇక సాంఖ్యులవాదన– ఆత్మకు కర్తృత్వము భోక్తృత్వము మొదలయిన గుణాలుండవు– అవి ప్రకృతివే అని ఆత్మ సాక్షిమాత్రుడు. ఏం పని చేయడు. ఉదాసీనుడు. కేవలము ద్రష్టనే, బంధము మోక్షము ప్రకృతికే. కర్తృత్వాది గుణములు ప్రకృతికి చెందినవే. ఈ విషయాలన్నిటిని ఇదివరకు చర్చించిన 'కర్తా శాస్త్రార్థ వత్త్వాత్' అను సూత్రములో బాదరాయణమహర్షి ఖండించినారు. జీవులను కర్తగా ఒప్పుకోకుంటే శాస్త్రము చెప్పిన తత్తత్కర్మలు వ్యర్థమయిపోతాయి. శాస్త్రము అర్థవంతము కాకుండాపోతుంది. శాస్త్రము అర్థవత్తు కనుక జీవుడు కర్త అనేది సిద్ధము. కర్తృత్వమే భోక్తృత్వాన్ని కలుగజేస్తుంది. ఇవి రెండు ఒక



దానితో ఒకటి కలిసిన గుణములు మరియు జీవునియొక్క స్వరూపనిరూపకధర్మములు.

బ్రహ్మాంశజీవవాదము: శ్రీయాదవప్రకాశుల మతమున జీవుడు బ్రహ్మయొక్క అంశము. జీవుడు మరియు బ్రహ్మలో భేదము స్వాభావికముగనే ఉంటుంది. అభేదము కూడ స్వాభావికముగ ఉంటుంది. బ్రహ్మఅంశి. – జీవుడు అంశము. ఈ సిద్ధాంతము ప్రకారము బ్రహ్మనే జీవభావాన్ని పొందుతాడు. కాని ఈశ్వరుడు సర్వజ్ఞుడు కద. ఎల్లప్పుడు ఆయనకు నేనే అనేకులయిన జీవులుగా ఉన్నాను అనే జ్ఞానముంటుంది. జీవులకు కలుగు దుఃఖాదిదోషములన్ని నాలోనే ఉన్నాయి అని అనుభవము కలగాల్సి వస్తుంది. దీనికి వారు ఇలాచెప్పవచ్చును. జీవుల శరీరములో కలుగు సుఖాదుల జ్ఞానము ఈశ్వరునికి లేదు. అట్లే దోషములు కూడ కలుగవు అని. అయితే తనఅంశమే ఉన్నది అని అనుకునే వాడికి శరీరములు వేరు భిన్నములు అవడం ఆ దోషాలు తగలకుండా ఆపలేదు. సౌభరిమహర్షి యాభయి శరీరాలలో ఉండి ఆ యా శరీరాల్లో కలిగే సుఖాదులను అనుభవించాడు కద. ఈశ్వరుడు కూడ అట్లాగే అనుభవించాల్సివస్తుంది. ఈ వాదముపేరు ద్వైతాద్వైతవాదము. దీనికి బట్టే దోషము ఏమంటే ఈశ్వరుడు ఎల్లప్పుడు తాను వివిధశరీరములలో ఉంటూ సుఖాదులను అనుభవిస్తూ సంసారంలోనే ఉంటున్నట్టు జ్ఞానము కలుగవలసి రావడము, జీవులలోని దోషాలు ఈశ్వరునికికూడ కలుగడము. కనుక ఈ వాదము సరి కాదు.

**సోపాధికబ్రహ్మఖండ జీవవాదము:** ఉపాధి మరియు బ్రహ్మ తప్ప వేరే దేనిని ఒప్పుకోరు భాస్కరాచార్యులు. మహాకాశము ఎట్లా కుండ, గుహ మొదలయిన ఉపాధికారణముగా కుండలో ఆకాశము, గుహలో ఆకాశము అవుతుందో, అట్లాగే బ్రహ్మకూడ అంతఃకరణము మొదలయిన జడము లయిన ఉపాధితోకలసి జీవులుగా అవుతాడు. వీరిసిద్ధాంతములో ప్రపంచము సంసారము సత్యములు. జీవులు బ్రహ్మ ఒకరే అని జీవ బ్రహ్మైక్యమును ఒప్పు కుంటారు.

ఉపాధిసంబంధముతో బ్రహ్మనే జీవుడు అవుతాడు. ఉపాధి సంబంధము వలన జీవునిలో కలిగేదోషాలన్ని బ్రహ్మలో కలుగుతున్నట్లుగా ఒప్పుకోవలసివస్తుంది.

అలాంటప్పుడు బ్రహ్మలో 'అపహతపాప్మా' అను శ్రుతి తెలిపే గుణాల ప్రతిపాదన బాధింపబడుతుంది. దీనికి వారు ఇట్లా జవాబు చెప్ప ప్రయత్నించవచ్చును. కుండలో గుహలో ఉండే ఆకాశము పరిచ్ఛిన్నమయినది. మహాకాశము పరిచ్ఛేదము – కొలత, ఉపాధి, లేనిది. కుండలోని ఆకాశానికి మహాకాశానికి భేదమున్నట్లు జీవునికి బ్రహ్మకు భేదముంటుంది. కుండలోని ఆకాశము, గుహలోని ఆకాశం పరస్పరమూ కూడ భేదము కలిగినవి. అట్లానే జీవులకు పరస్పరం భేదముంటుంది. గుహలోని ఆకాశంలో, కుండలోని ఆకాశంలో ఉండేదోషాలు గాని, గుణాలుగాని వాటితో సంబంధము మహాకాశానికి అంటవు. అట్లానే జీవులలో ఉండే గుణదోషాలతో సంబంధము బ్రహ్మకు ఉండదు. జీవులని చెప్పబడే ఉపాధిసంబంధము కల్గిన బ్రహ్మ పాపానికి దుఃఖానికి ఆస్పదుడు కావచ్చును కాని ఉపాధిసంబంధము లేని బ్రహ్మ దోషము అంటనివాడు. కనుక బ్రహ్మయొక్క నిర్దోషత్వమును చెప్పు శ్రుతులకు విరోధము కలుగదు– అని.

అయితే ఈ యుక్తి సావయవ మయిన వస్తువిషయములో సరిపోతుంది. నిరవయవమయిన పదార్థములో సరిపోదు. బ్రహ్మ అవయవములు లేని వాడు శరీరము అవయవములు కలది. కాళ్ళు, చేతులు, వేళ్ళు మొదలయినవి అంగములు. వేలుకు ఏదయినా అయి శరీరంఅంతా వ్యాపించేట్టు ఉంటే వేలును కోసి తీసివేస్తారు. పాముకరిచినా అంతే. అప్పుడు మిగిలిన శరీరము అయినా బాగుంటుంది. ఇట్లా ఉపాధికల్గిన బ్రహ్మను అసలు బ్రహ్మనుండి విడదీయగలిగితే పయిన చెప్పినట్టు దోషనివారణ జరుగవచ్చును. కాని అట్లా వేరు చెయ్యరాదు. ఆకాశం నిరవయవ పదార్థము. కుండ, గుహ మొదలయిన ఉపాధులను కోసి



ముక్కలు చెయ్యరాదు. కాని కుండపగిలిపోతే ఆ ఆకాశములు పెద్ద ఆకాశములతో కలసిపోతాయి. విడిపోయే అవయవములు కలవి కావు కనుక ఆకాశాదులు ఎల్లపుడు నిరవయవములు. వాటిలో ఉపాధి సంబంధమయిన గుణదోషములు కలుగతవి. అట్లాగే బ్రహ్మలో కూడ ఉపాధి సంబంధముతో జీవులలో కలిగే గుణదోషములు కలుగుతవి. కనుక ఈ సిద్ధాంతము సరికాదని స్పష్టము.

**శాంకరాభిమతాద్వైత వాదము:** వీరు బ్రహ్మనే సత్యము బ్రహ్మకంటే ఇతరమయిన జగత్తంతము అవిద్యచే ఏర్పడినది. మిథ్య అని ఒప్పుకుంటారు. అవిద్యతో కూడుకున్న చైతన్యమే జీవుడు, స్వప్నకాలమున కనబడే జీవుడు లేచిన తరువాత ఉండనందున మిథ్య– కల నిజము కాదు కద, అట్లాగే తత్త్వమసి మొదలయిన వాక్యాలతో కలిగిన అపరోక్షజ్ఞానముతో ప్రపంచము అనే భ్రమకు బాధ (కాదుఅని) కలుగుతుంది. స్వప్నకాలములో మనిషి ఏ స్వప్నము చూస్తాడో అదే అతనికి కనబడుతుంది. నిజము అనిపిస్తూ మిగతాది అంత మిథ్యగా ఉంటుంది. అదే ప్రకారం అవిద్యతో గూడిన చైతన్యం ఏ శరీరంలో ఉండి ఈ (స్వప్నంలాటి) జగత్తును చూస్తుంటుదో ఆ జీవుడు వాస్తవము మిగత కనబడే ప్రపంచమంతా మిథ్య. ఆ చైతన్యమే ఆత్మ. నిర్విశేషుడు. వీరి సిద్ధాంతములో బంధము మోక్షములలో భేదము లేకపోవడము. ఒక దోషము. మోక్షము ఏమి అన్నదానికి వీరు అవిద్య లేకపోవడమే మోక్షము అనవచ్చు. అయితే బ్రహ్మ తప్ప ఇతరమంతా మిథ్య కనుక బంధము సమయములో కూడ మోక్షము ఉన్నట్లే లెక్క. అవిద్యకూడ మిథ్యనే అవుతుంది. బంధము ఉన్నప్పుడు అవిద్యావ్యవహార ముంటుంది. మోక్షములో అవిద్యావ్యవహారము ఉండదు అనడం యుక్తము గాదు. బంధమున్నప్పుడు జరిగే అవిద్యావ్యవహారము కూడ వీరి ప్రకారము వాస్తవికము గాదు. మోక్షదశలో కూడ అతాత్త్వికమయిన అవిద్యావ్యవహార ముంటుంది. శుకుడు, వామదేవుడు మొదలయినవారు ముక్తు

లయ్యాకకూడ జగత్తులో సంసారము యొక్క వ్యవహారము నడుస్తుంటుంది. ఇట్లా అవిద్యోపకల్పిత జీవాత్మైక్యవాదములో బంధము మోక్షము అను వ్యవస్థ ఉండదు.

అంతఃకరణావచ్ఛిన్న మయిన అనేకులు జీవులు అను వాదన శ్రీవాచస్పతిమిశ్రులవారు, అంతఃకరణములో ప్రతిబింబించిన చైతన్యమునే ఆత్మ జీవుడు అంటారు. అనేకములయిన అంతఃకరణములలో ప్రతిబింబించు తున్నందున అనేకులయిన జీవులున్నారు. బ్రహ్మ ఒకడే. ఆ బ్రహ్మయొక్క ప్రతిబింబరూపములే ఈ అనేకజీవులు. బ్రహ్మ బింబము సుఖదుఃఖాదులు జీవులలోనే కలుగుతవి. ముఖము బింబము అనుకుందాము. అది అద్దంలో, మణిలో కత్తిలో, నీళ్ళలో ప్రతిబింబిస్తుంది. ముఖము ఒక్కటే కాని ప్రతిబింబాల్లో పెద్దది, చిన్నది, బాగులేనిది మొదలయిన దోషాలు, అద్దం, మణి మొదలయిన ఉపాధినిబట్టి ఏర్పడతాయి. కాని ముఖములో ఎట్టి మార్పుఉండదు. అది అట్లానే ఉంటుంది. ఇట్లా సుఖదుఃఖాదులు జీవులలోనే జరుగుతాయి. ఈ దోషాలు ప్రతిబింబాలవి కాని బింబానివి కానట్టు సుఖిత్వం, దుఃఖిత్వం మొదలయినవి ప్రతిబింబస్థానములో ఉన్నజీవులకు మాత్రమే కలుగుతవి. బింబస్థానములో ఉన్న బ్రహ్మకు కాదు. జీవుడు బ్రహ్మలో వాస్తవికమయిన భేదము ఏది లేదు, ఈ బింబప్రతిబింబభావవ్యవస్థ కల్పితమయినది. వాస్తవము కాదు.

ప్రశ్నఏమిటంటే ఈ వ్యవస్థను కల్పించువాడు ఎవడు? నిర్వికారుడు, నిర్విశేషుడు కనుక బ్రహ్మకల్పించాడు అని చెప్పలేము, జీవుడే అనుకుందామా? జీవుడు అనేవాడు ఏర్పడినాక కల్పించగల్గుతాడు. మొదలే లేనప్పుడు కల్పించ లేడు కద. ఇట్లా అన్యోన్యాశ్రయము అనుదోషము కలుగుతుంది. బంధము మోక్షము అను వ్యవస్థగురించియే జీవునికి అజ్ఞానము ఒప్పుకోవలసివస్తున్నది. ఆ వ్యవస్థవీరికి కల్పించుకోరాదు. ఎందుకంటే అవిద్యయొక్క నాశమే మోక్షము అనబడుతుంది. వీరివాదములో ఒక్క జీవుడు ముక్తుడు అయినా అతనితో బాటు అవిద్య నశించి పోతుంది. కనుక అందరికి సమకాలములో ముక్తి కలుగుతుంది.



సమకాలములో అందరి ముక్తి కలుగుటను చూడటము లేదు కనుక అవిద్య నశించి పోదు అని అంటే మీ వాదములో ఎవరికీ ముక్తి కలుగనే కలుగదు. ఎందుకంటే అవిద్యానాశము లేనిది ముక్తి లేదు గద. అది కాదు జీవులందరి అవిద్య వేరువేరుగా ఉంది కనుక ముక్తిబంధము అనువ్యవస్థ వీలవుతుంది అంటే ఇది ఇంకో ప్రశ్నకు దారితీస్తుంది. జీవులభేదము ఆధారముగా మీరు జీవులయొక్క అవిద్య వేరు వేరు అని చెప్పుతున్నారో ఆభేదము స్వాభావికమయినదా అవిద్యద్వారా కల్పితమయినట్టిదా అని ఆ ప్రశ్న. ఆ భేదము స్వాభావికము అని వీరు ఒప్పుకోరు. భేదాన్ని కల్పించడంకొరకు అవిద్యను కల్పించడము వ్యర్థము. జీవభేదము కొరకు అవిద్యను కల్పించడము అంటే అవిద్య ఎవరిది? బ్రహ్మదా? జీవుడిదా? అని ప్రశ్న ఉదయిస్తుంది. బ్రహ్మది అని ఒప్పుకుంటే జీవాజ్ఞానవాది కూడ బ్రహ్మ జ్ఞానము ఒప్పుకున్నట్టు అయిపోతుంది. ఫలితముగా బ్రహ్మాజ్ఞాన వాదములో బంధమోక్షవ్యవస్థ అనుపపన్నము అయినట్లు ఈ వాదములో కూడ కుదరక పోతుంది. భేదమును కల్పించు అవిద్య జీవులది అని ఒప్పుకోలేక పోవడము ఎందుకనగా జీవభేదమును కల్పించు అవిద్య– దానిని కల్పించడానికి పూర్వమే జీవులది కాలేదు కాబట్టి. బంధమోక్షవ్యవస్థ వీలు కానందున ఈవాదము కూడ నిలువజాలదనుట స్పష్టము.

**అణూనామపి జీవానాం అదృష్టజనితదేశాంతరఫలోపలబ్ధిః**

**మూ:** నను జీవస్య విభుత్వానఙ్గీకారేఽదృష్టజనిత దేశాంతరఫలోపలబ్ధిః కథమితి చేన్న, జీవస్య సమ్బన్ధాభావేఽపి అదృష్టవశాదుపపద్యతే. అదృష్టం నామ భగవత్ప్రీతి జనక జీవకర్తృక కర్మవిశేషజన్యో జ్ఞానవిశేషః. స విశేషో భగవత్సంకల్ప ఏవ. అతః ఫలోపలబ్ధిరితి న విరోధః.

**అ:** విభువు అయితేనే అన్ని ప్రదేశాలతో అన్ని పదార్థాలతో సంబంధము కలిగి యుండవచ్చును. మీరు ఆత్మ విభువు కాదు అంటున్నారు. అప్పుడు దేశాంతరములో కలిగే ఫలము ఎట్లా జీవునికి కలుగుతుంది అని

ప్రశ్న. జీవునికి ఆ దేశముతో ఎట్టిసంబంధము లేకపోవచ్చును కాని అదృష్టము కారణముగా ఆ ఫలము అతనికి దొరుకుతుంది అని జవాబు. అదృష్టము అనగా– జీవులు చేసిన కర్మలచే వారికి కలిగిన జ్ఞానవిశేషము అదృష్టము. ఇది కర్మవిశేషము వలన కలుగుతుంది. మరియు భగవంతునికి జీవునిపయి ప్రీతిని కలిగిస్తుంది. ఆ జ్ఞానవిశేషము – అదృష్టము భగవంతుని యొక్క సత్యసంకల్పరూప మయినదే. సర్వవ్యాపకుడు విభువయిన భగవంతుని ఆశ్రయించి ఉంటుంది. అందువలన అంతట వ్యాపించివుండే అదృష్టముచేత దేశాంతరములో జరిగే ఫలముకూడ జీవునకు (విభువుకాకున్నప్పటికిని) లభిస్తుంది. అనడంలో ఎట్టి విరోధము లేదు.

**వి:** నైయాయికులు వైశేషికులు ఆత్మను విభువుగా ఒప్పుకుంటారు. విశిష్టాద్వైతులు అణుపరిమాణుడు ఆత్మ అని నిరూపించుతారు. శ్రుతికూడ దీన్నే బలపరుస్తున్నది. ఇక్కడ పూర్వపక్షులు ఒక ప్రశ్న లేవ నెత్తుతారు. అణుపరిమాణం కల జీవుడు ఏదో ఒక ప్రదేశంలోనే ఉంటాడు. అప్పుడు మరోప్రదేశంలో చేసిన కర్మల యొక్క ఫలముగా ఏ అదృష్టం ఉంటుందో ఆ యా ఫలము ఎట్లు కలుగుతుంది, జీవుడు ఏ ప్రదేశంలో కర్మచేసితే ఆ ప్రదేశములోనే అదృష్టం పుడుతుంది కనుక. ప్రదేశంతో జీవునకు సంబంధము లేకపోతే కర్మ జన్యఫలము ఉపలబ్ధి ఎలా కలుగుతుంది, అని ఆ ప్రశ్న. జవాబు–జీవులకు కర్మఫలము సాక్షాత్తుగా కలుగదు. చేయగానే కర్మ క్షణంలోపలనే నశిస్తుంది. ఆ కర్మలు ఆచరించినందున ఒక అదృష్టము కలుగుతుంది. అది స్థిరముగా ఉంటుంది. అట్లా కర్మఫలమును జీవునికి అందిచ్చే వరకు అదృష్టము ఉంటుంది. జీవుడు ఏ ప్రదేశములో ఉన్నాడో ఆప్రదేశములోనే ఫలము లభిస్తుంది. ప్రదేశాంతరములో చేసిన కర్మలవలన గలిగిన అదృష్టము ఇంకోప్రదేశములో ఉన్న జీవునకు ఎట్లా ఫలము నిస్తుంది? అని మళ్ళీ ఓ ప్రశ్న. దీని సమాధానము అదృష్టం అనేది ఓ రకమయిన జ్ఞానవిశేషము. అది



జీవులు చేసిన కర్మలవలన పుడుతుంది. అది భగవంతునిలో ప్రసన్నతను కలిగిస్తుంది. ఆ జ్ఞానవిశేషము భగవత్సంకల్పరూపమే. భగవంతుడు స్వయంగానే సర్వవ్యాపకుడు. సర్వవ్యాపియయిన భగవంతుడు ఈ ఫలానా జీవునికి ఫలానాఫలము లభించని అని సత్యసంకల్పము కలవాడు. దానిచే ఆ జీవునికి ఆఫలము దొరుకుతుంది. ఆ ప్రదేశముతో సంబంధ ముండవలసిన పనిలేదు. ఇట్లా జీవుడు అణువు అయినా ఫలప్రాప్తిలో ఎట్టివిరోధము ఉండదు.

## జీవవిభాగః

**మూ:**, స జీవస్త్రివిధః – బద్ధముక్త నిత్యభేదాత్.

**అ:**, బద్ధుడు, ముక్తుడు, నిత్యుడు అని ఆ జీవుడు మూడు విధాలు.

## బద్ధ జీవనిరూపణమ్:

**మూ:** తత్ర బద్ధా నామ అనునివృత్తసంసారాశ్చతుర్దశభువనాండ కటాహవర్తినో బ్రహ్మాది కీటపర్యంతాశ్చేతనవిశేషాః శ్రీమతో నారాయణస్య నాభికమలాదుత్పన్నో బ్రహ్మా. బ్రహ్మణో రుద్రః పునర్బ్రహ్మణో సనకాది యోగినో నారదాదిదేవర్షయో వసిష్ఠాది బ్రహ్మర్షయః పులస్త్యమరీచిదక్షకశ్యపాది నవప్రజాపతయశ్చ బభూవుః. తేభ్యో దేవా దిక్పాలకా శ్చతుర్ద శేన్ద్రాశ్చతుర్దశ మనవో సురాః పితరస్సిద్ధగన్ధర్వ కిన్నర కిమ్పురుష విద్యాధరాదయో వసవో రుద్రా ఆదిత్యా అశ్వినౌ దానవయక్షరాక్షసపిశాచ గుహ్యకాదయశ్చ. ఏవం దేవయోనయో బహువిధాః. మనుష్యా అపి బ్రాహ్మణక్షత్రియవైశ్యశూద్రాదిజాతి భేదాత్ బహువిధాః.

తిర్యంచోఽపి పశుమృగపక్షి సరీసృప పతంగకీటభేదాత్ బహువిధాః. స్థావరా అపి వృక్ష గుల్మలతా వీరుత్ తృణాదిభేదాద్ బహువిధాః. వృక్షాదీనాం జలాహరణాద్యుపయుక్త కించిజ్ జ్ఞానసంబన్ధో ఽస్త్యేవ. అప్రాణవత్సు స్వల్పాసేత్యుక్తత్వాత్. అతో దేవమనుష్య తిర్యక్ స్థావర భేదభిన్నా బద్ధాః. ఏతే

పునర్జరాయు జాండజోద్భిజ్జస్వేదజాశ్చ భవంతి. దేవమనుష్యా జరాయుజాః తేషు బ్రహ్మరుద్రాదయస్సనకాదయశ్చ సీతాద్రౌపదీ ధృష్టద్యుమ్న ప్రభృతయో భూతవేతాలాదయశ్చాయోనిజాః. తిర్యగాదయశ్చ జరాయుజా అండజా స్స్వేదజాశ్చ భవంతి. స్థావరాదయ ఉద్భిజ్జాః. ఏవంభూతా బద్ధా బీజాఙ్కుర న్యాయేన విషమప్రవాహతయా అనాది కాలప్రవృత్తా విద్యాకర్మవాసనారుచి ప్రకృతి సంబన్ధైశ్చక్రవత్పరివర్తమానైర్గర్భ జన్మబాల్య యౌవన జాగర స్వప్నసుషుప్తిమూర్ఛా జరామరణ స్వర్గ నరక గమనాది వివిధ విచిత్రా వస్థావన్తో౽ నాద్యననంతప్రకారాతిదుస్సహ తాపత్రయాభితప్తాః స్వతః ప్రాప్తభగవదనుభవ విచ్ఛేదవంతశ్చ.

**అ:** బద్ధులు అనగా కట్టబడినవారు. స్వాతంత్ర్యములేనివారు, పుట్టుక చావురూపమయిన సంసారములో చిక్కుకున్నవారు. ఈ సంసారము పుట్టుక చావు మొదలయినది అనువృత్తము – క్రమముగా వచ్చుచున్నట్టిది. (కొన్ని పుస్తకాల్లో అని వృత్తసంసారాః– అని ఉంది. దాని అర్థము సంసారము తొలగి పోనివారు. రెండిటి తాత్పర్యము ఒకటే. అ.) ఈ జీవులు చేతన విశేషములే. చేతనము యొక్క భేదములే. పూర్వము పదునాలుగు లోకాలు అండకటాహము విస్తృతముగా వివరింపబడినవి. అట్టి పధ్నాలుగు లోకాల్లో నివసించువారు బద్ధులు. ఎవరు వీరు? బ్రహ్మమొదలు చిన్న పురుగు పర్యంతమున్నవారు. దీనినే బ్రహ్మాది స్తంబపర్యంతము, బ్రహ్మాది పిపీలికా పర్యంతము అని అంటుంటారు.

సృష్టిక్రమము నిరూపింపబడుతున్నది. శ్రీమన్నారాయణుని నాభికమ లమునుండి బ్రహ్మపుట్టాడు. బ్రహ్మనుండి రుద్రుడు. మళ్ళీ బ్రహ్మనుండి సనకుడు మొదలయిన యోగులు నారదుడు మొదలుగా గల దేవర్షులు, వసిష్ఠుడాదిగా బ్రహ్మర్షులు పులస్త్యుడు, మరీచి, దక్షుడు, కశ్యపుడు మొదలయిన తొమ్మిదిమంది ప్రజాపతులు పుట్టారు. వారినుండి దేవతలు, దిక్పాలకులు, పధ్నాలుగురు ఇంద్రులు, పదునాలుగురు మనువులు, అసురులు, పితరులు, సిద్ధులు,



గంధర్వులు, కిన్నరులు, కింపురుషులు, విద్యాధరులు మొదలుగువారు ఉద్భవించారు. అష్ట వసువులు, రుద్రులు, ఆదిత్యులు, అశ్వినులు, దానవ యక్షరాక్షస పిశాచగుహ్య కాదులు కూడ ఆ ప్రజాపతులనుండి జన్మించారు.ఇట్లా దేవతల జాతులు అనేకవిధాలు.

బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రాది భేదముతో మనుష్యులు అనేక విధాలు. తిర్యక్కులు కూడ పశువులు, మృగములు, పక్షులు, సరీసృపములు, పతంగములు, పురుగులు అనుభేదముతో అనేక విధాలు. (తిర్యక్ నాలుగుకాళ్ళమీద నిటారుగా నిలువక నడచునవి.) ఇవి అన్ని జంగమములు – నడచునవి, తిరుగునవి ఒకదగ్గర నుండనివి. ఇక స్థావరములు– నిలకడగా ఉండునవి. వృక్షములు, గుల్మములు,లతలు, వీరుధములు, తృణములు అను భేదముతో పలువిధాలు. చెట్లు మొదలయిన వాటిలో నీటిని పీల్చుకోవడానికి ఉపయోగపడే కొంచెం జ్ఞానముంటుంది. జ్ఞానముగూర్చి చెప్పేప్పుడు ప్రాణములేని వాటిల్లోకూడ జ్ఞానము కొంచెముంది అని చెప్పడం జరిగింది.

ఇట్లా దేవతలు, మనుష్యులు, తిర్యక్కులు, స్థావరములు అని బద్ధులు నాలుగు విధములు. ఇంకోవిధముగా కూడ బద్ధులు నాలుగు విధములు. ఒకటి – జరాయుజములు, రెండు అండజములు, మూడు ఉద్భిజ్జములు, నాలుగు స్వేదజములు అని. దేవతలు మనుష్యులు జరాయుజులు వారిలో బ్రహ్మ రుద్రాదులు సనకాదులు సీత ద్రౌపది ధృష్టద్యుమ్నుడు మొదలయిన వారు. భూతములు, వేతాలుడు మొదలయినవారు అయోనిజులు. తిర్యక్ ఆదులుకొన్ని జరాయుజములు అండజములు స్వేదజములుకూడ ఉన్నవి, స్థావరములు ఉద్భిజ్జములు, ఈ బద్ధజీవులు బీజాంకురన్యాయముతో మొదలయిన అనాదికాలమునుండి వస్తున్న అవిద్య వలన కలిగి, చక్రమువలె తిరుగుతున్న కర్మవాసన, రుచి, ప్రకృతితో సంబంధము కలిగి ఉండి అనేకం విచిత్రమయిన అవస్థలలో తగులుకుంటారు.

ఆ అవస్థలు ఇవి– గర్భము, జన్మ, బాల్యము, యౌవనము, జాగ్రదవస్థ, స్వప్నము, సుషుప్తి, మూర్ఛ, జర, మరణము, స్వర్గము, నరకములకు పోవుటవచ్చుట మొదలయినవి. ఈ అవస్థలలో తగులుకుని, అనాదిగా వస్తున్న అనేకప్రకారములయిన అతి దుఃసహములయిన తాపత్రయముచే పీడితులవుతూ తమకు సహజంగా లభించిన భగవదనుగ్రహానికి విముఖులుగా ఉంటారు.

**వి:** ప్రకృతితో సంబంధము కల్గిఉన్నవారు బద్ధజీవులు. ఈ సంబంధం తోనే సంసారములో సంసరణము జరుగుతున్నది. ప్రకృతి సంబంధం ఉంటేనే జీవుడు పుణ్యపాప రూపమయిన కర్మలను జేస్తుంటాడు. దీని కారణముగా జీవుని నిజరూపము – పాపములు లేనివాడు, జర లేనివాడు, మృత్యువు లేని వాడు, శోకములేనివాడు, ఆకలిదప్పులు లేనివాడు, సత్యకాముడు, సత్య సంకల్పము కలవాడు, ఆత్మ– అనునట్టిది అతనికి కనపడదు. సంకుచిత జ్ఞానము కలవాడయి సంసారములో పుడుతూ గిట్టుతూ సంసారములోని ఆధ్యాత్మికము ఆధిభౌతికము, ఆధిదైవికము అయిన తాపత్రయరూపమయిన క్లేశము, కర్మ వాటి పరిణామమయిన వాసనచే అంతఃకరణము దూషితమయిన వాడయి, తనుచేసిన కర్మల ఫలితమయిన సుఖదుఃఖాలను అనుభవిస్తుంటాడు.

సంసారము చక్రమువంటిది. ప్రకృతి సంబంధంతో జీవునకు సం సారము కలుగుతుంది. సంసారము వలన కొన్నికర్మలు చేయాలిసివస్తుంది. ఆ కర్మలకు దేహముతో సంబంధముంటుంది. దేహం యొక్క సంబంధంతో మిథ్యాజ్ఞానము కలుగుతుంది. మిథ్యాజ్ఞానముతో మళ్ళీకర్మలు. ఆ కర్మలతో మళ్ళీ జీవునకు దేహసంబంధము కలుగడము. ఇట్లా ఈ సంసారమనే చక్రము అనాది.

'సమానే వృక్షే పురుషో నిమగ్నోఽ నీశయా శోచతి ముహ్యమానః' అని ముం. ఉ. 3.1.2 శ్వే. 4.7 తెలుపుతున్నవి. శరీరము అనే వృక్షములో ఉంటూ జీవుడు, మాయచే గ్రస్తుడయి ప్రియవిప్రయోగము, అప్రియ యోగము చేత దుఃఖిస్తుంటాడు అని. జీవాత్మపరమాత్మలను గురించి ఓ ఋక్మంత్రము ఇట్లా తెలుపుతున్నది.



'ద్వా సుపర్ణా సయుజా సఖాయా
సమానం వృక్షం పరిషస్వజాతే
తయోరేకః పిప్పలం స్వాద్వ
త్త్యనశ్నంశ్చాన్యః అభిచాకశీతి' ఋ. అ. 2.3.27.

ఇది చాలా ఉపనిషత్తుల్లో కూడ ఉన్నది. ఎప్పుడు కలిసి ఉండే, పరస్పరము స్నేహము గల్గిఉండే, ఆత్మపరమాత్మ రూపమయిన రెండు మంచిరెక్కలు గల పక్షులు (గరుడపక్షులు అని కూడ అర్థము) శరీరమనే ఒకవృక్షముపయిననే కూర్చుని ఉన్నాయి. ఈరెంటిలో ఒకటి (జీవాత్మ) కర్మతో కలిగిన శరీరము అను చెట్టుయొక్క పండును బాగా తింటున్నది. రెండవ పక్షి (పరమాత్మ) ఆ కర్మలనుండి దూరంగా ఉంటూ, అంటే ఫలమును అనుభవించకుండ కూడ, సంతోషంగా వెలుగు తున్నది. బద్ధజీవులు తాముచేసిన పూర్వపుణ్యపాపకర్మల ఫలితముగా అనేక విధములయిన చిత్రవిచిత్రములయిన మంచి చెడు ఫలితముగా అనేక విధములయిన చిత్రవిచిత్రములయిన మంచి చెడు జన్మలను ఎత్తుతారు.

ఓ ఉపనిషత్తు 'సాధుకారీ సాధుర్భవతి, పాపకారీ పాపో భవతి, పుణ్యః పుణ్యేన కర్మణా పాపః పాపేన,' బృ.ఉ.4.4.5లో తెలుపుతుంది. మంచి పనులను చేస్తే మంచి జన్మలను ఎత్తుతాడు జీవుడు. చెడుపనులు చేస్తే తిర్యక్ ప్రాణిగా జన్మ నెత్తుతాడు. కనుక విహితమయిన, హితమయిన పనులను చేయడంద్వారా మంచి భగవద్భక్తిగల జన్మను పొందవచ్చును. ఈ బద్ధజీవులు – బ్రహ్మ (చతుర్ముఖుడు) మొదలుకొని గడ్డిపోచ వరకు ఉన్నారు. ఈ బద్ధజీవులు పొందే శరీరాలు నాలుగు విధాలుగా ఉన్నాయి. అవి 1 దేవశరీరము 2 మనుష్య శరీరము 3 తిర్యక్ శరీరము మరియు 4 స్థావర శరీరము. ఈ నాలుగింటిని చరము అచరము లేదా జంగమము స్థావరము రెంటిగాకూడ విభజన చేయ వచ్చును. తిరిగేవి తిరుగనివి అని.

దేవసృష్టి – శ్రీమన్నారాయణుని నాభినుండి ఓ కమలము పుడుతుంది. దాని నుండి సృష్టిలో మొదటివాడుగా (చతుర్ముఖ) బ్రహ్మపుడుతాడు. బ్రహ్మనుండి రుద్రుడుద్భవిస్తాడు. మళ్ళీ బ్రహ్మనుండే సనకుడు, సనందునుడు, సనత్ కుమారుడు అను నలుగురు యోగులు పుడతారు. బ్రహ్మనుండే నారదుడు మొదలయిన దేవర్షులు తొమ్మిది మంది ప్రజాపతులు పుడతారు. అట్లాగే వసిష్ఠుడు భృగువు మొదలయిన బ్రహర్షులు కలుగుతారు. 1 భృగువు 2 పులస్త్యుడు 3 పులహుడు 4. క్రతువు 5 అంగిరసుడు 6 మరీచి 7 దక్షుడు 8 అత్రి 9 వసిష్ఠుడు. (కశ్యపుడేమయినట్టు. అ.) అని నవబ్రహ్మలపేర్లు విష్ణుపురాణం 1–7–5, 6లో ఉన్నాయి. ఈ బ్రహ్మలనుండే దేవతలు, దిక్పాలకులు జన్మించారు. 1 ఇంద్రుడు తూర్పునకు అధిపతి 2 అగ్ని– ఆగ్నేయము 3 యముడు– దక్షిణము 4 నిర్‌ఋతి – నైరుతము 5 వరుణుడు – పడమర 6 వాయు వాయవ్యము 7 కుబేరుడు – ఉత్తరము 8 ఈశుడు –ఈశాన్యము 9 అనంతుడు – భూమి 10 బ్రహ్మ– ఊర్ధ్వము. ఇక పధ్నాలుగురు మనువులు. వీరు ప్రజాపతులనుండే ఉద్భవించారు.

1. స్వాయంభువుడు 2. స్వారోచిషుడు 3. ఉత్తముడు 4. తామసుడు 5. రైవతుడు 6. చాక్షుషుడు 7. వైవస్వతుడు 8. సావర్ణి 9. దక్షసావర్ణి 10. బ్రహ్మసావర్ణి 11. ధర్మసావర్ణి 12. రుద్రపుత్రసావర్ణి 13. రుచి 14. భౌముడు. ఇంద్రులు – ఒక్కో మనువు సమయంలో ఒక్కో ఇంద్రుడు ఉంటాడు. అట్లాగ ఇంద్రులు కూడ పధ్నాలుగురు.

1. ఇంద్రుడు 2. విపశ్చిత్ 3. సుశాంతి 4. శివుడు 5. విభువు 6. మనోజవుడు 7. పురందరుడు 8. బలి 9. అద్భుతుడు 10. శాంతి 11. వృషుడు 12. ఋతుధాముడు 13. దివస్పతి 14. శుచి అని.

అసురులు పితృగణము సిద్ధులు, గంధర్వులు, కిన్నరులు, కింపురుషులు, విద్యాధరులు మొదలయిన దేవజాతులవారు బ్రహ్మ మానసపుత్రులు.



ఏకాదశరుద్రులు – వీరి ఉత్పత్తియు బ్రహ్మమానసపుత్రుల వలననే జరుగుచున్నది. పదకొండుమంది రుద్రులు–

1. మన్యువు 2. మనువు 3. మహిమ్నన్ 4. మహాశివుడు 5. క్రతుధ్వజుడు 6. ఉగ్రరేతసుడు 7. భవుడు 8. కాలుడు 9. వామదేవుడు 10. ధృతవ్రతుడు 11. రుద్రుడు.

పన్నెండుమంది ఆదిత్యులు వీరు లేదా సూర్యులు

1. ధాత 2. అర్యముడు 3. మిత్రుడు 4. వరుణుడు 5. ఇంద్రుడు 6. వివస్వంతుడు 7. పూషణ్ 8. పర్జన్యుడు 9. అంశుడు 10. భగుడు 11. త్వష్ట 12. విష్ణువు.

ఇద్దరు అశ్వినీకుమారులున్నారు. వీరు దేవతల వైద్యులు. దానవులు, యక్షులు, రాక్షసులు, పిశాచులు, గుహ్యకులు మొదలయిన వారు బ్రహ్మమానస పుత్రులవలన పుట్టారు. ఇట్లా అనేక ములయిన దేవ జాతులున్నాయి. మనుష్య జాతిలో నాలుగు వర్ణముల సంగతి తెలిసిందే. ఇక తిర్యక్ జాతిలోని జీవాల్లో పశువులు (బహుశ ఆవులు గేదెలు వంటి పెంచుకునేవి అయిఉండవచ్చును) మృగములు (వేటాడబడేవి) పక్షులు (పెద్దవి) సరీసృపములు– పాములు, పతంగములు – ఎగిరేవి, పురుగులు మొదలయినవి ఉన్నవి. ఇక నిలకడగా ఉండే – స్థావరము జీవులకిందికి చేరేవి ఇవి– చెట్లు గుల్మము కాండములేకుండ అన్ని ఆకులు గలవి. పొదలు వీరుధములు చిన్నతీగల గుంపు గడ్డి మొదలయి నవి. చెట్లు మొదలయిన వాటిలో చేతనత్వము జ్ఞానము తక్కువగా ఉంటుంది. అవి నీటిని గ్రహించే శక్తి కల్గియున్నాయి. అది జ్ఞానమువలననే కలుగుతుంది.

జీవులను మరొొకవిధముగా విభజించవచ్చును. ఆ విభాగమే జరాయుజము, అండజము, ఉద్భిజ్జము, మరియు స్వేదజము అని. గర్భమునుండి

జన్మించునవి జరాయుజములు. గర్భసంచిపయిన చాలాసన్నని పల్చని పేగు (మావిచర్మముదే) ఉంటుంది. దానిని జరాయువు అంటారు. దానినుండి పుట్టినవాటిని జరాయుజములు అంటారు. దేవతలు, మనుష్యులు దీనికిందికే వస్తారు. అయితే కొందరు మాత్రము తల్లిగర్భమునుండి పుట్టలేదు. వీరు దేవతలలో బ్రహ్మ, రుద్రుడు, సనకాదులు. మనుష్యులలో సీత, ద్రౌపది, ధృష్టద్యుమ్నుడు, గోదాదేవి మొదలయిన వారు అయోనిజలు. భూతములు (పంచభూతములు కాదు – దయ్యాలవంటివి) వేతాలుడు మొదలయినవారు కూడ అయోనిజులుగానే పేర్కోబడ్డారు.

తిర్యక్కులలో పశువులు మృగములు మొదలయినవి జరాయుజములు, పక్షులు పాములు అండజములు. పేలు మొదలయినవి స్వేదజములు. చెట్లుమొదలయినవి భూమిని చీల్చుకొని వచ్చే స్థావరములు ఉద్భిజ్జములు. ఉత్ పయికి భిత్ – పగల్చుకొని జము – పుట్టేది.

ఈ జీవులందరు బద్ధులకోవకే చెందుతారు. వీరిసంసారము వరుసగా జరుగుతుంటుంది. అనాది కాలమునుండి నడచుచున్న అవిద్య యొక్క అధీనంలో ఉండిపోయి వీరంతా తాపత్రయమును అనుభవిస్తుంటారు. ఈ సాంసారిక తాపములు మూడు.

1. ఆధ్యాత్మికము: శరీరములో కలుగు దుఃఖములను ఆధ్యాత్మికము లంటారు ఇవి వ్యాధి– శరీరమునకు సంబంధించినవి, ఆధి–మనసుకు సంబంధించినవి. శరీరములోని త్రిదోషములవలన కలిగే జ్వరము, వ్రణము, కఫము, దగ్గు మొదలయినవి శారీరములు – జబ్బులు. కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము వలన కలిగేవి కోరిన రూపరస గంధస్పర్శ శబ్దరూప విషయములు దొరకక కలుగునట్టి దుఃఖములు మానసికములు.



2. ఆధిభౌతికము – ఇతరులవలన, పశుపక్ష్యాదుల వలన కలుగునట్టి దుఃఖములు. భూతములవలన కలుగనవి భౌతికములు.

3. ఆధిదైవికము – యక్ష, రాక్షస, పిశాచ, గ్రహాదులు పూని నందున కలుగు దుఃఖాలు ఆధిదైవికములు. బద్ధులలో మూడిటిచేగాని, ఒక్కదానితో నయినా గాని బాధ పొందని జీవులుండరు. సహజముగా ప్రాప్తమయిన పరమాత్మానుభవానికి జీవులు తరుచూ విముఖులుగానే ఉంటారు.

## శాస్త్రవశ్యజీవానాం విభాగః

**మూ:** తే ద్వివిధాః – శాస్త్రవశ్యాస్తదవశ్యాశ్చ. తయోర్మధ్యే కరణాయత్త జ్ఞానానాం బద్ధానాం శాస్త్రవశ్యతాస్తి. తిర్యక్ స్థావరాదీనాం తన్నాస్తి. శాస్త్రవశ్యా ద్వివిధాః బుభుక్షవో ముముక్షవశ్చేతి. తత్ర, బుభుక్షవస్త్రైవర్గిక పురుషార్థనిష్ఠాః. తే చ ద్వివిధాః– అర్థకామపరా ధర్మపరాశ్చేతి. కేవలార్థ కామపరా దేహాత్మాభి మానినః. ధర్మపరాశ్చ అలౌకిక శ్రేయస్సాధనం ధర్మః, చోదనాలక్షణార్థో ధర్మ ఇతి ధర్మలక్షణలక్షిత యజ్ఞదానతప స్తీర్థయాత్రాదినిష్ఠాః తే చ దేహాతిరిక్తాత్మాభి మానినః పరలోకోஉస్తీతి జ్ఞానవంతః. ధర్మపరా ద్వివిధాః– దేవాంతరపరా భగవత్పరాశ్చేతి. దేవాంతరపరా బ్రహ్మరుద్రాగ్నీ న్ద్రాద్యారాధనపరాః. భగ వత్పరాస్తు ఆర్తో జిజ్ఞాసురర్థార్థీత్యక్తాధి కారిణః. ఆర్తో భ్రష్టైశ్వర్యకామః. అర్థార్థీ అపూర్వైశ్వర్యకామః.

**అ:** ఆ బద్ధజీవులు రెండు విధాలుగా ఉంటారు– ఒకరు శాస్త్రము చెప్పినట్టు నడుచుకొనేవారు, శాస్త్రమునకు వశ్యులయి– అధీనులయి ఉండేవారు. శాస్త్రావశ్యులురెండవ వారు – శాస్త్రముచెప్పినట్టు కాక తమ ఇష్టము వచ్చినట్టు నడచుకునేవారు శాస్త్రము యొక్క వశము – అధీనములో లేని వారు శాస్త్రావశ్యులు అని. వీరిలో మొదటి వారు తమఅధీనంలో తమ ఇంద్రియా అధీనంలో జ్ఞానాన్ని ఉంచుకునేవారు అనగా మనుష్యులకు శాస్త్రవశ్యత్వము ఉంటుంది. పశుపక్ష్యాది స్థావరములకు తిర్యక్కులకు ఈ శాస్త్రాధీనత్వముండదు.

మళ్ళీ శాస్త్రవశ్యులు రెండు విధాలు– బుభుక్షువులు ముముక్షువులు అని. ఈ బుభుక్షువులు త్రివర్గము అను పురుషార్థములను సాధించప్రయత్నించువారు. ధర్మము, అర్థము, కామము అనుమూడు త్రివర్గము. (మోక్షము కలిస్తే చతుర్వర్గము అవుతుంది. ఇవి నాలుగు పురుషార్థములు అంటారు.) వీరు కూడ మళ్ళీ రెండు విధాలు – కేవలము అర్థకామపరులు అని ధర్మపరులు అనీను. మొదటివారు దేహమునే ఆత్మఅని అభిమానించేవారు. అర్థమును– ధనమును, కామమును– విషయసుఖమును సాధించుటయందు కడు ఆసక్తికలవారు.

ఇక ధర్మపరులు అను రెండవవారు పరలోకము ఉన్నదని నమ్మి ఆ లోకానికి చెందిన శ్రేయస్సును సాధించునది ధర్మము అని వేదవిహితమయిన కర్మలను చేయుటవలన కలుగునది ధర్మమని నమ్మి, యజ్ఞములను దానములను, తపస్సును, తీర్థయాత్రలను చేయునట్టివారు, వీటిని చేయుట వలన ధర్మమును ఆచరించువారు. వారు దేహమున కంటే వేరుగా ఆత్మ ఉన్నదని నమ్మేవారు, కనుకనే పరలోకము ఉన్నదను జ్ఞానము విశ్వాసము కలవారు. ఈ ధర్మపరులు మళ్ళీ రెండు విధాలు– దేవాంతరమును పూజించువారు, భగవత్పరులు అని. మొదటివారు బ్రహ్మ, రుద్రుడు, అగ్ని, ఇంద్రుడు మొదలయిన దేవతలను ఆరాధించేవారు. ఇక భగవంతుడయిన నారాయణుని ఆరాధించువారు. గీతలో చెప్పినట్టు ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని అనునలుగురు. పోయిన ఐశ్వర్యము పొందగోరువాడు ఆర్తుడు. కొత్త ఐశ్వర్యాన్ని కోరేవాడు అర్థార్థి. తెలుసుకో గోరేవాడు జిజ్ఞాసువు, తెలిసినవాడు జ్ఞాని.

**వి:** భోక్తుం ఇచ్ఛుః బుభుక్షుః. భోగములను అనుభవించగోరువాడు బుభుక్షువు. మోక్తుం ఇచ్ఛుః మోక్షమును కోరువాడు ముముక్షువు. బుభుక్షువులు రెండురకములఉంటారు. మొదటివారు కేవలము అర్థమును సంపాదించడము కామమును తీర్చుకోవడం ఆ రెంటి కొరకే పని చేస్తుంటారు. ధర్మాన్నిగూర్చి పట్టించుకోరు. వీరు కేవలము దేహమునే అభిమానిస్తారు, దానినే ఆత్మ అని



అనుకుంటారు. వీలయినంత సుఖపడడమే జీవితము అని భావించేవారు. రెండవ వారు అర్థకామములను కాదనకుండ, ధర్మమును సంపాదింపగోరువారు. శాస్త్రవిహితమార్గములో హితమయిన కర్మలను ఆచరిస్తూ అర్థాన్ని న్యాయం తప్పక సంపాదిస్తూ ఉంటారు. అట్లానే కామాన్నికూడ. వారు ఏది ఆచరించినా ధర్మదృష్టితోనే. వీరు ఆత్మను పరలోకాన్నినమ్మి శాస్త్రము చెప్పినట్లు ధర్మమును ఆచరిస్తూ ఉంటారు. గీతలోకూడ 'యజ్ఞదానతపః కర్మ న త్యాజ్యం కార్యమేవతత్' అని బోధిస్తాడు శ్రీకృష్ణపరమాత్మ. కర్మఫలమును అనుభవించక తప్పదని తెలిసి పుణ్యకర్మలు చేయువారు. నిషిద్ధమయినవాటిని ఆచరించనివారు. అవి వివిధములయిన యజ్ఞములు, దానము, తపస్సు, తీర్థయాత్రలు మొదల యినవి తప్పక ఆచరిస్తారు. హింస, నింద, మొదలగునవి చేయరు.

ధర్మపరాయణులు మళ్ళీ రెండు విధాలుగా ఉంటారు. ఒకటవ ధర్మపరాయణ జీవులు – దేవతాంతరమును ఆరాధించి ఇహలోకంలో పరలోకంలో కల్యాణము పొందగోరేవారు. రెండవవారు భగవత్పరాయణ జీవులు. భగవంతుడే ఆ యా దేవతలద్వారా ఆ యా ఫలాన్నిప్పిస్తుంటాడు అని, అన్ని ఫలాలను వారు ఇవ్వలేరని ముఖ్యముగా మోక్షఫలాన్ని ఇచ్చే వాడు నారాయణుడొక్కడే అని త్రికరణశుద్ధిగా నమ్మి ఆయన్నే తొమ్మిది విధములయిన భక్తులలో ఇష్టమయిన దానితో పూజిస్తుంటారు. ఆయన చరాచరప్రపంచానికి ప్రభువు అని తెలుసుకుంటారు. భగవత్పరాయణులయిన అధికారులు ముగ్గురు– ఆర్తుడు, పోయిన ఐశ్వర్యాన్ని తిరిగి పొందాలని ఆరాటం గలవాడు, అర్థార్థి తనకులేనటువంటి ఐశ్వర్యాన్ని పొందగోరువాడు, వీరిద్దరికి పెద్ద తేడా లేదు. మూడవవాడు – జ్ఞాతుం ఇచ్ఛుః– తెలుసుకొనగోరువాడు. భగవంతుని ఆరాధించి ప్రకృతినుండి విడివడి పరమాత్మస్వరూపమును తెలుసుకొనగోరువాడు (ఇక్కడ జ్ఞానిని చెప్పలేదు. గీతలో చెప్పారు. తెలిసినవాడు ఆయనను ఆరాధించి మోక్షమును పొందగోరుతాడుగద.అ.)

**ముముక్షుభేదనిరూపణమ్ :**

మూ: ముముక్షవో ద్వివిధాః – కైవల్యపరా మోక్షపరాశ్చేతి. కైవల్యం నామ జ్ఞానయోగాత్ ప్రకృతివియుక్తస్వాత్మానుభవరూపమ్. సోఽనుభవోఽర్చిరాది మార్గేణ పరమపదగతవత ఏవ క్వచిత్ కోణే పతిత్యక్త (వియుక్త) పత్నీన్యాయేన భగవదను భవవ్యతిరిక్తస్వాత్మాను భవ ఇత్యాహుః. కేచిత్ అర్చిరాది మార్గేణ గతస్య అపునరావృత్తి శ్రవణాత్ ప్రకృతిమణ్డలఏవ క్వచిద్దేశే స్వాత్మానుభవ ఇత్యాహుః.

అ: మోక్షమును గోరు వారు రెండు విధాలుగా ఉన్నారు. కైవల్యమును గోరువారు ఒకరు, రెండవ వారు మోక్షమును గోరువారు అని. జ్ఞానయోగముచేత ప్రకృతితో సంబంధమును బాసి తన ఆత్మయొక్క అనుభవము పొందడము కైవల్యము. ఈ అనుభవము అర్చిరాది మార్గమున పరమపదము చేరినవాడికే కలుగుతుంది. తన భర్తనుండి దూరమయి ఓ మూలచేరి తనసౌందర్యమును చూసుకొని ప్రసన్నురాలగు పత్ని అనుభవము తీరుగ భగవంతుని అనుభవములేక ఆ అనుభవము నీరసము అని ఆచార్యులు చెప్పిరి. కైవల్యార్థి యయిన వాడు ప్రకృతి మండలములోనే ఉండి స్వాత్మానుభవము పొందుతాడు. దీనికి కారణము అర్చిరాది మార్గమున పోయినవానికి తిరిగి సంసారములోనికి రావడము ఉండదని శ్రుతులు చెప్పటమే అని మరికొందరు అంటారు.

వి: శాస్త్రవశ్యులయిన జీవులలో రెండవరకమువారు ముముక్షువులు. వీరు త్రివర్గమునకు విముఖులయి మోక్షము అనే నాలుగవ పురుషార్థమును పొందడానికి ఆ యా సాధనములను అనుసరించి ప్రయత్నించేవారు. వీరు కూడ రెండు విధాలుగా ఉంటారు. ఒకరు కేవలము కైవల్యమును కోరుకుంటారు. రెండవవారు మోక్షమునే కోరుకుంటారు.

కైవల్యపరులు: కేవలస్య భావః కైవల్యమ్. జ్ఞానయోగముతో సాధన చేయుటచే ప్రకృతి సంబంధము తొలగిపోతుంది. అప్పుడు జ్ఞానస్వరూపుడు



ఆనంద స్వరూపుడు అయిన ఆత్మ యొక్క అనుభవము ఆత్మకు కలుగుతుంది. ఆ అనుభవము పేరే కైవల్యము. కైవల్యము కోరేవారు తమ ఆ పరిశుద్ధమయిన ఆత్మానుభవము కొరకు ఆయా సాధనములతో ప్రయత్నిస్తుంటారు. కైవల్యానుభవము యొక్క మార్గము విషయములో రెండు అభిప్రాయాలున్నాయి. ఒకటి కైవల్యపరులయిన జీవులుకూడ అర్చిరాదిమార్గము గుండా పరమపదము వెళ్ళుతారు. అక్కడ జ్ఞానానంద స్వరూపుడయిన తమ ఆత్మానుభవం పొందు తారు.

అయితే ఇక్కడో విషయం గుర్తించాలి. ఒక సుందరి పతినుండి దూరమయి ఇంటిలో ఓమూల కూచొని ఏకాంతంలో తన సౌందర్యమును చూసుకొని మురిసినట్లు ఉంటుంది. ఆ ఆత్మానుభవము. అది నీరసము కూడ. ఆ మురియడంలో ఒక హద్దు ఉన్నది. పతి వెంటఉంటే ఆ ఆనందమును మించిన ఆనంద ముండదు. అట్లాగే జీవులందరికీ పరమ ప్రాప్యుడు శ్రీమన్నారాయణుడే కనుక జీవులందరికీ పతి ఆ శ్రియః పతియే. బాదరాయణమహర్షి కూడ ఈ విషయాన్ని 'అత ఏవ చానన్యాధిపతిః' బ్ర.సూ.4.4.9 లో వివరించారు. నాస్తి అన్యః – పరమాత్మవ్యతిరిక్తః అధిపతిర్య స్యాసౌ అని అనన్యాధిపతి విగ్రహవాక్యము. నాస్తి అధిపతిర్యస్య అని విగ్రహము చేయరాదు. చేస్తే అనధిపతిః అని సమాసము అవుతుంది. జీవుల యొక్క స్వాభావికమయిన అధిపతి పరమాత్మ. అధిపతి అనుభవముతో బాటు తన స్వరూపానుభవము సర్వాతిశయముగాను, సుఖావహముగను ఉంటుంది. కైవల్యానుభవములో భగవదనుభవ ముండదు కనుక కేవలాత్మానుభవము నీరసముగా ఉంటుంది.

అర్చిరాదిమార్గం గురించి ముక్తోర్చిః ఇత్యాదిశ్లోకంలో అగ్నిర్జ్యోతి రహఃశుక్లః.... భగవద్గీత 8–24లో, తేఽర్చిషమభిసంభవన్తి...... సంవత్సరమ్ ఛాం.5–10–1 లో వివరింపబడినది. బ్రహ్మసూత్రములో కూడ నాలుగవ అధ్యాయము మూడవ పాదము అర్చిరాద్యధికరణములో బాదరాయణమహర్షి

వివరించారు. కైవల్యానుభవ మార్గము విషయములో రెండవ అభిప్రాయము కైవల్యార్థియయిన జీవుడు ప్రకృతిమండలములోనే ఏదో ఒకచోట ఉండి తన పరిశుద్ధ ఆత్మ స్వరూపమును అనుభవిస్తూ ఉంటాడు; అర్చిరాదిమార్గంలో వెళ్ళి వైకుంఠం చేరే జీవుడు శ్రీమన్నారాయణునితోబాటు ఆత్మానుభవం పొందుతాడు కనుక కైవల్యార్థి ప్రకృతిమండలంలోనే ఉంటాడు అని.

## మోక్షపరాణాం ముముక్షూణాం భేదాః

మూ: మోక్షపరాశ్చ ద్వివిధాః – భక్తాః ప్రపన్నాశ్చేతి. భక్తాః పునరధీత సాఙ్గశిరస్కవేదాః పూర్వోత్తర మీంమాసా పరిచయాచ్చిదచిద్విలక్షణా నవధికాతిశయానన్దరూపం నిఖిలహేయప్రత్యనీకం సమస్త కల్యాణ గుణాత్మకం బ్రహ్మావధార్య తత్ప్రాప్త్యుపాయభూతాం సాఙ్గాం భక్తిం స్వీకృత్యతయా మోక్షం ప్రాప్తుకామాః. భక్తావధికారః త్రైవర్ణికానామేవ. దేవాదీనా మప్యస్తి. అర్థిత్వసామర్థ్యయోః సమ్భవాత్ న శూద్రాణామధికారః. అపశూద్రాధికరణ విరోధాత్. భక్తిస్వరూపం తు బుద్ధిపరిచ్ఛేదే ప్రతిపాదితమ్. భక్తా ద్వివిధాః సాధన భక్తినిష్ఠాః సాధ్యభక్తినిష్ఠాశ్చేతి. సాధన భక్తినిష్ఠా వ్యాసాదయః. సాధ్యభక్తి నిష్ఠా నాథాదయః.

అ: మోక్షమునందాసక్తి గల జీవులు కూడ రెండువిధాలుగా ఉంటారు. ఒకరు భక్తులు, రెండవ వారు ప్రపన్నులు అని. మొదటివారు ఆరు అంగములు ఉపనిషత్తులతో గూడిన వేదములను చదివినవారు. పూర్వమీమాంసా ఉత్తర మీమాంసా పరిచయము కలవారు. దానితో భగవంతుడు త్రివిధచేతనుల కన్న త్రివిధ అచేతనములకన్న విలక్షణుడు, అంతులేని అధికమయిన ఆనంద రూపుడు. నిఖిలహేయదోషములు లేనివాడు, అఖిలకల్యాణ గుణములు కలవాడు బ్రహ్మ–శ్రీభగవానుడు అని గుర్తెరిగి అతనిని చేరుటకయి పొందుటకయి ఉపాయమయిన భక్తిని స్వీకరించువారు. ఆ భక్తి అష్టాంగయోగముతో సాధనసప్తకముతో కూడినదయి ఉంటుంది. అట్టి భక్తితో మోక్షమును పొందగోరువారు భక్తులు.



ఈ భక్తియందు త్రైవర్ణికులకే అధికారము ఉన్నది. దేవాదులకు కూడ అధికారమున్నది. వారిలో కూడ అర్థిత్వము – కావాలని కోరిక, సామర్థ్యము – శక్తి ఉంటాయి కనుక శూద్రులకు అధికారము లేదు. అపశూద్రాధికరణముతో విరోధము వస్తుంది కనుక భక్తిస్వరూపము ఏమిటో బుద్ధిపరిచ్ఛేదములో నిరూపించాము. భక్తులు రెండు విధాలు. ఒకరు సాధనభక్తినిష్ఠులు. రెండవ వారు సాధ్యభక్తినిష్ఠులు. వ్యాసుడు మొదలయిన వారు మొదటి కోవకు, నాథమునులు మొదలయినవారు రెండవకోవకు చెందుతారు.

వి: శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అని ఆఱు వేదాంగాలు. ఉపనిషత్తులకు వేదాంతము అను పేరుతోబాటు వేదముల శిరస్సు అని కూడ ప్రసిద్ధి ఉన్నది. శరీరమునకు శిరస్సు ప్రధానమయినట్టు (మూడు జ్ఞానేంద్రియములు ఉన్నందున అట్లాగే బ్రహ్మను గూర్చి చర్చించినందున) ఉపనిషత్తులు వేదమునకు ప్రధానము. పూర్వమీమాంస యజ్ఞయాగాది క్రతువులను ఎట్లా నిర్వహించాలో నిరూపిస్తుంది. ఉత్తరమీమాంస బ్రహ్మ ఏమిటో నిరూపిస్తుంది. భక్తి యొక్క అంగములచర్చ ఇదివరకే వచ్చినది. యమనియమాది అష్టాంగయోగము, వివేకాది సాధనసప్తకము భక్తి అంగములు.

ఇక భక్తికి అధికారి వివరణము. దేవతలు, మనుష్యులు అందరు అధికారులు. అయితే బ్రహ్మసూత్రములలో అపశూద్రాధికరణము అని ఒక అధికరణము బ్రహ్మసూత్రములలోని మొదటి అధ్యాయము మూడవ పాదములో ఉన్నది. దీనిలో 33వ సూత్రమునుండి 39 వరకు చర్చించి అధికారము శూద్రులకు లేదని నిర్ణయించారు. మారుతున్న మారిన కాలములో ఎందరో విదేశీయులు వేదాలు ఉపనిషత్తులు అధ్యయనం చేసి వ్యాఖ్యానాలు వ్రాసి భక్తిని అవలంబించినారు. కనుక శూద్రులకు అధికారం లేదనడం సమంజసం కాదు. వారిలో కూడ అర్థిత్వము సామర్థ్యము ఉన్నది. ఇవి రెండు ఉన్నవారు అధికారులు అనికదా చెప్పడం జరిగినది. శాస్త్రము శాస్త్రకారులు మన్నింతురు గాక. బ్రహ్మ

సూత్రములోని అపశూద్రాధికరణముతో విరోధమున్నందున గ్రంథకర్త అధికారాన్ని దేవతలకు త్రైవర్ణికులకు పరిమితము చేశారు.

## ప్రపన్నానాం స్వరూపం భేదాశ్చ:

మూ: ఆకించన్యానన్యగతిత్వధర్మవిశిష్టో భగవంతమాశ్రితః ప్రపన్నః. స ద్వివిధః – త్రైవర్గికపరో మోక్షపరశ్చేతి. త్రైవర్గికపరో నామ, భగవత ఏవ ధర్మార్థ కామాభిలాషీ, మోక్షపరస్తు సత్సంగత్వానిత్యా నిత్య పరవస్తువివేకే సతి సంసారే నిర్వేదాత్ వైరాగ్యే ఉత్పన్నే మోక్షేచ్ఛాయాం జాతాయాం తత్సిద్ధ్యర్థం ఆచార్యో వేదసంపన్న ఇత్యాద్యాచార్య లక్షణలక్షితం గురుం సంశ్రిత్య తద్ ద్వారా పురుషకారభూతాం శ్రియం ప్రపద్య భక్త్యాద్యుపాయాంతరేషు అశక్తోऽత ఏవాకించనోऽనన్యగతిః శ్రీమన్నారాయణ చరణావే వోపాయత్వేన స్వీకరోతి యః సః ప్రపన్నః. ప్రపత్తిః సర్వాధికారా. ప్రపన్నో ద్వివిధః – ఏకాంతీ పరమైకాంతీ చేతి. యో మోక్షఫలేన సాకం ఫలాంతరాణ్యపి భగవతఏవేచ్ఛతి స ఏకాంతీ. దేవాంతరశూన్య ఇత్యర్థః. భక్తిజ్ఞానాభ్యాం అన్యత్ఫలం భగవతోऽపి నేచ్ఛతి యః పరమైకాంతీ స ద్వివిధః దృప్తార్తభేదాత్. అవశ్యమనుభోక్తవ్యమితి ప్రారబ్ధ కర్మానుభవన్ ఏతద్దేహావసాన సమయమీ (యే మోక్షమపే) క్షమాణో దృప్తః జాజ్జ్వల్యమానాగ్ని మధ్య స్థితేరివ సంసారస్థితేరతిదుఃసహత్వాత్ ప్రపత్త్యుత్తరక్షణ ఏవ మోక్షకామ ఆర్తః.

అ: నాకంత సుకృతము లేదు. ఉంటే దాని బలముతో నేను భగవంతుని పొందియుండే వాడను అనే భావనలేక, భగవంతుడు దయైక సింధువు అతని అవ్యాజకృప నన్ను అతని వాణ్ణి చేస్తుంది. అనే దీనమయిన భావన ఆకించన్యము. కించ ఏమియును లేదు. వాడు అకించనుడు. వానిభావము ఆకించన్యము. ఏమీ లేదని దీనిభావన. 'నీవే తప్ప నితః పరంబెరుగను' – నీవు తప్ప నాకు దిక్కు ఎవరు లేరు అనుభావన – అన్యులు – ఇతరులు, గతి దిక్కు ఇట్లా లేనివారు అనన్యగతి వారి భావము అనన్యగతిత్వము. ఇట్లా ఆకించన్యము అనన్యగతిత్వము అనుధర్మములు కలిగి యుండి భగవంతుని సర్వవిధాలా ఆశ్రయించినవాణ్ణి ప్రపన్నుడు అంటాడు. ప్రపద్యతే – పొందును అని ప్రపత్తి అదికలవాడు. చేసిన వాడు ప్రపన్నుడు.



ఈ ప్రపన్నుడు మళ్ళీ రెండువిధాలుగా ఉన్నాడు. మొదటివాడు త్రైవర్గికపరుడు, రెండవవాడు మోక్షపరుడు అని. త్రివర్గము ఇది వరకే తెలుసుకొన్నట్టు ధర్మము, అర్థము, కామము అను సముదాయము. భగవంతుని నుండే వీటిని కోరువాడు మొదటివాడు త్రైవర్గికపరుడు. మోక్షపరుడు ప్రపన్నులయిన సత్పురుషుల యొక్క సత్సంగముతో నిత్యానిత్యవస్తువివేకమును పొందుతాడు. దానివలన అనిత్యమయిన సంసారము పయి వైరాగ్యాన్ని పొందుతాడు. అప్పుడు నిత్యమయిన మోక్షమందు కోరిక కలుగుతుంది.

ఆ మోక్షము ఎలా సిద్ధిస్తుంది? ఆచార్యుని వలన. ఎలాటి గుణములు ఉన్నవాడు ఆచార్యుడు? వేదజ్ఞుడు. బ్రహ్మనిష్ఠుడు. రామానుజులు 'సత్సంతాన ప్రసూతసదాచారనిష్ఠవేదవిదాచార్యః' అని చెప్పారు. అట్టి లక్షణాలున్న ఆచార్యులను ఆశ్రయిస్తాడు. తద్ ద్వారా పురుషకార రూపురాలైన లక్ష్మీదేవిని శరణాగతి చేస్తాడు. భక్తి మొదలయిన ఉపాయములందు శక్తి లేనివాడు కనుక అకిఞ్చనుడు అనన్యగతికుడయి శ్రీమన్నారాయణుని చరణారవిందములనే మోక్షప్రాప్తి సాధనముగా స్వీకరిస్తాడు. ఈ ప్రపత్తిని అందరు చేయవచ్చును. అధికార భేదము లేదు.

ఇట్లాటి ప్రపత్తి గలవాడు ప్రపన్నుడు. ఈ ప్రపన్నుడు కూడ రెండువిధములు, ఏకాంతి అని పరమైకాంతి అని. మోక్షఫలముతోబాటు ఇతర ఫలములను భగవంతునివలననే కోరేవాడు ఏకాంతి. ఇతర దేవతలను ప్రార్థించనివాడు ఇతర దేవతలు లేనివాడు అని అర్థము. ఏఫలముకొరకూ ఇతరులను పూజించనివాడు. ఇక పరమైకాంతి ప్రపన్నుడయిన జీవుడు

భగవంతున్ని కూడ భక్తి జ్ఞానము తప్పవేరే ఫలమును కోరడు. ఈ పరమైకాంతి ప్రపన్నజీవుడు కూడ రెండు విధాలుగా ఉంటాడు. ఒకడు దృప్తుడు. రెండవవాడు ఆర్తుడు. మొదటివాడు దర్పము అనగా గర్వము ఆదికలవాడు దృప్తుడు. చేసిన కర్మల ఫలమును తప్పక అనుభవించాలి అని తెలిసినవాడు కనుక ప్రారబ్ధ కర్మలఫలాన్ని అనుభవిస్తూ ఈ శరీరము పడిపోయేంత వరకు వేచిఉండేవాడు. వాడు దృప్తుడు. ఇక ఆర్తుడు - ఆర్తి బాధ కలవాడు. ఈ ప్రపన్న జీవుడు పరమైకాన్తి ఈ సంసారములో ఉండటాన్ని ధగధగ మండేమంటలలో ఉండటమంత బాధగా భావించి, అసహ్యసంసారంనుండి ప్రపత్తి చేసిన వెంటనే మోక్షం కావాలని తహతహ పడేవాడు.

వి: శ్రీమద్వేదాంతదేశికులు ఆచార్యలక్షణము నిలా వివరించారు.

**'సిద్ధం సత్సమ్ప్రదాయే స్థిరధియమనఘం శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం**
**సత్త్వస్థం సత్యవాచం సమయనియతయా సాధువృత్త్యా సమేతమ్.**
**దమ్భాసూయాదిముక్తం జితవిషయగణం దీర్ఘబంధుం దయాలుం**
**స్ఖాలిత్యే శాసితారం స్వపరహితపరం దేశికం భూష్ణురీయాత్'**

అని అర్థము స్పష్టముగానే ఉన్నది. పురుషకారము భగవత్ప్రాప్తికి లక్ష్మీదేవి శరణాగతి అత్యావశ్యకము. జీవుడు ఎట్లాటివాడయినా వాడి తప్పులేదని వాడిని కాపాడమని పిల్లల తల్లి తండ్రితో చెప్పినట్టు వెనుక వేసుకొని వచ్చి తలపెట్టిన మోక్షము దొరికేట్టుచేసే (సిఫారస్, రికమెండేషన్ అని అంటామే అలాంటిది) దానిని పురుషకారము అంటారు. లక్ష్మీదేవియే మోక్షప్రాప్తిలో పురుషకారము. కృప, పారతంత్ర్యము, అనన్యార్హత్వము అను పురుషకారానికి అవసరమైన మూడు గుణములు గలిగిన తల్లి లక్ష్మీదేవి.

ప్రపత్తి సర్వజీవులకు సులభము. అకించనులు, అనన్యగతికులు అయి భగవంతుని చరణకమలములే మోక్షోపాయమని నమ్మి వాటినే కొలుచుట ప్రపత్తి.



దీనికి అందరు అధికారులే. నియమములు ఏవీ లేవు. ఈ విషయములనే ప్రపత్తేర్దేశనియమః కాలనియమో౽ధికారనియమః ఫలనియమశ్చ నాస్తి శ్రీ.వ. భూ.27 లో పిళ్లలోకాచార్యులు తెలిపారు.

## ముక్తజీవవర్ణనమ్:

మూ: ముక్తో నామ ఉపాయపరిగ్రహానన్తరం నిత్యనైమిత్తిక భగవదాజ్ఞాను జ్ఞాకైఙ్కర్యరూపాణి కర్మాణి స్వయమ్ప్రయోజనతయా కుర్వన్, భగవద్భాగవతాచార్యా పచారాంశ్చ వర్జయన్, దేహావసానకాలే సుకృతదుష్కృతే మిత్రామిత్ర యోర్నిక్షి పన్ వాఙ్మనసీత్యాది ప్రకారేణ హార్దే పరమాత్మని విశ్రమ్య, ముక్తిద్వార భూత సుషుమ్నానాడీం ప్రవిశ్య తయా బ్రహ్మరంధ్రాన్నిష్క్రమ్య హార్దేన సాకం సూర్యకిరణ ద్వారా అగ్నిలోకం గత్వా దినపూర్వపక్షోత్తరాయణ సంవత్సరాద్యభిమాని దేవతాభిర్వాయునా చ పథి సత్కృతః, సూర్యమణ్డలం భిత్త్వా (నభోరన్ధ్ర) రథచక్రరన్ధ్రద్వారా సూర్యలోకం గత్వా అనన్తరం చన్ద్రవిద్యుద్వరుణేన్ద్ర ప్రజాపతిభి ర్మార్గ ప్రదర్శిభిరాతివాహి కైర్గణైస్సహ సోపచారం తత్తల్లోకానతీత్య ప్రకృతి వైకుణ్ఠసీమా పరిచ్ఛేదికాం విరజాం తీర్త్వా సూక్ష్మశరీరం విహాయ అమానవకర స్పర్శాదప్రాకృతదివ్య (మఙ్గల) విగ్రహయుతశ్చతుర్భుజో బ్రహ్మాలఙ్కారేణాలం కృతః, ఇంద్రప్రజాపతి సంజ్ఞక నగరద్వార పాలాభ్యనుజ్ఞయా శ్రీవైకుణ్ఠాఖ్యం దివ్యనగరం ప్రవిశ్య గరుడా నన్తయుక్త పతాకాలం కృత దీర్ఘ ప్రాకారసహిత గోపురమతీత్య ఐరమ్మదా ఖ్యామృతసరస్సోమ సవనాఖ్యాశ్వత్థం చ దృష్ట్వా శతం మాలాహస్తా ఇత్యాద్యుక్త పఞ్చశతదివ్యాప్సరోగణైరుపచరితో బ్రహ్మగన్ధాదిభి రలం కృతః తత్రత్యానన్తగరుడ విష్వక్సేనాదీన్ ప్రణమ్య తైర్బహుమతో మహామణి మణ్డపమాసాద్య పర్యఙ్కసమీపే స్వాచార్యాన్ ప్రణమ్య పర్యఙ్కసమీపం గత్వా తత్ర ధర్మాది పీఠోపరి కమలే అనన్తే విమలాదిభిశ్చామర హస్తాభిస్సేవ్యమానం శ్రీభూమి నీలాసమేతం శఙ్ఖచక్రాది దివ్యాయుధోపేతం జాజ్వల్యమాన కిరీట ముకుట చూడావతంస మకరకుండలగ్రైవేయక హారకేయూర కటక శ్రీవత్స కౌస్తుభ ముక్తా దామోదర బంధన పీతామ్బర కాఞ్చీగుణ నూపురాద్య పరిమిత

దివ్యభూషణై ర్భూషితమపరిమితోదార కల్యాణగుణసాగరం భగవన్తం దృష్ట్వా తత్పాదారవిన్దయుగలం శిరసా ప్రణమ్య పాదేన పర్యఙ్క మారుహ్యా తేన స్వాఙ్కే స్థాపితః కోఽసీతి పృష్టో బ్రహ్మప్రకారో (బ్రహ్మ పరికరో) (బ్రహ్మప్రకాశో) స్మీతి ఉక్త్వా తేన కటాక్షితః తదనుభవజనిత ప్రహర్ష ప్రకర్షాత్సర్వ దేశసర్వకాల సర్వావస్థోచిత సర్వకైఙ్కర్యైకరతిరావిర్భూత గుణాష్టకః ఉత్తరావధిరహిత బ్రహ్మానుభవవాన్ యః స ముక్త ఇత్యుచ్యతే. ముక్తస్య బ్రహ్మసామ్యా పత్తిశ్రుతిస్తు భోగసామ్యమాహ జగద్ వ్యాపారవర్జనస్య ప్రతిపాదనాత్. తస్య నానాత్వం సర్వలోకసఞ్చరణం చ సమ్భవతి,

అ: ముక్తజీవుని వర్ణన ఇలా ఉంది. ప్రపత్తి అను మోక్షోపాయమును స్వీకరించిన తరువాత నిత్యనైమిత్తికకర్మలను భగవంతుని ఆజ్ఞ అనుజ్ఞల కైఙ్కర్య రూపకర్మలను ఆచరణము కొరకే ఆచరిస్తాడు జీవుడు. అట్లా ఆచరిస్తూ భగవంతుని ఎడల భాగవతుల ఎడల అపచారమును వదలి పెడతాడు. దేహావసానకాలములో పుణ్యమును మిత్రులకు, అమిత్రులకు దుష్కృతమును పంచి ఇస్తాడు. తదుపరి అతని వాక్కు మనసులో లీనమవుతుంది. (మనస్సు ప్రాణములో, ప్రాణములు తేజస్సులో, తేజస్సు పరమాత్మలో లీనమవుతవి. హృదయంలో ఉండేవాడు కనుక హార్దుడు అనిపేరు) హృదయములోనున్న పరమాత్మునిలో లీనమయి విశ్రమిస్తాడు. తదుపరి శరీరమునుండి ముక్తికి ద్వారములాగా ఉండే సుషుమ్నా నాడిలో ప్రవేశిస్తాడు. దానిద్వారా బ్రహ్మరంధ్రమునుండి బయటకు వెడలి హృదయస్థుడయిన పరమాత్మునితో బాటు సూర్యకిరణముద్వారా అగ్ని లోకములోనికి వెళ్ళుతాడు. అక్కడి నుండి వెళ్ళుతూ మార్గంలో దినము, శుక్లపక్షము, ఉత్తరాయణము, సంవత్సరముల యొక్క అభిమానదేవతలచే ఆదరింపబడుతాడు. వాయుదేవత కూడ అతనిని గౌరవిస్తాడు. అక్కడి నుండి సూర్యమండలమును భేదించుకొని రథచక్రరంధ్రము ద్వారా సూర్యలోకం ప్రవేశిస్తాడు. అక్కడి నుండి బయలుదేరిన జీవుని మార్గము చూపునట్టి చంద్రుడు, విద్యుత్, వరణుడు, ఇంద్రుడు మరియు ప్రజాపతి అను అతివాహికగణము



(చేయిపట్టి సుఖంగా తీసుకొని – మోసుకొని పోయేవారు అతివాహకులు వారి సముదాయము–గణము) పూజిస్తుంది.

దారిలో అట్లా అన్ని పూజలు అందుకొంటూ ఆ యా లోకములను దాటి ప్రకృతిని వైకుంఠమును వేరుచేయునట్టి విరజానదిని చేరుతాడు జీవుడు. ఆ నదిని కూడ దాటిన తరువాత తన సూక్ష్మ శరీరమును వదలి పెడ్తాడు. అక్కడ ఆ మానవుడు అతనిని తనచేతితో తాకుతాడు. దానితో జీవుడు నాలుగు భుజములుకల దివ్యమయిన మంగళమయిన శరీరమును పొందుతాడు. బ్రహ్మాలంకారములతో అలంకరింపబడుతాడు. ఇంద్రుడు ప్రజాపతి అనుపేర్లుగల ద్వారపాలకుల అనుమతిని పొంది ముక్తజీవుడు శ్రీవైకుంఠ దివ్యనగరంలో ప్రవేశిస్తాడు. గరుడుని విష్వక్సేనుని బొమ్మలు గల పతాకములతో అలంకరింపబడిన పొడవయిన ప్రాకారములు కలిగిన గోపురములను దాటుతూ ఐరమ్మదం అను సరస్సును సోమ సవనము అను రావిచెట్టును చూస్తాడు. ఛాందోగ్యోపనిషత్తులో శతం మాలా హస్తాఃఇత్యాది భాగంలో వర్ణించినట్టు అతనిని ఐదువందలమంది అప్సరసలు పూజించి బ్రహ్మగంధము మొదలయినవాటితో సత్కరిస్తారు. అప్పుడు ముక్తజీవుడు అక్కడ విరాజమానులయి ఉన్న అనంతుడు, గరుడుడు, విష్వక్సేనుడు మొదలయిన నిత్యసూరులకు నమస్కరిస్తాడు. వారు అతనిని అక్కున చేర్చుకుంటారు.

అక్కడినుండి మహామణిమండపం ప్రవేశిస్తాడు. అక్కడ తల్పము దగ్గర ఉన్న తన ఆచార్యులకు ప్రణమిల్లుతాడు. తల్పము దగ్గరికి వెళ్ళుతాడు. తల్పముపయి ధర్మాది పీఠములమీద కమలము మీద శేషునిపయి విరాజిల్లుతుంటాడు శ్రీమన్నారాయణుడు. విమల మొదలయిన పరిచారికలు చామరములు వీచుతుంటారు. శ్రీదేవి, భూదేవి, నీలాదేవి ఆయనకు పరిచర్యలు చేస్తుంటారు. ఆయన శంఖచక్రాది దివ్యాయుధములతో, కిరీటము, మకుటము, చూడామణి, మకరకుండలములు, కంఠహారములు, కేయూరములు, కంకణములు, శ్రీవత్సచిహ్నము, కౌస్తుభమణి, ముత్యాలహారము, ఉదరబంధము

(బెల్టులేదా నడుముకట్టు) పీతాంబరము, కాంచి (వడ్డాణము) నూపురములు (అందెలు) మొదలయిన అనేక దివ్యాభరణములతో విభూషితుడయి ఉంటాడు. అట్లాటి అనంత కల్యాణగుణములకు ఆశ్రయుడు అయినట్టి శ్రీమన్నారాయణుని దివ్యదర్శనం చేసుకుంటాడు.

ఆ శ్రీమన్నారాయణుని పాదపద్మములకు శిరసుతో ప్రణమిల్లి వాటిని వదలక పట్టుకుని ఉంటాడు. అప్పుడు శ్రీభగవన్నారాయణుడు ఆతని లేవనెత్తి తల్పము పయికి తీసుకుని తన అంకమున కూచో బెట్టుకొని నాయనా! నీ వెవరు అని ప్రేమతో అడుగుతాడు. నేను బ్రహ్మవంటి వాడిని అంటాడు. అప్పుడు శ్రీమన్నారాయణుడు అక్కున చేర్చుకొని మరింత కృపాదృష్టితో చూస్తాడు. ఆ దయావీక్షణముతో జీవునిలో ఓ గొప్ప ఆనందము కలుగుతుంది. ఆ హర్షాతిరేకముతో అతనిలో, జీవునిలో భగవంతునికి సర్వదేశకాలావస్థలలో చేయదగిన సేవలను చేయడంలో ఉత్సాహము, శక్తి ఉరకలువేస్తుంది. ఇట్లా ఆ జీవునిలో గుణాష్టకము కలుగుతుంది.

జీవుడు అట్లాగా అనంతకాలందాకా బ్రహ్మను – నారాయణుని అనుభవిస్తూ అనగా శ్రీమన్నారాయణుని సేవచేస్తూ గడుపుతాడు. ముక్తజీవుడు బ్రహ్మతో సామ్యం పొందుతాడు అని కొన్ని శ్రుతులు చెప్తుతున్నవి కదా అంటే ఆ శ్రుతుల జీవుడు బ్రహ్మపొందినట్టు భోగాలు అనుభవిస్తాడు అని తెలుపుతున్నవని అభిప్రాయము. ఆయనతో సమానమయిన భోగములను పొందుతాడు అది ఒక్క జగద్ వ్యాపారము తప్ప, అంటే బ్రహ్మలాగ జగత్తును సృష్టించడు, భోగమాత్రములో సామ్యము అని తాత్పర్యము. ఆ ముక్తజీవులు స్వేచ్ఛానుసారము అనేకములయిన శరీరములను ధరిస్తారు. నానాలోకాల్లో సంచరిస్తారు.

వి: ముక్తునకు బ్రహ్మసామ్యము గురించి చిన్నచర్చ. ముండక ఉపనిషత్తు 'నిరఞ్జనః పరమం సామ్యముపైతి' అని ముక్తజీవుడు ప్రాకృతిక దోషములు లేని వాడయి పరమాత్మతో సమానుడు అవుతాడు. పురుషవిద్యలో జీవాత్మను సత్యకామః సత్యసఙ్కల్పః అని వర్ణించడము జరిగినది. మమ



సాధర్మ్యమాగతాః గీ 14 అని ఉన్నది. ఇట్లా ముక్తజీవులకు బ్రహ్మసామ్యము నిరూపించడము జరిగినది. దీనికి విశిష్టాద్వైతుల సమాధానము – శాస్త్రములలో జీవునికి బ్రహ్మసామ్యాపత్తి చెప్పబడినది. బాదరాయణ మహర్షి భోగమాత్ర సామ్యలిఙ్గాచ్చ 4-4-21 అని ముక్తావస్థలో జీవునకు బ్రహ్మకు భోగమాత్ర సామ్యము ఉంటుంది అని వివరించారు. దీని బలపరచేది 'సోఽశ్నుతేసర్వాన్ కామాన్ సహ బ్రహ్మణావిపశ్చితా' అనుశ్రుతి 'జగద్ వ్యాపారవర్జం ప్రకరణాద సన్నిహితత్వాచ్చ' బ్ర.సూ.4-4-17 అనుదానిలో ముక్తుని లక్షణము జగద్ వ్యాపారము లేకపోవుట. సంపూర్ణజగత్తు యొక్క సృష్టి స్థితి ప్రవృత్తి ముక్తుని లక్షణము అయితే 'యతో వా ఇమాని భూతాని జాయన్తే యే న జాతాని జీవన్తి యత్ప్రయన్తి అభిసంవిశన్తి తద్విజిజ్ఞాసస్వ తద్ బ్రహ్మ' తై.ఉ.భృ.వ.1లో చెప్పిన విషయాన్ని 'జన్మా ద్యస్య యతః' బ్ర.సూ.1.1.2 అనుదానితో చెప్పిన బ్రహ్మ లక్షణము అని చెప్పడము వీలుపడదు. యతోవా శ్రుతి బ్రహ్మలక్షణ ప్రక రణములో ఉన్నది. ముక్తజీవునిలక్షణ ప్రకరణములో లేదు, కనుక జీవునకు బ్రహ్మకు సామ్యమల్లా భోగమాత్రములోనే కాని సర్వవిధములయిన సామ్యము కాదు.

మోక్షము అంటే విశిష్టాద్వైతము ప్రకారము సాయుజ్యమే కాని సాలోక్యము, సామీప్యము, సారూప్యం కాని కావు. అవి అన్ని స్వర్గము వంటి ఫలాంతరములే. 'సయుగ్భావో హి సాయుజ్యం భోగసామ్యం' – ఇద్దరుగా ఉండడమే 'కలిసి ఉండడమే' భోగసామ్యమే సాయుజ్యము 'బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి' – ముం.3.2.9కి ఇదే సామ్యముతో తాత్పర్యము.

**లోకేషు విష్ణోర్నివసన్తి కేచి**
**త్సమీపమృచ్ఛన్తి చ కేచిదన్యే**
**అన్యే తు రూపం సదృశం భజన్తే**
**సాయుజ్యమన్యే తు స మోక్ష ఉక్తః'**

అని కూడ చెప్పడం జరిగినది. శ్లోకము స్పష్టార్థము.

**మోక్షం సాలోక్యసారూప్యం ప్రార్థయే న కదాచన ।**
**ఇచ్ఛామ్యహం మహాబాహో సాయుజ్యం తవ సువ్రత ॥**

కనుక మోక్షమంటే సాయుజ్యమే. తారతమ్యము లేదు. కాని వాటిల్లో కూడ లక్షణద్వారా మోక్షశబ్దము ప్రయోగాన్ని మనం చూస్తుంటాము.

## ముక్తజీవస్య సర్వలోకసఞ్చరణత్వప్రతిపాదనమ్:

మూ: నను ముక్తస్య అనావృత్తిప్రతిపాదనాత్ అస్మిన్ లోకే సఞ్చారః కథమితి న శఙ్కనీయమ్. కర్మకృతస్యైవ నిషేధాత్. స్వేచ్ఛయా సఞ్చరణస్యోప పత్తేః అతో ముక్తో భగవత్సఙ్కల్పాయత్తః స్వేచ్ఛయా చ సర్వత్ర సఞ్చరతి.

అ: 'న చ పునరావర్తతే' ఛాం.ఉ.8–15–9 ముక్తజీవుడు మళ్ళీ తిరిగిరాడని తెలుపుతున్నది కనుక మళ్ళీ ఈలోకంలో ఎట్లా సంచరిస్తాడు అని ప్రశ్న. ఇట్లా ప్రశ్నించడంలో అర్థం లేదు. శ్రుతులు ముక్తజీవునకు కర్మవలన ఏర్పడే పునరావృత్తి లేదని వర్ణిస్తున్నాయి. కాని అతడు తనస్వేచ్ఛతో సంచరించడాన్ని కాదుకనుక ప్రశ్నకు అవకాశము లేదు. ముక్తజీవుడు భగవత్సంకల్పమునకు అధీనుడయి స్వేచ్ఛగా అంతట తిరుగుతుంటాడు.

## నిత్యజీవానాం స్వరూపమ్:

మూ: నిత్యా నామ కదాచిదపి భగవదభిమత విరుద్ధాచరణాభావేన జ్ఞానసఙ్కోచప్రసఙ్గరహితా అనన్తగరుడ విష్వక్ సేనాదయః. తేషా మధికారవిశేషా ఈశ్వరస్య నిత్యేచ్ఛయైవ అనాదిత్వేన వ్యవస్థాపితాః. ఏతేషా మవతారాస్తు భగవదవతారవత్ స్వేచ్ఛయైవ. ఏవం బద్ధముక్త నిత్యభేదభిన్నో జీవో నిరూపితః.

ఇతిశ్రీవాధూలకులతిలక – శ్రీమన్మహాచార్యప్రథమదాసేన
శ్రీనివాసదాసేన విరచితాయాం యతీన్ద్రమతదీపికాయాం
శారీరకపరిభాషాయాం జీవనిరూపణం నామ అష్టమోఽవతారః ॥

అ: ఎప్పుడయినా భగవంతుని అభిమతానికి విరుద్ధమయిన ఎట్టి పనిచేయనివారు, భగవంతుని కనుసన్నలలో మెలిగే వారు మనోనుకూలురు.



అందువలన జ్ఞానసంకోచ వికాసముల ప్రసక్తి లేనివారు, భక్తి ప్రపత్తి ప్రపూర్ణులు నిత్యజీవులు. వారు అనంతుడు, గరుడుడు, విష్వక్సేనుడు మొదలగువారు. వారు చేయవలసిన పనులు అధికారములు అన్ని భగవంతుని నిత్యేచ్ఛాప్రకారమే నిశ్చయింపబడి జరుగుతుంటవి. భగవంతుడు స్వేచ్ఛతో అవతారములు దాల్చినట్లు నిత్యజీవులు కూడ స్వేచ్ఛతోనే అవతారములు తాల్చుతారు కాని కర్మవశమున కాదు. ఇట్లా జీవులు బద్ధులు, ముక్తులు, నిత్యులు మూడు రకాలని వారి స్వరూప నిరూపణము చేయడము జరిగినది.

శ్రీవాధూలకులతిలకుడయినట్టి శ్రీమన్మహాచార్యులదాసుడయిన

శ్రీనివాసాచార్య ప్రణీతమయిన యతీంద్రమతదీపిక

అను శారీరకపరిభాషయందు జీవనిరూపణము

అను ఎనిమిదవ అవతారము సమాప్తము.

* * *

## ఈశ్వరస్య స్వరూపనిరూపణమ్:

మూ: అథేశ్వరో నిరూప్యతే. సర్వేశ్వరత్వం, సర్వశేషిత్వం, సర్వకర్మ సమారాధ్యత్వమ్, సర్వఫలప్రదత్వమ్, సర్వాధారత్వమ్, సర్వ కార్యోత్పాద కత్వమ్, (సర్వశబ్దవాచ్యత్వమ్), స్వజ్ఞానస్వేతరసమస్త ద్రవ్య శరీరత్వ మిత్యాదీనీశ్వర లక్షణాని.

అ: జీవుని నిరూపించిన పిదప, క్రమప్రాప్తమయిన ఈశ్వర నిరూపణమును గ్రంథకర్త చేయుచున్నాడు.

అందరిని నియమించు శక్తి మత్త్వము, అన్నిటికి శేషిత్వము, (అనగా యజమాని అగుట) అన్ని పనులచే పూజింపబడుట, సర్వకర్మలకు ఫలము ఈయగల్గియుండుట, అన్నిటికి ఆధారము అగుట, అన్ని కార్యములను చేయగల్గియుండుట, అన్నిశబ్దములకు అర్థము అగుట, తన జ్ఞానము తప్ప ఇతరద్రవ్యములన్నీ శరీరముగా గలిగి యుండుట మొదలగునవి ఈశ్వరుని యొక్క లక్షణములు.

వి: లక్షణము రెండు విధాలుగా ఉంటుంది. స్వరూపలక్షణము, తటస్థలక్షణము అని. స్వరూపలక్షణము యొక్క సంబంధము లక్ష్యము యొక్క స్వరూపముతో ఉంటుంది. తటస్థలక్షణము యొక్క సంబంధము లక్ష్యము యొక్క స్వరూపముతో ఉండక తటస్థముగా ఉంటుంది. సర్వేశ్వరత్వము – ఇది స్వరూప లక్షణము. ఈశ ఐశ్వర్యే అను ధాతువునుండి వరట్ ప్రత్యయముతో ఈశ్వరశబ్దము ఏర్పడుతుంది. అట్లానే అశువ్యాప్తౌ ధాతువునుండి వరట్ ప్రత్యయము, అకారమునకు ఈకారముతో కూడ ఈశ్వరశబ్దము సిద్ధిస్తుంది. మొదటి దానిని బట్టి సంపూర్ణజగత్తు ఎవరికి ఐశ్వర్యమో అతడు ఈశ్వరుడని రెండవదానినిబట్టి జగత్తు అంతటా వ్యాపించి ఉండువాడని అర్థము తెలుస్తుంది. 'విష్ణో రేతా విభూతయః' అని విష్ణు పురాణ వాక్యము. గీతలోని విభూతి యోగము మొదలయినవి ఈ విషయాన్నే బలపరుస్తున్నవి. 'ఈశావాస్యమిదం సర్వమ్' మొదలయిన శ్రుతివాక్యాలతో సర్వవ్యాపకత్వము సిద్ధిస్తున్నది.



సర్వశేషిత్వమ్: 'యథేష్ట వినియోగార్హత్వమ్ శేషత్వమ్' – అనగా యజమాని తన ఇష్టము వచ్చినట్టు ఉపయోగించుకొనగలిగియున్న పదార్థమునకు శేషము అని, అది కలవాడు శేషి అని, అన్ని శేషములుగా కలవాడు సర్వశేషి అని తెలుస్తున్నది. సంపూర్ణ జగత్తునుండి లీలారసమును భోగరసమును భగవానుడు పొందుతాడు కనుక సర్వశేషి అతడు.

'సర్వకర్మ సమారాధ్యత్వమ్' – శరీరమును పూజించుటద్వారా శరీరములో ఉన్న ఆత్మను పూజించడము అవుతుందో ఆ ప్రకారము ఆ యా దేవతలను పూజించినా ఆ యా దేవతలు శరీరముగా కలిగిన సర్వదేవ శరీరకుడయిన పరమాత్ముని పూజించినట్టు అవుతుంది. 'జగత్ సర్వం శరీరం తే' అని కదా సూక్తి (మరి ఇలాటప్పుడు జీవులను దేవతాంతరములను పూజించువాడు అని ధర్మపరజీవుని భేదముగా చెప్పడంలోని ఆంతర్యము ఏమి? కేవలము బుద్ధి వైశద్యానికేనేమో – అ.)

'స్వజ్ఞానేతర సమస్తద్రవ్య శరీరకత్వమ్' : తన, ధర్మభూతజ్ఞానము, తనస్వరూపము తప్ప ఇతర ద్రవ్యములయిన శరీరములలో ఆత్మరూపుడుగా నున్నవాడు, ఈశ్వరుడు అని లక్షణము. ఈ లక్షణములో రెండింటిని వదలి పెట్టి మిగత ద్రవ్యములన్ని శరీరముగా కలవాడు అనిలక్షణము. అవి ఒకటి తనధర్మభూత జ్ఞానము, రెండవది తనస్వరూపము. ఈశ్వరుడు సమస్త ద్రవ్యములను తన శరీరముగా చేసుకొని ఆత్మరూపమున వాటిలోపల ఉంటాడు. ఆ ద్రవ్యాల్లో ఈశ్వరుని ధర్మభూతజ్ఞానము ఈశ్వరుని స్వరూపము చేరవు. ఈశ్వరుని స్వరూపానికి ఈశ్వరుడు ఆత్మ కాడు. ఆత్మకు శరీరానికి భేదముండాలిగద. కాని ఆత్మస్వరూపము ఒకటే, భేదము లేదు. ఈశ్వరుడు తన ధర్మభూతజ్ఞానానికి ఆత్మ కాడు. చేతనుడు తన ధర్మభూతజ్ఞానము ద్వారా దేనిని అధిష్ఠించి ఉంటాడో అది అతని శరీరము. ఈశ్వరుడు తన ధర్మభూత జ్ఞానము ద్వారా ధర్మభూత జ్ఞానాన్ని అధిష్ఠించి ఉండడు కనుక ధర్మభూతజ్ఞానము అతని శరీరము కాదు. ఈశ్వరునిలో రెండు ధర్మభూత జ్ఞానాలుండవు కద. ఇవి అన్ని స్వరూపలక్షణాలు.

## ఈశ్వరస్య జగత్కారణత్వ సమర్థనమ్:

మూ: అయమీశ్వరః సూక్ష్మచిదచిద్విశిష్టవేషేణ జగదుపాదాన కారణం భవతి. సఙ్కల్పవిశిష్టవేషేణ నిమిత్తకారణం కాలాద్యన్తర్యామివేషేణ సహకారి కారణం చ. కార్యరూపేణ వికారయోగ్యం వస్తూపాదాన కారణమ్. కార్యతయా పరిణామయితృ నిమిత్తకారణమ్. కార్యోత్పత్త్యు పకరణం వస్తు సహకారి. యద్వా ఉత్తరోత్తరావస్థావిశిష్ట స్వరూపాపేక్షయా తదనుగుణ నియత పూర్వభావ్యవస్థావిశిష్టం యత్తదుపాదానమ్. యథా – ఘటత్వావస్థా విశిష్టమృద్ ద్రవ్యాపేక్షయా పిణ్డత్వావస్థావిశిష్టం తదేవ ద్రవ్యమ్. పరిణామౌన్ముఖ్యాతిరిక్తా కారేణాపేక్షితం కారణం నిమిత్తకారణమ్. అస్మిన్పక్షే సహకారి కారణస్య నిమిత్తేన్తర్భావః. ఏవం త్రివిధకారణపక్షే కారణద్వయపక్షే చ కారణలక్షి తత్త్వాదఖిల జగత్కారణత్వం భగవతో నారాయణస్యైవ సమ్భవతి.

అ: ఈశ్వరుడు సూక్ష్మచిదచిద్వస్తువిశిష్ట రూపముతో జగత్తునకు ఉపాదానకారణముగా ఉన్నాడు. సంకల్పవిశిష్టరూపముతో జగత్తునకు నిమిత్త కారణము అవుతున్నాడు. కాలము, అంతర్యామి రూపముతో జగత్తునకు సహకారి కారణముగా ఉన్నాడు. కార్యరూపముగా మార్పుచెందే యోగ్యమయిన వస్తువు ఉపాదానకారణము అవుతుంది. కార్యముగా మార్పుచెందింపజేసేది, ఉపాదానకారణమును కార్యంగా మార్చేది ఏదో అది నిమిత్తకారణము అవుతుంది. కార్యము ఉత్పత్తికి సామగ్రీరూపము అయినది. ఆ కార్యానికి సహకారి కారణము అవుతుంది. మరియొక విధముగా చెప్పవచ్చును దీనిని. ఉత్తరోత్తరముగా జరుగబోవు కార్యము యొక్క దశలకు తగినట్లు దశతో కార్యము కంటే నియతముగా ముందుండడము ఉపాదానము. ఉదాహరణానికి ముందర కుండ కాబోయే మట్టికి, తపకుండ ముందు ఉండే మట్టిముద్దలు ఉపాదాన కారణము. పరిణామము కలుగుటకు ఉన్ముఖమయిన దాని కంటే అతిరిక్తముగా అపేక్షితమయిన కారణము నిమిత్తకారణము. కుండలు చేయువాడు నిమిత్త



కారణము. రెండు కారణాలు ఒప్పుకునే వారి పక్షంలో సహకారికారణము నిమిత్తములో అంతర్భవిస్తుంది. ఈ ప్రకారముగా మూడుకారణాలు, రెండు కారణాలు ఒప్పుకునే పక్షంలో కూడ కారణ లక్షణములు ఉన్నందున ఈశ్వరునిలో జగత్కారణత్వము అనే లక్షణము కుదురుతుంది.

వి: ప్రపంచములో మూడుకారణములు విడివిడిగా ఉండటము చూస్తుంటాము. అవి ఉపాదానకారణము, నిమిత్తకారణము, సహకారి కారణము. అయితే ఒక్క బ్రహ్మకే ఇవి మూడు ఎట్లా సిద్ధిస్తవి అని ప్రశ్న. ప్రపంచములో ఏ ఒక్కటి మూడుకారణములు అయినది లేకపోవచ్చును. కాని బ్రహ్మ జగత్తుకు ఈ మూడు కారణములు కావచ్చును. 'స దేవ సోమ్య ఇదమగ్ర ఆసీదేకమేవా ద్వితీయమ్' అని శ్రుతి కారణత్వమును బోధిస్తున్నది. ఓయి సోమ్యుడా! శ్వేతకేతూ! నామరూపములచే విభక్తమయిన అనేక విధములయిన జగత్తు సృష్టికి పూర్వము నామరూప విభాగము లేనందున ఒకటి గానే ఉండెను. ఆ ఒకటి సద్రూపము వేరే అధిష్ఠానము లేదు. ఈ శ్రుతిలోని సత్ పదము నామ సంబన్ధయోగ్యత్వము అనునట్టి సత్త్వమును ప్రవృత్తి నిమిత్తముగా చేసుకొని పరమాత్మరూపమయిన అర్థమును తెలుపుతుంది. ఈ సత్ శబ్దము విశేష్యమయిన పరమాత్మను చెప్పునదే అయినను కారణ విషయత్వ సామర్థ్యముచేత కారణముగా, యోగ్యత అను గుణవిశిష్టుడు ప్రకృతి పురుష కాల శరీరాత్మకుడు అయిన పరమాత్మను బోధిస్తుంది. ఒక పదము ఆ అర్థాన్ని బోధించడానికి ఆ పదము రావడానికి కారణమయిన దానిని ప్రవృత్తినిమిత్తము అంటారు. పయిశ్రుతి ఛాం.ఉ.6.2.1.; 'బ్రహ్మ వా ఇదమేకమేవాగ్ర ఆసీత్', బృ.ఉ.1.4.10.; 'ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్' ఐ.1.1.మొదలగు శ్రుతులు దీనినే బోధిస్తున్నాయి.

బౌద్ధులు' జైనులు పరమాణువులకే జగత్కారణత్వము ఒప్పు కుంటారు. వైశేషికులు పరమాణువులకు ఉపాదానకారణత్వమును, ఈశ్వరునికి నిమిత్త కారణత్వమును అంగీకరిస్తారు. బౌద్ధులు వైశేషికులు పృథివ్యప్తేజో వాయువు లను నాలుగు విధాల పరమాణువులకు అర్హతులు ఒక (రూపమయిన)

పరమాణువులకే ఆ కారణత్వమును చెప్పుతారు. ఒక్క ఈశ్వరుడికే ఎట్లా కారణత్వము అని ప్రశ్న. పరమాణువులో ప్రమాణము లేదు. మహత్వము లేదు కనుక పెద్దవి కావు కనుక ప్రత్యక్షము కావు. సదేవ ఇత్యాది శ్రుతి విరోధము కలుగుతుంది కనుక అనుమానం ప్రమాణం కాదు, ఆగమము కాదు, చెప్పడం లేదు, పయిగా ఆగమము ఈశ్వరునికే జగత్కారణత్వము ఉద్ఘోషిస్తున్నది. ఇతర ప్రమాణాలు ఈ మూడింటిలోనే చేరినవి.

ఇక సాంఖ్యులు: ఒకే రుచి కలిగిన నీటిని మేఘాలు వర్షిస్తాయి. కాని అదేనీరు కొబ్బరి, మామిడి, వెలగ మొదలయిన వాటిలో అనేక విధాలుగా మారుతుంది. అట్లాగే పరిణామమే స్వభావముగా కలిగినట్టి, ఎవరు అధిష్ఠించి ఉండనట్టి ప్రధానమునకే గుణవైషమ్యము కారణముగా విచిత్ర పరిణామము జరుగుతుంది అని వాదిస్తారు. ఇది సరికాదు. ప్రధానము అచేతనము విచిత్ర జగదాకారముగా పరిణామానికి అయినా సంకల్పము హేతువు. సంకల్పము చేతనమునకే వీలవుతుంది. దాని స్వభావమే అంత అంటే ప్రలయము వీలుకాదు. జీవవిశేషుడు – ఎవరయినా జీవుడు కారణం కాదు. అతడు కర్మపరతంత్రుడు అవుతాడు కనుక, నైయాయికులు అసత్ కార్యవాదులు, సాంఖ్యులు పరిణామ వాదులు. విశిష్టాద్వైతులు సత్ కార్యవాదులు. వారు ఉత్పత్తికి ముందుకూడ కార్యము కారణములో ఉంటుంది. ఆ సమయంలో దాని పేరు రూపము విడివిడిగా కారణముకంటే విడిగా ఉండవు. 'ఉత్పత్తేఃప్రాక్ అవిభక్తనామరూపం కార్యం కారణకలాపేన ద్వారా విభక్తనామరూపతయా ఉత్పద్యతే' అని ఒప్పుకుంటారు. శ్రుతిలోని ఏవకారము అసత్ కార్యమును నిషేధిస్తున్నది. ఏకమేవలోని ఏవకారము బహుస్యామ్ అని సృష్టింపబడబోయేకార్యము బహుత్వము అవస్థ ముందు లేదని తెలుపుతున్నది. ఏకం పదము ద్వారా జగత్తు యొక్క ఉపాదానకారణత్వము బోధిస్తున్నది. అద్వితీయం పదము బ్రహ్మవ్యతిరిక్తమయినది ఏది జగత్తుకు నిమిత్త కారణము గాలేదు అని ప్రతిపాదిస్తున్నది. 'తదైక్షత తత్తేజోఽసృజత' ఇత్యాదులలో తత్ శబ్దముతో



సత్‌శబ్దవాచ్యుని తెలుపుతూ బ్రహమనే జగత్తుకు నిమిత్తకారణమని బోధిస్తున్నది. ఏకం అద్వితీయం అనేది రెండుపదాలద్వారా బ్రహ్మను జగత్తుకు అభిన్న నిమిత్తోపాదానకారణము అని తెలుపుతున్నది.

యతీంద్రమతదీపికాకారులు ఈ భావాన్నే సూక్ష్మచిదచిద్ వస్తు శరీరము కలిగిన బ్రహ్మ జగత్తుకు ఉపాదానకారణము అని చెప్పారు. సూక్ష్మచిదచిద్ వస్తువును శరీరముగా కలిగి ఉండటమే బ్రహ్మయొక్క అవిభక్త నామరూపవస్థ. సూక్ష్మచిద చిద్వస్తు శరీరకుడయిన బ్రహ్మసంకల్ప విశిష్ట రూపముతో జగత్తునకు నిమిత్త కారణము అవుతాడు. 'ఏకోఽహం బహుస్యామ్' అని నామరూపావస్థా సహితుడు గాని, బ్రహ్మఏకః, ఆ అవస్థను వదలి నామ రూపములు గలిగిన అవస్థను పొందుతాను అని సత్య సంకల్పము చేస్తాడో ఆ సంకల్పవిశిష్టుడయిన బ్రహ్మ నిమిత్తకారణము. ఆ బ్రహ్మయే కాలము రూపముగా మిగిలినవాటిలో కూడ అంతర్యామి రూపముగా సహకారి కారణము అవుతాడు.

ఉపాదాన కారణ లక్షణము: కార్యముగా మార్పుచెందే యోగ్యత ఉన్నవస్తువును ఉపాదానకారణము అంటారు. కుండను గురించి మట్టి ఉపాదాన కారణము. మట్టియొక్క వికారమే, మార్పే, కుండ. బ్రహ్మకు ఉపాదాన కారణమంటే బ్రహ్మను కూడ వికారము గల ద్రవ్యముగా ఒప్పుకోవాల్సి వస్తుంది. 'అవికారాయ శుద్ధాయ' అని చెప్పిన నిర్వికారత్వము దెబ్బ తింటుంది కద అంటే జవాబు – చిదచిద్రూపవిశేషణ విశిష్టుడయిన బ్రహ్మకు జగద్రూపముగా పరిణామము కలిగినప్పటికి విశేష్యమయిన స్వరూపానికి వికారము ఏ పరిణామము లేదు అని. దీనిని గ్రంథకారులు ఉపాదాన కారణానికే ఇంకోలక్షణము చెప్పి పరిహరించారు. యద్వా అని అదే ద్రవ్యము ఉపాదానకారణము అవుతుంది. ఏది తన తరువాతి అవస్థకంటే అవ్యవ హితముగా, ఆ కార్యమునకు అనుకూలమయిన అవస్థ కలిగిన ద్రవ్యము అవుతుందో, ఉదాహరణము కుండకు మట్టి ఉపాదానకారణము.

మట్టి – ముద్ద – కుండ ఇవి ఉత్తరోత్తర అవస్థలు. మట్టి ఉపాదాన కారణము ఎందు వలన? ముద్దఅయిన తరువాత కుండ అవుతుంది. అది కుండ కావలిసిన అవస్థకు అవ్యవహితముగా సమయంలో ఎట్టి అడ్డులేక వెనువెంటనే ముందుగా ఉండే అవస్థ – ముద్దగా ఉంటుంది. అది కుండగా అయ్యే వీలును కల్పిస్తుంది కూడ. ఇట్లాగే విభక్తనామరూపార్హము అయినది కార్యత్వావస్థ. దానికంటే ముందుగా (రెంటి మధ్యలో ఎట్టిసమయము జరిగిపోకుండ) అవ్యవహితముగా ఉండునట్టిది, కార్యమునకు అనుకూల మయినట్టిది బ్రహ్మయొక్క అవిభక్త నామ రూపావస్థ. ఈ దశకలిగిన బ్రహ్మ యే జగత్తుకు ఉపాదానకారణము అవుతాడు. అవస్థావిశిష్టమయిన అవ స్థావత్వమే ఉపాదానము.

ఈ వైశిష్ట్యము అనునది స్వావ్యవహిత పూర్వత్వము, స్వసమానాధి కరణ్యము అను రెండు సంబంధాలతో ఉంటుంది. అవస్థ అంటేకొత్తగా వచ్చినది వేరుగా ఉండనిది అన్నమాట. ఇట్లా స్థూలచిదచిద్విశిష్ట కార్యావ స్థావస్థితు డయిన భగవంతునియందు సూక్ష్మచిదచిద్ నియంతృత్వ విశిష్టత్వము అనే పూర్వావస్థతో సంబంధము ఉన్నందున స్వరూపము మారనప్పటికినీ భగవంతునకు జగత్తునకు ఉపాదానకారణత్వము సిద్ధిస్తుంది.

నిమిత్తకారణలక్షణము: ఉపాదానమును కార్యరూపముగా మార్పు చెందింపజేసేది, కార్యానికి నిమిత్తకారణము అవుతుంది. కుండ అనే కార్యానికి మట్టి ఉపాదానకారణము. ఉపాదానవస్తువును (మట్టిని మట్టిముద్దను) కార్యరూపముగా కుండగా పరిణామము – మార్పు చేస్తాడో ఆ కర్త కుమ్మరియే నిమిత్తకారణము. సంకల్పవిశిష్టుడు సూక్ష్మచిదచిద్ వస్తు శరీరకుడయిన బ్రహ్మయే జగత్తురూప పరిణామమును చేస్తాడు కనుక జగత్తుకు నిమిత్తకారణము అతడే.

'పరిణామౌన్ముఖ్యాతిరిక్తాకారేణాపేక్షితం నిమిత్తకారణం' అని యతీంద్ర మతదీపికా కారులు మరియొక లక్షణమును చెప్పారు. పరిణామమునకు



సిద్ధముగా ఏ కారణముంటుందో దానికంటే భిన్నమయిన ఆకారముతో ఉత్పత్తికి అపేక్షితమయినది అవసరమయినది నిమిత్తకారణము. కుండగా మారే కార్యరూపోన్ముఖమయిన పిండత్వావస్థా విశిష్టమయిన మట్టి అనే ద్రవ్యము ఉందో, దానికంటె భిన్నమయిన ఆకారము కలిగి కుండ అనే కార్యానికి అవసరమయిన కారణము కుమ్మరి, చక్రము, దండము మొదలయినవి అవి నిమిత్తకారణములు. సహకారి కారణములన్నీ ఈ నిమిత్త కారణములోనే చేరి పోతాయి. పయిన చెప్పిన కుమ్మరి, చక్రము, దండము మొదలయినవి లేకుండ మట్టిముద్ద కుండగా మారదు కనుక అవి అవసరము, అపేక్షితము.

ఈ లక్షణము ఒప్పుకునే వారు రెండు కారణములు అని ఒప్పుకునే వారు. ప్రకృతము ఉదాహరణలో చూద్దాము. జగత్తు కార్యము. కార్యరూపముగా జగత్తు పరిణామము చెందుటకు ఉన్ముఖమయిన సూక్ష్మచిదచిద్ విశిష్టబ్రహ్మరూపమయిన ఉపాదాన కారణమునకంటే భిన్న ఆకారము కలిగిఉండి, జగత్తు యొక్క ఉత్పత్తికి అవసరమయిన కారణము సంకల్ప విశిష్టమయిన కాలాద్యంతర్యామి బ్రహ్మ అను రెండు రూపముల బ్రహ్మ జగత్తునకు నిమిత్తకారణము అనుట స్పష్టము. ఉపాదానము నిమిత్తము రెండు ఒకటియయిన బ్రహ్మనే కారణము గనుక బ్రహ్మ జగత్తునకు అభిన్ననిమిత్తోపాదాన కారణము. ఈ విషయాన్ని గ్రంథకర్త కారణద్వయ వాదులను దృష్టిలో పెట్టుకుని చెప్పినట్టున్నారు.

సహకారికారణము: కార్యోత్పత్తికి సాధనమయిన ఉపకరణమయిన వస్తువు సహకారికారణము అని లక్షణము. కార్యోత్పత్తిలో ఉపాదానము మరియు నిమిత్తము అను వాటికంటె వేరయిన సామగ్రి ఏదయితే ఉపయోగ పడుతుందో సహకరిస్తుందో దానిని సహకారీకారణము అని వివరణము. కుండ అనుకార్యం గురించి మట్టి, కుమ్మరిగా కుండ చక్రము, దండము మొదలయిన వస్తువులు దేశము, కాలము గూడ సహకారి కారణములు.

ఇట్లాగే జగత్తు అనే కార్యం గురించి దాని ఉపాదాన నిమిత్త కారణములకంటే వేరయిన కాలాదులలో ఉండేట్టి అంతర్యామిత్వ విశిష్టు డయిన మొదలయినవి, సహకారి కారణములు. ఇట్లా రెండు కారణాలు ఒప్పుకున్నా మూడుకారణాలు అని వాదించినను, రెండు పక్షములలో కూడ జగత్తుకు సిద్ధించే ఒకే ఒక్కకారణము భగవన్నారాయణుడే ననటంలో సందేహం లేదు. పూర్వమే ఉదాహరించిన 'యతోవా ఇమాని భూతాని జాయన్తే' యేన జాతాని జీవన్తి' యత్ ప్రయన్త్యభిసంవిశన్తి. తద్వి జిజ్ఞాసస్వ, తద్ బ్రహ్మ' అను తైత్తిరీయశ్రుతి, 'ఏకోహవై నారాయణ ఆసీత్, న బ్రహ్మా నేశానః' అను మహోపనిషత్ ఈ విషయాన్నే గట్టి పరుస్తున్నవి: జగత్కారణము బ్రహ్మ అని ఆ నారాయణుడే బ్రహ్మ అని.

## నారాయణే జగత్కారణత్వస్య పర్యవసానప్రతిపాదనమ్:

మూ:- నను, కథం నారాయణే కారణత్వ పర్యవసానమితిచేత్, ఉచ్యతే; న్యాయసహకృత వేదాన్త వాక్యవిచారేణైవం పర్యవస్యతి. తద్యథా – అదౌ తావత్, ప్రకృతేర్జగత్కారణత్వం నోపపద్యతే, ఈక్షితృత్వాద్యభావాత్. ఛాన్దోగ్యే తావత్ సదాకాశప్రాణ శబ్దవాచ్యానాం జగత్కారణత్వం ప్రతీయతే. సర్వ శాఖాప్రత్యయన్యాయేన కారణవాక్యానామేక విషయత్వే ప్రతిపాదయితవ్యే ఛాగపశున్యాయేన సామాన్యవాచకానాం సదాదిశబ్దానాం విశేషే బ్రహ్మణి పర్యవసానం వక్తవ్యమ్. ఏవముక్తన్యాయేన బ్రహ్మ శబ్దస్య తైత్తిరీ యోక్తాత్మ శబ్దవాచ్యే పర్యవసానే ఆత్మ శబ్దవాచ్యః కః? ఇత్యాకాఙ్క్షాయాం శ్రుతి ప్రసిద్ధ ఇన్ద్రో వా, తథా ప్రసిద్ధేఽగ్నిర్వా, ఉపాస్యత్వేన ప్రసిద్ధః సూర్యో వా, కారణత్వేనోక్తః సోమో వా, అభీష్ట ప్రదత్వేనోక్తః కుబేరో వా, యమో వా, వరుణోవే తి సంశయే ఏతేషాం కర్మవశ్యత్వ – పరిచ్ఛిన్నైశ్వర్యవత్త్వ సంహార్యత్వ శ్రవణాన్నైతే జగత్కారణ భూతాః, కిన్తు శ్వేతాశ్వతరే శివస్య కారణత్వం భాసతే. ఏవమథర్వ శిఖాయాం శమ్భుశబ్దవాచ్యస్య ధ్యేయత్వం కారణత్వం చ



భాసతే. తథైవాథర్వశిరసి రుద్రశబ్దవాచ్యస్య సర్వాత్మకత్వముచ్యతే. తైత్తిరీయే హిరణ్యగర్భ స్య జగత్కారణత్వం ప్రతీయతే. అత్రాపి సామాన్య విశేషన్యాయాత్ శివశమ్భురుద్ర శబ్దానాం హిరణ్య గర్భశబ్దవాచ్యే విశేషే పర్యవసానం యుజ్యతే. శివశబ్దస్య శివమస్తు సర్వజగతాం శివం కర్మాస్తు, శివాస్తే సన్తు పన్థానః ఇత్యాదిభిర్మఙ్గలవాచిత్వమ్, రుద్ర శబ్దస్య అగ్ని వాచకత్వమ్. ఏవం మహేశ్వర శమ్భ్వాదిసామాన్య శబ్దా అప్యవయవ శక్త్యా చతుర్ముఖే పర్యవస్యన్తి. కారణవాచిశివాది శబ్దానాం ముఖ్యవృత్త్యా రుద్రపరత్వం కిం న స్యాదితి న శఙ్కనీయమ్. రుద్రస్య చతుర్ముఖాదుత్పత్తి శ్రవణాత్ అనపహత పాప్మత్వ శ్రవణాచ్చ న రుద్రస్య కారణత్వమ్. అతో హిరణ్యగర్భ ప్రజాపతి స్వయంభ్వాది శబ్దవాచ్యే చతుర్ముఖే శివాదిశబ్దాః పర్యవస్యన్తి. ఏవం మహోపనిషన్నారాణో పనిషత్సు బాలోపనిషన్మైత్రాయణీయ పురుష సూక్త నారాయణానువాకాన్తర్యామి బ్రాహ్మణాదిషు నారాయణస్యైవ పరమ కారణత్వ – సర్వశబ్దవాచ్యత్వ మోక్ష ప్రదత్వ జగచ్ఛరీరకత్వాది ప్రతిపాదనాత్ స్వయమ్భూ హిరణ్యగర్భ ప్రజాపతి శబ్దానాం నారాయణే పర్యవసానం యుక్తమితి నారాయణ ఏవాఖిల జగత్కారణం సర్వవిద్యావేద్యశ్చ.

అ: శ్రీమన్నారాయణునిలోనే జగత్కారణత్వము అని ఎట్లా సిద్ధిస్తుంది. ఇంకా అనేకం దేవతలున్నారుగద అని ప్రశ్న ఉదయిస్తుంది. దీనికి సమాధానము –

న్యాయములతో బలపరుపబడిన ఉపనిషత్ వాక్యములతో వాటి విచారము వల్ల ఈ విషయము సిద్ధిస్తుంది. అది ఎట్లాఅంటె సాంఖ్యులు చెప్పినట్టుగా ప్రకృతికి కారణత్వము కుదరదు. జడమయిన ప్రకృతికి ఈక్షణము చేయుట కుదరదు. ఛాందోగ్యోపనిషత్తులోనయితే సత్, ఆకాశము, ప్రాణము మొదలయిన శబ్దముల వాచ్యార్థమునకు జగత్కారణత్వము చెప్పినట్టుగా తెలుస్తున్నది. వాజసనేయకములో బ్రహ్మశబ్ద వాచ్యార్థమునకు జగత్కారణత్వము

చెప్పినట్లు తోస్తున్నది. సర్వశాఖా ప్రత్యయన్యాయమువలన తేలే సారాంశము ఏమంటే అన్నికారణవాక్యముల ద్వారా జగత్తుకు ఒకే కారణమును చెప్పాలని. సామాన్యవాచక శబ్దములకు విశేషవాచకశబ్దము అర్థము చెప్పాలని ఛాగపశున్యాయముతో తెలుస్తుంది. అప్పుడు సత్ ఆకాశము ప్రాణము మొదలయిన సామాన్యవాచక శబ్దములకు విశేషశబ్దమయిన బ్రహ్మశబ్ద వాచ్యార్థమున పర్యవసానము అవుతుందని చెప్పాలి. చెప్పిన ఛాగపశు న్యాయముతో బ్రహ్మశబ్దమునకు తైత్తిరీయములో చెప్పిన ఆత్మ శబ్దవాచ్యార్థమున పర్యవసానమవుతుంది.

మరి అయితే శ్రుతులలో ఆత్మశబ్దముతో దేనిని చెప్పారు? అని ప్రశ్న. శ్రుతులలో ప్రసిద్ధుడయిన ఇంద్రుడా ఆత్మ? అట్లానే ప్రసిద్ధి పొందిన అగ్నియా? ఉపాసింపదగిన వాడుగా ప్రసిద్ధి చెందిన సూర్యుడా ఆత్మ? కారణముగా చెప్పబడిన సోముడా? అభీష్టములను దీర్చువాడు గా చెప్పబడిన కుబేరుడా? యముడా? వరుణుడా? అని సంశయము కలుగుతుంది. వీరందరు కర్మకు అధీనులయి ఉన్నందున వారి ఐశ్వర్యము పరిమితము అయినందున వారు సంహరింపబడినట్లు శ్రుతులు వర్ణించినందున జగత్కారణము కాలేరు అని స్పష్టమవుతుంది.

కాని శ్వేతాశ్వతర ఉపనిషత్తులో శివునికి జగత్కారణత్వం చెప్పబడినది. అథర్వ శిఖోపనిషత్తులో శంభుశబ్దవాచ్యునకు ఉపాసింపదగిన గుణము జగత్కారణత్వము చెప్పినట్లు ప్రతీతమవుతున్నది. అథర్వశిరస్సులో రుద్రశబ్ద వాచ్యునకు సర్వాత్మకత్వము చెప్పబడినది. తైత్తిరీయోపనిషత్తులో హిరణ్యగర్భుడు జగత్కారణుడు అని చెప్పినట్లు తెలుస్తున్నది. మళ్ళీ ఇక్కడ సామాన్య విశేషన్యాయము ప్రవర్తిస్తుంది. దానితో శివ, శంభు, రుద్ర శబ్దవాచ్యులకు హిరణ్యగర్భుడు అనువిశేషశబ్దవాచ్యమునందు పర్యవసానము తగినది. శివమస్తు సర్వజగతాం–అన్నిజగత్తులకు (ప్రాణులకు) శుభము అగుగాక అని



శివంకర్మాస్తు. పని మంగళకరము అగుగాక. శివాస్తే సన్తు పన్థానః – నీకు దారిలో శుభము కలుగుగాక అను వాక్యాల్లో శివశబ్దానికి మంగళవాచకత్వ మున్నది. రుద్ర శబ్దానికి అగ్ని వాచకత్వము సిద్ధిస్తుంది. అట్లే మహేశ్వర, శంభు మొదలయిన శబ్దాలకు, సామాన్యశబ్దాలకు అవయవశక్తిచేత చతుర్ముఖుని యందు పర్యవసానము సిద్ధిస్తుంది.

కారణము అని చెప్పే శివుడు మొదలయిన శబ్దాలు ముఖ్యవృత్తితో (శబ్దము యొక్క శక్తి అభిధతో) రుద్రునినే చెప్పవచ్చు గదా అని శంకించ వీలులేదు. రుద్రుడు చతుర్ముఖునినుండి పుట్టినట్లు శ్రుతి చెప్పు తున్నది. అతడు కర్మపరతంత్రుడే. అపహతపాప్మావిజరో ఇత్యాది అర్థములు సరిపోనందున రుద్రునికి జగత్ కారణత్వము కుదరదు. చతుర్ముఖునకే హిరణ్యగర్భుడు, ప్రజాపతి, స్వయంభువు మొదలయిన శబ్దములు వాచకములుగా కలవు. వాటన్నిటి వాచ్యము చతుర్ముఖుడేనన్న మాట. ఆ చతుర్ముఖ శబ్దమునందే శివ శంభు స్వయంభు మొదలయిన శబ్దములు పర్యవసానము చెందుతాయి.

మహోపనిషత్తు, నారాయణోపనిషత్తు, సుబాలోపనిషత్తు, మైత్రా యణీయోపనిషత్తు, పురుషసూక్తము, నారాయణానువాకము మరియు అంతర్యామీ బ్రాహ్మణము మొదలయినవాట్లలో పరమకారణత్వము సర్వశబ్ద వాచ్యత్వము, మోక్ష ప్రదత్వము, జగత్ శరీరకత్వము మొదలయినవి నారాయణునివిగానే చెప్పడం జరిగినది. కనుక స్వయంభూ, హిరణ్యగర్భ, ప్రజాపతి మొదలయిన శబ్దాలకు కూడ నారాయణ శబ్దములో పర్యవసానము తగినది. ఇట్లా నారాయణుడే సకల జగత్తుకు కారణము అని, అన్నివిద్యలు ఆతనినే బోధిస్తున్నవి, ఆయనయే సర్వవిద్యావేద్యుడు అని సిద్ధిస్తున్నది.

వి: 'సదేవ' అనుశ్రుతి జగత్కారణము సత్ అని చెప్తూతూ మృత్ పిండము లోహపిండము మొదలయిన ప్రాకృతికమయిన ఉదాహరణములు

ఇస్తున్నది కనుక ప్రకృతి జగత్కారణము అని దార్శనికులయిన సాంఖ్యుల ప్రతిపాదన. ఇది సరికాదు. ప్రకృతి జడము. సత్ శబ్దవాచ్యుని జగత్కారణముగా తెలుపుతూ శ్రుతి సత్ శబ్దవాచ్యుడు నామరూప విభాగములు లేనట్టి ఏకత్వావస్థను వదలి నామరూపవిభాగములు కలిగిన అనేకత్వావస్థను పొందాలని సత్యసంకల్పము చేసాడు అని చెప్పుతున్నది. 'తదై క్షత, ఏకోఽహం బహుస్యామ్' అని. సత్యసంకల్పరూపగుణము జడప్రకృతిది కాలేదు. ఈక్షణము చేతనుని యొక్క క్రియ కనుక జడ ప్రకృతి జగత్కారణము కానేరదు. సదేవ శ్రుతి సత్ శబ్దముతో ప్రకృతిని చెప్పడము లేదు ఈ విషయాన్ని తెలుపుతూ బాదరాయణమహర్షి ఈక్షతేర్నాశబ్దమ్ 1.1.5 సూత్రములో అశబ్దం-శబ్దప్రమాణము లేని అనుమానమే ప్రధానముగా తెలుసుకోబడే ప్రకృతి కారణము న - కాదు. సదేవ శ్రుతి సత్ శబ్దవాచ్యునిలో ఈక్షణము అను క్రియను తెలుపుతున్నందున - ఛాందోగ్యోపనిషత్తు సత్‌శబ్ద, ఆకాశశబ్ద, ప్రాణశబ్దముల వాచ్యార్థమును వాజసనేయుల శ్వేతాశ్వతరోపనిషత్తు బ్రహ్మశబ్దవాచ్యునకు జగత్కారణత్వము బోధిస్తున్నాయి.

ఎవరిని జగత్కారణముగా గ్రహించాలి అని శంక. ఈ శంకా నివారణము సర్వశాఖాప్రత్యయ న్యాయముతో జరుగుతుంది. ఈ న్యాయము అనుపదము అన్నిశాస్త్రాల్లో వస్తుంది. ఓ శాస్త్రానికి న్యాయము అని పేరు. ప్రమాణములతో అర్థమును పరీక్షించుట న్యాయము. సాహిత్యములో వ్యవహారములో కూడ ఎంతో అర్థాన్ని ఒక న్యాయము తెలుపుతుంది. కాకతాలీయన్యాయము, సింహావలోకనన్యాయము మొదలయినవి. అట్లే మీమాంసాశాస్త్రములో చాలా న్యాయాలు ఉన్నాయి. ఇది వాక్యశాస్త్రము. 'ఏకం వా సంయోగ - రూప - చోదనా - ఆఖ్యా విశేషాత్' అని పూర్వమీ మాంసా సూత్రము. సూత్రార్థము అనేకం శాఖలలో యాగములు విధించబడి ఉంటాయి. ఆ కర్మల యొక్క సంయోగము, రూపము, చోదన, ఆఖ్య - అను నాలుగు ఒక్క విధముగా ఉంటే అన్నిశాఖలలో విధించబడిన కర్మ - యాగము



ఒక్కటే అనుకోవాలి. అని అంతే గాని శాఖలు వేరు కనుక కర్మలు వేరు వేరని భావించరాదు.

సూత్రములోని సంయోగము అనుపదముచే ఫలసంబంధము వివక్షితము. రూపశబ్దము చేత ద్రవ్యము మరియు దేవతను గ్రహించాలి; యాగము యొక్క రూపము దేవత, ద్రవ్యములే కద చోదనా శబ్దముతో జుహుయాత్, యజేత మొదలయినవి తీసుకోవాలి, ఆఖ్యాశబ్దముతో అగ్నిహోత్రము అగ్నిష్టోమము ఇత్యాది పేర్లను గ్రహించాలి. ఈ విధంగా అనేకశాఖల్లో వర్ణించిన ఏ కర్మనయినా తీసుకున్నప్పుడు పయినాలుగు ఒకే విధముగా ఉన్నట్లు అయితే, ఆ కర్మలను వేరుగా కాక ఒకటిగానే గ్రహించాలి అని సర్వశాఖా ప్రత్యయన్యాయ తాత్పర్యము. ఏమిటి దీనికి ప్రయోజనము? ఓ శాఖలో కర్మ యొక్క అంగాలు చెప్పబడ్డాయి. మిగతశాఖలలో అంగముల వర్ణనలేదు. అప్పుడు కర్మను ఆచరించు వారు ఇంకో శాఖనుండి అంగములను గ్రహించి ఆచరించాలి ఆకర్మను.

ఈ న్యాయముతో కారణవాక్యములన్ని ఒక వ్యక్తినే జగత్కారణముగా ఆయా పేర్లతో చెప్పుతున్నాయి అని. అవి చెప్పే వ్యక్తియే జగత్కారణము. మరయితే ఈ కారణవాక్యాలన్ని ఏ తత్త్వమును జగత్కారణము అని చెప్పుతున్నాయి. ఆ తత్త్వమే అని ఎట్లా నిశ్చయము చేస్తున్నారు అని ప్రశ్న. మళ్ళీ ఇక్కడ ఇంకోన్యాయము దీనికి తోడుపడుతుంది. ఆ న్యాయమే ఛాగపశు న్యాయము. ఛాగో వా మంత్రవర్ణాత్ అని ఒక సూత్రం పూర్వ మీమాంసలో ఉన్నది. ఈ అధికరణములో పశునా యజేత అని ఓ వాక్యమున్నది. దానర్థం పశువుతో యాగము చెయ్యాలి. నాలుగుకాళ్ళు కలదాన్ని పశువు అంటారు. అన్ని పశువులతో యాగం చెయ్యాల్నా? చేయవచ్చునా? కొన్ని అమేధ్యము లయినవి కూడ పశువులున్నవి. పశుశబ్దముతో సామాన్యవాచకం గనుక అన్ని పశువులని తీసుకోవాలా పశుశబ్దార్థాన్ని సామాన్య వాచకంగానే

గ్రహించాలా అని ప్రశ్న. పయిన చెప్పినట్టు అమేధ్యములు కూడనివి అన్ని పశువులు సామాన్యశబ్దంతో వస్తాయి, అవి పనికిరావు. కనుక విశేషమును – ఏదయినా పశువును తీసుకోవాలి అని అర్థము. అయితే ఆ యజ్ఞీయపశువు ఏది? సమాధానము 'ఛాగో వా మంత్రవర్ణాత్' మగమేకను గ్రహించాలి. ఎందుకంటే 'ఛాగస్య వపాయాః' అనుమంత్రములో పశువిశేషము ఛాగము చెప్పబడింది. కనుక పశుశబ్దము సామాన్యవాచకము. ఛాగశబ్దము విశేష వాచకము. సామాన్య శబ్దమునకు విశేష శబ్దముతో పర్యవసానము. దీనికే ఛాగపశు న్యాయము అని పేరు. ఈ న్యాయముతో సత్, ఆకాశము, ప్రాణము, ఆకాశము మొదలయిన సామాన్య వాచకములు అయిన శబ్దములు విశేష శబ్దమయిన బ్రహ్మలో పర్యవసానము చెందుతాయి. అనగా సామాన్య శబ్దములు సత్ మొదలయినవి విశేషమయిన బ్రహ్మను చెప్పుతాయి.

బ్రహ్మశబ్దానికి అనేక అర్థాలున్నాయి. ఈ శబ్ద ప్రవృత్తి నిమిత్తము చెప్పుతూ 'బృహత్వాద్ బృంహణత్వాచ్చ తద్ బ్రహ్మేత్యభిధీయతే' అని మహర్షులు తెలిపారు. స్వరూపముచేత గుణములచేత బృహత్తుగా ఉన్నాడు. తనకంటే ఇతర వస్తువుల నన్నిటిని బృహత్తుగా చేయువాడు బ్రహ్మ కనుకనే ఓ చోట బ్రహ్మశబ్దముచే ప్రకృతి, మరోచోట జీవుడు, ఇంకోచోట పరమాత్మ చెప్పబడ్డాడు. ఇక్కడ బ్రహ్మశబ్దానికి ఏ మర్థము? ఛాగపశు న్యాయముతో బ్రహ్మశబ్దానికి చేతనుడే చెప్పబడ్డాడని, అతడు, ఆత్మ అని, అతనివర్ణనయే కారణరూపముగా తైత్తిరీయోపనిషత్తులో చేయబడినది అని నిశ్చయము చేయవచ్చును.

జగత్కారణమయిన ఆత్మ ఎవరు? వేదములో చాలా సూక్తాల్లో స్తుతింపబడిన ఇంద్రుడా? అంతగా కీర్తింపబడిన అగ్నియా? ఉపాస్యుడుగా కొనియాడబడిన సూర్యుడా? చంద్రుడా? కుబేరయమవరుణుల్లో ఎవరు ఆత్మశబ్దవాచ్యుడు? వీరెవరు ఆత్మశబ్దవాచ్యులయిన జగత్కారణము కారు. దీనికి కారణము వీరి కర్మపరతంత్రత పరిమితమయిన ఐశ్వర్యము



కలిగియుండుట, ప్రలయకాలములో సంహరింపబడుట అనునవి ఈమూడు దోషములు వీరిని జీవకోటిలో చేర్చుతవి. జీవులందరు కర్మపరతంత్రులు. ఐశ్వర్యము పరిమితముగా కలవారు. ప్రలయకాలములో సంహరింపబడువారు 'ఆ బ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోఽర్జున' అని గీతలో ఈ విషయాన్నే కృష్ణపరమాత్ముడు చెప్పాడు. జీవులకు జగత్కారణత్వము లేదను విషయాన్ని బాదరాయణమహర్షి 'జగద్వ్యాపారవర్జం ప్రకరణాదసన్నిహితత్వాచ్చ' బ్ర.సూ. 4.4.17లో స్పష్టపరిచారు. శ్రుతిలోని అపహతపాప్మత్వం అనంతం అను విశేషణాలు ఇంద్రాదులు జగత్కారణమయిన ఆత్మకాదని చెప్పుతున్నవి.

మళ్ళీ పూర్వపక్షము:–

'ఘృతాత్ పరం మండమివాతిసూక్ష్మం
జ్ఞాత్వా శివం సర్వభూతేషు గూఢమ్.
విశ్వస్యైకం పరివేష్టితారం
జ్ఞాత్వా దేవం ముచ్యతే సర్వపాశైః'

శ్వే.ఉ.4.16.లో శివుడు సర్వోత్తముడుగా సర్వవ్యాపకుడుగా సర్వజ్ఞుడుగా చెప్పబడుతున్నది. ఈ శ్రుతినిబట్టి శివుడే జగత్తుకు కారణము అనిపిస్తున్నది గద.!

అథర్వశిఖోపనిషత్తు యొక్క 'కారణం తు ధ్యేయః సర్వైశ్వర్య సమ్పన్నః సర్వేశ్వరః శమ్భురాకాశమధ్యే' 2–17 శ్రుతి కూడ శమ్భుని సర్వజగత్తుకు కారణముగా చెప్పుతున్నది. అథర్వ శీర్షములో రుద్రుడు అంటాడు – 'అహమేకః ప్రథమమాసం వర్తామి చ భవిష్యామి చ' నాన్యః కశ్చిన్మత్తో వ్యతిరిక్తఇతి' సృష్టికి మొదలు నేను ఒక్కణ్ణే ఉన్నాను. వర్తమానములో ఉన్నాను. భవిష్యత్తులో ఉంటాను. నాకంటే భిన్నముగా ఏమీ లేదు. జగత్తు అంతా రుద్రాత్మకము అని. తైత్తిరీయనారాయణము యొక్క 'హిరణ్యగర్భః సమవర్తతాగ్రే భూతస్య జాతః పతిరేక ఆసీత్। సదాధార పృథివీం ద్యాముతేమాం' ॥ శ్రుతి సృష్టికి

పూర్వము హిరణ్యగర్భుడు ఒకడే ఉండెను. అన్నింటిలో వ్యాపించి ఉన్న కారణాన అతడొక్కడే జగత్తు నియంత పతిగా ఉండెను. ఈ పృథివిని, ద్యులోకమును ఆయనయే కాపాడెను అని తెలుపుతున్నది. దీన్ని బట్టి జగత్కారణము హిరణ్యగర్భుడు అని తెలియవస్తున్నది. ఇప్పుడు శంక ఏమిటంటే శివుడా? శంభుడా? రుద్రుడా? హిరణ్యగర్భుడా? జగత్కారణము అని.

శివశబ్దానికి సామాన్యార్థము కూడ ఉన్నది. శుభము మంగళము అని. శివం కర్మాస్తు, శివాస్తే సన్తు పన్థానః మొదలయిన వాక్యాల్లో ఇదే ఆ పదానికర్థము. రుద్రశబ్దము భయంకరము అని అగ్ని అని అర్థాల్లో కూడ ఉపయుక్తము. శం భవతి అస్మాత్ శం భావయతి అనిగాని శంభుశబ్దము అర్థము కూడ. ఎవరివలన శుభము కలుగుతుందో ఎవరు శుభమును చేస్తారో వారుశంభు అని సామాన్యార్థము ఉన్నది. 'హిరణ్యస్య హిరణ్మయస్య పరమవ్యోమ్నో గర్భభూతః తత్ర స్థితః' అని హిరణ్యగర్భశబ్దము యొక్క వ్యుత్పత్తి. ఎవడు బంగారమువలె మెరయునట్టి పరమపదములో విరాజిల్లు తున్నాడో అతడు హిరణ్యగర్భుడు. మహేశ్వరుడు, శివుడు, రుద్రుడు, హిరణ్యగర్భుడు మొదలయిన సామాన్యశబ్దాలన్ని అవయవ శక్తిద్వారా సమస్త జీవులకు శుభములు గూర్చు చతుర్ముఖబ్రహ్మలోనే పర్యవసానమును చెందుతాయి.

పురాణాల్లో కూడ బ్రహ్మనే శివుని సృష్టిచేసి నామాది ప్రదానము చేసినట్టు స్పష్టముగా చెప్పబడి ఉన్నది. బంగారము వలె మెరుస్తున్న పరమ పదమయిన వైకుంఠములో ఉన్నందువలన శ్రీమన్నారాయణ భగవానుడే హిరణ్యగర్భశబ్దముచే తైత్తిరీయమంత్రములలో చెప్పబడ్డాడు.

ఫలితాంశము ఏమంటే కారణవాచిశబ్దములన్నీ నారాయణునే బోధిస్తున్నవి. మహోపనిషత్, నారాయణోపనిషత్, సుబాలోపనిషత్, మైత్రాయణీ యోపనిషత్, పురుషసూక్తము, నారాయణానువాకము, అన్తర్యామి, బ్రాహ్మణము



మొదలయినవి భగవన్నారాయణునే పరమకారణముగా చెప్పుచున్నవి, నారాయణుడే సర్వశబ్దవాచ్యుడు అని తెలుపుతున్నవి. ఆయనయే సమస్త జీవులకు మోక్షమును ఇచ్చువాడు. సమస్తజగత్తు తన శరీరముగా కలవాడు అని చెప్పుతున్నవి. ఇట్లా స్వయంభూహిరణ్యగర్భ ప్రజాపతిశబ్దములన్నిటికి నారాయణ శబ్దవాచ్య నియందే పర్యవసానము. 'స్వయం స్వేచ్ఛయా భవతి లోకకల్యాణ కామన యా రామకృష్ణాది రూపేణావతరతి ప్రజాఃపాతి సాక్షాత్ అథవా సద్వారకపాలనాత్' ఇట్లా అవయవశక్తితో మహేశ్వరాది శబ్దములు చతుర్ముఖునిలో, అవి అన్ని హిరణ్యగర్భునిలో హిరణ్యగర్భుడు మొదలయినవి నారాయణునిలో పర్యవసానమును పొందుతవి. కనుక శ్రీమన్నారాయణుడే సంపూర్ణజగత్తుకు కారణము. అన్నివిద్యలచే వేద్యుడు, ఉపనిషత్తు లన్నీ ఆయననే ప్రతిపాదిస్తున్నాయి అనేది సుస్పష్టము.

## అన్తరాదిత్యదహరవిద్యయోర్నారాయణపరత్వసమర్థనమ్:

మూ: నను అన్తరాదిత్యవిద్యారుద్రపరేతి శఙ్కా న కర్తవ్యా. తస్యా విష్ణుపరత్వస్యైవ బహుప్రమాణసిద్ధత్వాత్. (హరస్స్మరహరో భర్గ ఇత్యకారాన్త ఏవ రుద్రపరః) భర్గశ్శబ్దస్య సకారాన్తత్వ ప్రతిపాదనాచ్చ. తర్హి దహర విద్యాయామాకాశ శబ్దవాచ్యనారాయణాన్తర్యామితయా రుద్రస్య ప్రతిపాదనాత్ దహరవిద్యారుద్రపరేతి న శఙ్కనీయమ్. నారాయణాన్త ర్వర్తిగుణజాతస్యైవ ఉపాస్యత్వేన తత్రాభిధానాత్. ఏవం సర్వవిద్యాస్వపి ఊహ్యమ్. అతస్సమస్త కల్యాణగుణాత్మకః ప్రకృతిపురుషాభ్యాం భిన్నః తద్విశిష్టః పరబ్రహ్మానారాయణ ఏవ జగత్కారణమ్.

అ: అంతరాదిత్యవిద్య రుద్రుని ఉపాసనను బోధిస్తున్నందున రుద్రపరము అని ఆ శంక పనికిరాదు. ఆ విద్యకు కూడ విష్ణుపరత్వమే ఉందని అనేక ప్రమాణాలు బోధిస్తున్నాయి. అకారాంతము అయిన భర్గశబ్దమే రుద్ర పరమయినది. సకారాంత భర్గశబ్దము కాదు. అన్తరాదిత్యవిద్యలోని

భర్గశబ్దము సకారాంతమే అని నిరూపణ జరిగినది. దహరవిద్యలో ఆకాశ శబ్దమున్నది. దానివాచ్యుడు నారాయణుడు అతని అంతర్యామి రూపమున రుద్రుడు ప్రతిపాదింపబడినాడు. కాబట్టి దహరవిద్య రుద్ర పరకమయినదే కద అని అనరాదు. నారాయణుని యొక్క గుణసమూహమునే ఉపాసించాలి అని చెప్పబడినది. ఇట్లా అన్ని విద్యలలోనూ అంతరార్థమును గ్రహించాలి. విచారించి చూడాలి. కనుక సకలకల్యాణగుణములు కలవాడు. ప్రకృతి పురుషుల కంటే అతీతుడు కాని ఆ ప్రకృతి పురుషులు శరీరముగా కలవాడు పరబ్రహ్మ అయిన నారాయణుడే జగత్తునకు కారణము.

వి: గాయత్రీ ఛందస్సులో ప్రతిపాదింపబడే అంతరాదిత్యవిద్య రుద్రుని ప్రతిపాదిస్తున్నది. దానిలో వరేణ్యభర్గుని యొక్క ఉపాసన విధానము చెప్ప బడినది. భర్గశబ్దానికి రుద్రుడని అర్థము ఉండనే ఉన్నది కావున ఈవిద్య రుద్రపరము అని శంకించరాదు. యతీంద్ర మతదీపికాకారులు భర్గశబ్దము అకారాంతమయితే నే రుద్రపరము అమరకోశములో చెప్పినట్టు. కాని మంత్రములోని భర్గశబ్దము సకారాంతము జ్యోతివాచకమూ. దీనికి ప్రమాణము బాదరాయణమహర్షి జ్యోతిశ్చరణాభిధానాత్ బ్ర.సూ. 1.1.25 లో గాయత్రీ ప్రతిపాద్యమయిన అంతరాదిత్యవిద్యను చర్చించి ఆదిత్యాంతర్వర్తి భగవానుడు నారాయణుడే అని సిద్ధింపజేసారు. కనుక శంకకు ఆస్కారమే లేదు.

ఇక దహరవిద్య విషయంలో శంక. అథర్వ శిఖోపనిషత్తులో దహరాకాశము చెప్పబడినది. దహరాకాశము యొక్క వాచ్యార్థము ఏమిటంటే నారాయణుని యొక్క నియామకుడుగా శంభుడు ఉన్నాడని 'శమ్భురాకాశ మధ్యే' అని శంభునే తెలుపుతున్నది. శంభుశబ్దము వాచ్యార్థము రుద్రుడే కద కనుక దహరవిద్యరుద్రపరము అవుతుంది గాని నారాయణపరము ఎట్లా అవుతుంది? అని మరియొక శంక. దీని సమాధానము – అథర్వ శిఖో పనిషత్తు దహరాకాశము యొక్క అంతర్యామి రూపమున ఉన్న నారాయణుని నిరతిశయ కల్యాణగుణములు కలవాడు' కల్యాణమును కలుగచేయు వాడు



కనుక శంభుశబ్దముతో చెప్పినది. దహరా కాశమును ఆయా గుణము లున్నందున ఉపాసించాలి అని చెప్పిన ఆ గుణములన్ని నారాయణునివే రుద్రునివి కావు. ఆయన నిరతిశయ కల్యాణగుణాలను బట్టి శం భావయతి శం భవత్యస్మాత్ అని పయిన చెప్పినట్టు శంభుశబ్దముతో చెప్పినది. ఇట్లా అన్ని బ్రహ్మవిద్యాప్రతిపాద్యుడు నారాయణుడే అని తెలుసుకొనాలి. ఇట్లా సమస్తకల్యాణ గుణాలకు ఆశ్రయుడు, ప్రకృతి పురుషుల కంటే వేరయినవాడు, ప్రకృతి పురుషులు శరీరముగా కలవాడు అయిన నారాయణుడే పరబ్రహ్మ. ఏల అనగా అతడే స్వరూపగుణములతో అన్నిటికన్న గొప్పవాడు, బృహత్, అన్నిటినీ వృద్ధి చేయువాడు 'బృంహణము చేయువాడు' సమస్త జగత్తుకు అభిన్ననిమిత్తోపాదానకారణము అయిన వాడూను.

## అద్వైత్యభిమతే నిర్విశేషే బ్రహ్మణి వేదాన్తానాం తాత్పర్యనిరసనమ్:

మూ: నను, అద్వైతశ్రుత్యా బ్రహ్మైకమేవ సత్యం నిర్గుణం చ. తదన్యత్ జ్ఞాతృజ్ఞేయాదికం తస్మిన్నేవ పరికల్పితం సర్వం మిథ్యా. బ్రహ్మ అవిద్యయా సంసరతి. తత్త్వమసీ త్యాద్యభేదజ్ఞానం తన్నివర్తకమ్. తస్మాత్ నిర్విశేషచిన్మాత్రే బ్రహ్మణి వేదాన్తానాం తాత్పర్యమితి మతాన్తరస్థైః ప్రతిపాద నాత్ కథం నారాయణే తాత్పర్యం తస్య సమస్తకల్యాణ గుణాత్మకత్వాది కథనం చేతి చేత్ ఉచ్యతే కారణత్వ ప్రతిపాదక శ్రుతిభిర్నారాయణస్య కారణత్వే సిద్ధే. భేదాభేద శ్రుతోర్ఘటకశ్రుత్యా విషయభేదేన విరోధే పరిహృతే, నిర్గుణ ప్రతిపాదక శ్రుతీనాం హేయగుణ నిషేధకత్వాత్ జ్ఞాతృజ్ఞేయాది కల్పకావిద్యాయా ఏవ అప్రామాణికత్వాద్ బ్రహ్మకార్యస్య సత్యత్వాత్ అవిద్యయా సంసారే జీవగతదోషాణాం బ్రహ్మణ్యపి సమ్భవాత్ తన్నివర్తకాన్తరస్య వక్తుమశక్యత్వాత్. అతోఽ ద్వైతవాదస్యా సమ్భవాన్న నిర్విశేషచిన్మాత్ర బ్రహ్మసిద్ధిః. అతో నారాయణ స్యైవ జగత్ కారణత్వమోక్ష ప్రదత్వాది గుణయోగస్సమ్భవతీతి స విశేషమేవ బ్రహ్మ. సూక్ష్మచిదచిద్విశిష్టం బ్రహ్మ కారణమ్, స్థూలచిదచిద్విశిష్టం బ్రహ్మ కార్యమితి కారణాదనన్యత్ కార్యమితి విశిష్టాద్వైతవేదాన్తినాం సమ్ప్రదాయః.

అ: అద్వైతశ్రుతి ద్వారా బ్రహ్మ ఒకడే సత్యము నిర్గుణుడు అని సిద్ధిస్తుంది. అతనికంటే భిన్నమయినట్టి జ్ఞాత, జ్ఞేయము మొదలయినవి అన్ని నిర్గుణ బ్రహ్మలో ఆరోపింపబడినట్టివి కనుక అవి మిథ్య. బ్రహ్మయే అవిద్యద్వారా అవిద్యకారణముగా సంసారబంధము కల్గిఉంటాడు. తత్త్వమసి మొదలయిన వాక్యముల ద్వారా కలుగు అభేదజ్ఞానముచే అవిద్య తొలగిపోతుంది. ఇట్లా వేదాంత(వాక్య)ములన్ని నిర్విశేష జ్ఞానము మాత్రము బ్రహ్మఅని తెలుపుతాయి. అని అద్వైత విద్వాంసులు ప్రతిపాదిస్తుండగా వేదాంతవాక్యములను నారాయణుని యందు తాత్పర్యమని, ఆతనికి సమస్తకల్యాణగుణము లున్నవని చెప్పడంలో తాత్పర్యమని చెప్పడం ఎట్లా కుదురుతుంది అని ప్రశ్న.

సమాధానము ఏమంటే – జగత్తుకు కారణమయిన తత్త్వమును ప్రతిపాదించు శ్రుతులు నారాయణుని జగత్కారణముగా ఎట్లా ప్రతిపాదించాయో చూసాము కద. అప్పుడు భేదశ్రుతులు అభేద శ్రుతుల మధ్యన ఉండే విరోధాన్ని ఘటకశ్రుతులద్వారా విషయ భేదమును బట్టి దూరము చేస్తే బ్రహ్మను నిర్గుణుడుగా ప్రతిపాదించే శ్రుతులు ఆతనిలో హేయగుణములను నిషేధిస్తున్నవని తేలుతుంది. జ్ఞాతృజ్ఞేయాది భేదమును అవిద్య కల్పిస్తుంది కనుక మిథ్యఅనడం సరికాదు. అవిద్యను సిద్ధింపజేసే ప్రమాణములు లేవు. అప్పుడు బ్రహ్మయొక్క కార్యము సత్యము అవుతుంది. అవిద్యద్వారా బ్రహ్మకు సంసార బంధము అంటే జీవులలో ఉండే దోషములు బ్రహ్మకు సంక్రమిస్తాయి. ఆ దోషాన్ని తొలగించేది మరొకటి చెప్పాల్సి వస్తుంది. అవిద్యను తొలగించే తత్త్వమస్యాది వాక్యజన్యమయిన అభేదజ్ఞానము తొలగిస్తుంది అనలేరు. ఇట్లా అభేదమును పూర్తిగా చెప్పే అద్వైతవాదము సిద్ధించదు. నిర్విశేషచిన్మాత్ర బ్రహ్మసిద్ధి కాదు.

ఇందువలన నారాయణునకే జగత్కారణత్వము మోక్షప్రదత్వము మొదలయిన గుణములు సంభవిస్తాయి, సిద్ధిస్తాయి కనుక బ్రహ్మ సవిశేషుడే.



సూక్ష్మచిదచిద్విశిష్టు డయిన బ్రహ్మకారణము స్థూలచిదచిద్వి శిష్టుడయిన బ్రహ్మ కార్యము అని కారణముతో కార్యానికి అభేదము సిద్ధిస్తున్నదని విశిష్టాద్వైత వేదాంతుల యొక్క సంప్రదాయము.

వి: సగుణ బ్రహ్మ నారాయణుని ప్రతిపాదించడమే వేదాంత వాక్యముల తాత్పర్యము అనలేరు. అద్వైతశ్రుతులు నిర్గుణ బ్రహ్మ ఒక్కడే సత్యము, తద్భిన్నముగా తోచేట్టి జ్ఞాత, జ్ఞేయము మొదలయిన భేదములన్ని మిథ్య. అవి అన్నీ నిర్గుణ బ్రహ్మమీదనే ఆరోపింపబడినవి. బ్రహ్మయొక్క నిర్గుణత్వమును ప్రతిపాదించే శ్రుతులు ఇవి –

సాక్షీ. చేతా కేవలో నిర్గుణశ్చ – బ్రహ్మ సాక్షి, చేతనుడు కేవలుడు మరియు నిర్గుణుడు. నిష్కలం నిష్క్రియం శాంతం నిరవద్యం నిరఞ్జనమ్ – బ్రహ్మకలా క్రియారహితుడు శాంతుడు (షడూర్మిరహితుడు) నిరవద్యుడు (దోషములు లేనివాడు) మరియు నిరంజనుడు. ఈ శ్రుతులు బ్రహ్మలో గుణములను నిషేధిస్తున్నవి. 'సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమే వాద్వితీయమ్'– అను శ్రుతి బ్రహ్మలో సజాతీయ విజాతీయ స్వగతభేదములను నివారించు తున్నది. సదేవ పదముతో విజాతీయ భేదములను ఏకమేవ పదముతో సజాతీయ భేదములను అద్వితీయపదముతో స్వగతభేదములను నివారించి బ్రహ్మలో లేవని తెలుపుతున్నది.

"యత్తదద్రేశ్యమగ్రాహ్యా మగోత్రమవర్ణమచక్షుశ్శ్రోత్రం తదపాణి పాదం నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం తదవ్యయం యద్ భూతయోనిం పరిపశ్యన్తి ధీరాః" ॥ ముం. ఉ. 1.1.6 శ్రుతి బ్రహ్మ అద్రేశ్యం ఇంద్రియ ప్రత్యక్షవిషయము కాదు, అగ్రాహ్య అనుమానప్రమాణంచే గ్రహింపబడడు. అగోత్రం నామరహితుడు సత్ బ్రహ్మ మొదలయిన శబ్దాలు కూడ లక్షణద్వారానే బ్రహ్మను తెలుపుతవి, అవర్ణం రూపంలేనివాడు. అచక్షుశ్శ్రోత్రం జ్ఞానేంద్రియములు లేనివాడు, అపాణిపాదం–కర్మేంద్రియములు లేనివాడు,

నిత్యుడు, విభువు, సర్వవ్యాపకుడు దేశకాలాద్యపరిచ్ఛిన్నుడు, సర్వగతుడు– వస్తుపరిచ్ఛేదము లేనివాడు, అత్యంత సూక్ష్ముడు, అదృశ్యుడు, అవ్యయుడు, తత్త్వవేత్తలు అతనిని భూతములకు కారణముగా చూస్తారు అని. ఈ శ్రుతి బ్రహ్మలో ఏ గుణములు లేవని తెలిపి నిర్విశేషుడు, నిర్వికారుడు, సత్యము అని ప్రతిపాదించుచున్నది.

'సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ' తై.ఉ.ఆనం, వల్లీ 1.1. అను శ్రుతి బ్రహ్మసత్య స్వరూపుడు అలోకవ్యావృత్తుడు అని, జ్ఞానస్వరూపుడు అనగా జడవ్యావృత్తుడు అని, అనంతుడు అనగా పరిచ్ఛిన్నప్రత్యనీకుడు అని స్పష్టపరచుచున్నది. ఈ వాక్యములు బ్రహ్మను నిర్విశేషుడు అని సిద్ధింపజేస్తున్నవి, 'ఇదం సర్వం యదయమాత్మా' బృ.ఉ.4.4.6 శ్రుతి సంపూర్ణమయిన జగత్తు బ్రహ్మలో ఆరోపింపబడినదని తెలుపుతున్నది. 'నేహ నానాస్తి కిఞ్చన' బృ.ఉ.6.4.19 శ్రుతి, జగత్తులో కనబడే నానాప్రకారములయిన భేదములు బ్రహ్మలో ఆరోపింపబడిన కారణముగా మిథ్య అని తెలుపుతున్నది. 'మృత్యోః స మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి' – బృ.ఉ.6.4.19 శ్రుతి, భేదములను సత్యమని తలుస్తాడో చూస్తాడో అతడు మాటిమాటికీ సంసారములో తగులు కుంటాడు. వస్తూపోతుంటాడు అని ప్రతిపాదించినది. ఈ శ్రుతులన్నిటి ద్వారా స్పష్టమయినది ఏమంటే – కేవలము బ్రహ్మయే సత్యము, అతడు నిర్గుణుడు, నిర్వికారుడు, జ్ఞాత, జ్ఞేయము మొదలయిన పదార్థములన్నీ బ్రహ్మలో కల్పితమయినవి కనుక మిథ్యయేగాని వాస్తవికములు గావు అని.

మరి సంసారము ఎట్లా జరుగుతున్నది – అద్వైతసిద్ధాంత ప్రకారము పరబ్రహ్మ అవిద్యచే ఉపహితుడయి (కప్పబడి) అనేక భేదములను చూస్తాడు, అభేద రూపమయిన భ్రమలో చిక్కుకుంటాడు. దాని ఫలితంగా జన్మ, జర, మరణము మొదలయిన సాంసారిక దుఃఖములను అనుభ విస్తుంటాడు. తత్త్వమసి మొదలయిన వాక్యములతో గలిగే అభేదజ్ఞానమును పొందుతాడు. ఈ జ్ఞానముచేతనే అవిద్య తొలగిపోతుంది.



ఈ విధంగా వేదాంతవాక్యముల తాత్పర్యము – జ్ఞానమాత్ర పరబ్రహ్మను ప్రతిపాదించడమే. కనుక సమస్త కల్యాణగుణగణాత్మకుడు సగుణుడయిన నారాయణుని ప్రతిపాదించడం వేదాంతవాక్యముల తాత్పర్యము కాదు. దీనికి యతీంద్రమతదీపికాకారుని జవాబు – కారణవాక్యములన్నీ శ్రీమన్నారాయణునే జగత్కారణముగా చెప్పుతున్నవని నిశ్చయించాము. ఇప్పుడు ప్రశ్న ఆ కారణతత్త్వము సగుణుడా? నిర్గుణుడా? అని. దీనికి అద్వైతుల జవాబు బ్రహ్మనిర్గుణుడు అని. శ్రుతులు అట్లానే ప్రతిపాదిస్తున్నాయి గనుక వారిసమర్థన ఇంకా ఇట్లా ఉన్నది. బ్రహ్మను గురించి చెప్పే శ్రుతులు రెండు విధాలుగా కనబడుతున్నాయి. ఒక విధమయినవి సగుణ శ్రుతులు, రెండవ రకము నిర్గుణశ్రుతులు. మొదటి శ్రుతులు బ్రహ్మను సగుణుడని చెపుతున్నాయి. రెండవశ్రుతులు బ్రహ్మనిర్గుణుడు అని ప్రతిపాదిస్తున్నాయి. మరి ఒకే బ్రహ్మ సగుణుడు, నిర్గుణుడు రెండుకాలేడు గద. ఏదయినా ఒకటే కావాలి. కాబట్టి రెండురకాల శ్రుతులలో ఒక శ్రుతి అర్థానికి బాధ అని ఒప్పుకోవాలి. ఏ శ్రుతి యొక్క అర్థానికి బాధ అని ఒప్పుకోవాలి. (బాధ – అర్థమునకు యుక్తి యుక్తత్వము లేకపోవుట. సూర్యుడు పడమర ఉదయిస్తున్నాడు. అర్థానికి బాధ–బాధలేకపోవడం యోగ్యత. శబ్దము ప్రమాణము కావడానికి యోగ్యత ప్రధానకారణము. అ.) దేనిని ఒప్పుకోవాలి అను నిర్ణయానికి అపచ్ఛేద న్యాయము పనికి వస్తుంది. ఈ న్యాయముతో సగుణశ్రుతుల అర్థానికి బాధ కలుగుతుంది. నిర్గుణశ్రుతులను స్వీకరించాలి.

అపచ్ఛేదన్యాయము: పూర్వమీమాంసలోని ఆరవ అధ్యాయము ఐదవ పాదములో పందొమ్మిదవ అధికరణము అపచ్ఛేదాధికరణము. జ్యోతిష్టోమము యొక్క ప్రాతః సవనములో బహిష్పవమానస్తోమపాఠమును చేసే ఋత్విక్కులు ఒకరికక్షమును ఒకరు పట్టుకొని (కక్షము – చంకల భాగము వెనుక నుండి భుజములపయి చేతులు వేసి అని అర్థము) చీమలబారులాగా నడవాలి అని ఈ అధికరణము చెప్పుతున్నది. ప్రమాదవశాత్తు ఎవరయినా కక్షమును

వదలిపెడితే దానికి ప్రాయశ్చిత్తము నిట్లా చెపుతుంది అధికరణము – 'యదుద్గాతా అపచ్ఛిద్యేత, అదక్షిణో యజ్ఞః సంస్థాప్య, తేన పునరృజేత తత్ర తద్ దద్యాద్ యత్ పూర్వస్మిన్ దాస్యన్ స్యాత్. యది ప్రతిహర్తా అపచ్ఛిద్యేత సర్వవేదసం దద్యాత్' అని ప్రమాదవశాత్తు ఉద్గాత పట్టుకున్న కక్షమును వదలిపెడితే, మొదలు పెట్టిన యజ్ఞమును దక్షిణ ఇయ్యకుండనే ఆపివేయాలి తరువాత మళ్ళీ అదే యజ్ఞమును చేసి మొదటి యజ్ఞములో బాకీపడిఉన్న దక్షిణనే రెండవ యజ్ఞములో ఇయ్యాలి. ఒకవేళ ప్రతిహర్త కక్షమును వదలిపెడితే ఆ యాగములో సర్వస్వాన్ని దక్షిణగా ఇయ్యాలి.

ఎవరయినా ఒకరు కక్షమును వదలి పెడితే చెప్పిన ప్రాయశ్చిత్తము చెయ్యాలి. ఒకవేళ ఇద్దరు ఋత్విక్కులు ఒకేసారి కక్షములను వదలి పెడితే ఎవరయినా ఒకరికే ప్రాయశ్చిత్తము చేయవలసిన అవసరము. ఇద్దరు వదలి పెడితే చేసే ప్రాయశ్చిత్తానికి వికల్పము ఉన్నది. ఒక ఋత్విక్కు మొదలు వదలి పెట్టాడు. తరువాత రెండవ ఋత్విక్కు వదలి పెట్టాడు. ఇట్లా వరుసగా రెండు అపచ్ఛేదాలు జరిగాయి. అప్పుడు ఏమి చెయ్యాలి? అని ప్రశ్న కలుగుతుంది. మొదటి అపచ్ఛేదమునకు ప్రాయశ్చిత్తం చెయ్యాలా రెండవదానికి చెయ్యాలా? దీనికి సమాధానాన్ని 'పౌర్వాపర్యే పూర్వదౌర్బల్యం ప్రకృతివత్' అను సూత్రం తెలుపుతుంది. మొదటి అపచ్ఛేదము జరుగగానే దానికి సంబంధించిన ప్రాయశ్చిత్తశాస్త్రము ఉపస్థితము అయి జ్ఞానము కలిగిస్తుంది. ప్రాయశ్చిత్తం చేస్తుంటారు. అప్పుడు రెండవ అపచ్ఛేదం జరుగలేదు కనుక ఆ ప్రాయశ్చిత్త శాస్త్రజ్ఞానము హాజరు కాలేదు. కాబట్టి మొదటిది రెండో దానిని బాధించడం ప్రసక్తిలేదు. అట్లా ప్రాయశ్చిత్తము చేస్తూంటారు. అప్పుడు రెండవ అపచ్ఛేదము జరిగిందనుకోండి. దానికారణముగా ఉత్తరాపచ్ఛేద ప్రాయశ్చిత్త శాస్త్రము హాజరవుతుంది. ఆ సమయంలో మొదటి ప్రాయశ్చిత్తశాస్త్ర జ్ఞానము ఇంకా ఉంది కనుక పూర్వప్రాయశ్చిత్తశాస్త్రజన్య జ్ఞానమును బాధించకుంటే, తొలగించకుంటే ఉత్తర ప్రాయశ్చిత్తశాస్త్రజన్య జ్ఞానము కలుగనేరదు. నిమిత్తము



హాజరు కాగానే ఉత్తర ప్రాయశ్చిత్త శాస్త్రము ఉపస్థితము అయి జ్ఞానము కలిగించాల్సియే వస్తుంది. ఉత్తర ప్రాయశ్చిత్త శాస్త్రముతో పూర్వ ప్రాయశ్చిత్త శాస్త్రము బాధితము అవుతుంది. అపచ్ఛేదాధికరణములో ఈ విధమయిన సిద్ధాంతము చేయబడినది.

దీని అనుసారముగ ఉత్తరోపస్థితమయిన నిర్గుణ శాస్త్రముతో పూర్వోపస్థితమయిన సగుణశాస్త్రము బాధింపబడుతుంది. సగుణ శాస్త్రముతో గుణముల ప్రతిపాదన జరిగిన తరువాతనే నిర్గుణశాస్త్రముచే గుణాభావము ప్రతిపాదితము కావచ్చును. అభావజ్ఞానానికి ప్రతియోగి జ్ఞానము కారణము అవుతుంది. నిర్గుణశాస్త్రముతో సగుణశాస్త్రము బాధ జరుగగనే బ్రహ్మనిర్గుణుడని సిద్ధిస్తుంది. కాబట్టి మొదట చెప్పిన పూర్వ ప్రవృత్తి గలిగిన సగుణ శాస్త్రాన్ని వదలిపెట్టక ఉత్తర ప్రవృత్తీ శీలమయిన నిర్గుణశాస్త్రాన్ని ఒప్పుకోకతప్పదు.

అపచ్ఛేదాధికరణము ప్రవర్తించుస్థలము: ఈ అధికరణము పయి సగుణ నిర్గుణ శాస్త్రవిషయములో ప్రవర్తించదు. దీనికి ప్రవృత్తి ఎప్పుడు? ఏ శాస్త్రములకు విరోధము నియతము కాదో ఎప్పడో ఒకప్పుడే విరోధము కలుగుతుందో, విరోధము ఒకప్పుడు కలుగదో ఏ శాస్త్రములలో పౌర్వాపర్యము మొదలు తరువాత, నియతముగా లేదో అట్లాటి రెండు శాస్త్రముల విషయము లోనే అపచ్ఛేదన్యాయము పనిచేస్తుంది. ఇట్లా విరోధము పౌర్వాపర్యము నియతముగా లేని శాస్త్రవిషయములో అపచ్ఛేదన్యాయము ప్రవర్తిస్తుంది. ప్రకృతంలో సగుణశాస్త్రము, నిర్గుణ శాస్త్రములలో విరోధము నియతమయి ఉన్నది. పౌర్వాపర్యము గూడ నిశ్చయింపబడి ఉన్నది. సగుణశాస్త్రము ప్రవర్తించిన పిదప నిర్గుణశాస్త్రము ప్రవృత్తము అవుతుంది. అభావజ్ఞానము గురించి ప్రతియోగిజ్ఞానమే కారణమవుతుంది. నియత విరోధము నియత పౌర్వాపర్యము ఉన్నట్టి సగుణ నిర్గుణ శాస్త్రముల విషయములో అపచ్ఛేదన్యాయ ప్రవృత్తి ఉండదు. నియతవిరోధము కల సగుణ నిర్గుణశాస్త్రవిషయంలో విరోధాధికరణన్యాయమే ప్రవృత్తమవుతుంది. యుక్తము.

విరోధాధికరణన్యాయము: పూర్వమీమాంసా ప్రథమాధ్యాయము తృతీయ పాదములో విరోధాధికరణ న్యాయము ఉన్నది. దీని ప్రధాన సూత్రము 'విరోధే త్వనపేక్ష్యం స్యాదసతి హి అనుమానమ్' అని. ఈ సూత్రము 'ఔదుంబరీం స్పృష్ట్వా ఉద్గాయేత్' అని శ్రుతి విధిస్తున్నది. ఉద్గాతా అను ఋత్విక్కు ఔదుంబరిని ముట్టుకొని ఉద్గానము చెయ్యాలి అని అర్థము. ఔదుంబరీ సర్వా వేష్టయితవ్యా అని స్మృతివాక్యము. ఔదుంబరిని మొత్తము కప్పివేయాలి అని అర్థము. ఇక్కడ విరోధము. ఔదుంబరిని మొత్తం కప్పివేస్తే దానిని తాకడం ఎట్లా? కనుక ప్రశ్న ఏమిటంటే ప్రత్యక్ష శ్రుతికి విరుద్ధమయిన స్మృతి వచనము ప్రమాణామా? కాదా? పూర్వపక్షి స్మృతి వచనాన్నే ప్రమాణము అంటాడు. స్మృతివాక్యములు శ్రుతి మూలకము లయినందుననే ప్రమాణము కనుక ఈ స్మృతి స్మృతివచనము కూడ ప్రమాణమని ఒప్పుకోవాలి, ఈ స్మృతి వెనుక కూడ ఏదో ఓ శ్రుతి ఉండ వచ్చును. ఈ స్మృతివచనలింగము ద్వారా ఈ స్మృతికి కూడ శ్రుతిని అను మానించి తెలుసుకోవచ్చును. దీనిని సిద్ధాంతి ఇలా ఖండిస్తాడు–

శ్రుతివచనము శీఘ్రముగా యథార్థజ్ఞానాన్ని కలుగిస్తుంది. శ్రుతివచన మునకు మరియొక ప్రమాణము అవసరము లేదు. స్మృతివచనము ఆలస్యముగా యథార్థ జ్ఞానమును కలిగిస్తుంది. దీనికి కారణము స్మృతివచనము తనకు మూలము అయిన శ్రుతివచనమును అపేక్షించియే జ్ఞానము కలిగిస్తుంది. 'ఔదుమ్బరీం స్పృష్ట్వా ఉద్గాయేత్' అను ప్రత్యక్షశ్రుతి వాక్యము ఔదుంబరి యొకస్పర్శను విధిస్తున్నది. ఔదుంబరిని మొత్తము కప్పి వేస్తే తాకడము వీలుకాదు. ఇట్లా వేష్టనస్మృ తిప్రత్యక్షశ్రుతికి విరుద్ధముగా ఉన్నది. కనుక అప్రమాణము. ప్రత్యక్షశ్రుతితో విరోధము లేకుంటే స్మృతితో శ్రుతి అనుమానము జరుగవచ్చును. ఈ విధముగా ఈ అధికరణము ప్రత్యక్షశ్రుతి విరుద్ధమయిన స్మృతిని అప్రామాణికము అని సిద్ధింపచేస్తున్నది. (ఔదుమ్బరీ–అత్తిచెట్టు యొక్క శాఖ కావచ్చును). ఇక్కడ ఈ విషయాన్ని కూడ



గమనించాలి. శ్రుతి మొదలు జ్ఞానము కలిగిస్తుంది నిరపేక్షమయిన ప్రమాణము. అర్థజ్ఞానము కలిగించడానికి మరి ఒకప్రమాణం ఆవశ్యకత దీనికి లేదు. అదేస్మృతి చూడండి. ఆలస్యంగా అర్థజ్ఞానాన్ని కలిగిస్తుంది. తనకు మూలమయిన శ్రుతివచనము యొక్క అవమానం కూడ చెయ్యాలి. దానికి తగిన శ్రుతి వచనాన్ని వెదుక్కోవాలి. ఇట్లా అర్థబోధ కలిగించడంలో శ్రుతి పూర్వము, స్మృతి ఉత్తరము అని పౌర్వాపర్యము కూడ ఉన్నది. ఈ రెండింటిలో మొదట శ్రుతి వచనముతో యథార్థ జ్ఞానము కలుగుతున్నది. దానికి విరుద్ధమయిన అర్థము స్మృతి వచనము చెప్పుతున్నది. ఆ విరుద్ధమున అర్థము బాధితము అవుతుంది. శీఘ్రజ్ఞానము కలిగించే ప్రమాణము ఆలస్యముగా జ్ఞానము కలిగించే ప్రమాణము కంటే బలవంతము. ఈ న్యాయాన్ని బట్టి ఆలస్యముగా జ్ఞానము కలిగించే స్మృతికన్న శీఘ్రముగా జ్ఞానము కలుగించు శ్రుతి బలవతి అని తేలుతున్నది. ఇట్టి స్థితిలో విరోధి అయిన పరశాస్త్ర స్మృతి తలెత్తదు. జ్ఞానమును కలిగించదు. శ్రుతివిరుద్ధ స్మృతి అప్రమాణము గద!

సగుణశాస్త్రము మరియు నిర్గుణశాస్త్రములో పరస్పరవిరోధము నియతముగా ఉన్నది. పౌర్వాపర్యము కూడ నిశ్చితముగా ఉన్నది. సగుణశాస్త్రము మొదట బోధ కలిగించుతుంది. నిర్గుణశాస్త్రము తర్వాత బోధను కలిగిస్తున్నది. గుణములను నిషేధించాలి అంటే పూర్వము ప్రతియోగులయిన గుణముల జ్ఞానము ఆవశ్యకము. ఇట్టి స్థితిలో మొదట ప్రవృత్తమయిన సగుణశాస్త్రముచే గుణములయొక్క జ్ఞానము కలుగుతేనే, గుణములతో విరోధమును కల్గిన నిర్గుణ శాస్త్రము ప్రవృత్తము కానేకాదు. జ్ఞానమును కలిగించదు. శ్రుతివిరుద్ధమయిన స్మృతి బాధితమయినట్టు సగుణవిరుద్ధమయిన నిర్గుణశాస్త్రము బాధితమవుతుంది.

అద్వైత విద్వాంసులకొరకు ఇట్లా చెప్పడము, వారు సగుణనిర్గుణ శాస్త్రాలకు విరోధమని తలుస్తారు కనుక. వాస్తవముగా విశిష్టాద్వైతము

ప్రకారముగా కూడ సగుణశాస్త్రము నిర్గుణశాస్త్రముల మధ్య విరోధము లేదు. ఉత్సర్గాపవాదన్యాయానుసారముగ రెండు శ్రుతుల యొక్క విషయము వేరువేరు. పరస్పరము పడనట్టి రెండు వస్తువుల యొక్క విషయము ఒక్కటే ఉంటుందో అక్కడ విరోధముంటుంది. ఈ శ్రుతులలో భాసించే విరోధాన్ని ఉత్సర్గాప వాదన్యాయం తొలగిస్తుంది.

ఉత్సర్గాపవాదన్యాయము: పూర్వమీమాంసలో 'న హింస్యాత్ సర్వా భూతాని' అని ఓ వాక్యము ఉన్నది. ఏ ప్రాణిని హింసించరాదు అని దీనర్థము. మరో వాక్యము 'అగ్ని షోమీయం పశుమాలభేత' అగ్ని షోమీయము అయిన పశువును చంపాలి అని దీనర్థము. ఈవాక్యములు రెండు పరస్పర విరుద్ధములు. ఒకటి హింస చేయవద్దని బోధిస్తుంది. రెండవది పశువును చంపాలి అని బోధిస్తున్నది. ఉత్సర్గాపవాదన్యాయము ఈ రెండువిరోధము కలిగిన వాక్యములను చూసి 'న హింస్యాత్ సర్వాభూతాని' అను వాక్యానికి యజ్ఞీయహింస తప్ప హింసను నిషేధిస్తున్నది. యజ్ఞీయ హింస చేయవచ్చును అని ఉత్సర్గాపవాదన్యాయము బోధిస్తున్నది. అట్లానే నిర్గుణవాక్యములు సగుణ వాక్యములలో చెప్పబడిన కల్యాణగుణములను వదలిపెట్టి బ్రహ్మలో హేయమయిన గుణములు లేవని తెలుపుతున్నవి.

సామాన్యవిశేషన్యాయము ద్వారా 'పశుమాలభేత' అనువాక్యములోని పశుసామాన్య వాచకమయిన పశుశబ్దమునకు 'ఛాగస్యవసాయాః' అను మంత్రములో వర్ణింపబడిన ఛాగము అనుపేరు గల పశువిశేషములో పర్యవసానము ఎట్లా జరుగుతుందో, అట్లాగే నిర్గుణవాక్యములలోని సామాన్య గుణనిషేధము 'అపహతపాప్మా' ఇత్యాది వాక్యములద్వారా ప్రతిపాదితమయిన పాపాది దుర్గుణముల నిషేధములో పర్యవసానము అవుతుంది. తత్త్వసారము అను గ్రంథములో కూడ ఈ విషయము విషయము భిన్నమయినందున సగుణ నిర్గుణ వాక్యములమధ్య విరోధము లేదు అని ప్రతిపాదింపబడినది.



బ్రహ్మలో గుణాదివిధానము చేయు వాక్యములు మంగలగుణాది విధానములో తాత్పర్యము గలవి. గుణాది నిషేధము చేయు వాక్యములు దుర్గుణముల నిషేధములో తాత్పర్యము గలిగియున్నవి. అని విషయభేదముచే విరోధము లేదనుట స్పష్టము.

భేదమును చెప్పునట్టి అభేదమును చెప్పునట్టి శ్రుతులయొక్క తాత్పర్య నిర్ణయము రెండింటి మధ్యన ఉన్న విరోధమును ఘటక శ్రుతుల ద్వారా తీసివేయవచ్చును. భేదశ్రుతులు ప్రకారభూతమయిన చేతనా చేతనములు. ప్రకారీ భూతమయిన ఈశ్వరునికంటే ఎట్లా భిన్నమో తెలియజేస్తున్నాయి. అభేదశ్రుతులు 'అయమాత్మా బ్రహ్మ, సర్వం ఖల్విదం బ్రహ్మ' మొదలయినవి. చేతనాచేతన విశిష్టబ్రహ్మయొక్క ఏకత్వమును ప్రతిపాదిస్తున్నవి. ఈ అర్థమును ఘటక శ్రుతులు తెలియజేస్తున్నాయి. వీటికే అంతర్యామి శ్రుతులు అని కూడ పేరు. సంపూర్ణమయిన జగత్తు పరమాత్మ యొక్క శరీరమని పరమాత్మ జగత్తు యొక్క ప్రకారి అని వివరిస్తున్నాయి. జగత్తు పరమాత్ముని మధ్య ఉన్నట్టి శరీరాత్మ భావము వలన జగత్తు ప్రకారమని పరమాత్మ ప్రకారి అని సిద్ధిస్తున్నది. శరీరము ఆత్మ యొక్క ప్రకారము ఆత్మ శరీరి ప్రకారి అవుతున్నాడో అదే విధముగా 'ఐతదాత్మ్యమిదం సర్వమ్' అనుదానితో సంపూర్ణజగత్తుకు పరమాత్మ ఆత్మ పరమాత్మకు జగత్తు శరీరము అవుతుంది. 'యస్యాత్మా శరీరమ్'– ఈ ఆత్మ పరమాత్మ యొక్క శరీరము అని తెలుపుతున్నది. 'జగత్ సర్వం శరీరం తే భగవన్' సంపూర్ణమయిన జగత్తు నీ యొక్క శరీరము. ఇట్లా శ్రుతులలో స్మృతులలో వర్ణింపబడిన సంపూర్ణమయిన జగత్తు పరమాత్ముని శరీరము అయిన కారణము చేత ప్రకారము అవుతుంది. పరమాత్మ జగత్ యొక్క ఆత్మ అయినందున ప్రకారి అవుతాడు.

జ్ఞాతాజ్ఞేయము మొదలయినవి భేదములు. వాటిని కల్పించునది అవిద్య అని అద్వైతులు కల్పిస్తారు. అట్టి అవిద్యాకల్పనలో ప్రమాణము ఏదీ లేనందున అవిద్య సిద్ధించదు.

జగత్ సత్యత్వము. సదేవ అను శ్రుతి బ్రహ్మ జగత్కారణమని జగత్తు బ్రహ్మయొక్క కార్యమని తెలియజేస్తున్నది. సత్యమయిన మట్టితో సత్యమయిన కుండయే తయారు అయినట్టు సత్యమయిన బ్రహ్మతో తయారయ్యే కార్యజగత్తు సత్యమే. జగత్తు యొక్క సత్యత్వము ప్రత్యక్ష ప్రమాణముతో కూడ సిద్ధిస్తున్నది. కనుక అద్వైతులు కోరుకున్నట్లు జగత్తు యొక్క మిథ్యాత్వము అనుమానంతో సిద్ధించదు. ప్రత్యక్షప్రమాణం ఆధారంగానే మిగతా ప్రమాణాలు, ప్రమాణాలుగా సిద్ధిస్తున్నాయి. ప్రత్యక్షము ఉపజీవ్యము. అనుమానము ఉపజీవకము. ఉపజీవక ప్రమాణముతో ఉపజీవ్యప్రమాణము బాధితము గాదు. అగ్నియొక్కజ్వాలలు అనేకములు అనే అనుమానముచేత జ్వాల ఒక్కటే అను ప్రత్యక్షము బాధిత మవుతున్నట్టుగా ఇక్కడ కూడ అనుమానంతో ప్రత్యక్షము బాధ జరుగ వచ్చును గదా అనరాదు. అది కారణదోషముచే బాధప్రతీతి కారణముచే ఆ బాధ జరుగుచున్నది. భిన్నభిన్న జ్వాలలోని సామగ్రి నూనె వత్తి భిన్నముగా ఉన్నాయి. వాటితో ఉత్పన్నమయ్యే జ్వాలలు భిన్నములే కావాలి, కనుక జ్వాలైక్యప్రతీతికి బాధే కలుగుతున్నది. నిర్దోష ప్రత్యక్షము యొక్క బాధ అనుమానముతో జరుగదు. పయిన జ్వాల విషయము దోషముతో కూడినది కనుక బాధ జరిగినది. అట్లాగే నిర్దోషప్రత్యక్షవిషయ మయిన జగత్తు యొక్క సత్యత్వమును బాధించుట జరుగదు. నిజము కాదన లేము. కాబట్టి జ్ఞాతృజ్ఞేయత్వాది విశిష్టము వివిధభేదవిశిష్టము విచిత్రము అయిన జగత్తు బ్రహ్మ యొక్క కార్యము మరియు సత్యము మిథ్యకాదు.

అవిద్యోపహిత బ్రహ్మకు సంసరణము అని ఒప్పుకుంటే జీవునిలో కనబడే అన్ని దోషములు బ్రహ్మలో సంక్రమిస్తాయి. ఇలాంటప్పుడు బ్రహ్మను దోషరహితునిగా కల్యాణగుణాత్మకునిగా ప్రతిపాదించే శ్రుతులకు విరోధము ఏర్పడుతుంది. శ్రుతులన్ని బ్రహ్మ స్వేతరసమస్తవస్తు విలక్షణము అని, సమస్తానికి ఆశ్రయమని, ఆశ్రితజీవుల పాపతాపములను నశింపజేయు వాడని ఘోషిస్తున్నాయి. పరబ్రహ్మనే అజ్ఞానములో చిక్కుకుంటే జీవులను రక్షించే నాథుడేడి?



నివర్తకానుపపత్తి:- తత్త్వమస్యాది వాక్యజన్య జ్ఞానము అవిద్యను తొలగిస్తుంది అని వాదన. ఇది సరికాదు బ్రహ్మవ్యతిరిక్తమయినదంత మిథ్య. మరియు అవిద్యాకల్పితము. అలాంటప్పుడు అవిద్యావినాశకజ్ఞానము శ్రుతుల వలన కలుగుతుంది అని చెప్పలేరు. అవిద్యా కల్పిత మయినందున శ్రుతి దోష జన్యము, దాని వలన గలిగే జ్ఞానము దుష్టము అవుతుంది. కాబట్టి ఆ జ్ఞానంద్వారా అవిద్య తొలగిపోవడం గానీ, అవిద్యాకార్యభూతమయిన ప్రపంచము తొలగిపోదు, బాధింపబడదు.

పరిచితులయిన ఇద్దరు వ్యక్తులున్నారు. కళ్ళు సరిగ పనిచేయవు. ఒకడు తాడును చూసి పాము అనుకొని భ్రమపడ్డాడు. ఆ భ్రమను తొలగించాలని రెండవవాడు ఇది పాముకాదు తాడు అని చెప్పినా మొదటి వాడు నమ్మడు. కారణం తనలాగా వాడికి కూడ సరిగా కనబడదని మొదట భ్రమకలిగిన వాడికి తెలుసు కాబట్టి. ఇట్లాగే అద్వైతి సాధకుడు శాస్త్రమును వినేప్పుడే బ్రహ్మవ్యతిరిక్తమయినది. కనుపడేదంతా అవిద్యాకల్పితము అని తెలుసుకుంటాడు, కనపడే దానిని ప్రతీతి భ్రమవలన కలుగుతున్నదను కుంటాడు. అంతా మిథ్య అనుకుంటాడు. అలాటప్పుడు ఆ సాధకునిలో శాస్త్రము, ప్రపంచము బాధక జ్ఞానమును కలిగించలేదు. అవిద్య వలన కలిగినది శాస్త్రము దాని వలన జ్ఞానము కలిగినది. అవిద్యవలన కలిగిన శాస్త్రజ్ఞానము అవిద్యవలన కలిగిన ప్రపంచమును తొలగించలేదు. నివర్తకము కాలేదు.

ఈ విచారణతో తేలిందేమంటే అద్వైతవాదము అనుపపన్నము. అద్వైతా భిమతమయిన నిర్విశేష చిన్మాత్రమయిన బ్రహ్మసిద్ధి జరుగదు. సదేవశ్రుతితో బ్రహ్మ యొక్క విశేషాలెన్నో తెలుస్తున్నాయి. ఆ శ్రుతితో బ్రహ్మ యొక్క నిర్విశేషత్వము సిద్ధింపదు. ఈ వాక్యములో అగ్రే పదముతో సృష్టికి పూర్వము ఉన్న ప్రలయకాలము అను కాలవిశేషము సిద్ధిస్తున్నది. ఈ శ్రుతి బ్రహ్మజగత్తుల మధ్య కారణకార్య భావమును సిద్ధింప ప్రవృత్తమయినది.

ఆసీత్ పదముతో క్రియావిశేషము సిద్ధిస్తున్నది. ఏకమేవ పదముతో జగదుపాదానత్వము అద్వితీయం పదముతో జగన్నిమిత్తత్వము సిద్ధిస్తున్నది. ఇట్లా ఈ శ్రుతి బ్రహ్మకు అభిన్ననిమిత్తో పాదాన కారణత్వ రూపవిశేషాన్ని సాధిస్తున్నది. ఈ శ్రుతి సవిశేషబ్రహ్మనే విషయముగా కలిగియున్నది నిర్విశేషమును కాదు. నారాయణుడే జగత్కారణము మోక్షప్రదుడు. అతడే బ్రహ్మ. బ్రహ్మ సవిశేషుడే నిర్విశేషుడు కాదు. సూక్ష్మ చేతనా చేతన విశిష్ట బ్రహ్మకారణము. స్థూలచేతనా చేతన విశిష్టమయిన బ్రహ్మ కార్యము. ఇట్లా విశిష్టాద్వైతాభిమత మయిన కారణమునకు కార్యమునకు అనన్యత్వము సిద్ధిస్తుంది. ఇదియే విశిష్టాద్వైతవేదాంత సంప్రదాయము.

## పరమతనిరాసపూర్వకం సిద్ధాన్త్యభిమతేశ్వరాఙ్గీకారే దోషాభావ సమర్థనమ్:

మూ: ఏవ మీశ్వరాఙ్గీకారాత్ నిరీశ్వర సాఙ్ఖ్యమీమాంసకాది మతనిరాసః ఏతస్యైవోపాదానత్వస్వీకారాత్ యోగపాశు పతసైయాయిక మతనిరాసః. తైర్నిమిత్త కారణమాత్రేశ్వరాఙ్గీకారాత్. ఈశ్వరస్య కార్యం ప్రతి ఉపాదానత్వ నిమిత్తత్వవత్ కర్తృత్వ ప్రేరకత్వనియంతృత్వ ప్ర(శాసి) కాశయితృత్వానుమన్తృత్వ సహకారిత్వో దాసీనత్వాదిక ముపపద్యతే. బాల్యయౌవనావస్థాదయో దోషా యథా శరీరగతా న తు శరీరిణి జీవే, ఏవం చిదచిచ్ఛరీరిణః పరమాత్మనోఽపీతి న నిర్వికార శ్రుతివిరోధః. నియమేన తదాధేయత్వ–విధేయత్వ–శేషత్వాదేః శరీరలక్షణస్య జగతి విద్యమానత్వాత్ జగచ్ఛరీర ఈశ్వరః తద్గతదోషైరసంస్పృష్టశ్చ.

అ: ఈవిధముగా జగత్తుకు కారణముగా ఈశ్వరుని ప్రతి పాదించడము జరిగినది. దీనివలన ఈశ్వరుడు లేడని వాదనచేసే సాంఖ్యులు, మీమాసంకుల మత ఖండనము జరిగినది. ఉపాదాన కారణము ఈశ్వరుడు అని ఒప్పుకున్నందున ఈశ్వరుడు నిమిత్తకారణము మాత్రము అని ఒప్పుకున్నట్టి యోగము, పాశుపతము, సైయాయికమతము ఖండనము జరిగినది.



కార్యమయిన జగత్తుకు, దానిగురించి, ఉపాదానత్వము, నిమిత్తత్వము, ఉన్నట్లుగా, కర్తృత్వము, ప్రేరకత్వము, నియంతృత్వము, ప్రశాసితృత్వము, ప్రకాశయితృత్వము, అనుమంతృత్వము, సహకారిత్వము, ఉదాసీనత్వము మొదలయినవి కూడ గుణములుగా సిద్ధిస్తున్నవి. బాల్యము, యౌవనము మొదలయినవి శరీరమునకు వచ్చు అవస్థలు, దోషాలు ఏవయినా ఉంటే అవి శరీరానికి వర్తిస్తాయి. కానీ శరీరికి – ఆత్మకు కాదు, జీవునకు గాదు, ఇట్లాగే పరమాత్మునకు చిత్ అచిత్ అనునవి శరీరము, వికారములన్ని శరీరమునకు కానీ శరీరి – పరమాత్మకు కాదు. కావున నిర్వికార శ్రుతులకు విరోధము రాదు. ఈ చిదచిచ్ఛరీరము నకు పరమాత్ముని పయిన ఆధార పడినందున, అతడి చెప్పుచేతలలో ఉన్నందున అతనికి ఉపయోగము అయినందున ఆధేయత్వము, విధేయత్వము, శేషత్వము అనుగుణములు శరీరలక్షణములన్ని జగత్తులో ఉన్నవి జగచ్ఛరీరుడు ఈశ్వరుడు, శరీరములోని దోషములు ఏమి అంటవు ఆయనను తాకవు.

వి: ఈశ్వరునకు జగత్తు యొక్క అభిన్ననిమిత్తోపాదానత్వము సిద్ధము అయినది. సాంఖ్యులు, మీమాంసకులు ఈశ్వరుని అంగీకరించరు. ఈశ్వరుడుంటే అతని ఉపలబ్ధి ఉండేది. (ఉపలబ్ధి – దొరకడము, కనబడడము, ఉండడము అని, అనుపలబ్ధి – దానికి విరుద్ధము అని అర్థము). ఈశ్వరుని ఉపలబ్ధి లేదు కనుక ఈశ్వరుడు లేడని వారి వాదము. వీరివాదన సరియయినది కాదు. యోగ్యానుపలబ్ధి యే ఏవస్తువు నయినా లేదని నిరూపిస్తుంది. అయోగ్యానుపలబ్ధిద్వారా ఏవస్తువు యొక్క అభావాన్ని నిరూపించలేము. ఉపలబ్ధి కావడానికి తగినది యోగ్యము, దానివిషయము యోగ్యము అయి ఉండాలి. ఈ యోగ్యత ఎట్లా వస్తుంది. వస్తువు ఉద్భూత రూపము – రూపము పుట్టినది కావాలి, అట్లాగే ఉద్భూతమహత్త్వము కలది – పరిమాణములో పెద్దదిగా (త్రసరేణువు కంటే పెద్దగా – చక్షురింద్రి యమునకు గోచరము అగునట్లుగా లేదా ఏదయినా ఇంద్రియముచే గ్రహింప

బడునట్లుగా నయినా ఉండాలి. అది మహత్త్వము కలిగియుండుట అన్నమాట.) ఉండి ఉండాలి. అట్లా ఉండే వస్తువు, ఉపలబ్ధము కాకపోతే అనుపలబ్ధి అనుప్రమాణము దాని అభావమును సిద్ధింపజేస్తుంది. ఈశ్వరుడు ఈ రెండు విధాలుగా లేనందున యోగ్యానుపలబ్ధికి విషయము కాడు. విషయము కాని ఈశ్వరుని అనుపలబ్ధి ప్రమాణము లేడని సిద్ధింపచేయదు.అయోగ్యవిషయాలను అభావప్రమాణము తన విషయము చేసుకునేట్టయితే ఆత్మ – పరమాత్మభేదమును మీమాంసకులు సాంఖ్యులు చేయలేరు. ప్రత్యక్ష విషయము పరమాత్మ కాదు కనుక అతని సాక్షాత్కారము కాదు. కనుక అనుపలబ్ధి ప్రమాణముతో అతని భావము కూడ సిద్ధించదు.

చార్వాకులు మేము శరీరమును ఆత్మ అని ఒప్పుకుంటాము (ఆత్మను చూస్తాము) కనుక పరమాత్మ సాక్షాత్కారము తప్పక అవుతుంది అని అంటారు. దానికి జవాబు మీరు శరీరమును చూడగలుగుతున్నారు. దాని జ్ఞానమును సాక్షాత్కారింపజేసుకోలేరు. ఇతర శరీరాత్మల జ్ఞానమును ప్రత్యక్షమునకంటె భిన్నమయిన ప్రమాణము ద్వారా తెలుసుకుంటాము – శరీరాత్మ ఎక్కడ ఉందో అక్కడ జ్ఞానముంటుంది. నా శరీరాత్మలో వలె ఇది శరీరాత్మయే, అందుకే ఇందులో కూడ జ్ఞానముంది. అను అనుమానంతో తెలుసుకుంటాము అని చార్వాకులు అనవచ్చును. అయితే మేము ఇట్లాగే ఈశ్వరుని జగత్కర్తగా అనుమానంతో సిద్ధింపజేయవచ్చును. ఏది కార్యమో దానికి కర్తకూడ అవశ్యముగా ఉంటాడు. క్షిత్యంకురాదికము సకర్తృకము కార్యము గనుక క్షిత్యంకురాదికము కార్యము కనుక దీనికి కూడ కర్త ఉంటాడు. ఆ కర్త ఈశ్వరుడు. క్షితి, అంకురము మొదలయినవి సావయవములు కాబట్టి కార్యము. ఏది సావయవమో అది కార్యము. కుండ వలె, ఇట్లా భూమి, అంకురము మొదలయిన వాటి కర్తగా ఈశ్వరుడు సిద్ధిస్తాడు.

ఈశ్వరుడు జగత్కర్త అయితే అతడు శరీరధారి కావాలి. ఎవడు కర్తనో, వాడు శరీరధారి, కుండలను చేయుకుమ్మరివలె అని అనుమానంతో



ఈశ్వరునికి శరీరధారిత్వము సిద్ధిస్తుంది అని చారాక్వులు మళ్ళీ పూర్వ పక్షము చేయవచ్చును. ఈశ్వర వాదులయిన మీకు ఇది ఇష్టము కాదు, జవాబు ఏమంటే – ఈశ్వరుని కర్తగా మేము ఒప్పుకుంటాము, శరీరము కర్త కాదుగద. కర్తకు శరీరము కూడ ఒక సాధనము మాత్రమే. లోకంలో చూస్తుంటాము సమర్థుడయిన కర్త అంతట దొరికే సాధనములు లేకున్నా ఆయా పనులను చేస్తుంటాడు. శ్రుతులు ఈశ్వరుని సర్వసమర్థుడని తెలుపు తున్నాయి. కనుక ఈశ్వరుడు శరీరాది సాధన సామగ్రి లేకున్నా, తన సత్యసంకల్పము మొదలయిన వాటి ద్వారా జగద్ వ్యాపారమును నిర్వహిస్తాడు. శ్రుతులు కూడ జగత్తు యొక్క సృష్టికి అవసరమయినట్టి చేతనాచేతన శరీరము పరమాత్మ కున్నదని ప్రతిపాది స్తున్నవి. పరమాత్మయే జగత్తు యొక్క స్రష్ట, పాలకుడు, సంహారకుడు, మోక్షప్రదుడు అని శ్రుతులు స్పష్టముగా తెలుపుతున్నాయి. 'జన్మాద్యస్య యతః' బ్ర. సూ. 1. 1. 2లో బాదరాయణమహర్షి ఈవిషయమునే బాగుగ నిరూపించారు.

అదికాదు, ఈశ్వరుడంటూ ఉంటే తత్త్వవేత్తలలో అగ్రగణ్యుడయి నట్టి కపిలమహర్షి తప్పకుండ చెప్పేవాడు. ఆయన చెప్పలేదు కనుక ఈశ్వరుడు లేడు. ఆ మహర్షి స్వతంత్రమయిన ప్రకృతికే జగత్కారణ త్వమును ప్రతిపాదించాడు. అది సరికాదు. యోగులకుకూడ జీవస్వ భావము కారణముగా అప్పుడప్పుడు భ్రమ కలుగుతుంటుంది. బాదరాయణ మహర్షి భ్రమపూర్ణ మయినందున కపిలస్మృతి అను పాదేయము అని 'స్మృత్యనవకాశ దోషప్రసంగ ఇతి చేత్ నాన్యస్మృ త్యనవకాశదోష ప్రసఙ్గాత్' బ్ర.సూ. 2. 1. 1లో వివరించారు.

ఈశ్వరుని ఒప్పుకోని మీమాంసకులు కూడ జైమినిమహర్షి అభి ప్రాయాన్ని సరిగా తెలుసుకోలేక పోయారు. 'పరం జైమినిః ముఖ్యత్వాత్' బ్ర.సూ. 4. 3. 11 వలన జైమిని మహర్షికి కూడ ఈశ్వరాస్తిత్వమే అభిమతమని తెలుస్తున్నది.

పాశుపతమతానుయాయులు, యోగమతావలంబులు ఈశ్వరుణ్ణి అయితే ఒప్పుకుంటారు. కాని ఆయనను జగత్తుకు ఉపాదాన కారణము నిమిత్తకారణముగా (రెండింటిగా, అభిన్నముగా ఒక కారణముగా) ఒప్పుకొనరు. కార్యము యొక్క ఉపాదానకారణము ఏదయినా జడము కావాలి, ఉపాదాన కారణమే కార్యరూపముగా పరిణామము జరుగుతుంది. ఈశ్వరుడు చేతనుడు సర్వజ్ఞుడూను. జ్ఞాత అయిన ఈశ్వరుడు కార్యరూపముగా పరిణామము చెందుతాడనడము తగినది కాదు. అందుకే ఈశ్వరుణ్ణి జగత్తుకు నిమిత్త కారణముగా ఒప్పుకుంటాము. 'యతో వా' ఇత్యాది శ్రుతికూడ ఈశ్వరుడిని జగత్తుకు నిమిత్తకారణము గానే తెలుపుతున్నది. ఆయన జగత్తుకు అధిష్ఠాత అయినందున కూడ కుండకు కుమ్మరి నిమిత్త కారణమయినట్లు నిమిత్తకారణము అని సిద్ధిస్తుంది అని వాదిస్తారు.

వీరి ఈవాదన సరికాదు. ఈశ్వరుని సిద్ధింపజేసే శ్రుతులే ఈశ్వరుని జగత్తుకు అభిన్న నిమిత్తోపాదన కారణమని ప్రతిపాదిస్తున్నాయి. ఈశ్వరుడు సర్వశక్తిమంతుడు. జగత్తుకు నిమిత్తకారణము అయినట్లుగానే జగత్తుకు ఉపాదాన కారణము కూడ కాగల సామర్థ్యమూ ఉన్నవాడు. తన సూక్ష్మ చేతనాచేతనరూపమయిన ప్రకారము అను అంశమును వదలి పెట్టి స్థూలచేతనా చేతన రూపమయిన ప్రకారాంశమును గ్రహించి కార్యముగా మారతాడు. ప్రకారమును విశేషణమును వదలి ఇంకొక ప్రకారమును గ్రహించుతాడు. నామరూప విభాగమునకు అర్హముగాని అవస్థను వదలిపెట్టి నామరూప విభాగములకు అర్హమయినట్టి అవస్థను పొందడమే, ఉపాదాన భూతుడయిన ఈశ్వరుడు కార్యమయిన జగత్తు రూపముగా పరిణామము చెందుట అని భావము. కనుకనే ఈశ్వరుడు జగత్తుకు అభిన్ననిమిత్తోపాదాన కారణము అని చెప్పడంలో ఎట్టి విప్రతిపత్తి ఉండబోదు.

ఈశ్వరునిలో జగత్తు యొక్క ఉపాదానత్వము నిమిత్తత్వము అను కారణత్వము ఎట్లా సిద్ధిస్తుందో అట్లానే కర్తృత్వము మొదలయిన గుణములు



సిద్ధిస్తాయి. 'హన్తా అహమిమాస్తిస్రో దేవతా అనేన జీవేనాత్మనా అనుప్రవిశ్యనామరూపే వ్యాకరవాణి' అను శ్రుతి బ్రహ్మకు వ్యాకర్తృత్వమును ప్రతిపాదిస్తున్నది. 'క్షరం ప్రధానమమృతాక్షరం హరక్షరాత్మనా వీశతే దేవ ఏకః' అనుశ్రుతి. వికారము–మార్పు గలిగిన ప్రకృతిని అనుభవించుటకు జీవుడు అమృతమును గ్రోలుతాడు, ప్రకృతిని జీవుని ఇద్దరిని నియమించువాడు పరమాత్మ ఒక్కడే అని తెలుపుతున్నది. ఇది నియంతృత్వము. 'తస్యభాసా సర్వమిదం భాతి' అనుశ్రుతి పరమాత్మనుండి ప్రకాశమును పొంది సంపూర్ణమయిన జగత్తు ప్రకాశిస్తున్నది అని ఈశ్వరుని ప్రకాశయి తృత్వమును స్పష్టపరుస్తున్నది.

బాల్యము, యౌవనము, వార్ధక్యము మొదలయినవి శరీరమునకు కలుగు అవస్థలు – దశలు – వికారములు. శరీరి – ఆత్మమాత్రము ఎట్టి అవస్థలను, దశలను, వికారములను పొందదు, నిర్వికారుడు. పరమాత్మకు శరీరమయిన చేతనా చేతనములలో అవస్థలు, దశలు వికారములు ఉండవచ్చును. దోషము లుండవచ్చును. కాని అవి ఆత్మభూతుడయిన పరమాత్మకు అంటవు. కాబట్టి పరమాత్మను నిర్వికారుడు అని చెప్పు శ్రుతుల వలన చేతనా చేతనాత్మ పరమాత్ముడు అని ఒప్పుకోవడానికి ఎట్టి విరోధము వాటిల్లదు. శరీరములో ఉండే లక్షణాలన్నీ చేతనాచేతనాత్మక జగత్తులో ఉన్నందున జగత్తును శరీరముగా ఒప్పుకోవడంలో తప్పులేదు. ఎవరు ఏది– ఎవరికి శరీరముగా ఉంటుందో వారు, అది. వారికి అనగా తమ ఆశ్రయ భూతమయిన చేతనమునకు తప్పకుండ ఆధేయము, విధేయము మరియు శేషము అవుతుంది. జగత్తుకూడ పరమాత్మకు ఆధేయము, విధేయము మరియు శేషము. పరమాత్మను ఆశ్రయించి ఉన్నందున ఆధేయము, పరమాత్ముని వలన ప్రేరేపింపబడి నియమింపబడియున్నందున విధేయము, పరమాత్ముడు తనకు తోచినట్లుగా జగత్తును తన లీలావస్తువుగా ఆడుకుంటాడు, అనుభవిస్తాడు కనుక జగత్తు శేషము.

## పరమాత్మన ఆనన్త్యప్రతిపాదనమ్:

మూ: స చేశ్వరో విభుస్వరూపశ్చ. విభుత్వం నామ వ్యాపకత్వమ్. తచ్చేశ్వరస్య త్రిధా – స్వరూపతో, ధర్మభూతజ్ఞానతో, విగ్రహతశ్చ. స చానన్త ఇత్యుచ్యతే. అనన్తో నామ త్రివిధపరిచ్ఛేదరహితః. త్రివిధ పరిచ్ఛేదస్తు – దేశతః కాలతో వస్తుతశ్చ. సత్యత్వజ్ఞానత్వానన్దత్వామలత్వాదయ ఈశ్వరస్య స్వరూప నిరూపక ధర్మాః. జ్ఞానశక్త్యాదయస్తన్నిరూపితస్వరూపధర్మాః. సర్వజ్ఞత్వ సర్వశక్తిత్వాదయః సృష్ట్యుపయుక్తధర్మాః. వాత్సల్య సౌశీల్య సౌలభ్యాదయ ఆశ్రయణోపయుక్తధర్మాః. కారుణ్యాదయో రక్షణోపయుక్త ధర్మాః. ఏతేషాం స్వరూపం బుద్ధిపరిచ్ఛేదే నిరూపితమితి నేహ ప్రపఞ్చ్యతే.

అ: ఆ ఈశ్వరుడు స్వరూపమున విభువు. వ్యాపకుడిని విభువు అంటారు. ఈశ్వరుడు జగత్తులో మూడువిధములుగా వ్యాపించి ఉన్నాడు. స్వరూపముతో, ధర్మభూతజ్ఞానముతో మరియు శరీరముతోను. ఈశ్వరుడు అనంతుడు. మూడు విధములయిన కొలతలతో కొలవబడని వాడు. ఆ మూడువిధముల పరిచ్ఛేదము – కొలత – పరిమాణము దేశముతో, కాలముతో, వస్తువుతోను (సంఖ్యతో అన్నమాట.) సత్యత్వము, జ్ఞానత్వము, ఆనందత్వము, అమలత్వము అనునవి ఈశ్వరుని స్వరూపమును నిరూపించు ధర్మములు. జ్ఞానశక్తిమొదలయినవి స్వరూప నిరూపక ధర్మములద్వారా నిరూపింపబడిన ధర్మములు. సర్వజ్ఞత్వము సర్వశక్తిమత్వము మొదలయినవి పరమాత్మకు సృష్టికి ఉపయోగపడు ధర్మములు. వాత్సల్యము, సౌశీల్యము, సౌలభ్యము మొదలయినవి ఈశ్వరుని భక్తులు ఆశ్రయించుటకు తగిన ధర్మములు. కారుణ్యము మొదలయినవి ఈశ్వరుడు రక్షించుటకు ఉపయోగపడు ధర్మములు. ఈ గుణముల స్వరూపము బుద్ధిపరిచ్ఛేదములో విస్తరింప బడినందున ఇక్కడ వివరించడం లేదు.

వి: స్వరూపముతో ఈశ్వరుని వ్యాపకత్వము. వ్యాప్యద్రవ్యములతో సంయోగము కలిగియుండుట వ్యాపకత్వము (విభుత్వము) అటారు. ఈశ్వరుడు



జగత్తు యొక్క వ్యాపకుడు. జగత్తు వ్యాప్యము. ఈశ్వరుని స్వరూపవ్యాపకత్వమును 'ఈశావాస్యమిదం సర్వం' ఈశా. ఉ. 'అను శ్రుతి తెలుపుతున్నది. అట్లాగే

**'యచ్చ కిఞ్చ జగత్ సర్వం దృశ్యతే శ్రూయతేఽపి వా!**
**అన్తర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః'!!**

ప్రపంచంలో ఏది కనబడుతున్నదో వినబడుతున్నదో వాటన్నిటి లోపల వ్యాపకరూపంగా భగవన్నారాయణుడు ఉన్నాడు అని మరో శ్రుతి తెలుపుతున్నది. మళ్ళీ ఈశావాస్యము 'తదన్తస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః. – ఈశ్వరుడు సంపూర్ణ జగత్తు యొక్క లోపల బయట రెండు విధాలుగా వ్యాపకుడుగా ఉన్నాడు. గీతలో అర్జునుడు కూడ 'సర్వం సమాప్నోషి తతోఽసి సర్వః' అన్ని వస్తువులలో పూర్ణరూపంగా ఉన్నావు కనుక సర్వశబ్దము నీకు సరిపోయినది అని చెప్తాడు. అన్ని వస్తువులకన్న పెద్దవాడు కనుక 'మహతో మహీయాన్' అని శ్రుతి చెప్తున్నది. విష్ణుశబ్దవ్యుత్పత్తి– 'చరాచరేషు సర్వేషు వేశనాద్విష్ణురుచ్యతే' సంపూర్ణచరాచరములలో వ్యాపించిఉన్నందున విష్ణువు అని. అందువలననే అప్రమేయాత్మా అని కూడ శ్రుతి స్పష్టపరుస్తున్నది. బ్రహ్మశబ్దానికి యాస్కుడు 'బ్రహ్మపరివృఢం సర్వతః' అని వ్యుత్పత్తి చెప్పాడు. అన్నిటి కంటే పెద్దగా ఉన్నాడు. అన్నివైపులా విస్తరించి ఉన్నవాడు అని అర్థము. ఇట్లా స్వరూపముతో వ్యాపకత్వము సిద్ధిస్తున్నది.

ధర్మభూతజ్ఞానముతో వ్యాపకత్వము – అనగా ఈశ్వరుడు తన జ్ఞానము ద్వారా వర్తమాన' భూత, భవిష్యత్ కాలములలోని వస్తువులను విషయముగా చేసుకుంటాడు. పరమాత్మకు ప్రత్యక్షముగా తెలియని వస్తువేది లేదు. దేశకాలముల హద్దులు ఆయనకు సీమలు కావు. ఆయన జ్ఞానానికి ప్రతిబంధకములు కానేరవు. 'యః సర్వజ్ఞః స సర్వవిత్' పరమాత్ముడు సమస్త వస్తువులను సామాన్యముగా విశేషముగా తెలుసుకొని ఉన్నాడు. కాబట్టి అన్నిటిని తన జ్ఞానానికి విషయము చేసుకున్నందున పరమాత్ముడు ధర్మభూత జ్ఞానముద్వారా వ్యాపకుడు అని సిద్ధిస్తుంది.

విగ్రహము శరీరముద్వారా వ్యాపకత్వము పరమాత్మ తన విరాడ్రూపముతో జగత్తు అంతటా వ్యాపించి ఉన్నాడు. అందుకే 'యస్యాత్మా శరీరమ్' ఆత్మ ఎవనికి శరీరము అని 'యస్య పృథివీ శరీరమ్' భూమి ఎవనికి శరీరము అని 'యస్య సర్వాణి భూతాని శరీరమ్' – ఎవనికి అన్ని భూతములు – పృథివ్యప్తేజో వాయ్వాకాశములను ఐదు భూతములు – భూతములు ఉన్నవి ప్రాణులు అన్ని శరీరము అని శ్రుతులు జగత్తంతా పరమాత్మని శరీరము అని ఘోషిస్తున్నవి.

ఈశ్వరుని ఆనంత్యము: 'సత్యం జ్ఞానమనన్తమ్' అను శ్రుతి బ్రహ్మను, ఈశ్వరుని అనంతుడని తెలుపుతున్నది. ఓ వస్తువు ఏదయినా కాలములో దేశములో వస్తువులో మాత్రము ఉన్నవస్తువును అంతము కలది అంటాము. అట్లాకాక అన్నికాలములలో దేశములలో వస్తువులలో వ్యాపకముగా ఉండే దానిని అనంతము అని అంటారు. 'స భూమిం సర్వతః స్పృత్వాత్యతిష్ఠద్ దశాఙ్గులమ్' పు,సూ. 1. ఆ పరమాత్ముడు సంపూర్ణ మయిన జగత్తును అన్నివిధాల వ్యాపించి దాని వెలుపల అనంతప్రదేశము దాక వ్యాపించి ఉన్నాడు అని వివరిస్తున్నది. బ్రహ్మ వస్తుపరిచ్ఛేదము లేనివాడు, సర్వకాలములలో ఉండువాడు నిత్యుడు కనుక అనంతశబ్దవాచ్యుడు పరమాత్మ.

భగవంతుడు సమస్తకల్యాణ గుణగణములకు నెలవు. ఈ గుణాలన్ని ఆయన ధర్మాలు. ఆయన ధర్మి. ఈ గుణాలు అనేకప్రకారము గల ధర్మరూపములో ఉంటాయి. సత్యత్వము, జ్ఞానత్వము, ఆనందత్వము, అమలత్వము–భగవంతుని స్వరూప నిరూపక ధర్మములు. ఈ గుణాలన్ని భగవంతుని యొక్క స్వరూపమును నిరూపిస్తాయిఅని భావము. జ్ఞానము, శక్తి, బలము, ఐశ్వర్యము, వీర్యము మరియు తేజస్సు అను ఆరుగుణములు కూడ స్వరూపధర్మములే కాని ఇవి మొదట చెప్పిన జ్ఞానత్వము మొదలయిన స్వరూపనిరూపకధర్మములతో నిరూపింపబడినాయి. ఈశ్వరునిలోని సర్వజ్ఞత్వము సర్వశక్తిమత్త్వము అను రెండు ధర్మములు సృష్టి చేయడానికి ఉపయోగపడుతవి.



సర్వశక్తిమంతు డయిన ఈశ్వరుడు ఏమి అయినా చేయడానికి సమర్థుడు. అభిన్ననిమిత్తోపాదానకారణము పూర్వము ఉన్న కల్పమును అనుసరించి సూర్యచంద్రాదులు మొదలు అన్నిటి సృష్టిచేసి వాటికి నామరూపవిభాగము చేస్తాడు.

భగవంతునిలోని వాత్సల్యము, సౌశీల్యము, సౌలభ్యము మొదలయిన గుణాలను తలచుకొని జీవులు అతనిని శరణు వేడుతారు. శరణు జొస్తారు. కనుక ఈ గుణాలు భగవంతుని యొక్క శరణాగతికి ఉపయుక్తములయిన గుణములు. అనాదికాలము నుండి తనకు పరాఙ్ముఖుడుగా ఉన్నను జీవుని భగవానుడు అవ్యాజకరుణా ప్రేరితుడయి రక్షిస్తాడు. 'క్రీడాకారుణ్య తన్త్రః సృజతి సమతయా జీవకర్మాను రూపమ్' అను తత్త్వముక్తా కలాప శ్లోక పాదములో శ్రీమద్ వేదాంతదేశికులు జీవులు చేసిన కర్మలనుబట్టి దానికి తగినట్టు తనకరుణకు అధీనుడయి క్రీడారసము పొందుటకయి జీవులందరినీ సమముగా సృష్టిస్తాడు అని ఆయన కరుణ అందరిపయిన సమముగా ఉంటుందని వివరిస్తారు.

## ఈశ్వరస్యైవ సృష్టిస్థితిసంహారకర్తృత్వమ్:

మూ: అయమీశ్వరః అండసృష్ట్యనంతరం చతుర్ముఖ దక్షకాలాది ష్వంతర్యామితయా స్థిత్వా సృష్టిం కరోతి. విష్ణ్వవతారరూపేణ మను కాలాద్యన్త ర్యామిరూపేణ చ స్థిత్వా రక్షకో భవతి. రుద్రకాలాన్త కాదీనామన్తర్యామితయా సంహారమపి కరోతి. అతః సృష్టిస్థితిసంహారకర్తా చేతి.

అ: ఈ ఈశ్వరుడు బ్రహ్మాండము సృష్టించిన తరువాత, చతుర్ముఖుడు, బ్రహ్మ, దక్షుడు మరియు కాలుడు మొదలైనవారిలో అన్తర్యామిగా ఉంటూ సృష్టిచేస్తాడు. విష్ణువు యొక్క అవతారముతో మనువుకాలము మొదలయిన వాటిలో అంతర్యామిగా ఉంటూ జగత్తును రక్షిస్తాడు. రుద్రుడు, కాలుడు, యముడు మొదలయిన వారి అంతర్యామిగా ఉంటూ జగత్తు యొక్క

సంహారమును నాశమును కూడ చేస్తాడు. ఇట్లా ఈశ్వరుడు జగత్తు యొక్క సృష్టిని, స్థితిని, లయమును చేస్తాడు.

వి: 'యతో వా ఇమాని భూతాని జాయన్తే' యేన జాతాని జీవన్తి, యత్ ప్రయన్త్యభిసంవిశన్తి' అను శ్రుతి బ్రహ్మను జగత్ సృష్టికర్త రక్షకుడు సంహారకర్తగా కూడ తెలుపుతున్నది. ఈ మూడు కలసి జగద్ వ్యాపారము అవుతుంది. ఈ జగద్ వ్యాపారము అద్వారకము సద్వారకము అని రెండు విధాలుగా ఉంటుంది. పరమాత్మసృష్టి స్వరూపము. పరమాత్మద్వారా చేయబడు సృష్టి అంటే పరమాత్ముడు తన సత్యసంకల్పముతో తగిన వస్తువుల యొక్క స్వరూపమును పరిణమింపజేస్తాడు. చేతనజీవులకు శరీరము ఇంద్రియములు ఇచ్చి వారి ధర్మభూత జ్ఞానమును వికసింప జేస్తాడు. శ్రీపిళ్ళై లోకాచార్యుల వారు 'ఈశ్వరేణ క్రియమాణా సృష్టిర్నామ-అచితః పరిణామనం చేతనస్య శరీరేంద్రియ ప్రదాన పురస్సరం జ్ఞానస్య వికాసనఞ్చ' - తత్త్వత్రయమ్ 3-24లో పయి విషయాన్ని తెలిపారు.

బ్రహ్మను' బ్రహ్మాండమును ఈశ్వరుడు సాక్షాత్తు సృష్టిస్తాడు ఇది ఈశ్వరుని అద్వారకసృష్టి. సద్వారక సృష్టి నాలుగు విధాలు. బ్రహ్మకృతము, నిత్యసృష్టికర్త ప్రజాపతి కృతము, కాలకృతము మరియు మాతాపితృరూప జీవకృతము. పరమాత్ముడు ఈ నాలుగింటిలో ఉండి (అంతర్యామిరూపముగా) సృష్టికార్యమును నిర్వర్తిస్తుంటాడు.

**ఏకేనాంశేన బ్రహ్మాసౌ భవత్యవ్యక్తమూర్తిమాన్ !**
**మరీచిమిశ్రాః పతయః ప్రజానాం చాస్య భాగశః !!**

వి.పు. 1.22.24 అవ్యక్తరూపుడయిన భగవంతుడు తన ఒక అంశతో బ్రహ్మ అవుతాడు. రెండవ అంశతో మరీచి మొదలయిన ప్రజాపతి అవుతాడు. మూడవ అంశముతో కాలము అవుతాడు. నాలుగవ అంశముతో అన్ని ప్రాణుల భూతముల అంతర్యామిగా ఉంటాడు అని తెలుపుతున్నది. పరమాత్మచే



జగత్పాలనము. నీరు ఒక పొలములో చేరి ఆ పొలములోని పైరులోనికి ప్రవేశించి జీవనాధారము అవుతుంది. అట్లాగే పరమాత్ముడు కూడ జడచేతనాత్మక మయిన సృష్టిచేస్తాడు అని 'సచ్చత్యచ్చా భవత్' అను శ్రుతి తెలుపుతున్నది. తరువాత నేను భూమి, నీరు, తేజస్సు అను దేవతలలోనికి జీవాత్మతో బాటు ప్రవేశించి వీటి నామరూపముల విభాగము చేస్తాను – 'హన్తాహమిమాస్తి స్రో దేవతా అనేన జీవేనానుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి' – ఛాం.ఉ.6. 3.2లో విశదపరుస్తున్నది. ఈ శ్రుతులను బట్టి సంపూర్ణజగత్తులోనికి అంతర్యామిగా ఈశ్వరుడు ప్రవేశించి సృష్టించిన వాటినన్నిటిని కాపాడుతుంటాడు. ఇది జగత్పాలనకర్తృత్వము.

ఈ పాలనముకూడ నాలుగు విధములుగా చేస్తాడు. 1.స్వయం విష్ణువు రూపముతో ఉంటూ రక్షిస్తాడు. 2.వాల్మీకి, పరాశరుడు మొదలయిన మహర్షుల హృదయములో అంతర్యామిగా ఉంటూ, సన్మార్గములో నడిపించు శాస్త్రనిర్మాణము చేయించి జీవులను పాలిస్తుంటాడు. 3.కాలము యొక్క అంతర్యామిగా ఉంటూ రక్షిస్తాడు. 4.ఆయా తల్లిదండ్రులు, మిత్రులు మొదలయిన రక్షకుల అంతర్యామిగా ఉంటూ జీవులను రక్షిస్తాడు ఆ పరమాత్ముడు. పరాశరమహర్షి కూడ ఇదేవిషయాన్ని విష్ణుపురాణం 1-22లోని 26, 27 శ్లోకాల్లో ఇట్లా వివరించారు.

**'ఏకాంశేన స్థితో విష్ణుః కరోతి పరిపాలనమ్. ।**
**మన్వాదిరూపశ్చాన్యేన కాలరూపోఽపరేణ చ' ॥**

**'సర్వభూతేషు చాన్యేన సంస్థితః కురుతే స్థితిమ్।**
**సత్త్వం గుణం సమాశ్రిత్య జగతః పరిపాలనమ్' ॥**

అని.

జగత్సంహారము – చేతులు, కాళ్ళు, ఇంద్రియములు మిగత అవయవములు కలిగిన విచిత్ర దేహము అను సంపదను జీవులకు ఆ

పరమాత్ముడు ఇచ్చాడు. జీవుడు వాటినన్నిటిని ఈశ్వరునికి నివేదించి ఆయన సమాశ్రయణము చెయ్యాలి. జీవుడు అట్లా ఆయన ఉపాసన చెయ్యకుండ శరీరమునే ఆత్మగా తలచి విషయాసక్తుడయి పోవడాన్ని చూసి పరమాత్మ ఆ ఇంద్రియాదులను నిగ్రహిస్తాడు. మందలిస్తాడు. చెడుమార్గంలో పొయ్యేవాడిని బాగు చేయడానికి అతనికి సంకెళ్ళువేసి నట్టుగా పరమాత్మ ద్వారా ఇంద్రియాదులు నిగ్రహింపబడడము సంహారము.

ఈ సంహారము కూడ నాలుగువిధాలు 1 సంహారకర్మను చేయడానికి పరమాత్ముడు దానికి ఉపయుక్తమయిన తమోగుణము కలిగిన వాడయి సంహారకర్తలలో ప్రధానుడయిన రుద్రుని అంతర్యామిగా ఉంటాడు. 2.అవాంత రసంహారమును చేయడానికి యముడు మరియు అగ్ని మొదలయిన వారి అంతర్యామిగా ఉంటాడు. 3.సంహారకర్మకు సహకారి అయిన కాలము యొక్క అంతర్యామిగా ఉంటాడు. 4.పరస్పరం చంపుకునే జీవుల అంతర్యామిగా ఉంటాడు. వీరందరి రూపములో పరమాత్ముడే సంహారము చేస్తుంటాడు. విష్ణుపురాణము ఒకటవ అంశం 22వ అధ్యాయంలోని 28,29,30 శ్లోకాలు దీనినే స్పష్టపరుస్తున్నాయి.

## ఈశ్వరస్య పఞ్చ ప్రకారాః:

మూ: ఏవంప్రకార ఈశ్వరః పర, వ్యూహ, విభవ, అన్తర్యామి, అర్చావతారరూపేణ పఞ్చప్రకారః.

అ: ఏవంగుణ విశేషణ విశిష్టు దయిన ఈశ్వరుడు, పరుడు, వ్యూహుడు, విభవుడు, అంతర్యామి, అర్చావతారుడు అనుభేదములతో అయిదు ప్రకారములుగా ఉంటాడు.

వి: ఈ అయిదింటిలో అందరి శరీరధారులలో అంతర్యామిగా, అర్చావతారంలో దయాలువు అయిన పురుషుడుగా ఉంటాడని పాంచరాత్రా గమము ఇట్లా తెలుపుతున్నది.



**మమ ప్రకారాః పఞ్చేతి ప్రాహుర్వేదాన్తపారగాః ।**
**పరో వ్యూహశ్చ విభవో నియన్తా సర్వదేహినామ్ ॥**
**అర్చావతారశ్చ తథా దయాలుః పురుషాకృతిః ।**
**ఇత్యేవం పఞ్చధా ప్రాహుర్మాం రహస్యవిదో జనాః॥** అని.

## ఈశ్వరస్య పరరూపస్య వర్ణనమ్:

మూ: తత్ర పరో నామ త్రిపాద్విభూతౌ కుముద కుముదాక్ష పుండరీక వామన శఙ్కుకర్ణస (ర్ప) ర్పనేత్రసుముఖసుప్రతిష్ఠి తాదిభిర్ది వ్యాయుధ భూషణ పరిజన పరిచ్ఛదాన్వితై ర్దివ్యనగర పాలకైః పరిరక్షితే శ్రీమద్వై కుణ్ఠాఖ్యే పురే చండ ప్రచండ భద్ర సుభద్ర జయవిజయ ధాతృవిధాతృప్రభృతిభి ర్ద్వారపాలకైరుపేతే శ్రీమద్దివ్యాలయే శ్రీమహామణి మండపే ధర్మాద్యష్టపాద విచరిత సింహాసనే శేషపర్యఙ్క చతుర్భుజ దివ్యమఙ్గల విగ్రహవిశిష్టః శ్రీభూనీలాది సహితః శఙ్ఖ చక్రాది దివ్యాయుధోపేతః కిరీటాది దివ్యభూషణ భూషితః అనన్తగరుడ విష్వక్సేనాదిభి ర్నిత్యైః సామగాన పరైరన్యై ర్ముక్తైశ్చాను భూయమానో జ్ఞానశక్త్యాద్యనన్త కల్యాణ గుణగణవిశిష్టః పరబ్రహ్మ పరవాసుదేవాది శబ్దవాచ్యో నారాయణః.

అ: త్రిపాద్విభూతిలో శ్రీవైకుంఠమనే నగరమున్నది. ఆ నగరాన్ని దివ్యాయుధములు, భూషణములు, పరిజనులు, పరిచ్ఛదములు- ఛత్రచామ రాదులు కలిగినట్టి కుముదుడు, కుముదాక్షుడు, పుండరీకుడు, వామనుడు, శంకు కర్ణుడు, సర్పనేత్రుడు, సుముఖుడు, సుప్రతిష్ఠితుడు మొదలయిన నగర పాలకులు ఆవైకుంఠాన్ని పరిరక్షిస్తుంటారు. ఆ వైకుంఠములో చండుడు, ప్రచండుడు, భద్రుడు, సుభద్రుడు, జయుడు, విజయుడు, ధాత, విధాత, మొదలయిన ద్వారపాలకులు కలిగిన ఒక దివ్యాలయము ఉన్నది. ఆ ఆలయములో ఒక మహామణి మండపమున్నది. దానిలో ధర్మము మొదలయిన ఎనిమిది పాదములు కలిగిన సింహాసన మొకటి ఉన్నది. ఆ సింహాసనము

మీద శేషునిశయ్య ఉన్నది. దానిపయిన నాలుగు భుజలములతో దివ్యమంగల విగ్రహముతో శ్రీదేవి, భూదేవి, నీలాదేవి సహితుడయి, శంఖ చక్రాది దివ్యాయుధోపేతుడయి, కిరీటము మొదలయిన దివ్యాభరణ భూషితుడయి, అనంతుడు విష్వక్సేనుడు, గరుడుడు మొదలగు నిత్యులు, సామగానము చేస్తున్న ఇతరముక్తులతో సేవింపబడి దర్శించు కొనబడుతూ, జ్ఞానం, శక్తి, మొదలయిన అనేక కల్యాణ గుణగణములతో కూడిన వాడయి విరాజిల్లు తూంటాడు. శ్రీభగవంతుడు 'పరబ్రహ్మ' పరవాసుదేవుడు మొదలయిన పేర్లతో పిలవబడే ఆ నారాయణుడు పరుడు అన్నమాట.

వి: శ్రీవాత్స్యవరదులు పరరూపునిట్లా వర్ణిస్తారు–

ఉద్యద్భానుసహస్రభాస్వరపరవ్యోమాస్పదం నిర్మల–
జ్ఞానానంద ఘనస్వరూపమమలజ్ఞానాదిభిః షడ్గుణైః
జుష్టం సూరిజనాధిపం ధృతరథాఙ్గాబ్జం సుభూషోజ్జ్వలం
శ్రీభూసేవ్యమనన్తభోగినిలయం శ్రీవాసుదేవం భజే.

## ఈశ్వరస్య వ్యూహరూపస్య వర్ణనమ్:

మూ: వ్యూహో నామ, పర ఏవో పసనార్థం జగత్ సృష్ట్యాద్యర్థం చ వాసుదేవ సఙ్కర్షణ ప్రద్యుమ్నానిరుద్ధభేదేన చతుర్ధా అవస్థితః. తత్ర షాడ్గుణ్య పరిపూర్ణో వాసుదేవః. జ్ఞానబలాభ్యాం సఙ్కర్షణః. ఐశ్వర్య వీర్యాభ్యాం ప్రద్యుమ్నః శక్తితేజోభ్యామనిరుద్ధ ఇతి గుణవిభాగః. ఏతేషు చతుర్షు ప్రత్యేకం త్రయ స్త్రయోవతీర్ణాః కేశవాదయో వ్యూహాన్తరాణి ద్వాదశద్వాదశ మాసానాం ద్వాదశా దిత్యానాం చాధి దైవతాని. ఊర్ధ్వపుణ్డ్రేషు చ తేషామ వస్థాపనం విధీయతే. తత్ర కనకప్రభః కేశవశ్చతు శ్చక్రధరః. శ్యామో నారాయణ శ్చతు శ్శఙ్ఖధరః. మణి ప్రభాభో మాధవశ్చతుర్గదః. చన్ద్రాభో గోవిన్దశ్చతు శ్శార్ఙ్గః పద్మకింజల్క సన్నిభో విష్ణుశ్చతుర్హలః. అబ్జాభో మధుసూదనశ్చతుర్ముసలః. అగ్నివర్ణ స్త్రి విక్రమః చతుఃఖడ్గః. బాలసూర్యాభో వామనశ్చతుర్వజ్రధరః. పుండరీకాభః శ్రీధరశ్చతుః పట్టిసధరః. తడిత్ప్రభో హృషీకేశశ్చతుర్ముద్గరధరః. సూర్యాభః పద్మనాభః. పఞ్చాయుధధరః. ఇన్ద్రగోపనిభో దామోదరశ్చతుష్పాశధరః.



అ: పరుడే భక్తులు తనను ఉపాసించడానికి, సృష్టి మొదలయిన కార్యములు చేయడానికి వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు అనునాలుగు విధముల రూపములను ధరించుతాడు. అట్లా ధరించడమునే వ్యూహము అంటారు. అందులో వాసుదేవుడు ఆరు గుణాలతో పరిపూర్ణుడు, సంకర్షణుడు. జ్ఞానము బలములతో పరిపూర్ణముగా ఉంటాడు. ప్రద్యుమ్నుడు ఐశ్వర్యము వీర్యముతో పరిపూర్ణుడుగా ఉంటాడు. అనిరుద్ధుడు, శక్తితేజస్సులతో పరిపూర్ణుడుగా ఉంటాడు. ఇట్లా భగవంతుని యొక్క గుణములు విభజింప బడుతవి. ఈ నలుగురు మళ్ళీ ఒక్కొకరు మూడు మూడు రూపాలుగా అవతరించి కేశవాదులు పన్నెండు మంది వ్యూహముగా తయారు అవుతారు. ఆ పన్నెండుగురు పన్నెండు మాసములకు పన్నెండుగురు ఆదిత్యులకు అధిదైవతముగా ఉంటారు. భక్తులుధరించు పన్నెండు ఊర్ధ్వపుండ్రములలో వీరే ఉంటారు.

వారిలో కేశవుడు బంగారుతళుకు లీనువాడు. నాలుగు చక్రములను ధరించి ఉంటాడు. నారాయణుడు నీలమువర్ణమువాడు. నాలుగుశంఖములను ధరించాడు. మాధవుడు మణి వంటి కాంతి కలవాడు. నాలుగు గదలను ధరించి ఉంటాడు. చంద్రుని వంటి కాంతి కలవాడు గోవిందుడు. నాలుగు [1]శార్ ఙ్గములను ధరించి ఉంటాడు. కమలము వంటి కాంతి కలమధు సూదనుడు [2]నాలుగుముసలములను ధరించి ఉంటాడు. అగ్నితో సమమయిన కాంతి గలవాడు త్రివిక్రముడు. నాలుగు ఖడ్గములను ధరించి ఉంటాడు. బాలసూర్యుని వంటి ప్రకాశము కలవాడు వామనుడు. నాలుగు వజ్రములను ధరించి ఉంటాడు. పుండరీకముతో సమానమయిన కాంతి గలవాడు శ్రీధరుడు. నాలుగు [3]పట్టిసములను ధరించి ఉంటాడు. మెరపు వంటి కాంతి గలవాడు హృషీకేశుడు. నాలుగు [4]ముద్గరములను ధరించుతాడు. సూర్యుని వంటికాంతిగల పద్మనాభుడు పంచాయుధములను ధరించి ఉంటాడు. ఎఱ్ఱనికాంతి గలవాడు దామోదరుడు నాలుగు పాశములను ధరించి ఉంటాడు.

---

1.ధనుస్సులు. 2. రోకలివంటి ఆయుధం. 3. శూలంవంటి ఆయుధం. 4. గదవంటి ఆయుధం

వి: ఉపాసకులను అనుగ్రహించుట సృష్ట్యాది కార్యమును నెరవేర్చుట వ్యూహ కృత్యముగా చెప్పుకోవచ్చును. ఈరెంటికి సంసారి రక్షణము అనే మూడవ పని ప్రయోజనమును కూడ కలపాలి. శ్రీపిళ్ళైలోకాచార్యులు వారు కూడ 'వ్యూహో నామ సృష్టిస్థితి సంహారార్థం సంసారి రక్షణార్థం ఉపాసకానుగ్రహార్థం చ సఙ్కర్షణ ప్రద్యుమ్నానిరుద్ధరూపేణా వస్థానమ్' 3-36 తత్త్వత్రయములో ఈ విషయాన్నే ప్రతిపాదించారు.

భగవంతుని వాసుదేవ వ్యూహరూపమున ఆరుగుణములు పరిపూర్ణంగా ఉంటాయి. అవి జ్ఞానము, శక్తి, బలము, ఐశ్వర్యము, వీర్యము, తేజస్సు అని. ఇవి ఆవిర్భూతస్వరూపములయి ఉంటాయి. వీటిని నిత్యముక్త జీవులు తెలుసుకొని అనుభవింపగలుగుతారు.

సంకర్షణరూపమున జ్ఞానము బలము అను రెండుగుణములు ఆవిర్భూతస్వరూపములుగాను, మిగత నాలుగు అభిభూత స్వరూపములుగను ఉంటవి. 'నిగూహనం చతుష్కాణాం ద్వన్ద్వానాం చ ప్రకాశనమ్' అని ఇదే విషయము ప్రతిపాదింపబడినది. సంకర్షణునియొక్కపని శాస్త్రప్రవర్తనము సంహారము చేయడము. తత్త్వత్రయములో వ్యూహరూపుని పని ఇట్లా నిరూపించనయినది. 'తత్ర సంకర్షణో జ్ఞాన బలభ్యాం యుక్తో జీవ తత్త్వమధిష్ఠాయ తత్ప్రకృతేర్వివిచ్య, ప్రద్యుమ్నావస్థాం ప్రాప్య శాస్త్ర ప్రవర్తనం జగత్సంహారం చ కరోతి. ప్రద్యుమ్న ఐశ్వర్య వీర్యాభ్యాం యుక్తో మనస్తత్త్వమధిష్ఠాయ ధర్మోపదేశం మనుచతుష్టయ ప్రభృతి శుద్ధవర్గ సృష్టిం చ కరోతి. అనిరుద్ధః శక్తితేజోభ్యాం యుక్తో రక్షణస్య తత్త్వజ్ఞాన ప్రదానస్యకాల సృష్టేర్మిశ్రసృష్టేశ్చ నిర్వాహకః' అని. సంకర్షణరూపమున భగవంతుడు సమస్త జీవులకు అధిష్ఠాతగా ఉంటాడు. జీవతత్త్వమును ప్రకృతి నుండి వేరు చేస్తాడు. అప్పుడు ప్రద్యుమ్నునిరూపము ధరించి శాస్త్రములను ప్రవర్తింపజేస్తాడు మరియు శరీరధారుల సంహరిస్తాడు. ప్రద్యుమ్నుడు ఐశ్వర్య వీర్యగుణములతో



మనస్తత్త్వమును అధిష్ఠించి ఉంటాడు. ధర్మోపదేశమును మనుచతుష్టయముతో గూడిన శుద్ధవర్గ సృష్టిచేస్తాడు. అనిరుద్ధుడు శక్తి తేజస్సులు ఆవిర్భూత గుణములుగా గలిగి జగత్తును రక్షిస్తు ఉంటాడు. తత్త్వజ్ఞానాన్ని ఇస్తాడు. కాలసృష్టి మరియు మిశ్రసృష్టిని చేస్తాడు.

ద్వాదశవ్యూహాంతరనిరూపణము - ఈ నాలుగు వ్యూహాలనుండి ఒక్కొక్కదానినుండి మూడుమూడుచొప్పున మొత్తం పన్నెండు వ్యూహాంతరములు కలుగతవి. వాసుదేవుని నుండి కేశవ నారాయణ మాధవరూపులు వస్తారు, గోవింద విష్ణుమధుసూదనులు సంకర్షణుని నుండి, త్రివిక్రమ వామన శ్రీధరులు ప్రద్యుమ్నుని నుండి, హృషీకేశ పద్మనాభ దామోదరులు అనిరుద్ధుని నుండి వస్తారు.

## ఈశ్వరస్య విభవరూపస్య వర్ణనమ్:

మూ: విభవో నామ తత్తత్సజాతీయ రూపేణావిర్భావః సప్రసిద్ధి ప్రాధాన్యేన దశధా. తే చ మత్స్యకూర్మాద యోఽవతార విశేషాః. తత్ర వేదాపహారిదైత్య నిరాసపూర్వకం బ్రహ్మణే వేదప్రమాణ ప్రదానార్థమవతీర్ణో మత్స్యావతారః. దేవానామజరామరణహేతు భూతామృతోత్పాదన మన్దరాధార త్వేనావతీర్ణః. కూర్మావతారః. సంసార సాగరనిమగ్న జనోద్ధరణ కామః (భూమ్యుద్ధరణార్థం) స్వమహిషీముద్ధర్తుమవతీర్ణో వరాహావతారః. ఆశ్రిత రక్షణార్థం మహాసుర గృహస్త మ్భోద్భూతో నరసింహావతారః. త్రివిక్రమో భూత్వా స్వపాదారవిందోద్భవేన జలేన జగత్పాపహారణేన జగద్రక్షణార్థమవతీర్ణో వామనావతారః దుష్టక్షత్రియనిరసనార్థమవతీర్ణః పరశురామావతారః. శరణాగత రక్షణధర్మ సంస్థాపనార్థ మవతీర్ణో రామావతారః. ప్రలమ్బాది నిరసనార్థ మవతీర్ణో బలభద్రావతారః. మోక్షోపాయప్రదానార్థమవతీర్ణః.కృష్ణావతారః. అధర్మిష్ఠాన్నిరస్య పూర్ణధర్మ ప్రవర్తనార్థ (కలినిర్మోచనార్థ) మవతీర్ణః కల్క్యవతారః. ఏవం దశావతారే ష్వపి ఏకైకావతారోఽనన్తరూపః. పద్మనాభదయోఽపి

షట్త్రింశదవతారాః సన్తి. పునర్దధిభక్తహయ గ్రీవనరనారాయణాదయోఽ పి. ఏవమేతే ముఖ్య గౌణ పూర్ణాంశా వేశాఖ్యా వాన్తర భేదేన బహుప్రకారాః. తేషూపాస్యానుపాస్యవిభాగో ద్రష్టవ్యః, అవతారాణామిచ్ఛైవ హేతుః. న తు కర్మప్రయోజనం తు దుష్టనిరాసపూర్వకసాధుపరిత్రాణమేవ.

అ: భగవంతుడు, విభవరూపములో, దేవుడిగా, మనుష్యుడిగా లేదా ఇంకోవిధముగా అవతారము ఎత్తుతాడు. విభవము అనగా అవతారము అని అర్థము. ప్రసిద్ధము లయినవి ప్రధానమయినవి పది అవతారా లున్నాయి. వేదములను అపహరించిన దైత్యుడు (హిరణ్యాక్షుని) సోమకుని సంహరించి బ్రహ్మకు వేదరూపప్రమాణము అయిన శాస్త్రాన్ని తిరిగి ఇచ్చిన అవతారము మత్స్యావతారము. దేవతలను అజరామరము చేయుటకు కారణమయిన అమృతమును సంపాదించడానికి అవసరమయిన మందరపర్వతమునకు ఆధారముగా అవతరించాడు కూర్మముగా. సంసారసాగరములో మునుగుతున్న జీవులను, సాగరములో మునుగుతున్న పత్ని భూదేవిని ఉద్ధరించడానికి ఎత్తినది వరాహావతారము. తనను ఆశ్రయించిన ప్రహ్లాదుని రక్షణార్థము మహారాక్షసుని ఇంట స్తంభమునుండి ఉత్పన్నమయిన అవతారము నరసింహావతారము. త్రివిక్రముడయి తన చరణారవిందమునుండి పుట్టిన గంగానదీ జలముచే సంసారపు పాపములను పారద్రోలడానికి ఎత్తినది వామనావతారము. దుష్టులయిన రాజులను మట్టు బెట్టడానికి ఎత్తినది పరశురామావతారము. శరణాగతులయిన జీవులను రక్షించుట అను ధర్మమును స్థాపించుటకయి శ్రీరామావతారము ఎత్తడం జరిగినది. ప్రలంబాసురుడు మొదలయిన రాక్షసులను సంహరించడానికి బలభద్రుడుగా అవతారము ఎత్తాడు హరి. మోక్షోపాయజ్ఞానము ఇయ్యడానికి భగవంతుడు ఎత్తిన విభవము శ్రీకృష్ణావతారము. అధర్మమార్గం అవలంబించేవారిని నశింపజేసి పూర్ణధర్మ ప్రతిష్ఠాపన చేయడానికి ఎత్తే అవతారము పేరు కల్కిఅవతారము. ఈ పది అవతారాల్లో ప్రత్యేకం అవతారం అనేకరూపాల్లో ఉంది. పద్మనాభుడు



మొదలుకొని ముప్పది ఆరు అవతారాలున్నాయి. అవేగాక దధిభక్తుడు, హయగ్రీవుడు, నరుడు, నారాయణుడు మొదలయిన అవతారాలు కూడ ఉన్నాయి. ఇట్లా భగవంతుని అవతారాలు ముఖ్యావతారములు, గౌణావతారములు, పూర్ణావతారములు ఆవేశావతారములు అని అనేక భేదాలుగా ఉన్నాయి. మళ్ళీ ఈ అవతారములను ఉపాస్యావతారములుగా అనుపాస్యావ తారములుగా కూడ విభజించవచ్చును. భగవంతుడు తన ఇచ్ఛను అనుసరించి అవతారములను ఎత్తుతాడు గాని కర్మకు లోబడి పరతంత్రుడయి కాదు. కర్మప్రేరితుడయి కాదు. దుష్టులను శిక్షించుట, మంచి వారిని రక్షించుటయే అవతారముల యొక్క పరమప్రయోజనము.

వి: భగవంతుని విభవావతారముల సంఖ్య లేదు. అయినప్పటికీ అవతారములను రెండు విధాలుగా విభజించవచ్చును. ఒకటి ముఖ్యావతారము అని రెండవది గౌణావతారము అని. మనుష్యాదుల సజాతీయుడుగా అవతరించుటను విభవాతారము అంటారు. సాక్షాత్ అవతారములను ముఖ్యములని, ఆవేశావతారములను గౌణములని అంటారు. మళ్ళీ ఆవేశము స్వరూపావేశమని, శక్తిఆవేశమని, అందులో పరశురామాదులలో స్వరూపావేశ మని, రామకృష్ణాది అవతారములు ముఖ్యములని అంటారు. అవి సాక్షాత్ అవతారములు. పరశురామాది అవతారములు భగవంతుని స్వరూపము ఆవేశించినందు వలన వాటిని ఆవేశావతారములు అంటారు. కార్యకాలములో బ్రహ్మ, శివుడు మొదలయిన చేతనులలో శక్తిమాత్రముతో స్ఫురించుట – శక్తి ఆవేశము. ఇచ్ఛతోనే భగవంతుడు ముఖ్య, గౌణావతారములను దాల్చుతాడు. ఇవి ఆయనకు స్వాభావికములే. ఒక దీపముతో వెలిగిన మరొకదీపము తన కారణభూతమయిన దీపముతో సమానమయిన కాంతి కలిగిఉంటుంది. అట్లాగే ముఖ్య, గౌణములు. ఈ రెండు భేదములతో గూడిన భగవంతుని అవతారములు గూడ భక్తులకు ముముక్షులకు భగవంతుని వలెనే ఉపాసింపదగినవి. రెంటిలో దివ్యవిగ్రహము, ఐశ్వర్యము, స్వభావము ఉంటాయి గనుక ఉపాసింప దగినవి.

పరవాసుదేవుడు కేవలము నిత్యులకు ముక్తులకు మాత్రమే అనుభవంలోనికి వస్తాడు కనుక ఆయన్ను నిత్యోదితుడు అంటారు. వ్యూహ మూర్తి అయిన వాసుదేవుని శాంతోదితుడు అంటారు. విష్వక్సేన సంహితలో భగవంతుడు ముప్పది ఆరు అవతారాలు ఎత్తుతాడు అని ఉంది. అహిర్బుధ్న్యసంహిత భగవంతుని ముప్పయితొమ్మిది అవతారాలను పేర్కొన్నది. దుష్టశిక్షణము కూడ అవతార ప్రయోజన మయినప్పటికి సజ్జన పరిత్రాణము అవతారము యొక్క పరమప్రయోజనము. అమృతప్రదాన మునకయి ఎత్తినది దధిభక్తావతారము. వేదముల నిచ్చుటకయి హయగ్రీవావతారము. ఉపాస్యానుపాస్యత్వమును గురించి తత్త్వత్రయము ఇట్లా చెప్పుతున్నది. 'తత్రాప్రాకృతవిగ్రహా అజహత్స్వభావ విభవా దీపాదుత్పన్న దీపవత్ స్థితా ముఖ్య ప్రాదుర్భావాః సర్వే ముముక్షూణాం ఉపాస్యాః. విధిశివపావకవ్యాస జామదగ్న్యార్జున విత్తేశాది రూపా గౌణప్రాదుర్భావాః సర్వేఽహం కారయుక్త జీవాధిష్ఠాతృత్వాన్మముక్షూణా మనుపాస్యాః' అని

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్.
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే

అను శ్రీమద్భగవద్గీతాశ్లోకము అందరికి తెలిసినదే. మునుపే చెప్పినట్లు దుష్కృత వినాశము, ధర్మ సంస్థాపనము సాధు పరిత్రాణము వరుసగా ప్రధానమయిన ప్రయోజనములు.

**ఈశ్వరస్య అంతర్యామిరూపస్య వర్ణనమ్:**

మూ: అంతర్యామిత్వం నామ స్వర్గనర కాద్యనుభవదశాయామపి జీవాత్మనః సుహృత్త్వేన యోగిభిర్ద్రష్టవ్యతయా హృదయ ప్రదేశావస్థిత రూపమ్. జీవేన సాకం విద్యమానోఽపి తద్గతదోషైరసంస్పృష్టో వర్తతే.



అ: జీవులు స్వర్గనరకాదులను అనుభవిస్తుండగా కూడ జీవాత్మ స్నేహితునిగా, యోగులు ప్రత్యక్షము చేసుకొను రూపముగా హృదయ ప్రదేశములో భగవంతుడు ఉండుట అంతర్యామిత్వము అంటే అర్థము. ఇట్లా జీవులతో పాటు ఉన్నా జీవుల దోషములు పరమాత్మ రూపానికి అంటవు.

వి: 'ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి' అని శ్రీమద్భగవద్గీతలో భగవంతుడు స్వయంగా చెప్పాడు. అర్జున! ఈశ్వరుడు జీవులందరి హృదయములో అంతర్యామి రూపంలో ఉన్నాడు అనితాత్పర్యము. 'య ఆత్మానమన్తరో యమయతి' బృ.ఉ. 3.7.3లో ఇదే విషయము చెప్పబడింది. అంతర్యామిగా ఉండటం కూడ రెండు రకాల స్థితి. ఒకటి – స్వర్గనరకప్రవేశాది సర్వావస్థలయందు కూడ సకలచేతనులకు సహాయ భూతుడుగా ఉంటూ వారిని వదలి పెట్టలేని స్థితి. రెండవది – సకల చేతనులకు బంధుభూతుడయి సకలజీవులను రక్షించుటకు వారి ధ్యానమునకు తగిన శుభములకు నెలవయిన విగ్రహముతో కూడి వారి హృదయకమలములో ఉండటము. జీవునితో పాటు ఎప్పటికి ఉన్నా ఆ దోషము లేవి ఆయనను తాకవు. 'య ఆత్మానమన్తరో యమయతి సతే ఆత్మా అంతర్యామ్యమృతః' – శ.బ్రా. 14-5-30 కూడ పరమాత్మ' ఆత్మలో ఉండి నియమిస్తాడో అతడు నీ ఆత్మ అమృతుడు అంతర్యామి అని తెలుపుతున్నది. 'అన్తః ప్రవిష్టః శాస్తా జనానాం సర్వాత్మా' – తై.ఆ.3.11.3 ఇదే విషయాన్ని తెలుపుతున్నది.

సాధనసప్తకముచే అంతః కరణము వశము కాగా యోగిజనులు, అష్టాంగ యోగక్రమమున నిర్వికల్పకసమాధి అవస్థకు చేరుకుని తైలధారవలె ఎడతెగని ధ్యానముతో పరమాత్ముని ఈ అంతర్యామిరూపమునే విశదము, విశదతరము, విశదతమముగా చివర ఉన్నదున్నట్టుగా సాక్షాత్కారము చేసుకుంటారు.

## ఈశ్వరస్య అర్చావతారవర్ణనమ్:

మూ: అర్చావతారో నామ దేశకాలవిప్రకర్షరహిత ఆశ్రితాభిమత ద్రవ్యాదికం శరీరతయా స్వీకృత్య తస్మిన్నప్రాకృత శరీర విశిష్టస్సన్నర్చక పరాధీనస్నాన భోజనాసనశయన స్థితిః సర్వసహిష్ణుః పరిపూర్ణో గృహగ్రామనగర ప్రశస్తదేశ శైలాదిషు వర్తమానో మూర్తివిశేషః. స చ స్వయం వ్యక్త దైవసైద్ధ మానుషభేదాచ్చతుర్విధః. ఏకముక్తాసు పఞ్చావస్థాస్వపి శ్రీవిశిష్ట ఏవ భగవాన్ వర్తత ఇతి శ్రుత్యాది ప్రమాణసిద్ధోఽర్థః. ఏతేనైకా యనోక్తనిః శ్రీకవాదనిరాసః. ఏవమీశ్వరో నిరూపితః.

ఇతిశ్రీవాధూలకులతిలక-శ్రీమన్మహాచార్య ప్రథమ దాసేన శ్రీనివాసదాసేన విరచితాయాం యతీంద్రమతదీపికాయాం శారీరకపరిభాషాయాం ఈశ్వర నిరూపణం నామ నవమోఽవతారః.

అ: దేశవిప్రకర్షము, కాలవిప్రకర్షము వదలి పెట్టి ఆశ్రితులు అయిన జీవులకు అభిమతమయిన అనుకూలమయిన ద్రవ్యము మొదలయిన దానిని శరీరముగా స్వీకరించి' దానిలోనే దివ్య శరీరముతో కూడిన వాడయి ఉండి అర్చకుల అధీనుడయి స్నానము, భోజనము, ఆసనము, శయనము, ఉనికి గలవాడయి సర్వమును కూడ సహించుచు, ఇంటిలోగాని, గ్రామములోగాని, నగరములోగాని, క్షేత్రములలోగాని, కొండలమీదగాని, ఉండునట్టి భగవంతుని మూర్తికి అర్చావతారమని పేరు. అర్చావతారమునకు నాలుగు భేదములున్నవి- స్వయంవ్యక్తము, దైవము, సైద్ధము, మానుషము అని. ఇట్లా నిరూపించిన అయిదు అవస్థలలో కూడ భగవంతుడు లక్ష్మీదేవితో కూడియున్నవాడే, అనువిషయమును శ్రుతులు ప్రతిపాదిస్తున్నవి. దీనితో ఏకాయనులు (మాధ్వులు) చెప్పిన నిఃశ్రీక వాదము వీగిపోతుంది. ఈ ప్రకారముగా ఈశ్వరనిరూపణము జరిగినది.

వి: శ్రీశఠకోపసూరి చెప్పినట్లు భగవంతుడు భక్తులు కోరినట్టుగా తనరూపాన్ని ధరిస్తాడు. జీవులకల్యాణము కొరకయి భగవంతుడు



అర్చావతారమును దాల్చుతాడు. ఈ అవతార మాహాత్మ్యమును తెలుపుతూ 'సౌలభ్య సీమాభూమిరర్చావతారః' అని కృష్ణపాదసూరి ఆచార్య హృదయములో అంటారు. విప్రకర్ష అంటే దూరము అని అర్థము. పరరూప మున భగవంతుని మనము సేవించలేము, ఆయన వైకుంఠములో ఆ రూపముతో ఉంటాడు కనుక ఇది దేశ విప్రకర్షము. రాముడు అయోధ్యలో కృష్ణుడు మథురలో ఉంటారు. ఇది కూడ దేశనియమము. అట్లానే కాలము – రాముడు ఒక యుగంలో కృష్ణుడు మరొకయుగంలో. ఇప్పుడు ఆకాలము కాదు. ఇది కాలవిప్రకర్షము. వ్యూహరూపాన్ని దేవతలు పూజింప గలుగుతారు సామాన్య జీవులు పూజింపలేరు. విభవావతారములో భగవంతుడు వచ్చి జీవులతో జీవుడిగా ఉంటాడు. కాని కాలవిప్రకర్షము వస్తుంది. పయిన చెప్పినట్టుగా అంతర్యామి రూపము సర్వదేశసర్వకాల సర్వావస్థలయందు ఉంటుంది గాని అరూపమును సామాన్య జీవులమయిన మనము సాక్షాత్కారము చేసుకోలేము. ఇంతుకుముందు భాగమున చెప్పినట్టు యోగులు చేసుకోగలరు, వారికి వివేక విమోకాది సాధన సప్తకము వలన మనస్సు పరిశుద్ధమయి సంస్కృ తమయి ఉంటుంది. వారు అష్టాంగయోగ ప్రక్రియను పాటిస్తారు. దానివలన నిర్వికల్పకసమాధిని చేరుకుంటారు. ఆసమాధిలో సాధనచేస్తూ పోగా పోగా అంతర్యామిరూపాన్ని క్రమంగా చూడగలుగుతారు.

అయితే ఇక మనలాటి పాపపరాయణులకు సాధన విహీనులకు విషయాసక్తులకు, ఇంకా సామాన్యులకు వేరే మార్గంలేదా? ఉన్నది. అదే అర్చావతారమును నవవిధ భక్తులతో పూజించుట. దీనికొరకే భక్త సులభుడయిన భగవంతుడు అర్చావతారమును ధరించినాడు. అర్చావతారము అనగా ప్రతిమావతారము ఆశ్రితాభిమత ద్రవ్యము – ఏదయినా కావచ్చును బంగారము, వెండి, రాగి, ఇత్తడి మరేదయినా లోహము లేదా కర్ర లేదా మట్టి మొదలయినవి. మరి అర్చావతారములో అంతమహిమ ఉంటుందా? ఉంటుంది.

అర్చావతారము కూడ ఆరు గుణములకు నెలవు.

**'సర్వాతిశయషాడ్గుణ్యం సంస్థితం మన్త్రబిమ్బయోః ।**
**మన్త్రే వాచ్యాత్మనా నిత్యం బిమ్బే తు కృపయా స్థితమ్' ॥**

అని స్మృతి, బింబం అంటే ప్రతిమ–బొమ్మ. దేవాలయాల్లో ఉండే మూర్తివిశేషము – నారాయణునిది, నరసింహు నిది, రామునిది, కృష్ణునిది మరిఏదయినా అవతారముది కావచ్చు ఆమూర్తి.

**వైకుంఠే తు పరే లోకే శ్రియా సార్ధం జగత్పతిః ।**
**ఆస్తే విష్ణురచిన్త్యాత్మా భక్తైర్భాగవతైస్సహ' ॥**

అని వర్ణింపబడినట్టుగా విరాజిల్లే భగవానుడు అనాదికాలము నుండి భగవంతునికి దూరమయిన జీవులను స్వోన్ముఖులను చేసుకోవడానికి వైకుంఠము వదలి అర్చావతారము వంటి రూపాన్ని ధరిస్తాడు. ఇది మన్త్రము కాని బిమ్బము కాని కావచ్చును. జ్ఞానశక్త్యాదులు ఆరుగుణాలు ఉండటము వలన ప్రభావముంటుంది. ఈమూర్తులు నాలుగు రకాలు ఉండవచ్చును. స్వయం వ్యక్తము ఒకచోట, మరోచోట దేవతలు స్థాపించినవి, ఇంకోచోట సిద్ధులు స్థాపించినవి, మరియు మనుష్యులు స్థాపించినవి. ఈ దేవాలయాలు గ్రామాల్లో, నగరాల్లో, పుణ్యక్షేత్రాల్లో, కొండలమీద ఉన్నవి కావచ్చును. ప్రతిష్ఠ తరువాత దివ్యమంగల విగ్రహము అవుతుంది. 'ఏహి ఆశ్మాన మాతిష్ఠ ఆశ్మాభవతుతేతను' అని సంహితాగమ వాక్యము. జగన్నియంత పోయి అర్చకుని అధీనమవుతాడు. అతడు చేయించినప్పుడు స్నానము, పెట్టినప్పుడు నైవేద్యము, ఉయ్యాలసేవ, ఏకాంత సేవ, శయనము మళ్ళీ సుప్రభాతము ఇట్లా పూజారి చేతిలో ఉంటాడు దేవుడు. మనం చేసే అపచారములను సహిస్తాడు. భక్తుల అభీష్టము మేరకు ఇళ్ళల్లో, ఊళ్ళల్లో, నగరాల్లో, తిరుమలలో, శ్రీరంగములో, కాంచీలో, మేల్కోటలో, భద్రాచలములో, వేంకటేశ్వరునిగా, రంగనాథునిగా, వరదరాజుగా నరసింహునిగా నారాయణునిగా రామునిగా వెలిశాడు. విశిష్టాద్వైత సంప్రదాయము ప్రకారము నూటాఎనిమిది అర్చావ తార స్థలాలున్నాయి.



వీటికే దివ్యదేశములు అని పేరు. దివ్యసూరులు ఈ దివ్యదేశములలోని మూర్తులకు మంగలాశాసనములు చేసారు.

భగవంతుడు ఈ అయిదు దశలలో కూడ లక్ష్మీసహితుడయి యే ఉంటాడు. శ్రీమన్నారాయణుడే సకల జీవులకు ఉపాస్యుడు. కేవలము నారాయణుడు కాదు. మధ్వాచార్యులు కేవలము విష్ణువునే ఉపాస్యుడుగా నిరూపించడము, శ్రుతివిరుద్ధము కనుక తొలగిపోతుంది. వారి వాదము పేరు నిఃశ్రీకవాదము.

ఇక్కడ గుర్తించవలసిన మరొక విషయము – ఉపాసకుడు మొదట అర్చావతారమును ఉపాసించాలి. తరువాత విభవమును, పిదప వ్యూహమును, అనంతరం పరుని చివరగా అంతర్యామిని, ప్రతిమలు – అర్చారూపము, విభవము అవతారములు, సంకర్షణాదులు వ్యూహము, పరంబ్రహ్మ – వాసుదేవుడు, అంతర్యామి జీవులలో ఉండువాడు. 'పూర్వ పూర్వోదితో పాస్తి విశేషక్షీణకల్మషః

**ఉత్తరోత్తర మూర్తీనాముపాస్త్యధికృతో భవేత్**
**వాసుదేవః స్వభక్తేషు వాత్సల్యాత్తత్తదీహితమ్**
**అధికార్యానుగుణ్యేన ప్రయచ్ఛతి ఫలం బహు**
**అర్చోపాసనయా క్షిప్తే కల్మషేధికృతో భవేత్**
**విభవోపాసనే పశ్చాద్ వ్యూహోపాస్తౌ తతః పరమ్**
**సూక్ష్మే తదనుశక్తః స్యాదన్తర్యామిణమీక్షితుమ్'**

అని ఉపాసనాక్రమము తెలియదగినది.

ఇట్లు, శ్రీవాధూలకుల తిలకుడయినట్టి శ్రీమన్ మహాచార్యుల
ప్రథమదాసుడయిన శ్రీనివాసదాసునిచే ప్రణీతమయిన
యతీంద్రమతదీపిక అను శారీరకపరిభాషయందు
ఈశ్వరనిరూపణము అను తొమ్మిదవ
అవతారము సంపూర్ణము.

## అద్రవ్యలక్షణం తద్భేదాశ్చ:

మూ: ఏవం ద్రవ్యనిరూపణానన్తరం క్రమప్రాప్తమద్రవ్యం నిరూప్యతే.

సంయోగరహితమద్రవ్యమ్. తదద్రవ్యం చ సత్త్వరజస్తమాంసి శబ్దస్పర్శ రూపరస గన్ధాస్సంయోగశ్శక్తిరితి దశప్రకారమేవ.

అ: ఇంతవరకు ద్రవ్యము యొక్క నిరూపణము జరిగినది. తదుపరి ఉన్న అద్రవ్యమును ఇప్పుడు నిరూపించుచున్నాము.

సంయోగము లేనట్టి పదార్థమును అద్రవ్యము అంటారు. ఆ అద్రవ్యము పదిరకాలుగా ఉంటుంది. ఆపది ఇవి – సత్త్వము, రజస్సు, తమస్సు, శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము, సంయోగము మరియు శక్తి అని.

వి: నాలుగవ అవతారము మొదలు తొమ్మిదవ అవతారము వరకు ఆరు అవతారములలో ద్రవ్య నిరూపణము జరిగినది. ఈ పదవ అవతారములో అద్రవ్యము నిరూపించబడుతున్నది. అద్రవ్యము యొక్క సామాన్య లక్షణము – సంయోగము లేనిది (పదార్థము) అద్రవ్యము. ఏది ఇంకొక దానితో కలిసి ఉండదో ఇంకోటి ఏది దీనితో కలిసి ఉండదో అది అద్రవ్యము. ద్రవ్యములకే సంయోగము అనునియమము ఉన్నది కనుక సంయోగము లేనిది అద్రవ్యము. అద్రవ్యములు అనంతములు. ప్రలయకాలములో ప్రతిక్షణము సదృశమయిన అవస్థలు ఒకటితరువాత ఒకటి జరుగుతూఉంటవి. అట్లే సృష్టికాలములో విసదృశమయిన అవస్థలు ప్రతిక్షణము జరుగుతుఉంటవి. కాలములో కూడ క్షణత్వము లవత్వము మొదలు పరార్ధము వరకు ప్రతిక్షణము అవస్థలు ఉంటూనే ఉంటవి. శుద్ధసత్త్వములో అవస్థలు ఉంటవి. ఈ అవస్థలు అన్ని అద్రవ్యములు. ఇలాటి అవస్థా రూపమయిన అద్రవ్యములను దృష్టిలో ఉంచుకొని శ్రీవరదవిష్ణు మిశ్రులు 'గుణాశ్చానన్తాః' గుణములు అనన్తములు అని చెప్పారు. అవస్థా రూపమయిన అద్రవ్యము అనంతము. వీనిలో పరస్పరభేదములు అనంతములు



అన్నిటిని నిరూపించడం తలకు మించిన పని. నిరూపించగలిగినవాటి భేదములను పరిగణనలోకితీసుకుని గ్రంథకర్త పది అద్రవ్యములను నిరూపి స్తున్నారు. అవి పది సత్త్వము, రజస్సు, తమస్సు, శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము, సంయోగము, మరియు శక్తి అని.

సత్త్వరజస్తమస్సులు ద్రవ్యము కంటె భేదములేనివి కావున ఇవి ద్రవ్యములే కావచ్చుగద అని శంక. సమాధానము. రచనానుపపత్తేశ్చ నానుమానం ప్రవృత్తేశ్చ. బ్ర.సూ. 2.2.1 లోని శ్రీభాష్యముతో విరోధము వస్తుంది. అక్కడ సత్త్వము మొదలయినవి ద్రవ్యధర్మలు గాని ద్రవ్యస్వరూపము గాదు. సత్త్వరజస్తమస్సులు పృథివ్యాదులలో ఉండే లఘుత్వము ప్రకాశత్వము మొదలయిన వాటికి కారణము లయినవి వాటి స్వభావవిశేషములే గాని మట్టి, బంగారము మొదలయిన ద్రవ్యముల వలె కార్యాన్వితములు గావు. సత్త్వాదులకు గుణములనే ప్రసిద్ధి ఉన్నది అని వివరణ ఉన్నది కనుక అవి అద్రవ్యములే. ద్రవ్యములు కావు.

## సత్త్వరజస్తమసాం వివేచనమ్:

మూ: తత్ర ప్రకాశసుఖలాఘవాదినిదానం అతీంద్రియం శక్త్యాద్యతిరిక్త మద్రవ్యం సత్త్వమ్. తద్ ద్వివిధమ్ శుద్ధసత్త్వం మిశ్రసత్త్వం చేతి. రజస్తమ శ్శూన్య ద్రవ్యవృత్తి సత్త్వం శుద్ధసత్త్వమ్. తన్నిత్యవిభూతౌ. ఉపచారాత్తత్ప్ర వర్తకేశ్వరే చ రజస్తమస్సహవర్తిసత్త్వం మిశ్రసత్త్వమ్. తత్త్రిగుణే తత్సమ్బద్ధిని జీవే చోపచారాత్. రాగతృష్ణాలోభ ప్రవృత్త్యాది నిదానమతీంద్రియం శక్త్యాద్యతి రిక్తమద్రవ్యం రజః. ప్రమాదమోహాది నిమిత్త మతీంద్రియం శక్త్యాద్యతిరిక్తమ ద్రవ్యం తమః. త్రీణ్యప్యేతాని యావత్ప్రకృతివ్యాప్తాని ప్రకృతి వశ్యపురుష సమ్బద్ధాన్య నిత్యాని, నిత్యసన్తానాని, ప్రలయదశాయాం సమాని. సృష్ట్యాదౌ విషమాణి సృష్టి స్థితి సంహారోపయుక్తాని ఈశ్వరసఙ్కల్పాది సహకారి భేదాత్పర స్పరాభిభవోద్భవకరాణీత్యేతాని సాధారణాని. సత్త్వగుణస్తు సత్యజ్ఞానరూప

సుఖాదిహేతు ర్మోక్షప్రదశ్చ. రజోగుణస్తు రాగాద్యాత్మకః కర్మసఙ్గీ దుఃఖాదిహేతుః స్వర్గాద్యాముష్మిక ప్రదశ్చ. తమోగుణస్తు అజ్ఞాన రూపఫలస్యాదిహేతు ర్నరక ప్రదశ్చ. అతస్సత్త్వాదయో గుణా ద్రవ్యరూపాః.

అ: ఆ పది అద్రవ్యములలో సత్త్వము ప్రకాశానికి, సుఖానికి, లాఘవానికి కారణ మయినట్టిది. అతీంద్రియము, శక్తి మొదలయినవాటి కంటె ఇతరమయినది అని లక్షణము. అది రెండువిధములుగా ఉంటుంది. శుద్ధ సత్త్వము మిశ్రసత్త్వము అని. రజోగుణము తమోగుణము లేనట్టి ద్రవ్యములో ఉండునది శుద్ధసత్త్వము. అది నిత్యవిభూతిలో ఉంటుంది. నిత్యవిభూతిని ప్రవర్తింపజేయునట్టి ఈశ్వరునిలో కూడ ఔపచారికముగా ఉంటుంది. రజోగుణముతో తమోగుణముతో కలిసిఉండేది మిశ్రసత్త్వము. ఈ మిశ్రసత్త్వము ప్రకృతిలో ఉంటుంది. ఉపచారముతో ప్రకృతి విశిష్టుడయిన జీవునిలో కూడ ఉంటుంది.

రాగము, తృష్ణ, లోభము మరియు ప్రవృత్తికి కారణభూతమయి నది అతీంద్రియము. శక్త్యాదుల కంటె భిన్నమయిన అద్రవ్యము రజస్సు, ప్రమాదము. మోహము మొదలయినవాటికి కారణభూతమయినది అతీంద్రియము. శక్త్యాదులకంటె భిన్నమయిన అద్రవ్యము తమస్సు. ఈమూడు మొత్తం ప్రకృతిలో వ్యాపించి ఉన్నవి. ప్రకృతి పరతంత్రుడయిన పురుషునితో ఇవి సంబంధించి ఉంటవి. అనిత్యములు, ఎల్లపుడు వీటి ఉత్పత్తి జరుగుతునే ఉంటుంది. నిత్యములు అన్నమాట. ప్రలయకాలములో సమానమయినవిగా ఉంటాయి. సృష్టి మొదలయిన కాలాల్లో విషమముగా ఉంటాయి, ఇవి సృష్టిస్థితి ప్రలయమున కుపయోగడేవి. ఈశ్వర సంకల్పము మొదలయిన సహకారు (కారణము) లను పొంది, ఒకటి మరొకదానిని అణచివేసి తాము ఉద్రిక్తము లవుతాయి. ఇవి ప్రకృతిలో ప్రాకృత ద్రవ్యాలలో అన్నిట్లో ఉంటాయి



సత్త్వగుణము సమ్యక్ జ్ఞానరూపమయిన సుఖాన్ని కలిగించేది మోక్షమును కూడ కలిగిస్తుంది. రజోగుణము రాగాదిరూపములయిన పనులందు ప్రవర్తింపజేస్తుంది. దుఃఖాదులకు కారణమయినట్టిది, స్వర్గాది లోకములను కలిగిస్తుంది. ఇక తమోగుణము అజ్ఞానరూపమయిన సోమరితనానికి హేతుభూతము అయినట్టిది నరకమును కలిగింపజేసేది. ఈవిధంగా సత్త్వము మొదలయినవి అన్ని గుణాలు (అద్రవ్యములు) ద్రవ్యరూపములు కావు.

వి: సత్త్వముయొక్క లక్షణములో ప్రకాశసుఖలాఘవాది కారణము అనకుంటే రజస్సు తమస్సుల్లో ఈలక్షణప్రసక్తి వస్తుంది. అతి వ్యాప్తినివారణకు ఈ దలము రజస్తమస్సులు ప్రకాశాది కారణములు కావు కనుక నివృత్తి అవుతుంది. అతీంద్రియము అనక ఉంటే శబ్దము మొదలయిన ఇంద్రియ గ్రాహ్యములలో అతివ్యాప్తి, తన్ని వృత్తికి ఆపదము. శబ్దాదులు అతీంద్రయములు కాదు కనుక నివృత్తి. శక్తి మొదలయిన వాటిని నివర్తించుటకు శక్త్యాద్యతిరిక్త పదము. ప్రకాశము అంటే వస్తు యాథాత్మ్యము యొక్క జ్ఞానము. లాఘవాదిలోని ఆదిపదముచే జ్ఞాన సుఖసంగము సంగ్రహింప బడుతుంది. గీతాభాష్యంలో 14.6 'జ్ఞానసుఖజననం సత్త్వం పునరపి తయోః సఙ్గజననం చేతి' అని ఉంది కనుక సత్త్వము అద్రవ్యము. అది ప్రకాశానికి సుఖానికి లాఘవానికి మొదలయిన వానికి నిదానము కారణము. అది శక్తిమొదలయిన అద్రవ్యముల కంటే వేరయినది. అది అతీంద్రియము కూడ అని లక్షణము.

శుద్ధసత్త్వము, మిశ్రసత్త్వము అని రెండువిధాలు సత్త్వము. రజస్సు తమస్సులతో కాకుండ విడిగా ఉండేది శుద్ధసత్త్వము. అది నిత్యవిభూతిలో ఉంటుంది. అక్కడ రజస్సు తమస్సు ఉండవు. నిత్యవిభూతిని నడిపేవాడు– ప్రవర్తకుడు ఈశ్వరుడు కనుక ఈశ్వరునిలో శుద్ధసత్త్వము ఉంటుంది. పూర్వము తెలుసుకున్నట్టు ఉపచారము కార్యకారణ భావము, తాదర్థ్యము, తాత్స్థ్యము,

సామీప్యము, సాదృశ్యము మొదలయిన వాటి వలన ముఖ్యమునుండి అముఖ్యములో శబ్దముయొక్క ప్రవృత్తి. ఇక్కడ కార్యకారణభావము.

మిశ్రసత్త్వము – రజోగుణముతో తమోగుణముతో కలిసిమెలసి ఉండే సత్త్వము. ఇది ప్రకృతిలో ప్రకృతిచే ఏర్పడ్డ అన్నిపదార్థాలలో ఉంటుంది. ప్రకృతితో సంబంధము ఉన్న జీవులలో కూడ ఈ మిశ్రసత్త్వము ఉన్నది. జీవుని గుణము సత్త్వము కాదు కాని ప్రకృతితో సంబంధము ఉన్న కారణముగా మిశ్రసత్త్వము బద్ధ జీవులతో సంబంధము కలిగి ఉంటుంది. ఈ సంబంధము ఔపచారికము.

రజోగుణలక్షణము – ఇది రాగము, తృష్ణ, లోభము, మరియు ప్రవృత్తికి కారణభూతమయినది. శక్తి మొదలయిన వాటికంటె భిన్నమయిన అతీంద్రియము అద్రవ్యము అని లక్షణము. సత్త్వము తమస్సులలో అతివ్యాప్తికి రాగాది విశేషణము. శబ్దాది నివృత్తికి అతీంద్రియపదము. ఇతర అద్రవ్యనివృత్తికి శక్త్యాదిపదము. లోభము అనగా తన ద్రవ్యమును వస్తువులు మొదలయిన వాటిని దానము చేయలేకపోవడము వదలలేక పోవడము. ప్రయోజనమంటూ ఏది లేకున్నా చంచలస్వభావముతో ఏదో ఒక ప్రవృత్తి. ఆదిపదముతో ప్రయత్నము, అశమము, స్పృహ. ప్రయోజన ముతో పనిచేయడం ప్రయత్నము. ఇంద్రియములు ఎప్పటికి పనిచేయడం అశమము. విషయములందాసక్తి స్పృహ.

తమోగుణలక్షణము – ప్రమాదము, మోహము మొదలయిన వాటికి కారణభూతము శక్త్యాదులకంటే ఇతర అద్రవ్య మయినది అతీంద్రియ మయినది తమస్సు. దీంట్లో కూడ మొదటి దలముతో సత్త్వము రజస్సుల నివృత్తి జరుగుతుంది. రెండవవిశేషణముతో ఇతర అద్రవ్యములనుండి నివృత్తి అవుతుంది. అతీంద్రియముతో శబ్దాదుల నుండి నివృత్తి కలుగుతుంది. చెడుపనులలో ప్రవర్తింప చేయడమే ఫలముగా గలది బుద్ధి యొక్క అజాగ్రత్త



ప్రమాదము అని చెప్పవచ్చును. విపరీతజ్ఞానము మోహము. ఆదిపదముతో జ్ఞానానుదయమను అప్రకాశమును స్తబ్ధతరూపమయిన అప్రవృత్తిని చెప్పుకోవాలి.

ఈ మూడు, సత్త్వరజస్తమోగుణములు, ప్రకృతి అంతటను వ్యాపించి ఉంటాయి. ప్రకృతి అధీనములో ఉన్న బద్ధ జీవులతో వీటికి సంబంధము ఉంటుంది. ఇవి మూడు అనిత్యములు. కాని వీటి సంతానము ప్రవాహము వలె ఎల్లప్పుడు ఉంటుంది. ఇది సదృశముగా విసదృశముగా కానీ ఉంటుంది. ప్రలయ దశయందు సదృశసంతాన ముంటుంది. సృష్టి దశలోని విసదృశ సంతానము ప్రవహిస్తుంటుంది. మూడింటిలో సృష్టికి పనికి వచ్చేది రజస్సు. స్థితికి ఉపయోగపడునది సత్త్వము. సంహారకాలమునకు అవసరమయినది తమస్సు.

ఈ గుణములు ఈశ్వరుని సంకల్పము మొదలయినట్టి సహకారి కారణములతో ఒకటి మరొకదానిని అణచివేస్తుంది, పెరుగుతున్నది. ఉత్పత్తి చేయునది అవుతుంది. భిన్న భిన్నమయిన అదృష్టములతో కూడి భిన్నభిన్న పురుషులలో ఏగుణము ఆవిర్భావావస్థ, సామ్యావస్థలో కనబడదు. అంతేకాదు ఓవస్తువు, కేవలము సుఖాత్మకము కేవలము దుఃఖాత్మకము అని చెప్పలేము. విష్ణు పురాణము– 'వస్త్వేకమేవదుఃఖాయ సుఖాయేర్ష్యా గమాయ చ కోపాయ చ యతస్తస్మాద్ వస్తువస్త్వాత్మకం కుతః॥ అని చెప్తుతుంది. అట్లాగే

**'తదేవ ప్రీతయే భూత్వా పునర్దుఃఖాయ జాయతే**

**తదేవ కోపాయ చ యతః ప్రసాదాయ చ జాయతే ॥**

**తస్మాద్ దుఃఖాత్మకం నాస్తి న చ కిఞ్చిత్ సుఖావహమ్' ॥**

అని కూడ వివరించినది.

గీత పదునాలుగవ అధ్యాయములో మూడుగుణాలు, గుణాల గుణాలు, విశేషాలు విపులీకరించబడ్డాయి. వీటన్నిటిని బట్టి సత్త్వరజస్త మస్సులు గుణములు, ద్రవ్యములు కావు అని సుస్పష్టము.

## శబ్దనిరూపణమ్:

మూ: అస్మదాది శ్రోత్రగ్రాహ్యః పఞ్చ భూతవర్తీ శబ్దః. స చ ద్వివిధః – వర్ణాత్మకః అవర్ణాత్మకశ్చేతి. అకచటతపయాది పఞ్చాశదక్షరాత్మకో వర్ణాత్మకః. సదేవ మనుష్యాది తాల్వాది వ్యఙ్గ్యః. భేర్యాదిజన్యో వర్ణాత్మకః. ఏవమ్భూతశ్శబ్దః శ్రోత్రేంద్రియేణ గృహ్యతే॥ శ్రోత్రేందియగమనాద్వా వ్యఞ్జక వాయ్వాగమనాద్వా శబ్దగ్రహః. నను శ్రుత్యా శబ్దస్య ద్రవ్యత్వం ప్రతీయతే, అద్రవ్యత్వం కథమితిచేన్న. అకారాదేః ప్రణవోత్పాదకత్వం వాచ్యద్వారా సమ్భవతీతి పరిహారాద్ ద్రవ్యత్వముపపద్యతే.

అ: మనము శ్రోత్రేందియము (చెవి) ద్వారా గ్రహించునది శబ్దము. అది అద్రవ్యము. ఇది పంచభూతములలో ధర్మముగా కనబడుతుంది. ఇది రెండు విధాలు – ఒకటి వర్ణాత్మకము రెండు అవర్ణాత్మకము. అకచటతపయ మొదలుకొని ఉన్న యాభయి అక్షరాలతో కూడినది వర్ణాత్మకము అయిన శబ్దము. ఈవర్ణాత్మక మయిన శబ్దము దేవతలు మనుష్యులయొక్క కంఠము, తాలువు (దవడ), మూర్ధ (తల), దంతములు (పళ్ళు) ఓష్ఠములు (పెదిమలు) అను స్థానమునుండి అభివ్యక్తము అగునది. ఢంకా, మృదంగము మొదలయిన వాటినుండి పుట్టినది అవర్ణాత్మకమయిన శబ్దము. ఈరెండువిధాలయిన శబ్దాన్ని శ్రోత్రేంద్రియము గ్రహిస్తుంది. శ్రోత్రేంద్రియము శబ్దమువరకైనా పోతుంది లేదా వాయ్వాత్మక శబ్దము శ్రోత్రేంద్రియము వరకు వస్తుంది. శ్రుతి అనుసారము శబ్దము ద్రవ్యము అని అనిపిస్తున్నది, మీరేమో అద్రవ్య మంటున్నారు ఇది ఎట్లా? ద్రవ్యము అనడం సమంజసము కాదు. అకారము మొదలయినవి ప్రణవమును ఉత్పత్తిచేస్తున్నవి. ఎట్లా? వాచ్యము అయితేనే శబ్దముగా అభివ్యక్త మయితేనే కనుక శబ్దము అద్రవ్యమే. సందేహం లేదు.



వి: శబ్దము మనచెవులతో వినబడుతుంది. ముఖావయవములు నాసిక వాటి ద్వారా అభివ్యక్త మవుతుంది. ఇది రెండు విధాలు–వర్ణాత్మకము, అవర్ణాత్మకము. వర్ణాత్మకములో అకారాది అచ్చులు కకారాది స్పర్శలు, యకారాది అంతస్థములు, శకారాది ఊష్మములు ఉంటాయి. ఒకే దానిని చెప్పడానికి అక్షరము వర్ణము అని రెండు ఎందుకున్నాయి. ఇది నా ఊహ అక్షరము – నాశము లేనిది. జీవునకు గూడ ఈపేరుంది. ధ్వనిరూపముగా వెలువడునది, నాశనము లేనిది అ, ఆ మొదలయినవి, ఇక వర్ణము – అక్షరముతో బాటు రంగు అని కూడ అర్థమున్నది. మాట్లాడితే రంగు అవసరము లేదు. వ్రాస్తేమటుకు ఏదయినారంగు కావాలి. వ్రాసిన అక్షరము వర్ణము, ఇది నశించ వచ్చును. ఇట్లా ఒకదానికే రెండు పేర్లు వచ్చియుండ వచ్చును. ఈవర్ణములు ఒక్కొక్క భాషకు ఒక్కొక్క సంఖ్యలో ఉన్నాయి. సంస్కృతభాషకు యాభయి యాభయిఒకటి, యాభయి రెండు, యాభయి మూడు అనిచెప్తుతారు. అనుస్వారము విసర్గ క్షత్రజ్ఞలు తీసేస్తే నలుబయి ఎనిమిదే అక్షరములు, గ్రంథకర్త అచ్చులు పదహారు, వర్గాక్షరాలు ఇరువయి అయిదు, యనుండి హవరకు ఎనిమిది, క్షకారము కలుపుకొని యాభయి చెప్పినట్టున్నారు.

శబ్దగ్రహణ పద్ధతి: శ్రోత్రేంద్రియ గమనము చేత శబ్దగ్రహణము జరుగుతున్నది అనగా శ్రోత్రేంద్రియము శబ్దస్థానమునకు పోయి శబ్దమును గ్రహిస్తుంది. శబ్దము పంచభూతములలో ఉంటుంది. ఇది విశిష్టాద్వైతులకు అభిప్రేత మయినది.

వాయ్వాది ఆగమనము చేత శబ్దగ్రహణము వాయువు చే అభివ్యక్త మయి శబ్దము శ్రోత్రేందియమును చేరుతుంది. అప్పుడు ఇంద్రియము శబ్దమును గ్రహిస్తుంది అని. ఈవాదము ప్రకారము శబ్దము ఆకాశంలోనే ఉంటుంది. దానిని చెవి గ్రహిస్తుంది.

మొదటివాదాన్ని బలపరిచే శ్లోకము వరదనారాయణులది –

**దూరే శబ్దః సమీపే చ ప్రాచ్యాం చేత్యాదిదర్శనాత్ ।**
**గత్వా శ్రోత్రేన్ద్రియం తత్ర తతః శబ్దగ్రహక్షమమ్ ॥** అని.

శబ్దము ద్రవ్యము అనుపక్షము – శ్రుత్యాది ప్రమాణములతో శబ్దము ద్రవ్యమని కార్యమని సిద్ధిస్తున్నది. వేదము ప్రారంభమున ఏది ప్రణవ రూపస్వరమున చెప్పబడినదో ఏది వేదాంతములలో ప్రతిష్ఠితమయి ఉన్నదో అట్టి వేదకారణమయిన ప్రణవము తన ప్రకృతి అకారములో లీనమవుతుంది. ఆప్రణవము యొక్క ప్రకృతి భూతమయిన అకారమునకు వాచ్యమయినది ఏ అర్థమో అదే మహేశ్వరుడు అని

**'యద్ వేదాదౌ స్వరః ప్రోక్తో వేదాన్తేషు ప్రతిష్ఠితః ॥**
**తస్య ప్రకృతిలీనస్య యః పరః స మహేశ్వరః**

శ్రుతి తెలుపుతున్నది. దీనిని బట్టి ఒకవర్ణము ఇంకొక దానికి ఉపాదాన కారణము అని తెలుస్తున్నది. కనుక అది ద్రవ్యము.

భగవద్రామానుజులు వేదార్థసంగ్రహములో 'సర్వస్యవేదజాతస్య ప్రకృతిః ప్రణవః......... నారాయణో యః స మహేశ్వర ఇత్యర్థః' అను గ్రంథముతో కూడ సమస్తవేదానికి ఉపాదానకారణము ప్రణవము అని చెప్పినట్టయినది. కనుక ద్రవ్యమే శబ్దము అని వాదన. అట్లాగే 'యస్య వేదాః శరీరమ్' ద్రవ్యము కానిది శరీరము కాదు. కొన్ని గ్రంథాలలో శబ్దము, ఆకాశము యొక్కగుణము కాదని వాయు ధర్మమని శబ్దము ఉచ్చారణతర్వాతనే పుడుతుంది. కనుక వాయువు శబ్దవ్యంజకము అనుట సరికాదని కూడ.

సిద్ధాంతము: ఏయుక్తులతో శ్రీభాష్యకారులు సత్త్వరజస్తమోగుణములను అద్రవ్యములుగా నిరూపించారో అవేయుక్తులు శబ్దాన్ని అద్రవ్యముగా నిరూపింప గలుగుతాయి. శబ్దము అద్రవ్యము ఆగంతుక ధర్మము. కాలవిశేషములో



ఉపత్పన్నమవుతుంది. ఆగంతుకము గనుక పరిణామము అని చెప్పబడింది. అంతమాత్రమున ద్రవ్యత్వము సిద్ధింపనేరదు. 'యస్యవేదాఃశరీరం'లో వేదాభిమాని దేవతను ఈశ్వరుని శరీరము అన్నారు. దేవత ద్రవ్యము కాదు గద. తస్యప్రకృతిలీనస్య అనుశ్రుతిలో అకారము ప్రణవానికి ఉపాదానము అని చెప్పడం జరిగింది. దాని అభిప్రాయం అకారాభిమాని దేవత ప్రణవము యొక్క ఉపాదాన కారణము అనియే. శ్రీపరాశరభట్టరు వారు కూడ 'గగనగుణశబ్దాది స్వరూపస్థితిః' అనువాక్యముతో శబ్దాన్ని ఆకాశగుణముగానే చెప్పారు. 'భగవత్సంకల్పానుసారము శబ్దము స్వభావతఃనే అర్థప్రతిపాదన శక్తి కలిగి ఉంటాయి' అని సమర్థించు సందర్భములోని దీ వాక్యము.

## స్పర్శనిరూపణమ్:

మూ: అస్మదాది స్పర్శనేన్ద్రియ గ్రాహ్యావిజాతీయవ్యావృత్తః అద్రవ్యం స్పర్శః. స చ త్రివిధః– శీతోష్ణానుభయాత్మక భేదాత్. అప్సు శీతస్పర్శః. తేజస్యుష్ణస్పర్శః. క్షితిపవనయో రనుష్ణాశీతస్పర్శః. పునర్ద్వివిధః– పాకజోఽ పాకజశ్చేతి. పృథివ్యాం పూర్వః. ఇతరేషు త్రిషు పరః. తత్ర అమృత గరలతూలోపల గోబ్రాహ్మణాది స్పర్శవిశేషాః పాకజభేదాః.

అ: మనయొక్క స్పర్శనేంద్రియముచే గ్రహింపబడే పదార్థముల కంటే విజాతీయములయిన వాటి నుండి వ్యావృత్త మయినదో – భిన్నమయి నదో ఆ అద్రవ్యము స్పర్శ అని లక్షణము. అది మూడువిధాలు చల్లనిస్పర్శ, వేడి స్పర్శ, సమశీతోష్ణ స్పర్శ. నీళ్ళలో చల్లటి స్పర్శ, తేజస్సులో వేడిస్పర్శ, భూమి వాయువులలో సమశీతోష్ణ స్పర్శ ఉంటాయి. మళ్ళీ స్పర్శ రెండు విధాలు– ఒకటి పాకజస్పర్శ, రెండవది అపాకజము అని. భూమిలో పాకజస్పర్శ ఉంటుంది. మిగత మూటిలో జలము, వాయువు తేజస్సులలో అపాకజస్పర్శ ఉంటుంది. అమృతము, విషము, దూది, రాయి, గోవు మొదలయిన వాట్లలో ఉండే స్పర్శవిశేషములు పాకజములు.

వి: మనందరిచే స్పర్శనేంద్రియముతో గ్రహింపబడే ఏ స్పర్శఉందో దానికి విజాతీయములు అయినవి శబ్దాదులు. వాటి కంటే భిన్నమయినది స్పర్శ అని లక్షణము. విజాతీయవ్యావృత్తము అనుపదము లేకుంటే అనుద్భూత స్పర్శయందు అవ్యాప్తి వస్తుంది. ఆస్పర్శలో స్పర్శనేంద్రియ గ్రాహ్యత్వము లేదు. అద్రవ్యపదం లేకుంటే ఘటాదుల్లో అతివ్యాప్తి కలుగుతుంది.

స్పర్శభేదములు నీళ్ళలో శీతస్పర్శ, తేజస్సులో ఉష్ణస్పర్శ అనేవి ఉంటాయి. భూమిలో గాలిలో ఉనుష్ణాశీతస్పర్శ ఉంటుంది. జలము సంబంధముతో భూమిలో చల్లని స్పర్శలు కలుగవచ్చును. వాయువులో కలుగవచ్చును. ఆచల్లదనం నీటిదేకాని భూమిదో వాయువుదో కాదు. తేజస్సు ప్రభావం వలన భూమి, గాలి వేడిగా ఉండవచ్చును. ఆవేడి తేజస్సుదే, భూమిదో గాలిదో కాదు. చల్లదనం నీటి స్వభావం. వేడి తేజస్సుది, సమశీతోష్ణం భూమి మరియు వాయువులది. మణులలోని రత్నములలోని ప్రభయొక్క వేడిని మనం గ్రహించలేక పోవడానికి కారణము వాటిది అనుద్భూతస్పర్శ అవడమే. అందుకే లక్షణములో కలిగే అవ్యాప్తిని పరిహరణము చేయడానికి అస్మదాది స్పర్శనేంద్రియ గ్రాహ్య పదము ప్రయోగింపబడినది.

స్పర్శపాకజము అపాకజము అని మళ్ళీ రెండు విధములుగా ఉంటుంది. పాకముతో ఉత్పన్నమయ్యేది పాకజము. ఇది పృథివిలో ఉంటుంది. పాకముతో ఉత్పన్నము కానిది అపాకజము. ఇది జలములో వాయువులో తేజస్సులో ఉంటుంది. పాకజస్పర్శలో అనేకం భేదాలున్నాయి. మెత్తనిది కఠినమయినది, జీవింపజేయునది మరణింపజేయునది (అమృతము, విషము వరుసగా) పవిత్రమయినది అపవిత్ర మయినది అనునవి ఆ భేదాలని తెలుసుకోవాలి. అనుష్ణాశీతము అనేది ఒకస్పర్శనే. శీతోష్ణములు లేక పోవడం కాదు. నిర్విశేషము అయిన సామాన్యముండదు కనుక అది స్పర్శసామాన్యం కాదు.



**రూపనిరూపణమ్:**

మూ: అస్మదాది చక్షురిన్ద్రి యైకగ్రాహ్యావిజాతీయవ్యావృత్తమ ద్రవ్యం రూపమ్. తచ్చతుర్ధా - సితరక్త పీతకృష్ణ భేదాత్. తత్ర సలిలకలధౌత శఙ్ఖ శుక్తిశశాఙ్కాదీనాం రూపవిశేషాస్సిత భేదాః. హుతవహజపాదాడిమ బన్ధుజీవవిద్రుమ పద్మారాగాదీనాం రూపవిశేషా రక్తభేదాః. కాఞ్చనహరితాల హరిద్రాదీనాం రూపవిశేషాః పీతభేదాః. మరకతమధుకర జలధరతిమిర తమాలదూర్వాదీనాం రూపవిశేషాః కృష్ణభేదాః. పీతిమానపి రక్తావాన్తరభేదం కేచిదిచ్ఛన్తి శ్రుత్యనుసారాత్. ప్రకారాన్తరేణ రూపం ద్వివిధమ్ - భాస్వరాభాస్వర భేదాత్. తేజోగతం భాస్వరమ్. క్షితిసలిలగతమ భాస్వరమ్. ఏవం చత్వార్యేవ రూపాణి. ఏతేన చిత్రం నామ పఞ్చమం రూపమితి మతనిరాసః. అతఏవ చిత్రరసగంధస్పర్శానామపి నిరాసః.

అ: మనం కళ్ళతో చూస్తాము. అట్లా మనకళ్ళతో మాత్రమే చూడబడే పదార్థాలు చక్షురింద్రియగ్రాహ్యాలు. వాటికి విజాతీయ మయినది ఏపదార్థమున్నదో అద్రవ్య మయినదో అది రూపముగా పేర్కొనబడుతుంది. ఆ రూపము నాలుగువిధాలుగా ఉంటుంది. తెలుపు ఎరుపు, పచ్చ (నిది) మరియు నలుపు అని నీరు, వెండి, శంఖము, ముత్యపు చిప్ప, చంద్రుడు మొదలయిన వాటి రంగు, తెలుపురకాలు. అగ్ని జపాకుసుమము- దాసన పువ్వు, దానిమ్మ బంధుజీవము, మంకెనపూవు, పగడము, పద్మరాగము - కెంపు, మొదలయిన వాటి యొక్క రంగు ఎరుపు - దాని భేదాలకిందకు వస్తుంది. బంగారము, హరి తాలము - హరిదళము, పసుపు మొదలయిన వాటి రంగు పీతము - పచ్చని రంగు భేదము (పసుపుపచ్చ) మరకతము- పచ్చ, తుమ్మెద, మబ్బు, చీకటి, తమాలము, నల్లని ఆకులు గలది సముద్రము, నది ఒడ్డుమిద ఉండే చెట్టు దూర్వ - గరిక మొదలయిన వాటి రంగు కృష్ణవర్ణము యొక్క భేదముల కిందికివస్తుంది. శ్రుతిని అనుసరించి కొందరు

పీతమును కూడ రక్తవర్ణము యొక్క అవాంతర భేదము అని ఒప్పుకుంటారు. ఇంకోవిధముగా రూపము రెండు విధాలు, ఒకటి భాస్వరము మెరయునట్టిది; అభాస్వరము – మెరవనిది. తేజస్సులో ఉండేది అభాస్వరము. ఇట్లా నాలుగేరూపము లుంటాయి. దీని వలన చిత్రము అని అయిదవ రూపము ఒప్పుకునేవారి వాదము వీగిపోతుంది. ఇదేవిధముగా చిత్రరసము, చిత్రగంధము, చిత్రస్పర్శ అనేవి కూడ లేవు.

వి: రూపము యొక్క లక్షణము – మనం ఇంద్రియమయిన నేత్రంతో గ్రహించే పదార్థములకు విజాతీయమయిన పదార్థము అద్రవ్యము ఏదయితే ఉన్నదో అది రూపము. ఇది నాలుగువిధాలు తెలుపు, ఎరుపు, నలుపు, పచ్చ, వీటి అవాంతర భేదాలు కూడ ఎన్నో ఉన్నాయి. 'యదగ్నే రోహితం రూపంతేజసస్తద్రూపం యచ్ఛుక్లం తదపాం యత్కృష్ణం తదన్నస్య' – ఛాం. ఉ.6.4.1 అగ్ని యొక్క రూపము ఎరుపు, నీటి యొక్క రూపము తెలుపు, అన్నము యొక్క రూపము నలుపు అని చెప్పినట్లు కొందరు మూడు రూపములనే చెప్పుచున్నారు. గ్రంథకర్తకు నాలుగు రూపములు అభిప్రేతములు. ఇంకో విధముగా కూడ భాస్వరరూపము అభాస్వర రూపమని రెండు విధాలుగా విభజన ఉన్నది. తేజస్సులో రక్తభాస్వరము. నీటిలో శుక్ల భాస్వరము. భూమిలో అనేకవిధము లయిన అభాస్వర రూపమున్నది.

నైయాయికులు మొదలయిన వారు చిత్రము అను అయిదవ రూపమును కూడ ఒప్పుకుంటారు. అది సరికాదు. వారు అట్లాచెప్పడానికి కారణము తెలుపు, ఎరుపు, మొదలయిన అనేకం దారాలతో తయారయిన వస్త్రమునకు ఏరూపం లేదని అందువలన వస్త్రమునకు ప్రత్యక్షము కాకపోవలసిన దుఃస్థితి వస్తుంది. ఇది తగదు. అవయవములకంటే వ్యతిరిక్త మయినట్టి అవయవి లేదు. అవయవములలో తెలుపు మొదలయిన ఒకేరంగు కనపడుతున్నది. ఇట్లాగే చిత్రరసము, చిత్రగంధము ఒప్పుకోవలసిన అవసరము లేదు. చిత్రస్పర్శకూడ లేదు.



## రసనిరూపణమ్:

మూ: అస్మదాది రసనేన్ద్రియ గ్రాహ్యావిజాతీయేతరో రసః. స షోఢా. మధురామ్లలవణకటుతిక్త కషాయభేదాత్. తత్రేక్షు క్షీరగుడాది రసో. మధుర భేదాః. చూతచిఞ్చామలకాదిరసా ఆమ్లభేదాః. సైన్ధవోషర వికారాది రసా లవణభేదాః. కిమ్పాకనిమ్బాదిరసా స్తిక్తభేదాః. శుణ్ఠీమరీచసర్ష పాదిరసాః కటుభేదాః. హరీతకీ విభీతకీ చూతాఙ్కురాది రసాః కషాయభేదాః.

అ: మనం రసనేంద్రియముతో కొన్ని పదార్థాల రుచి చూస్తాము. ఆ పదార్థాలకు విజాతీయ మయినవి – అట్లాటివి కానిపదార్థాలుంటాయి. రూపము స్పర్శ శబ్దము మొదలయినవి. వాటికంటే భిన్నమయినవి ఏ పదార్థాలున్నాయో, అద్రవ్యముగా ఉన్నాయో అవి రసము రుచి అని అర్థము. ఆ రుచి ఆరువిధాలు. మధురము, తీపి, ఆమ్లము – పులుపు, లవణము – ఉప్పు, తిక్తము – చేదు, కటు – కారము, కాషాయము – వగరు అని. చెఱకు, పాలు, బెల్లము వాటిలో రుచి తీపి భేదము కిందకు వస్తుంది. మామిడి, చింత, ఉసిరి మొదలయిన వాటి రుచి పులుపు వాటికి చెందినది. సైంధవము, ఊషరము, (సింధు–నది, సముద్రము నుండి వచ్చినది సైంధవము ఉప్పు, సింధుదేశము నుండి వచ్చే గుఱ్ఱానికి గూడ సైంధవము అని పేరు. అందుకే భోజనము చేసేప్పుడు సైంధవము అంటె ప్రకరణమును బట్టిఉప్పు అని నిర్ణయము అవుతుంది. ఊషరము – చౌటినేలలోనుండి వచ్చే ఉప్పు అని రెండువిధాలుగా ఉప్పు.అ.) అను వాటి నుండి తయారయిన వాటి యొక్క రుచి ఉప్పుభేదములకిందకు చేరుతుంది. కిమ్పాకము – విషవృక్షము, నిమ్బ–వేప మొదలగువాటి (పండ్ల) రసము–రుచి చేదు కిందకు వస్తుంది. శొంఠి, మిరియాలు, ఆవాలు మొదలయిన వాటి రుచి కారములో చేరుతుంది. కరక్కాయ, విభీతకము – తాండ్ర, చూతాంకురము–మామిడి మొదలయిన వాటి రుచి కషాయము – వగరులో చేరుతుంది.

## గంధనిరూపణమ్:

మూ: అస్మదాది ఘ్రాణగ్రాహ్యా విజాతీయేతరో గంధః. స ద్వివిధః – సురభిరసురభిశ్చ. పాటీర మృగమదఘుసృణ చమ్పకాది గన్ధాస్సురభి భేదాః పూతివిస్రాది గంధాస్త్వసురభిభేదాః; అయం చగంధః పృథివ్యేకవర్తీ పాక భేదాద్భిన్నః పవనసలిలాదిషు గంధోపలబ్ధిః పార్థివసంసర్గాత్ అయో దహ తీతివదౌపచారికీ. పఞ్చీకరణప్రక్రియయా సర్వభూతేషు సర్వగుణానాం విద్యమానత్వేఽపి ప్రాధాన్యాభిప్రాయేణోక్తమితి న విరోధః. పాకాద్ గుణాన్తరోత్పత్తిః స్వాశ్రయే. స్వాశ్రయనాశాభావాదేవోపపత్తేః పీలుపాకాది మతనిరాసః.

అ: మనం ముక్కుతో మాత్రమే కొన్నిటిని గ్రహిస్తాం. వాటి కంటె భిన్నమయినవి – విజాతీయములు. విజాతీయములకంటె ఇతరమయినవి. అవి అద్రవ్యమయినవి గంధము అన్న మాట. ఆ వాసన రెండువిధాలు, ఒకటి సురభి – మంచి వాసన, రెండవది అసురభి – చెడువాసన లేదా దుర్గంధము. పాటీరము – చందనము, మృగమదము – కస్తూరి, ఘుసృణము– కుంకుమ, చంపకం. – సంపంగి మొదలయిన వాటి గంధము సురభి గంధము కోవకు చెందుతాయి. పూతి – పాడయి పోయిన మాంసము వాసన, విస్ర– అపక్వమయిన గంధము మొదలయినవి అసురభిగంధము తెగకు చెందుతాయి. ఈగంధము ఒక్క పృథివిలోనే ఉంటుంది. పాకము యొక్కభేదముతో పలురకాలుగా వుంటుంది. గాలిలో నీటిలో వాసన రావడము, భూమి యొక్క సంసర్గము – సంబంధము వల్లనే కాని మరొకటి కాదు. ఇది ఉపచారము వలన కలుగుతున్నది. ఇనుము కాల్చుతున్నది అన్నట్లుగా నీళ్ళు వాసన వేస్తున్నాయి. మంచి గంధంగాలి వీస్తున్నది అని ప్రయోగము కూడ ఔపచారికమే. దానికి భూమితో సంబంధమే కారణము.

పంచీ కరణప్రక్రియ ద్వారా అన్నిగుణాలు అన్నిటిలో ఉంటాయి. అన్నది వాస్తవమే అయినా ఆయాభూతములలో ఆయాగుణముల స్థితి ఎక్కువ



తక్కువల బట్టి చెప్పినందున ఎట్టి విరోధము లేదు. పాకము వలన తన ఆశ్రయములో మరియొక గుణము పుడుతుంది. స్వాశ్రయము యొక్క నాశము లేకుండగనే మరియొక గుణము పుడుతు న్నందున పీలుపాకము, పిఠరపాకము అను వాటిని ఒప్పుకొనువారి అభిప్రాయము సరికాదు.

వి: గంధము లక్షణము కూడ పూర్వపు వాటి లక్షణము వలె ఉన్నది. విజాతీయేతరము అనుపదము మిగత గుణముల యొక్క ప్రసక్తి తొలగిపోతుంది.

సుగంధము, దుర్గంధము అని రెండు విధాలు. సుగంధ, దుర్గంధ ప్రతీతి వ్యవహారవిషయ మయినవి సుగంధ దుర్గంధములు అన్నమాట. కొన్ని ఉదాహరణల – చందనము, కస్తూరి, సంపెంగ, కుంకుమ మరియు ఇతర పూలవాసన సుగంధములో చేరుతుంది. సంస్కృతంలో వాసనా అని ఓ శబ్దమున్నది. దానికి సంస్కారము అని విస్తృతమయిన అర్థమున్నది. దానిలో ఒకటి గంధము కూడ కావచ్చును.

ఇది ఒక భూమి భూతములో ఉంటుంది. దీని సంబంధముతో నీటికి గాలికి కూడ కొంత గంధము అంటవచ్చును. అట్లా అంటి నందువలన మంచివాసన కల్గిన నీరు, గాలి, అని ఉపచారముతో అంటుంటాము. ఉపచారము గురించి ఇది వరకే చాలా తెలుసుకున్నాము. గ్రంథకర్త ఇచ్చారు కనుక మరొక ఉదాహరణము – ఇనుము కాలుస్తున్నది అని. తేజస్సులో ఉండేవేడి ఇనుములోకి వచ్చింది. వచ్చి అగ్ని చేసేపని చేస్తున్నది. ఇది ఉపచారము. అట్లాగే భూమి సంబంధముతో గాలి, నీరు, కూడ గంధము కలిగి ఉన్నాయనడం ఉపచారమన్నమాట.

విశిష్టాద్వైతులు పంచీకరణమును ఒప్పుకుంటారు. దీనివివరణను ఇది వరకే చూసాము. దీని ప్రకారము అన్ని భూతముల గుణములు అన్నిట్లో ఉంటాయి గద. అట్లాటప్పుడు గంధము ఒక భూమిలోనే ఉండటం

ఎట్లా పొసగుతుంది అని ప్రశ్న. దీనికి గ్రంథకర్త ఇచ్చినసమాధానము– పంచీకరణ ప్రక్రియ ఉంది. అన్ని గుణాలు అన్నిట్లో ఉంటాయి. ప్రాధాన్యంగా ఎక్కువగా ఉండటాన్ని బట్టి ఇట్లా వివరించడం జరిగింది, ఏ విరోధములేదు అని.

పాకజగుణాంతరోత్పత్తి విమర్శ. పూర్వము ఉదాహరించిన 'యత్ కృష్ణం తదన్నస్య' అనుశ్రుతి పృథివిది కృష్ణరూపము అని తెలుపుతున్నది. ఆకాశములోని నీలమును సమర్థిస్తారు భాష్యకారులు. పంచీకరణ ప్రక్రియతో ఆకాశములో నీలరూపము కలసి పోయినది. అందుకే ఆకాశము నీలముగా కనబడుతుంది అని. పృథివి రూపము స్వాభావికముగా నీలము. పాకజము గాదని స్పష్టము. ఇక్కడ నైయాయికులు, వైశేషికులు ఓప్రశ్న లేవదీస్తారు – ఉత్పన్నమయ్యేప్పుడు కార్యములన్ని ఒకక్షణము ఏమి ధర్మము లేకుండ ఉంటవి. తరువాత క్షణములో పాకముతో రూపాది గుణాలు పుడుతాయి. అట్లాటప్పుడు పృథివి ఉత్పత్తికాలములో నీలముగా ఉండింది అని ఎట్లా అనవస్తుంది పాకజమే అని అనాలి. సమాధానము–ఉత్పత్తి సమయములో జలము అభా స్వరశుక్లము శీతస్పర్శ అనుగుణములతో కలిసియే ఉంటుంది అని ఒప్పుకున్నట్లుగా పృథివి కూడ నీలరూపము కలిగి ఉన్నదని ఒప్పుకోవాలి.

పాకము అంటే ఏమిటి – పాకము ద్వారా ద్రవ్యములలో ఉన్న గుణములతో బాటు కొత్తగుణాలు వస్తవి. అయితే ఈ పాకము ఎక్కడ జరుగుతుంది – పీలువులలోనా (పరమాణువులలోనా) పిఠరములోనా (అవయవిలోనా) లేదా ఆశ్రయములోనా? అని ప్రశ్న. పీలువులు – పరమాణువులలోనే పాకము జరుగుతుంది అవయవిలో కాదు అని వైశేషికులు అంటారు. పిఠరములో అవయవిలో కూడ పాకము జరుగుతుంది. అని నైయాయికులు అంటారు. ఈ రెండు పక్షాలు సిద్ధాన్తానికి విరుద్ధములు, సమ్మతములు కావు. పరమాణువులు లేవని నిరూపించడం జరిగింది



ఇదివరకే. అట్లాగే అవయవములకంటే వేరుగా అవయవి ఉండనేరదు కనుక రెండవది కుదరదు. కుండ మొదలయిన వాటి యొక్క అవయవములు కలిసి ఉన్నప్పుడు, వాటిలో పాకము జరుగుతుందా? అవి విడిపోయినప్పుడు వాటిలో పాకము జరుగుతుందా అని ప్రశ్న. వీలున్నట్లుగా రెంటిని ఒప్పు కుంటారు. స్వాశ్రయనాశము అనేది అవసరము లేకుండానే గుణాం తరము పుడుతుందని ఒప్పుకోవడంతో పీలుపాకవాదము పిఠర పాకవాదము వీగిపోతాయి.

## సంయోగ నిరూపణమ్:

మూ: సంయుక్త ప్రత్యయ నిమిత్తం సంయోగః. స చ సామాన్య గుణః షడ్ ద్రవ్యవర్తీ. అస్య చ స్వాభావసాదేశ్యముపలభ్యమానమంశ భేదప్రయుక్తతయా న విరోధావహమ్. స చ కార్యాకార్యభేదాద్ ద్వివిధః. పూర్వః పరిమితానా ముభయప్రేరణాత్. యథా మేషయోర్మల్లయోర్వా, క్వచి దన్యతరప్రేరణాత్, యథా స్థాణుశ్యేనయోః. కేచిత్సంయోగజసంయోగమపి వదన్తి. హస్తపుస్తక సంయోగాత్కాయ పుస్తక సంయోగ ఇతి. తన్న. హస్తపుస్తక సంయోగేనైవోపపత్తేః. ఏతేన విభాగజవిభాగోఽపి నిరస్తః. వియోగోఽపి సంయోగాభావ ఏవ న పృథగ్గుణః. అకార్యసంయోగస్తు విభుద్రవ్యయోః. అజద్రవ్యసంయోగః. శ్రుత్యాఅఙ్గీక్రియతే. అనుమానాదప్యజద్రవ్య సంయోగసిద్ధిః యథా విభుద్రవ్యం విభుద్రవ్యసంయోగవద్ ద్రవ్యత్వాత్ ఘటవత్ తథా విభుద్రవ్య మీశ్వరసంయుక్తమ్, ద్రవ్యత్వాత్ ఘటవత్. ఈశ్వరః కాలాది సంయుక్తో ద్రవ్యత్వాద్ ఘటవత్ ఇత్యాదిభిర్విభుసంయోగస్సిద్ధః.

అ: ఈ పదార్థములు సంయుక్తములు అను ప్రతీతి దేనివలన జరుగుతున్నదో అది సంయోగము. సంయోగము ఒక సామాన్యగుణము. ఇది ఆరు ద్రవ్యములలో కూడ ఉంటుంది. తనయొక్క అభావము స్వాభావము. సమానో దేశోయస్యసః సదేశః తస్యభావః సాదేశ్యమ్. తాను ఉన్నచోట తన

అభావము కూడ ఉండటము. తాను ఉండటం ఉండకపోవడం పరస్పర విరుద్ధాలు. కాని ఒక అంశంలో సంయోగం ఉండటం ఒక అంశంలో లేకపోవడం అనువాటికి ఎట్టి విరోధము లేదు. ఈ సంయోగము కార్య సంయోగము కార్యభిన్నసంయోగము అని రెండు విధాలుగా ఉంటుంది. కార్యసంయోగము పరిమిత వస్తువులకు కలుగుతుంది. అది రెండిటి ప్రేరణ వలన కలుగుతుంది. రెండు గొర్రెలమధ్యగాని ఇద్దరు వస్తాదుల మధ్యగాని కలుగునట్లాటిది కార్యసంయోగము. ఒకోచోట ఒక్క(రి) దాని ప్రేరణవలననే జరుగుతుంది సంయోగము. ఒకడేగ మోడు మీద కూచున్నట్టుగా కొందరు సంయోగము వలన కూడ సంయోగము కలుగుతుందంటారు. చేయిపుస్తక సంయోగముతో శరీరానికి పుస్తకానికి సంయోగము కలిగినట్లుగా. కాని దీనిని సంయోగమని ఒప్పుకోలేము. హస్తపుస్తకసంయోగముతోనే సంయోగము సిద్ధిస్తున్నది. అందుకే విభాగజన్య మయిన విభాగము కూడ లేదు. విభాగము సంయోగము యొక్క అభావమే కాని మరొకటి కాదు. గుణము కాదు. రెండు విభుద్రవ్యములలో కలుగు సంయోగము అకార్యసంయోగము. నిత్య ద్రవ్యముల సంయోగమును శ్రుతులు ప్రతి పాదిస్తున్నవి. నిత్యద్రవ్య సంయోగమును మనం అనుమానంతో కూడ సాధించవచ్చును–విభుద్రవ్యానికి విభుద్రవ్యముతో సంయోగము కలుగుతుంది. అవిఘటమువలె ద్రవ్యములు కనుక. విభుద్రవ్యము ఈశ్వరునితో సంయోగము కలిగి ఉంటుంది. అవి ఘటము వలె ద్రవ్యము కనుక. ఈశ్వరునకు కాలాదులతో సంయోగము కలుగుతుంది అవి ఘటమువలె ద్రవ్యములు కనుక. ఇట్లాటి అనుమానాల ద్వారా విభుద్రవ్యములయొక్క సంయోగము సిద్ధిస్తుంది.

వి: కొందరు ద్రవ్యస్వరూపమునే సంయోగ మంటారు. సంయోగము ఒక పదార్థము కాదు అని. అట్లయితే వియుక్తములకు కూడ తమ స్వరూపమున్నందున సంయుక్తములు అని ప్రతీతి కలుగవలసి వస్తుంది. రెండిటి మధ్య ఎడములేక పోవడము నైరంతర్య సంయోగము. సంయోగమనేది వేరే అక్కరలేదు అని బౌద్ధులు అంటారు. నైరంతర్యము అంటే ఏమిటి అంతరాలము లేకపోవుట అభావము. అది కూడ సమీపదేశముతో సంయోగమే. అభావము భావాన్తర రూపము కనుక సంయోగమును తప్పక ఒప్పుకొనితీరాలి. సర్వత్ర జీవనములో సంయోగమున్నందున అందరు ఒప్పు కున్నదే. ప్రకృతి పురుషసంయోగము వలన విశ్వసృష్టి. అలాటి సంయోగ విశేషాలతోనే జగత్తులో దృగ్గోచరమయ్యే వైషమ్యము. ఇంద్రియార్థ సంయోగముతో అనేక విధము లయిన బుద్ధి కలుగుతున్నది. నీరు మొదలయిన వాటి సంయోగముతో విత్తులో అంకురము పుడుతున్నది. పవిత్రవస్తు సంయోగముతో సుఖము, అపవిత్రవస్తుసంయోగముతో దుఃఖము ఇట్లా సంయోగకార్యములు అంతటా అనుభవిస్తునే ఉన్నాము.



ఈ సంయోగములో విరోధమున్నట్టు కనబడుతుంది. ఓ చెట్టుమీద కోతి ఉన్నది. కనుక కపిసంయోగము కలది చెట్టు. చెట్టుకాండములో కోతి లేదు. సంయోగము లేదు, ఇట్లా ఒకచోటనే తాను తన అభావము తాను లేక పోవడము జరుగుతున్నది. ఇది స్వాభావము. సమానోదేశః సదేశః తస్య భావః సాదేశ్యము. ఇట్లా ఉండటము ఏమి విరోధము కాదు. అంశభేదముతో ఇట్లా జరుగుతుంది. ఒక అంశము – అగ్ర భాగము, ఒక అంశము కాండ భాగము. స్వాభావసాదేశ్యము విరుద్ధము గాదు. ఒకే భాగమున రెండు ఉంటె విరోధము. పైన కింద భేదము స్వము–అభావము రెండు ఉన్నవి. సావయవముల విషయమున బాగుంది, మరి నిరవయవ విషయములో విరోధము వస్తుందిగదా – అంటే రాదు. నిరవయవమునకు ఉపాధి భేదము లుంటాయి. ఓఉపాధిలో సంయోగము, మరో ఉపాధిలో సంయోగము లేకపోవడము కనుక విరోధము లేదు. మఠాకాశములో పురుషసంయోగ మున్నది కాని ఘటాకాశములో లేదు. ఈ విధముగా ఉపాధి అంశభేదము న్నందున విరోధము కలుగదు.

భేదములు - కార్యసంయోగము. పరిమితము లయిన మూర్త పదార్థముల యొక్క సంయోగము కార్యము. అదిపుడుతున్నది కాబట్టి రెండు పదార్థములలో క్రియ ఉన్నప్పుడు కార్యరూప సంయోగము. రెండు గొర్రెలు ఒక దానితో ఒకటి తలపడుతున్నప్పుడు క్రియ ఉన్నది. ఇద్దరు వస్తాదులు కుస్తీపడుతున్నప్పుడు క్రియ ఉన్నది. ఒకోసారి రెంటిలో ఒక దానిలోమాత్రమే క్రియ ఉంటుంది. దానితో సంయోగము ఏర్పడుతుంది. ఒకడేగ ఓమోడు మీద వాలుతుంది. అదీ సంయోగమే. క్రియ ఒక డేగలోనే ఉన్నది.

కొందరు సంయోగమువలన సంయోగము కలుగుతుంది, అది సంయోగజసంయోగము అని వాదిస్తారు. ఇది సరికాదు. వారు చెప్పే ఉదారహణము - చేయి పుస్తకముల సంయోగము. ఆ సంయోగముతో కలిగేది శరీర పుస్తక సంయోగము. చేయి శరీరము యొక్క అవయవము. శరీరము దాని అవయవి. అవయవ భూతమయిన చేతికి పుస్తకముతో సంయోగము అవడముతో, అవయవి అయిన శరీరముతో పుస్తకానికి సంయోగము కలుగుతున్నది అని. ఈ సంయోగము సరియయినది కాదు. అవయవముల సముదాయము కంటె వేరుగా అవయవి అనే పదార్థము ఏదీ లేదు. అవయవభూత మయిన చేతితో పుస్తకమునకు ఏ సంయోగము కలిగినదో అదే అవయవ సముదాయ మయిన శరీరమునకు పుస్తకముతో సంయోగము. సంయోగజ సంయోగము లేదు.

అకార్యసంయోగము - నిశ్చలముగా ఉండి మధ్యన ఎడము లేకుండ ఉండే రెండు వస్తువుల మధ్యన ఉండేది అకార్యసంయోగము. కాలము మరియు ఈశ్వరుడు మొదలయినవి విభుద్రవ్యములు, నిశ్చలములు. వీటిలో క్రియ ఉండదు. ఇవి అన్ని మూర్త ద్రవ్యాలతో సంయోగము కలిగి ఉంటాయి. రెండు విభుద్రవ్యాల మధ్య ఏ అంతరాలము - ఎడము ఉండదు. రెండు విభుద్రవ్యాలమధ్యన వాటితో సంయుక్తము కానిది ఏ పదార్థముండదు.



రెండు విభుద్రవ్యముల మధ్యన క్రియ ఉండనందున వీటిసంయోగము కార్యము కాదు. కనుక ఇది అకార్యసంయోగము.

వైశేషికులు ఈ సంయోగము నొప్పుకొనరు. ఈ విషయములో శ్రుతులు 'సర్వవ్యాపీ చ భగవాన్' అన్తర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః' అని నారాయణుడు ప్రపంచంలో అంతటా వ్యాపించి ఉన్నాడు ప్రపంచంలోని అన్నివస్తువులలోన వెలుపల వ్యాపించి వున్నాడు అని అకార్య సంయోగమును ప్రతిపాదిస్తున్నవి. శ్రుతులే కాకుండ ఇట్లా అనుమాన ప్రమాణాన్ని కూడ మనం చెప్పుకోవచ్చును. రెండు విభుద్రవ్యముల మధ్య సంయోగము ఉంటుంది. అవి ఎడము లేకుండా ఉన్నవి కాబట్టి అంతదరాలము లేకుండ ఉండే ఇద్దరు మనుష్యులలో గాని వస్తువులలో గాని సంయోగము ఉంటుంది. విభు ద్రవ్యములు సంయుక్తములు కాకుంటే మధ్యన ఎడము ఉండేది కాని ఎడము లేదు. దీనిని బట్టి వాటిలో సంయోగమున్నది. రెండవ అనుమానము - విభుద్రవ్యములు ఈశ్వరునితో సంయోగము కలిగి ఉంటాయి. అవి ద్రవ్యములు కనుక, ద్రవ్యములన్ని ఘటమువలె ఈశ్వరునితో సంయోగము కలిగిఉంటాయి. మూడవది - విభుద్రవ్యమయిన ఈశ్వరుడు కాలాదులతో సంయోగము కలిగి ఉన్నాడు. ద్రవ్యము కనుక. ద్రవ్యములెన్ని ఉన్నాయో అవి అన్ని ఘటములాగ కాలముతో సంయోగము కలిగియే ఉంటాయి.

## శక్తినిరూపణమ్:

మూ: అథ శక్తిః. సర్వకారణానాం కారణత్వనిర్వాహకః కశ్చిద్ అద్రవ్యవిశేషః శక్తిః తర్కాగమాభ్యాం తత్సిద్ధిః. ప్రతిబంధకమణిమన్త్రాదిసన్నిధౌ స్వరూపసహకారి వైకల్యాభావేపి యదుపరోధాద్దహనో న దహతి. సాహ్య తీంద్రియా శక్తిః. అయస్కాన్తాదిషు తత్ప్రసిద్ధిః. సా శక్తిః షడ్ద్రవ్యవర్తినీ భగవన్నిష్ఠత్వం పురాణరత్నాదిషు ప్రసిద్ధమ్. ఏవం సర్వత్రాపి శక్తినామక ధర్మవిశేషసిద్ధిః.

అ: ఇప్పుడు శక్తినిరూపణము. అన్ని కారణముల యొక్క కారణత్వమును నిర్వహించునది అద్రవ్యమయినది శక్తి. ఈశక్తి తర్కముచేత ఆగమము చేత సిద్ధిస్తుంది. సాధారణముగా అగ్నికి దహించే శక్తి ఉన్నది. మణి మంత్రములు ఆశక్తిని అడ్డు కుంటాయి. ప్రతిబంధకము లయిన మణిమంత్రముల సమీపమున స్వరూప కారణములు సహకారి కారణములు ఉన్నను, ఏది లేనందువలన అగ్నిలో దాహకత్వము ఉండదో అది శక్తి. అది అతీంద్రియ మయినది. అయస్కాంతము మొదలయిన వాట్లలో ఈశక్తి ఉనికి ప్రసిద్ధము. ఈ శక్తి ఆరుద్రవ్యాల్లో ఉంటుంది. భగవంతునిలో శక్తి ఉన్నదను సంగతి విష్ణుపురాణము మొదలయిన వాట్లలో ప్రసిద్ధము. ఇట్లా అన్నిచోట్ల శక్తి అనేధర్మము సిద్ధిస్తుంది.

వి: అద్రవ్యములను తొమ్మిదింటిని నిరూపించిన తరువాత గ్రంథకర్త పదవ అద్రవ్యమును నిరూపిస్తున్నారు. కారణములలో కారణత్వము ఉంటుంది. ఆకారణత్వమును నిర్వహించునది, కారణత్వము కలిగించునది శక్తి. కార్యమును ఉత్పన్నము చేయు సామర్థ్యము కారణమునకు కలిగించు నది శక్తి. ఇది ఇంద్రియములకు అందనిది కనుక అతీంద్రియము. ఈశక్తి తర్కముతో సిద్ధిస్తుంది. ఆగమముతో సిద్ధిస్తుంది. తర్కముతో సిద్ధి – సామాన్యముగా అగ్ని దహిస్తుంది. అది దాని స్వభావము. అప్పుడప్పుడు నెయ్యి, కర్రలు మొదలయిన సహకారి కారణములతో ఎక్కువగా దహిస్తుంది. అయితే స్వభావము, సహకారులు ఉన్నవి కాని చంద్రకాంత మణి గాని మంత్రము ప్రయోగించినందున గాని అగ్ని దహించలేకుండా పోతుంది. అది ఉండికూడ దేని అడ్డువలన దహించలేకుండ పోతున్నది అది శక్తి. అగ్ని యొక్క దాహకత్వశక్తిని మణి, మంత్రము అడ్డుకున్నాయి. వాటిని తొలగిస్తే అగ్ని దహిస్తుంది. దేని ద్వార అగ్ని దహిస్తున్నదో అది శక్తి. అది అద్రవ్యము. శక్తి ప్రత్యక్షము కాదు. అతీంద్రియము. అగ్నిలో దాహక శక్తి నీటిలో అర్ద్రీకరణశక్తి మొదలయిన శక్తులను అనుమానంతో తెలుసుకోవచ్చును.



ఇక ఆగమసిద్ధి – శక్తయః సర్వభావానా మచిన్త్యాఅపృథక్స్థితాః. అని అహి, సంహితలో కలదు. సర్వవస్తువులలో శక్తులు ఉన్నాయి. అవి అచిన్త్యజ్ఞానవిషయములు అవుతున్నవి. అయస్కాంతమణిలో ఈశక్తి ప్రసిద్ధము. ఆది పదము చేత దుందుభిమోత మొదలయినవి తీసుకోవాలి. అవును శక్తి కూడ శక్తివిశిష్ట మయినదా? కాదా? విశిష్టమయినది కాదు. దానిలో శక్తి అని అనవస్థ ఏర్పడుతుంది. కాదు అంటే శక్తిలేకుండా పోతుంది. అశక్తమవుతుంది. అట్లయితే ఇసుకనుండి కూడ నూనె కలుగుతుంది అని అనరాదు. వేరేశక్తి లేకున్నను కారణములు కార్యానుగుణముగా ఉండటంతోనే అది సిద్ధిస్తుంది. లేకుంటె ఉష్ణత్వము ఉష్ణమా? కాదా? మొదటిదానిలో అనవస్థ ఏర్పడు తుంది. రెండవదానితో కార్యమును కలిగించక పోవలసి వస్తుందన్నట్టు శక్తిలోశక్తి ప్రసంగమే రాదు. ఈశక్తి ఆరుద్రవ్యాల్లో ఉంటుంది. శక్తిలేని ద్రవ్యమే లేదనవచ్చును. విష్ణుపురాణము 1.3.2లో

**శక్తయః సర్వభావానామచిన్త్యజ్ఞానగోచరాః।**
**యతోఽతో బ్రహ్మణస్తాస్తు సర్గాద్యా భావశక్తయః॥**

'భవంతి తపతాంశ్రేష్ఠపాపకస్య యథోష్ణతా' ॥ అని చెప్పినందువలన శక్తి భగవన్నిష్ఠము అని స్పష్టము. 'పరాస్య శక్తిః వివిధైవశ్రూయతే' అని శ్రుతి కూడ చెపుతున్నది. భగవంతునిలో ఉన్న శక్తి పరా – ఉత్కృష్టమయినది. సర్వద్రవ్యములలో ఆయా కార్యములచే తెలుసుకోదగినది ఆకార్యమునకు ప్రతియోగిశక్తి అనే గుణము సాధారణముగా ఉంటుంది. ఇట్లా శక్తి ఆరుద్రవ్యములలో ఉంటుంది. (మీమాంసకులు శక్తిని వేరేపదార్థముగా ఒప్పు కుంటారు. నైయాయికులు, ప్రతిబంధకాభావమునే శక్తి అంటారు.

## వైశేషికాభిమతదశగుణేషు చతుర్వింశతి గుణానామన్తర్భావః

మూ: నను, చతుర్వింశతి ప్రకారా గుణా ఇత్యుక్తత్వాత్ కథం దశైవేతి నిర్దిశ్యతే ఇతి చేత్ ఉచ్యతే. జీవాత్మగుణవిశేషాణాం బుద్ధి సుఖదుఃఖే చ్ఛాద్వేష ప్రయత్నానాం షణ్ణాం జ్ఞానవితతి రూపత్వేన జ్ఞానేన్తర్భావస్య ఉక్తత్వాత్ ధర్మాధర్మయోరపీశ్వర ప్రీత్యప్రీతి రూపత్వేన ఈశ్వర జ్ఞానే అన్తర్భావాత్. భావనాఖ్య సంస్కారస్య జ్ఞాన విశేషరూపత్వాత్. వేగో (త్పతన) త్పాదకహేతోరేవ వేగాఖ్య సంస్కారోపపత్తేః సంయోగమాదాయ స్థితస్థాపక స్యాపి సమ్భవాత్. శబ్దస్పర్శరూప రసగన్ధానాం పఞ్చానాం ప్రత్యక్షసిద్ధత్వే నాఙ్గీ కారాత్. విభాగ పృథక్త్వ యోరపి సంయోగా భావమాదాయ ఉపపత్తేః. పరత్వాపరత్వయోర్దేశకాలసంయోగ విశేషమాదాయ ఉపపత్తేః సంఖ్యాపరిమాణ ద్రవత్వస్నేహానాం తత్తద్ ద్రవ్య స్వరూపమాదా యోపపత్తేః. గురుత్వస్య శక్త్య న్తర్భావస్య వక్తుముచితత్వాచ్చ దశైవేతి సుష్ఠూక్తమ్.

అ: న్యాయవైశేషికములలో ఇరువది నాలుగు గుణాలు అని నిరూపణ జరిగినది కద. మీరు పదిమాత్రమే చెప్పారు. ఇది ఎట్లా కుదురుతుంది అని ప్రశ్న కలుగుతుంది. దీనికి జవాబు ఇది – బుద్ధి, సుఖము, దుఃఖము, ఇచ్ఛ, ద్వేషము మరియు ప్రయత్నము అను ఆరుగుణములు జీవాత్మ యొక్క గుణవిశేషములు. ఈ ఆరు జ్ఞానముయొక్క విస్తృత రూపువంటివే. కనుక వీటికి జ్ఞానములో అంతర్భావమును చెప్పాలి. ఇక ధర్మము అధర్మము అను రెండు ఈశ్వరుని ప్రీతి, అప్రీతి రూపాలే, కాబట్టి ఇవి ఈశ్వరుని జ్ఞానంలోనే చేరిపోతవి. భావన అనేసంస్కారము కూడ జ్ఞానము యొక్కభేదమే వేరుగాదు. వేగమును కలిగించుటకు ఏకారణము ఉన్నదో దానిని వేగము అనే సంస్కారము అంటారు. సంయోగము వలననే స్థితి స్థాపకము ఏర్పడుతుంది. మేము ప్రత్యక్షసిద్ధమయిన శబ్ద స్పర్శ రూపరస గంధములను ఒప్పుకుంటాము. విభాగము మరియు పృథక్త్వము అనునవి సంయోగా భావ రూపములే గద. పరత్వము అపరత్వము అనునవి దేశము కాలమువలననే సిద్ధిస్తున్నవి. సంఖ్యా, పరిమాణము, ద్రవత్వము, స్నేహము ఆయా ద్రవ్యముల స్వరూపమే.



గురుత్వము శక్తిలోనే చేరుతుంది. ఇందువలన పదిగుణాలను ఒప్పుకోవడమే మంచిది.

వి: 1 రూప 2రస 3గంధ 4స్పర్శాః 5సంఖ్యా 6పరిమాణాని 7 పృథక్త్వం 8సంయోగ 9విభాగౌ 10 పరత్వా 11పరత్వ 12 బుద్ధయః 13 సుఖ 14 దుఃఖే 15 చ్ఛా 16 ద్వేషౌ 17 ప్రయత్నాశ్చగుణాః అని. క. సూత్రము 1.16 లో 17 గుణాలను చెప్పింది. సూత్రములో చకారమున్నది, అది చెప్పనివాటిని కలుపడాని కుంది. దానితో 18 గురుత్వ 19 ద్రవత్వ 20 స్నేహ 21 సంస్కార 22 ధర్మ 23 అధర్మ 24 శబ్దముల యొక్క చేరిక అని ఉపస్కారము, వివృతి అనువ్యాఖ్యానములు చెప్పినందున 24 గుణములు అని వైశేషికుల నైయాయికుల లెక్క. విశిష్టాద్వైతులు సత్త్వరజస్తమస్సులు శబ్ద స్పర్శరూపరసగంధములు సంయోగము శక్తి అని పదింటినే ఒప్పుకుంటారు. ఎట్లా సమన్వయము అని ప్రశ్న. పదింటిలోనే వారు ఎక్కువగా చెప్పిన వాటి అంతర్భావము కుదురుతుంది.

అంతర్భావ ప్రకారము ఈక్రింది విధముగా ఉంటుంది. బుద్ధి, సుఖము, దుఃఖము, ఇచ్ఛ, ద్వేషము, ప్రయత్నము అను ఈ ఆరుగుణాలు జ్ఞానము యొక్క భిన్నభిన్న రూపాలే ఈ విషయాన్ని కొంత, ధర్మభూతజ్ఞానం రూపణ సందర్భములో తెలుసుకున్నాము. వీటికి జ్ఞానములోనే అంతర్భావము. వేరుగాగుణములు కాదు. 'ఇచ్ఛాద్వేష ప్రయత్నాది శబ్దైరభిధీయతే అర్థభేదాను విద్ధాస్తే ధీవిశేషాః ప్రకీర్తితాః.॥ అని అందుకే చెప్పారు. ఇచ్ఛాది హేతుభూతాను కూలాది విషయమయిన బుద్ధికే ఇచ్ఛాది పేర్లు. తదతిరిక్తముగా వాటిని కల్పించడం వలన లాభం ఏదీ లేకపోగా అధికల్పన అనే గౌరవదోషం కలుగుతుంది.

అప్పుడు జ్ఞానమునకు ఇచ్ఛ మొదలయినవి పర్యాయపదములు కావా అని శంకించాల్సిన పనిలేదు. జ్ఞానము యొక్క విశేషాలే, భేదాలే

అయినప్పటికి ప్రత్యభిజ్ఞ, స్మృతి, అనుమతి, అనుభవము అనువాటికి పర్యాయత్వము లేనట్టుగా వీటికి కూడ ఉండదు. అట్లా కాదంటే ఈర్ష్య, అసూయ, అభయ, ధృతి, కరుణ, శాంతి, తుష్టి మొదలయిన వ్యవహారములకు కూడ విషయము కావాలి కనుక వాటిని కల్పించాల్సివస్తుంది. నా కాళ్ళు నొస్తున్నాయి మొదలయిన వ్యవహారము వలన సుఖదుఃఖములకు శరీర ధర్మత్వం కనబడుతున్నా, అది ఔపచారికమే కాని వాస్తవము కాదు. చనిపోయిన వాటి శరీరములో అదిలేదు కనుక అని ఆత్మ ధర్మములే, అట్లాగ అవి జ్ఞానములోనే చేరిపోతవి.

మనిషి కర్మలను ఆచరిస్తాడు. వెంటనే ఆ కర్మలు అయిపోతాయి. చాలాకాలం క్రితమే నశించిపోయిన కర్మలకు భావకాలములో ఫలము కలిగించడానికి అనువయినది ఏదయినా అదృష్టము లాంటిది కావాలి. దానిని సాంఖ్యులు అంతఃకరణము యొక్క పరిణతి అని అంటారు. మనస్సు యొక్క వాసన అని బౌద్ధులు, ఆత్మ ధర్మమని నైయాయికులు, విభురూపము అయిన ఒకతత్త్వము అని జైనులు, వారిలో కొందరు పుద్గల రూపము అని అంటారు. ప్రమాణము లేనందున అధికంగా కల్పించడంలో గౌరవం అనే దోషము కలుగుతుంది కనుక ఇవేవి కావు. ఆయాకర్మలను అచరించడముతో ప్రీతి అప్రీతి కలిగిన ఈశ్వరుని యొక్క బుద్ధివిశేషమే ధర్మము మరియు అధర్మము 'స ఏవైనం భూతిం కమయతి' తై. సం. 2. 1. 1య 'స ఏవం ప్రీతః ప్రీణాతి. తై. సం. 5. 7. 4, 'ఏష హ్యేవ సాధుకర్మ కారయతి తమ్ ' కౌ. ఉ. 3. 8; 'క్షిపామ్యజస్రమశుభాన్' గీ. 16. 19 మొదలయినవి ఈశ్వరుని ప్రీతి కోపమువలననే ఫలము కలుగుతున్నది అని తెలుపుతున్నది. కనుక ఇవి ఈశ్వరుని జ్ఞానములోనే అంతర్భవిస్తవి.

సంస్కారమును నిరూపిస్తూ వైశేషికులు వేగము భావన, స్థితి స్థాపకము అని మూడు విధాల సంస్కారమును చెప్తుతారు. వేగము ఒక కర్మవిశేషము.



వేగము యొక్క ఉత్పత్తికి హేతువు ఏదో దానిని వేగమనే సంస్కారము అంటారు. భావన అను సంస్కారము ఒక జ్ఞానవిశేషము. స్థితిస్థాపకమను సంస్కారము సంయోగమువలన ఏర్పడుతుంది. శీఘ్రముగా వెళ్ళుతున్నాడు వంటి వాటిలో కర్మ అతిశయవిశేషము కన్న వేరే వేగమనే గుణము కనబడుతు లేదు. కర్మ భేదము చేత వేగభేదము కనుక కర్మభేదమే వేగము, మరొకటి కాదు.

ఇక భావన అను సంస్కారము సంగతి – సంస్కారము అనగా ధర్మభూతజ్ఞానము యొక్క అవస్థావిశేషము. స్మృతి మొదలయినవి ఎట్లానో అట్లాగ జ్ఞానము ద్రవ్యము కావున అవస్థావిశేషా లుండవచ్చును. ఆత్మ నిర్వికారుడు. ధర్మభూతజ్ఞానంమాత్రము సవికారము. ధర్మభూతజ్ఞానము ఆత్మయొక్క నిత్యమయిన అసాధారణ ధర్మము. దాన్ని బట్టి ధర్మ భూతజ్ఞాన వికారములన్ని జ్ఞానము ద్వారా జ్ఞానాశ్రయ పర్యంతము ఉంటాయని అంటారు అని తెలుసుకోవాలి. స్థితి స్థాపకము అను సంస్కారము విషయము చెట్టు కొమ్మలు, ధనుస్సు, చర్మము మొదలయినవాటిని గుంజగా (లాగితే) ఏదోకారణముచేత అవి మళ్ళీ స్వస్థానమునకు వెళ్ళుతవి. ఆ కారణము స్థితి స్థాపకము. పాత ఉనికికి చేర్చునది దీనిని వేరే అంగీకరించాలి అని వాదన. అవసరము లేదని సిద్ధాంతము. వాటి అమరికనే దానికి కారణము. అది లేనందున లోహము మొదలయినవి మళ్ళీ పాతస్థితికి చేరుకోవు, ఈ సంస్కారము పనిలేదు నియత సంస్థాన విశేషము చాలు. అవయవముల రచనావిశేషము అదే. ఈ అమరిక భేదాన్ని బట్టి కొమ్మలు మొదలయినవి వెనకకు పోవడములో తొందర, ఆలస్యము భేదాలు ఏర్పడుతాయి. ఎట్టిసంస్థాన విశేషమో అట్టి స్థితి స్థాపము కనుక ఇది సంయోగము యొక్క భేదము, వేరే సంస్కారము పనిలేదు. పృథక్త్వము వేరే గుణము.

ఒకపదార్థము మరియొక్క దాని కన్న భిన్నమయినది. ఇలాటి వ్యవహారమునకు అవసరమయిన గుణము ఇది అవసరము అని వైశేషికుల

వాదన. సిద్ధాంతములో దీని జవాబు – పృథక్త్వము అనేది భేదమే. దాని కంటే భిన్నమయినది కాదు. ఒక పదార్థము మరొక దానికంటే భిన్నము. ఈభేదము సంయోగాభావరూపమే. న్యాయ తత్త్వములో ఈభేదము రెండువిధాలు అని చెప్పారు – 'అతి రేకవ్యతిరేక భేదేన ద్వివిధో భేదః' అని. రెండవ ధర్మిలో లేని ధర్మము అతిరేకము. ధర్మము ధర్మి మొదలయినవాటి స్వరూపము వ్యతిరేకము. ఐక్యము సాకల్యేనసంయోగః, తదభావో భేదః– అని అదేగ్రంథములో ఉన్నది. పూర్ణరూపంలో ఉండే అయ్యే సంయోగమును ఐక్యము అని సంయోగము లేకపోవడం భేదము అని అంటారని.

ఇట్లావిభాగము కూడ సంయోగము లేకపోవడము గానీ భేదరూపము గానీ అవుతుంది. వేరేగుణము కాదు. కాని వైశేషికులు సంయోగమునకు విరోధి అయిన గుణము విభాగము. తోయటము, చీల్చటము మొదలయిన వాటితో విభాగము పుడుతుంది. విభాగముతో సంయోగము నశిస్తుంది అని ఒప్పుకుంటారు. తోయటము చీల్చటము క్రియలతోనే సంయోగము యొక్క ధ్వంసము కలుగుతుంది.మధ్యన విభాగము అనేగుణము అవసరము లేదని సిద్ధాంతము. ఇట్లావిభాగమూ సంయోగాభావమే వేరుగా గుణము కాదు.

పరత్వము అపరత్వము, పరము అపరము అను రెండు పదార్థము లున్నాయి. ఈ ప్రతీతికి అసాధారణ మయిన కారణము ఏదయితే ఉన్నదో అదే పరత్వము. అపరత్వము అనే గుణములు అని వైశేషికులు చెప్పుతారు. ఇంకా ఇవి ఒక్కొక్కటి దిక్కృతము, కాలకృతము అని రెండు విధాలుగా ఉంటాయి. దూరమున్న వస్తువులో దిక్కృతమయిన పరత్వము, దగ్గరి వస్తువులో దిక్కృతమయిన అపరత్వము ఉంటాయి. అట్లాగే వృద్ధునిలో కాలకృత పరత్వము, యువకునిలో కాలకృతమయిన అపరత్వము, ఉంటవి అని వివరిస్తారు. సిద్ధాంతము ప్రకారము దిక్కు, కాలము యొక్క సంబంధ విశేషముతో ఇవి ఏర్పడుతున్నాయి కనుక దిక్కాలసంబంధము కంటే వేరుగా పరత్వా పరత్వములు ఒప్పుకోకపోవడంలో నే లాఘవము ఉన్నది. ఇవి అతిరిక్తములయిన గుణములు కావు.



సంఖ్య: ఒకటి రెండు మూడు ఇత్యాది రూపమయిన జ్ఞానానికి వ్యవహారానికి ఏదయితే విషయము ఉన్నదో అది సంఖ్య. వైశేషికులు సంఖ్యను ద్రవ్యములో మాత్రము ఉంటుంది అని ఒప్పుకుంటారు. ఇతర దార్శనికులు ఇది ద్రవ్యములో గుణములో అన్నిటిలో ఉంటుంది. అన్నిటి ధర్మము అని అంగీకరించారు. మూడు గుణములు ఆరురసములు మొదలయిన ప్రతీతి వ్యవహారము రెండు ఉన్నాయి. నిత్యద్రవ్యములలో ఉండే ఏకత్వము నిత్యము. అనిత్యములు అవయవములు కలిగిన ద్రవ్యముల ఉండే ఏకత్వము అనిత్యము, అవయవములలో ఉండే ఏకత్వముతో కలుగుతున్నది కనుక వారి ప్రకారము ద్విత్వము, త్రిత్వము మొదలయినవి అనిత్యము, ఇది ఒకటి, ఇది ఒకటి ఇత్యాది అపేక్షా బుద్ధి అను నిమిత్తకారణముచే కూడిన ఒక్కొక్కటిలో ఉండే ఏకత్వాలతో ఏర్పడుతున్నది. ద్విత్వము, సిద్ధాంతము వైశేషికులు బాహ్యపదార్థములలో ద్విత్వాది ఉత్పత్తికోసము అపేక్షా బుద్ధిని సహకారి కారణముగా అంగీకరిస్తారు కదా ఆ అపేక్షా బుద్ధినే మేం సంఖ్య అంటాము. అపేక్షాబుద్ధితో బాహ్య పదార్థాలలో ద్విత్వాది ఉత్పత్తి జరుగదు, జ్ఞానము బాహ్యపదార్థాలను కేవలము ప్రకాశింపజేస్తుంది. వాటిలో దేనిని ఉత్పత్తి చేయదు. ఆ అపేక్షాబుద్ధియే ద్విత్వాది, అది స్వయంప్రకాశము అయినందున జ్ఞానము కూడ అవుతుంది. అపేక్షాబుద్ధితోటే వ్యవహారము కలుగుతుంది, వ్యవహారనియమము కలుగుతుంది. మాదృష్టిలో వ్యవహారము నియమము అను రెండింటి యొక్క హేతువు ఒక్కటే కాని భిన్నములు కావు. ద్విత్వాది వ్యవహారమునకు కారణము అపేక్షాబుద్ధియే. అది నశిస్తే ద్విత్వాదివ్యవహారము కలుగదు. జ్ఞానము లేకున్న వ్యవహారమూ కలుగదు – లాఘవమును బట్టి అపేక్షాబుద్ధినే సంఖ్యగా ఒప్పుకోవడము సముచితము.

ఆయా వస్తువులస్వరూపమునే సంఖ్య అని ఒప్పుకోవాలి. అది సంయోగములోనే అంతర్భవిస్తుంది. మళ్ళీ అపేక్షాబుద్ధి నిర్విషయ మయినది అని శంకచేయరాదు. నిర్విషయమయితే జ్ఞానము కాకుండా పోవలసి వస్తుంది.

సవిషయమేగాని ప్రకృతమునకు ఉపయోగించని వస్తువులు విషయముగా కలది అనరాదు. అంటే ప్రకృతమున అసంగతి ఏర్పడుతుంది. ఈ విధముగా సవిషయత్వము ప్రకృతసంగతత్వము సిద్ధిస్తుండగా ఈ విషయ విశేషమే ద్విత్వాది వ్యవహారమును కలుగచేస్తుంది. కాదు పోదు అని సంఖ్యను అతిరిక్తగుణంగా ఒప్పుకున్నా సంఖ్య గుణము కనుక, ద్రవ్యమాత్రంలో ఉండేది అన్నారు కాబట్టి, గుణములు ఇరువయి నాలుగు అని, కర్మలు అయిదు అని, గుణగత మయిన కర్మగత మయిన సంఖ్య వీలుకాదు. ఆశ్రయము లయినవాటిద్వారా సంఖ్యను కల్పిస్తాము అని అంటే గుణాశ్రయములు ఇరువది నాలుగే అని, కర్మలు అయిదే అని అనడానికి నియామకము ఏది లేదు పృథివి, జలము, తేజస్సు, వాయువు, మనస్సు కర్మాశ్రయములు అవి అయిదే. కాని వారు ఉత్ క్షేపణాదుల భేదముతో కర్మలకు పంచత్వము చెప్పారు కనుక వీలుపడదు. కర్మాశ్రయత్వమున పంచత్వమును చెప్పటము. కార్య భూతమయిన ఏకత్వము లేనేలేదు. అవయవాతిరిక్తముగా అవయవి యొక్క కార్యము లేదు. గుంపులో ఏకత్వము రాశిలో వలె ఔపచారికము. కొందరు భేదాభావము అనునదే నిత్యమయిన ఏకత్వము అని చెప్పారు. ఏకత్వమును వివరించబోతూ భేదాభావము రూపముగా ఏకత్వాన్ని వివరిస్తారు. భ్రాంతి గురించి చెప్పుతూ భేదము కనబడనందువలన ఏకత్వభ్రమ కలిగింది అని వివరిస్తారు.

పరిమాణము:–ఈ వస్తువు ఇంత ఉన్నది అనుప్రతీతికి ఏది విషయమో దానిని పరిమాణము అంటారు. అణు, మహత్, హ్రస్వము, దీర్ఘము అని నాలుగు విధాలు. ఈ నాలుగు పరిమాణముల స్వరూపమును ప్రతియోగి నిరూపిస్తుంది. ఈ పదార్థము దానికంటె అణువు; ఆ పదార్థము ఈ పదార్థము కంటే మహత్తు, ఇట్లాగే పొడుగు, కురుచలు కూడ నిరూపించబడుతాయి. ఇక్కడ పంచమీవిభక్తితో ప్రతియోగి చెప్పబడుతున్నది. ఆయాపదార్థముల యొక్క స్వరూపవిశేషమే పరిమాణము. వేరుగుణము కాదు.



ద్రవత్వము:– ద్రవత్వము యొక్క ప్రతీతికి విషయభూతమయిన పదార్థము ద్రవత్వము. ఈద్రవత్వమే నీరు పారడానికి కారణము. వైశేషికులు దీనిని జలములో మాత్రమే ఉంటుందని ఒప్పుకుంటారు. పార్థివమయిన పాలలో, తైజసమయిన సువర్ణములో కూడ ద్రవత్వముంటుంది. ఇది స్వాభావికము, పాకజము అని రెండు విధములు. జలము లోనిది స్వాభావికము, సువర్ణాదులలో పాకజద్రవత్వము. ఈద్రవత్వము జలత్వములో గాని సంయోగవిశేషములో గాని స్పర్శవిశేషములో గాని అంతర్భవిస్తుంది. దీన్ని ఆయా వస్తువుల సంస్థానవిశేషముగా చెప్పుకోవచ్చును. స్నేహము ఇట్లాంటిదే. స్నేహ ప్రతీతికి విషయము అయిన పదార్థము స్నేహము. ఇదీ జలములో ఉంటుంది. నెయ్యి మొదలయిన వాట్లలో ఉండే స్నేహము జలము యొక్క సంబంధముతో ఏర్పడినట్టిది. స్నేహము, ద్రవము కంటె భిన్నమయినది. బంగారములో ఉండే ద్రవము దుమ్మును ఒకదగ్గర కలుపదు. స్నేహమే చూర్ణమును ఒక దగ్గర ముద్దగా చేస్తుంది. జలత్వమును మాత్రమే స్నేహమని చెప్పలేము. జలము స్నిగ్ధము అను ప్రయోగములబట్టి స్నేహము జల ధర్మముగా తెలుస్తున్నది. నీరేకాకుండ తేనె మొదలయిన పార్థివములలో కూడ స్నేహము కనబడు తున్నది. కనుక నీటిలో ఉండేది, పిండిని ముద్దగా చేయ కారణమయినది స్నేహమని వైశేషికులు కొందరు విశిష్టాద్వైతులు ఒప్పుకుంటారు.

ఇది స్నిగ్ధము వంటి ప్రతీతి తప్పక కలుగుతుంది. రూపములో స్పర్శలో ఈ స్నిగ్ధత్వము ప్రతీతము అవుతుంది. నీటిలో ఉండే మసృణత్వము, మిసిమితనము, నిగ్గు అనుదాని వలన స్నిగ్ధత్వము ప్రతీతము అవుతుంది. సంయుక్తములయిన వాటిని విడిపోకుండ కలిపి ఉంచే గుణము మసృణత్వము. ఇట్టి స్నేహము బంగారములో కూడ ఉంటుంది. అని మరికొందరు విశిష్టాద్వైతులు అంటారు.

మరికొందరు, జలములో స్నేహముండదు, స్నేహము మట్టిలోనే ఉంటుంది. జలములో ఉండే జలత్వము గాని ఒకవిధమయిన శక్తి ఉంటుంది. దాని ద్వారా నీరు ధూలి కణములను ఒక్కటిగా చేస్తుంది. ఇట్లా పిండీ భావమునకు కారణముగా స్నేహమును కల్పిస్తే వేరు చేస్తున్నందున అగ్నిలో రూక్షత అనే మరో గుణమును ఒప్పుకోవాల్సి వస్తుందని మరొకరు అంటారు.

వాస్తవము ఏమిటంటే :– ఆయా సహకారులను పొందిన జలము యొక్క స్వరూపమే పిండీభావానికి గాని విడదీయడానికి గాని కారణము అవుతుంది. తదతిరిక్తముగా స్నేహమను గుణము పనిలేదు. జీవులలో ఉండే స్నేహము అనునది బుద్ధివిశేష స్వరూపమే వేరుగాదు. దీనితో సంఖ్య, పరిమాణము, ద్రవత్వము, స్నేహము అనునవి ఆయావస్తువుల స్వరూపమే కనుక వేరుగా గుణములని ఒప్పుకోవలసిన అవసరము లేదని సుస్పష్టము.

గురుత్వము శక్తిలో అంతర్భవిస్తుంది. స్వయం పడిపోవుటకు కారణము అయిన స్వభావము ఏదో అది గురుత్వము, జలము పృథివిలో ఉంటుంది. ఇది జలము. పృథివి యొక్క స్వరూపము కంటె భిన్నము కాదు. ప్రతి బంధకము అడ్డులేని జలము, పృథివి పడుతునే ఉంటవి. అది స్వభావము పెరుగుకుండ పడపోవడానికి ఉట్టి కారణము. అంతేగాక ప్రతిచోట హేతుత్వమును నిర్వహించునట్టిదిగా శక్తిని ఒప్పుకున్నాముకదా. పతనమునకు హేతువయిన గురుత్వము కూడ శక్తిలోనే చేతుతుంది. ఇట్లా ఈ చర్చతో పదిగుణములను అంగీకరించుటయే సరియయినది అనుట స్పష్టము.

## తేషాం తేషాం గుణానాం తే తే ధర్మాః:

మూ:– తత్ర సత్త్వరజస్తమాంసి ప్రకృతిగుణాః తత్సమ్బన్ధి జీవగుణాశ్చ సత్వరూపం జ్ఞానం, సాత్త్వి కః కాలః ఇత్యాది ప్రతీతి రుపాధివశాత్ ఔపచారికీ, శబ్దాదయః పఞ్చ ప్రకృతి కార్యపఞ్చమహా భూతగుణత్వేన ప్రసిద్ధాః. శుద్ధ



సత్త్వం తు త్రిపాద్విభూత్యాం. తత్ప్రవర్తకేశ్వరే చ. సంయోగశక్తి రూపే గుణౌ షడ్ద్రవ్యసాధారణావితి వివేకః. ఇత్యద్రవ్యం నిరూపితమ్.

ఇతి శ్రీవాధూలకులతిలక – శ్రీమన్మహాచార్య ప్రథమదాసేన శ్రీనివాస దాసేన విరచితాయాం యతీన్ద్రమతదీపికాయాం శారీరకపరిభాషాయాం అద్రవ్య నిరూపణం నామ దశమోఽవతారః.

ఆ:– ఆ పదిగుణాలలో సత్త్వము, రజస్సు, తమస్సు అనునవి ప్రకృతిలో ప్రకృతికి సంబంధించిన జీవులలో ఉండే గుణములు, జ్ఞానము జీవులలో ఉంటుంది. సత్త్వము జీవులలో ఉంటుంది. ఈ సంబంధాన్ని పురస్కరించు కొని సత్త్వరూపమయిన జ్ఞానము అని, ఔపచారికమయిన ప్రయోగము కలుగుతుంది. ఓసమయంలో అన్ని బాగుంటే కాలాన్ని గూడ సాత్త్వికము అని అంటారు. ఇది కూడ ఔపచారిక ప్రయోగము అంటారు. శబ్దమునుండి అయిదు గుణములు ప్రకృతి కార్యమయినట్టి పంచమహా భూతముల యొక్క గుణములని ప్రసిద్ధి . శుద్ధసత్త్వము అనునది త్రిపాద్వి భూతిలో దానిని నడిపే ఈశ్వరునిలో ఉన్నది. సంయోగము మరియు శక్తి అనుగుణములు ఆరుద్రవ్యములలో సమానముగా ఉన్నవి. ఈ విధముగా అద్రవ్యముయొక్క నిరూపణము ముగిసినది.

ఇది శ్రీవాధూలకులతిలకు డయినట్టి శ్రీమన్మహాచార్యుల ప్రధాన శిష్యుడు అయిన శ్రీనివాసాచార్యులచే ప్రణీతమయిన 'యతీంద్ర మతదీపిక' అను శారీరక పరిభాషయందు అద్రవ్యనిరూపణము అను పదియవ యవతారము.

## సమాప్తం

* * *

## యతీంద్రమతదీపికాయా ఉపజీవ్యగ్రన్థాః

మూ:– ఏవం ద్రమిడ భాష్య, న్యాయతత్త్వ, సిద్ధిత్రయ, శ్రీభాష్య, దీప, సార, వేదార్థసఙ్గ్రహ, భాష్య వివరణ, సఙ్గతిమాలా, షడర్థసంక్షేప, శ్రుతప్రకాశికా, తత్త్వరత్నాకర, ప్రజ్ఞాపరిత్రాణ, ప్రమేయసఙ్గ్రహ, న్యాయకులిశ, న్యాయసుదర్శన, మానయాథాత్మ్యనిర్ణయ, న్యాయసార, తత్త్వదీప, తత్త్వనిర్ణయ, [1]తత్త్వముక్తాకలాప సర్వార్థసిద్ధి , న్యాయపరిశుద్ధి , న్యాయసిద్ధాఞ్జన, పరమతభఙ్గ, తత్త్వత్రయచులుక, తత్త్వత్రయ నిరూపణం, తత్త్వత్రయ తద్వ్యాఖ్యాన చణ్డమారుత, వేదాంతవిజయ, పారాశర్యవిజయాది పూర్వాచార్య ప్రబన్ధానుసారేణ జ్ఞాతవ్యార్థాన్ సంగృహ్య బాలబోధనార్థం యతీంద్రమత దీపికాఖ్య శారీరక పరిభాషాయా మస్యామేతేఽర్థాః ప్రతిపాదితాః.

ఆ:– ద్రమిడ భాష్యము మొదలుకొని పారాశర్యవిజయమువరకు గల ముప్పది రెండు పూర్వాచార్యుల గ్రంథములను అనుసరించి, తెలుసుకొనదగిన విషయాలను సంగ్రహించి బాలురకు తెలుపుటకు యతీంద్ర మతదీపిక అని పేరు గల్గిన ఈ శారీరకపరిభాషయందు ప్రతిపాదించుట జరిగినది.

వి:– ముప్పది రెండు గ్రంథముల సంక్షిప్త పరిచయము. గ్రంథమును ముగిస్తూ కర్తయయిన శ్రీనివాసాచార్యులు గారు తన గ్రంథమునకు ప్రాణము వంటి పూర్వాచార్యులు వ్రాసిన, ముప్పది రెండు గ్రంథములను పేర్కొన్నారు. ఉపనిషత్తులలో మోక్షము కొరకయి ముప్పది రెండు బ్రహ్మవిద్యలు ఉపాయములుగా చెప్పబడినవి. యతీంద్రమతదీపికకు ఆధారభూతమయిన గ్రంథములు ముప్పది రెండే. ఇది యాదృచ్ఛికముగానీ ఆలోచితముగాని అయిఉండవచ్చును.

1. ద్రమిడ భాష్యము:– శ్రీ బ్రహ్మానన్దిటంకాచార్యులు వ్రాసిన ఛాందోగ్య వాఖ్యానము అయిన వాక్యగ్రంథమునకు భాష్యము. దీనిని నైధ్రువ కాశ్యపగోత్రోత్పన్నులయిన ద్రవిడాచార్యులు రచించారు.



2. న్యాయతత్త్వము:– శ్రీమన్నాథమునులు దీనిని రచించినారు. ఇది అనేక అధికరణముల గ్రంథము. శ్రీమద్వేదాంత దేశికులు ప్రమాణముగా ఈ గ్రంథము నుండి అనేక వాక్యములను ఆయాచోట్లలో తమకృతులలో ఉదాహరించారు.
3. సిద్ధిత్రయము:– శ్రీమన్నాథమునుల మనుమడు, శ్రీభగవద్రామానుజల పరమగురువు అయిన శ్రీమద్యామునాచార్యులవారు దీని కర్త. ఆత్మసిద్ధి, ఈశ్వరసిద్ధి మరియు సంవిత్‌సిద్ధి అని మూడుప్రకరణములు దీనిలో ఉన్నాయి.
4. శ్రీభాష్యము:– శారీరకమీమాంస పయిన భగవద్రామానుజులు వెలయించిన విస్తృతమయిన భాష్యము. విశిష్టాద్వైత దర్శనమునకు పునరుజ్జీవనము కలిగించిన గ్రంథరాజము. దీనిలో శ్రీరామానుజులు శారీరకమీమాంసపయి గల శాంకరభాష్యమును ఖండించిరి.
5. వేదాంతదీపము:– దీనిలో శ్రీమద్రామానుజులు, శారీరక మీమాంస సూత్రములపయి అంత విస్తృతము కానట్టి అంత చిన్నదియు కానట్టి వ్యాఖ్యను వెలయించారు.
6. వేదాంతసారము:– దీనిలో శ్రీమద్రామానుజులు శారీరకమీమాంసా సూత్రములపయి సంక్షిప్తతమమయిన వ్యాఖ్యను చేసారు.
7. భాష్యవివరణము:– శ్రీవిష్ణుచిత్తాచార్యులు రచించిన ఈ గ్రంథము శ్రీభాష్యమునకు వ్యాఖ్య.
8. సంగతిమాలా:– శ్రీవిష్ణుచిత్తాచార్యులు దీనిని రచించారు. దీనిలో శ్రీభాష్యవిషయములకు మరియు ఇతరసంబద్ధ విషయములకు సంగతులను చూపారు.
9. షడర్థసంక్షేపము:– శ్రీరామమిశ్రాచార్యులు దీనిని వెలయించారు. న్యాయసిద్ధాఞ్జనమను తమగ్రంథములో శ్రీమద్వేదాంతదేశికులు పలుచోట్ల దీనిలోనుండి ఉదహరించారు.

10. శ్రుతప్రకాశికా:– శ్రీసుదర్శనసూరి దీనిని రచించారు. శ్రీభాష్యము పయిగల వ్యాఖ్యలలో ఉత్తమోత్తమ మయినది. ఇది బృహద్ గ్రంథము. ముప్పది ఆరువేల అనుష్టుప్ శ్లోకముల అంత పరిమాణము గలది. వీరికి వేదవ్యాసుడని మరియొక పేరు కలదు.

11. తత్త్వరత్నాకరము:– శ్రీపరాశర భట్టరు దీనిని రచించినారు. వీరు కూరేశ సూరి పుత్రులు.

12. ప్రజ్ఞాపరిత్రాణము:– శ్రీవరదనారాయణభట్టారకులు కర్త.

13. న్యాయసుదర్శనము– శ్రీవ.నా.భట్టారకప్రణీతము.

14. ప్రమేయసంగ్రహము:– శ్రీవిష్ణుతాతాచార్య విరచితము.

15. ప్రమేయ సంగ్రహము:– శ్రీవాత్స్యవరదాచార్యరచితము.

16. న్యాయకులిశము:– వాదిహంసాంబువాహ బిరుదాంచితు లయిన ఆత్రేయ రామానుజాచార్య విరచితము. అనేక వాదములను సంగ్రహముగా కూర్చినది, శతదూషణికి ఉపజీవ్యభూతము.

17. మానయాథాత్మ్యనిర్ణయము:– శ్రీవరదవిష్ణు మిశ్రప్రణీతము.

18. న్యాయసారము:– తత్త్వసారమని మరియొక పేరు గల ఈ గ్రంథమును శ్రీవాత్స్యవరదాచార్యులు రచించారు.

19. తత్త్వదీపము:– వాదికేసరి శ్రీరమ్యజామాతృముని ప్రణీతము.

20. తత్త్వనిర్ణయము– కర్త శ్రీవాత్స్య వరదాచార్యులు.

21. వేదార్థసంగ్రహము:– భగవద్రామానుజ రచితము, శ్రుతుల యొక్క అర్థమును నిర్ణయించునది. శ్రీవేంకటేశుని ఆనతితో శ్రీఆచార్యులు



వేదార్థనిర్ణయ రూపముగా ఒకరోజు ప్రవచనము చేసారట. దానికే వేదార్థసంగ్రహమని పేరు.

22. సర్వార్థసిద్ధి:– శ్రీమద్వేదాంత దేశికరచిత మయిన తత్త్వముక్తా కలాపమునకు వ్యాఖ్యారూపమయిన గ్రంథము.

23. న్యాయపరిశుద్ధి :– శ్రీమద్వేదాంత దేశికులు రచించిన గ్రంథరాజము. న్యాయదర్శనము ను సమీక్షించుచూ, శారీరక మీమాంసానుసారము న్యాయదర్శనమును వ్యవస్థీకరించారు.

24. న్యాయ సిద్ధాఞ్జనము:– శ్రీమద్వేదాంత దేశికులు దీనిలో వైశేషిక దర్శనముయొక్క విమర్శను ఆరు పరిచ్ఛేదములలో గావించారు.

25. పరమతభంగము:– ఇది వేదాంతదేశికుల గ్రంథమే. దీనిలో మణి ప్రవాళశైలి ఉన్నది.విశిష్టాద్వైత వ్యతిరిక్తదర్శన విమర్శ దీనిలో చేసారు.

26. తత్త్వత్రయ చులుకము:– శ్రీవరదగురు కృతము. వీరు వేదాంత గురుకుమారులు.

27. తత్త్వత్రయ నిరూపణము:– శ్రీకృష్ణపాదసూరి కర్త.

28. తత్త్వత్రయము:– శ్రీమల్లోకాచార్యులు దీని రచయితలు.

29. తత్త్వత్రయవ్యాఖ్య:– శ్రీమద్వరవరముని ప్రణీతమయిన గ్రంథము. శ్రీమల్లోకాచార్య రచిత తత్త్వత్రయమునకు వ్యాఖ్యారూప మయినది.

30. చండమారుతము:– శ్రీమాన్ భట్టాచార్యరచితము. ఇది శ్రీమద్వేదాంత దేశిక ప్రణీతమయిన శతదూషణికి వ్యాఖ్యారూప మయినట్టిది.

31. వేదాంతవిజయము:– దీనిని కూడ శ్రీమాన్ భట్టాచార్యులు రచించినారు.

32. పారాశర్యవిజయము:– శ్రీమాన్ భట్టాచార్యులు దీనిని రచించినారు.

## యతీన్ద్రమతదీపికాయాః తత్త్వహితపురుషార్థ ప్రతిపాదకత్వమ్:

మూ:– ఆధ్యాత్మశాస్త్రాణాం హిత పురుషార్థ ప్రతిపాదకత్వాత్ తత్సారేఽస్మిన్నపి ప్రకృతిజీవేశ్వర పరిచ్ఛేదైః తత్త్వస్య నిరూపితత్వాత్, బుద్ధిపరిచ్ఛేదే ఉపాయస్య నిరూపణాత్, నిత్యవిభూతి పరిచ్ఛేదే ఈశ్వర పరిచ్ఛేదే చ పురుషార్థస్య నిరూపణాచ్చ తత్త్వోపాయ పురుషార్థా నిరూపితా ఇతి నిరవద్యమ్.

ఆ:– అధ్యాత్మశాస్త్రము, హితమును మరియు పురుషార్థమును ప్రతిపాదిస్తుంది. ఈ యతీంద్రమతదీపిక గూడ అధ్యాత్మ శాస్త్రమునకు సారభూత మయినట్టిది. దీనిలో ప్రకృతి పరిచ్ఛేదములో, జీవపరిచ్ఛేదములో, ఈశ్వర పరిచ్ఛేదములో తత్త్వము నిరూపించబడినది. బుద్ధిపరిచ్ఛేదములో మోక్షోపాయము నిరూపింపబడినది. నిత్యవిభూతి పరిచ్ఛేదములో, ఈశ్వర పరిచ్ఛేదములో కూడ పురుషార్థము ఏమిటో నిరూపించ నయినది. ఈవిధముగా దీనిలో తత్త్వము, హితము మరియు పురుషార్థము బాగుగా ప్రతిపాదించ బడినవి. ఈగ్రంథము సంపూర్ణముగా నిర్దుష్టముగా నున్నది.

## యతీన్ద్రమతదీపికాయాః తత్త్వాపాదకత్వమ్:

మూ:– ఏకం తత్త్వమితి ప్రతిపాదయంతి సూరయః.ఆత్మానాత్మేతి ద్వేధా విభజ్య న్యరూపయన్ ఋషయః. శ్రుత్యనుసారాత్ భోగ్య, భోక్తృ, నియన్తృరూపం తత్త్వత్రయ మితి ప్రతిపాదయన్తి ఆచార్యాః. హేయమ్, తస్య నివర్తకమ్, ఉపాదేయమ్; తస్యోపాయ ఇతి చతుర్ధా విభజ్య అనుసన్దధతే కేచిదాచార్యాః. ప్రాప్యమ్, ప్రాపకమ్, ఉపాయః, ఫలమ్, విరోధీతి పఞ్చధా కథయన్త్యపరే దేశికాః. అర్థపఞ్చకమేవ సమ్బన్ధేన సాకం షోఢా పరిగణయ్య వర్ణయన్తి అన్యే గురవః తేషాం తత్తద్వి భాజక ధర్మపురస్కారేణ తథోపన్యాసో నార్థభేదక ఇతి సర్వమవదాతమ్.



ఆ:– సూరులు తత్త్వము ఒకటే అని ప్రతిపాదించారు. ఋషులు ఆత్మ, ఆనాత్మ అని విభజించి తత్త్వమును రెండురకాలుగా చెప్పారు. శ్రుతుల ననుసరించి భోక్త – జీవుడు, భోగ్య – జడతత్త్వము, నియన్త – ఈశ్వర తత్త్వము అని తత్త్వత్రయమును ఆచార్యులు ప్రతిపాదించినారు. కొందరు ఆచార్యులు, హేయము – త్యాజ్యము, హేయనివర్తకతత్త్వము, ఉపాదేయ తత్త్వము, ఉపాయము అనునాలుగు విధాల విభాగముచేసి తత్త్వమును నాలుగువిధాల ప్రతిపాదించినారు. మరికొందరు వీటిని అయిదు అని నిరూపించినారు, అవి ఇవి – ప్రాప్యము, ప్రాపకము, ఉపాయము, ఫలము, విరోధి అని సంబంధము అను అరవదానిని కలిపి మరి కొందరు ఆరు తత్త్వము లన్నారు. వివిధము లయిన విభాజక ధర్మములను బట్టి ఆయా భేదములు ఏర్పడుతున్నది గాని అర్థములో భేదము లేదు. ఇట్లా అన్ని అభిప్రాయములు నిర్దుష్టము లయినవియే.

వి:– తత్త్వముల విషయములో ఆచార్యులలో భేదాభిప్రాయము లున్నవి. సూరిగణము తత్త్వము ఒకటే అని ప్రతిపాదన చేసారు. వారి దృష్టిలో సంపూర్ణ జగత్తు శరీరముగా గల పరమాత్మ ఒకడే తత్త్వము. ఋషుల ప్రకారము ఆత్మ, ఆత్మ కానిది అని రెండుతత్త్వములు. ఆత్మ తత్త్వములో జీవాత్మ పరమాత్మలు చేరుతారు. ఆత్మ కానిదానిలో జీవేశ్వరుల కన్న వ్యతిరిక్త మయినదంత చేరుతుంది. ప్రకృతి, కాలము, నిత్యవిభూతి మొదలయినవి అనాత్మతత్త్వములో చేరుతవి. 'భోక్తా, భోగ్యం, ప్రేరితా రం చ మత్వా' అను శ్రుతితత్త్వములు మూడు అని తెలియజేస్తున్నది, అవి భోక్తా, భోగ్యము, ప్రేరితా అని జీవుడు భోక్తృతత్త్వము, క్షరణశీలము గల ప్రకృతిని అనుభవించువాడు. భోగ్యము అంటే జడతత్త్వము. ప్రకృతి, కాలము, ధర్మభూతజ్ఞానము, మరియు శుద్ధసత్త్వము మొదలయినవి భోగ్యములలో చేరుతవి. భోక్తృతత్త్వము, భోగ్యతత్త్వమును, వాటిస్వరూపమును స్థితిని, ప్రవృత్తిని నియమించువాడు పరమాత్మ. ఈ అర్థాన్నే "క్షరం ప్రధాన

మమృతాక్షరోహరః క్షరాత్మానావీశతే దేవ ఏకః" అను శ్వేతాశ్వతర శ్రుతి తెలుపుతున్నది. (దీని వివరణ ఇదివరకేవచ్చినది. ఆ.) కొందరు ఆచార్యులు, తత్త్వములు నాలుగు అని అభిప్రాయపడ్డారు. అవి ఇవి -1 హేయతత్త్వము - ప్రకృతిమరియు ప్రాకృతిక పదార్థములు చేరుతాయి. 2. హేయనివర్తక తత్త్వము - మోక్షసాధనము అయిన భక్తి మొదలయినవి. 3. ఉపాదేయ తత్త్వము - పరమాత్మతత్త్వము 4 పరమాత్మ సాధన భూతమయిన తత్త్వము. మరి కొందరు ఆచార్యులు అయిదు తత్త్వాలను ప్రతిపాదిస్తారు.

**ప్రాప్యస్య బ్రహ్మణో రూపం ప్రాప్తుశ్చ పత్యగాత్మనః।**

**ప్రాప్త్యుపాయం ఫలం ప్రాప్తేః తథా ప్రాప్తివిరోధి చ ।**

**వదన్తి సకలా వేదాః సేతిహాసపురాణకాః॥**

అని వేదములు, పురాణములు, ఇతిహాసములు ఈ అయిదు తత్త్వాలనే ప్రతిపాదిస్తున్నాయి. అవి ఇవి:- 1.సర్వజీవులచే పొందదగిన బ్రహ్మస్వరూపము 2. జీవుల స్వరూపము 3. పరమాత్మ ప్రాప్తిసాధనము. 4. పరమాత్మని పొందితే కలుగునట్టి ఫలము 5. పరమాత్మప్రాప్తికి విరోధియయిన తత్త్వములు అవి. దీనికే అర్థపంచకమని కూడ పేరు. ఈ అయిదు తత్త్వాలకు ఆరవదానిని కలుపుకొని ఆరుతత్త్వాలని మరికొంద రాచార్యులు ప్రతిపాదించారు. ఆతత్త్వము సంబంధము. అష్టాక్షరీ మంత్రమును విమర్శించి చూడ, జీవాత్మ పరమాత్మల మధ్య తొమ్మిది విధాల సంబంధము ఉన్నట్టు తెలియవస్తున్నది. అవి ఇవి -

1. పితాపుత్రభావ సంబంధము. జీవాత్మ పరమాత్మ యొక్క పుత్రుడు. పరమాత్మ తండ్రి. అతడు జీవులను అన్నివిధాల కాపాడుతాడు.
2. రక్ష్యరక్షకభావము - పరమాత్మ జీవుల రక్షకుడు, జీవులు పరమాత్మచే రక్షింపదగినవారు - రక్ష్యులు, అను భావము - సంబంధము.



3. శేషశేషి భావసంబంధము, జీవాత్మ పరమాత్మ యొక్క శేషుడు.పరమాత్మ యజమాని. శేషి ఇష్టము వచ్చినట్లు అనుభవిచువాడు. జీవుడు - శేషుడు. యథేచ్ఛావినియోగార్హుడు.
4. భర్తృభృత్యభావసంబంధము:- పరమాత్మ జీవులకు స్వామి. జీవాత్మ పరమాత్మ యొక్క సేవకుడు.
5. జ్ఞాతృజ్ఞేయభావ సంబంధము:- పరమాత్మ జ్ఞేయుడు, జీవాత్మ పరమాత్మని తెలుసుకొనువాడు - జ్ఞాత.
6. సేవ్యసేవకభావ సంబంధము:- సేవ్యుడు పరమాత్మ. సేవకుడు జీవాత్మ (ఇదికొంచెము భర్తృభృత్యభావములాగానే ఉన్నది.)
7. ఆధారాధేయభావ సంబంధము:- పరమాత్ముడు జీవులకు ఆత్మ అయినందున, జీవాత్మలకు ఆధారము, జీవాత్మలు అతనికి ఆధేయములు.
8 శరీరాత్మ భావసంబంధము:- జీవుడు పరమాత్మకు శరీరము, పరమాత్మ జీవులకు ఆత్మ.
9. భోక్తృభావ సంబంధము:- పరమాత్మ భోక్త. జీవాత్మ పరమాత్మకు భోగ్యము ముక్త జీవుని గూర్చి తెలుపునట్టి శ్రుతి - 'అహమన్నమహమన్న మహమన్నమ్' అని తెలుపుతున్నది. దీని అర్థము నేను పరమాత్మునికి భోగ్యభూతుడను అని.

అర్చిరాది మార్గము ద్వారా ఉత్క్రమణ చేయునట్టి ముక్తజీవుని విషయకమయిన శ్రుతి వలన సంబంధ జ్ఞానము కలుగుతుంది. అది తెలియకుండ వేదాంత జ్ఞానము పూర్తిగా కలిగినట్లు కాదు. కాబట్టి అర్థపంచక జ్ఞానముతో బాటు సంబంధజ్ఞానము కూడ అనివార్యముగా కావాలి. ఈ విషయాన్ని బలపరచడానికే ఆరుతత్త్వములని కొందరు ఆచార్యులు

బోధించడము. ఈ తత్త్వాలన్నీ – రెండునుంచి ఆరుదాక ఉన్నవి. విభజించే ధర్మములపయి ఆధారపడినవి కాని వాస్తవికమయిన భేదము లేదు. వాస్తవముగా ఈ విభాగానికి తాత్పర్యము ఒక్క అర్థములోనే – అదే పరమాత్మతత్త్వము. కనుక ఇట్లా విభాగములు చెప్పినా దోషము లేదు.

## చిదచిద్విశిష్టం అద్వైతం తత్త్వమేకమేవేతి వేదాన్తానాం తాత్పర్యమ్:

మూ:– వస్తుతస్తు, వేదాన్తానాం చిదచిద్విశిష్టాద్వైతం తత్త్వమేక మేవ బ్రహ్మేతి తాత్పర్యమ్. అత ఏవ చిదచిద్విశిష్టం బ్రహ్మైక (మేవేతి) మితి మత్వా భగవాన్ బాదరాయణ అథాతో బ్రహ్మజిజ్ఞాసా ఇత్యుపక్రమ్య తదేవ సప్రకారం నిరూపితవాన్. అతః చిదచిద్విశిష్టో బ్రహ్మశబ్దవాచ్యో విష్ణ్వాఖ్యః పరవాసుదేవో నారాయణ ఏవైకం తత్త్వమితి విశిష్టాద్వైతవాదినాం దర్శన మితి సిద్ధమ్.

అ:– వాస్తవముగా చిదచిద్వి శిష్టమయిన అద్వైత బ్రహ్మ ఒకటే తత్త్వము అని వేదాంతముల తాత్పర్యము. చేతనాచేతనవిశిష్టమయిన బ్రహ్మ ఒక్కటే అని తలచి బాదరాయణమహర్షి 'అథాతో బ్రహ్మజిజ్ఞాసా' అని మొదలుపెట్టి శారీరకమీమాంసలో సప్రకార బ్రహ్మనే నిరూపించారు. కావున చిదచిద్విశిష్టుడు, బ్రహ్మశబ్దానికి అర్థమయినవాడు విష్ణువు అనుశబ్దము చే పిలువ బడువాడు, పరవాసుదేవుడు, భగవన్నారాయణుడు ఒకటే తత్త్వమని విశిష్టాద్వైతవాదులయొక్క దర్శనము – సిద్ధాంతము.

## యతీన్ద్రమతదీపికాయా ఉపసంహారః:

**శ్లో॥ ఇతి వివిధవిచిత్రమానమేయప్రకాశం**
**ఘనగురువరదాసేనోక్తమాదాయ శాస్త్రాత్**
**యతిపతిమతదీపం వేదవేదాన్తసారం**
**స భవతి మతిమాన్యస్తత్కటాక్షైకలక్ష్యః ॥**



ఇతి శ్రీవాధూలకులతిలక – శ్రీమన్మహాచార్యప్రథమదాసేన
శ్రీవేంకగిరినాథపదకమలసేవాపరాయణస్వామిపుష్కరిణీ
శ్రీగోవిందార్యసూనునా శ్రీనివాసదాసేన విరచితా
యతీన్ద్రమతదీపికాఖ్యా విశిష్టాద్వైతశారీరకపరిభాషా సమాప్తా.

అ:– ఇట్టి పలు విధములయిన ప్రమాణములను ప్రమేయములను ప్రకాశింపజేయునట్టి సాంగము, ఉపనిషత్తులతో కూడిన వేదముల సారరూపమయినట్టి, భగవద్రామానుజుల సిద్ధాంతమును తెలుపునట్టి, శ్రీమన్మహాచార్యుల ప్రధానశిష్యునిచే విరచితమయినట్టి, యతీంద్ర మతదీపికను అభ్యసించి, సదాచార్యుల కృపకు పాత్రుడయిన చదువరి వేదాంత జ్ఞానసంపన్నుడు అవుతాడు.

వి:– ఉపసంహారము చేస్తూ గ్రంథకర్త తన గురువు గారి ని 'ఘన గురువు' అన్నారు. ఇది గురువుగారి మరోపేరు. అయినప్పటికి ఘనశబ్దానికి మేఘము అని అర్థము కూడ ఉన్నది. ఆచార్యునిలో మేఘముతో చాలా పోలికలు ఉన్నాయి. మేఘము సముద్రము నుండి ఉప్పునీటిని త్రాగునీటిగా మార్చి వర్షిస్తుంది. ఆచార్యులు, తెలుసుకోవడం ఇబ్బంది అయిన శాస్త్రార్థములను సుగమములుగా చేసి, జనసామాన్యమును ఉజ్జీవింపజేసి ఉపాయములను చూపెడతారు. మేఘము వర్షముతో నిమ్న ప్రాంతములను సమము చేస్తుంది. సత్‌శిష్యులను సదుపదేశముతో వారి జీవితాన్ని సద్గుణములతో నింపుతారు గురువుగారు. ఎక్కువ వర్షించినా మేఘము తృప్తిచెందనట్టు ఆచార్యులు ఎంతబోధించినను తృప్తిచెందరు. శిష్యునినుండి ప్రత్యుపకారమును ఆశించరు. ఇన్ని సాదృశ్యాలను చూసి గురువుగారిని మేఘముతో పోల్చారు గ్రంథకర్త.

తమ గురువుగారు బోధించిన విషయములను పొందు పరచి శ్రీనివాసాచార్యులు గారు యతీంద్రమతదీపిక అను ఈగ్రంథమును వ్రాశారు.

దీపిక చిన్నగనే ఉంటుంది. కాని వెలుగు చూపుతుంది. అట్లాగే ఈ గ్రంథము ప్రమాణములు, ప్రమేయములపయి వెలుగు ప్రసరింప జేస్తుంది. ప్రమాణప్రమేయములు అనేక ప్రకారములు, విచిత్రములు కూడ, విషయాలన్నీ ప్రామాణికములు. దీంట్లో నిరూపించిన విషయాలు శాస్త్రానుకూలముగా నున్నవి. శాస్త్రవిరుద్ధముగా విషయాలను నిరూపించలేదు. విశిష్టాద్వైత సంప్రదాయము శాస్త్రవిరుద్ధముగా ఏదీ చెప్పదు, ఏ శాస్త్రమును, మిథ్యార్థమును ప్రతిపాదించునదిగా వ్యాఖ్యానించదు. వేదము మొత్తము సత్యమునే ప్రతిపాదిస్తున్నది అనునది విశిష్టాద్వైతుల ప్రగాఢవిశ్వాసము. విశిష్టాద్వైతము వైదికము. ఈ యతీంద్రమతదీపిక వేదవేదాంతముల సారరూపము. ఆచార్యుని దయకు యోగ్యుడయి, దీని నభ్యసించువాడు వేదాంతజ్ఞానమును తప్పక పొందుతాడు.

ఇట్లు శ్రీమద్వాధూలకులతిలకుడయినట్టి శ్రీమన్మహాచార్యులప్రధానశిష్యుడు శ్రీమద్వేంకటగిరినాథునిపదకమల సేవాపరాయణ స్వామిపుష్కరిణీ శ్రీగోవిందాచార్యుల పుత్రుడయిన శ్రీనివాసాచార్యులచే ప్రణీతమయిన యతీంద్రమత దీపిక యను శారీరకపరిభాష ముగిసినది.

శ్లో. గోదారంగార్యతనుజో నరసింహేతి విశ్రుతః
కృతధర్మపురీవాసో నరసింహప్రసాదతః॥
గురూణాం కృపయా భక్త్యా పూర్వగ్రంథానుశీలనాత్।
ఆంధ్ర్యాం హి వ్యదధామేతాం యతీంద్రమతదీపికామ్॥
దోషాః కర్తురితి త్యాజ్యా గుణా జ్ఞేయా గురోరితి।
ద్యోతయన్తీ బహూనర్థాన్ దీపికా లసతాద్భువి ॥

ఇట్లా కాశ్యపగోత్రుడు బూరుగడ్డ రంగాచార్యులు, శ్రీమతి గోదమ్మల



సుతుడు, ధర్మపురివాసుడు, సీతారాంబాగు సంస్కృత కళాశాలాలబ్ధ న్యాయాది విద్యుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయ సంస్కృత విభాగ అధ్యక్షచరుడు అయిన బూరుగడ్డ నరసింహాచార్యులు, గురు భగవద్దయతో చేసిన యతీంద్రమతదీపిక తెలుగు అనువాదము సంపూర్ణము.

*****